# తెలుగు సాహిత్యము శైవమత ప్రభావము

రెండవ సంపుటము

POST DOCTORAL THESIS

డా॥ వి. రత్నమోహిని

...ACED ON THE ...
Date.................................

TELUGU SAHITYAMU
SAIVAMATA PRABHAVAMU
(SAIVISIM AND ITS INFLUENCE ON
TELUGU LITERATURE

SRI VENK...ESW...
...RAL ...B...
...CEN...
50429
TIRUP...

Post - Doctoral Thesis
by
Dr. V. RATNA MOHINI,
M.A., Ph:D:,

FIRST EDITION : MAY 1992
Copies : 1000
Copyright : AUTHOR

PRICE : Rs. 60/-

Published by
Dr. V. RATNA MOHINI
G. 2. 'ORCHIDS'
2-2-12/1/C,
D.D. Colony (Durga Bai Deshmukh Colony)
HYDERABAD 500 007
Phone : 8 6 4 9 2 4

Printed at
MASTER PRINTERS & GRAPHICS
HABSIGUDA
HYDERABAD 500 007.
Phone : 8 5 1 0 2 1 PP

భగవాన్

శ్రీశ్రీశ్రీ సత్యసాయి బాబా



పాదపద్మములకు

సమర్పితము

తిరుమల - తిరుపతి
దేవస్థానము వారి
ఆర్థిక సహాయముతో
ముద్రితము

# నా మాట

తెలుగులో "మహాకవి ధూర్జటి జీవితము- రచనలు" అను అంశంపై పరిశోధన చేసిన తరువాత ఈ మహాకవి శైవకావ్యములు రచించుట వలనకాబోలు "తెలుగు సాహిత్యము - శైవమత ప్రభావము" అనే అంశముపై పరిశోధన చేయవలెనని కోరిక కలిగినది.

ఈ సంకల్పము కలిగిన వెంటనే ఆచార్య ఎం. కులశేఖరరావు గారికి విన్నవించగా వారు నన్ను ప్రోత్సహించిరి. యు.జి.సి వారు ఉపకార వేతన మిచ్చి పరిశోధన నిరాటంకముగా సాగుటకు దోహదము చేసిరి.

ఆచార్య ఎం. కులశేఖరరావుగారి పర్యవేక్షణలో నా ఈ పరిశోధన కొనసాగినది. వారు ఉత్సాహ ప్రోత్సాహముల నొసంగుటయే కాక అమూల్యములగు సలహాలనిచ్చుచు ఈ పరిశోధన కనేక విధముల సహకరించిరి. వారికి నేనెంతయో కృతజ్ఞురాలిని.

నా ఈ సిద్ధాంత వ్యాసమును రెండు భాగములుగా విభజన చేసితిని. శివ శబ్దము-దాని ప్రాచీనత, బసవేశ్వరుని వీరశైవము, మల్లికార్జున పండితుని సిద్ధాంతము, పాల్కురికి సోమనాథుని తెలుగు కృతులలోని అంశములు, నన్నెచోడుని కుమార సంభవ కావ్యములోని శైవమత విశేషములు, మున్నగునవన్నియు ఒక భాగము కాగా; ఆగమ శైవము, శివుని మహాత్మ్యము, ఆధిపత్యము, శివుని లీలలు, నాథ సంప్రదాయము, మున్నగునవన్నియు నిరూపించు కావ్యముల నెన్నుకుని అందుగల శైవనిరతిని నిరూపించుట మరొక భాగము. సిద్ధేశ్వర చరిత్ర ప్రతాపరుద్ర చరిత్ర అను గ్రంథములు కూడ నీ పరిధిలో చేరినవి.

శ్రీనాథుని కావ్యములు, ప్రబంధ కాలమున అష్టదిగ్గజములని పేరు వడసిన కవులు వ్రాసిన శైవ ప్రబంధములలోని శైవనిరతిని పరిశీలించితిని. ఇంతే

కాక లఘు కృతులైన శతకములు, ఉదాహరణములు, వచనములు మున్నగు వాటిలో శైవ సంప్రదాయమును కూడ పరికించి వ్రాసితిని. దీనిలో క్రీ. శ 16వ శతాబ్ద్యంతము వరకు వెలువడిన సాహిత్యము మాత్రమే పరిశీలింప బడినది.

పరిశోధన నిమిత్తము అనేక స్థలములు, గ్రంథాలయములు సందర్శించుట, విషయ సేకరణ చేయుట జరిగినది. గ్రంధాలయాధి కారులు దయతో నా పరిశోధనకు కావలసిన విషయ సేకరణకు తోడ్పడిరి. వారికి నేనెంతయో కృతజ్ఞురాలిని.

బెంగుళూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు డా॥ బడాల రామయ్యగారు ఈ పరిశోధనకు తమ అమూల్యమగు సలహా నొసంగిరి. వారికి నా కృతజ్ఞతలు. ఆంధ్ర విశ్వవిద్యాలయ ఆచార్యులు డా. యస్. వి. జోగారావు గారు, ఆచార్య కొర్లపాటి శ్రీరామమూర్తి గారు కూడ తమ సలహాల నందజేసిరి. వారికి నా కృతజ్ఞతలు.

ఈ పరిశోధనలో అనేక విధముల నన్ను ప్రోత్సహించిన నా భర్తగారైన శ్రీ సూర్యారావు గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు. ఇంకను ఎందరో మహానుభావులు. వారందరికి నా కృతజ్ఞతలు.

ఈ పరిశోధన, సమయమునకు, విస్తృతికి కొన్ని పరిమితులు ఏర్పరచుకొని చేయుట వలన అంతగా ప్రాముఖ్యములేని సాహిత్యము దీనిలో చేరెడు అవకాశము లేకపోయినది.

ఈ సిద్ధాంత గ్రంథము అచ్చువేయుటకు ఆర్థిక సహాయము నందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారికి నేనెంతయు కృతజ్ఞురాలిని.

వి. రత్నమోహిని

## రెండవ సంపుటము

# విషయసూచిక


ఆరవ అధ్యాయము

శైవతత్త్వము - ఇతర కృతులు 1

1. సిద్ధేశ్వర చరిత్ర
2. ప్రతాపరుద్ర చరిత్ర
3. నవనాథ చరిత్ర
4. నవచోళ చరిత్ర

ఏడవ అధ్యాయము

శ్రీనాథుని కావ్యములు - శైవనిరతి 98

1. భీమేశ్వర పురాణము
2. కాశీఖండము
3. హరవిలాసము
4. శివరాత్రి మాహాత్మ్యము

ఎనిమిదవ అధ్యాయము

ప్రబంధ యుగము - శైవ సంప్రదాయములు 193

1. ఉద్భాటారాధ్య చరిత్ర
2. శ్రీకాళహస్తి మాహాత్మ్యము

తొమ్మిదవ అధ్యాయము

లఘుకృతులు - శైవనిరతి 247

1. శతకములు
   - ఎ) సర్వేశ్వర శతకము
   - బి) కాళహస్తీశ్వర శతకము
2. ఉదాహరణములు
3. వచనములు

సింహావలోకనం 292

ఉపయుక్త గ్రంథముల పట్టిక 295

# శైవతత్త్వము - ఇతరకవులు

గడచిన ఐదు ప్రకరణములలో శైవమత సిద్ధాంతములను స్థూలముగా పరిశీలించితిని. బసవేశ్వరుని అవతరణతో ప్రారంభింపబడిన వీరశైవమతము, దానియొక్క స్వరూప స్వభావములు. పెక్కు వీరశైవ భక్తుల కథలు సూక్ష్మముగా పేర్కొంటిని. వీరశైవ కావ్యములలో పేర్కొనబడిన వారి పద్ధతులను కథల రూపమున బసవేశ్వరుని బసవపురాణములో పేర్కొనబడిన భక్తుల కథల ద్వారా ప్రగాఢమగు వారి శివభక్తి ఎట్టిదో తెలిసినది. అట్లే పండితుని భక్తి ప్రపత్తులుకూడ పండితారాధ్య చరిత్ర చాటినది. కేవలము వీరశైవ కావ్యముకాకపోయినను శైవసిద్ధాంతమును, శివభక్తికి సంబంధించిన కావ్యములైన కుమార సంభవము కూడ శివభక్తి తత్త్వము గొప్పగా చాటిన గ్రంథరాజము. నన్నెచోడుడు శివుని మహాత్మ్యమును, గొప్పతనమును కథల ద్వారా మనకెఱిగించినాడు. మల్లికార్జున పండితుడు శివతత్త్వ సారములో చిన్నచిన్న కందములలో శైవతత్త్వమును, చక్కగా ప్రబోధించినాడు.

ఈ విధముగా ప్రారంభింపబడిన వీరశైవము బసవేశ్వరుని కాలములో పరాకాష్ఠనంది జనాదరణ పొందినది. మతోద్రేకపు చర్యలు దీనికి కొంత కారణము కావచ్చును. వీరశైవము అతిత్వరలోనే సన్నగిల్లినను శైవతత్త్వము శైవభక్తులు మాత్రము నిలిచిపోయిరి. తరువాతి కావ్యములు వీరశైవమత ప్రతిపాదితములుకాక, శైవభక్తుల కథలతో అలరారినవి. శ్రీనాథుని కాలములో, తరువాత ప్రబంధయుగమని పేరువడసిన రాయల కాలములో కూడ శైవమతస్థులు అనేక శివభక్తి ప్రతిపాదితములగు కావ్యములు వెలయించినారు. శ్రీనాథుని భీమేశ్వర పురాణము, కాశీఖండము, హరవిలాసము, శివరాత్రి మహాత్మ్యము నిట్టికావ్యములే. ఇంకేరాయల కాలములో రామలింగని ఉద్భటారాధ్య చరిత్ర ధూర్జటి శ్రీ కాళహస్తి మహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము మున్నగునవి ఇట్టివే. కానెసర్వప్ప సిద్ధేశ్వర చరిత్రము, ఏకామ్రనాథుని ప్రతాపరుద్ర చరిత్రము, గౌరన నవనాథ చరిత్రము, పాలిసెట్టి లింగ

కవి విరచితమగు నవచోళ చరిత్ర, పోతన కవి రచించిన వీరభద్ర విజయము, యథావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము, మొదలగు కావ్యములలో శైవతత్త్వము, శివభక్తుల కథలు పరిశీలింతము.

సిద్ధేశ్వర చరిత్రము

పాల్కురికి సోమనాథుడు వీరశైవ మతమును ప్రతిపాదించుటకు, ప్రచారము చేయుటకు సాహిత్య ప్రక్రియలను సాధనముగ చేసికొని యుండె నను మాటను గడచిన ప్రకరణములలోచూచితిమి. అతడు కావ్యమును మత ప్రసారమునకు వాహికగా చేసికొన్నట్లుగానే 'దేశి' కవితను సాధనముగా గ్రహించెను. ప్రధానముగా 'దేశి' కవిత అనునప్పుడు దేశీయమైన ఛందస్సు సంస్కృత సమేతరమైన తెలుగు భాష అని చెప్పవచ్చును. ద్విపద, కందము, సీసము మొదలగు దేశీయచ్ఛందస్సులను సోమనాథుడు విశేషముగా అభిమానించెను. మహాకావ్యములనదగిన బసవపురాణము పండితారాధ్య చరిత్ర కేవలము ద్విపదలలో నిబద్ధమైన గ్రంథములు. ఇక ఇతర లఘు కావ్యములకు కూడ అతడు ప్రచురముగ దేశీయమైన ఛందస్సును, భాషను ఉపయోగించియే యున్నాడు.

సోమనాథుడు ప్రారంభించిన దేశి కవిత తెలుగులో ఒక సంప్రదాయ ముగా, ఒక సాహిత్య విశేషముగా నిలిచిపోయినది. సోముని తరువాత చాల కాలమువరకు తెలుగు కవులలో కొంతమంది ఈ దేశికవితా సంప్రదాయమును గ్రహించి అనుసరించిన వారు కన్పింతురు. సోమనాథునికి వలెనే ఈ కవులకు కూడా శైవమతాభినివేశము ఉన్నది. అనగా, మత సాహిత్య సంప్రదాయ ములు రెండింటియందును ఈ కవులు సోమనాథునికి అనుయాయులనియే చెప్పుట సమంజసముగా నుండును. ఇట్టి సంప్రదాయ అనుసరులలో కానే సర్వప్ప ఒకడు. ఇతడు ద్విపదయందు చక్కని కథా కావ్యము వ్రాసి తెలుగు సాహిత్యమును సుసంపన్నము చేసినాడు. దానిని గురించి యిప్పు డింక పరిశీలన చేయవలసియున్నది.

తెలుగులో చారిత్రిక కథా కావ్యములు చాలతక్కువ ఆ వరుసలో చెప్పగా సిద్ధేశ్వర చరిత్రమునే చారిత్రక కావ్యములలో మొదటి దానినిగా

చెప్పవలసియుండును. సిద్ధేశ్వరుడనగా ఈశ్వర స్వరూపుడైన మహేశ్వరుడే. సిద్ధేశ్వర చరిత్ర మన్నప్పుడు ఈ కపిశివుని కథా విశేషములను వ్రాయునేమో ననిపించును. కాని ఈతని కావ్యము తెలుగు దేశమును ఓరుగల్లు రాజధానిగా చేసికొని మూడు శతాబ్దులకాలము పరిపాలించిని కాకతీయుల చరిత్రను గురించి చెప్పుచున్నది. అందులో ప్రతాపరుద్రునికి సంబంధించిన చారిత్రక విశేషములు విపులముగా వర్ణింపబడినవి. అందుచేత పేరునకిది సిద్ధేశ్వర చరిత్రయేయైనను కాకతీయుల చరిత్రకే ఈ కావ్యమునందు ప్రాధాన్యము.

సిద్ధేశ్వర కాకతీయ చరిత్ర ప్రధానముగా మూడు ఆశ్వాసములలో విభాజ్యమైయున్నది. మొదటి ఆశ్వాసము మహేశ్వరుని అవతారమును గురించి చెప్పును. శివుడు కైలాసమునుండి హనుమకొండలోని సిద్ధేశ్వరాలయము నందు సిద్ధేశ్వరుని రూపములో అవతరించుటను గురించి వర్ణింపబడినది. రెండవ ఆశ్వాసములో హనుమకొండను పరిపాలించిన రాజులను గురించి చెప్పుటయేకాక మాధవవర్మ అనురాజును గురించి అతని దిగ్విజయములను గురించి వర్ణింపబడినది. ఇక మూడవ ఆశ్వాసము ప్రతాపరుద్రుని జన్మము అతని విద్యాభ్యాసమును గూర్చి చెప్పును. బహుశః 4వ ఆశ్వాసమునందు కూడ అతడు ప్రతాపరుద్రుని కథను చెప్పదలచియుండెను కాబోలు. కాని ఈ భాగము వచన మందే వ్రాయబడియున్నది. అదికూడా ఏకామ్రనాథుని ప్రతాప చరిత్రకు చాలా సన్నిహితముగానుండెడి రచనగా కన్పించును.1*

సిద్ధేశ్వర చరిత్ర-ఇతివృత్తము:- సిద్ధేశ్వర చరిత్ర, ప్రతాప చరిత్ర రెండింటికి దగ్గర సంబంధముగలదు. కాకతి రాజన్యుల కీర్తి ప్రాభవములను ప్రకటింపదలచినవాడై కాసెసర్వప్ప సిద్ధేశ్వర చరిత్రమును రచించెను. గద్యముకన్న పద్యము ప్రశస్తమను భావముగలవాడగుటచే కాబోలు సర్వప్ప ద్విపద కావ్యముగ దీనిని వెలయించెను. శివపార్వతులు కైలాసము నుండి దిగివచ్చి లోకానుగ్రహార్థమై హనుమాద్రిపై వెలయుట యిందలి విషయము. ఈ భాగము ఏకామ్రనాథుని ప్రతాప చరిత్రములోలేదు. అందిట్లు గ్రంథారంభము చేయనైనది. "అట్టి పుణ్యాశ్రమంబునకు, ఈశాన్య భాగంబునందు

---

* సిద్ధేశ్వర చరిత్ర (పీఠిక) ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

హనుమద్గిరి యనునొక ధరణీ ధరంబు విలసిల్లు. అప్పర్వతమధ్య భాగంబున ప్రమథ గణంబులును, సకల ముని జన సేవితుండును సిద్ధేశ్వరుండును, పశ్చిమ భాగంబున బద్మాక్షీదేవియు గలరు" సిద్ధేశ్వరావిర్భావమును గూర్చి యందేమియులేదు. ఈ కథనంతను కాసెసర్వప్పయే ప్రవేశపెట్టి తనకుగల కవితాశక్తిని ప్రదర్శించి సార్థకము చేసికొనెను. కాళిదాసు కుమార సంభవము నందును ఇతర శివపురాణము లందునుగల పార్వతీ పరమేశ్వర వివాహ వృత్తాంతము నిందుతెచ్చిపెట్టి చరిత్ర గ్రంథమునందు గూడ మంచి రచనావకాశమునీతడు కల్పించుకొనెను. కాని సిద్ధేశ్వర చరిత్ర పద్యకావ్యముకాగా ప్రతాపచరిత్ర వచన కావ్యము. కొన్నికొన్ని విషయములు ఒకచేయైనను ప్రతాపచరిత్రలో చారిత్రక విశేషములు ఎక్కువగలవు, సిద్ధేశ్వర చరిత్రలో శివ ప్రతిపాదకమగు విషయములు మున్నగునవి మొదటి రెండాశ్వాసములలో చెప్పబడినవి. సిద్ధేశ్వర చరిత్రము రెండు భాగములుగా గలదు. ఒకటి పద్య భాగము రెండవది గద్యభాగము. పద్యభాగములో మొదట శివుడు సిద్ధేశ్వరుడుగా హనుమకొండపై వెలయుట వర్ణితముకాగా రెండవ భాగములో కాకతీయ రాజుల చరిత్రము వర్ణితమైనది. శివుడు సిద్ధేశ్వరుడుగా అవతరించుట అనునది ప్రతాపచరిత్రలో కానరాదు. కాసె సర్వప్ప శివుడు సిద్ధేశ్వరునిగా హనుమకొండలో వెలయుట అను అంశము సిద్ధేశ్వర చరిత్రలో ప్రత్యేకముగా వెలయించుట విశేషము. దీనివలన ఈతని శైవభక్తి తత్త్వము వెల్లడియగుచున్నది, మరియు ఆతని కవిత్వ ధోరణి రాణించినది. సర్వప్ప చెప్పిన శివుని కథ యిట్లు గలదు.

నారదుని గానమునాలకించుచు శివుడు పార్వతీ సమేతుడై దేవగణములతోసహా సభ తీర్చియుండగా ప్రమథ గణములు శివలీలాగానము చేయుచు శివస్తుతి చేసిరి. చిఱుతొండడు, భల్లనరాయ, కన్నప్ప మున్నగు భక్తులను శివుడేవిధముగా రక్షించెనో వర్ణించిరి. శివుని హనుమకొండ ప్రాంతమున గల కొండపై వెలసి అచట గల మానవాళి నుద్ధరించవలసినదనివేడిరి. హనుమకొండ హిడింబా శ్రమమునకు ఈశాన్య దిశగాను, గోదావరీ కృష్ణానదీ ప్రాంతముల మధ్యన శ్రీశైలమున కుత్తరదిశగా గలదు. అనేకమంది దేవతలు వెలసిన పవిత్రమైనకొండ హనుమకొండ సమీపమునగలదు. కొండకు దక్షిణ

దిశన అద్భుతమైన సరస్సు గలదు. ఈ ప్రదేశముయొక్క పవిత్రత వర్ణనాతీతము. ఇట్టి పవిత్ర స్థలము గావుననే శివుడు ఇచట వెలయుటకు తగినదని బావించి ప్రమథ గణములు ప్రార్థించిరి. అదే విధముగా పార్వతీదేవిని కూడా సిద్ధేశ్వరమునకు పశ్చిమ దిశగానున్న కొండపై పద్మాక్షి నామముతో వెలయుటకు ప్రార్థించిరి. ఇచట కాసెసర్వప్ప పార్వతీదేవి దక్షప్రజాపతి యజ్ఞమందు ప్రాణత్యాగముచేసి హిమవంతుని కుమార్తెగా జననమొందెనో వర్ణించినాడు. ఈ వృత్తాంతము కుమార సంభవములో విపులముగా చర్చించబడినది. పార్వతీదేవి శివుని వివాహమాడవలెనని కోరికతో నుండెను హిమవంతుడు తన సోదరులైన మలయ, మందర రాజులతో పార్వతిని శివునికిచ్చి వివాహము చేయుటకు నిశ్చయించినట్లు తెలిపి వారి యభిప్రాయమునుకోరగా వారును అంగీకరించి పెండ్లి కుమారుని చూచుటకు మహర్షులను పంపిరి. వారు శివునకీ విషయము తెల్పగా శివుడు అంగీకరించి వారిచ్చిన తాంబూర దక్షిణాదులను గ్రహించెను. అంత శివుడు తన వారిని పెంప్లి కుమార్తెను చూచి వివాహము నిశ్చయింపుమనెను.

అంత పార్వతీదేవి సర్వాలంకృతయై చెలికత్తెలతో కూడి వచ్చుచుండ ఋషులు సాముద్రికశాస్త్ర ప్రకారము ఆమె సౌందర్యమునుచూచి ముగ్ధులైరి. ఈశ్వరనామ సంవత్సరములో కార్తీకమాస మధ్యమంబున నవమి సోమవారము రాత్రి వివాహము జరుగుటకు నిశ్చితమైనది. ఇదే రోజున సిద్ధేశ్వర దేవ వార్షికోత్సవము జరుగునట. పార్వతీ కళ్యాణ నిశ్చితార్థ సూచకముగా దక్షిణ తాంబూలాదులు, ఉంగరము శివుని ప్రతినిధులు పార్వతికి బహూకరించిరి. మహాదేవుడైన శివుడు అతని పరివారముతో పెండ్లికి మహావైభవముగా తరలివచ్చెను. హిమవంతుడు వారిని సాదరముగా ఆహ్వానించెను. పెండ్లి వేడుకలు మహావైభవముగా ప్రారంభింపబడెను. పవిత్రాగ్నిని బృహస్పతి మున్నగు ఋషులు వెలిగించిరి. స్త్రీలు పెండ్లి పాటలు పాడిరి. ఈ విధముగా వైభవముగా పెండ్లి జరిగెను. పెండ్లికుమార్తెను పంపు సమయమాసన్నమయ్యెను. ఆక్షణము ఏతండ్రికైనను అత్యంత ఆనందదాయకము, మరియు బాధాకరము కూడ. ఇటువంటి పరిస్థితి ఎటువంటి మహనీయులకైనను తప్పదు. కాళిదాసుని "అభిజ్ఞాన శకుంతలము"లో కణ్వమహర్షికి కూడ తప్పలేదు. శకుంతల అత్తవారింటికేగు సమయమున కణ్వుడు

సామాన్య మానవునివలె విలపించినాడు పార్వతీదేవితో కళ్యాణము జరిగినది మొదలుకొని శివుడు అర్ధనారీశ్వరుడయ్యెను. ప్రమథ గణముల ప్రార్థన నంగీకరించి హనుమకొండపై సిద్ధేశ్వరుడు, పద్మాక్షి యను నామధేయములతో శివపార్వతులు వెలసిరి*. ఆరోజు మొదలుకొని ఆ స్థలము సిద్ధాశ్రయముగా పేరొందినది.

ఈ విధముగా శివుడు సిద్ధేశ్వరుడైనాడు. ఈ స్థలములో శివుని మహాత్మ్యమెట్లున్నదో కవి చెప్పుచున్నాడు. విద్యార్థులు సిద్ధేశ్వరు నారాధించి తగిన విద్యనుపొంది కవితా సామర్థ్యమును పొందిరి. ఈ కవిత్వము వ్రాయుటకు తగిన శక్తిని సామర్థ్యమును శివుడే వారికొసంగెననుధ్వనియిచట గలదు. ఇది సిద్ధేశ్వరుని మహాత్మ్యమువలననే సంతాన హీనులకు సంతానప్రాప్తి శివునిమహిమచే గలుగుట యిచట మరియొక విశేషము

విద్యార్థులకును దావిద్యలిచ్చినను
గద్య పద్యంబులగాంచ జెప్పుదురు
మోక్షార్థులెల్లను మొగిపునశ్చరణ
లక్షలు నక్షర లక్షలుజేసి
యక్షయ పదవులనందు చుండుదురు
పుత్రార్థులగువారు పొసగబూజించి
పుత్రుల బౌత్రుల బొందనేరుతురు.
అని ప్రమధులు వేడనా సదాశివుఁడు
భక్తహితార్థమై పరగంగ వచ్చి
వ్యక్త సిద్ధాశ్రమ వీదులనుండె. (సి ౹చ౹ ప్ర-ఆ).

ప్రథమాశ్వాసాంతములో కవి శివ పార్వతీ కళ్యాణ ఘట్టమును సిద్ధశైవ పురాణము నుండి స్వీకరించినట్లు సూచించినాడు. ఇటువంటి పురాణమున్నదోలేదో మనకు తెలియదు. ఎచటను ఆధారములులేవు. శివపార్వతుల

* సిద్ధాశ్రమమునకు సన్నిహితముగా అనేక దైవతములు వెలసినవి. వారిలో దుర్గ, కాలభైరవుడు మున్నగువారు కలరు. కవి కాలభైరవుని వటులేక వటుభైరవుడు అని పేర్కొనెను.

కళ్యాణగాథ విశ్వవ్యాప్తముగా ప్రఖ్యాతి నొందినదే. సుపరిచితమే. ఈ చిన్న గాథను తీసికొని కవి ఆనాటి సామాజిక వివాహ వ్యవస్థ, కట్టుబాట్లు ఆచార్య వ్యవహారములు మున్నగునవి వర్ణించి ఆసక్తి వంతముగా తీర్చిదిద్దినాడు.

## ఆ శ్వా సాం త ము

ఇది సిద్ధశైవ పురాణేతిహాస
సదమల భక్త సచ్చరిత్ర వికాస
సింధురా సురత్వక్కు చేలాంగసంగ
బంధుర సిద్ధేశపాదాబ్జభృంగ
విదిత ప్రమథాఖిల విద్వజ్జనాళి
పదకమల క్సారభాస్వాదనానూన
మానసాంభోజాత మధుకరపాన
లీనాత్మ సముదిత నిత్యనిపుణుండు
కానేమల్లన మంత్రి ఘనకుమారకుడు
వానిగాజెప్పె సర్వప్ప నాహ్వయుడు
సిద్ధ మహాత్మ్యమన్ శ్రీ కృతియందు
శ్రద్ధప్రథమ కథిత సేవ్యంబునందు
వినిపింప దొలుకాడు (వి) శ్రుతకావ్య
మున బ్రథమాశ్వాస మొగినయ్యె నొకటి. (సి॥ చ) (ప్ర॥ అ)॥

ఇతర కవులవలెనే కానె సర్వప్ప కూడ తన వంశజులగు తండ్రి తాతలను ఇందు ప్రశంసించినాడు. అవతారికలో శివస్తుతి చేసినాడు. శివ భక్తుడనుటకు శైవమతావలంబి యనుటకిది తార్కాణము. శివస్తుతి (ఇష్ట దేవతాస్తుతి) యైన పిమ్మట సంప్రదాయానుసారముగా విఘ్నేశ్వరుని స్తుతించెను

కానె సర్వప్ప శివకవుల మార్గమునకు చెందినవాడు. కాని ఈతడు వీరశైవుడుకాడు. వేద మతమున కనుగుణమైన సాధారణ శైవమతమునే పాటించినవాడు. అయినను కవిత్వ రీతులందు శివకవుల పదములను మెచ్చిన

వాడు. శివకవి రీతులనగా శివభక్తుల కథలను, వర్తమాన వీరుల వృత్తాంతములను కావ్య వస్తువుగా గైకొనుట; దేశీయచ్ఛందస్సులలో రచన చేయుట; ఛందోవ్యాకరణ నియమములను కొంత సడలించుకొని, వారి పరిధిని విస్తృతము చేయుట; నాటి జన వ్యవహారమునకు సమీపముగానుండు భాషా నిబంధనము కావించుట దీనినే ప్రాచీన శివ కవులు జాను తెనుగని వ్యవహరించినట్లు కన్పించును. కానె సర్వప్ప యందీ లక్షణములు గోచరించుచున్నవి. శివభక్తుల చరిత్రములకు బదులుగా నీతడు ప్రజాహిత తత్పరులైన మహారాజుల పుణ్య వృత్తాంతములను కవితా వస్తువుగా గ్రహించినాడు. వారును శివారాధకులే, కాకతీయుల శివాలయ ప్రతిష్ఠలు లోక ప్రసిద్ధములు. వారు కావించిన తటాకారామ ప్రతిష్ఠలును నేటికిని కొంతవరకు నిలిచియేయున్నవి. ఇట్టి లోకహిత పరాయణుల చరిత్రమును కావ్యవస్తువుగ గ్రహించుట శివకవి సంప్రదాయమున కనుగుణముగనే యున్నది. సిద్ధేశ్వర చరిత్ర యందీతడు వాడినది దేశీయ ఛందస్సైన ద్విపద. చరిత్ర ప్రసిద్ధులైన మహారాజుల కథనమును సాహిత్యమునందు ప్రవేశపెట్టిన యాంధ్ర కవీశ్వరులలో నీడదే మొదటి వాడని ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం గారు సిద్ధేస్వర చరిత్ర పీఠికలో వ్రాసిరి. కృష్ణరాయ విజయము; నరపతి విజయము మున్నగు చారిత్రక కావ్యములను వ్రాసిన కవులీతనికి అనంతరులని చెప్పదగియున్నది.*

సిద్ధేశ్వర చరిత్రలో చారిత్రిక వ్యక్తులగు కాకతీయ వంశజుల గూర్చి చెప్పినను శివమహాత్మ్యము, హరి శివభక్తి కూడా కవి వర్ణించినాడు. శివపార్వతుల కళ్యాణ ఘట్టములో వేద పండితుల వేద ఘోష, వైదిక మార్గ పద్ధతిలో పెండ్లి జరుగుట యితడు వర్ణించిన తీరు, కేవలము శివభక్తుడని చెప్పుటకాధారములే తప్ప వీరశైవ మత లక్షణములు కాన్పించుటలేదు. కానె సర్వప్ప వైదిక మత ధర్మములను గౌరవించి, అటు శివ కవులు పాటించిన శైవ సంప్రదాయములను విడనాడక రెంటికి చక్కని సమన్వయము చేకూర్చినాడనిపించుచున్నది. సిద్దేశ్వర చరిత్రలో సిద్దేశ్వరుని గొప్ప తనమును వర్ణించుటకు వెనుకాడలేదు. ఇంక శివుని పెండ్లిలో వేదములు వల్లించబడెనని కవి చెప్పెను.

---

* సిద్దేశ్వర చరిత్ర (పీఠిక) ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

రెండవ భాగము భువనైక మల్లునితో మొదలిడి ప్రతాపరుద్రునితో అంతమైనది. ఈ ప్రతాప రుద్రుడు శివభక్తుడు. సిద్దేశ్వర చరిత్రలో నీ విధముగా తెల్పబడినది. సిద్ధేశ్వరుడు సిద్ధులను తరింపజేయుటకు భూమిపై వెలసి కొన్ని సంవత్సరములు గడచినవి. శ్రీశైలమున కుత్తర దిశగా నున్న కృష్ణా గోదావరీ నదుల నడుమ నున్న భూభాగమున దండకారణ్యములో హిడింబాశ్రమమున్నది. దీనికీశాన్య దిశగా హనుమకొండ పర్వతముగలదు. దేవతలు, సిద్ధులు ఈ ప్రదేశమును వారికి అనువైన నెలవుగా ఎంచుకొనిరి. సిద్దేశ్వర స్వామి యిచటనే వెలసినాడు.

ఇటువంటి పర్వతముపై యెఱుక దేవరాజు ప్రేటకులమునకు చెందినవాడు తన రాజ్యస్థాపన గావించెను. ఇతడు శ్రీశైల ప్రాంతమునకు చెందిన మహావీరుఁడు. సిద్ధేశ్వరునారాధించవలసినదిగా అచ్చటి ప్రజలకు బోధించెను. ఈతనికి ముగ్గురు కుమారులు. వారు అనుమ, కొండ, గార్గలేయ అనువారలు.* వీరి వంశము 186 సం॥లు పరిపాలనచేసినట్లు సిద్దేశ్వర చరిత్ర చెప్పుచున్నది. దీనికాధారములు తగినంతగాలేవు తర్వాత కాకతీయులు పద్మాక్షిదేవియొక్క ఆశిర్వాదముతో ప్రాముఖ్యము పొందిరి. వీరి ఓరుగల్లు పట్టణము నిర్మించిరి. అదియే నేటి ఒరంగల్లు. కవి వీరి వైభవము 125 కథలతో వర్ణింపబూనినాడు.

మొదట చంద్రవంశరాజుల వృత్తాంతమును కవి చెప్పినాడు. చంద్రుడు కులదైవము. వీరిలో ప్రముఖులు మహాభారతంలోని పాండవులు, సర్పయాగము చేసిన జనమేజయ మహారాజు, క్షేమకుడు, జయార్కుడు ప్రతాప సోమేంద్రుడు మున్నగువారు. ఈ వంశములో సోమరాజు (విష్ణువర్ధనుని చిన్న తమ్ముడు) రాజరికపు శతృత్వము నుండి దూరముగా నుండుటకు నిశ్చయించి గోదావరి నదిని దాటి అచట అనేక రాజ్యములు జయించి తన రాజ్య ప్రతిష్ఠాపన గావించెను. ఈతని కుమారుడు నందుడు. యుద్ధ నైపుణ్యము నందు పేరు పొందినవాడు. ఈతడు నందగిరి నగరమును నిర్మించెను. ఈతని రాణి భానుమతీదేవి. ఈతడు భ్రమరాంబా, మల్లికార్జునలను కొలుచుటకు శ్రీశైలము వెళ్ళెను. ఇచట ఒక గుహయందు ప్రవేశించగా

---

* సిద్దేశ్వర చరిత్ర పీఠిక - ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు

ఒక యోగి ఇతనికి దివ్యశక్తులు గల ఖడ్గము, కవచము ఒసంగెను. నందరాజు కాంచీపురమునకుపోయి చోళ రాజు కుమార్తెను వివాహమాడెను. రామేశ్వరము కూడ సందర్శించెను.

కవి చంద్రవంశరాజుల వృత్తాంతము చెప్పుచూ సిద్ధేశ్వర చరిత్రలో "అతనికి కొండడు మనుమడు నాగ.

నుతిమీర గర్గశీయుండుననంగ
నూట యెన్బదియేఱు నొగి వత్సరములు
పాటించి యేలిరి బాగుగా బృథ్వి
నంతటనొక కొన్ని హాయనంబులకు
నంత పద్మాక్షి వర ప్రాసాదమున
కాకి తరాజులు ఘనవైభవమున
నేక శిలనగర మే పారగట్టి
రటమీద బెక్కు సాహసములు చేసి
కోటలు పెట్టించి ఘోరసంగ్రామ
పాటవంబున జెలగి పాలించిరవని
నేటించి వారల మేటి కీర్తులను
నూట యిర్వదియైదు నొప్పగు కథలు
శ్రీ మత్ప్రతాపుని చరితంబు కథల
నేమంబులగు నను క్రమణిక దెలియ
వే మరు ద్విపదల విస్తరించెదను
సేమమున వినుడు చిత్తంబు లలర."

చంద్ర వంశ వృత్తాంతము చెప్పిన పిమ్మట వరుసగా కాకతీయ రాజులు పరిపాలనము కవి వర్ణించెను. ఇందు విశేషమేమనగా కాకతీయ వంశజు లందరు శివభక్తులే. పెక్కు ఏడులు గడచిన పిమ్మట ఈ వంశములో సోమ దేవరాజు జనించినాడు. ఇతడు జెబ్బెర్లను పరిపాలించెను. భల్లునితో యుద్ధ రంగముగా ఈ సోమదేవరాజు మరణించెను. ఆ సమయములో ఆతని రాణి

సిరియాలదేవి గర్భవతి. మహాదేవశర్మ శిరియాలదేవికి ఆశ్రయమిచ్చి రక్షించెను. ఆమెకు కలిగిన కుమారుడే మహదేవవర్మ. ఇతడు రాజ్య ప్రతిష్ఠచేసి నూట అరువది సంవత్సరములు పాలించెను. ఈ బాలుడు పంచ వర్ష ప్రాయంపువాడై అక్షరాభ్యాసము చేసిన పిమ్మట పద్మాక్షీదేవి యితనికి ప్రత్యక్షమయ్యెనట. తోడి బాలురతో పద్మాక్షి దేవాలయములో గూర్చుండగా పలక పుస్తకము పట్టిన ఈ బాలుని ధైర్య సాహసములకు మెచ్చి పద్మాక్షీదేవి "నీ మదిలోని కోరిక ఏమిటి? అని అడుగగా నబ్బాలుండు.

"వినుము శ్రీ పద్మాక్షి వీరహంకాళి
మా తండ్రి పశువుల మల్లుబల్లహుని
చేత నోటువడిన నేమ మంతయును
తమ తల్లిచే విన్న తన కథ తెలియు
కామంబునకు ఫలముగావలెననియు
వాని జయింపగ వరబలశక్తి"
గాని యెండోల్ల నోకమలాక్షి

అనగా దేవి అతనికి తగిన ఆయుధములు ప్రసాదించి అతని కోర్కె నెరవేరునని వరమిచ్చి వీడుకొలిపెను. ఇచట బాలునికి పద్మాక్షీదేవి యందు గల నిశ్చల భక్తి గొనియాడదగినది. బాలుని చేయవలసిన పనులన్నియు పద్మాక్షి చెప్పుటలో కవి బ్రాహ్మణులయెడ, చూపిన యభిమానము కొనియాడ దగినది. శివునారాధించుటకు కుల గోత్రములతో పనిలేదనువాదమును ఈ కవి బలపరచలేదని తెలియుచున్నది. ప్రగాఢమగు శివభక్తుడైనప్పటికి వేద పారగులను బ్రాహ్మణుల యందభిమానము చూపినాడు. మహేశ్వరుని కొలి చిన పిమ్మటనే ఏకార్యమైనను తలపెట్టవలెనని పద్మాక్షి దేవిచే కవి పలికించిన పల్కులు. ఆతని శైవమతాభి నివేశమున కుని దర్శనములు. మాధవవర్మ కొడుకు పద్మశేనుడు. డెబ్బది నాలుగు సంవత్సరములు పరిపాలించెను. తదుపరి రాజు వెన్నెమరాజు. అతని కొడుకు పోరంకి వెన్నమరాజు. తరు వాత పెండ్లి గుండమరాజు తరువాత యెఱుక దేరరాయడు. భువనైకమల్లుడు యెఱుకదేవరాజు కొడుకు. త్రిభువనమల్లుడు, (విక్రమాదిత్య 6గా పిలువ బడెను). ప్రోలరాజు (పెక్కు శివాలయములు నిర్మించినాడు) రుద్రదేవుడు

మహదేవరాజు, గణపతి దేవరాజు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడు మున్నగు వారందరు కాకతీయ రాజ్యము పరిపాలించినవారే

ప్రోలరాజు పెక్కు శివాలయములు నిర్మించినాడు. ప్రోల రాజునకు మరియొక రాజధాని నిర్మించవలయునను దివ్యాలోచన కలిగినది. హనుమకొండ ప్రాంతములో కొంతమంది బండ్లు తోలుకొనిపోవువారు ఈ మార్గమున పోవుచుండగా బండిచక్రము ఒక రాతికి తగలగా ఆ చక్రములోని యినుప భాగము బంగారముగా మారినదట. అందరూ ఇది చూచి ఆశ్చర్యపడి వెంటనే రాజునకు విన్నవించిరి. రామారణ్యులను పండితుని సంప్రదించినారు. ఇది 'పరుసవేది' యను రాయయొక్క ప్రభావమని తెలిపినారు. ఈ పరుసవేది అన్ని లోహములను బంగారముగా మార్చును. అంతనిచట శివాలయము, ఓరుగల్లు పట్టణము నిర్మించబడినవి. చరిత్రాధారములు 909 శక సంవత్సరములో (A. D. 987) వరంగల్లు పట్టణము నిర్మించినట్లుగలవు. కాని యిది రెండవ ప్రోలరాజు సమయమునకు సరికాదు. మొదటి బేతరాజునకు 'కాకతిపుర అదినాథ' యను బిరుదుకలదు. ఇక్కడ కాకతిపురము హనుమకొండగా భావించబడినది. ఓరుగల్లు ఒక గ్రామముగా ఉండి తరువాత రెండవప్రోలరాజు ఆధ్వర్యములో పట్టణముగా అభివృద్ధిచెంది యుండవచ్చు. ఓరుగల్లునందు ప్రోలరాజు ముక్తేశ్వర, విశ్వనాథ, విరూపాక్ష, మల్లికార్జున, నీలకంఠ, మున్నగు దేవతల విగ్రహములు ప్రతిష్ఠించినాడు. ఇతడు గణపతి, వాసుదేవ, వీరభద్ర దేవుళ్ళకు కూడ అనేక ఆలయములను నిర్మించినాడు. పరుస వేదిశిల ప్రతిరోజు ఒక బారువ బంగారము యిచ్చుచుండెడిది*. అది ప్రోలరాజు బ్రాహ్మణులకు పంచిపెట్టుచుండెడివాడు. ఈ విషయములన్నియు సిద్దేశ్వర చరిత్రలో పేర్కొనబడినవి. ప్రోలరాజు కుమారునకు జబ్బు చేయుటయు దైవానుగ్రహమున నయమగుటకు. చివరకు మోక్ష ప్రాప్తి కలుగుటయు వర్ణింపబడినది. ఈతని కుమారుని ఉపనయనము కూడ కవి సందర్భానుసారముగా పేర్కొనినాడు. దీని వలన ఉపనయన కర్మకు కవి యిచ్చిన ప్రధాన్యము ఈ గ్రంథములో పలుచోట్ల చూచుచున్నాము.

---

* సిద్ధేశ్వర చరిత్ర పీఠిక ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు.

తరువాతి వాడగు రుద్రదేవుడు కూడ శివభక్తుడే. దేవాలయములు కట్టించుట, పూజలు చేయించుట, యిటువంటి కార్యక్రమముల యందు శ్రద్ధ చూపినట్లు తెలియుచున్నది. పెక్కు ఆలయములు రుద్ర దేవుడు కట్టించెను. తరువాత మహాదేవరాజు పరిపాలించెను. పిమ్మట గణపతిదేవ రాజు పరిపాలన చేసెను. ఇతడు కూడ శివ మందిరములు నిర్మించినట్లు సిద్ధేశ్వర చరిత్ర చెప్పుచున్నది.

అంతట నోర్గంటికపుడును శైల
ప్రాంతంబు శిలలను బగుల వేయించి
కోటకలరంబులు (2) కొత్తడంబులును
వాటంబుగా రాతికోట బెట్టించె
చేయగా గడమైన శివమందిరములు
వేలార్లు ఖర్చించి వేగ బెట్టించి
యా రీతి గణపతి యా మహారాజు
సార దయారస హరి మానసుడు
మీటి ధర్మంబులు మితిమేఖలేక
పూరించి (న్యాయంబు) భూపతులెల్ల
సారె సారెకు (తన్ను సన్నుతుల్) సేయ
సార పారావార సరసగంభీర
సారుడై కీర్తి విస్తారుడైయలరు (సి.చ. 114)

♦ ఈతని కాలములో ఈ గణపతి దేవరాజు దగ్గరకు తిక్కన సోమయాజి అరుదెంచెను. తిక్కన పేరు చెప్పినంతనే హరిహరనాథ తత్త్వము జ్ఞప్తికి వచ్చును. శివకేశవులకు భేదము లేదనుట బహుశ ఈ కాలమునుండియే అమలు చేయబడెనని తోచును. శివభక్తి వెఱ్ఱి తలలు వేచిన పాల్కురికి కాలమునకును. ఈ కాలమునకును భేదమదియే. తదుపరి రుద్రమ దేవి పరిపాలించెను. ఈమె కడుధీరురాలు రాజ్య పరిపాలనా నైపుణ్యము కలిగిన వ్యక్తి.

♦ ఈమెకు యిరువురు కుమార్తెలు. ముమ్మక్క, రుయ్యమ అను వారలు ఈమె కుమార్తెలు. ముమ్మక్క కుమారుడు ప్రతాప రుద్రుడు. రుద్రమదేవి శివభక్తురాలే. "సిద్దేశ్వరుని సహస్ర దళంబుల బూజించి, పద్మాక్షిదేవి నిత్యా మహోత్సవంబు గావించుటయు", యిత్యాది వాక్యముల వలన ఈమె భక్తి వెల్లడి యగుచున్నది. మహాధైర్య సాహసములతో రాజ్యము పరిపాలించిన వీర వనిత యీమె. మనుమడైన ప్రతాపరుద్రుడు పెరిగి పెద్ద వాడై రాజ్యపాలనము స్వీకరించెను. ప్రతాపరుద్రుడు కూడ శివ భక్తుడే. యితడు నానా వర్ణముల వారికి లెఖ్ఖలేనన్ని గృహములు నిర్మించినాడట. సిద్దేశ్వర చరిత్రలో నీ విధముగా గలదు. "శివాలయంబులు అయిదు వేలయేన్నూరు, విష్ణుస్థానంబులు వెయ్యిన్నెన్నూరు, మైలారు దుర్గ, భైరవులాదిగా గణపతి వీరభద్ర నివాసంబులు నాల్గువేల నేనూరు, యిందుల ప్రసిద్ధ స్థానాల భేరీలు యేనూట యేబది యును, నిస్సాణంబులు రెండు వేల యేనూరు....పంచ మహా శబ్దంబులు మ్రోయుచుండ గుడుల మీది పసిడి కుండలు అయిదువేల యేనూరు, దేవతా స్థానాల దీపాలకు నూనె దినంబును కొలపాటి యిరువైయైదు పుట్లు, నగరి దీపాల కన్ను నిత్య బ్రాహ్మణ సంతర్పణకున్ను ఘనసారచందన పరిమళ ద్రవ్యాదులకు నిత్యంబును పది వేల వరహాలు నగరిలో భాగీరథి జలంబుల చేతను, గౌతమీ జలంబుల చేతను శివుణ్ణి పూజసేతురు" (సి చ. 151)

మఱియు ఒకనాడు ప్రతాపరుద్రుండు కొలువు చాలించి సకల జనంబుల వీడుకొలిపి శివ దేవయ్యయును తానును, అంతఃపురంబునకుం జనుదేఱయా రాజు పట్టపు దేవియగు విశాలాక్షి శివదేవయ్యగారింజూచి పరపురుషుండుగదా యని మఱుగుకేగుటయు, అంత ప్రతాప రుద్రుండు శివదేవయ్యగారికి నిజ మందిరంబున కనిపి రాజు మజ్జన భోజనాదులు దీర్చి నవరత్న ఖచితంబైన

♦ తాటియాకు శిథిలమైపోగా తాళపత్ర ప్రతిలో రుద్రమదేవి ప్రతాప రుద్రుల గూర్చి ఉన్న భాగమంతయు యథాతథముగా ప్రతాపుని జీవిత చరిత్ర యిచట పొందుపరచుటయైనది. ప్రతాప రుద్రుని గాథ ఈ విధముగా గలదు. శివభక్తుడుగనుక ఆతడొనరించిన పుణ్యకార్యములు, తత్సంబంధమైన శివభక్తుల కథలు యథాతథముగా వ్రాయుటయైనది.

యొక్క పీఠంబున గూర్చుండి తన పట్టపు దేవి యగు విశాలాక్షి కిట్లనియె శివదేవయ్యను జూచి పర పురుషుండని తొలగిపోయితివి. అయయ్య యిశ్వరుండుగాని మనుజమాత్రుండు గాడు యీయయ్య బూజించి సుగతి గాంచు" మని యెఱుంగ బలుకుటయు యీ వాక్యంబు విశాలాక్షి దేవి తన చిత్తంబున పాదుకొలిపి శివదేవయ్య యెదుట తానిలువనోడి పతి వాక్యంబులు మనంబున నిలిపి శివదేవయ్య గారి రూపంబుగా నొక్క సువర్ణ ప్రతిమ గావించి, వొక సువర్ణ వేదిపై నునిచి, షోడశోపచారంబుల బూజించుచుండె. అంత నొక్క నాడు మాసశివ రాత్రి యగుటయు, యీ ప్రతాప రుద్రుండును శివదేవయ్య (యు) నుపవసించి స్నానాది కృత్యంబులం దీర్చి శంభులింగంబున గరికిం జని, యద్దేవునిం జూచి యచట జాగరణంబు సేయుచున్న సమయంబున, శివదేవయ్య సుగంధంబైన త్రేన్పు గ్రుఖున త్రేన్చినంజూచి ప్రతాప రుద్రుండాశ్చర్యచిత్తుండై "మహాత్మా, మాతోడనే వుపదసించితివి ఈవేగి నంతయు నేమియు గుడుచుటలేదు సుగంధంబైన త్రేన్పు త్రేన్చితివి కారణంబేమి?"యని యడుగుటయు, శివదేవుండును ప్రతాప రుద్రున కిట్లనియె "యందు వసియించిన ఆరగించితి"ననిన ఆశ్చర్యపడి నగరికింజని విశాలాక్షి దేవిని అడ్గిన, తానును సువర్ణ ప్రతిమను చేయించి శివదేవయ్య యని నైవేద్యంబు....సమర్పించితిననిన, రాజు ఆశ్చర్యపడి శివదేవయ్య గారి మాహాత్మ్యంబు గొనియాడి, యిటు మహామహుండైన శివదేవయ్య గురుండును, సఖుండును. మంత్రియునై తనకు మహామహిమచే కూర్చుచుండె"నట.

ఇక పాలకుర్తి సోమనాథుని గూర్చిన కథ. ప్రతాప రుద్రుండు రంగనాథుని ప్రభావంబువిని ఆశ్చర్యంబు నొంది తన మంత్రి యగు పాలకుర్తి సూరయ్య ప్రతాప రుద్రునకిట్లనియె "పాలకుర్తి సోమనాథుండు రచియించిన శివ కథలు దేవర రేపుశంభుని సేవింప బోయినప్పుడు సుఖస్థితి కూర్చుండి వినియెద" పాలకుర్తి సోమనాథుండు చెప్పినది నూతనంబులు గాని యాద్యంతరంబులుగావు" అని నిరాకరించిన యీప్రతాప రుద్రుండు ఊరకుండి తన నివాసంబునకుం జనియె అచట శివభక్తులు సిగ్గుపడి పాలకుర్తి కింజని సోమనాథున కెఱింగించిన యా సోమనాథుండు శైవులు గాని వారల జూడకుండుటంజేసి యొక్క బండిపై గుడారంబు వన్నించి యందు మీద దాను గూర్చుండి, లింగ ముద్రల యెడ్ల గట్టించి యేకామ్ర గురుండును రంగ

నాథుండు మొదలుగా గల శిష్యగణంబులు తన్నుగొలువ, యేక శిలానగరంబునకుంజను దెంచి యాబండి గట్టిన యెద్దుగవని చొఅకున్న నెఱింగి గవనిపై అర్ధ దూలంబునజేసిన (ఛవి) ప్రతిమయు, రెండు యేనుగులుంటం తెలిసీ తొలగుమని పలుకుటయు, అది తునిసి యిరుగడులం బడుటయు, అంత యేక శిలానగరంబున శిష్యుడైన యన్నమదేవు నివాసంబున నుండుటయు, యావార్త ప్రతాప రుద్రుండు యెరింగి విస్మయం బొంది(న) కొందరు ధూర్తులు సహింపజాలక శిలలు దెగిపడుట మంత్ర విద్యగాని వాక్య సిద్ధి గాదనిన యతని పద్దకుంబోయి యాగుట్టు తెలిసి యిపుడే వత్తుమని రాజుచే నను జ్ఞగైకొని యా సోమనాథుని వద్దకుం జనిన, యతండు అన్యమతస్థులం జూడ కుండుటంజేసి, ద్వార పాలకుల చేత నివారితులై మగిడి పురవీధి కేతెంచి గూంపులు గూడి "కీన కటా! వేద శాస్త్ర సంపన్నుం జూడరాదట! చండాలుండైనను శైవుండయ్యేనేని మాట్లాడ చూడ వచ్చునట యిట్లు కాక" యని (య) తన్ని హాస్యంబు చేసి యా ప్రౌద్దెపురంబు వెడల నడుప వలయునని తలంచి అప్పురిలోపల గ్రాసార్థులై తిరుగు అంగహీనుల మొండి ముక్కిడి మొత్రిీవాండ్లను, అంధులను, బధిరులను, మూగలను మరియు రోత జనముల రావించి మీరుపోయి యా సోమనాథుని హాస్యంబు చేసి వచ్చితిరేని, మీకు అన్నంబు వస్త్రంబు నిచ్చెదమని యొడంబఅచి వారలకు లింగాధారణ, విభూతి, రుద్రాక్ష ...అతని ప్రభాదంబునజేసి అంగహీనులకు అంగంబులును, అంధుంకున్ను కన్నులు, బధిరులకు వీనులు మూగలకు వాక్యంబులున్ను.... అత్యంత సంతోషంబున ఆ అయ్యకు నమస్కరించి బహు విధంబుల గొనియాడి యా సోమనాథుని (చే) ననుజ్ఞాతులై పురవీధికే తెంచుటయు జూచి యా సోమనాథుని మహిమ గొనియాడిరి. ఆ ధూర్తులు లజ్జగొనిరి. ఆ ప్రతాపరుద్రునకు సోమనాథుండిట్లనియె నాయొక్క వ్రతంబు చేపట్టినడువు[10] మనిన, ఆ వ్రతంబు భంగ పడకుండా నడుపుమనిన శివుండు ప్రత్యక్షంబవునని యెరింగించిన, ఆ రాజు....యెట్టి వ్రతంబు పట్టుమందువని యడిగిన ఆ రాజును జూచి శివదేవయ్య "భాగీరథి జలంబుల అభిషేకంబు గావింక కాని కుడువ రాదని వ్రతంబు...." యెఱింగించిన యట్లకాక యని నిజవాసంబునకు జనుదెంచి నిత్యంబు భాగీరథి జలంబులు దెచ్చునట్లుగా మూ....ని ప్రభావంబునం జేసి అంగవ (?) నిత్యంబును భాగీరథి జలంబుల దెప్పించి సంబుని లింగం

బున కభిషేకంబు సేయుచుండె నంత....లు అత్యంత సంతోషంబున ఆయయ్య దృఢ భక్తిం జూడగోరి యేడు దినంబులు భాగీరథి జలంబులు రాకుండిన ప్రళయ కాలమేఘ (ము) చందంబున నుఱుములు మెఱుములు మహా వాయువుచే భాగీరథి జలంబులు దెచ్చు....కావండ్ల వారు రాక వాన చేత నొక్కొక్క మూల నొదిగిరి. ఇక్కడ ప్రతాప రుద్రుండు....ఖడ్గ ఖేటకంబులును, మైదపు జిడ్డు పట్టించుకొని పరిజనంబులు తన్ను కొల్వ వచ్చుచుండ కోట చెఱువు వీథిలోపల నచట మహా వాయువులచే (ఖడ్గ) ఖేటకంబులెగసి పోయిన మేఘంబులు నురుములు పిడుగులును వాయువు వానయు గూడ నొక్క యుద్ధ విడి వచ్చిన నోర్వలేక, చెదరి పరిజనంబులు నేలపైబడిరి. ఆ రాజు చలింపక ధైర్యంబుతోడ, వానల స్రుక్కక, బుద్ధి చలింపక, భక్తి మఱవక, వేసరక, శంభుని నగరి (కి) బోవ శక్యంబు గాక పెద్ద యెలుగెత్తి "శంభలింగా! మహాదేవా! నీలకంఠా! మృత్యుంజయా! కైలాసవాస" యని పిలుచుటయు యాక్షణంబున నంది వాహనారూఢుండై (శివుండు) ప్రమథ గణంబులు గొలువ ప్రత్యక్షంబయ్యె. అంత నిర్మేఘంబై సూర్యమండలంబు గానంబడిన, యప్పుడు ప్రతాప రుద్రుండు శంభులింగంబునకు సాష్టాంగ దండ ప్రణామంబులాచరించి బహు విధంబు నుతియించిన యద్దేవుండు మెచ్చి "నీకు వరం బిచ్చెద యడుగు" మనుటయు, శ్రీమత్ప్రతాప రుద్రుండు ముకుళిత హస్తుండై "దేవా తనకు వ్రత భంగంబు గాకుండునట్లుగా కృపసేయు"మనుటయు, యంతయు మెచ్చి "పురంబునకు వుత్తర భాగంబున క్రోసు పర్యంతరంబున భాగీరథీ జలంబుల బుగ్గ గజతుండ సమానంబై మీకు కానవచ్చు, నీవ్రతంబు చెల్లుచుండును. నీవు గంగా గర్భంబున వెడలి ది(వ్య) విమానారూఢుండవై కైలాసంబునకు వచ్చెద"వని వరంబొసంగిన శివుండు ప్రత్యక్షంబైన చోటనే శివాలయంబు గట్టించి ప్రతాప రుద్రుండు మంత్రి సమేతుడై పంచ మహా వాద్యంబులతో బోరుకలుగ మహా వైభవంబుతో పురంబు వెలువడి యొక్క రమ్య ప్రదేశంబున నిలచియు ఘోష పెట్టుచున్న సమయంబున గగనంబునంటై చంద్ర ప్రకాశంబైన భాగీరథీ జలంబుల బుగ్గ యెగసి వచ్చుటయు, నజ్జలంబులు ప్రతాప రుద్రుండు చూచి అత్యంత భరిత సంతోషంబున సర్వజనంబులును తానును స్నానంబు చేసి అక్కడ శివాలయంబు యొక్క తులా పురుషంబు దూగి కోటి సువర్ణంబులు దానంబు చేసి, పరి

యజ్జలంబులు హేమ కుంభంబులు నునిచి మద గజంబులపై నిడుకొని మహా వైభవంబుతో శంభునగరుకు యేతెంచి, అభిషేకంబు గావించి నైవేద్యంబు సమర్పించి బంధుహిత సామంత పంక్తి గూర్చుండి భుజియించిరి.

శ్రీమత్ప్రతాప రుద్రుండు రెండవ దేవేంద్రుండై సకల విభూతి సంపన్నుండై యున్న సమయంబున పాలకుర్తి సోమనాథుండు యీ దేశంబున మా వ్రతంబు చెల్లదు దక్షిణ దేశంబునకుం బోయెద ననిన ప్రతాప రుద్రుండు "గొట్టిపర"ను గ్రామంబు నగ్రహారంబుగా నొసంగెను. ఇంకను ప్రతాప రుద్రుండు అనుమకొండలోని సిద్దేశ్వరుని, పద్మాక్షీ దేవిని షోడసోపచార విధిని పూజించి నట్లు తెలియుచున్నది. ప్రతాప రుద్రుడు డిల్లీ సుల్తానుచే గౌరవింపబడి డెబ్బది యేండ్లు రాజ్య భోగంబు లనుభవించి మణికర్ణిక యందు స్నానంబు చేసి, విశ్వనాథు నారాధించి, వారణాసి యందు నిల్చెద; రాజ్య భోగంబుల సహస్ర గుణిత భోగంబులు అక్కడ నునికి నానందం" బనిన సులతానియు ననేక విధంబులుగా నొడంబరచి ఏకశిలా నగరంబునకు.... సింహాసనంబున గూర్చుండి మగుడ కాశికి జనుదెమ్మని యిరువై వేలు గుఱ్ఱంబులు సహాయంబుగా నియమించి ప్రతాప రుద్రుణ్ణి గజారూఢునిజేసి సులతాని యొక్క యోజనంబు ప్రతాపుని వెంట పాదచారియై నడచిన యొడంబడి యట్లకాక యని సులతానిని నిల్పి కాశికింజని ప్రతాప దేవేంద్రుండు మణికర్ణికం గ్రుంకి. విశ్వనాయకుల నారాధించి యచట యెనిమిది తులా పురుషంబులం దూగి కోటి సువర్ణంబులు దానంబులు యిచ్చి, యేక శిలా నగరంబునకుం జనుదెంచుచు, గోదావరి చేరి, కాళేశ్వరంబున నిలిచి అచట తీర్థంబులాటి కాళేశ్వరు ముక్తీశ్వరుని గొలిచి యేక శిలానగరంబునకు పయనంబవు సమయంబున-

శివ దేవయ్య ప్రతాప రుద్రుని యేకాంతమునకుం బిలిచి "యింకా పద్దెనిమిది (18) దినంబులకు నీవు కైలాస నివాసుండవు కాగలవు. యిది గౌతమీ గంగా గర్భము, యిందుల జీవంబు విడిచి దివ్యదేహంబు దాల్చి కైలాసంబునకు వచ్చెదవని శివుండు నీకు వరం బొసంగె. యిచ్చటనే యుండి ఏక శిలానగరంబు ప్రజల రాబనుపు" మనగానే రాజు తన పట్టపు దేవులను,

రాణివాస కాంతలను, కుమారులను, బంధువులను మున్నగు వారందరిని రప్పించెను. సకల దాన ధర్మములు గావించెను.

ప్రతాప రుద్రుండు గోదావరిలో తీర్థంబులాడి దుకూల వస్త్రింబులు దాల్చి రుద్రాక్షమాలాలంకృతుడై గోదావరి గర్భంబున కూర్చుండి శంభు లింగంబు తన హృదయంబున ధ్యానము చేసి దేవియగు విశాలాక్షిని జూచి శివ దేవయ్య యిట్లనెను, "నీవు పెద్దకాలంబు జీవించితివి....నీకు యిష్టంబైన వరంబొసగెద వేడుము''అనిన ఆయమ్మ నమస్కరించి ''మహాత్మా తనకు పతి జీవితంబుయె - నాకు చేయు'' మనిన అతండు సరియని రుధిరోద్గారి నామ సంవత్సర మాఘ శుద్ధ సప్తమి ప్రతాప రుద్రుండు నిజదేహంబు విడిచి దివ్య దేహంబు దాల్చి దివ్య విమానారూఢుండై విశాలాక్షిలోడ విమానంబెక్కి కైలాసమున కరుగగా సర్వ జనులు చూచుచుండిరి.

## ఏకాంబ్రనాథుడు - ప్రతాపరుద్ర చరిత్రము

ఏకాంబ్రనాథుడు తెలుగు వచన రచయితలలో నొకడు. ఈతడు 'ప్రతాపరుద్ర చరిత్రము' అను వచన కావ్యము రచించినాడు. రెండవ ప్రతాప రుద్రుని కాలమున కాకతీయ సామ్రాజ్యము క్రీ॥శ॥ 1323 లో తురుష్కా క్రాంతమైన తరువాత నిన్నూరేండ్లకు ఈ ప్రతాప చరిత్రము బయలుదేరి యుండునని విమర్శకు లూహించియున్నారు. ఈ గ్రంథమునందలి వస్తువు ననుసరించి యీ రచయిత యెప్పటి వాడో నిర్ణయించుటకవకాశము కనపడుట లేదు. దీనిని బట్టియే 'సిద్దేశ్వర చరిత్రము' కాసె సర్వప్ప ద్విపదగా రచించెను. ఈ 'సిద్దేశ్వర చరిత్రము'ను ఆచార్య శ్రీఖండవల్లి లక్ష్మి రంజనంగారు పరిష్కరించి విపులమగు పీఠికతో ఆంధ్ర రచయితల సంఘము, హైదరాబాదు నుండి 1960లో ప్రకటించినారు. ఈ చరిత్రము సర్వప్ప 17వ శతాబ్ద సమీపములో రచించి యుండునని వారు నిర్ణయము చేసియున్నారు.

ప్రథమాంధ్ర చారిత్రక వచన కావ్యమును రచించిన ఈ ఏకామ్రనాథుని జీవిత కాలమును గురించి స్పష్టముగా తెలియుట లేదు. కాసె సర్వప్ప తన సిద్దేశ్వర చరితమున నిట్లు వ్రాసియున్నాడు.

"శ్రీమహా దేవుని జిన్మయాత్మకుని
నామ హేశానునిన సఖిలలోకేశు
శ్రీ శుభలింగంబు శ్రీహన్మకొండ
హేశయోచన సిద్ధ పతిమతి దలచి
వేగంబు తన కనురాగంబు గాఁగ
నాగనాథుని యడ్గులకు మొక్కి చాల
యతని యనుమతి నేకామ్రనాథుండు
మతి మీఱజెప్పిన కత వచించెదను"
(సిద్ధేశ్వర చరిత్ర-ఆశ్వా. 2 పుట 29

దీని వలన ఏకామ్రనాథుడు కాసె సర్వప్ప కన్న ముందు జీవించిన వాడను విషయము స్పష్టమగుచున్నది. కాని, కాసె సర్వప్ప జీవిత కాలమును గురించియు, సుటముగా తెలియుట లేదు. సిద్ధేశ్వర చరిత్రమును సంపాదించి పరిష్కరించి ప్రచురించిన శ్రీఖండవల్లి లక్ష్మీరంజనం గారు, ఏకామ్రనాథునియు, కాసె సర్వప్పయు కాలములను గురించి విశేషములను వివరించిరి.

పూర్వ చారిత్రకులగు వీరేశలింగం పంతులుగారును, చిలుకూరి వీరభద్రరావు గారును, చాగంటి శేషయ్యగారును కాసె సర్వప్ప క్రీ.శ. 1400 ప్రాంతము వాడని భావించిరి. ఇక ప్రతాప చరిత్ర కర్త ఏకామ్రనాథుడు అంతకు ప్రాచీనుడగును. కాని యిది సరిగా కాన్పించదు. ప్రతాప చరిత్ర సిద్ధేశ్వర చరిత్రములపై నాధారపడి రచింపబడిన సోమదేవ రాజీయమును - కూచిమంచి తిమ్మకవి రచించిన దానిని పరిశీలించవలెను. ఈ తిమ్మకవి ప్రఖ్యాత కూచిమంచి జగ్గకవి సార్వభౌముని సోదరుడు ప్రతాప చరిత్రమును సర్వప్ప ద్విపద కావ్యముగా వ్రాసినట్లే జగ్గకవి చంపూ గ్రంథముగా రచించినాడు. ఇట్టి పద్ధతి ఆంధ్రమున నూతనము కాదు.[1] పిడువర్తి సోమన బసవ పురాణమును, శ్రీనాథుడు పండితారాధ్య చరిత్రమును ఇట్లే వ్రాసిరి.

కూచిమంచి జగ్గకవి క్రీ॥శ॥ 1700 సం. ప్రాంతము వాడని వీరేశలింగం గారును క్రీ.శ. 1720 ప్రాంతము వాడని చాగంటి శేషయ్య గారును

1. వచన వాఙ్మయ వికాసము- డా॥ యం. కులశేఖరరావు గారు 493

TIRUPATI
50424

## శైవమత ప్రభావము - 2

భావించిరి. అసగా ప్రతాప చరిత్ర కర్త ఇంతకు పూర్వుడై యు[illegible] ప్రతాప చరిత్ర మాంధ్ర సాహిత్య పరిషత్ పత్రికలోను, తరువాత శైవ ప్రచారిణీ గ్రంథమాల- వరంగల్లు వారిచేతను ప్రచురింపబడినది.[1] ఇందు తద్గ్రంథ కర్తను గురించిన విశేషము లేవియునులేవు. ఇక గ్రంథమందలి విశేషములను గ్రహించియే గ్రంథకర్త కాలమును నిర్ధారించవలసి యున్నది. ప్రతాప చరిత్ర ప్రారంభమున నాగనాథుడను వాని ప్రశంస కలదు. సర్వప్పయు 'నాగనాథుని యడుగులకు మ్రొక్కి' అని నాగనాథుని పేర్కొనెను. దీని వలన నీ నాగనాథుడు గొప్ప మహత్త్వము కలవాడనియ తెలియుచున్నది. పశుపతి నాగనాథుడను పేరుతో నొకడు రాచకొండను పాలించిన అనపోత నాయకుని ఆస్థాన విద్వాంసుడుగా నున్నట్లు తెలియుచున్నది.[1] ఇతడు అయినవోలు శాసనము నందలి శ్లోకములను రచించెను. ఈ శాసన కాలము శా.శ. 1291 లేక క్రీ.శ. 1369. ఇతడు శైవుడుగానే కాన్పించుచున్నాడు. మదన విలాసభాణము, విష్ణుపురాణము అను గ్రంథములను కూడ నీతడు రచించి నట్లు తెలియుచున్నది. ఒకవేళ ప్రతాప చరిత్రలోని నాగనాథు డితడే యైనచో ప్రతాప చరిత్ర రచనా కాలము 1369 క్రీ.శ. తరువాత నగును.

ఈ కావ్యమునకు శ్రీమత్ప్రతాప రుద్ర చరిత్ర యను పేరు కూడ కలదు. కాకతీయుల పుట్టు పూర్వోత్తరములను వర్ణించి, వారిలో ప్రఖ్యాతుడగు ప్రతాపరుద్రునికి సంబంధించిన విశేషములను విశదముగా నుల్లేఖించు గ్రంథ మది. చరిత్ర యందును, వచన వాఙ్మయము నందును, ఈ గ్రంథమునకు విశేషప్రాముఖ్యము కలదు. దీనికి ముందు చారిత్రక విశేషములను వివరించు గ్రంథమేదియు నాంధ్రమున వెలువడి యుండలేదు. వచన కావ్యములు కొన్ని వచ్చినను, చరిత్రను గురించి వచ్చిన మొదటి గ్రంథమదియే.[2] అందుచే నిది వచన వాఙ్మయమున విశేష ప్రాముఖ్యము వహించుచున్నది.

ప్రతాప చరిత్ర రచయిత ఏకామ్రనాథుడని తెలియుచున్నది. ఇతడు ఏకాంబ్రనాథుడుగా పేర్కొనబడినాడు. ఏకామ్రనాథుడా, ఏకాంబ్రనాథుడా యను సంశయము కలుగుచున్నది ఈ విషయము ఆచార్య యం. కులశేఖర

---

1. నరేంద్రనాథ సాహిత్య మండలి, తణుకు 1969 లో తిరిగి ప్రచురించిరి.
2. వచన వాఙ్మయ వికాసము- డా॥ యం. కులశేఖరరావు గారు.

రావు గారు తమ 'వచన వాఙ్మయ వికాసము'లో ఏకామ్రనాథుడే సముచితమని ఈ విధముగా చెప్పిరి. గ్రంథ ప్రారంభమున "శ్రీ సర్వదేవతా మయుండును శ్రీ శంభులింగంబునగు నీశ్వరుని పూజించి నాగనాథుని యడుగులకు మ్రొక్కి, ఏకాంబ్ర నాథుండను వాడొక పుణ్య కథను నిటుల వచింపనారంభించెను. ఏకాంబ్రనాథునిచే రచింపబడిన ప్రతాపరుద్ర చరిత్ర యందు సర్వమును సంపూర్ణము'' (81 పుట; ప్రతాప చరిత్రము) కాని, దీని ననుసరించి తరువాత వెలువడిన సిద్ధేశ్వర చరిత్రమున నీతడు ఏకామ్ర నాథుడనియే వ్యవహరింప బడినాడు. అందుచే నీతడు ఏకామ్ర నాథుడనుటయే సముచితము'' ఏకామ్ర నాథుడే ఏకో రాముడని ప్రసిద్ధి వహించిన శైవాచార్యు డనియు, మల్లంపడే వారికి మూల పురుషుడనియు, అన్యవాద కోలాహలమను గ్రంథము నీతల్లి రచించె ననియు, శ్రీనిడదవోలు వేంకట రావు గారభిప్రాయపడిరి.1

ప్రతాప చరిత్రము కేవలము చారిత్రక కావ్యమైనను నిడదవోలు వారు పేర్కొనినట్లు ఏకామ్రనాథుడు శైవాచార్యుడు మరియు కాకతీయు లందరు శైవ భక్తులు గనుకను ఈ కావ్యములో శివారాధన, కాకతీయ వంశజుల భక్తి ప్రపత్తులు కూడ వర్ణింపబడినవి. కాకతీయులలో పెక్కుమంది శివాలయములు కట్టించిన వారు కలరు. దీని తరువాత వచ్చిన సిద్ధేశ్వర చరిత్రలో సర్వప్ప మొదటి రెండాశ్వాసములలోను శివుడు సిద్ధేశ్వరుడుగా వెలయుట మున్నగు అంశములు వ్రాసినాడు. అవి ప్రతాప చరిత్రలో లేవు. రెండు గ్రంథములలో యించు మించు విషయమొకటియే యైనను, చిన్న చిన్న మార్పులు మన కక్కడక్కడ గోచరించును. సోమ దేవుడను రాజు మొదలుగ రెండవ ప్రతాపరుద్రుని వఱకు నుండిన ఈ చంద్ర వంశ రాజుల చరిత్రము, వారికి సిద్ధేశ్వర పద్మాక్షులనే పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహము వలన లభించిన సమృద్ధియు, శత్రు విజయములు, సామ్రాజ్య స్థాపనము మొదలగు విషయము లీ రెండు గ్రంథములలో నేకరూపముగ నిరూపితమై యున్నవి. ఇంకను ప్రతాప చరిత్రలో సోమదేవరాజునకు ముందుగల కాకతీయ రాజుల వంశ చరిత్రము స్థూలముగా నీయబడినది.

1. ఆంధ్ర వచన వాఙ్మయము పుట 31; త్రిలింగ 24-12-49; 3-1-5 "మల్లపల్లి బుచ్చికవి"యను వ్యాసములు.

సోమదేవ రాజు దిన దిన ప్రవర్ధమానుడై తంత్రి పరోక్షంబున రాజ్య మేలుచు సకల ధర్మంబులు చేయుచుండెను. కటకంబుపై యుద్ధము చేసి జయించినాడు. సోమదేవ రాజు యుద్ధములో మరణించగా ఆతని భార్య సిరియాళదేవి గర్భవతిగా నుండెను. ఆమె శత్రు భయముచే బ్రాహ్మణ బృందముతో హనుమకొండ వచ్చెను. కటక వల్లభుడు హనుమకొండకు ఈమెను వెదుక వచ్చెను. ఈ వార్త విని యెరుక రాజు నిశీధి సమయంబున బ్రాహ్మణులతో కలిసి ఊరు విడిచి పోవలసినదని వెడలగొట్టెను. ఈ విధముగా సిరియాళదేవి హనుమకొండ నుండి వారలతో వెలువడి యా విప్రులందరికి సాష్టాంగముగ నమస్కరించి "మిమ్ము మీరు కాపాడుకొండ"ని వారిని పంపించి యామె తిరిగి హనుమకొండకు వచ్చి యెరుక రాజుల పురోహితుడగు మాధవశర్మ నగరుకు పోయి తన వృత్తాంత మంతయు చెప్పి నమస్కరించి లేవలేక పోగా బ్రాహ్మణ శ్రేష్ఠుండగు మాధవశర్మ సిరియాళ దేవికి నభయంబిచ్చి వెరవకుమని ఊరడించి అప్పుడే తన సమీపమున నున్న భృత్యులచే హనుమకొండలో నున్న బ్రాహ్మణుల బిలిపించి యీ వృత్తాంతంబంతయు వారికి రహస్యముగా నెఱింగింపగా నందరు నేకగ్రీవంబుగా బలుక నంగీకరించిరి. అంత కటకవల్లభుడు సైన్యముతో హనుమకొండ చేరి యెరుక రాజులను సిరియాళదేవిని గురించి అడుగగా వారందరు తమకు తెలియదని చెప్పిరి. రాజునాజ్ఞచే వారు వెతుకగా సిరియాళదేవిని కానక పురంబులో జనుల నొక్కొక్కరిని రావించి చూచునెడ కందారంబు ప్రజల నొక్కరిని గానక యేడు దినంబులు వెదకి వేసారి బ్రాహ్మణ స్త్రీలలో నున్న సిరియాళ దేవిని చూచి కొందరిది రాజపత్ని యగునని తలచి విశాల నేత్రములు దీర్ఘ బాహువులు, మందయానంబును పాదపద్మంబులును ఇతర కాంతల కుండవు యని అనుకొని రాజపత్ని యగు సిరియాళదేవి యగును తప్పదని కటకవల్లభుని ముఖంబునకు దోడ్కొని పోవనారంభించిరి.

ఆ సమయములో ఊరిలోని బ్రాహ్మణులందరును సిరియాళదేవిని తీసికొని హాహాకారంబులు సేయుచు, " ఈ కాంత పవిత్ర కాంత మాధవశర్మ కూతురు ఈ చెలియ పెనిమిటి వారణాశికి బోవుచు మాతృ గృహంబున నునిచి చనియె. ఇది నిజంబు ఎట్టి సత్యంబైన చేసెదము అట్లుగాదని దలంచితిరేని

నీ కాంతతో గూడ నీ విప్రులందరము సొదలు జొచ్చువార " మన దీక్ష పట్టి హరిద్రా వస్త్రములు దాల్చి వీరజడలల్లుకొని తమ గృహంబులు విప్పుకొని శపింప తెగబడియున్న విప్రులంజూచి " కటక వల్లభుడును నతని యనుచరులును వణుకుచు మహాభీత చిత్తులై విప్రులకు నమస్కరించి " ఇది రాజకాంత యని పట్టితిమి. ఇంతియే కాక మాకు వైరంబులేదు. కోపంబులు సైరింపుడు. మీకు మాకు మెరొక్క తగువు గలదు. అది యేమన " ఈ విప్రజనంబులు సిద్దేశ్వరుని సముఖంబున గూర్చుండి యీ చెలి వడ్డించిన యన్నంబు రోయక భుజించితిరేని యిది విప్రకాంత యగును. కాదేని మీరు నిజంబు పలికిన మీకు వేయి గ్రామంబులు సగ్రహారంబులుగా నిచ్చి యీ కోమలిని రక్షించి యీ గర్భంబుననున్న శిశువును మరల కందారంబునను బట్టంబు గట్టెద " మని నీతి యుక్తంగా నాడిన వారలతో విప్రులీ విధముగా బలికిరి. " ఈ స్త్రీ రాజకాంత కాదు. విప్రులకు సింహాసనం బేటికి ? ఈ కోమలి విప్రకాంతయగుట తధ్యంబు. ఇదిగో చూడుడని తక్షణంబున సిద్దేశ్వర శ్రీ మన్మహాదేవునగరికింజని యా విప్రులందరు నచ్చటి గుండంబునమునిగి కృతానుష్ఠానులై యద్దేవుని వేదోక్తంబుగా నారాధించి బహువిధంబుల బూజించి చతుర్విధో పహారంబుల నైవేద్యంబు లిచ్చిరి. ఆ నైవేద్యంబు లాకోమలి వడ్డింప నందఱును పంక్తిని గూర్చుండి సోమదేవరాజు వేదాధ్యయన పారాయణం బగుటంజేసి "వేదాధ్యాయ రతో విప్ర " యని యేడు వాక్యంబు మనస్సులో నిల్పికొని సిద్దేశ్వర శ్రీ మన్మహాదేవున కెదురు నిలిచి చెయ్యెత్తి చాచి, యీ కాంత విప్రకాంతయని పలికి యాయంగన వడ్డించు నన్నంబులు సంతుష్టిగా నారగించిరి.

ఆ సమయంబున సకల జనంబులు చూచుచుండ విప్రులపై శ్రీ మన్మహాదేవుండు పుష్పవృష్టి గురిపించెను. అది యంతయు చూచి కటక వల్లభుడు పరిజనంబులు గజ గజ వణుకుచు వల్లభుని కెరిగించిన నాతడు విప్రులను రావించెను. ఆ విప్రులకు ధనము నిచ్చి తనవారు, తను కటకంబునకు బోవుచు నానా దేశంబులకు సిరియాళ దేవిని వెదుక బంపెను.

ఈ కథలో " వేదాధ్యాయ రతో విప్ర " యనెడి వాక్యము వలన కవి కర్మ మార్గమందు నమ్మకము గలవాడని కేవలము శైవమహాత్మ్యము చెప్పుటే లక్ష్యముగా భావించినట్లు తెలియుచున్నది. వీరశైవ మంతరించిన పిమ్మట తిరిగి

వేదములకు, కర్మ మార్గమునకు ఆదరణ లభించెననుట కిదియే తార్కాణము కావచ్చును. కేవలము మతోద్రేకపు చర్యలతో వీరశైవ కవులు కావ్యములు వ్రాయగా తరువాతి కాలములో శైవభక్తిని మరువక, శివుని మహాత్మ్యము చెప్పుటలో కొఱత లేక , వైదికమార్గ పద్ధతిలో ఇటువంటి కావ్యములు రచించిరి. కాకతీయ వంశజులందరు శైవభక్తులనుటకీ గ్రంధము చక్కని తార్కాణము. శైవ భక్తులు కానిది శివాలయము ప్రతిష్ఠాపన చేయలేరు. కేవలము ఆలయ ప్రతిష్ఠాపనే కాక వారు నమ్మిక దైవమైన సిద్ధేశ్వరుని యందు పరిపాలనా విషయములలో శక్తి సామర్ధ్యములు ప్రసాదించమని వేడిన ఘట్టములే ఇందులకు తార్కాణము. సిద్ధేశ్వరుడు వెలసిన స్థలమహాత్మ్యమే ఈ చారిత్రక కావ్యములో పరిపాలకులకు అండగా నిలిచెననుట అతిశయోక్తి కాదు. ఇక మాధవ వర్మ జననము గూర్చి తెలిసికొందము. సిరియాళదేవికి సుముహూర్తంబున సర్వలక్షణ సంపన్నుడైన కుమారుడు కలిగెను. విప్రులు జననవేళ నెఱింగి సర్వ సర్వంసహ నేకచ్ఛత్రంబుగా గర్భాష్టకంబున మహా మహిమతో పాలింప గలడని చెప్పిరి. తల్లి యనుమతి ప్రకారంబు యబ్బాలునకు మాధవవర్మ యను నామకరణము చేసిరి. ఆ కుమారుని విప్రదంపతులు పోషించుచు గర్భాష్టకమున ఉపనయంబు జేసి, ఉపాధ్యాయు నొద్ద పద్మాక్షి సముఖంబున చదివించుచుండిరి.

ఒకనాడా బాలుడు తనతోడి బాలురు౯, తానును నాట తమ పలక పుస్తకమును పద్మాక్షిదేవి చేరువపెట్టి గుడి తలుపువేసి తిరుగుచుండగా సూర్యాస్తమయంబాయెను. ఇంటికిబోయి మజ్జన భోజనంబులు దీర్చి రాత్రి చదువుదమని పలుకయు పుస్తకంబును లేకునికి మాధవశర్మ తన నెక్కడ కోపించునోయని రాత్రి కాలంబునందు పద్మాక్షిదేవి సముఖంబునకు దానొక్కడుచనెను.

పద్మాక్షిదేవి భయంకరంబై భూత ప్రేత పిశాచ శాకిని డాకిని భేతాళ బ్రహ్మరాక్షస పరివృతయై సింహాసనంబున కొలువుండెను. కాని మాధవశర్మ చలింపిక భూత గణంబుల జేత నెట్టివేయుచు ఆ దేవి సముఖంబుననున్న పలకయు పుస్తకంబును పుచ్చుకొని నిలిచియుండెను. ఆ బాలుని సాహస ధైర్యంబులకు దేవి వెరగంది అతని ధైర్యంబు జూచుటకు భయంకరాకారంబు

దాల్చెను. ఐనను ఆ బాలుడు చలించలేదు. బహు విధముల స్తుతియించుచు ఆదేవి పాద పద్మములకు మ్రొక్కి లేవకుండెను. అదిచూచి దేవి అత్యంత దయార్ద్రమానసయై యిట్లనియె "చెమ్మ వత్సా! నీభక్తి ధైర్యంబులకు మెచ్చితిని నీకిష్టంబైన వరమువేడు" మని పలికెను బాలుడు తన తల్లివలన తండ్రి చందంబంతయు నెఱింగినవాడైనందున కటకవల్లభుని సాధించి తమ గోధనంబులు మరల్చునట్లు వరము కృపచేయమనెను. అంత నద్దేవి దివ్యఖడ్గంబును, దివ్య ఖేటకంబును గృపజేసి "ఈ ఖడ్గంబునీచేతనున్న నిన్నెదిర్చిన శత్రువు లడంగుదురు ఈ దివ్య ఖేటకంబు నీచేత నున్న శస్త్రాస్త్రంబులు నిన్నుజేరవు." అని యానతిచ్చి ద్విగుణిత సహస్ర మాసంబులు రాజ్యంబు చేయుదువని పల్కి తన సమీపంబుననున్న యొక్క బిలంబునుజూపి పశ్చిమముఖుండవైయరిగి యొక్క రమ్యప్రదేశంబున నీవీబిలంబు వెడలియున్న సమయంబున సూర్యోదయ పర్యంతంబునకు నబ్బిల మార్గంబున వెడలి చతురంగ బలంబులు నీవెంట చనుదెంచునని అనతిచ్చి యింకను ఇట్లనెను. ఈ దివ్య ఖడ్గఖేటకంబులు మీ యింటసింహాసనంబున వెయ్యేండ్లుండునని యానతిచ్చి గోబ్రాహ్మణపూజయు, నుమామహేశ్వరపూజయు, లక్ష్మీనారాయణపూజయు మఱవకుమని చెప్పెను. ఇచట మాధవవర్మకు శివారాధనపై అనగా శాక్తేయ సంప్రదాయముపైగల దృఢవిశ్వాసము వ్యక్తమగుచున్నది. బహుశ శైవుడైన ఏకామ్రనాథుడు ఈ శైవవిశేషములను వ్యక్తము చేయుటకే మాధవవర్మ కథను ఈ గ్రంథమున అనగా ప్రతాప చరిత్రమున భూమికగా పూర్వగాథగా నిక్షేపించెనని చెప్ప వలసియున్నది.

ఆ బాలుడు పదే పదే నమస్కరించి దేవి అనుమతితో నబ్బిలము దూరి పోవుచు పెక్కు విఘ్నంబులు, భూత ప్రేత పిశాచ వ్యాఘ్ర భల్లూక సర్పాదులు గనుపించగా నించుకు చలింపక అన్నియు నివారించుచు నబ్బిలంబు వెలువడి కొంత దూరమేగి యొరమ్య ప్రదేశంబున నిలిచియుండెను. పద్మాక్షీదేవిపట్ల బాలుని భక్తి ప్రపత్తులు అపారమైనవి.

అంత నబ్బిలంబు వెలువడి గజ తురగ వీరభటులు పెక్కులట్లవార్య ఘోషంబును భేరీ ఝాంకృతులును కాహళనిస్వంబులును శంఖనాదంబులును రథ భట బలంబులును ఉష్ట్రఘంటికాఘణాత్కారంబులును, తురగ గజవాహన

ధ్వనులు నేకంబై ప్రళయకాల మేఘగర్జితంబుగ చాల దిక్కులు పిక్కటిల్లు నటుల సూర్యోదయ పర్యంతమును హయాబలంబులును, అరువదివేల మద గజంబులు పంన్నెండులక్షలుత్తమాశ్వంబులు పదివేను లక్షలు పదాతివర్గం బులు మణిమయాభరణ దివ్యాభరణంబులు పదికోట్ల సువర్ణంబుగొని మాధవ వర్మ యిల్లుచేరెను. ఇదంతయు పద్మాక్షిదేవి యనుగ్రహమువలననే బాలునకు సంప్రాప్తించెను.

అదివరకు అనుమకు, కొండడు అను యిరువురు ఆటవిక సోదరులు ఒక దుర్గమును నియమించి అనుమకొండ యను పేరు దానికి పెట్టి ఆ ప్రాంత మును పరిపాలించుచుండిరి వారి రాజ్యమిట్లు కొనసాగుచుండగా పద్మాక్షిదేవి యనుగ్రహము వలన అనుమకొండ రాజ్యము మాధవవర్మకు లభించెను. అప్పుడాయన తన పరివారముతో అనుమకొండకు వచ్చుచుండెను. తల్లి కొడుకు కోసము వెదకి వెదకి దుఃఖంబుచే పొర్లుచుండెను. పూర్వ భూసుర దంపతులు సిరియాళ దేవినిగాంచి దుఃఖోపశమనంబు గలుగునట్లుగా మాటలచే బుజ్జగింపు చుండిరి. ఆ సమయంబున మాధవవర్మ తల్లి సిరియాళ దేవినిగాంచి మ్రొక్కెను. ఆమె బాలుని కౌగిలించుకొని ఎక్కడ నుండితివి. బాలుండవై నొంటిగ నుండుట ఆశ్చర్యముగదా యనెను. బాలుడు తాను పద్మాక్షిదేవి నగరికి జనుటయు మొదలుగా గల వృత్తాంతంబంతయు చెప్పగా విస్మయంబొందిన మాధవశర్మను జూచి కుమారు డిట్లనెను. "ఈ రాజ్య భోగంబులు మీరనుభవింపుడు. యీ సమీపంబున నేను ధరాచక్రంబు పాలించు వాడనని" పలికెను. అంత మాధవశర్మ "మేము వృద్ధులము. నేత్రంబులు పొరలు గప్పి యున్నవి. శ్రోత్రపుటంబులు విన నిజశక్తి జాలవు. కాలు చెయ్యియు నాడుట లేదు. జవసత్వములు నానాటికి దగ్గుచున్నవి. శ్లేష్మంబులు కంఠర లంబున నాగుకొని క్షుత్పిపాసాదులు సన్నగిల్లెను. మాకు నెక్కడి రాజ్యభోగంబులు? ఎటుల ననుభవించువారము! నీ భోగంబులే మాకు సహస్ర గుణిత భోగంబులనిన, విని యాతడు వారల జూచి నిట్టూర్పు నిగుడించి తక్షణంబె పద్మాక్షీదేవినగరికిం జనుదెంచి యద్దేవి సముఖంబున నిలిచి చెయ్యెత్తి, ఓ పరమేశ్వరీ! మా మాధవవర్మకు యా మాధవాంబకును మా తల్లి సిరి యాళదేవికిని గాక యీ రాజ్యభోగంబులు నాకేల? ఖడ్గ ఖేటకంబులివిగో యని ముందఱ బెట్టి చను చుండెను.

ఆ సమయంలో బాలుని యౌదార్యమునకు మెచ్చి పద్మాక్షిదేవి చేర బిలిచి మీ తాత ముత్తవులగు వృద్ధభూసుర దంపతులును మీ తల్లి సిరియాళ దేవియు నీవు రాజ్యంబు పాలింపుచున్నంత కాలంబును వయో యౌవన ప్రాయంబుల నుండగల వారలని యానతిచ్చి నీవు ధరాచక్రంబు నూట యిరువై యేండ్లు పాలించి యటమీద దివ్యకన్యకా కృష్ణుండవై యీ కొండ బిలంబులో దివ్యాంగనలతో దివ్యభోగంబులనుభవింపుచు నమరత్వంబును నిర్జరత్వంబునుంగలిగి యుండగలవని యానతిచ్చిన దేవికి సాష్టాంగ నమస్కారంబులు చేసి ఖడ్గ ఖేటంబులు తిరిగి తీసికొని మాధవవర్మకు వృత్తాంతం బంతయు నెరింగించెను. తదుపరి ఆ బాలుండు దేవీ కల్పితంబులైన సేనలతో తాను హనుమకొండకు వచ్చి చేరెను. మంచి ముహూర్తమున దేవభూదేవ పూజలు గావించి భూసురాశీర్వాద పూర్వకంబుగా సింహాసనమెక్కెను కటక వల్లభుని జయించుటకు పద్మాక్షీ దత్తమైన బలంబులు గొల్చుచుండ కటకంబు నకు పోయి ఆ పట్టణము చుట్టు ముట్టడించెను. ఒక్క మాసంబు ఘోర యుద్ధము జేసి దేవిదత్తంబైన ఖడ్గఖేటకంబు లిరుగేలంబూని యుద్ధములో కటక వల్లభుని తల్రుసించెను. ఇచట ఒక విషయము గమనించ వలెను. పద్మాక్షీదేవి యనుగ్రహముననే మాధవవర్మ విజయములు సాధించుచుండెను. ఆ దేవత మహిమ ఎప్పుడు వెన్నంటి ఈ బాలుని కాపాడినది. సిద్ధేశ్వరుడు, పద్మాక్షీదేవి యనుగ్రహము వలననే ఈ కాకతీయ వంశపు రాజులందరు జయము పొందుట గమనించదగిన విషయము. కాకతీయులు హనుమకొండలో సిద్ధేశ్వరుని కొండపై సిద్ధి పొందిరి. ఇది ఆ స్థల మాహాత్మ్యము, మరియు సిద్ధేశ్వరుని మహిమ కూడా. మాధవవర్మ చోళదేశాధీశ్వరుని కుమార్తెను వివాహ మాడెను. రాజ్య పరిపాలన చేయుచుండగా విప్రులు మాధవవర్మనిట్లు అడిగిరి. “కటకవల్లభుకు మీ తల్లి సిరియాళ దేవిని గొనిపోవు సమయమున నా యాప దని మీ తల్లి చేతి యన్నంబు గుడిచితిమి. ఆయాపన్నివారణం బుచితంబని యును శివప్రసాదంబనియును గుడిచితిమి. ఇంతియే గాక, కలియుగంబున క్షత్రియుల చేతి సన్నంబు గుడువరాదు. అగ్రజనులకు క్షత్రియాన్నంబు తగదు. ఆ కారణంబున మా మనంబులో నెప్పుడును ఈ విషయము మెదులు చున్నది. మాకు సప్తగోదావరి మధ్య ప్రదేశంబున కొన్ని గ్రామంబు లగ్ర హారములుగా నిచ్చి యచట స్నాన జపహోమంబులును, క్రతువులును గావించి

పుణ్యలోకంబులు వడసెద"మనిన మాధవవర్మ సప్తగోదావరి మధ్య ప్రదేశం బున నగ్రహారంబుల నిచ్చిపంపెను.

ఇచట విశేషమేమనగా క్షత్రియ కాంతయగు సిరియాళదేవి చేతి అన్నము విప్రులు భుజించుట విప్రులకు అంగీకారము కాలేదు. శివప్రసాదమని భావించి వారామె చేతియన్నము తిన్నను, తిరిగి దానికి తగిన ప్రాయశ్చిత్తము కావించు కొనవలెననెడి తపన వారిలో కలిగినది. ఇచట కవి కుల భేదముల పట్టింపు వారిలో గోచరింపజేసినాడు. ఇది వైదిక కర్మ మార్గము, శైవభక్తి తత్పరుడైనను ఈ మార్గమునకు ప్రాధాన్యత నిచ్చినాడు. కర్మమార్గమునకు చెందిన శుద్ధ శైవమేగాని వీరశైవము లేదు.

మాధవ వర్మ పెద్ద కాలము రాజ్య పరిపాలనము చేసి పద్మాక్షిదేవి వర ప్రసాదమున నొక పుత్రునిగని పద్మ సేనుండని పద్మాక్షి పేరు పెట్టెను.

మాధవవర్మ తదుపరి పద్మసేనుడు రాజ్యము పరిపాలించెను. అతనికి సంతానము లేకపోగా సిద్ధేశ్వర శ్రీమన్మహాదేవుని నిత్యము కూష్మాండ ఫలంబు లతో పూజింప తత్ప్రసాదంబున నొక్కసుతుడు గల్గెనట. అతనికి వెన్నమ రాజను నామకరణం బిడెను. పిదప వెన్నమరాజుని పట్టాభిషిక్తునిజేసి తాను శివలోకమున కరిగెను.

వెన్నమరాజు సింహాసనం బెక్కిన తరువాత వివాహంబు జేసికొని పెద్ద కాలము రాజ్యము పాలించెను. సుతులు లేనందున సిద్ధేశ్వర శ్రీమన్మహా దేవుని గూర్చి ఘోర తపం బాచరించెను. ఆ దేవుని ప్రసాదంబున నొక్క సుతుం డుద్భవించెను. అతనికి బొరికి వెన్నమ రాజను నామకరణం బిడెను. సకల దేశాధీశ్వరులను జయించి వారిచే నప్పనంబులు గైకొనెను. అతడు ముఖ్య పట్టణంబగు హనుమకొండ ప్రవేశించి యెనుబది మూడు వర్షంబులు రాజ్యంబు మహామహిమచే బాలించి తన సుతుడగు బొరికి వెన్నమరాజును పట్టాభిషిక్తుని జేసి తాను శివలోకమున కరిగెను.

ఈ కావ్యములోని చారిత్రిక వ్యక్తులందరు రాజ్య పరిపాలనముచేసి తదుపరి వారి వారి కుమారులను పట్టాభిషిక్తులుగావించి శివలోకమున కరిగినట్లు చూచుచున్నాము. దీనిని బట్టి వారి శైవభక్తినిరతి తెలియుచున్నది.

వీరికి వెన్నమరాజు సింహాసనంబెక్కిన తరువాత పెండ్లి చేసికొని గుండమరాజును సుతుని గనెను. ఈ వీరికి వెన్నమరాజుకూడ పెక్కేండ్లు పరిపాలించి శివలోకమునకరిగెను. గుండమరాజు కుమారుడు యెఱుకదేవరాజు. గుండమ రాజుకూడ యెఱుకదేవరాజుని పట్టాభిషిక్తుని గావించి తాను శివలోక మున కంగెను ఎఱుక దేవరాజు బాలుడగుటవలన కుంతలదేవి (మేనత్త) రాజ్యము పరిపాలించెను. కొంతకాలము బాలించి కుంతలదేవి యెఱుకదేవరాజు నకు రాజ్యభారమప్పగించి శివలోకమునకరిగెను. ఎఱుకదేవరాజు తనకుమారు డగు భువనైకమల్లుని సింహాసనాసీనునిగావించి శివలోకమునకరిగెను భువనైక మల్లుడు కటకవల్లభునిపై యుద్ధము చేయుటయేగాక పెక్కు పద్మాక్షీదేవి వర లబ్ధంబులైన ఖడ్గ ఖేటకంబుల సహాయముతో విజయనగరముకూడ చుట్టు ముట్టెను. పిదప నరసింహరాయల చెలియగు శ్రీరంగమదేవిని పదుగురు చెలికత్తెలతో భువనైక మల్లునకు వివాహము చేసెను భువనైక మల్లుడు అత్త వారింట మూడు మాసంబులున్న పిమ్మట హనుమకొండ చేరెను. భువనైక మల్లుడు శ్రీరంగమ దేవుని తీసికొని గంగాపురంబునకు వచ్చి అక్కడ మీనాంబకుండను ఋషిచే గ్రామ మధ్యమున నూరుగుళ్లు కట్టించెను. మరియు చెన్నరాయల ప్రతిష్ఠ చేసెను. ఒక కోనేరు కట్టించెను. ఎనిమిది తులాభారం బులు దేవీయుక్తంబుగా దూగెను. అంత భువనైక మల్లునకు త్రిభువనైక మల్లు డను కుమారుడు, పాంచాలి యను కుమార్తెయు గలిగిరి.

వీర నరసింహరాయల కుమారుండగు వేంకటనాథుండు భువనైక మల్లునిపై యుద్ధమునకు వత్తునని ప్రకటించగా భువనైక మల్లుడు దానికి సిద్ధపడెను. అంత శ్రీరంగముదేవి పతికి నీరాజనంబిచ్చి కన్నీరు నించెను. భువనైక మల్లుడు "సతీమణీ నీవు పుణ్యాంగనవై నాకు నీరాజనంబిచ్చి దీవించు సమ యంబున కన్నీరు దెచ్చుకొన కారణంబేమి"యని యడిగెను. అంతనామె "తొల్లి మీరును మాయన్నయగు వీరనరసింహ రాయలును సఖ్యంబు జేసితిమని బ్రాహ్మణాగ్ని సమక్షంబున సువర్ణ ఫలకాంకితంబుగా వ్రాలు పెట్టితిరి. సత్యంబు తప్పితిరి. వీర నరసింహరాయలకు వేంకటనాథుండొక్కడే సుతుడని" తెలిపి పాదములపై పడెను. భువనైక మల్లుడు వైరము చాలించి తన రాజ్యము చుట్టూ చక్రకారంబుగా వేయి గ్రామంబులు భూసురుల కగ్రహారంబులుగా

నిచ్చి పంపెను పిదప వేంకటనాధుడు హనుమకొండకు వచ్చెను భువనైక మల్లుడు దేవీయుక్తంబుగా నెనిమిది యోజనంబు లెదురుగా వచ్చి వేంకటనాథుని మహావినయ భక్తిపూర్వకముగా పూజించి తమకు రాజధానియగు హనుమ కొండకు దోడ్తెచ్చి తత్పురంబున మాస ద్వయంబు నిల్పి పురంబు అంత, పురంబు శృంగారించి తమ పుత్రికయగు పాంచాలిని వేంకటనాథునకు వివాహంబుజేసి అనేక వస్తు వాహనంబులును అమూల్యాభరణాంబరాదులు కొండ వీడు మొదలుగా విదర్భదేశమును అచ్చెలిము కరణంబిచ్చి నరపతి రాయలకు పట్టంబు నిజంబుగా గట్టి దేవీ యుక్తంబుగా వేంకటనాథుని విజయనగరంబునకు పంపెను. భువనైక వల్లభుడు ఇరువది యారేండ్లు రాజ్యంబు పాలించి తన సుతుడగు త్రిభువనైక మల్లునకు పట్టంబుగట్టి శివలోకమున కరిగెను.

త్రిభువనైన మల్లుడు డెబ్బది నాలుగు సంవత్సరములు పరిపాలించి కుమారుడగు కాకతి ప్రోలరాజునకు పట్టంటుగట్టి శివలోకమున కరిగెను.

కాకతి ప్రోలరాజు చెన్నరాయని ప్రతిష్ఠచేసి యక్కడ నొక్క కోనేరు గట్టించెను. మరియొకసారి గంగాపురంబురాజు సముఖమునకు త్రిదండియను ముని యేతెంచిన వారిని బహువిధముల పూజించి వారిచే వారి యాశ్రమ మహత్త్వంబు విని యచ్చటను శివాలయములు గట్టించెను. రాజ్యంబేలు సమయంబున నొక్కనాడా రాజు పట్టణంబున గ్రామసార్థులై పరిజనములు శకటంబునకు రక్షకులై యుండి రాత్రి వచ్చుచుండగా ఆగ్నేయ భాగంబున క్రోశద్వయ దూరమున నిర్నిమిత్తంబున వచ్చు నా బండి వోరగిలపడెను. రాత్రి అది చక్కచేయ రామికి అచటనే నిలిచిరి. మరునాడు బహుజనంబుల గూర్చుకొని యాబండి చక్కపరచు సమయంబున బండి కమ్మి శుద్ధ సువర్ణంబగుటయు చూచి యా సువర్ణంబు తనకు లభింపకుండుటంజేసి అతి త్వరితంబున కాకతి ప్రోలరాజున కెరింగించిన విస్మయానంద భరితుడై అతి త్వరిత గతిని బుధజన పురోహితామాత్యులతో నచ్చటికి చనుదెంచి యచ్చట పాతించిన పరుస వేదియగు శంభు లింగంబు గనుపట్టె. తజ్జ్యోతిర్మయంబగు సువర్ణ లింగంబును హనుమకొండకు గొనిపోవనుద్యోగించి నా దేవుండు దరలకుండిన చింతించి కాలేశ్వర నివాసులైన రామారణ్య శ్రీపాదులను మహేంద్ర శ్రీపాదులను హిడింబాశ్రమ నివాసులైన త్రిదండి ఋషులను బిలిపించి వారల నెదుర్కొని

యత్యంత వినయ భరితులై యర్ఘ్య పాద్యంబుల బూజించి యాదేవుని జూ పెను. అంత వారలత్యంత హర్షంబుగా నద్దేవునికి విభూతి ధారణంబు జేసి అద్దేవుండు మధ్య ప్రదేశంబున నుండు నట్లుగా గొలిచి యోజన విస్తారంబుగా పురంబు గట్టందలంచి శాలివాహన శక వర్షము 909 యగు శుభ కృత్తు నామ సంవత్సర కార్తీక శు. 5 గురువారంబున రోహిణీ నక్షత్రంబున ఓరుగల్లు పట్టణంబు గట్టిరి.

హనుమకొండ ద్వారము నుండి స్పర్శ వేదియగు శంభులింగంబు నగర పర్యంతంబు రెండు క్రోసుల వీధి యేర్పరచి యుభయ పార్శ్వంబుల దేవాలయంబులు యుక్తీశ్వరుండును, శ్రీ విశ్వనాథుండును, భీమేశ్వరుండును, విరూపాక్షుండును, రామేశ్వరుండును మొదలుగాగల ఈశ్వర స్థానంబులు ఇన్నూట యేబదియును వేంకటనాథుండును, శ్రీ రంగనాయకులును, గోపాలుండును, పాండాల రాయుండును, ఆదిగాగల విష్ణుభవనంబులు నూరును, దేవీ భవనంబులు ఏబదియు, వీర భద్ర వినాయక భైరవ భవనంబులు నలువదియును గట్టించెను. ఈ దేవతలకు ప్రతిష్ఠలు చేసి రామారణ్య శ్రీపాదులు కాకతి ప్రోలరాజుతో నిట్లనిరి "నీవు నిత్యంబును శంభులింగంబు పూజానంతరంబున లోహము స్పర్శ చేయించిన నది శుద్ధ సువర్ణంబగు. అది నీవు నిత్య వినియోగంబు చేసికొ"మ్మనెను.

కాకతి ప్రోలరాజు మునులయాజ్ఞ ప్రకారంబు బారువ దెప్పించి జ్యోతిష్కరంబై పరుస వేదియగు నా లింగంబునకు స్పర్శ చేయించినది శుద్ధ సువర్ణంబైన ఆ ద్రవ్యంబు దేవ బ్రాహ్మణ కార్యార్థంబుగా నిత్య వినియోగంబు చేయగా నొక్క సుతుండుద్భవించెను. అతడే రుద్రుడు.

ఈ సమయంబున భూసురులు ఏకాంత ప్రదేశమునకు కాకతి ప్రోలరాజును బిలిచి "ఈ బాలుని చేత నీవు మృతి పొందగలవు. బాలుని ఛేదించు" మనిరి. అంత కాకతి ప్రోలరాజు, భార్యయు మధ్యరాత్రి ఆ బాలుని రహస్యముగా శంభుదేవుని ముందటి మంటపంబున పరుండబెట్టి ఆ బాలునికి స్తన్యపానంబులు చేయించి పొత్తెళ్లయందు ఆ బాలునుంచి యిద్దరు దంపతులు నిజ నివాసంబున కేగిరి. అంతనా గుడి కావలి వారు యా శిశువును జూచి యాశ్చర్య చకితులై రాజ సముఖంబునకు నేతెంచి యా బాలుని తెరంగెఱింగించిరి.

భూపాలుడువిని యెఱుంగని యట్లాశ్చర్య చిత్తుండై పుత్ర మోహంబున బెనంగొన బురజనులు వలె తానును శంభునగరికింజని యబ్బాలుని జూచి కటకటంబడి పెద్ద పూజారిని బిలిచి యీ బాలుడు సర్వ లక్షణ సంపన్నుడు వీనిని అతి రహస్యంబున బోషించుమని రుద్ర జియ్యకు వొప్పజెప్పి యబ్బాలునకు రుద్ర నామంబు బెట్టి పిల్చు చుండెను. అంత నబ్బాలుండు దిన దిన ప్రవర్థమానుండైనంజూచి రాజశేఖరుండు విధ్యుక్త ప్రకారంబుగా నుపనయనంబు చేయించి క్రమంబున నబ్బాలునకు వేదాధ్యయనాది సకల శాస్త్రంబులును, ధనురాది సాధనాభ్యాసంబులును జపతపో మంత్రంబులును చేయించు చుండెను.

బాలుడు యౌవనుండగుటతోడనే భూపాలుడు కుమారుని బిలిపించి బహువిధములగారవించి యాతనికి నిద్దఱు భటుల కొలువుండజేసి వారికి గట్టిడి జేసి పరులెవ్వరు తన యాజ్ఞలేక శంభులింగంబు నగరుజొచ్చిరేని శాసించుమని యాజ్ఞాపించి పంపెను. ఆకుమారుండు రాజానుమతంబున సకలవైభవంబులుగొని శంభులింగంబు నగరికింజని రాజాజ్ఞాక్రమంబున నచటనుండెను.

కాకతిప్రోలరాజునకు మఱియొక సుతుండుద్భవించెను. అతని పేరు మహాదేవరాజు. ఈ మహాదేవరాజునకు మహారోగంబు పొడమగా విద్వాంసులు దానిని వృత్తికొఱకై దూదికేశవపిన్నయ యనువానికి తిలలు దానంబొసగమని సలహానిచ్చిరి దాన పరిగ్రహణమున దూదికేసవ పిన్నయ్య బ్రహ్మరాక్షసుడయ్యెను. కాకతి ప్రోలరాజు అతనికి ద్రవ్యంబొసగి వారణాసికి జనుమని పంపెను. అతడు అచట మరణించి పుణ్యలోకమునకేగెను.

కాకతి ప్రోలరాజు ఇంకను డెబ్బది రెండు సంవత్సరములు మహామహిమతో రాజ్యమేలెను. అతడు షట్కాల శివ పూజాపరుడుగావున ఒకనాడు మధ్యరాత్రి శంభులింగంబు నగరి కరిగి పదిలముగా సింహద్వారమున నిలిచి మంటపమునకు వెళ్ళి ద్వారమునకు నడ్డముగా నొక్కమహానీయ తల్పంబున బవ్వళించి సుఖసుప్తుండైన సుతునిగాంచి, యతని పూర్వరేఖలు చూచి కటకటంబడి పుత్ర మోహంబున నిద్రాభంగముగాకుండునట్లు తలుపులు ఓరగిలంజేసి యద్దేవుని సముఖంబునకుం జని పూజగావించి తీర్థ ప్రసాదంబులుగైకొని మగుడవచ్చుచుండెను అంత విధివశంబున కాకతి ప్రోలరాజు ఝంఘలు సుకుడబ

రుద్రమహారాజు బొటిమన వ్రేలుకు తాకెను. అంతట నతఁడు దద్దరిల్లి లేచి మ్రుచ్చు యని యరచుచు తనచేతి సురియచే బొడిచిన, నతండు రాజగుట నెఱింగి గడగడ వణకుచు నాయుధంబుదీయక నిలుచుండెను.

అప్పుడారాజు గుడి వెలుపలనున్న జనులకు మంత్రి పురోహిత సామంతులను బిలువుండని యానతిచ్చి యత్యంత భయాకులిత చిత్తుండైయున్న తన పుత్రునింజూచి నీవు భయపడకుమని వచించెను. వానిని దగ్గరకు బిలచి గాఢాలింగనంబుజేసి "నీవు నా గర్భంబున బుట్టిన సుతుండవని" పూర్వవృత్తాంతంబు దెలిపెను. దీనికింత విచారము వలదని అది తానుచేసిన పనికాదని గారవించెను.

భృత్యులతోడవచ్చిన పురోహిత ప్రధానులకు రాజాపోటు చూపి యితఁడు తనసుతుండని దెలిపి పట్టాభిషిక్తుని జేయమని జెప్పి కాకతి ప్రోలరాజు కైలాసము కరిగెను.

రుద్రమహాదేవరాజు పట్టాభిషిక్తుండై రాజ్యంబేలుచుండగా మైలారు దేవరకు నొద్దపల్లి వినాయక దేవరకును ముగిలిచెర్ల వీరాదేవికిని గుళ్లు కట్టించి ప్రతిష్ఠలు చేయించెను.

తరువాత తండ్రిని పొడిచిన దోషము విముక్తియగునట్లు జగదాచార్యానుమతంబున కాశీ విశ్వనాథుని పూజాప్రకారంబులు మహామహిమగా జేయించెను. మఱియు శ్రీనగరంబునకుబోయి మల్లికార్జునలింగంబు సేవించెను. అచ్చట నెనిమిది తులాభారంబులుదూగి కోటి సువర్ణంబులు దానము చేసెను తదుపరి ఏకశిలానగరంబునకొచ్చి తత్పుర మధ్యప్రదేశంబున ముప్పది మూడుకోట్ల సువర్ణంబులు తెప్పించి సహస్ర లింగంబుల శివాలయంబులు గట్టించెను. మఱియు హనుమకొండకు సహస్రస్తంభముల గుడియును మఱియు పెక్కు దేవాలయములు కట్టించెను. అందు రుద్రేశ్వరుల ప్రతిష్ఠలు చేసెను. దిగ్విజయంబు చేసెను. తిరిగి పురంబునకువచ్చి తన తమ్ముడైన మహాదేవరాజు దుర్మతంబునెరింగి యతని గిరి చేయించెను. తనకు సంతానంబు లేకునికి చింతించి శ్రీశైలంబునకు బత్నీయుక్తుండైచని శ్రీమల్లికార్జున లింగంబు సేవించి యక్కడనున్న సిద్ధులకును మఠాధిపతులకును నానా విధవస్తుసముదయంబులిచ్చి వారల చిత్తంబునకు మోదంబు గలుగజేసెను. ప్రసన్నంబగునట్లుగా

బూజలుచేసెను. అంతవారల ప్రసాదంబున నొక్క సుతుండు గలిగెను. అతనికి గణపతిదేవుండని నామకరణంబిడెను. మఱికొంతమంది సుతులు గలిగిరి.

తరువరి పాండ్యదేశాధీశ్వరునిపై దండయాత్ర గదలి వానిని సాధించి వాని సుతునికి పట్టంబుగట్టి వాని సుతునిచే గోటిసువర్ణ నిష్కంబులప్పనంబులు గొని సేతు బిందురామేశ్వరంబునకుంజని ధనుః కోటి తీర్థంబు నాడి యచ్చట నెనిమిది తులాభారంబులుదూగి తిరిగి ఏకశిలానగరంబు ప్రవేశించెను.

అంత మహాదేవరాజు కొందరి పరిజనంబులను వశపరచుకొని రుద్ర మహాదేవరాజును బొడిచి తనకు బట్టంబు గట్టుమనిన వారు మహాదేవరాజుతో నిట్లనిరి "నీవు రుద్రమహాదేవరాజును వధించిన కారణంబున నీకు పట్టాభిషేకంబు పూజ్యంబుగాదు. ఈ రుద్రమహా దేవరాజు సుతునకు బట్టంబుగట్టి నీవు యువరాజువు కమ్మనిరి. అతండట్లు చేసిన నా మహాదేవరాజు మూడుకోట్ల సేనలతో గణపతిరాజు సహితంబుగా దేవగిరి మీదికి దండుపోయి మాస ద్వయంబు ఘోరయుద్ధంబుజేసెను. దేవగిరిరాజుచే మహాదేవరాజు గతించెను.

పిదప గణపతిరాజు సింహాసనంబెక్కెను. తన పిన తండ్రిని చంపిన దేవగిరిరాజు వంశక్షయంబు గావించెను. హతశేషులు భయాకులిత చిత్తులై కోట్లద్రవ్యంబులు కానుకబట్టి గణపతి దేవునకు నతనికూతురు రుద్రాదేవిని సర్వాభరణ భూషితులజేసి కానుక బెట్టిన నాకన్యకను వివాహంబై యేకశిలా నగరంబునకు వచ్చెను తనకు మర్లబడ్డ తమ్ములను ప్రహరించి తాను పట్టాభిషిక్తుండై ఓరుగంటి శిలాప్రకారంబు లేర్పరచెను.

తదుపరి తిక్కనసోమయాజి గణపతి దేవరాజుచే ననుజ్ఞాతుండై పోవు నప్పుడీరాజు సింహాసనంబున మంత్రియైయున్న శివదేవయ్యగారిని జూపి యితండీశ్వరుండుగాని మనుష్య మాత్రుండుగాడు గావున రాజ్యభారం బీతని యనుమతిని నడుపుమని చెప్పివెడలెను.

క. పనుచు నెడదిక్కమఖియ
జనవర సింహాసనమున సచివాగ్రణియై
దనరెడు శివదేవయ్యం
గనుగొని యారాజుతోడ, గడకంబలికెన్

తే.గీ. వసుమతీనాథ! యీత డీశ్వరుడెగాని
మనుజమాత్రుండుగాడు వల్మూరు నితని
యనుమతంబున నీవు రాజ్యంబునెమ్మ
నేలు మని చెప్పియాఘను, డేగుటయును

(సోమదేవరాజీయము)

ఇక గణపతిరాజు శివదేవయ్య యనుమతితో ప్రణయభేరి వేయించి బలసమేతుండై మున్నూరువేల సాటి రాజులగెలిచి వారిని యాజ్ఞకు లోబరచుకొని, అప్పనంబులు గైకొనెను. అంత నెల్లూరకేగి అక్కన్న బయ్యన్నలను భేదించి మనుమసిద్ధి రాజును తిరిగి యభిషిక్తునిజేసి రెండువేల యేనూరు గ్రామంబులతనికి చెల్లుచేసి కడమవి తన వశంబు జేసికొనెను. నెల్లూరులో నొక్క మహాతటాకంబు త్రవ్వించెను. సిద్ధరాజుచే బూజితుండై తిరిగి గంగాపురంబునకు వచ్చి పెక్కుశివాలయంబులు, రెండు గోపురంబులు గట్టించెను.

ఏకశిలానగరంబునకువచ్చి నగరిలో ననేక రాజగృహంబులు గట్టించి తన నగరికి ప్రాకారంబుగట్టించెను. బడ్డె పాండ్యులపై దండువెడలి వారిని సాధించి వారిచే నప్పనంబులు పుచ్చుకొనెను. తన యాజ్ఞ సఫలము చేసికొని శ్రీగిరి దర్శించి మల్లికార్జున లింగంబు సేవించి పన్నెండువేల సువర్ణ కమలంబుల బూజించెను. పంచారామంబు సేవించి షోడశమహాదానంబులు చేసెను. గణపతిదేవుడు రాజ్యపరిపాలనముతోపాటు శివారాధనకుకూడా బహుప్రాముఖ్యమిచ్చినవ్యక్తిగా యిక్కడ మనకు గోచరించుచున్నాడు. పరిపాలనా భారమంత వహించుచున్నను భక్తిమార్గము మరువలేదు. ఇంకను గణపతిదేవుడు వందితారాధ్యులచే దీక్షగైకొని యమ్మహాదేశికునకు రెండు గ్రామంబు లొసంగెను. పెక్కు శివాలయములు గట్టించుచు రామరాజ్యము తీరు రాజ్యపరిపాలన గావించెను. గణపతిమహారాజు తనకు సంతానంబు లేకునికి పద్మాక్షీ వర ప్రసాదంబున నొక కన్యకారత్నంబునుంగాంచి ముమ్మమ్మ యను నామకరణంబు జేసెను.

ఆమెను వీరయ్యదేవుండను రాజసుతునకు వివాహము చేసెను. యేనిమిది కోట్ల సువర్ణంబులు నిక్షేపంబు జేసెను. తన పురమున గల యగ్రగణ్యునిజూచి

నాయకత్వం బిచ్చెదమని వారు క్షాత్రధర్మంబు లొప్పవని పల్కిరి. అంత నానావర్ణంబులవారికి నాయకత్వంబు కృపజేసెను గణపతిదేవుండు అరువది యెనిమిదియేండ్లు రాజ్యపరిపాలనజేసి శివలోకమునకరిగెను.

గణపతిరాజు భార్యయగు రుద్రమహాదేవి వీరపత్నిగావున రాజ్యపరి పాలన కడంగెను. ఈమె పద్మాక్షీదేవి దత్తంబైన ఖడ్గ ఖేటకంబులు సింహాసనముపై నిడి శివదేవయ్యగారి యనుమతంబున రాజ్యము పరిపాలించు చుండెను. ప్రజల సౌకర్యార్థ మనేక కోటలు నిర్మించెను. అనేక శివాలయములు కట్టించెను. సత్రంబులు నిర్మించుట మున్నగు అనేక పుణ్యకార్యంబులు చేసెను. తన కూతురగు ముమ్మమ్మ మహాదేవికి మంచి సుతుడు గావలెనని నోము నోపించెను. తమ యింటి యిలవేలుపైన కాకతమ్మకు జాతర చేయించెను. ఒడ్డేపల్లి వినాయ కునికిన్ని మొగలిచర్ల యేకవీరాదేవికిని అయినవోలు మైలారపు దేవికిని సకల దేవతలకును మహోత్సవంబు చేయుచు అయిదు దినంబులు పురంబు వెలుపల యుండెను. రాజపత్నిగా రాజ్యభారము వహించి ప్రజోపయోగకరములగు కార్యములు సాధించుటేకాక యీమె పుణ్యవతియై పెక్కు పుణ్యకార్యములు జేసినది. భక్తికేమాత్రము లోటులేదు. భక్తిభావముతో దాన ధర్మములు చేయుటేకాక దైవారాధనయందును శ్రద్ధచూపిన వీరవనితగా ఈమెను చెప్ప వచ్చును. సకలజనులు 'అంబా'యని పలుకుటచేత తనపేర అంబాలయ మను గ్రామము గట్టించెను. నిజనామంబున వేయి రుద్ర నగరములు గట్టించెను. అష్టదిక్కుల జయస్థంభముల నెత్తించి మహావైభవంబుతో రాజ్యమేలుచుండగా ముమ్మమ్మ గర్భముదాల్చి సుతునిగనెను. రుద్రమహాదేవి శివదేవయ్య గారిచే నాబాలునికి విభూతి ధరియింపజేసెను. ఇచట గమనించవలసిన విషయమేమ నగా 'విభూతి ధారణ' వీరశైవులకాలములోనిదే. ఇది కేవలము వీరశైవమత లక్షణమేకాక శైవారాధనకు చిహ్నమే కావచ్చును. శైవమత లక్షణము కూడ. నేటికిని కర్నాటక రాష్ట్రములోను యితర ప్రదేశములలోను లింగధారులు 'విభూతి ధారణ' పాటించుట చూచుచున్నాము. రుద్రమహాదేవి పుత్రోత్సవము అత్యంత వైభవముగా జేసెను భూసురులకు అపారద్రవ్యముల నొసెగెను. శివ దేవయ్యగారిని సంప్రదించి ఆ బాలునకు ప్రతాప వీరరుద్రదేవుడని నామకర ణంబు చేసెను. తదుపరి ముమ్మమ్మ మహాదేవికి మఱియొక సుతుడుద్భవించెను. ఆ సుతునకు అన్నమదేవుండని నామకరణంబు చేసిరి.

ప్రతాపరుద్రునికి గర్భాష్టకంబున ఉపనయనంబు గావించెను. వేదాధ్యయనాదులుగాగల విద్యలన్నియు నేర్పించెను. పదునాఱవయేట విశాలాక్షి మొదలుగా పదునాఱుగురు కన్యలతో వివాహము చేసెను. తదనంతరంబు రుద్రమహాదేవి శ్రీ మత్ప్రతాపరుద్రుని సింహాసనారూఢుని చేయవలయునని సంకల్పించి శివదేవయ్యగారిని రావించెను. తరువాత వాతని పాదంబులకు నృపాలునిచే మ్రొక్కించి యతనిచేత విభూతి ధరియింపజేసి, పట్టాభిషిక్తుం జేసి, శ్రీ మత్ప్రతాపరుద్రుని శివదేవయ్యగారికి ఒప్పగించి, రుద్ర మహాదేవి ముప్పదియెనిమిదేండ్లు రాజ్యముపాలించి శివలోకమున కఱిగెను.

ప్రతాపరుద్రుడు పట్టాభిషిక్తుడైన తరువాత కాశేశ్వరనివాసులైన రామారణ్య శ్రీపాదులును, మహేంద్ర శ్రీపాదులు మొదలైన మునులేతెంచిరి. వారికి సాష్టాంగ నమస్కారముచేసి వారియభీష్ట మేమనియడిగెను. వారు తమకు బరుసవేదిలింగంబు సేవించుట వారి యభీష్టమని తెలిపిరి. సరేయని వారిని తోడ్కొని శంభులింగంబు నగరికింజని ఆ దేవుని జూపిన వారా లింగమును సేవించిచనిరి. తదుపరి కొందఱు దుష్ట నాయకులు గూడి స్పర్శలింగంబును గొనిపోవ నుద్యోగించి బహుజనంబుల గూర్చుకొని యాదేవుని కావలివారిని కొట్టి నగరు జొచ్చిరి.

ఆ సమయమున శ్రీమత్ప్రతాపరుద్రుడు యిదివిని దేవదత్తంబైన ఖడ్గ ఖేటకంబుల నిరుగేలంబూని తన సమీపమునయున్న యాప్తవర్గంబులతో గూడి యామంటముననున్న దుష్టనాయకుల దునిమెను. మరియు నొక్కనాడాపురి దుష్ట నాయకులతోగూడి, ఆకుల చంద్రయ్య యను విప్రునిల్లుసొచ్చి సర్వ ధనంబులపహరించి విప్రుని పొడిచి పోయిరి. అతడు మూర్ఛాగతుడయ్యెను. భూపాలుడావార్త విని ఆ విప్రుడు చచ్చినందులకు తనకు బ్రహ్మహత్య తగులు నేమోయని మహాభయంబంది చింతించు చుండెను. అట్టి సమయములో నావిప్రుని భార్య పతివ్రతగావున లక్ష్మీదేవి వరప్రసాదంబువలన తన పెనిమిటికి ప్రాణ హానిగాకుండ బ్రతికించుకొనెను.

ఆవార్త భూపాలుడువిని విప్రదంపతులను రావించి పూజించి చీని చీనాంబరంబులిచ్చి ఒక గ్రామంబిచ్చి పంపెను వారా గ్రామంబున లక్ష్మీదేవిని

ప్రతిష్ఠించి యాపురంబునకు లక్ష్మీదేవి పురంబని పేరు పెట్టుకొనిరి. ఏనిపలన కాకతీయ వంశపువారి భక్తి ప్రపత్తులు వెల్లడియగుచున్నది.

ఈ విధంబుగా ప్రతాపరుద్రుడు మహానేర్పుతో రాజ్యపరిపాలన సేయుచు సోమదేవరాజు నాటినుండి వంశపారంపర్యముగా వచ్చుచున్న రాజ్యములో ప్రజలను గౌరవించి తాంబూలంబులిచ్చి పైనజరిగిన వింత వారలకెరిగించెను. అంత వారు ప్రతాపరుద్రుని 'సాక్షాత్ రుద్రుండవుగాని మనుజమాత్రుడవుగావని' పొగడిరి. సభాసదులందరు ఈతని రాజనీతి వివేకమును మెచ్చుకొనిరి. ఈ విధముగా ఇంకను ప్రతాపరుద్రుడు పెక్కు విజయములు సాధించెను. ఈ సందర్భములో ప్రతాపరుద్రుడు భాగీరథిజేరి గంగా, యమునా, సరస్వతీ నదుల కృత స్నానుండై పెక్కు దానములు చేసెను. ఎనిమిది తులాభారంబులు తూగెను. ప్రణయభేరి వేయించి యాపట్టణంబు తన వశముగా జేసికొనెను. ఆ పుర మునందుగల మాధవదేవుని బూజించి యాదేవుని వైభవముకొఱకు నాపురం బిచ్చెను.

ఉ. కాశికినేగి వేగమణి కర్ణికలోన మునింగి భక్తివి
శ్వేశుభజించి యవ్విభున కిమ్ముగ నప్పురమిచ్చి యిచ్చట
న్నేశల బుద్ధిభూమిసుర బృందములంబిలిపించి వారికిం
గౌశలమొప్ప గోటినవ కాంచన నిష్కములిచ్చి వెండియున్
(సోమదేవరాజీయం)

అటనుండి కాశికి జని మణికర్ణికయందు మునిగి విశ్వనాథుని సేవించి యానగరంబు విశ్వనాథున కొసంగెను. అచట నిరువది తులాభారంబులు తూగి కోటిసువర్ణంబులు దానము చేసెను. మరియు గయకువెళ్లి అచట సుల్తానునిచే పూజితుండై యచట నర్హజనంబులచేత మాతామహులకును పితామహులకును విహిత కృత్యములు జేయించెను.

తిరిగి వింధ్యనగరముదాటి గోదావరీ మంత్రకూటంబు ప్రవేశించి విధ్యుక్తప్రకారంబు నచట పంద్రెండు క్రతువులు చేయించెను. కాళేశ్వరంబున కేతెంచి ముక్తీశ్వరుని పర్యంచెను. పంద్రెండు తులాభారంబులు దూగెను.

కోటి సువర్ణంబులు దానంబు జేసెను. రెండువేల విప్రులకు వివాహంబులు జేసి సకల దానంబులు గావించెను. వేయి శివాలయములు, మున్నూరు విష్ణు స్థానంబులు ప్రతిష్ఠలుజేసెను. ఏకశిలానగరంబున కీశాన్య భాగంబున ప్రతాప గిరియను నొక్కదుర్గంబు గట్టించెను.

అంత మౌద్గల్యమను క్షేత్రమునకువచ్చి యాగుండంబున స్నానంబుచేసి రామేశ్వరు నారాధించెను. అచట నున్నతంబుగా గుడియొకటి కట్టించగా మునులిది మాండకర్ని ఏకాంతస్థలమగును. యిచట జనసమర్థము గూడదనిరి. అంత నాతడా ద్రవ్యంబు తెప్పించి పాకాల చెరువు కట్టించెను. ఒక్కపురంబు గట్టించి కోట బెట్టించెను. పాకాల సీమలో నలువది గ్రామంబులు రామేశ్వరుని వైభవంబునకొసంగెను ఎనిమిది తులాభారంబులు తూగెను. షోడశమహా దానంబులు చేసెను. తరువాత నేకశిలానగరంబునకు వచ్చుచుండెను.

అట్టిసమయంబున తన తమ్ముడైన అన్నమదేవుడు పండ్రెండు వర్షంబులు రాజ్యంబుపాలించి ప్రతాపరుద్ర నరేంద్రునకు యోజన దూరంబున నెదుర్కొని దండ ప్రణామంబులు చేసి ముకుళితహస్తుడై చెంత నిలిచెను. తమ్ముని చూచి ప్రతాపరుద్రుండు కౌగలించుకొని కుశలమడిగెను. సంతోష చిత్తుండై పురంబు ప్రవేశించి శంభులింగంబు నారాధించెను.

తదనంతరంబు సింహాసనాసీనుండై కూర్చుండి తనవెంట వచ్చిన నానా దేశాధీశ్వరుల నిజనివాసంబునకు పంపెను. అంతఃపురంబునకేగి తన తల్లియైన ముమ్మమ్మ మహాదేవికి సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించెను ఆమె దీవనలు గైకొనెను.

విశాలాక్షియందు విరూపాక్షుండు, వీరభద్రుండను నిద్దరు సుతులను గనెను. ఈ విధంబుగా ప్రతాపరుద్రుడు మహామహిమతో రాజ్యమేలుచుండగా ఏకశిలానగరం బలకాపురి సమానంబై ప్రకాశించుచుండెను.

[1]ప్రతాప చరిత్రలో దుర్గమునగల నానా వర్ణముల సంఖ్య మరియి ఆలయముల సంఖ్య ఈయబడినది. అంగళ్లు వివిధ వర్ణంబుల వారి యిండ్లు కాక

1. ప్రతాపరుద్ర చరిత్రము. పుట 54.

శివాలయములు, విష్ణు ఆలయములు, మైలారు, పోలేరు దేవతల ఆలయములు మున్నగు వివరములు కూడా ఇందున్నవి. అందు శివాలయముల సంఖ్య 5500. విష్ణు ఆలయములు 1300 మైలారు పోలేరులు 2400.

ఇట్లసార సంపద చేత ప్రతాపరుద్రుడు రెండవ దేవేంద్రునివలె ప్రకాశించెను. 'మూరురాయరగండ' అను పెండేరము అనెడు అలంకారమును వామ పాదమున ధరించెను. ఆ ప్రతాపరుద్రుని విశేషభోగములు దినచర్య ప్రతాప చరిత్రలో వర్ణింపబడియున్నది. ఇంత భోగమయంబైన జీవితంబు గడుపుచున్నను భక్తి భావమున కే లోటు లేక అనేక దేవాలయములు కట్టించుట, దానములిచ్చుట మున్నగు పుణ్యకార్యము లనేకంబులు చేసెను. ఏకశిలా నగరంబున గల దేవతా వైభవంబులకు నొక్కకోటి నగరంబులో రాజ గృహంలను గట్టిన వారికి ప్రతి సంవత్సరంబునకు కోటి వారణాసికిని, సిద్ధేశ్వరునకు, శ్రీ శైలమల్లికార్జునునకు, శ్రీ వేంకటేశ్వరులకును, శ్రీ రంగనాయకులకును, ఏకాంబ్ర నాథేశ్వరునకు, రామేశ్వరునకు మొదలుకొని దివ్యదేశ నివాస మూర్తులకు ప్రతివర్షంబునకు కోట్లు చెల్లించు చుండెను.

ఇట్లు విక్రమాదిత్యుని చందంబున మహా మహిమతో రాజ్యంబు పాలింపుచు సకల భోగంబులు పరివారసమేతంబుగా ననుభవింపుచు రాజ్యమేలుచుండెను. అట్టితరి దేశంబు ఆనందకరముగా శోభిల్లుచుండెను. సకలజనులు ప్రతాపరుద్రుని "సాక్షాద్రుద్రుండు" గాని మనుష్యమాత్రుండు గాదని కొనియాడుచుండిరి. ఇతని చరిత్ర ఆదిపురాణాదులట్లు సకలానందంబై యుండును.

ప్రతాపరుద్రుడు ఒక పుణ్యకాలంబునందు మౌద్గల్యంబునకుం జని యగ్గుండంబున దీర్ఘంబులాడి యచ్చట రామేశ్వరుని సేవించి పెక్కు దానంబులు చేసెను. మరియు ప్రతాపరుద్రుడు పదకొండు హిరణ్య ధేనువులు చేయించి యొక్కొక్క ధేనువుకు ఒక లక్ష సువర్ణటంకంబులు దక్షిణ యొసంగి వేదవేదాంగ ప్రచండులైన విప్రోత్తములకు దానంబిచ్చెను.

ఆ దానంబు లందుకొనలేని విప్రులు చండాలవాటికకుం జని కొన్ని కుయుక్తులు బలికిన నా చండాలురు రాజు చేత దమకు ప్రాణహాని యెరుంగక

యానందం బట్టువడ బ్రాహ్మణుల నరికట్టుకొని యా సువర్ణ దేనువులు సజీవంబులయెనేని మరల దోడ్కొని పొందు నిర్జీవ దేనువులయ్యేనేని యది మీ సొమ్ములని బ్రాహ్మణులతో వాదించిరట. ఆ బ్రాహ్మణులు ప్రతాపరుద్రున కెరింగించిరి,

అంత ప్రతాపరుద్రుడు బహు విధముల రామేశ్వరు నారాధించెను. రామేశ్వరుండు ప్రత్యక్షమయ్యెను. ఆ సనుయమున నా సువర్ణ ధేనువులు రాజు మొదలుకొని సకల జనంబులు చూచుచుండ నడవ సాగినవి. అనంతరమున రాజు చండాలుర దండించి యేకశిలా నగరంబు ప్రవేశించెను. ఒక్కనాడు ప్రతాపరుద్రుండు కొలువు చాలించి సకల జనంబుల వీడ్కొల్పి శివదేవయ్యగారు తాను నంతఃపురంబునకుం జనుదెంచిరి. రాజు పట్టపు దేవియగు విశాలాక్షి శివదేవయ్య గారిని జూచి పరపురుషుడు గదాయని మరుగునకు పోయెను. ప్రతాపరుద్రుడంత శివదేవయ్య గారిని నిజ మందిరమున కనిపి తన పట్టపు దేవియైన విశాలాక్షి కిట్లనియె 'శివ దేవయ్యను జూచి పరపురుషుండని తొలంగి పోయితివి. ఆ యయ్య ఈశ్వరుండుగాని మనుష్య మాత్రుండు గాడు. ఆ యయ్యను బూజించి సుగతి గాంచుమని బలికెను.

అది విని విశాలాక్షీ దేవి తన చిత్తంబున బాదుకొల్పి శివదేవయ్యగారి యెదుట దాను నిల్చుటకు మొహమ్మాటపడి పతి వాక్యంబులు మనస్సునందుంచు కొని శివదేవయ్య గారి రూపంబుగా నొక్క సువర్ణ ప్రతిమను చేయించి ఒక సువర్ణ వేదికపై నునిచి షోడశోపచారంబుల బూజింపు చుండెను.

అంత నొక్కనాడు మాస శివరాత్రి యయ్యెను. ఆ ప్రతాపరుద్రుడు శివదేవయ్యను పిలిపించి స్నానాది కృత్యంబులు దీర్చి శంభునగరికి జనెను. ఆ దేవుని పూజించి యచట జాగరణ చేయుచుండెను అట్టి సమయంబున శివ దేవయ్యయు గిఱ్ఱున నిలిచిన మహీపాలుండును నొక శిల్పి నచ్చట జూచి నంతనే పంచ బాణుడు జ్యోతిషంబు విప్రులకు రానేర్చునే, సజ్జ్యోతిష్యంబు తమదని వ్యతీపాత ప్రవేశంబున జిల్లేడు కొమ్మవిరిచిన రక్తంబుగారెను. రాజది గని సంకోషించి శిల్పికి యొక్క గుఱ్ఱంబును పల్లకియు గృపజేసెను.

ఆ పార్థభూసురులెరింగి కటకటా యితర జాతిప్రజ్ఞలు మించి స్విగ్రహాను గ్రహంబులైన విప్రజనంబుల మాహాత్మ్యంబెరుగ రాదయ్యెనవె రాజ సముఖంబునకేతెంచి యిట్లనిరి. జ్యోతిష్యులకుగాక యితరజాతులకు ప్రజ్ఞలెట్లు లభించు శిల్పిజూపిన పరీక్షనిజంబుగాదు. అమృతవేళ నెరింగి ధేనువుల యెదుట క్షీరంబులు పిదుకుదురేని జ్యోతిష్యంబెరుగుంట నిజంబగును. వేద వేదాంగంబు ద్విజజాతులకుగాక యితర జాతులకు నెట్లు లభించు. పరీక్షజూపిన నది నిజంబు గాదు. అమృతవేళ నెరింగి ధేనువుల నెదుట క్షీరంబులు పిదుకునేని జ్యోతిష్యంబాతని సొమ్మని వచించి యొక్క గొడ్డుటావును జూపిరి. అదిగని వాడు పరీక్షసేయక తొలంగిపోవుటంజూచి యొక విప్రుం డది యెరింగి పిదికిన, కుంచెడు పాలు పట్టుటజూచి యా ప్రతాపరుద్రుం డత్యంత విస్మయంబందెను. ఆ విప్రుడు కోరినట్లుగా గోదావరి తీరంబున శతవర్షంబను గ్రామం బగ్రహారంబుగ నిచ్చెను.

ప్రతాపరుద్ర చరిత్రములో నున్న శివదేవయ్యగారికథ సిద్ధేశ్వర చరిత్రలోకూడ కలదు. కాని కొంచెము రెండింటిలో ఈ కథ ఇంచుక భేదముగా చెప్పబడినది. రెండు కావ్యములలో విశాలాక్షి శివదేవయ్యను జూచి పరపురుష దని తొలగిపోవుట వరకు ఒకేరకముగా చెప్పబడినది. తదుపరి సిద్ధేశ్వర చరిత్రలో విశాలాక్షి శివదేవయ్యగారిని మనం తలంచుకొని శివదేవయ్యగారి పేరుతో ఒక సువర్ణ ప్రతిమ చేయించి మంటపమునందుంచి పూజించెను. ఆనాడు మాసశివరాత్రి. ప్రతాపరుద్రుండును, విశాలాక్షియు, శివదేవయ్యయున్నగువారందరు ఉపవసించి భజన చేయుచున్న సమయములో శివదేవయ్యగారు బయలుదేరగా, ప్రతాపరుద్రుండు వారికిట్లనియే "ప్రొద్దంతయు ఉపవసించి, ఏమియు తినకున్నను ఏల్లతేన్చితి" రని ప్రశ్నింపగా శివదేవయ్యగారు కడుపార అంతకు ముందరే భుజించితిమని తెలిపినారట. అంత ప్రతాపరుద్రుండాశ్చర్యపడి భార్యకెఱిగింపగా ఆమె శివదేవయ్యగారి సువర్ణ ప్రతిమచేయించుటయు తాను షోడశోపచారవిధిని పూజించి నైవేద్యమిడుటయుట ర్త కెఱింగించెను. అంత ప్రతాపరుద్రుడు శివదేవయ్యగారి మాహాత్మ్యమింత యని యెఱింగి సంతసించెను. ఈ కథ సిద్ధేశ్వర చరిత్రలో ఈ విధముగా నుండగా ప్రతాపచరిత్రలో ఇంచుక భేదముగా గలదు.

ఇంకను ప్రతాప చరిత్రలో కృష్ణమాచార్యులవారి కథ కూడా కలదు. ఒకనాడు సంతూరను గ్రామములో కృష్ణమాచార్యుల తమ్ము డనంతాచార్యులు రజకస్త్రీతో గూడెను. ఆ రజకు డిద్దరిని పొడిచెను. అంత వారు మరణించిరి. ఆపురి విప్రులిది "శూద్ర పీనుగతో కూడియున్నది గనుక మేము మొయ్యమనిరి. అది విని కృష్ణమాచార్యులు తన మదిని విచారించి వాసుదేవమూర్తిని కీర్తన చేసెను. శవము తనంతట తానే కాష్ఠంబున వఱకు జరిగిపోయెనట.

ఇది గని సకల జనంబు లేతెంచి కృష్ణమాచార్యుల పాదములకు ప్రణమిల్లి మా యపరాధంబు క్షమియింపుమని వేడిరి. అతండు "నాకు రాగ ద్వేషంబులు లేవు" మీరు వెరవకుడని వచించెను. ఆ వార్త ప్రతాప రుద్రుడు చారులచే విని కృష్ణమాచార్యులను పిలిపించి పూజించి కనకగిరి సీమలో నాల్గవ భాగంబును, 50 గ్రామంబుల కధికారంబును నొక్క యూరగ్రహారంబు నొసంగి పంపెను.

ఇచట శివకేశవుల యభేదము కన్పించుచున్నది. ప్రతాపరుద్రుడు శైవుడైయెనను వైష్ణవుడైన కృష్ణమాచార్యుని గౌరవించి ఆయనకు అగ్రహారంబులు దానమునేసి తన మతసామరస్యమును ప్రదర్శించుటయేకాక కృష్ణమాచార్యుల ఘనతను గుర్తించినాడు.

కృష్ణమాచార్యులు సంతూరు ప్రవేశించి సకల ధనంబులు పంచిపెట్టెను. కల్లూరను గ్రామంబు గట్టించెను. మూడు వర్షం బులధికారంబుచేసి గ్రామంబుల గలుగు పదార్థంబు దెప్పించి తామ్ర పత్రికలు చేయించి ఆ పత్రికలమీద తాను రచించిన చాతుర్లక్ష గ్రంథంబులు చెక్కించెను వాటిని శకటంబులపై నిడుకొని శ్రీరంగంబునకు బోవ నుద్యోగించెను.

అంత కొందఱు దూర్తులు గూడి రాజు సముఖంబునకు పోయి కృష్ణమాచార్యుల కధికారమిచ్చినందులకు గ్రామంబులో పదార్థంబులు దెప్పించి తామ్ర పత్రంబులు చేయించి శ్రీరంగమును గొని పోవుచున్నాడని యెఱింగించిరి. ప్రతాప రుద్రుం డిది విని 'అతండు మహాత్ముండు అతనికేమి యిష్టంబో అదే నాకు యిష్టంబని' వచించి ఊరకుండెను.

ఈ వార్త కృష్ణమాచార్యులు విని తన మనంబున వాసుదేవుని నారాధించి ఒక వచనంబు రచియించిన మెచ్చి ఏకశిలానగరంబున గనకవృష్టి గురిపించెను. ఇది గని ప్రతాపరుద్రుం డచటి జనంబులను కృష్ణమాచార్యులను బూజించి వారిచే వీడ్కొనెను. కృష్ణమాచార్యులు శ్రీరంగము కరిగెను.

మరియొక్క నాడు తిక్కన సోమయాజుల వరప్రసాదంబు చేత కుమ్మర మొల్ల రామాయణము రచించి వీర ప్రతాపరుద్రున కంకితము చేయ నిశ్చయించెను. అట్టి సమయంబున నారాజు ముఖంబున విద్వాంసులు కొందరది విని " ఇది శూద్ర కవిత్వంబు నిశ్చబ్దంబని నిరాకరించి పలికిరి " రాజు సర్వజ్ఞుడు గావున దానిని మెచ్చి బ్రాహ్మణ కృత్యంబయిన కావ్యంబు కావలెనని యనెను.

ఆ విద్వాంసులంత భాస్కరుని పిలిపించిరి. అతడు రచించిన శ్రీరామాయణము వినుసమయంబున నచ్చటికి తెంచి మొల్ల రామాయణంబు మున్ను నేను రచించి యున్నానని యచట నచట నొక్కొక్క పద్యము నర్ధయుతంబుగ జదువ సాగెను. అది విని ఆ రాజు సర్వజ్ఞుడు కావున వీని ప్రజ్ఞకు మెచ్చ విప్రజనంబు మెచ్చునోయని మొల్లని బిలిచి పల్లకియును నగరిలో నిత్య జీవితంబు కట్టడిజేసి తనయెదుటనుండ నీక తన దేవి విశాలాక్షి సముఖంబున నుండజేసెను. ఆ వార్త విని శాఖవెల్లి మల్లికార్జునభట్టు నిరోష్ఠ్యరామాయణంబు రచించెను. తదనంతరంబున రంగనాదునించిన నతడు దక్షిణదేశంబున నుండి యాందోళికపై నెక్కి చనుదెంచు నప్పుడు త్రిపురాంతక విజయంబను గోపురంబు జూచి యవి యేమి యని యడిగిన నవి 1) త్రిపురాంతక గోపురంబులని యచ్చటివారు పలికిరి.

అంత నాతడు శివభవనంబులను జూడ నొల్లక మైదపుదడ్డు గప్పించుకొనియె. అప్పుడు రంగనాధుండు నేత్రంబులు గానక జాత్యంధుని పగిది యుండెను. రంగనాధుండు మగుడి శ్రీరంగమునకు బోయి యా దేవుని ప్రసన్నుని జేసికొని నేత్రంబులు ప్రసాదింప వేడికొనెను. ఆ దేవుడు కరుణించి త్రిపురాంత దేవుని వేడుకొమ్మనుమని వచించెను.

అంత రంగనాధుండు మరల త్రిపురాంతంబున కేతెంచి యద్దేవునికి నమస్కరించి తన యెత్తు క్రతవులు సమర్పించదనని వ్రతంబుజేసి భక్తి

మయంబుగా నొక్క రగడ చెప్పెను. అద్దేవుండు ప్రసన్నుండై రంగనాధునకి నిలువు కన్ను లొసంగెను రంగనాధుండంత పాలకుర్తికిం జని సోమనాధునిచే దీక్ష గైకొని యాయయ్య యొద్ద శివ రహస్యంబులు దెలిసికొను చుండెను.

ప్రతాపరుద్రుడు సోమనాధుని ప్రభావము విని ఆశ్చర్యము నొందెను. అంత మంత్రియగు పాలకుర్తి సూరయ్య ప్రతాపరుద్రునితో నిట్లనెను. పాలకుర్కి సోమనాథుడు చెప్పిన శివకథలు దేవరవారు ఉప్పులశంభుని సేవింపబోయినప్పుడు గూర్చుండి వినవచ్చునని వచించెను. మరునాడు ఆరాధ్య చరిత్ర రాజు వినుచుండగా కొందఱు ధూర్త జనులు పాలకుర్తి సోమనాదుండు చెప్పినవి నూతనంబులుగాని యాద్యంతబులుగావని నిరాకరించిరి. ఆ ప్రతాప రుద్రుం డంత దన నివాసంబునకు జనెను.

అచ్చటి శివభక్తులు సిగ్గుపడి పాలకుర్తిజని సోమనాధున కెఱింగించిరి. సోమనాధుండు శైవులుగానివారల జూడకుండుటంజేసి ఒక బండిపై గూడారంబు వైచి యందు దానుగూర్చుండెను. లింగముద్రగల యెడ్లు గట్టించెను. సూర్య మంత్రిని సూతునిగజేసి ఏకామ్రగురుండగు రంగనాదుండును మొదలుగాగల శైవులందరు తన్నుగొలువ ఏకశిలానగరంబున కేతెంచెను.

బండికి గట్టిన యెడ్లు కవాటము జొరకున్న నెఱింగి, గవినియద్ద దూలంబున శివి ప్రతిమయు రెండుయేనుగు లుండగా జేసినట్లు దెలిసికొనెను. అంతట సోమనాధుండు శివుని ధ్యానించి యాప్రతిమలపైన భస్మము చల్లిన నవి తునకలై క్రిందపడెను. అంత నేకశిలానగరంబున దన శిష్యుండగు ఇంచులూరి యన్నమదేవు నివాసంబున కేగెను.

ప్రతాపరుద్రుం డీ సంగతివిని విస్మయం బందెను. కొందరు ధూర్తులు సహింపజాలక శిలలు తెగిపడుట మంత్రవిద్యగాని వాక్యసిద్ధికాదు. ఇతని సమీపమునకుబోయి యీగుట్టు తెలిసికొని యిప్పుడే వచ్చెదమని రాజుచే ననుజ్ఞగొని యాసోమనాధుని సమీపమునకు జనిరి. కాని యతం డన్యమతస్థుల జూడకుండెను.

అంత నాద్వారపాలకులచేత నివారితులైమగుడి పురవీధి కేతెంచి గుంపులు గూడి కటకటా! వేదశాస్త్ర సంపన్నుల జూడరాదట. చండాలురైనను లింగ ధారులైన మాట్లాడి చూడవచ్చునట. అట్లుకాకయని యితనిని హాస్యంబుచేసి యీప్రొద్దే పురంబు వెడల నంపవలయునని తలంచిరి. ఆ పురిలోపల గ్రామసార్థమై తిరుగు అంగహీనులనుండి మొండి ముక్కుడి వెఱ్ఱివాండ్లను, అంధులను, బధిరులను, మూకులను మరియు రోతజనుల రావించి, మీరు సోమనాధుని హాస్యంబు చేసి వచ్చితిరేని మీకు అన్నవస్త్రంబు లిచ్చెదము, అని వారిని యొడంబరిచి, వారికి లింగధారణంబు విభూతి రుద్రాక్షధారులంజేసి కొన్ని కుయుక్తులు జెప్పి పనిపిరి.

వారు సోమనాధుని సముఖంబునకుం జనిరి. ఆయయ్య ద్వారపాలకులచే ఆ వార్త నెఱింగి తన సముఖంబునకు వారల బిలిపించుకొనెను. అంతట నతని ప్రభావంబునంజేసి యంగహీనులకు నంగంబును, యంధులకు గన్నులును, బధిరులకు వీనులును, మూఢులకు వాక్యంబులును గలిగెను. వారత్యంత సంతోషంబున నాయయ్యకు నమస్కరించి, బహువిధంబుల గొనియాడి సోమనాధునిచేత ననుజ్ఞాతులై పురవీధి కేతెంచిరి.

సకలజనులు నామూగ బధిరయంగహీనంబులు నివారణంబగుట జూచి యాసోమనాధుని మహిమ గొనియాడిరి. ఆ దూర్తజనులు లజ్జజెందిరి. ఆ వ్రతాపరుద్రుండు విభూతి రుద్రాక్షలు ధరించువాడు గనుక నాయయ్యవద్ద కేతెంచి సేవించి తనకు శివుడు ప్రత్యక్షంబగు టెఱింగించుమని వేడుకొన్న గరుణించి యాప్రతాపరుద్రునకు సోమనాధుండిట్లనియె 'శివుండు భక్తిసులభుండు ఒక్కవ్రతంబు చేబట్టి నడుపుము వ్రతంబు భంగంబుగాకుండ నడిచితివేని ప్రత్యక్షంబగునని యెఱింగించెను.

రాజు శివదేవయ్యనుజూచి యెట్టి వ్రతంబుజేయవలయునని యడిగెను. అంత రాజునకు నాతడు, భాగీరధి జలంబుల నభిషేకంబు గావించినగాని భుజింపనని వ్రతంబు పట్టుమని యెఱింగించెను. అట్లేయని నిజనివాసంబున కరిగి నిత్యము భాగీరధిజలంబులు దెచ్చునట్లుగా 3,500 పరిజనంబుల నేర్పరచి నిత్యకృత్యంబుగ భాగీరధి జలంబులు దెప్పించి శంభులింగమున కభిషేకము చేయుచుండెను.

వర్షత్రయంబు జనెను. అట్లు గి సంవత్సరంబులు గడచెను. ఈశ్వరుడు ప్రతాపరుద్రుని దృఢభక్తి జూడగోరి యేడుదినంబులు భాగీరథి జలంబులు రాకుండునట్లును మహావర్షంబు గురిపించెను. ప్రళయకాల మేఘంబు రీతి నురుములు మెరుపులు మహావాయువును గలుగ భాగీరథి జలంబులుదెచ్చు జనంబులు రాలేక మిట్టపల్లంబులెరుంగరాక వానచేత నొక్కొక్క మూలకొదిగిరి.

ప్రతాపరుద్రుండు భాగీరథిజలంబులు రాకుండుటంజూచి యేడుదినంబులు యుపవసించి నిత్యము త్రికాలంబును పూజ చేయుచుండెను అంత మరునాడు ప్రభాతసమయంబున ప్రతాపరుద్రుండు మహాదేవుని గుడిలోనికి జనుదెంచు సమయంబున ఖడ్గఖేటకంబులును, మయిదపు జిడ్డును బట్టించుకొని పరిజనంబులు తన్ను గొలిచివచ్చుచుండ కోటసమీప వీధిలోపల మహావాయువుచె ఖడ్గఖేటకంబు లెగిసి పోయినవి. పిడుగులును, వాయువులును, వానయుగూడ నొక్క తడవ విడివచ్చిన నోర్వలేక పరిజనంబులు నేలపైబడిరి.

రాజు చలింపక ధైర్యంబు వహించి యుపవాసంబుల సొక్కక బుద్ధి చలింపనీక భక్తిమరువక వేసారక శంభుని నగరికిబోవ శక్యంబుగాక పెద్దనెలిగెత్తి శంభులింగా! మహాదేవా! నీలకంఠా! మృత్యుంజయా! కైలాస నివాసా! యని పిలువసాగెను.

ఆ క్షణంబున నందివాహనారూఢుండై ప్రమదగణంబులు గొలువ నీశ్వరుండుప్రత్యక్షంబయ్యెను. అంత నిర్మలంబై సూర్యమండలంబు గానంబడెను. ప్రతాపరుద్రుండు శంభులింగంబునకు సాష్టాంగ దండ ప్రణామంబు లాచరించి బహువిధంబుల స్తుతించెను.

అద్దేవుండు మెచ్చి నీకు వరంబు లిచ్చెద నడుగు మన ప్రతాపరుద్రుండంత ముకుళిత హస్తుడై వ్రత భంగము గాకుండునట్లులు గృపసేయుమనెను. అంత శంకరుడు మెచ్చి యప్పురంబునకు నుత్తర భాగంబున క్రోశ మాత్రంబున భాగీరథీ జలంబుల బుగ్గ గజతుండ సమానంబై మీకు గానవచ్చు. నీవ్రతంబు చెల్లుచుండు. నీవు గంగా గర్భంబున శరీరంబు దొలంగి దివ్య విమాన రూఢుండవై కైలాసంబునకు వచ్చెదవని వరంబొసంగెను.

శివుడు ప్రత్యక్షంబైన చోట శివాలయంబు గట్టించెను అంత ప్రతాప రుద్రుండు సకల జనసమేతుండై పంచమహా వాద్యంబులు మ్రోగగా మహా వైభవంబుతో బురంబు వెలువడి యక్కడికి వచ్చి యొక ప్రదేశంబున వారిని పిలిచి శంకరుని ప్రార్థింపసాగెను. అట్టి సమయంబున గజతుండ సమంబై చంద్ర ప్రకాశంబైన భాగీరథీ జలంబుల బుగ్గబయలు వెడలివచ్చెను ఆ జలంబులను ప్రతాప రుద్రుండు చూచి యత్యంత సంతోషంబున సర్వ జనంబులు తానును స్నానంబు చేసిరి. అక్కడనే శివాలయంబులు గట్టించెను. ఎనిమిది తులా భారంబులు తూగి కోటి సువర్ణంబులు దానంబుచేసెను.

మఱియు నాజలంబులను హేమకుంభముల నుంచి మదగజ కుంభంబుపై నిడుకొని మహావైభవంబుతో శంభులింగంబు నగరి కింజని యభిషేకంబు గావించి నైవేద్యంబులు సమర్పించెను. బంధుహిత సామాంత వర్గంబులతో గూర్చుండి శ్రీమత్ప్రతాప రుద్రుండు రెండవ దేవేంద్రునివోలే సకల విభూతి సంపన్నుండై సింహాసనా సీనుండై యుండెను. అట్టి సమయంబున పాలకుర్తి సోమనాథుండా దేశంబున వ్రతంబు చెల్లిన దక్షిణ దేశంబునకు బోయెదనని వచించిన ప్రతాప రుద్రుండొక్క గ్రామంబు నగ్రహారంబుగ నొసంగి పంపెను. ఆయయ్య యనుమతంబున రంగనాథుని దన వద్ద నుంచుకొనెను.

తదుపరి ప్రతాపరుద్రుండు తన పైకి యుద్ధమునకు వచ్చిన పశ్చిమ దేశాధీశ్వరులను జయించెను. ఇంకను మఱికొన్ని విజయములు ప్రతాప రుద్రుండు సాధించెను.

పిదప గోదావరిజేరి కాళేశ్వరంబు వచ్చి యచ్చట నిల్చి తీర్థంబులాడి కాళేశ్వరంబున ముక్తీశ్వరుగొల్చి యేకశిలానగరంబునకు జను సమయంబున శివ దేవయ్య ప్రతాపరుద్రునినే కాంతంబునకుం బిలిచి " యిక బదునెనిమిది దినంబులకు నీవు కైలాస నివాసుడవు కాగలవు ఇది గౌతమీ గంగా గర్భంబు ఇందుల నీ దేహంబు విడిచి దివ్య దేహంబు దాల్చి కైలాసంబున కేగెదవని శివుండు మీకు వరంబొసంగెను, కావున నిచ్చట నేయుండి యేకశిలానగరంబునం గల ప్రజలకీ వార్త చారులచే దెలియ జేయుమని వచించెను.

పిదప ప్రతాపరుద్రుని జూచుటకు నేకశిలానగర వాసులందరు

నేతెంచిరి. ప్రతాపరుద్రుండు తన్ను గొలిచిన వారందరిని అనేత విధంబుల సత్కరించెను.

ప్రతాపరుద్రుడు గోదావరి యందు స్నానమాచరించి, దివ్యాంబరంబుల ధరించి నానాభూషణంబులు దాల్చి విభూతి రుద్రాక్ష మాలికాలంకృతుండై గోదావరి గర్భంబున గూర్చుండి, శంభులింగంబును దన హృదయంబున నిల్పి ధ్యానించెను. అనంతరము రాజు తన పట్టపు దేవియగు విశాలాక్షిని జూడ గానే శివదేవయ్య విశాలాక్షి కిట్లనియె తల్లీ! "నీవు నన్ను జాలకాలంబు పూజించితిని నీకిష్టంబైన వరంబిచ్చెద వేడుమనెను. ఆయమ్మ యాతనికి నమస్కరించిమహాత్మా! తనకు బతి జీవంబు వెంటనే తన జీవంబును జనునట్లు వరంబు దయచేయుమనెను. ఆయయ్య యట్లనే యొసెంగెను.

శాలివాహన శక (12?1) సంవత్సర మాఘశుద్ధ ? గురువారం ఉదయ కాలంబున ప్రతాప రుద్రుండు నిజదేహంబు విడిచి దివ్యదేహంబు దాల్చి దివ్య విమానా రూఢుండాయెను. ఆ రాజు కాంత విశాలాక్షియు, నిజదేహంబు దాల్చి పతితో గూడ దివ్య విమానం బెక్కెను. ఇట్లు నా దంపతులులా విమానంబున సర్వజనులు చూచుచుండ కైలాస మునకరిగిరి.

ఇది ఒక విధముగా శివసాయుజ్యమేయని చెప్పవచ్చును. ప్రతాప రుద్రుండు సతితో కలిసి శివుని సాయుజ్యము వడయుట ఇందువిశేషము. తాను శివారాధకుండేకాక, శివుని కొరకు అనే కాలయంబులు కట్టించి, మరెన్నో పుణ్య కార్యములు సలిపినాడు గావున శివానుగ్రహమున ఈరీతిగా కైలాసమున కరిగినాడు. సతికూడ శివభక్తురాలు గావున శివదేవయ్య గారిచే ఇటువంటి వరము పొందగలిగినది తదుపరి అన్నమదేవుడు ప్రతాపరుద్రుని కుమారుడగు వీరభద్రదేవుని తలంపెరిగి యాతనికి పట్టంబు గట్టెను వీరభద్ర దేవుని పరి పాలనతో శ్రీమత్ప్రతాపరుద్ర చరిత్రలు సమాప్తమగుచున్నది.

TIRUPATI.
2-424

శైవమత ప్రభావము - 2

## గౌరన - నవనాథ చరిత్ర

గౌరన హరిశ్చంద్రుని కథ, నవనాథ చరిత్ర యను ద్విపద కావ్యములు రచించెను.

ఈతడు గౌతమ గోత్రజుడు. అయ్యలమంత్రి, పోచాంబల పుత్రుడు.

ఈతనికి పోతరాజు మంత్రిగా నుండెనని వెలుగోటివారి వంశ చరిత్రములో నుదహరింపబడిన "శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైక దురంధరః । మంత్రి (శ్రీ) పోతరామాసీత్ సర్వశాస్త్ర విశారదః ॥" అను శ్లోకము వలన గూడ దెలియవచ్చుచున్నది. సర్వజ్ఞ సింగ భూపాలుడని పేరువడసిన రావు సింగమహీపాలు నాస్థానమునకు శ్రీనాథుడు పోయినట్లును, నాతడు మహా విద్వాంసుడగుటచే నాతని మెప్పించు విషయమున నీతడు కొంత జంకుగల వాడై 'దీనారటంకాల' పద్యమును జెప్పి, రాజ సభాదేవత యగు శారదాంబను స్తుతించెననియు బ్రసిద్ధి కలదు అట్టి సర్వజ్ఞుని కొడుకగు నీసింగయ మాధవ నృపాలుడు గూడ గొప్పపండితుడై శాలివాహన శకము 1349వ సంవత్సరము (క్రీ.శ. 1427)న రామాయణమునకు 'రాఘవీయ' మనునొకటీకను వ్రాసెనని యాతని భార్య రచింపించిన యొక శాసనమునందలి యీ క్రింది పద్యము వలన స్పష్టమగు చున్నది.

"శాకాబ్దే నిధి వార్ధిరామ శశిగేవ్యబ్దేప్లవంగే శుభే
మాసేప్యాశ్వయు జీరఘూద్వహ పదేయా రాఘవీయాహ్వాహమ్
టీ కామర్థపటు ప్రబోధఘటనా మాణిక్య పుష్పాంజలిం
కృత్వారాజతి రావుమాధవ నృపోరామాయణస్యశ్రియే"

ఇట్లు క్రీ.శ. 15వ శతాబ్ది తొలిభాగముననున్న సింగయమాధవ నృపాలుని యొద్ద మంత్రిగానున్న పోతరాజుననుజుడగు నయ్యలామాత్యుని కొడుకగు గౌరన 15వ శతాబ్ది పూర్వార్ధమున నుండె ననుటకు సందేహము లేదు. మఱియు శ్రీనాథునిచే శివరాత్రి మాహాత్మ్యమును దనభృత్యుడగు ముమ్మిడి శాంతయ్యకు గృతి యిప్పించిన శ్రీశైల జంగమ మఠాధీశ్వరుడగు శాంత భిక్షావృత్తిరాయడే గౌరనచే నవనాథ చరిత్రమును మల్లికార్జునుపేర గృతిగా జెప్పించుటచేత

నీ గౌరనయు శ్రీనాదుని కాలమువాడేయని విస్పష్టంబగు చున్నది. శివరాత్రి మాహాత్మ్యమునందు నైషధకాశీ ఖండాది పూర్వగ్రంధముల పోలికలు విశేష ముగా గనబడుచుండినను, అవతారిక దోషభూయిష్ఠమౌటను, ప్రౌఢ బంధము కలదిగా గనబడకుండుటను, శ్రీనాధుడు గతించిన పిదప నవతారిక యెవ్వరి చేతనో వ్రాయించి, ముమ్మిడి శాంతయ్య యాగ్రంధమును గృతినందెనను వాదము యధార్థమగుట తటస్థించినను దీనికి ప్రేరకుడగు శాంత భిక్షావృత్తి యతీశ్వరుడే నవనాధ చరిత్ర రచనమును బ్రోత్సహించిన వాడగుటచే గౌరన శ్రీనాదుని చరమ కాలమునను నాతని తరువాతను జీవించి యుండెననుటకు సందియములేదు.

ఇచట గమనించవలసిన విషయమేమనగా వీరశైవమతము 13, 14 శతాబ్దములలో ముమ్మరముగా ప్రచారమునందున్నది గనుక ఈ కవి వీర శైవుడుకాడు. ఈ సంప్రదాయముతో రచన చేయు ఆసక్తియు, మరియు శైవారా ధన దృష్టియందుంచుకొని రచనచేయు పద్ధతి ఈతడవలంబించినాడు. శివుని మహాత్మ్యమిట్టిదని చెప్పుట, శివుని గొప్పతనము చెప్పుటయే. అటువంటి కథ లను మనకు నవనాధచరిత్ర చెప్పుచున్నది. కర్మమార్గమందభిమానము కలదు గావున బ్రాహ్మణ్యంబుతో పొత్తునంగీకరించిన శైవమతావలంబియే తప్ప వీరశైవుడుకాడు.

ఇతడు 15వ శతాబ్దముననే ఉన్నట్లు డా॥ కోరాడ రామకృష్ణయ్యగారు, డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావుగారు, యితర సాహిత్యకులును భావించు చున్నారు [1].

## నాథ సంప్రదాయము - నవనాథ చరిత్ర

క్రీ. శ. 15 శతాబ్దము నాటికి తెలుగుదేశములో వీరశైవమత వ్యాప్తి చాలా వరకు తగ్గినది. దాని స్థానములో ఆగమ శైవము చోటుచేసుకొన్నది. శ్రీనాదుడు పురాణములలో నున్న శివుని కథలను గ్రహించి అనేక కావ్య ములు రచించెను. పోతన వీరభద్ర విజయమును రచించుటకూడ నిట్టిదే. ఇదే సమయములో శైవమతమునకు సన్నిహితముగానున్న నాథ సంప్రదాయమను

1 నవనాధచరిత్ర (పీఠిక)

ఒక పద్ధతి తెలుగుదేశములో ప్రవేశించినట్లున్నది. ఆ సంప్రదాయము గౌరన నవనాథ చరిత్ర'లో దర్శనమిచ్చుచున్నది. ఇక నాథ సంప్రదాయమునుగూర్చి గౌరన కావ్యములో దాని స్థానము గురించి తెలిసికొందము.

శైవము, బౌద్ధము, జైనము, వైష్ణవము మొదలగు సంప్రదాయములు భారతదేశములోని వివిధ ప్రాంతములలో ఉద్భవించి ఆంధ్రదేశమునందు ప్రవేశించి విస్తరించినట్లు గానే నాథ సంప్రదాయము కూడా ఉత్తర దేశములో ఉద్భవించి క్రమముగ ఆంధ్ర దేశమునందు కొందరిని ఆకర్షించినట్లు కన్పించుచున్నది. క్రీ. శ. 12వ శతాబ్దము ప్రారంభములో ఈ సంప్రదాయము వంగ దేశము నందలి ఈశాన్య భాగమున ప్రారంభమైనట్లు చారిత్రకులు అభిప్రాయ పడుచున్నారు. అయినను యింతకుపూర్వము అనగా 7, 8 శతాబ్దులలోనే ఈ సంప్రదాయము మన దేశములో ప్రారంభమైనట్లు ఆచార్య తుమ్మపూడి కోటేశ్వరరావు గారు అభిప్రాయ పడిరి. కారణమేమనగా ఈ సంప్రదాయమునకు సంబంధించిన సాహిత్యము వంగదేశములో 12వ శతాబ్దము తరువాతనే కనిపించుచున్నది ఈ సంప్రదాయమునకు వంగదేశమే కేంద్రస్థానమై నిలిచినది. క్రమముగా ఒక పరిమిత స్థితిలో ఈ సంప్రదాయము ఉత్తర భారత దేశములోని పంజాబ్, సింధు, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, ఒరిస్సా, మహారాష్ట్ర మొదలైన ప్రాంతములలో విస్తరించినది. మనదేశమునకు ఈ సంప్రదాయము ఓఢ్ర దేశమునుండి వచ్చి ఉండును. లేదా మహారాష్ట్రమునుండి కూడా తెలుగు దేశములో ప్రవేశించి యుండును. చాళుక్యరాజులు చాలా కాలముగ మన దేశముతో రాజకీయ సంబంధము పెట్టుకొనుట వలన ఇది ఆంధ్రదేశములో ప్రవేశించుటకు అవకాశము కన్పించుచున్నది. ఇట్లుకాక ఓఢ్ర దేశమును పరిపాలించు గజపతులు రాజకీయముగా సాంఘికముగా అప్పుడప్పుడు ఆంధ్ర దేశముతో సంబంధములు పెట్టుకొని ఉండుట చేతను నాథ సంప్రదాయము తెలుగు దేశములో ప్రవేశించుటకు అవకాశమున్నది. లేక ఈరెండు మార్గముల నుండి కూడా ఇది ప్రవేశించినదేమో !

ఇతర ప్రాంతములలో ఈ సంప్రదాయము అనేక మతములలోనికి ప్రవేశించి సంకీర్ణమై పోయినది. నేపాళ దేశములో బౌద్ధముతోను, పశ్చిమ భారత దేశములో శైవ మతముతోను, బెంగాలు ప్రాంతములో మహమ్మదీయ

మతముతోను, కలిసి పోయినట్లు తెలియవచ్చుచున్నది. కాని ఈ సంప్రదాయము మనదేశములో, మన సాహిత్యములో వైష్ణవముతో ఏకీభావము చెందినది. ఈ సంప్రదాయానుయాయులకు రుద్రాక్ష, విభూతి, త్రిశూలధారణ, శివరాత్రి, చైత్రోత్సవములు శివాంకితముగా చేయుట ఇది శైవముతో ఎట్లు చేరిపోయినదో చెప్పుచున్నది. నవనాథులలో ఒకడైన గోరక్షుని శైవులు భైరవ మూర్తి యొక్క అంశముగా భావింతురు. గోరక్షునికి గురువు మత్స్యేంద్ర నాథుడు. అతని వలననే యిది శైవములో సంకీర్ణమైనదిగా భావింతురు.

నాథ సంప్రదాయము యదార్థమునకు ఒక తాంత్రిక యోగ సంప్రదాయము. తాత్త్వికమైన చర్చలకు సిద్ధాంతములకు దీనిలో ప్రాధాన్యములేదు. తాంత్రికులకు సాధన అనగా యోగమార్గము ప్రాధాన్యము వహించునట్టిది. వీరిది హఠయోగ మార్గము. పరమజ్ఞాన సిద్ధి వీరికి ధ్యేయమైనది. 'హఠయోగ ప్రదీపిక' అనే గ్రంథము ఈ సంప్రదాయ వాదులకు పరమప్రమాణమైన గ్రంథము. పరమజ్ఞాన సిద్ధిని అష్ట సిద్ధులలో వీరు ఒకటిగా భావింతురు. హ-అనగా సూర్యుడు, అనగా కుడి శ్వాస. ఠ-అనగా చంద్రుడు-అనగా యెడమ శ్వాస. అవధూత - అనగా సుషుమ్నలో సమన్వయించుట అనగా ముక్తి. హఠయోగమునకే చంద్ర యోగమని కూడా పేరు. ఇట్టి స్థితిని పొందినవాడు పరమజ్ఞాన సిద్ధిని పొందుచున్నాడని వీరి విశ్వాసము

అయితే ఈనాథ సంప్రదాయ మెప్పటిదను ప్రశ్న ఉదయించుచున్నది. గౌరన 'నవనాథ చరిత్ర' లో కన్పించు మత్స్యేంద్ర నాథుని అభినవ గుప్తుడు 'తంత్రాలోకం' లో స్తుతించినట్లు ఆచార్య శ్రీ తుమ్మపూడి కోటేశ్వరరావుగార భిప్రాయపడిరి. 1050 నాటికే నాథ సంప్రదాయ రచనలన్నీ వెలువడినను, మత్స్యేంద్రనాథుడు అంతకంటే పూర్వుడని వీరభిప్రాయము. కాని ఎంత పూర్వుడన్నది యిత్థమిత్థముగా వారు చెప్పలేదుగాని 7, 8 శతాబ్దుల నాటిదని ఊహించుట కవకాశము కలదు.

నాథ సంప్రదాయస్థులు కూడా ' శివుడొకడే ' దైవమని చాటినారట. కాని వీరశైవులవలే వీరిది భక్తి యే మతముకాదు. యోగ సాంప్రదాయం వీరి మత ధ్యేయను నాథ సంప్రదాయస్తులు మత వ్యాప్తి కొరకు పాటుపడలేదు. మత నిర్మాణము చేయుట వీరి ధ్యేయము కాదు. విభూతిధారణ వీరి మతములో

లేదు. వీరిది హఠయోగ మార్గము. బాహ్య వేషధారణకు ప్రాముఖ్యము లేదు. వీరశైవములో వలె ఇందు విశిష్ట లక్షణములేవు. స్త్రీ ప్రధానము లేప్పు సంఘము కాదు.

గౌరన కావ్యములో మనకు 'కన్‌ఫటా యోగులు' అను మాట వినవచ్చు చున్నది. ఈ కన్‌ఫటా యోగులు చెవులకు ప్రోవులు ధరింతురట. ఈ ప్రోవులు గుండ్రముగా చంద్రాకారముగా చదునుగా (Flat Rings) నుండునని ప్రతీతి. ఇందు దర్శని, కుండలము అని రెండు రకములు గలవు. దర్శని అనగా గుండ్రపాటి ప్రోవులని అర్థము చెప్పబడినది. చెవులు కుట్టుకుంటే గాని యోగి కాజాలడట. దానిచేత పవిత్రులగుదురట. అందుచే 'పావిత్రి' అని చెప్పబడినది. గౌరన నవనాథ చరిత్రలో మొదట మత్స్యేంద్రనాథుని యోగ పద్ధతి వర్ణించి నాడు. ఆజన్మ సిద్ధుడుగా చెప్పబడినాడు. మత్స్యేంద్రనాథుని సంప్రదాయము (Cult) ౪వ శతాబ్దిలో ఒరిస్సాలో వ్యాప్తి చెందినది అచట ఒక దేవాలయము మధ్యలో భైరవుడు గలడట. చుట్టూ ౬౪ యోగశక్తుల మందిరములు కలవట. ఆ గుడి కడియమాకారములో ఉన్నట్లు ప్రతీతి. నాథ సంప్రదాయములో భైరవ శబ్ద మునకు ప్రాముఖ్యము కలదు. భైరవోపాసన వీరి ధ్యేయము. శివుడే భైరవుడు. కాశ్మీర శైవములో కూడా భైరవోపసాన కలదు. షడచక్ర భేదనము గోరక్షుడు రూపకల్పన చేసినట్లు తెలియు చున్నది. దీనివలన అష్టసిద్ధులు లభించునని నాథ సంప్రదాయస్థుల నమ్మకము. మొదట ప్రారంభములో ఈ మతాను యాయులకు తీర్థ యాత్రలు, పుణ్యక్షేత్రములు దర్శించుట, విగ్రహారాధన, సగుణోపాసన ఇవేమియు లేవు. ఈ నిర్గుణతత్వమే భైరవుడు. క్రమముగా విగ్రహారాధన, తీర్థ యాత్రలు మున్నగునవన్ని ఈ సంప్రదాయములో వ్యాపించినవి. రస వాదము కూడా వీరిలోకలదు. అదియే నవనాథ చరిత్రలో నాగార్జునుని కథలో కన్పించును. జైన, బౌద్ధ, తాంత్రిక సాంప్రదాయముల నుండి ఈనాథ సంప్ర దాయము వచ్చెనని ప్రతీతి జైన తీర్థంకరులలో 'నేమినాథుడు' అను యోగి కలడట (4 వ శతాబ్దం కావచ్చును) నీమ్ - అనగా వేప. చెవులకు ప్రోవులు కట్టించుకుని వేపపుల్ల వాడుదురు. 'నేమినాథుడు' నుంచి నాథ సంప్రదాయం వచ్చెనని ప్రతీతి. ఈ సంప్రదాయము కూడా కర్నాటకలోనే ఎక్కువ వ్యాప్తి చెందినట్లు గౌరన కావ్యము వలన తెలియుచున్నది.

శ్రీశైలములో శాంత భిక్షా వృత్తి చెప్పగా గౌరన ఈ కావ్యము వ్రాసినట్లు చెప్పుకొనినాడు. ఈ శాంతభిక్షా వృత్తి ఆనతివలననే శ్రీనాధుడు 'శివరాత్రీ మాహాత్మ్యం' వ్రాసినట్లు చెప్పినాడు. కాబట్టి గౌరన, శ్రీనాధులు సమకాలికులని తెలియుచున్నది. ఇంకను శ్రీనాధుడు నాథ సంప్రదాయమును గౌరవించిన వాడుగా దర్శనమిచ్చుచున్నాడు. రాజస్థాన్‌లో 'శ్రీనాథ దేవాలయం' గలదట శ్రీనాథ శబ్దము. నాథ సంప్రదాయమును సూచించుచున్నది. శ్రీనాధుడు హర విలాసములో కామాక్షీ స్తుతిలో అవతారికలో శ్రీనాథుడు నాథ సంప్రదాయం గురించి చెప్పెను.

ఒరిస్సా రాజు కొడుకు రత్న సంభవుడు, మన గౌరన కావ్యములో వచ్చు మత్స్యేంద్ర నాధుని శిష్యుడు. టిబెట్‌లో వజ్రయాన సంప్రదాయమును స్థాపించె నని ప్రతీతి. టిబెట్ వజ్రయాన యోగసిద్ధుల సంప్రదాయమునకు, మత్స్యేంద్రుని వజ్రాయాన మునకు సంబంధము గలదట. ఇందెంత యదార్థము గలదో తెలియదు గోరఖ్‌పూర్‌లో వీరి మఠములు గలవు. ఈ విషయము 'గోరక్ష శతకము' వలన కొంత తెలిసికొన వచ్చును.

ఇంక గౌరన కావ్యములో చెప్పిన హఠ యోగమురో అష్టసిద్ధులు కలవు. పరకాయ ప్రవేశ మిట్టిదే. నాథ సంప్రదాయములో యోగ సిద్ధులు పొందినవారు చేయువిద్యలలో గాలిలో ఎగిరిపోవుట, నీటిపై తేలుట మున్నగు నవి కూడ గలవు. ఇవన్నియు గౌరన కావ్యములో కథలలో మనకు కన్పించును. ఇదే సందర్భములో గోరక్షనాధుడు అల్లమ ప్రభువు సంవాద విశేషములు చెప్పవలెను. గోరక్షుడు తన ఘనతను ప్రదర్శించుటకై అల్లమ ప్రభువును ఖడ్గముతో తనను ప్రహారము చేయుమనెను. ఆతడట్లు చేయగా కొండను రాతితో కొట్టినట్లు ఆ కొండకు హాని కలగనట్లుగా గోరక్షుని శరీరమునకు ఏ మాత్రము క్షతికలుగలేదు. అది తన యోగ విద్యచేత సాధించిన ఘనతగా గోరక్షుడు చెప్పెను. తరువాత అల్లమ ప్రభుతో రగాగోరక్షుడు అతనిని కొట్టెను కాని ఖడ్గము గాలిలో తిరిగిట్లుండెను గాని అతని శరీరమునకు ఖడ్గము తగులలేదు. అతనికి గాయముకాలేదు. ఈ శక్తియు అల్లమ ప్రభువుకు యోగ విద్య చేతనే సాధ్యమయినది. ఈ కథను బట్టి నాథ సంప్రదాయ యోగ విద్యా సాధకుడు తమ శరీరమును కఠినాతి కఠినముగా సిద్ధించుకొనువారు అని చెప్ప వలసియున్నది

నాథ సంప్రదాయము సృష్టి అనగా లోకసృష్టిని గురించి చెప్పుచున్నది. అనాది అనగా సృష్టి ప్రారంభము కాక పూర్వము శూన్యముగా నిరంజనముగా ఉండెనట. అది సృష్టికి పూర్వావస్థ. తమస్సుతో నిండినట్టిది. అట్టి అవస్థలో సృష్టి, కామన స్పందమై అదొక అండమై పైకి ఉబికినది. దాని నుండి ప్రథమ దైవమైన ఆదినాథుడు అవతరించినాడు.

అతడవతరించినప్పుడు అండస్వరూపము రెండుగా విభాగము చెంది భూమ్యాకాశములుగా సమస్త విశ్వమునకు రెండు హద్దులుగా పరిణమించినవి. ఆది నాథుని చెమట నుండి కేతక భార్యగా జన్మించినది. వీరికి జన్మించిన వారే త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ఈ త్రిమూర్తులు తపస్సు చేసికొనుచుండగా వీరి తండ్రియైన ఆదినాథుడు వీరిని పరీక్షించుట కొరకు తాను కుళ్లిన శవమై నదిలో తేలినాడట ఆ స్వరూపమును దుర్గంధమును బ్రహ్మ విష్ణువులు అసహ్యించుకొనినారు. నిరసించినారు కూడ. కాని శివుడు మాత్రము ఆ శవమును తన తండ్రిదిగా గుర్తించినాడు. ఆ శవమును దహనము చేసినాడు కూడ. ఆది నాథుని చితాభస్మము నుండి ఆదిసిద్ధి పంచకము జన్మించినది. నాభి నుండి మీననాథుడు కపాలము నుండి గోరక్షుడు, యెముకల నుండి హాదిపా, చెవుల నుండి కానుపా, పాదముల నుండి చౌరంగి అనువాడు నాథులుగా జన్మించినారు. ఈ ఆది సిద్ధ పంచకమే నాథ సంప్రదాయమునకు పునాదివంటిది. ఈ సృష్టి కథనము చూడగా వీరు కూడా ఋగ్వేదమును ఆధారముగా చేసికొనియే దీనిని చెప్పినట్లు కాన్పించును. పురుష సూక్తములో చెప్పబడిన సృష్టిక్రమమునకు దీనికి కొంత ఏకీభావము గోచరించుటయే దీనికి కారణము.

ఆదినాథుడు తన కుమారులలో శివుడు శ్రేష్ఠుడని గ్రహించి అతని తల్లిని, ఖేతకను, శివుని వివాహము చేసికొమ్మనెను. ఈ వివాహానంతరము ఈమెయే గౌరిగా, చెండిగా ప్రసిద్ధురాలైనది. ఐదుగురు సిద్ధులు వీరికి శిష్యులైనారు. మహా జ్ఞానము శివునికి తెలియును. ఆ జ్ఞానమును సంపాదించవలెనని గౌరికి కోర్కె కలిగెను. అది పరమ రహస్యము గాబట్టి ఈ రహస్యము బయలు కాకుండునట్లు సముద్రముపై వేదిక నిర్మించి గౌరీదేవికి చెప్పుట ప్రారంభించెను. ఈ విషయమును మీననాథుడు గ్రహించినాడు. అతడు నీటిలో దాగుకొని తన శక్తిచేత గౌరీదేవిని నిద్రింపజేసి శివుడు మహా జ్ఞాన

మును బోధించగా దానిని సంపాదించినాడు, నిద్ర తెలిసిన గౌరీదేవి మహా జ్ఞానమును చెప్పుమని తిరిగి భర్తను కోరినప్పుడు మీననాధుడు చేసిన మాయోపాయము తెలియ వచ్చినది. ఒక రోజులో మీననాధుడు తనకు తెలిసిన జ్ఞానమంతయు విస్మరించగలడని శపించినాడు.

గౌరీదేవి యాజ్ఞచేత ఈ ఐదుగురు సిద్ధులు గృహస్థులైనారు. మీననాధుడు కదళీ దేశములో వివాహితుడై స్థిరపడినాడు. హాదిపుడు పాటికా దేశము వెడలి రాణి మయనామతి దగ్గర ఊడ్చేవాడుగా స్థిరపడినాడు. కానుపా, దాహుకా దేశము వెళ్ళినాడు. శిశుపా అను చౌరంగీ నాధుడు పినతల్లిని వివాహము చేసికొనినాడు. గోరక్షుడు ఒక సన్యాశియైన రాజ కుమార్తెను పెండ్లియాడినాడు. మొదటిరాత్రి రాకుమార్తె గదిలోనికి రాగా గోరక్షకుడు శిశువై ఏడ్చినాడట. అందులకామె భయపడగా తాను స్త్రీ పురుష తత్త్వాతీతుడనని చెప్పి ఆమె దుఃఖ నివారణోపాయముగా తన ఒంటిమీదదనున్న గుడ్డపీలికను ముంచిన నీళ్ళను ఆమెచేత త్రాగించినాడు. అప్పుడు సద్యోగర్భములో ఆమెకొక కుమారుడుదయించెను. అతడే కర్పటి నాధుడు. కర్పటమునకు గుడ్డ పీలిక యని అర్థము. తరువాత గోరక్షుడు తపస్సు చేయుటకు విజయ నగరములోని వకుళ వృక్షము నాశ్రయించినాడు. ఇతడు దక్షిణ దేశమునకు వచ్చినట్లుగా ఈ కథనము వలన తెలియవచ్చు చున్నది.

ఒకనాడు గోరక్షకుడు వకుళ వృక్షచ్ఛాయలో నున్నప్పుడు అతని మీద మనిషి నీడ పారినట్లుగా స్ఫురించినది. అతడు పైకి చూడగా కానుపా ఆకాశములో వెడలుచున్నట్లుగ కన్పించెను. వెంటనే గోరక్షకుడు తన పాదరక్షను విసరి అతనిని భూతలమున పడవేసినాడు, కానుపా తాను హాదిపా శిష్యుడనని చెప్పగా గోరక్షకుడు తాను మత్స్యేంద్రనాధుని శిష్యుడనని అనెను. ఈ మత్స్యేంద్రుడు కదళీదేశములో అంగనా లోలుడు అయినాడని ప్రభువైన గోపీచంద్రుని ఆజ్ఞచేత గోతిలో పాతిపెట్టబడినాడని తెలిసికొనెను. వీరిద్దరు అతనిని రక్షించుటకు కదళీ దేశమునకు వెళ్ళిరి. ఎటులో అనేక వేషములు వేసి చివరకు నర్తకి వేషములోని మీననాధుని గోరక్షకుడు దర్శించెను. కాని తంత్రి శాపవశమున మీననాధుడు మహాజ్ఞానమును విస్మరించి యుండెను. గోరక్షకుడు తన నాట్యము చేతను మృదంగ వాదనము చేతను గురువుకు

జ్ఞాన స్మృతిని కలిగించెను. మీననాధుడు తన కుమారుడైన బిందునాథుడు లేక మంజునాథుడు అనువానిని తీసికొని కదళీ దేశమునుండి వెడలిపోయెను.

హాదిపా కథ యింకొక విధముగా నుండును, ఈ హాదిపాకే మరొక పేరు జాలంధరి. ఇతడు పాటికా రాణియైన మయినామతి దగ్గర ఊడ్చు వాడుగా నియమితుడైనాడు. ఆమె ఒక యోగిని. ఆమెకడ అనేక శక్తులుండె నట. తన చిన్నతనములో ఒక సిద్ధునికి అనేక సేవలు చేసి అతడివలన ఈ శక్తులు సంపాదించెను. హాదిపా మహా జ్ఞానియైన తరువాత రాణి కుమారు డైన గోపీ చంద్రుడు ఆమె ఆజ్ఞచే హాదిపాకు శిష్యుడయ్యెను. అతడు ఒక సారి యోగ శక్తులను నిందించెనట, దానికి కోపించిన గురువు అతనినుండి ఆ శక్తులను ఉపసంహరించినాడు. రాజైన గోపీచంద్రుడు దానికి ప్రతీకార ముగా హాదిపాను బ్రతికుండగానే పాతిపెట్టించెను. తరువాత కానుపా వచ్చి అతనిని రక్షించెను. గోపీచంద్రుడు మూడు జన్మల తరువాత బుద్ధి తెచ్చు కొని హాదీపాకు శిష్యుడయ్యెను. సన్యసించెను, ఈ కథలు మన పురాణముల లోని కథలకు మారు రూపమున ఉన్నట్టి కథలే యని డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావుగారి యభిప్రాయము. మీననాధుని కథ మత్స్యావతార కథకు సన్నిహితముగా గలదు. మత్స్యావతారములో వేదజ్ఞాన రక్షణ చేసినట్లున్నది.

ఈ సిద్ధనాదులు అందరును సమకాలీనులే. వీరిలో ఒక నాగార్జునుడు కలడు. అతడు శాతవాహన యుగములోని మాధ్యమిక సిద్ధాంతవాదియైన నాగార్జునునితో ముడిపడినట్లు ఒక కథ నవనాధ చరిత్రలో కన్పించును. కాని సిద్ధ నాగార్జునుడు వేరు, ఆచార్య నాగార్జునుడు వేరు. ఈ నాథ సంప్రదాయ ములో రస వాదము, కాయసిద్ధి, వయస్తంభనము, ఆకర్షణ మొదలైనవి పెనవేసికొని పోయినవి. గౌరన తన గ్రంథములో ఈ అల్లిబిల్లి సాంప్ర దాయమును జాగ్రత్తగా నిర్వహించినాడు. ఈ సిద్ధనాదులు అమృతజ్ఞ సిద్ధి గోరక్షవాదము, రసవాదము, ఓషధీ సిద్ధులు, యోగ ప్రస్తావన మొదలగు గ్రంథములు రచించినట్లు తెలియవచ్చుచున్నది.

శ్రీవిద్యకు కేంద్రమైన శ్రీ చక్రములోని నవావరణములకు నవనాధులు గురువులుగా నాథసాంప్రదాయములో చెప్పబడినారు. ఆదినాథుడు మహేశ్వ రునివంటివాడుగా పేర్కొనబడినాడు. శ్రీచక్ర ప్రథమ త్రికోణములోని మూడు

కోణములు మూడు పీఠములు జాలంధరము, ఉత్తరకోణము ఇట్లు చూడగా ఈ నాధ సంప్రదాయము శ్రీ విద్యా సంప్రదాయములోనికి ప్రవేశించినది. [1]

## నవనాథచరిత్ర - కథావిశేషములు.

గౌరనకూడ కృత్యారంభములో కృతి ప్రశంస, ముక్తి కాంత బిక్షా వృత్తిరాయ ప్రశంస, కృతి కర్త ప్రశంస చేసినాడు. ఈతడుకూడ తన కావ్యమును శ్రీశైల మల్లికార్జున కంకిత మొనరించినాడు.

ఇక నవనాథచరిత్రలో కావ్య విషయమేమనగా యోగమభ్యసించి సిద్ధి బడసిన తొమ్మండుగురు సిద్ధపురుషుల జీవితచరిత్ర, వైష్ణవమున పన్నిద్దరాళ్వారులు, శైవమున అరవత్తుమూవురు నాయనారులు, వజ్రయాన బౌద్ధ తాంత్రికులలో చౌరాశీ సిద్ధులువలెనే యోగ సంప్రదాయములో ప్రసిద్ధులైనవారు నవ నాధులు.

వీరు వేరువేరు ప్రాంతములవారు. కాని వీరి కథలు దేశమంతటా వినిపించును. వీరువ్రాసిన యోగశాస్త్ర సంబంధిత రచనలుకొన్ని సంస్కృతములో నున్నను, అంతకు రెండింతలుగా ప్రాచీన హిందీ, బెంగాలీ భాషలలో దొరుకుచున్నవి. కట్టుకథలుగా చెప్పుకొనుచున్న వీరిచర్యలు చరిత్రలు కొన్ని బెంగాలీ భాషలలోను మహారాష్ట్ర భాషలలోను కనిపించును. [1] యోగ సంప్రదాయావిష్కృతివంటి కొన్ని సంస్కృత గ్రంథములలో వీరి చర్యాచరిత్రాదికము కొంత వివరింపబడినను వానిలో కొన్ని. సంవాదములు, పరస్పర విరుద్ధములైన కథలు కనిపించును. నవనాధులనగా ఎవరెవరు అను విషయములోకూడ భిన్న మతము లున్నవి. ఒక జాబితా వేరొకదానితో సరిపోదు. శైవులు, కాపాలికులు, కాశ్మీరాగమవాదులు, త్రిపురా సాధకులు, మానభావ మతస్థులు, మున్నగువారెందరో నాథమతము నాదరించుతురు. అన్ని సంప్రదాయ

1 నవనాథ చరిత్ర - నాథపంథా

డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు,

భారతి (ఏప్రిల్ 1986) నవనాథచరిత్ర - అనుశీలన వ్యాసము

డా॥ మట్నూరి, సంగమేశం.

ములు శివుని ఆదినాథునిగను, మత్స్యేంద్రుని అతని మానసపుత్రుడుగను, గోరక్షనాథుని మత్స్యేంద్రుని ప్రధాన శిష్యునిగను, యోగమార్గ ప్రవర్తకుడుగను పేర్కొనును. గోరక్షుని సతీర్థుడుగా ప్రసిద్ధి చెందిన చౌరంగి నాథుని చరిత్రము గౌరన వాక్యములో ప్రముఖస్థానము వహించినది.

అంతేకాదు, గోరక్షు డతనిని గురుతుల్యునిగా గౌరవించినట్లు గౌరన వర్ణనలు సాక్ష్యమిచ్చును. మేఘనాథ, విరూపాక్ష, నాగార్జున, ఖనికసిద్ధుల కథలు పూర్వాకార్యములతోకూడ వివరించి, ఆ పిదప సిద్ధబుద్ధినాథుని కథ ప్రాసంగికముగా చెప్పి గౌరన వీరినే నవనాథులుగా పేర్కొనెను. అపైన వీరి శిష్య ప్రశిష్యుల పేర్లు సుమారు డబ్బదికిపైగా సంగ్రహించెను. యోగ సంప్రదాయా విష్కృతి, హఠయోగప్రదీపిక మున్నగు వాటితో సరిపోల్చిచూచినప్పుడు గౌరన సంగ్రహించిన పేర్లలో కొన్ని సరిపోయి, కొన్ని సరిక్రొత్తగా కనిపించును. నవనాథుల శిష్యులుగా పేర్కొనిన వారిలో ఆత్రేయ సిద్ధనాగార్జునుడు, వ్యాళి, గోరక్కు, గోరంటకుడు అనువారి కథలుకూడ గౌరన తన కావ్యములో వర్ణించెను. పరంపరలెట్లున్నను వీరందరు ప్రసిద్ధులైన నాథసిద్ధులు. వీరి కథల కొకవిధమైన ఐక్యత ఘటించి నవరస భరితమైన కావ్యముగా వీటిని సంతరించిన ఘనత గౌరనది:

గౌరన కావ్యము ఆదినాథుడైన శివుడు పార్వతికి యోగ ముపదేశించిన ఘట్టముతో ప్రారంభించును. దీనికి చక్కని వాతావరణముగా గౌరన వసంత శోభను వర్ణించి దానిని శివపార్వతుల జలక్రీడకు అనువైన పీఠికగా సంతరించెను. వసంత ఋతువు "నీ కంధరుగాల్వ నెఱివచ్చినట్లు" వచ్చినదట.

"తరుల ప్రాయపుమందు- తావులపొందు
విరహులమంటకో విలగమిపంట
రతి సుఖంబులచొక్కు రసికులమ్రొక్కు
రతిరాజు జోక విరక్తుల ధాక
పువ్వుబోణులయుబ్బు పుష్పాస్త్రుగబ్బు
పువ్వుదేనెల పెచ్చు భోగులమెచ్చు

(న.చ. పుట 11)

వెలయగా వచ్చిన వసంత వేళలో నా ఆదిమ దంపతులు జలకేళి సవరింతురు. ఆ సందర్భమున శివునికి వీర్యపతనమై, ఆ వీర్యము నొక చేప మ్రింగగా దానికి సద్యోగర్భమున మత్స్యేంద్రుడుదయించును.

జలక్రీడ ముగించి జలాశయపుటొడ్డున విశ్రమించుచున్న సమయమున పార్వతి కోరికపై శివుడామెకు యోగరహస్యము లెరిగించును. జలాశయములోనున్న మత్స్యేంద్రుడా రహస్యములు వినుచూ, పార్వతి ఏమరినప్పుడు తాను ఊ కొట్టును. శివుడది గ్రహించి, ఆ కుమారుని బయటకు పిలిచి, అనుగ్రహించి, యోగ విద్య కడముట్ట నుపదేశించి, సిద్ధులు ప్రసాదించి వరములిచ్చి పంపును. ఈ విధముగా యోగవిద్యకు శివుడు ఆదినాధుడు. మత్స్యేంద్రుడు కలిలో భూలోకమున దానిని ప్రవచించిన మొదటి సిద్ధుడు. యోగ సంప్రదాయావిష్కృతిలో శివపార్వతీ సంవాదమును విన్నవాడు భృగువంశములో పుట్టిన బ్రాహ్మణుడుగా, గండ యోగమున పుట్టినందున నీటిలో పారవేయబడినవాడుగా వర్ణింపబడెను. అతడు నవనారాయణులలో ఒకడైన కవినారాయణుని అవతారముగా పేర్కొనబడెను. బహుశా, యిది మత్స్యేంద్రుడు బ్రాహ్మణుడని, అవతారపురుషుడని చెప్పుటకై అల్లిన కథ.

నవనాధ చరిత్రలో శివుడు మీనానదునికి వరములొసంగుట యను ఘట్టములో గౌరన హస్త మస్తక సంయోగమను ప్రయోగము శివుని కుద్దేశించి చేసినాడు. ఇది ఒకవిధముగా శివుని అధిక్యతను చెప్పుటయే. * ఈ వర్ణన వలన ఇది శైవ శాక్తాగమములకు, పాతంజలి యోగమునకు, హఠయోగ సాధనకు, రసౌషధ ప్రక్రియలకు కూడ సరిపోవునట్టి ఒకానొక సమన్వితయోగమార్గమనుట స్పష్టము.

కలి ప్రవేశించిన పిదప మత్స్యేంద్ర యోగి దేశసంచారమునకు వెడలెను. గౌరన కవి అతడు

"కాళింగ బంగాళ కరహాటలాట
గౌళ కేరళ చోళ కర్ణాట మాట

* భారతి ఏప్రిల్ 1976. నవనాధ చరిత్ర. అనుశీలన. డా॥ ముట్నూరి సంగమేశం (వ్యాసంనుండి)

కుకురు కోంకణ పౌండ్ర కురు కోసలాది
సకల దేశంబులు సాగరంబులును
దీవులు బురములు దీర్థముల్ గిరులు
దేవాలయంబులు దిరిగి కన్గొనుచు
వలవడ నొకచోట నమ్మహా యోగి
తిలంకుండు మాళవ దేశంబు చొచ్చి
వఱపున గఱపున వైరుల వలన
వెఱపును దెవులు నొప్పియును శోకంబు
నేడ నెనరిడు లేక యేచి భూప్రజలు
పాడియు బంటయు బహుళ సంపదలు
గరిగి నెమ్మదినుండ గనుచుదావారి
వలన నాదేశంబు వలనొప్పనేలు
నేలిక రాజ మహేంద్ర నరేంద్రు
బోలరు తక్కిన భూభుజులెల్ల
దేజంబునను గాంతి దేకువ చేదుల
రాజసంబునగ్రహ రాజును రాజు
రాజశేఖరు రాజ రారాజు
ననిన నవ్విభుడు మహా వైభవమున
దనర వసించు మాంధాతను పురము

(న. చ. పుట 31)

సకల దేశములు తిరిగి మాళవ దేశము చేరినట్లు వ్రాసెను. అచట గల మాంధాతృ పురమును చూచి, రాజైన రాజ మహేంద్రుని కీర్తి విని సంత సించి, నర్మదా తీరమునగల ఓంకార తీర్థమును సందర్శించి, తత్సమీప కాంతర సీమలో నొక గుహలో నిలిచి యోగ మనువర్తింప సాగెను. రాజ మహేంద్రుని పశుపాలకుడైన గొల్లవాడతనిని చూచి, మహాత్ముడని గుర్తించి సేవింపసాగెను. ఈ గొల్లయే పిదప మత్స్యేంద్రుని అనుగ్రహమున యోగియై గోరక్షనాధుడను పేర ప్రసిద్ధి చెందిన వ్యక్తి.

యోగ సంప్రదాయావిష్కృతిలో మత్స్యేంద్రుడు గిరినార్ ప్రాంతమున నొక గుహలో నిల్చి యోగసాధన చేసినట్లును, గోరక్షదతనిని ఏడేండ్లు సేవించినట్లును చెప్పబడినది. ఇదే గ్రంథమున గోరక్షుడు గోదావరీ తీరమున 'చంద్రగిరి' అనుచోట జన్మించెననియు, ఒకనాడు గోవులను కాయుచుండగా అతనిని పాము కరిచినదనియు వ్రాయబడెను. గోరక్షసహస్ర నామస్తోత్రములో నతడు దక్షిణ దేశమున 'బడబ' అను ప్రాంతమున జన్మించినట్లు చెప్పబడెను. గోరఖ్‌పూర్‌లో అతని సమాధి గల చోటునే అతడు పుట్టిన చోటుగాకూడ చెప్పుదురు. [1] కొన్ని కథలితనిని బ్రాహ్మణుడనును, మరికొన్ని తంతువాయుడని చెప్పును. వేరొకనోట 'తేలి' అని వినిపించును, గ్రియర్సన్ సంగ్రహించిన కథననుసరించి గోరఖ్ నాథుడు కలిలో కథియవాడ్‌లో జన్మించిన సిద్ధుడు. ఇవన్నియు చూచినపిదప ఉత్తర కథాబలమున, గౌరన చెప్పినదే కొంతవరకు సత్యమునకు సన్నిహితమనిపించును. సంప్రదాయములో ఇదే పేరుగల సిద్ధులు అయాకులస్థలాదులు కలవారువెలసి యిట్టి భ్రాంతులకు కారణమైయుందురు. గౌరన కావ్యములోనే గోరక్షునికి తోడు గోరక్కు అను సిద్ధుడు కూడ వర్ణింపబడెను. * గోరక్షుడు చూచిన మత్స్యేంద్రుని రూపమీ క్రింది విధముగా వర్ణింపబడెను.

పొలుచు త్రిపుండ్రడంబు. పూత విభూతి
తళతళ మించుదం. తంపులాతాము
పొలుపారు పటికెంపు. బూసలపేరు
చెలుత కెంజెడలును. సింగినాదంబు
నేలు పట్టుగంతయు. నిగనిగమించు
ల దరేడు మణులకా. మాకులు మెఱయ
దొడలపై జేతులొ. త్తుగ నూదినడుము
నిక్కించి నిజముఖ. నీరజంబెత్తి

1. భారతి - ఏప్రిల్ 1986. నవనాథచరిత్ర. అనుశీలన. డా॥ మట్నూరి సంగమేశం.

* భారతి - ఏప్రిల్ 1986. నవనాథచరిత్ర. అనుశీలన. డా॥ మట్నూరి సంగమేశం.

తక్కక దృష్టిలో. దగులమగుడిచి
మహాసీతా యోగస. మాధిగూర్చున్న
యహిమాంశుతేజుని. నామీననాథు
గనుగొనిచోద్యంబు. గడలుకొనంగ
దనలోనవెఱచుచు. దగ్గఱబోయి
యోగనిద్రావస్థ. నొందియట్లున్న (న.చ పుట 3 )

అటువవంటి మీననాథుని గోపాలుడు దర్శించెను. నాథ యోగులరూప రేఖలు పలు తావుల నిట్లే వర్ణింపబడినవి. కాని వీరికి ముఖ్య చిన్నమైన శూలమును గౌరన బుద్ధిపూర్వకముగనే విడిచినట్లున్నది. "ముద్రనాద త్రిశూలైర్విమల రుచిధర ఖర్పరం భస్మ మిశ్రం" ఇత్యాదిగా వర్ణించిన జలంధరోక్తికి ఇది కొంత భిన్నము.1 జలంధరుడు గోరక్షకుని సతీర్థుడుగా పేర్కొన బడినను, అతని మతము కొంత వరకు కాపాలిక సమ్మతము. అట్లే, అతని ముఖ్య శిష్యుడైన కాన్హపాదుని మతము కూడ గారుడ సమ్మోహనాది తంత్ర బహుళము. గౌరన కావ్యములోని వీరి పేర్లు వినబడవు. ఇది అతని విశుద్ధ శైవ సంస్కారము పశు పాలకుడైన గోరక్షుని వృత్తి విద్యా నైపుణ్యము లెంగించుచూ గౌరన ఎన్నో పశురోగములు, వాటి చికిత్సలు కూడ గుదిగ్రుచ్చి చెప్పెను. ఈ పద్ధతి తక్కిన కథా కావ్యముల కొరవడియైనట్లున్నది. సింహాసన ద్వాత్రింశక నుండి హంస వింశతి వరకు గల కథా కావ్యము లన్నియునిట్టి పద్ధతులనుసరించినవే. గోరక్షుని గొల్ల వేషముకూడ ఇట్టి పర్ణల కొజ్జబంతిగా వర్ణింపబడినది.

తరువాత గౌరన సారంగధరుని (చౌరంగి) కథ చెప్పెను. మాళవ దేశపు రాజు రాజమహేంద్రుడు. అతని రాణి రత్నాంగి. భోగకాంత చిత్రాంగి. శివప్రాసాదమున బడసిన పుత్రుడు సారంగధరుడు.

ఈ విధముగా శివానుగ్రహమున పుట్టిన సారంగధరుడు పెరిగి పెద్ద వాడయ్యెను. రాజొకనాడు వేటకరుగును. సారంగధరుడు పావురములాడు

---

1. భారతి. ఏప్రిల్ 1' 86. నవరాథచరిత్ర. అనుశీన.
డా॥ మట్నూరి సంఘమేశ.

చుండగా, అది చిత్రాంగి మేడపై వ్రాలును. దానిని తేబోయి చిత్రాంగి మేడకరుగనున్న సారంగధరుని సుబుద్ధి వారింప నెంచును.

"పలుకులు బొంకులు। పసలు వేసాలు
వలపులు వెడవెడ। వాపులునున్న
మదిరాక్షులకు మది। మాటలట్లుండె
విదితంబు గానింక। వినుమొక్కమాట" (న.చ.పుట 51)

అని సుబుద్ధి బోధించినను వినక సారంగధరుడు చిత్రాంగి మేడకేగును. 'చక్కని వారిలో చక్కనివాడై'న సారంగధరుని చూచి, మోహించి చిత్రాంగి వావిడిచి తన కోర్కె దాపకచెప్పును.

'తల్లియే దైవంబు దలపోయననుచు
నుల్ల మారగ జెప్పుచుందురు బుధులు,
కలలోన, బరకాంత గదియుట నాకు
చెలియలి గామంచి చేపట్టుకొనులు (న.చ.పుట 60)

అని నీతిగా పలికిన సారంగధరునితోఁ గరువంబుమురువును కలికితనంబు గల చిత్రాంగి

'దైవంబుగాను నీ। తల్లినిగాను
భావింప నృపభోగ। భామినిగాని
భావజు గుఱి బారి। బాఱినపిదప
వావులేటికి ధర్మ। వర్తనంబేల
రతిరాజునాననా। రా చిలుకతోడు
చతురత నీతోడి। సరస సంభోగ
లీల దేలక వద। లి చనిపోలేను.
(న.చ. పుట 61)

అని తొందరించి, తప్పించుకొని పోవుచున్న సారంగధరుని పైవలువ అంకించుకొనును. అదియే తుదకు సాక్ష్యమై సారంగధరుడు 'పరిసెనంబున దిబ్బవట్టు

టకు సిద్ధపడినను' అతనిని దోషిగా నిరూపించెను. రాజతని కాలుచేతులు ఖండింప బంపును. రత్నాంగి ఎంత రోదించినను వినక రాజు ఈ పనికి పాల్పడినాడు. చిత్రాంగి తప్పు సాక్ష్యములతో రాజుని నమ్మించినది. అన్యాయముగా శిక్షబడి విలపించుచున్న సారంగధరునికి అతని పూర్వజన్మవృత్తాంత మెఱింగించి అశరీరవాణి యోదార్చును. ఆ మాటలు విన్న తలారులు రాజున కది యెరింగింతురు. నిజమెరిగి రాజు చిత్రాంగిని సూత్రద్రోయించి తానాత్మహత్య చేసికొనబోయి తిరిగి అశరీరవాణి వలననే సారంగధరుడొక సిద్ధుని కృపచేత కాళ్ళేతులు పొంది సుఖముగా నున్నాడని విని శాంతించును.

సారంగధరుడు బ్రతుకుట శివానుగ్రహమే. చంద్రశేఖరు ననుగ్రహము వలన పుట్టిన సారంగధరుని చంద్రశేఖరుడే ఆపదనుండి కాపాడినాడు. శివ భక్తులకు భక్తియే శరణ్యము. అసహాయ పరిస్థితులలో భక్తులనాదుకొనుట భగవంతుని కర్తవ్యము. కాలు చేతులు ఖండింపబడిన సారంగధరుని చూచి మత్స్యేంద్రుడతనిని తన గుహలోనికి తీసికొనిపోయి యోగ మంత్రౌషధ ప్రక్రియలచే తిరిగి అతని కాలుచేతులు మొలిపించి యోగముపదేశించును. మొలుచుచున్న కాళ్ళేతుల మొదళ్ళు నాల్గుచోట్లును ఎర్రగా కనిపించినందున మత్స్యేంద్రుడతనికి 'చౌరంగి' అని పేరు పెట్టెను. గోరక్షు నాతని చెంతవదిలి మత్స్యనాథుడు మాల్యవంతమేగును. కాని తాను సిద్ధుడనైతినన్న విషయము గుర్తించిన చౌరంగి గోరక్షుని వీడి మాల్యవంతమరుగును. గోరక్షుని వదలి వచ్చినందుకు మత్స్యేంద్రుడు మండిపడి, అది రాచబుద్ధి అని నిందించి, నిస్సంతు కమ్మని శపించి, వెంటనే అతనిని తోడ్కొని గోరక్షుని వద్దకు వచ్చును. పిదప వారు ముప్వురు యోగసమాధిలో నిలుతురు. అట్లు వారెన్ని దినములు సమాధిలో నుండిరో కాని ; సమాధి చాలించి లేచుసరికి రాజమహేంద్రుని రాజ్యమును, మాంధాతృ నగరమును నామావశిష్టములగును. 'పొలగానలనీరు' బుగ్గలకంటె, చాల నిస్సారమీ సంసార సుఖము' అన్న సత్యము చౌరంగి గోరక్షులకు స్వానుభవమయి సాక్షాత్కరించును.

ఈ కథలో నగరము, వేట, విలాసక్రీడ, నిశాముఖము, కేసారము, చంద్రోదయము, సూర్యోదయము వంటి చక్కని వర్ణనలతోపాటు, పూర్వజన్మవృత్తాంతము, అశరీరవాణి కథనము వంటి శివకవి సంప్రదాయములను

కూడ జోడించి మొదలి నుండి తుదివరకు కరుణాద్భుత సన్నివేశ భరితముగా సంతరించి గౌరన యీ కథను దేనికదే ప్రత్యేక కావ్యమన్నంత సొంపుగా రచించెను.

గౌరన వర్ణించిన యీ కథ చాలవరకు తక్కిన అనుశ్రుతులతో సమన్వయించు చున్నది. రాజమహేంద్రుడు తెలుగు రాజరాజ నరేంద్రుడుకాడు' ఆ భ్రాంతికి కారకుడు బహుశ దోనేరు కోనేరునాదుడు. ఈ భ్రాంతిని నివారించుటకో యన్నట్లు చేమకూర వేంకటకవి[1]

'మహిని రాజనరేంద్రుడు మాళవపతి
రాజరాజనరేంద్రుడు రాజరాజు
ననగ, బేరెన్నికకు నెక్కి యతిశయిల్లు,
నింద్ర విభవుండు రాజమహేంద్ర విభుడు,

అని సారంగధర చరిత్ర (1-౯) లో స్పష్టముగా వ్రాసెను.

బదరికాశ్రమములోని భువనేశ్వరాలయపు స్థలపురాణములో ఇదే కథ చిన్న చిన్న మార్పులతో వినిపించును. పంజాబ్‌లో ఈ కథ 'పూరన్ భగత్' అను వాని కథగా చెప్పుకొందురు. పూరన్ భగత్ రాజా రసూల్‌కి సవతి తమ్ముడు. వీరు స్యాల్ కోటలోని శాలివాహనుని పుత్రులు. ఆ వాహనుడు ఉజ్జయినీ రాజవంశస్థుడనియు స్యాల్‌కోటలో రాజ్యము సంపాదించెననియు చెప్పబడినది. పూరన్ భగత్ పుట్టుక మంచిది కాక, వేరొక యింటిలో నుంచి పెంచబడెను. తండ్రి ఒక చమార వనితను చేరదీసెను. ఆమె కపటోపాయమే పూరన్ భగత్‌కు కాలు సేతులేకాదు కండ్లు కూడ నాశనమగుటకు హేతువు. అంతేకాదు, ఇన్ని చేసి అతని నొక పాడు నూతిలో పారవేసిరి. గోరఖ్ నాథు

1. భారతి, ఏప్రిల్ 1966. నవనాథ చరిత్ర-అనుశీలన.
వ్యాసము — డా॥ మట్నూరి సంగమేశం.

దతని నుద్ధరించెనని కథ. స్యాల్‌కోటలో నేటికిని ఒక నుయ్యి 'పూరన్ భగత్ కూప'మను పేర ప్రసిద్ధముగా నున్నదట.[1]

చౌరంగినాథుడు వ్రాసిన 'ప్రాణ సంకలీ' అను గ్రంథ మొకటి లభించు చున్నది. ఇది ప్రాచీన హిందీ భాషలో నున్నది. దీనిలో నితడు తాను శాలి వాహనుడనని చెప్పుకొనెను. సవతి తల్లి కపటమునకు గురియైనట్లు కూడ వ్రాసికొనెను. పంజాబ్‌లో ఖిల్వాడీ అనుచోట నితని అగ్ని నేటికిని వెలుగు చున్నది. మాఘశుద్ధ చతుర్దశినాడు ఏటేటా అచ్చట ఉత్సవము జరుపుదురు. 'జొహర్ గద్దీ' అను పేరున ఇచ్చట నొక యోగాశ్రమ మున్నది. యోగి పరంపరలో చౌరంగినాథుడు పంజాబ్‌లోని పాగల్‌పంథ్ అను సంప్రదాయ మును స్థాపించినవాడు. ఆఫ్ఘనీస్థానపు రావల్ సంప్రదాయస్థులైన యోగులు కూడ ఇదే మతస్థులు. వీరిలో కొందరు ముసల్మానులు కూడ 'రావల్ గల్లా' లను పేర ప్రసిద్ధులు.[2]

ఈ కథలన్నియు చూచిన పిదప సారంగధరుని కథలో కొంత సత్యమున్నదనియు, అతడు మాళవ రాజ వంశస్థుడే కానగుననియు, సిద్ధుడైన పిదప పంజాబ్, ఆఫ్ఘనీస్థాన ప్రాంతములలో తన సంప్రదాయమును వ్యాపింప జేసినాడనియు నమ్మవచ్చును. గౌరన కావ్యములో చౌరంగి మత్స్యేంద్రునితో కలిసి మంచుకొండ కేగినట్లు వ్రాయపడెను. ఇట్లు దేశాంతరమతాంత రాసక్తుడగుట చేతనో యేమో గౌరన ఇతనిని గురుశాప తప్తునిగా వర్ణించెను. గౌరన మతములో నవనాథులు లౌకిక ధర్మావిరుద్ధులైన యోగసిద్ధులు.

గౌరన తన కావ్యములో నాథ సంప్రదాయమును గూర్చి ఏదో విధ ముగ గౌరవమును ప్రకటించు చుండును. ఈ సారంగధరుని కథలో కూడ అతడు ఇట్లే చేసెను. యదార్థమునకు సారంగధరునికి మీననాథుని యను గ్రహము చేత కాలు చేతులు మొలచుట ఆ విషయము తల్లితండ్రులకు తెలు

---

1. భారతి, ఏప్రిల్ 1986, నవనాథ చరిత్ర అనుశీలన వ్యాసం
డా॥ మట్నూరి సంగమేశం.

2. ,, ,, ,, ,,

యుట అను ఘట్టముతో కథ ముగింప వచ్చును. కాని ఆ సిద్ధుడు అతనిని మంచెపై కూర్చుండ జేయుట అతనికి యోగ విద్యను సాంగముగా నుపదేశించుట మొదలైన వృత్తాంతము ఈ నాథ సంప్రదాయ విశేషమే. 'చౌరంగి' యనబడిన సారంగధరుడు చివరకు నాథ సంప్రదాయ ప్రచారకుడుగా మారుట ఈ కథలోని విశేషము. దీనినిచ్చట మనము గమనించ వలెను. ఈ కథ ఒకవైపు మహేశ్వర మహిమను ఉల్లేఖించుచునే రెండవవైపు నాథ సంప్రదాయ విశేషములు ప్రకటించు చున్నది.

ఇక మహారాష్ట్ర దేశములో ఈ కథ కొంచెము మార్పులతో వినిపించును. మహారాష్ట్ర భాషలోని నవనాథ చరిత్రను బట్టి రచింపబడిన తెలుగు గ్రంథములోని 'చౌరంగి' పేరు కృష్ణాగరుడని కలదు. ఈతడు కౌండిన్య నగరాధిపుడగు శశాంగ నృపాలుని పుత్రుడు. ఈతని పట్టమహిషి మందాకిని. వీరికి చిరకాలము సంతానము లేకుండుటచే వీరు మాధవుని ధ్యానించి సంగమేశ్వరమున నాతని బూజింప నా ప్రదేశమున నొకనాడు రాజ ర్ఘ్యంబిడు సమయమున శివ వీర్యబలముచే నాతని యంజలి భాగంబున నర్భకుండుద్భవించెను. అతనిందెచ్చి రాజు భార్యకొసగి కృష్ణాగరుడని నామకరణం బొనర్చెను. పదప నీతనికి వివాహముజేయ రాజు ప్రయత్నము చేయు సమయమున మందాకినీదేవి మరణించుటయు, రాజుకొమరునికై యుద్దేశించిన చిత్రకూట నగరాధిపుని కుమార్తెయగు భుజావంతిని దానే వివాహమయ్యెను. ఈమె యొకప్పుడు నవ యౌవనుడగు కృష్ణాగురుని జూచి మోహించి, రాజు మృగయా వినోదంబున నరణ్యంబున కేగినతఱి యొక చెలికత్తియను బంపి యతనింబిలిపించి తన చిత్తమునగల చిత్తజుని తాపమును వెలిబెట్ట నాతడతి క్రుద్ధుండై యామె ప్రార్థనమును దిరస్కరించి తన యింటికి బోయెను. పిదప నీ విషయము కృష్ణాగరుడు తండ్రి కెఱింగించునేమో యను భయముచే పరితపించుచుండు సమయమున దన చెలికత్తె చేసిన దుర్బోధనలచే నేరంబు కుమారునిపై వైచి రాజునకు గోపము పుట్టించి, కరపాద ఖండనము చేయించెను అప్పుడా యూరద్రిమ్మరుచున్న గోరక్షునాధుడీ విషయము మత్స్యనాథునికి దెలిపి కృష్ణాగరుడు శివ వీర్యోద్భవుండగుట యెఱింగి, చతురంగ పీఠంబుపై కరచరణంబులు ఖండింపబడిన కతంబున నాతనికి చౌరంగనాథనామంబిడి, తండ్రి కెఱింగించి, వాని దోడ్కొని బదరి కాశ్రమంబునకుంజని, యచ్చట

ఘోరతపోనియమంబున గరచరణములతో గూడ మహాసిద్ధుల నాతడు బడయునట్లు చేసి యనుగ్రహించెను[1]

చేమకూర వెంకటకవి సారంగధర చరిత్రకు పీఠిక వ్రాయుచు అందా కథకు మూలమనందగిన చౌరంగి కథ నవనాథ చరిత్రములందిట్లు గలదని యీ క్రింది కథను వేదము వెంకటరాయ శాస్త్రిలుగారిచ్చియున్నారు.[2] రుద్రపురమున భులేశ్వరుడను రాజు గలడు. అతనికి చంద్రావతి, శోభావతి యను నిద్దఱు భార్యలు. శోభావతి సవతిని వెలార్చుటకై యామెపై అంకులుమోపి గర్భిణియగు నామె నరణ్యమునకు వెడలగొట్టించెను. ఒకశివాలయము కడనొక గంధర్వకన్య యీమెకు మత్యేంద్ర వ్రతముసుపదేశించెను. చంద్రావతియు మునుల యాశ్రమమున నొక సుతుని గని, చంద్రశేఖరుడని మునులచే నామకరణము చేయబడిన యతనికి మత్యేంద్రోపాస్తి నుపదేశించెను. ఒకప్పుడు భువనేశ్వరుడు యజ్ఞము చేయుచుండగా మునీశ్వరులతో గూడి యీ కుమారుడచ్చటకు బోవుటయు, యజ్ఞభూమికడ మునిశిష్యులతో బంతులాడుచున్న యీ కుమారుని శోభావతి చూచి మోహించి, యతని బంతి తన చేటికచే దెప్పించుకొనెను. బంతి యడుగబోయిన చంద్రశేఖరునికి శోభావతికిని పావురమడుంగబోయిన సారంగధరునికి చిత్రాంగికి జరిగిన వృత్తమే జరిగినది. శోభావతీ ప్రేరణంబున రాజు చంద్రశేఖరుని కాలు సేతులు తలారులచే దఱిగించెను. మత్స్యేంద్ర నాథస్మరణముచే నాతడు కాలుసేతులు మరల బడసి తల్లియొద్దకు పోయెను. రాజు సత్యమును దెలిసికొని శోకింప మత్స్యేంద్రనాధుడాతనిచే ప్రాయశ్చిత్తముగా నొక శివాలయము నిర్మింపజేసెను. అదియే బదరికాశ్రమమున భులేశ్వర మను పేరునున్న శివాలయమట.

వీనిని బోలిన కథ యొకటి కొంత భేదముతో కన్నడ భాషలోగూడ 'కుమార రాముని కథ' యను పేరుతో బొడసూపుచున్నది. పదునాల్గవ శతాబ్దిని కంపిలి రాయడను రాజొకడు హంపీ సమీపమునగల కంపిలి నగరము పాలించుచుండెను. అతనికి కుమార రాముడను కుమారుడొకడు కలడు. ఈతడు మహాశూరుడు. బహు బల పరాక్రమశాలి. దిగ్విజయార్థము బయలుదేరి యనేకులగు

1. నవనాథ చరిత్ర పీఠిక - శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు.
2. నవనాథ చరిత్ర పీఠిక - శ్రీ కోరాడ రామకృష్ణయ్యగారు.

రాజుల నోడించి, తండ్రికి గప్పము గట్టునట్లు చేసెను. మిక్కిలి బలవంతుడగు బళ్లాలరాజు నెదుర నమకట్టి ఓరుగల్లు ప్రతాపరుద్రుని సహాయమును వేడ, నాతడందుల వోల్లనందున నాతనితో బోరి ప్రతాపరుద్ర కుమారుని బంధించి, పిదప వానిని విడిచిపుచ్చి, ఢిల్లి సుల్తాను సాయమును గోరెను ఒకనాడు కంపిలి రాయడు వేటకై యరణ్యమునకు బోయిన సమయమున కుమార రాముడు స్నేహితులతో జెండ్లాట నాడుచుండ నా బంతి విధి వశమున రాజు రెండవ భార్యయగు రత్నాజీ మేడపై బడెనట. దానిని తెచ్చుకొనుట కీతడచటికిబోయి యామెనడుగగా నామే నీతనిని మోహించి, క్రీడాగృహమునకు రమ్మనుటయు, నాతడా పాప కార్యమున కంగీకరింపక విదిలించుకొని పారిపోయెను. రాజ రణ్యము నుండి యింటికి రాగానే రత్నాజీ కుమార రాముడు తండ్రి యింట లేని సమయము జూచి తన మేడకువచ్చి తన్ను బలాత్కరించెనని కొండెములు చెప్పగా రాజామె మాటలను నమ్మి కుమారునికి మరణ దండనము విధించెను. మంత్రియగు బయిచప్ప రత్నాజి చేసిన మోసమును తెలిసికొని కుమారు నొక పాతాళ గృహమున దాచి, యాతని వధింపించితినని రాజుతో జెప్పి యాతనిని సమ్మతింపజేసెను. రాజన్యాయముగ గుమారుని జంపించెనన్నవార్త లోకమున వ్యాపించెను. ఈ సందర్భముక ఢిల్లి సుల్తాను దెలిసికొని, కంపిలి రాజ్యమును స్వాధీనము చేసికొనుటకై కొంత సైన్యముతో బహదూర్ ఖానును బంపి, యాతడద్దానిని సాధింపలేక పోగా దానే స్వయముగా వచ్చి కోటను ముట్టడించెను. అప్పుడు కుమార రాముడు జీవించి యున్నచో శత్రువును, సులభముగా పాఱద్రోలి కోటను రక్షించి యుండెడి వాడని జనులందఱు రాజును నిందింప సాగిరి. ఆ సమయమున బైచప్ప మంత్రి భూగృహము నుండి కుమార రాముని దీసికొని వచ్చి, యాతని ముందిడుకుని కోటవాకిలి దెఱచుటయు, నా కుమార రాముడు శత్రు సేనలను జెండాడి, యావలికి బాఱద్రోలెను. కాని ఢిల్లి సుల్తాను సేన లపారముగా నుండుటచే, వారితో బోరాడుచు కుమార రాముడు రణరంగమున ప్రాణములు విడువ వలసిన వాడయ్యెనట. ఇట్లే కుమార రామ చరిత్రమును కన్నడమున రచించిన వాడు గంగాధరుడను శైవకవి. రాజమహేంద్రవరమునందు వలెనే అచ్చటను గొన్ని స్థలములను "చిత్రాంగి మేడ" "రత్నాంగి మేడ" 'యున్న స్థలము' లని చెప్పి చూపు చుండుట వాడుకలో కలదట. కాలు సేతులు నఱుక బడిన పిదప సిద్ధుడగుటను గూర్చిన గాథ లేకపోయినను,

మొత్తము కథలో కొంత సామ్యము లేకపోలేదు. ఇంకను బౌద్ధ జాతకము లలోగూడ వీనిని బోలిన కథగలదట. దీనినిబట్టి చూడ నీ సారంగధరుని కథ మిగుల ప్రాచీనమై, దేశ కాలములను బట్టి పెక్కు మార్పులు బొంది యనేక రూపముల బొడకట్టు చున్నదని చెప్పవచ్చును. కేవలము సారంగధరుని కథ తెలుగు సాహిత్యములోనే కాక, యితర సాహిత్యములలో గూడ ప్రసిద్ధి చెందె ననుటకు పై కథలే నిదర్శనములు. శివుని మహాత్మ్యము ఈ కథద్వార తెలి యుట మరియొక విశేషము.

చౌరంగి నాథుడు గురుని దర్శింపబోయి మాల్యవంతమేగుచున్నప్పుడు దారిలో నొకచోట మొసలితో పోరాడు చున్న సర్పరాజునకు సాయపడి రక్షించెను. దానికాపాము సంతసించి అతనికొక దివ్యౌషధమిచ్చి, మీననాథుని దర్శనము వేడుకొనెను. ఆ వృత్తాంతమువిని మీ నాథుడు చౌరంగి గోరక్షులతో కలిసి ఆ సర్పరాజును చూడనరిగెను. ఆ సర్ప మొక గంధర్వుడు. మీనా నాథుని దర్శనముచేత నతని శాపము తొలగి పోయెను. మీననాథుని కతడెన్నో దివ్యౌషధములిచ్చి తన లోకమునకేగెను. గోరక్షుని కథలో చౌరంగి కథయు, చౌరంగి కథలో సర్పరాజు కథయు ప్రారంభించినట్లే గౌరన యీ కావ్యములో నవనాథుల కథలన్నియు ఒకదానికొకటి సంబంధ పడినట్లుగా కూర్చి నడి పెను. ఇది అతని కథాకథన చాతురికి నిదర్శనము. దీని వలన కథలకేక వాక్యత కలిగి కుతూహల వృత్తికి భంగమురాని పద్ధతిలో కావ్యము నిర్వ హింప బడెను. ఇంతేకాక నవనాథుల కథలన్నిటికి సంబంధ మెట్లున్నదో గౌరన కావ్యములో నాథ సంప్రదాయము యోగమార్గ విశేషములు కూడ పడుగు పేకలవలె అల్లుకొని పేయినవని చెప్పుట అతిశయోక్తి కాదు.

సర్పము కథలో వచ్చిన గంధర్వుడు మహా భారతములోని ఒక కథతో సంబంధము కలిగినట్టివాడుగా కవి కల్పన చేసినాడు. ఆ కథ యిట్లుండును. మత్స్యేంద్రునితో సర్పము తన పూర్వజన్మ వృత్తాంతమిట్లు చెప్పెను. "ఓ మహానుభావా; దేవేంద్రుని దగ్గర నివసించెడి గంధర్వుడను నేను సర్ప రూప మును ఎట్లు ధరించితినో వినుము. పూర్వము పాండువంశములోని పరీక్షిత్తు డను రాజు వేటకై వెళ్ళి మహాటవిలో తపము చేయుచుండగా కూడదను

* నవనాథ చరిత్ర పీఠిక. శ్రీ కోరాడ రామకృష్ణయ్య.

నియమమును పాటించి ముందుగా మీరు మాట్లాడక పోవుటచేత కోపించి మీ కంఠములో మరణించిన సర్పమును వేసెను. రాజు వెడలిన తరువాత ఆ ముని శిష్యుడు శృంగియను వాడు వచ్చి గురువు కంఠములో మరణించిన సర్పమును చూచి చాల కోపించెను. ఇతని కంఠములో సర్పశవమును వేసిన వాడు సర్పవిషాగ్నిచేత మరణించునని శపించెను. ఈ విషయము తెలిసిన రాజు పరిక్షిత్తు ఒంటి స్థంబపు మేడలో రక్షణ చేసికొని యుండెను. అప్పుడు తక్షకుడను సర్పరాజు విప్రవేషముతో పరీక్షిత్తును సంహరించుటకై వెడలుచు వటవృక్షము క్రింద శయనించి యుండెను. అప్పుడు ధన్వంతరి వృద్ధ విప్రుని వేషములో రాజును బ్రతికించుననుచు వెడలుచు ఆ వటవృక్షము క్రిందకు చేరెను. తక్షకునకు ధన్వంతరికి పరస్పరము పరిచయమాయెను. "నేనీ వట వృక్షమును నా విషము చేత భస్మము చేసెదను. నీవు దానిని తిరిగి పునర్జీవము కలిగింతువా ? అని తక్షకుడనెను. నా సిద్ధ మంత్రముల చేత నీనట్లు చేయుదు నని విప్రుడు చెప్పెను. తక్షకుడు విషాగ్ని చేత ఆ వటవృక్షమును కాల్చి వేసెను. ధన్వంతరి ఆ భస్మముపై సంజీవని సిద్ధమంత్రముల నీటిని చల్లెను. అద్భుతముగా ఆకులతో, చివుళ్లతో, ఫలములతో, శాఖలతో, చివరకు పక్షు లతో కూడా ఆ వృక్షము తిరిగి బ్రతికెను. అతని మహత్త్వమునకు తక్షకుడు ఆశ్చర్యపడెను. మహాత్మా ! నీవు మహితాత్ముడవు. నీ సిద్ధ మంత్రములు గొప్పవి. అయినను ముని శాప దగ్ధుడైన పరీక్షిన్మహారాజును తిరిగి జీవింప జేయుట సాధ్యము కాని పని. నీవు ఆచటికి వెళ్లక తిరిగిపోయినచో రాజు యిచ్చెడి ధనమంతయు నేనే నీకిత్తును. అని మతిలేని ధనరాశులను చూపగా ధన్వంతరి వాటిని గ్రహించి తిరిగి వెడలి పోయెను. అప్పుడు నేను వృక్షముపై ఉండుటవలన ఈ వృత్తాంతమంతయు స్వయముగా చూచితిని. అంతేకాదు సర్పములు దుష్టములని నిందించితిని. ఈ నిందవిన్న తక్షకుడు కోపించి క్రూరమైన సర్పముగా జన్మించుమని నన్ను శపించెను. అప్పటినుండి నేను సర్ప రూపమున నుంటిని. నా శాపము ఎట్లు నెరవేరునని తక్షకుని ప్రార్థిం చగా అగజేశునకు కూర్మినందనుడైన మీననాదుని నీవు దర్శించి అతనితో సంభాషింపగా నీకు శాపమోక్షము కలుగును అని తక్షకుడు పలికెను. నా భాగ్యవశమున ఈనాటికి మీననాథా మీరు విచ్చేసితిరి. మీ ప్రసాదమున

తిరిగి నేను గంధర్వ లోకమునకు వెడల గలిగితిని అని పలికి ఆకాశవీధిలో గంధర్వుడు వెడలిపోయెను.

పరీక్షిత్తునకు శృంగి శాపమిచ్చుట తక్షకుడు వటవృక్షమును కాల్చి వేయుట ఒక వృద్ధ బ్రాహ్మణుడు తన మహిమచేత దానిని పునర్జీవితము చేయుట మొదలైన వృత్తాంతములు మహాభారతములో నున్నవి. గౌరన నాథ సంప్రదాయము మీద గౌరవము కలవాడగుటచేత ఈ కథలో గంధర్వుని సృష్టించి అతనికి శాపము కలుగుట మీననాథుని మహిమచేత ఆ శాప విముక్తి యగుట అను కల్పనముచేసెను. ఇట్లు చేయుట అతడు నాథ సంప్రదాయమును దాని మహిమను తన కావ్యమున ఉల్లేఖించుటకే. ఇట్లు చూడగా పౌరాణిక కథలకు కూడా గౌరన నాథ సంప్రదాయముతో ముడి పెట్టుట గమనించ వచ్చును. సర్పరాజును వీడి ముందుకేగుచూ మత్స్యేంద్రాదులొక అడవిలో ప్రవేశించిరి. వారి కచ్చట పత్నీద్వితీయుడైన పుళిందుడొకడు కని పించెను. అతని వలన మత్స్యేంద్రునకు రసము, పరుసవేధి, చింతామణి మున్నగునవి గల చోట్లు గుర్తింపనయ్యెను. పుళిందుని వృత్తాంతము, పరుసవేది చింతామణి వృత్తాంతము మున్నగునవి గౌరన తన కావ్యములో వర్ణించి చెప్పినాడు.

*ఇట కొంత గ్రంథము దీని మాతృక వ్రాయునప్పటికే పోయి యుండు నని గౌరన కావ్యములో మేఘనాథ సిద్ధుని కథ ప్రారంభము కాకముందు గలదు బహుశ తృతీయాశ్వాసములోని దానదర్మునుని కథ అయిన తరువాత మేఘనాథ సిద్ధుని కథ ప్రారంభమునకు నడుమ కొంత భాగము గ్రంథ పాతమై ఉండవచ్చును. ఇచట గౌరన వ్యాఘ్రోపహతుడైన బ్రాహ్మణుని కథ సగములో ప్రారంభించినాడు. ఇదే మేఘనాథ సిద్ధుని కథ. బ్రాహ్మణుని సతీ సమేతముగా రక్షించిన రాజు విరూపాక్షుని కథయందు ప్రారంభించెను. ఈ రెండు కథలు గౌరన అత్యంత కరుణాద్భుత సన్నివేశ భరితముగా రచించెను. బ్రాహ్మణ బాలకుడు మేఘనాథ సిద్ధుడుగా మారును. విరూపాక్షుడు మత్స్యేంద్రుని వద్ద యోగము గ్రహించి సిద్ధుడగును. వారందరు కలిసి ముందు

---

* గౌరన నవనాథ చరిత్ర పుట 160.

కేగుచూ దారిలో వంచక పురోహితుని, వాని నరసీ కాయుచున్న బోయవానిని కలసికొందురు. బోయవలన వంచక పురోహితుని వృత్తాంత మామూలాగ్రముగా తెలియవచ్చును. ఈ కథలో గౌరన పురోహితుల దుర్వర్తనములనెల్ల నేకరువు పెట్టి హాస్య వ్యంగ్య పూరితముగా రచన సాగించెను. గౌరన ఈ పురోహితుని ఆర్వేల శాఖకు చెందిన ఋగ్వేది బ్రాహ్మణునిగా వర్ణించెను. బహుశ అతని నాటికి ఆంధ్రదేశములో నియోగి, వైదిక విభేదములుగాని, వృత్తిలో తారతమ్యములుగాని లేవు కాబోలు. ఇంకొక విశేష మేమనగా శివ కవులు రచించిన కావ్యములలో బసవడు మున్నగువారు "భక్తిమీది వలపు బ్రాహ్మణ్యంబుతో పొత్తు బాయ" లేక పోవుట ఇతని కాలములో గానవచ్చుట లేదు. బ్రాహ్మణ్యంబును గౌరవించిన వాడుగా గౌరన దర్శనమిచ్చు చున్నాడు. శివారాధనాశక్తి, శైవములో ఒక శాఖయైన నాథ సంప్రదాయము వ్యాపింప జేయుటయం దాసక్తి కల కవిగా గౌరన కన్పించుచున్నాడు. శాఖాభేదములు పాటించక పోయినను కర్మ సిద్ధాంతమును నమ్మిన వ్యక్తిగా గౌరనను భావించ వచ్చును. కుల మతములతో పని లేనివాడుగా వీరశైవుడుగా గౌరన కాన్పించలేదు. దీనివలన వీరశైవ మంతరించినట్లు కొంతకాలమే ఆంధ్ర కర్నాట దేశములలో ఆ మత వ్యాప్తి జరిగినట్లు మనము భావించవచ్చును.

పురోహితాదులను తోడ్కొని ముందేగుచున్న మత్స్యేంద్రునికి దారిలో నడుముద్రొక్కిన నాగరాజు తారాసపడును. అతనికది శాపాంతము. శాప మిచ్చిన ముని ఖణికుడు. మత్స్యేంద్రుడీ యిరువురికి యోగమిప్పించును. వీరే నాగార్జున ఖణిక సిద్ధులు గౌరన కావ్యములో చతుర్థాశ్వాసములో గల నాగార్జున సిద్ధుని కథ, ఖణిక సిద్ధుని కథ, మీననాథుని పరకాయ ప్రవేశము, బుద్ధసిద్ధుని కథ ముఖ్యాంశములు. ఇదే అశ్వాసములో 'మీననాథుని హిమవత్ప్రయాణము' ఘట్టములో రామ కథ కూడ గలదు. కావ్యమున కాయువుపట్టులైన సిద్ధుల కథలీ ఆశ్వాసములో గౌరన చెప్పినాడు. యోగ మభ్యసించుట, సిద్ధి వడయుట నాథ సంప్రదాయములో శైవులకు ముఖ్య విద్యలు. ఇంతకు ముందు గంధర్వుని పూర్వ వృత్తాంతము చెప్పు సందర్భములో భారత గాథ ప్రసక్తి వచ్చినట్లుగానే ఈ ఆశ్వాసములో మీననాథుని హిమవత్ప్రయాణ ఘట్టములో రామకథ ప్రవేశపెట్టినాడు. దీనినిబట్టి గౌరన పురాణగాథల నాధారముగా తన

కావ్యములో యోగావిష్కృతిని, నాథ సంప్రదాయమును జోడించి కథలు నడపినట్లు తోచుచున్నది.

'నపమృత్యు భయమున . న్యాయవర్తనము
కపటంబుమరి శత్రు . ఘాతకములేక
తల్లియు దండ్రియు . దానైయేలె
నెల్లభూప్రజలబెం . పెసగిన కరుణ
నని మహాపాతక . హరమైన రాము
వినుతచరిత్రంబు . విని శిష్యులలర
జెప్పి మత్స్యేంద్రుండు . చిరలీల బరగు
నప్పట్టణంబున . నా రాత్రినిలిచి
యటబాసి యుత్తరం . బరిగిన త్రోవ
బటుబుద్ది ఒనిపాప . బహుళతాపటలు
దాత్రంబు నఖిల భూ . ధవఘనస్తోత్ర
పాత్రంబు నర్జున . పతి చండకంక
పత్ర నిర్దళితారి . పత్రంబు జూడ
జిత్రంబులగు కురు . క్షేత్రంబు గాంచి
యనువున మత్స్యేంద్రు . దచ్చటి మహిమ
దనశిష్యులకు బ్రమో . దమున జెప్పుచును
నారాత్రి యందుండి . యమ్మఱునాడు
భోరున పయనమై . బోవుచునెదుర.'

శిష్యులందరిని వెంటనిడుకొని యేగుచూ మత్స్యేంద్రుడు. 'మంగళా వృతమగు మహనీయపుట భేదనము' చేరుసరికి ఆ నగరమున రాజప్పుదే మరణించినట్లు వినెను. తోడనే శిష్యులు వలదన్నను వినక మత్స్యేంద్రుడు పరకాయ ప్రవేశము చేయును. మంత్రి ఆ రహస్యము గ్రహించియు సమయోచితముగా ప్రవర్తించి రాజ్యము నడుపును. పూర్వపు రాణులను పరస్త్రీలుగానెంచి రమణి కాదలు పన్నెండుగురు కన్యలను పెండ్లాడి; బారహకన్యాపురములో నుంచి మత్స్యేంద్రుడు వారితో సుఖించును. రమణికకు మంజునాథుడు జనిం

చును. గురుడిట్లు భోగాసక్తుడై చిరకాలము తడయుటచే గోరక్షనాథుడేగి అతనిని మరల్పయత్నించును. ఆ ప్రయత్నములంతగా ఫలింపకున్న సంగతి గమనించి పుత్రవ్యామోహమును మాన్పుటకై గోరక్షుడు మంజునాధుని చంపి ముద్ద చేయును. చివరకు తాను ప్రాణములు విడుతునని శపించి గురుని ప్రబోధించి తెచ్చును. మంజునాధుని కూర్మాసనమునిలిపి, అతడట్లు శాశ్వతముగా నుండునని వరమిచ్చి మత్స్యేంద్రుడు వెడలి పోవుచుండగా మంత్రివచ్చి తాను యోగి కానెంచును. మత్స్యేంద్రుడతనికి యోగమిప్పించి సిద్ధ బుద్ధినాధుడని పేరిడును.

యోగ సంప్రదాయా విఖ్యాతి ననుసరించి మత్స్యేంద్రుడొక సారి ప్రయాగలో పరకాయ ప్రవేశము చేసి రాజుగా నుండి మాణిక్‌నాథుని కనినట్లును, వేరొకసారి స్త్రీదేశములో (సింహళమని వ్యాఖ్య) పరకాయ ప్రవేశము చేసి రాజై పరశురామమీనరాములను కొడుకులను బడసినట్లును తెలియును, బెంగాలీ గ్రంధములలో మత్స్యనాధుడు కదళీ దేశములో పరకాయ ప్రవేశము చేసి రాజై బిందునాధుని కనినట్లు వ్రాయబడెను.* రాజా మాన్‌సింగ్ నాడు సంగ్రహింపబడిన 'మేఘమాల' అను సంస్కృత గ్రంధములో పరకాయ ప్రవేశము చేసి మత్స్యేంద్రుడు జయంతి అనుకన్యను పెండ్లాడి కదళీ వనములో విహరించినట్లు వర్ణింపబడెను. వేరొక కథలో మత్స్యేంద్రుడు కామరూప దేశములో పరకాయ ప్రవేశము చేయగా మంగళాదేవ్యాది రాణులా రహస్యమెరిగి అతనిని తిరిగి పోనీకుండ నిల్పుటకై ప్రయత్నించినట్లు చెప్పబడినది. ఈ కథలో నీతనికి పార్శ్వనాథ శ్వేతాంబరనాధులను పుత్రు లిరువురుదయించినట్లు చెప్పబడెను. స్త్రీ దేశమని చెప్పిన సింహళము హిమాలయ ప్రాంతమున నుండెనని శ్రీ హజారీ ప్రసాద్ ద్వివేదీగారు వ్రాసిరి. గఢవాల్ కుమయూన్ ప్రాంతములను కొందరు స్త్రీ దేశమని పేర్కొనిరి. కుల్లూప్రాంతము, సట్లేజ్ ఉద్గమ ప్రాంతము, హిమాలయ పాదప్రదేశము, టిబెట్టు పూర్వభాగము, కామరూప (అస్సామ్) దేశము మున్నగునవి స్త్రీదేశములని పేర్కొన బడినవి. భారతారణ్య పర్వము (146 అధ్యాయము) లో కదళీవన ప్రశంస వినిపించును. అచ్చట వ్యాసాంజనేయ పరశురామాది చిరంజీవులు వసించుచున్నట్లు వర్ణింపబడినది. డెహరాడూన్, హృషీకేశ్, బదరికాశ్రమ ప్రాంతములు

---

* భారతి 1986 ఏప్రిల్. నవనాథచరిత్ర. అనుశీలన వ్యాసము డా॥ మట్నూరి సంగమేశం.

'కజరీబన్'లని శ్రీ సుధాకర ద్వివేదిగారు వ్రాసిరి [1] నాగర సర్వస్వమను బౌద్ధ గ్రంథపు టీకలో స్త్రీ దేశము భూతస్థానమునకు దగ్గరగానున్నట్లు వ్రాయ బడినదని పండిట్ తన్ సుఖ్‌రామ్‌గారు తెలియజేసిరి. వాత్సాయనీయ జయ మంగళ వ్యాఖ్యలో వజ్రావతంసదేశమునకు పడమట స్త్రీ దేశమున్నట్లు వివ రింపబడెను. [2]

గౌరన వ్రాసిన 'మంగళావృత పుట భేదనము' బహుశా నేటి దక్షిణ కన్నడ జిల్లాలోని మంగుళూరు కావచ్చును. అచ్చట మంగళాదేవి ఆలయ మున్నది. ఆ దేవి పేరున ఆ నగరము మంగుళూరైనది. అచ్చటి తుళు భాషీయులలో కొన్ని జాతులవారు భూతములను పూజింతురు. గృహ, కుల, గ్రామ దేవతలుగా ఎన్నో భూతములచట వెలసి దానిని భూత స్థానమని నిరూపింపదగినట్లున్నవి. అది మలబారు తీరముతో పాటుగా పరుశురామ క్షేత్రము. పార్శ్వనాథ, శ్వేతాంబర జైన బసదులు, విగ్రహములు నేటికిని తత్ప్రాంతమున నున్నవి. మంగుళూరులో నొకపేటకు 'కదిరి' అని పేరు. అది కదళీ శబ్దమునకు అపభ్రంశరూపము కావచ్చును. ఈ కదరిలో మంజు నాథాలయమను పేర పెద్ద శివాలయమున్నది. దీని సమీపమున గోరఖ్ నాథా లయమును, గోరఖ్ సంప్రదాయస్థులైన 'కన్‌ఫటా' యోగుల మఠమును నున్నవి. వజ్రయానీసిద్ధుల కొకప్పుడు నిలయమైన శ్రీశైల ప్రాంతమునకిది పడమరగా నున్న ప్రదేశమే. ఈ ప్రాంతములో కొన్ని జాతుల వారిప్పటికీ మాతృమాతుల వారసత్వరూపమైన 'మరమక తాయ' మను ఆచారమును పాటించుచున్నారు కాగా, గౌరన వర్ణించిన మంగళూరే మత్స్యేంద్రుడు పరకాయ ప్రవేశమొనర్చిన చోటని నమ్మవచ్చును. వేర్వేరు ఆకరణములలో వినవచ్చు లక్షణములన్నియూ ఆ చోటున సరిపోవుచున్నవి. గౌరన మత్స్యేం ద్రుడు సంచరించినట్లు పేర్కొన్న గౌళబంగళాది దేశములొకప్పుడు వజ్ర యానీ బౌద్ధతాంత్రికుల కాటపట్లు. నేపాల్‌లో మత్స్యేంద్రుని అవలోకితేశ్వ

---

1. భారతి - ఏప్రిల్ 19\{6, నవనాథచరిత్ర, అనుశీలన వ్యాసం డా॥ మట్నూరి సంగమేశం.
2. భరతి - ఏప్రిల్ 1\{86, నవనాథచరిత్ర, అనుశీలన వ్యాసం డా॥ మట్నూరి సంగమేశం.

రుడుగాను, కౌలసిద్ధుడుగాను పేర్కొందురు. కనుక పై పరకాయ ప్రవేశ కథ అతని యోగిని కౌల సాధనను సూచించునది కావచ్చును. గోరక్షుడతని నావామాచారము నుండి మరలించి విశుద్ధ యోగ మార్గమునకు తిరిగి రప్పించెనని యెంచవలెను. నేపాల్‌లోని బౌద్ధమును శైవముగా మార్చిన వాడనియు, గూర్ఖాజాతి నిర్మాత అనియు, గోరక్షనాథునికి ప్రసిద్ధికలదు.

మంగళూరు విడిచిన పిదప మత్స్యేంద్రుడు హిమాలయమునకు బయలు దేరెను. దారిలో ఉజ్జయినిని చేరుకొనెను. గౌరన అచ్చటి కాళికాలయమును, కాళీభక్తులను, వారి వీరవ్రతములను అత్యంత బీభత్స భయావహముగా వర్ణించెను. ఆ తర్వాత వారు ద్వారవతి గడచి, దారిలో ఎందరినో యతులను, పాశుపతులను, తాపసులను, సోమయాజులను, ఆగమవేదులను, శివపూజా పరాయణులను చూచి అయోధ్య చేరుకొనిరి. "అపమృత్యుభయము, సన్యాయ వర్తనము, కపటంబు మరి శత్రుఘాతము లేక, తల్లియు, దండ్రియు దానయై" యేలిన శ్రీరాముని చరితము సొంతముగా శిష్యుల కెరగించి మత్స్యేంద్రుడు అయోధ్యనుండి కురుక్షేత్ర మేగెను. అటుపై గంగను దర్శించి, కాశిలో యేడు దినములు వసించి, ప్రయాగకరిగి త్రివేణిలో మునిగి, మరికొన్ని తీర్థములు గడిచి కేదారేశ్వరుని దర్శించి ఆ పైన హిమగిరి చేరుకొని ఒక గుహలో విశ్రమించెను. ఈ వర్ణనలతో గౌరన కావ్యమునకు పురాణ ఫక్కి సిద్ధించెను.

కొన్నాళ్ళ పిదప మత్స్యేంద్రుడు తన శిష్యులను ఆయా దేశములలో తిరిగి యోగ మార్గమును ప్రచారమునకు పంపిన మీదట గోరక్షాదులాయా దేశముకువేగి యోగ విద్యను ప్రచారమునకు దెచ్చిరి. గౌరన యీ సందర్భములో గోరక్షాదు లెవరెవరు ఏయే దేశమేగి యోగవిద్యను ప్రచారము చేసినదియు, వారికెవరెవరు శిష్యులైనదియు వివరముగా వ్రాసెను.

గోరక్షనదు డొకసారి నీలగిరిప్రాంత మరిగి, అచ్చటినుండి శ్రీశైలమునకు వచ్చెను. అచ్చట అతనికి అల్లమ ప్రభువు దర్శనము లభించెను. కాపాలిక సంప్రదాయమును గురించి, కాయసిద్ధిని గూర్చి వారిరువురికి వివాదము జరిగెను. అన్యోన్యశక్తి పరీక్షలైన పిదప అల్లమ ప్రభువు గోరక్షకుని శిష

ద్వైత జ్ఞాన యోగమును, అంగ లింగా భేద తత్త్వమును వివరించెను. దాని వలన గోరక్షుడు సకల కళ్యాణములకు నిలయమయ్యెను.

అల్లమ ప్రభువు ప్రస్తావన ప్రతాప చరిత్ర మొదలగు తెలుగు కావ్యములలో కన్పించుచున్నది. శ్రీశైలము తెలుగుదేశము నందుండుట చేతను గోరక్షుడు ఆ క్షేత్రమును దర్శించుట చేతను అల్లమ ప్రభువును అతడు కలిసికొనుట వారి వాదము చారిత్రికములైన యదార్థములుగనే భావించవచ్చును.

అల్లమ ప్రభువు వీర శైవులచే శివుని అవతారముగా భావింపబడిన మహా పురుషుడు. శ్రీశైలములో బసవేశ్వరుని 'అనుభవ మంటపము' అను పేరుగల వీరశైవ విద్యా పరిషత్తునకు అధ్యక్షుడు. ఇతడు 12 వ శతాబ్దిలో వెలసిన చారిత్రక పురుషుడు. గోరక్షనాథు డితనికి చాల పూర్వుడని మిగిలిన కథల వలన తోచును. కాని హఠయోగ ప్రదీపకలో (33) సంగ్రహించిన సిద్ధుల పేర్ల పట్టికలో "అల్లమ ప్రభు దేవశ్చ ఘోడా చూళీచ టిం టినిః" అని అల్లమ ప్రభువు పేరు కూడ చేర్చబడినది.

గౌరన కావ్యములో ఈ మీననాథ సిద్ధుల శిష్యులైన ఆత్రేయ నాగార్జున, వ్యాళి, గోరక్కు, గోరంటకుడు అనువారి కథలు వర్ణించెను. గౌరన కావ్యమునుబట్టి యీ సిద్ధుల కథలన్నియు 12వ శతాబ్దికి పూర్వమే జరిగినట్లు ఊహింపవచ్చును. అంతేకాదు, గౌరననాటికి ఈ కథలు శ్రుతపరంపరలోనిల్చి, అనేక విధములుగా అల్లుకొని, వెలివడి, పూర్వాపరములేమో చెప్పరాని స్థితికి వచ్చినవని అనుకొన వచ్చును. ఏది యెట్లున్నను గౌరన కాలములో, అనగా 15వ శతాబ్ది పూర్వభాగములో నవనాథులు వారి సంప్రదాయము, రసవాదము, సిద్ధులు మున్నగువాటిని గూర్చి ఆంధ్ర దేశములో శ్రీశైలమునుండి శేషాద్రి వరకు ఎన్నో కథలు ప్రచారములో నున్నట్లు అప్పటి తెలుగు సాహిత్యము వలన తెలియుచున్నది.

గౌరన వ్రాసిన దానినిబట్టి నాథమతము లౌకిక ధర్మవిరుద్ధము. ఇది విశుద్ధ యోగాచార శైవముగా రూపించును. దీనికి వైష్ణవముతో పగలేదు. రామాయణముతో వైరములేదు. తీర్థయాత్రలన్న నిరసన భావములేదు. వ్రత

నియమాదులపట్ల ఏవగింపులేదు. ఆ కాలపు నాథ సంప్రదాయపు గ్రంథముల నేమి, ఇతరులీసిద్ధులను గూర్చివ్రాసిన వ్రాతల వల్లనేమి, నాథమతమింత సనాతన ధర్మ పరాయణముగా కనిపించదు. కాగా, గౌరననాటికి మతము కొన్ని చోట్ల, ఇతర సంప్రదాయములకు లొంగి పలు విధములుగా కనిపించినను, కొన్ని చోట్ల నిది తన విశుద్ధ ధార్మిక రూపము నింకనూ నిల్పుకొన్నదనియే యెంచవలెను. కనుకనే ముక్తి కాంత భిక్షనాథునికిది ప్రియమయ్యెను.

గౌరన సరససాహిత్య లక్షణ విచక్షణ బిరుదాంకితుడు. స్వరూపమునకు నవనాథ చరిత్ర ద్విపద కావ్యమేయైనను గౌరన సాహిత్యరీతులు చక్కగా తెలిసినవాడు. విస్తృతమైనకథ, సందర్భమును బట్టి సమగ్ర వర్ణనలు, చక్కని పాత్రపోషణ కొంత చారిత్రక పరిజ్ఞానము, శైవము, నాథ సంప్రదాయము, పౌరాణిక విశేషములు వీనిపై అభిమానము కలిగిన గౌరన నాథచరిత్రను విలక్షణమైన కావ్యముగా తీర్చిదిద్దెను. అందుచేతనే 15వ శతాబ్దములో నివసించిన కవులలో గౌరన అగ్రశ్రేణిలోనే చేరుచున్నాడు.

## నవచోళ చరిత్ర - శైవసంప్రదాయము

'నవచోళ చరిత్ర' రచయిత పోశెట్టి లింగన కవి. ఈతడు పదునైదవ శతాబ్దము వాడని తెలియు చున్నది. పోశెట్టి లింగకవి ఈ కృతిని చకిలాల లింగప్ప ప్రేరణచేత శ్రీరామపల్లి నివాసియగు మృత్యుంజయస్వామి కంకితముగా రచించినట్లు నవచోళ చరిత్ర పీఠిక వలన తెలియుచున్నది. శ్రీరామపల్లె యనునది ఈ గ్రంథమునందు 'రామపల్లి' 'శ్రీరామపల్లి' 'బగిరాముపల్లి' అను పేరులతో ననేక విధముల పేర్కొనబడినది. 'బగిరాముపల్లి' యనునదియే సరియైన పాఠమని తెల్పబడినది.1 కాని సరియైన మాతృక లేనందున దీనిని తేల్చుటకు వీలుకాలేదు.

'బగిరాముపల్లి' యనునది దివ్యక్షేత్రము. ఈ క్షేత్రమునందు వెలసిన దైవము మృత్యుంజయేశ్వరుడు. పోశెట్టి లింగనకవి కృతి నీతనికి అంకితము

1 నవచోళ చరిత్ర పీఠిక (పుట) 6

చేసినాడు. కాని పైన పేర్కొని నట్లు లింగప్ప ప్రేరణచే అంకితము చేయుట వలన కాబోలు, తక్కిన కృతి ప్రదాతలవలె గాక, గ్రంథము నందలి కథ నంతను లింగప్పను సంబోధించియే వర్ణించినాడు. గ్రంథ మధ్యమున కృతి పతిని సంబోధించునాచారమే కాని కృతి ప్రేరకుని సంబోధించు నాచారము మనలో నంతగా కన్పించదు. అయినను ఇచట మృత్యుంజయ లింగమునకును, చకిలాల లింగమునకును అభేదమును అధ్యవసాయించెనేమో యెఱుగ రాకున్నది. చకిలాల లింగకవి పోశెట్టి లింగన కవిని కృతిసేయ ప్రోత్సాహము చేసినట్లు కావ్యారంభములో ఇష్ట దేవతాస్తుతి, గురు ప్రార్థనము, భక్తగణస్తుతి, పండితారాధ్యస్తుతి, కవివంశవర్ణనము మున్నగు అంశముల తర్వాత చెప్పఁ బడినది.

"నన్ను రాపించి మన్నన గారవించి- మున్నుగా భూతి తాంబూ
లంబులొసగి
విరివొప్ప నీవుల వేడ్కతో నొసగి హర్షంబు తోడు తనప్పుడిట్లనియే
'ఇర వొందమును ముక్తి. నీశురామేశు - వర లాభమున భక్త
పరులగు ననగ
కరమర్థి వెలయు శంకర దాసమయ్య చరితంబు నవ్వీర సంగయ్యదేవు
చరితంబు మల్హాన చరితంబు మఱియు హర్షంబు దనర
శిష్య ప్రబోధనము
నచలిత రీతి బరమాను రాగమున రచియించితివి భక్తి రచననింపొంద
గావున నట్టి సంస్కారివి గాన భావజ్ఞులగు భక్తిపరులు గారణులు
తసికులు నవచోడ రాజులు మున్న నసలార బూజించి మాధ్యతమించి
వలనొప్ప మోక్షంబు - వడసిన మహిమ. నలగన్న డము జేసి
రాద్యులుమున్ను
వెలయగా నీవును విజ్ఞానమునను దెలుగున నద్దాని ద్విపద గావించి
స్థిర గురుమూర్తి దేశిక చక్రవర్తి బరమాత్మ శ్రీరాముపల్లి నివాసి
దృఢయ శస్కరుడు మృత్యుంజయేశ్వరుడు నవిరళభక్తి సామ్రాజ్య
పూజ్యుండు

సద్గుణ గణనిధి సత్య సంధుండు మద్గురునాథుండు మన్మనోహరుడు
అనురక్తి నట్టి మహాత్ముని పేర తనరారగా సంకితము
సేయవలయు"

పై వాక్యములను బట్టి కృతి కర్తయగు లింగన కవియును కృతిప్రేరకుడగు లింగప్పయును గూడ కుమ్మర కులము వారేయని దృఢమగు చున్నది. ఇర్వురును దురితమదేభ సందోహ పంచాస్యులే. నిరుపమ జ్ఞాన పూర్ణతనులే. హరగురు భక్తి నిష్ఠాపరాయణులే. జంగమ తీర్థ ప్రసాద సేవకులే. కనుకనే "యత్కరోషియ దశ్నాసి తత్కురుష్వ మదర్పణం" అన్న న్యాయము నను సరించి ఈశ్వరార్పణముగా కృతి సేయుమనుటకును, చేయుటకును పూను కొన్నవారు. అనన్యమగు భక్తి యన నిదియే.

పోశెట్టి లింగన కవి రచించిన "నవచోళ చరిత్రము" స్వతంత్ర రచన కాదనియు కన్నడ గ్రంథమునకు తెలుగు సేత యని నవచోళ చరిత్ర పీఠిక యందు పేర్కొన బడినది. కన్నడమున ఎవ్వరు రచించిరో స్పష్టీకరించలేదు, కృతి ప్రేరకుడగు చకిలాల లింగప్పగారు దాన్నిగూర్చి

"రసికులు నవచోడరాజులు మున్ను, నసలార బూజించి యాధ్య
తమించి
వలనొప్ప మోక్షంబు వడసిన మహిమ, నలగన్నడముచేసి
రార్యులుమున్ను
వెలయగా నీవును విజ్ఞానమునను, తెలుగున నద్దాని ద్విపద గావించి"

అని సాముదాయకముగా చెప్పినారు.కాని కన్నడ గ్రంథము కూడ కన్పించుట లేదని, జీర్ణమై యుండునని పీఠికా కర్తలు పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారు నవచోళ చరిత్ర పీఠికలో పేర్కొనిరి.*

ఈ కావ్యములో కూడ బసవేశ్వరుని నాటి వీరశైవ సిద్ధాంతములు కొన్ని పేర్కొనబడినవి. పాల్కురికి సోమనాథుని బసవపురాణములో చెప్ప

* నవచోళ చరిత్ర - పీఠిక పుట 7

బడిన వీరశైవుల కథల ప్రసక్తి ఈ కావ్యములో 'భక్తగణస్తుతి'యను సంశ ములో వివరింప బడినది. ప్రసిద్ధ వీరశైవులైన మరుళ సిద్ధుడు, కుమ్మరి గుండయ్య, శంకర దాసయ్య, సాంఖ్యతాండడు, కిన్నర బ్రహ్మయ్య, కాట కోటయ్య, సొడ్డల బాచయ్య, పిట్టవ్వ, బెలిదేవి వేమనారాధ్యులు, మున్నగు భక్తులందరును స్తుతింపబడిరి. దీనిని బట్టి చూడగా ఈ కవికిని వీరశైవాభి మానమున్నట్లగపడుచున్నది. గౌరన ఈ కాలముననే ఇంచుమించుగా కొంచెము ముందుగనో, వెనకగనో 'నవనాధుల చరిత్రము' ద్విపదగా రచించి నాడు. పోశెట్టి లింగనకవి 'నవచోళుల చరిత్రము'ను ద్విపదగా రచించినాడు. నవనాథ చరిత్రలో కేవలము శైవసిద్ధాంత ప్రతిపాదనయే గాక నాథ సంప్ర దాయమను క్రొత్త సంప్రదాయమును, హఠయోగము, సిద్ధిపొందుట మున్నగు విషయ వివరణము గౌరన చేసి యున్నాడు. అట్లని పంచాక్షరీ మంత్రము, జపము, ధ్యానము యిత్యాది విషయములను విడిచిపెట్టలేదు. "వివిధ శైవ సంప్రదాయములకు నిలయము వంటిది నవనాథ చరిత్రము" అని చెప్ప వచ్చును. ఎందుచేతననగా గోళకీ మఠములలో శైవులేవిధముగా జపధ్యానా దులు చేయుదురో, పంచాక్షరి నెట్లు పఠింతురో వివరించుచు, కాశ్మీర శైవమును కూడ ఈ కవి ప్రవేశపెట్టినాడు.

ఇఁక నవచోళ చరిత్రలో కొన్ని వీరశైవ సంప్రదాయములతో పాటు ఆగమ సిద్ధాంత వివరణము కూడ కన్పించు చున్నదనిపించు చున్నది. దీనికి నిదర్శనముగా కావేరీ నది మాహాత్మ్యము చెప్పవచ్చును.

ఇఁక నీకవి కులమును గూర్చికూడ ఇందుస్పష్టముగా తెలియుటలేదు. బసవేశ్వరుననుసరించి వీరశైవులకు కులముతో పనిలేదు. వీరశైవులకు శివ పార్వతులే తల్లిదండ్రులు. బహుళ ఈ కవికూడ వీరశైవ సంప్రదాయానుసారి గనుక కుల ప్రసక్తిలేదని తలంపనగును. కాని ఈ 'నవచోళ చరిత' మూడవ పేజీలో కులమునుగూర్చి ప్రసక్తి కొద్దిగా చేయబడినట్లు ఈ వాక్యముల వలన విదితమగుచున్నది.

క్షితిని "మాతాహిమగిరిసుతా" యనగ - నతిశయతీతి 'పితారుద్ర' యనగ,
బాంధవుల్ శైవులు భక్తులౌననగ

శంకర దాసయ్య. శరణవంశజాడ-శంకర దాసయ్య శరణగోత్రజాడ
మూలమౌశ్రీగురు బూజించు శ్రీల-లీలమను పోశెట్టి లింగము నాగ
బరగినవాడ-సద్భక్తుల కరుణ-స్థిరభక్తి మహిమల జెందినవాడ
ప్రాకటవరబుద్ధి-బరగి నేబూను-నీకథా వృత్తాంతమిదియెట్టి దనిన
వరసమయాచార నిరసనోదార-బిరుదుచే విఖ్యాతిచేరైనవారు
జంగమవ్యాపార-సారసన్మతులు-లింగగంభీరులు లింగనైష్ఠికులు
హరునకును సమయ-హస్తంబులొసగి బిరుదు చెల్లించి మెప్పించిన భక్తి
పరులు శ్రీ గుండయ్య బ్రహ్మయ్యగారు దురితమదే సందోహపంచాస్యు
లమతులు వారిని జాంశంబుసందు-ప్రమదేశ్వరధ్యాన భావ సంధాన
స్థిర శుద్ధసిద్ధ ప్రసిద్ధ ప్రసాద పరిపూర్ణదేహుండు భక్తిఫలదుండు
నిరుపమ జ్ఞానపూర్ణతనుండువాడు హరగురు భక్తి నిష్ఠాపరాయణుఁడు
జంగమ తీర్థ ప్రసాద సేవకుడు-మంగళ సత్క్రియా మార్గంబువాడు
భక్తుల సద్గోష్ఠి బాయనివాడు - భక్తి మనస్సున ఫలియించువాడు
ధర్మార్థ పరుడు నిర్ద్దంబగు భక్తి నిర్మల చిత్తుండు నీతివర్తనుడు
వరమాత్ముడుద్దామ బగిరాముపల్లి గురుపదధ్యానుండు గురుపూజరతుడు
సంగీతభక్తి భాషణుడు చకిలాల లింగప్ప సద్భావ లీలలనొప్ప"

ఈ నవచోళ రాజుల చరిత్రమును సొసలపురాధీశ్వరుడగు భైరవరాజునకు పండితారాధ్యులు చెప్పినట్లుగా ఇందు ప్రాతిపదికము ఏర్పరుప బడినది. కాని పండితారాధ్యుల కాలమున భైరవ రాజని సుప్రసిద్ధుడగు రాజున్నట్టు వినికిడిలేదు * ఆయన వెలనాటి చోడుని కాలమువాడు. వెలనాటి చోడుని యాస్థానమునందు జైనపండితులతో ప్రతిఘటించి హోరాహోరిగపోరి, శివమహిమానుభావములను ప్రత్యక్షముగా గనబఱచి విజయము గొన్నమేటి. ఆ మహా మహిముని దివ్య చరిత్రముల నన్నిటిని పాల్కురికి సోమనారాధ్యుడు పండితారాధ్య చరిత్ర మనుపేర గూర్చినాడు. సోమనాధుడు అష్టభాషాకవి. ఇందుల కతని వృషాధిప శతక పండితారాధ్య చరితాదులే తార్కాణములు. కాని ఆయన భైరవ రాజును పేర్కొనుట గాని ఆరాధ్యుల వారు భైరవ రాజునకు నవచోళ రాజుల కథలు విన్పించుటను గాని పేర్కొని యుండలేదు.

అయినను అమూలమని దీనిని కాదనుటకును వీలులేదు. ఇంక నేమనగా పండితారాధ్యులు భైరవరాజునకు చెప్పినట్లుగా ఆ కాలమున జనశ్రుతి యుండి యుండును. దాని నాధారముగా చేసికొని ఈ కవి యీ చరిత్రములను గూర్చి యుండవచ్చును.

నవచోళ చరిత్రమునందు కరికాళచోళుడు, విక్రమ చోళుడు, ఉత్తుంగ చోళుడు, మనుజేంద్ర చోళుడు, వీరచోళుడు, ఉత్తమ చోళుడు, అహివరచోళుడు, వరధర్మ చోళుడు, సత్యేంద్ర చోళుడు అను తొమ్మండుగురు చోళ చక్రవర్తుల యొక్క శివభక్తి ప్రపూర్ణములగు మహిమాను భావములు వర్ణింపబడియున్నవి. ఈ చరిత్రము లన్నియును నాల్గాశ్వాసములలో నిముడ్పబడినవి. ఐదవ ఆశ్వాసమునందు భైరవరాజు కథయును నతని లింగైక్యమును వర్ణింపబడి యున్నవి. మొదటి నాల్గాశ్వాసములలోను వర్ణింపబడిన కథలలో మొదటి యాశ్వాసమునందు కరికాళచోళుని చరిత్రమును, రెండవయాశ్వాసమున విక్రమ చోళుని కథయును, మూడవ యాశ్వాసమున ఉత్తుంగ చోళుడు, అహివర చోళుడు, వరధర్మచోళుడు, సత్యేంద్రచోళుడు ననువారి కథలును, నాల్గవ యాశ్వాసమున మనుజేంద్ర చోళుడు వీరచోళుడు ఉత్తమ చోళుడు ననువారి కథ లును వర్ణింపబడి యున్నవి. వీనిలో కరికాళ చోళుని చరిత్రమును, విక్రమ చోళుని చరిత్రము మాత్రము విపులముగ గూర్పబడినది. కరి కాళ చోళుడు తిక్కన సోమయాజి నిర్వచనోత్తర రామాయణమునందు కృతి పతి వంశావతారాభివర్ణన ఘట్టమందు "కాచేనేతన్ బృథివీశులందు కొనగా గాశీ సింధుతోయంబు జేసెన్మజ్జనమంగు టంబున హరించె స్వర్ణవార్వీలన్శునుల్లా సంబొందగ పాలలోచనము లీలంగట్టెగావేరిహేలా సాధ్యాఖిల దిఙ్ముఖుండు కరికాలక్ష్మా విభుండల్పుడే." అని ప్రస్తుతింప బడినవాడే. ప్రస్తుప మీగ్రంథ మునందితని చరిత్రమునందు వర్ణింపబడిన కథాంశము కావేరికి గట్టుకట్టుటయే ప్రసక్తాను ప్రసక్తముగ నిందు భాస్కర చోళుడు, ముక్కంటి చోళుడు నను వారి చరిత్రలు గూడ కొంత వర్ణింప బడినవి. ఈ ముక్కంటి చోడుడే త్రినయన చోళుడు.

ఈ కావ్యము సంప్రదాయానుసారము ఇష్టదేవతా ప్రార్థనతో నారంభ మగుచున్నది. గురుప్రార్థన, భక్త గణస్తుతి, కవి వంశవర్ణనము, కృతిపతి

ప్రస్తావన మున్నుగునంశముల తరువాత సాసిలపుర వర్ణనము గావింపబడినది. ఈ పురము లోకములో ప్రఖ్యాతమైనది.

ఈ కావ్యములో ప్రసక్తాను ప్రసక్తముగా సామాన్యులైన శివభక్తుల కథలు కూడ చెప్పబడినవి. ఉదాహరణకు పిట్టవ్వ కథ గ్రహింపవచ్చును. పిట్టవ్వ గొప్ప శివ భక్తురాలు. శరీరమంతటను రుద్రాక్ష మాలికలు ముఖమున భూతి త్రిపుండ్రములు ధరించునట్టిది. ఆమె పేనముపై అట్లనుబోసి అంగడిలో అమ్మ మొదటి ధనముపోగా వచ్చిన లాభముతో జంగమార్చన చేయుచుండెను. ఆమెకు గురు భక్తి అధికము. ఎల్లప్పుడు వారిని స్తుతించు చుండును. కరికాళ చోడుడు కావేరీ నదికి ఆనకట్ట కట్టునపుడు అతని భృత్యులు ఆమెను వెట్టిపనికై పిలిచిరి. కాని దుర్బల శరీరయగు ఆమె కాపని సాధ్యము కాకుండెను. అప్పుడు ధృఢ శరీరము కలిగిన యువకుని వేషములో శివుడు సాక్షాత్కరించి "ముక్కలు కాని అట్లు నీవు నాకిత్తువేని నేను వెట్టి పని చేయుదు" ననెను. దానికి పిట్టవ్వ అంగీకరించెను. ఆ యువకుడు ఆనకట్ట పనిలో చాలా నేర్పు చూపించుచుండెను. దానికి రాజు ఆశ్చర్యపడి ఇతడు హనుమంతుడేమోయని భావించెను. ఆవేషధారి ఆ కట్ట నాయకునితో "నేను భుజించి వత్తును" అని చెప్పి అతని మెప్పు పొందుచూ పిట్టవ్వ ఇంటికిపోయెను. "నీతో చెప్పినట్లుగా" నేను పని చేసి వచ్చితిని అట్లు ఇమ్మని "కోరెను పిట్టవ్వ అట్లు పోసి ముక్కలతోసహా అతనికి వడ్డించెను. తిరిగి అతడు పనికి వెళ్లి పనిచేయుచూ అచటిపని వాంఛతో హాస్యము లాడుచుండెను. ఇదిచూచి సహింపని రాజభటులు అతనిని బెత్తములతో కొట్టిరి. దానికతడు కేకలు పెట్టెను. ఆ కేకలు విని కరికాళుడు దీనికి కారణమేమని యడుగగా భటులు జరిగిన వృత్తాంతము చెప్పిరి. రాజ భటులు దెబ్బలు కొట్టుటను మాన్పించెను. కాని తిరిగి ఆ వేషధారి అట్లేచేయుట వలన వెదురు కఱ్ఱలతో భటులు అతని వీపు జల్లెడయగునట్లుగా కొట్టిరి. తిరిగి అతడు రాజును శరణు వేడెను. రాజు రంధ్రములు పడిన అతని వీపును చూసి ఆశ్చర్యపడెను. 'ఇతడు మానవుడు కాడు సర్వేశుడు. నన్ను కటాక్షించుటకు ఈ పరమ పావనమూర్తిగా ఏతెంచినాడు" అని అతని పాదములపైబడి బ్రహ్మ విష్ణువుల కన్న నీవే ఘనుడవు. శర్వాణీ వల్లభుడవు నీవే ఓ మహేశ్వరా ! నీ పాదముల నర్చించుట వలన నేను ధన్యుడనైతిని. ఇట్టి వినోదము చేయుట కేమికారణమని ప్రశ్నించెను. అప్పుడు వృద్ధురాలైన పిట్టవ్వను భటులు వెట్టి

చేయుమని యడుగుట ఆమెకు బదులుగా తాను పనికి వచ్చుట విన్నవించెను. రాజు జరిగినది తెలిసికొని ఆమెను దర్శించుటకు శివునితోబాటు పిట్టవ్వ ఇంటికి వెడలెను. పిట్టవ్వ ఈశ్వరుని అజును స్తుతి చేసి తన ఇలవేల్పు తన ఇంటికి వచ్చినందునలకు కృతార్థురాలి నైతి" నని చెప్పెను. శివుడు పిట్టవ్వను వరము కోరుకొమ్మనగా పిట్టవ్వ తన శరీరమే శివాలయముగా చేయు" మనుచు తనకు శివభక్తి ఎప్పుడూ వదలనట్లు చేయుమని ప్రార్థించెను. మహేశ్వరుడు కరికాళ చోళుని రాజ్యము నందు నిలిపి పిట్టవ్వను దివ్యవిమానములో కైలాసమునకు గొనిపోయెను. కరికాళుడు శివాలయము కట్టించి చక్కగా అన్ని వస్తువులను అతనికి నివేదనము చేయుచుండెను. పాల్కురికి సోమనాథుడు మొదలైనవారు సామాన్యులైన మడివాలు మాచయ్య, సిరియాళుడు మొదలగువారి కథలను చెప్పెను. ఈ కవి పిట్టవ్వయను భక్తురాలి కథను అటులేచెప్పి వారివలే ఆమెకు కూడా సాయుజ్యము లభించునట్లు చెప్పియున్నాడు. శైవ రచయితల సంప్రదాయము దీనిలో ప్రతిబింబించు చున్నది.

కరికాళ చోళుని కథ తరువాత విక్రమచోళుని కథ చెప్పబడినది. కరికాళ చోళునివలె విక్రమచోళుడు కూడా శివభక్తి పరాయణుడే. విక్రమముతో విలసిల్లుచు రాజ్యపాలనము చేయుచుండి ఒక మాఱు దిగ్విజయ యాత్రకు బయలు వెడలి కొంత దూర మేగిన పిదప ఒక ఘనారణ్యములో పూజా పునస్కారములు లేకుండ నుండిన శివలింగముునుచూచి భక్త్యుత్కర్షముచేత వివశుడై అచట శివప్రీత్యర్థము ఆలయ నిర్మాణాది కైంకర్యములను చేయించి చివఱకు ఈశ్వరుని ప్రత్యక్షము చేసికొని తనపురమున నెలకొని ప్రత్యక్షముగా పూజల గొనునట్లు వరము నొందుటయును అనంతర మొకమారు మఱియొక శివభక్తునియొద్ద నుండు కతన విక్రము చోళునకు ప్రత్యక్షత లేకపోగా, విక్రము దలిగి గండ కత్తెర వేసికొనదలపగా, శివుడు ప్రత్యక్షమై అతనికి సాయుజ్య మొసగి గౌరవించుటయును ఇందలి కథాసారము.

విక్రమ చోళుడు 'శివునికి కైంకర్యములు చేయబూనుట' యను ఘట్టములో శివుని పూజించిన విధానము ఆగమోక్త పద్ధతిలో సాగినదని చెప్పవచ్చును. ఈపక్తులు ఈ సందర్భములో చూడవలసినవే.

అసలారనదియు సహస్రములసంఖ్య-బసిడి కుంభములతో బరువడినింప
ధరనెన్న వస్త్రపూతంబైన జలము-బనుపడిమఱియుండు బంధములనింపి
కమమొప్ప గంధోదకముల బుష్పోదకములను రత్నోదకముల మంత్రోద
కములనటువంటి ప్రకారములతోను - వరజలపూర్ణ కుంభములను నిల్పి
ఆ పూర్ణకుంభము లందును మఱియు బ్రాపుగా గంధపుష్పాక్షతల చిత్త
మర్పించి మఱియు సామాన్య ఖాండంబు గూర్చి యచ్చట నిల్పికొని
యందు తోయ
ములనుంచి యాఖాండముల యట్ల నర్చనలగడగాజేసి యట్టి తోయముల
రమణమౌ మూలమంత్రమున మంత్రించి - మమతతో నట్లభి మంత్రించి
జలము
సాక్షాత్కరించు పూజాద్రవ్యములను ప్రోక్షించి యవియునప్పుడు శుద్ధిజేసి
సాధించియర్ఘ్యాచమన సుపాద్యములు - నాదిగాగల వానికని వేఱువేఱు
పాత్రల బెట్టి శుభంబుగా నంటి- పాత్రల నింద శాబరముల నిల్పి
పాత్రంబుగానట్ల బంగు సామాన్య పాత్రయు శాశన - పాత్రయు నిల్పి
పరగ జగములు నిత్య పాత్రల యందు - నరుదంద గంధ
పుష్పాక్షతలనిల్పి
ఆ యీశ్వరేశ్వరు - నర్చించువేళ - పాయక గంధ పుష్పా
క్షతలు మఱియు
నాదిగా గలుగు పూజా ద్రవ్యములను విధముగా దన యొక్క
విభవబు కొలది
పూజించి ఆ మహా భూతేశు మీది రాజితంబైన నిర్మాల్యంబు దినియ
వ్రేళ్ల నడిమి వ్రే వెఱపున దర్భవ్రేలి సందున ముఖ్యవిరులు సంధించి
నర్మిలి నయ్యుమానాథుని శిరము నిర్మాల్యమును - భక్తి నిష్ఠ
బెంపొంది
తనరారు పెను వ్రేల దరువాతి వ్రేల - నను రక్తి దలచుచు
హర్షంబు తోద

నా మహాదేవుని నిర్మాల్య కుసుమములు - నేమంబుతో
దీసి నెక్షి వ్రేళ్ల సంధి
విరుల నెన్నగ నట్టి విశ్వ వల్లభుడు - శిరమున ధరియించే
జిత్తమున బూని

ఇదంతయు అగమ పూజా విధాన పద్ధతి. దీనిని చూచగా ఈ కవికి ఈ పద్ధతిపై విశ్వాసమున్నట్లున్నది. కాని కావ్యములో అక్కడక్కడ వీరశైవ ప్రకారముగా కవి కథలు చెప్పుటయు, వర్ణన చేయుటయు కాన్పించును. ఇదివరకు చెప్పిన పిట్టవ్వ కథ వీరశైవ సంప్రదాయము నందు ప్రచారములో నున్నది. పూసల నయనారు కథకూడ నిట్టిదే.

ఇంకను విక్రమ చోళుని కథలో అగమ సంప్రదాయములతో పాటు వీరశైవ సంప్రదాయములు లేక పోలేదు. శివలింగమును భక్తితో అభిషేకించి పసుపు కుంకుమలతో ఎట్లు పూజించినాడో విక్రమచోళుడు వీరశైవాచార విధిని షోడసోపచార విధిని పూజించుట విభూతి ధారణ మున్నగునవి కూడా అట్లే చేసినాడు. ఈ రెండు సంప్రదాయములు మిశితమై ఈ కావ్యములో గోచరించు చున్నవి. నవచోళ చక్రవర్తులు శివపూజాదురంధరులై శివలింగ పూజ లొనర్చుట అగమ పద్ధతిగాను, ప్రసక్తానుసారముగా బసవపురాణములో వచ్చు కథలు వీరశైవ సంప్రదాయమైనవి చెప్పబడుచున్నవి. పిట్టవ్వకథ పూసల నయనారు కథ ఇందులకు నిదర్శనము. ఈ రెండు సంప్రదాయములు ఈ కావ్యములో చక్కని సమన్వయముతో పెనవేసికొని యుండుట విశేషము.

విక్రమ చోళుని కథయందే చివర విక్రమచోళుడు 'గండ కత్తెర' వేసికొనుట వీరశైవ సంప్రదాయము. ఈ 'గండ కత్తెర' వైచికొనుట సర్వేశ్వర శతక కర్తయగు అన్నమయ్య కూడ వేసినాడు. ఇట్లు చేయు సందర్భములో శివుడు ప్రత్యక్షమగుట వారికి కైవల్యము లభించుట జరిగినది.

ఇక ఉత్తుంగచోళ, అహివరచోళ, వరధర్మచోళ, సత్యేంద్రచోళుల కథల సారమిది. ఉత్తుంగ చోళుడు సంతానార్థియై చిరకాలము తపము సేయుటయు, చివఱకు అహివర చోళుడను కుమారుడు కల్గుటయు, అతడు విశ్రృంఖ

లలగు మదవు ఢేన్గుల సయితము నిగ్రహింపగల విక్రమముగల వాడగుటయును పిమ్మట అహివరునికి పట్టము గట్టుటయును, అహివరునకు శైవమతాసక్తియు నీశపదభక్తియును, హెచ్చుకాగాకోటిలింగార్చనా నియమమును పెట్టుకొనుటయు నీశ్వరు డతనిని పరీక్షించి కైవల్యమొసగుటయును అనునది ఉత్తుంగచోళ అహివర చోళుల కథలలోని సారము. శివానుగ్రహమువలననే ఉత్తుంగ చోళునకు సంతానప్రాప్తియగుట ఈ కథలోని విశేషము. శివానుగ్రహము వలన జన్మించిన వాడుగావున అహివరుడు బహుపరాక్రమశాలియై శివభక్తుడు కూడనైనాడు.

వరధర్మచోళుడు తిర్యగ్జంతువులకైనను శివసాక్షిగా ధర్మము తీర్చెద నని గంటకట్టుటయును, వరధర్ముని కుమారుడు బాహ్యాళికేగు సమయమున నాయలజడిలో నన్యాయముగా తనవత్సమును గోల్పోయిన ఆవు ఒకటి ధర్మాస నమునకు వచ్చి తగవు తీర్పవేడుటయును, వరధర్మచోళుడు క్రమముగా విచా రణసేసి కుమారుడైన సత్యేంద్రచోళుడు చేసిన యపరాధమునకు తగినట్లు ప్రాణదండన విధించుటయు, నీవార్త తెలిసి సత్యేంద్రుడు తనంతదానే తెగుట యును, గ్రమముగా మంత్రితత్సుతాదులు తెగుటయును ఇదివిని వరధర్మ చోళుడు సైతము గండకత్తెర వైచుకొనయత్నింపగా ఈశ్వరుడు ప్రత్యక్షమై అందఱను కైలాసమునకు గొంపోవుటయును ఇందలి కథాంశము

ఈ కావ్యములో తృతీయాశ్వాసమున ఉత్తుంగ చోళునికథ, అహివర చోళుని కథ మున్నగు అంశములు చెప్పబడినవి. ఈ ఆశ్వాసములో కూడ అహి వర చోళుని వృత్తాంతములో ఆగమోక్తశైవ పద్ధతి కాన్పించుచున్నది. అహి వరుడు దిగ్విజయ యాత్రకు వెడలుట మొదట ఈశ్వరుడు ప్రత్యక్షమగుట యను ఘట్టమువరకు అహివరుడు శివునిభక్తి భావముతో స్తుతించుట, శివపూజ మున్నగు ఘట్టములన్నియు ఆగమోక్త శైవసంప్రదాయముతో కూడినవే.

వరధర్మచోళుని వృత్తాంతమంతయు వీరశైవపద్ధతిలో చెప్పబడినది. పేదరాలు తనకుమారుని మృతి రాజున కెఱింగించుట సత్యేంద్రచోడుడు తనే కుమారుని వధింప నుత్తరువు నొసగుట రాకొమారుడు తన శిరమును తాన ఖండించుకొనుట, పేదరాలును తనంతదాదెగుట, మితవచనుడు తన శిరమును

తానే ఖండించుకొనుట ఇత్యాదివిషయములలో మనకు వీరశైవ సంప్రదాయమే గోచరించు చున్నది. విక్రమచోళుని కథలోవలెనే ఉత్తుంగచోళుని కథలోకూడా ఆగమశైవ, వీరశైవ సంప్రదాయములు పెనవేసికొని యున్నవనుట అతిశయోక్తి కాదు.

ఇక చతుర్థాశ్వాసములో మనుజేంద్రచోళుని కథ చెప్పబడినది. దీని ప్రకారము మనుజేంద్రచోళుడు తన పట్టణములో శివలింగమును స్థాపించి అచట శివాలయము కట్టించి గౌరీశ్వరునకు లక్షదీపముల నియమము పెట్టుకొనెను. దానికొఱకు విరివిగా నువ్వులను పండించెను. ఆ నువ్వులను రాశిపోసి ముద్రలువేసి కావలికట్టెను. అదిచూసిన మునిపాలు డనువాడు అచటినుండి వెడలుచు నువ్వుల రాశినుండి నువ్వులు తీసికొని తన పుక్కిట పోసికొనెను. అది చూచి పుణత నవ్వెను. అట్లు నవ్వుటకు కారణమేమిటని ప్రశ్నించగా పూర్వము నేను మనుజుడనే. అప్పుడు నువ్వుచేనులో ప్రవేశించి నువ్వులనుభవించుటచేత పశురూపమెత్తితిని. దానిని తీర్చుకొనుటకు దీనికి కావలి యున్నాను. నీవుకూడా నువ్వులననుభవించితివిగాబట్టి నీకట్టి ఋణమేకలుగునేమో, యని పలికెను. ఇది తెలిసిన మనుజేంద్రుడు ఆజ్ఞాపించగా భటులు మునిపాలుని బంధించి ప్రభువునెదుటకు తెచ్చిరి. అతనిని దండించమని కోరిరి. కాని మనుజేంద్రుడు అతని శుభ చిహ్నములుచూచి మహాత్ముడని భావించెను. నువ్వులు అనుభవించుటకు కారణమేమని యడిగెను. అంత మునిపాలు డిట్లనెను. "మహారాజా, తిలలు అనుభవించి సుస్థిరముగా శివుని ఋణస్థుడగుటకు ఇట్లుచేసితిని. రాజు అతనిని కొనియాడెను. "నేనును శివునికి ఋణస్థుడనగుదు" నని మహారాజు పలికెను. దానికేమి చేయవలెనని ప్రశ్నించెను. అంత మునిపాలుడు తన యొద్దనుండి తిలలు గ్రహించగా అట్లు జరుగునని చెప్పెను. మహారాజు అటులే మునిపాలుని వద్దనుండి నువ్వులు గ్రహించెను. ఇదిచూచిన శివుడు పార్వతీదేవితోకూడ ప్రత్యక్షమై వారికి సాయుజ్యము ప్రసాదించెను.

బహుశ మనుజేంద్రచోళునికథ లోకములో ప్రచారములో ఉండి యుండగా లింగనకవి ఈ కావ్యములో గ్రహించి యుండును. ఈ కథలో ప్రధానవిశేషమేమనగా ఈ చోళునికి శివారాధనము చేయుటకు లక్ష జ్యోతులు వెలిగించు నియమముండెను. ఆ నియమమును పాటించుటకు అతడు నువ్వులరాశి

వృత్తాంతము కూడ యధార్థము కాకపోదు. మునిపాలుని కథవలన ఈ చోళ రాజునకు కైలాస ప్రాప్తి కలిగినట్లు చెప్పబడినది. లోకములోని కథనే కవి గ్రంథస్థము చేయుట దీనిలోని ప్రధానాంశము.

ఇదే ఆశ్వాసములో కవి వీరచోళ, ఉత్తమ చోళుల కథలను చెప్పి యున్నాడు. వీరచోళుడు పరమ శైవుడై సహస్ర పుష్పార్చన నియమము జరుపుకొనుచుండుటయును, ఒకనాడు ఈశ్వరుడు అతనిని పరీక్షింపనెంచి వేయిపుష్పములలో నొకదానిని తగ్గించుటయును, వీరచోళుడు నియమ భంగమునకు వగచి స్వశిరకర్తనమును చేసికొన బూనుటయును, అంత నీశ్వరుడు ప్రత్యక్షమై కైలాసమునకు గొనిపోవుటయు నితని కథయందలి సారము. ఇక ఉత్తమ చోళుడు తనుయేలు రాజ్యంబునందు క్షామడాంబరాదికములు రాకుండ పాలింతునని శపథమూనుటయు నీశ్వరుడతనిని పరీక్షించుటకై తపసిరూపమున వచ్చి తాను రోగపీడితుడననియు తన రోగము మాన్పుమనియు జెప్పుకొనగా భక్తిమహిమాను కీర్తనముసేయుచు తన చేతిలో నిమిడి యాతని వ్యాధిని పోద్రోలుటయు నంత నీశ్వరుడు ప్రత్యక్షమై అతనిని కైలాసమునకు గొని పోవుటయు నిందలి కథాసారము. ఈ వీరచోళ ఉత్తమ చోళుల కథలలో కూడ వీరశైవ సంప్రదాయమే చెప్పబడినది. పాల్కురికి సోమనాథుని కావ్యములలో, యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకములో చెప్పిన వీరశైవ సంప్రదాయములే లింగనకవి ఈ నవచోళ చరిత్రలో కూడ చెప్పినాడు. కాలానుసారము కేవలము వీరశైవ సంప్రదాయములే కాక, ఆగమ విధానముతో ముడి పెట్టి చెప్పుట ఈ కావ్యములో విశేషము.

ఇక పంచమాశ్వాసములో భైరవరాజు కథ చెప్పబడినది. నవచోళ చక్రవర్తుల యొక్క వీరమహేశ్వరాచార వైభవ పూర్ణములగు కథలను వినుచు తనకును కాలమాసన్నమైనదని యెఱింగి భైరవరాజు ఈశ్వరుని దేశమున దీక్ష గొనుటయును, నతనిని పరీక్షింపనెంచి ఇంద్రాదులు ఘోరముగా వర్షించుటయును, ప్రసక్తాను ప్రసక్తముగ కైకాలి కేతయ్య మున్నగు భక్తవరుల చరిత్రల నువన్యసించుటయును భైరవరాజు వీరశైవ విభవములను ప్రదర్శించి గణార్చనాదులను జరిపి కీర్తిగొని ఈశ్వరుని ప్రత్యక్షము చేసికొని కైవల్యము నొందుటయు నిందలి కథాంశము. ఈ కథలో భైరవరాజు కైవల్యము నొందు

టతోపాటు సందర్భ వశమున కైకూలి కేతయ్య కూడ కైలాసమునకేగుట కవి చెప్పినాడు. ఇది పరమశైవుడైన కేతయ్య శివుని సాన్నిధ్యము నెట్లు బడసెనో తెలుపు చున్నది. కేతయ్య నిత్యము శివభక్తుల ఇండ్లలో కూలిచేయుచు ఆ సంపాదనతో నిత్యము జంగ మార్చన గావించుచుండువాడు. వీరశైవులకు జంగమారాధన ముఖ్యవిధులలో నొకటి. జంగమార్చన చేసినగాని వారు భుజింపరు. వీరశైవులకు ఈ నియమము కలదు. ఇట్లుండగా పార్వతీదేవి శివునితో న్యితము జంగమార్చన చేయు భక్తుని చూపమని కోరగా శివుడు అట్లేయని కేతయ్య ఇంటికి జంగమవేషములో పార్వతీ పరమేశ్వరు లిరువురును ఏతెంచిరి. కేతయ్య వారిని ఉచిత రీతిని సత్కరించి కూర్చుండజేసి, తాను కూలికి పోయి వచ్చిన తరువాత వారి కోరిక మేరకు వారిని తృప్తి పఱచెదనని చెప్పి కూలి చేయుటకు సతీసమేతుడై గ్రామములోనికి బయలుదేరెను. ఎచటను కూలివని దొరకదయ్యెను. అంత సతి, తాను కలిసి చుట్టు ప్రక్కల పల్లెలకు కూడ వెడలిరి. తిరిగి తిరిగి ఎచటను పని దొరకక ఇంటి కేతెంచిరి. అంత కైకూలి కేతయ్య తన తల తాకట్టు పెట్టి కూలి తెచ్చి జంగముని, సతీదేవిని తృప్తి పరతునని తలనఱికికొనెను. కేతయ్య భార్య ఆతల తీసికొనివెళ్లి కొంత పైకము తీసికొని వచ్చి జంగమార్చన చేయుటకు మొదలిడెను. లోకులందరు భార్య భర్త శిరము అమ్ముటను జూచి ఎగతాళి చేసిరి. అయినను జంగమార్చన యందాసక్తి కలదియగుటచే నా భార్య ఆ పని చేయుటకువెరపలేదు. జంగముని, వాని భార్యను యధారీతిని సత్కరించుట కుపక్రమించెను. అంతనా జంగముడు భార్య ఒక్కతియే తమను పూజించుట పనికి రాదనియు తల భాగము లేని భర్త ఉన్నను లేని వానితో సమానమేనని పలుకగా ఆమె భర్త తలకొఱకు పరమేశ్వరుని పలు పలు విధముల ప్రార్థింప దొడంగెను. అంత పరమేశ్వరుడు ఆమె ప్రార్థన విన్నవాడై కైకూలి కేతయ్యకు తల యధారీతిగా వచ్చినది. అంత ఈశ్వరుడు కేతయ్య దంపతులకు ప్రత్యక్షమయ్యెను.

"కైకూలి కేతయ్య ఘనుడ నీ మహిమ-కైకొని వర్ణింపగా మాకు దరమె
కైకూలి పుట్టక కరమర్థితోడ - గైకొని శిరము తాకట్టుబెట్టి యిట్టి
జంగమార్చన సేయజాలితి వీవు - జంగమ భక్తుడవు స్వచ్ఛచరిత్రుడవు
సంతతమునుభక్తి సతిపతుల యొక్క అంతరంగంబుల నరసిచూచితిని

మీ భక్తి కెదురేది మేది నీస్థలిని - ప్రాభవంబుగ మీ ప్రభావంబునకును
మెచ్చితి ప్రమథత్వ మిచ్చెదమీకు - మెచ్చుగైకొనుమన మెలతయు
బతియు"

యనుచు వారి భక్తికి మెచ్చి వారి ననేక విధముల కొనియాడెను. కైవల్యము ప్రసాదించి కైలాసమునకు గొనిపోయెను. భైరవునికి, కైకూలి కేతయ్యకు కూడ నీ కథలో కైవల్య ప్రాప్తి సిద్ధించినది.

వీరశైవ మతి త్వరలోనే అంతరించినను ఆయా భక్తుల కథలు అనేక సందర్భములలో శైవకావ్యములలో ప్రశంసింప బడుట కానవచ్చుచున్నది. అందులకు తార్కాణముగా నవచోళ చరిత్రము, హరవిలాసము మున్నగునవి పేర్కొనవచ్చును. నవచోళ చరిత్ర యందలి కొన్ని వీరశైవ కథలలో కైకూలి కేతయ్య కథకూడ ప్రసిద్ధి వహించినట్టిదే. శ్రీనాధుని హర విలాసములో చిఱుతొండనంబి కథలో సిరియాళ చరిత్రకూడ కైకూలి కేతయ్య కథను పోలియుండుట గమనించదగిన విషయము. జంగమారాధనయందు చిఱుతొండని దంపతులు మిగుల నాసక్తి గలవారై కన్న బిడ్డను జంగమునకు వండిపెట్టుటకు వెనుదీయలేదు. ఈశ్వరుడు పెట్టిన పరీక్షలో దంపతులిరువురు గెలుచుటయే కాక తమ కుమారుడగు సిరియాళుడు కూడా గెలిచినాడు. మా బాలుని మాంసము వండి వడ్డించిన పిదప ముఖ్యాంగమగు శిరోమాంసము వడ్డించనందులకు జంగముడు చిఱుతొండనంబి దంపతుల కింకను పుత్ర వ్యామోహము తీరలేదని శిరో మాంసములేనిదే తాముభుజింపమని చిఱుతొండన ప్రశ్నింపగా ఆతడు శిరోమాంసమునుగూర్చి భార్యనడగగా ఆమె దానినివేరుగా తయారుచేసి యుంచితినని వక్కన చేయును. ఇంకను సంతృప్తి పొందక జంగమ దంపతులు సిరియాళునితో సహా వారు తమతో కలిసి భుజింపవలెనని షరతు పెట్టినారు. దానికి కూడా వారంగీకరించి అనేక విధముల బాలుని పిలవగా వాడు ప్రత్యక్షమగుట చివరకు వారికి కైలాస ప్రాప్తి లభించుట ఈ కథ యందలి సారాంశము. ఇట్లే కైకూలి కేతయ్య కథలో ఆ దంపతులుకూడ కూలి దొరకక అనేక విధముల పాట్లుపడి చివరకు కేతయ్య తల తాకట్టుపెట్టి భార్య శివార్చన చేయుటకు సిద్ధపడినది. భర్త లేకుండ జంగమార్చన చేయరాదను నియమము వారామెకు తెల్పుట ఆమె ప్రార్థనా ఫలమున తెగిన తల మొండెము శరీరముతో నేక మగుట జరిగినది. జంగముని పరీక్షలో వారునెగ్గి.

ఆ విధముగా వారికి కైలాసప్రాప్తి జరిగినది. "తలతాకట్టు పెట్టియుండుటను" అను నానుడి బహుళ ఈ కాలము నుండి మనభాషలో ప్రవేశించి యుండును ఈ విధమగు కథలు చెప్పుటకు ఆద్యుడు పాల్కురికి సోమనాథుడే. ఆయన ప్రతిపాదించు శైవమతములోని కథలు బహుళ ప్రచారమునొంది తరువాత వెలువడిన అనేక శైవకావ్యములలో ప్రసక్తాను సారముగా తెల్పబడుట విశేషము. తరువాతి కాలములో బహుళ ప్రచారము నొందిన ఆగమశైవ సంప్రదాయముతోపాటు వీరశైవ సంప్రదాయముకూడ కొన్నిచోట్ల బహుళముగను, కొన్నిచోట్ల నిమిత్త మాత్రముగను చోటు చేసికొన్న దనుట అతిశయోక్తి కానేరదు. నవచోళ చరిత్రలో వీరశైవ సంప్రదాయము, ఆగమ సంప్రదాయముతోబాటు పెనవేసి కున్నదని చెప్పవచ్చును.

నవచోళ చరిత్రలోని ప్రధాన కథలను ఉల్లేఖించి వానిని చర్చించితిని. ఇట్లు చూడగా దీనిలో రెండు విశేషములు స్పష్టముగా బయల్పడుచున్నవి. 1) చారిత్రక కావ్యక్తులైన చోడరాజుల జీవిత విశేషములను, వారిశైవభక్తి నిరతిని విస్తరించి చెప్పుట ఒకటి 2) ప్రసక్తాను ప్రసక్తములుగా సామాన్యులైన శివభక్తుల కథలను వర్ణించుట రెండవది. ఈ కథలు సత్యములై చారిత్రకము లగునో కాదో మనకు తెలియదు. కాని పరంపరగా శైవసంప్రదాయమున ప్రచారమందున్నమాట మాత్రము యదార్థము. లోకములో వినుకలినిబట్టి ప్రచారము చెందిన ఈకథలను చారిత్రక వ్యక్తులైన చోళచక్రవర్తులతో జోడించుట వలన ఈ కథలకు ఒక ప్రామాణ్యము ఏర్పడినది. ఇట్టి పద్ధతి శైవ రచయిలయందు నవచోళచరిత్ర రచనకు పూర్వమే కన్పించును. పాల్కురికి సోమనాథుడు అద్భుతమైన సామాన్యుల కథలను చారిత్రకవ్యక్తి బసవేశ్వరునితో జోడించెను. సిద్దేశ్వర చరిత్రలో కాసే సర్వర్స ఇటువంటి కథలను కాకతీయ ప్రతాప రుద్రునికి జోడించి చెప్పెను. పోశెట్టి లింగనకవి కూడ ఇదేమార్గమును అనుసరించినాడు.

ఇట్లు నవచోళ చరిత్ర శైవ ప్రాధాన్యమును, నిరూపించు కావ్యములలో ఒకటిగా నిలుచుచున్నది.

# శ్రీనాథుని కావ్యములు – శైవనిరతి

శివకవుల యుగము తర్వాత పేర్కొనబడినది కావ్యయుగము లేదా శ్రీనాథయుగము. ఈ యుగమునే ప్రబంధ పూర్వయుగమని, సంధికాలమని కూడ చెప్పుదురు. ఇటు ప్రబంధ యుగిమునకు, అటు పురాణ యుగమునకు మధ్య నడుమి కాలముగా ఈ యుగము పేర్కొన బడుట వలన సంధి యుగ మను పేరు దీనికి కలిగినది. ఎఱ్ఱన పురాణమే వ్రాసినను ప్రబంధ పరమేశ్వరు డను బిరుదు సంపాదించినాడు, ఎందువలననగా 'నృసింహ పురాణము' ప్రబంధ చ్ఛాయలు కన్పించు మొదటి గ్రంథరాజము కాబట్టి.

ఇక కావ్యయుగ ములో ప్రధానముగా పేర్కొనదగిన వాడు శ్రీనాథుడే. ఈతడు పెక్కు కావ్యములు రచించినాడు. రెడ్డి రాజుల ఆస్థానకవియై భోగ భాగ్యము లనుభవించిన మహాకవి శ్రీనాథుడు.

ఈతడు శివభక్తుడు. భీమఖండ, కాశీఖండములలో, హరవిలాసములో, శివరాత్రీ మాహాత్మ్యములో ఈతని శివభక్తి నిరూపితమగుచున్నది. శ్రీనాథుని ఆదరించిన రెడ్డి రాజులు కూడ శివభక్తులే. వీరిలో వీరభద్రారెడ్డి, బెండపూడి అన్నమంత్రి, పెదకోమటి వేమారెడ్డి మున్నగువారిని పేర్కొనవచ్చును. మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లిన రెడ్డిరాజుల కాలములో శ్రీనాథుడు మహా రాజ్యభోగము లనుభవించిన భోగశాలి. ఈతని కృతులలో ఆ భోగము లన్నియు అచటచట వర్ణితము.

శ్రీనాథుడు పాకనాటి నియోగి బ్రాహ్మణుడు. భారద్వాజస గోత్రుడు. ఆపస్తంభ సూత్రుడు. కమలనాభుని పౌత్రుడు. మారయామాత్యుడు, భీమాంబ ఈతని తల్లి తండ్రులు.

మన పురాణములలో 'శివ' నామము అనేక చోట్ల ప్రవచింపబడినది. త్రిమూర్తులలో శివుని ఆధిక్యత కూడ కొన్ని చోట్ల వివరింపబడినది. శివుని

మాహాత్మ్యము చెప్పుట, శివుని ఆధిక్యము వర్ణించుట గలదు గాని, వైష్ణవమును ద్వేషించుటగాని, శివుడు తప్ప వేరే దేవుడు లేడని చెప్పుటగాని ప్రాచీన కావ్యము లలోను, పురాణములలోను లేదు. ఒక్క శివకవుల యుగములో, వీరశైవ సంప్రదాయము వర్ణించు గ్రంథములలో పరమత ద్వేషము కన్పించును తప్ప వేరుచోట్ల శివుడొక్కడే దేవుడన్న మతము లేదు. ఒక్క మాటలో చెప్పవలె నన్న "త్రిమూర్త్యాత్మకమైన శైవము" ఆగమ శైవమని చెప్పవచ్చునేమో! బ్రహ్మ, విష్ణువు, శివుడు ముగ్గురు సమానమే. ఆరాధనా విధాన మొక్కటియే. తిక్కన 'హరిహరాద్వైతము' కూడ శివకేశవులకు భేదము లేదని చెప్పుట కొఱకే.

వైదిక కర్మ మార్గమునకు, విగ్రహారాధనకు ప్రాముఖ్యత ఆగమ శైవములో కలదు. శివుని కభిషేకము చేయుట, శివాలయ ప్రతిష్ఠాపన, శివ పూజ మున్నగునవి ఇందుల కుదాహరణములు. లింగధారణ, జంగమపూజ యిత్యాదులిందు కానరావు. భక్తి మార్గమునకు వీరశైవము, కర్మమార్గమునకు ఆగమశైవము, యోగమార్గమునకు నాథ సంప్రదాయము ఉదాహరణ లన వచ్చును.

ఆగమ శైవ సంప్రదాయము కూడ కడు ప్రాచీనమైనదని చెప్పుటకు భరత ఖండమున ప్రసిద్ధములైన శైవ క్షేత్రములే తార్కాణములు. కాశీ విశ్వనాథుడు, కాశ్మీరమున అమరనాథేశ్వరుడు, గుజరాతున సోమనాథుడు, ఉజ్జయినిలో కాల కాలేశ్వరుడు, కర్ణాటకమున గోకర్ణుడు, తమిళ దేశమున చిదంబర నటరాజ స్వామి, ఆంధ్రమున శ్రీశైలము, ద్రాక్షారామము, కాళేశ్వ రము ప్రసిద్ధ శివక్షేత్రములై యున్నవి. కృత యుగమున కేదారము, త్రేతా యుగమున వారణాసి, ద్వాపరమున హంపి (విరూపాక్షుడు), కలియుగమున శ్రీ పర్వతమే మూలస్థానములుగా పేర్కొనబడినవి.

ఇఁక వీరశైవ సిద్ధాంతములో వచ్చు షట్స్థల, పంచాచార, అష్టావరణ ముల గూర్చి గడచిన ప్రకరణములలో చర్చించి యుంటిని.

ఇఁక శ్రీనాథుని కావ్యములు పరిశీలించిన యెడల అతని శివభక్తి తత్త్వము, శైవనిరతి అవగాహన కాగలదు. శ్రీహర్ష నైషధము ప్రౌఢనిర్భర

పయఃపరిపాకమున శ్రీనాథు డనువదించినట్లు చెప్పినాడు. శ్రీనాథుని కావ్యములలో శృంగార రసపూరితమగు కావ్యమది యొకటియే. భీమఖండము, కాశీఖండము, హరవిలాసము, శివరాత్రి మాహాత్మ్యములలో శ్రీనాథుని శైవనిరతి మన కవగతము కాగలదు. భీమఖండ, కాశీఖండములలో స్థలమాహాత్మ్యముతో బాటు, శివభక్తుల కథలు శివుని మాహాత్మ్యముకూడ చెప్పబడినది.

## భీమేశ్వర పురణము

ఆంధ్రదేశములోని మూడు ప్రసిద్ధ శైవక్షేత్ర ములలో ద్రాక్షారామ మొకటి. దాని మహత్త్వమును శ్రీనాథుడు భీమ ఖండమున ఈ విధమగా చెప్పియున్నాడు.

ప్రసిద్ధినొందిన స్థలమాహాత్మ్యములలో భీమేశ్వర పురాణ మొకటి పంచారామములలో (దాక్షారామము, అమరారామము, క్షీరారామము, కుమారారామము, ద్రాచ్యారామము) అను ఐదారామములలో ద్రాక్షారామ మొకటి. దీనినే దక్షిణకాశి యనికూడ అందురు. ఈ క్షేత్రమాహాత్మ్యము చాలగొప్పది. ఉత్తర హిందూ స్థానమున కాశీక్షేత్రమెంత ప్రసిద్ధమో దక్షిణ హిందూ స్థానమున దక్షిణకాశి నాబడు దాక్షారామము కూడ నంత ప్రసిద్ధినొందిన ప్రాచీన క్షేత్రమయి యున్నది. ఇచ్చటి భీమేశ్వరస్వామిని శ్రీనాథుడు పదునాల్గు మహాయుగముల ముపవేల్పనియు, సప్త పాతాళ భువన విష్కంభముల వినిర్భేదించి యావిర్భవించిన దివ్యస్వయంభూ జ్యోతిర్మహా లింగమూర్తియనియు, యువనాశ్వుడు, మాంధాతృడు, ఇక్ష్వాకుడు మున్నగు సనాతన చక్రవర్తుల కాలమునుండి సేవింపబడినవాఁడనియు వర్ణించి యున్నాడు శ్రీనాథునకు నాల్గు శతాబ్దులు ముందుండిన నన్నయ్య భట్టారకుడుగూడ భారతములో అర్జునుని తీర్థయాత్రా వర్ణనములో వేంగీదేశ విభవము నుగ్గడించుచు

> "దక్షిణ గంగనాదద్దయునొప్పిన
> గోదావరియు జగదాదియైన
> భీమేశ్వరంబును బెడగుచున్న శ్రీ
> పర్వతంబును జూచి యుర్విలోన"

అని దక్షారామ భీమేశ్వరుడు జగదాదినుండియు నున్నవాడని యుద్ఘాటించి కృతిపతియగు రాజరాజును "భీమేశ్వర కృత నిత్య ప్రసాద సౌజన్య గుణా

ఖరణా" అనికూడ వర్ణించినాడు. కాబట్టి నీక్షేత్ర ప్రాచీనతను గూర్చి శ్రీనాధునకెట్టి భావనయుండెనో నన్నయకు గూడ నట్టి భావనయే యుండెనని వ్యక్తమగుచున్నది. కాని నేటి విమర్శకులు గొందఱిందుకు విరుద్ధముగ నిది యంతగా ప్రాచీనక్షేత్రము కాదనియు, అదియు నచ్చటి భీమేశ్వరలింగము క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దిలో పరిపాలించిన ప్రథమ చాళుక్య భీముని కాలమున వెలసినదనియు క్షేత్ర మాహాత్మ్య ప్రశస్తికొఱకు శ్రీనాదుడే తెలుగుభీమేశ్వర పురాణమును రచించి ఆ పిమ్మటనే దాని ననుసరించి సంస్కృత పురాణమును నిర్మించెననియు విపరీతాభిప్రాయములు వెలువరించు చున్నారు. దాక్షారామ క్షేత్ర మర్వాచీన మనేడు యభిప్రాయమునకు బీజమునాటినవాడు శ్రీ కొమఱ్ఱాజు వెంకట లక్ష్మణరావు పంతులుగారు గోదావరీ మండలములో దక్షారామమున కిరువదియైదు మైళ్ళ దూరములో సామర్లకోట దగ్గర బంచారామములలో నొకటి యగు కుమారా రామక్షేత్రము గలదు. అచ్చటి శివలింగమునకు గూడ భీమేశ్వరుడని పేరు - అందుచే నాక్షేత్రమునకు గుమారారామ భీమవరమను వ్యవహార మేర్పడినది. ఇది కొంత కాలము ప్రథమ చాళుక్య భీముడను చాళుక్యరాజునకు రాజధానిగా నుండుటయో దాని నాత డుద్ధరించి పునర్నిర్మాణ మొనర్చుటయో కారణముగా దీనిని చాళుక్య భీమవరము, చాళుక్య భీమపట్టణము అనునామము లాతని నాటినుండి యేర్పడినవి.

ఇంక కొంతకాలము చాళుక్య రాజధానిగా నుండెననుటకు భీమేశ్వర పురాణమందలి "చాళుక్య వంశరాజధానియగు చాణుక్య భీమవరమగు గ్రామంబున గుమార రత్నంబైన కుమారస్వామి చేత బ్రతిష్ఠితంబగుట జేసి కుమార భీమలింగంబన బ్రఖ్యాతంబు నొందిన భీమారామంబును" అను శ్రీనాధుని వాక్యము గూడ సాక్ష్యము కాఁగలదు. దాక్షారామ, కుమారారామములందలి భీమేశ్వర లింగములకు దదాలయములకు నౌన్నత్యాదిక విషయములలో చాల పోలికలు గలవు.

ఇఁక భీమేశ్వర పురాణమునకు మూలము స్కాంద పురాణమే యను ప్రతీతి నిజమే కావచ్చును. కథను స్కాందము నుండి గ్రహించి శ్రీనాదుడు ద్రాక్షారామ పురవర్ణన మున్నగునవి స్వవిరచితము చేసెను. ఇట్టి వర్ణనల

వలన శ్రీనాథుని దేశాభిమానము, ముఖ్యముగా త్రిలిఙ్గ దేశాభిమానము వ్యక్తమగుచున్నది. ద్రాక్షారామమాహాత్మ్యము కూడ ఇందుమూలమున తెలియుచున్నది.

1 భీమేశ్వర పురాణములోని ప్రధాన విషయము, ముఖ్యముగ దాక్షారామవాసియైన భీమనాయకుని మహిమను వర్ణించుటయేకాని దాని కుపష్టంభకముగ నీ పురాణములో భీమమండల చరిత్ర మంతయు జిత్రింపబడినది. శ్రీనాథుని రచనలో గానవచ్చెడి యీ చరిత్ర మంతయు సంస్కృత మూలమునందును గలదు. కాని కొండవీటి రాజ్యపాలకుడుగా నుండిన పెదకోమటి వేమ భూపాలుని యాస్థానములో విద్యాధికారిగా నుండి శాసనకవియైన శ్రీనాథుడా చరిత్రమును తెనుగున సంతరింపదలపెట్టినపుడా పురాణము నత్యుత్తమ చరిత్రముగను ఆనాటి శాసనాద్యాధారములకు సరిగా సరిపడు దానినిగను జేసి పెట్టినాడు. శ్రీనాథుని ఈ రచనలో మన మాతని నాటి భీమమండలమునకు, చారిత్రక భౌగోళిక రేఖాచిత్రములను, సాంఘిక వ్యవస్థలనన్నిటిని స్పష్టముగ జూడగలము. ఇది భీమేశ్వర పురాణమునందు గానవచ్చు ప్రత్యేకత.

శ్రీనాథుడు ప్రాసాద పంచాక్షరీ మంత్రోపాసకుడు. పరమశివు డాతని కద్వైత భక్తిభావోపాస్యుడు. శివుని మహిమాభివర్ణనమందా తనికి మక్కువ యెక్కువ. ఈశ్వరార్చన కళాశీలుడై తాను రచించిన రచనల నన్నిటిని పరమేశ్వరాలంబనముగానే కొనసాగించి యున్నాడు. భీమనాథుని యెడ అఖండిత భక్తిభావము కలిగిన వాడుగా శ్రీనాథుడు భీమేశ్వరపురాణములో దర్శనమిచ్చుచున్నాడు. శ్రీనాథుడు పుట్టినచోటు, అంతర్వేదికి సమీపమున, శంబరదీవికి దాపున, గోస్తనీ సాగర సంగమ స్థలమైన కాళీపట్టణము. ఇది పంచారామములని పరమ శివక్షేత్రములుగా ప్రసిద్ధి కెక్కిన సోమారామమునకు (గుణపూడికి) ఆరుక్రోసుల మేరలోనున్నది. అచటి కంత మేరలోనే క్షీరారామము కూడగలదు. గోస్తనికి గౌతమితో సంబంధము కలదు. దాక్షారామకుమారామములు గౌతమీనదీ శాఖలతో సంబద్ధములయినవి. ఈ విధముగ శ్రీనాథునకు జిన్ననాటినుండియు నాలుగారామములతో సన్నిహిత సంబంధము

---

1. శ్రీనాథకవితా సమీక్ష (భీమమండల చరిత్ర)

గలదు. ఈ వాలుగా రామములు భీమమండలాంతర్గతములే. భీమేశ్వరపురాణ రచనాక్రమములోనే శ్రీనాథునకు జాతీయాభిమానము. దేశియాభిమానము వ్యక్తము చేయుట కవకాశము లభించినదని చెప్పవచ్చును.

ఈ కావ్యము బెండపూడి అన్నమంత్రి ప్రోత్సాహమున రచింప బడినది. ఆ మంత్రి శైవమునందు, శివారాధకులయందు భక్తి శ్రద్ధలు గలవాడు. అతనిని గురించి శ్రీనాధుడే ఈ విధముగా చెప్పెను.

సీ॥ "ఏమంత్రి కులదైవ మిందుశేఖరుండు
దక్షారామ భీమేశు డఖిలకర్త"

ఇట్టి మంత్రి అట్లాదేశించెనట

మ॥ అరవిందాప్త కృతప్రతిష్ఠుడగు దక్షారామ భీమేశ్వరేశ్వరు
మాహాత్మ్యముతోడ గూడి భువన శ్లాఘాస్పదంబై యభం
గురమై స్కాంద పురాణ సారమగు శ్రీ గోదావరీ ఖండమున్
బరిపాటిన్ రచియింపు మంధ్ర జగతీ భాషాప్రబంధంబుగన్''
(ప్ర. ఆ.) (27 భీ. పు)

ఈ విశేషములు చూడగా శ్రీనాధునకు ఎంతటి శైవనిరతి కలదో తత్ కృతి భర్తయైన అన్నమంత్రికి కూడ శైవముమీద అంతటి అభినివేశమున్నట్లు స్పష్టమగుచున్నది. ఈ యిద్దరు మహానుభావులు ఏకముకాగా క్షేత్ర మాహాత్మ్యమనదగిన ఈ మహా కావ్యము తెలుగులో ఆవిర్భవించినది. శివభక్తులు శివభక్తులకు కావ్యము అంకితము చేయు పద్ధతి శ్రీనాధునకు వర్తించును.

భారతదేశ మంతటిలో ప్రాణులకు సకల కలుషహారములైన తీర్థములు రెండు. వానిలో నొకటి గంగానది, రెండవది గౌతమీనది; గంగానదీ తీరమున కాశీక్షేత్రముండుట, అది శ్రీ విశాలాక్షీ సమేత విశ్వేశ్వరావాసమగుటచే భుక్తి ముక్తిప్రదము. గోదావరీ తీరము శ్రీ మాణిక్యాంబా సమేతుడైన భీమనాధుని సన్నిధిచే భోగ మోక్షప్రదము. గంగానదీ తీరమునందు కాశీ క్షేత్రము, విశ్వేశ్వరాది వివిధ దేవతా నిలయమగుటచే నెంతటి పవిత్రత వహించినదో, కాశీక్షేత్రమందున్న వివిధ దేవతావర్గము సన్నిహితమగుట చేతను సప్త గోదా

వర తీర్థ సాన్నిధ్యము చేతను, భీమనాధావాసమైన దాక్షారామమున కంతటి ప్రశస్తి యేర్పడినది. దక్షారామ వాసియైన భీమేశ్వరుని సాన్నిధ్యము చేతనే, గౌతమీ సాగర సంగమ స్థలమునకు నలు దిక్కుల యందుండిన మండలము నకు 'భీమ మండలము' అను పేరేర్పడినది. ఆ సీమా విభాగ మీ క్రింది పద్యము నందిట్లు నిరూపిత మైనది.

"అంబుధిమేర తూర్పునకు, నబ్ధియ సీమటు యామ్య దిగ్విభా
గంబునకుం, బ్రతీచికిని గౌతమి సీమ, యుదీ చికిం బ్రమా
ణంబు త్రియోజనంబు, సురనాధుడు దక్షిణకాశీ భీమలిం
గంబున కేక భోగముగ గట్టడచేసె వసుంధరాస్థలిన్"

(భీ. పు. 5. 7)

"దివస్పతి శ్రీ భీమేశ్వరునకు భీమ మండలము సమర్పించుట" యను ఘట్టము లోని దీ పద్యము. భీమేశ్వరుడు దక్షారామమునందు ప్రతిష్ఠ నొందినప్పుడు, బృహస్పతి యుపదేశమున దేవేంద్రుడా దేవదేవునకు గొంత భూమండలమును ధారవోసెనని ఈ ఘట్టములో తెలుపబడినది. ఈ మండలమునకు తూర్పున సముద్రము (దక్షారామమునకు సరిగా మూడామడల దూరములో నుండిన భైరవ పాలెపు సముద్రము) మేర దక్షిణ దిక్కునకు అంతర్వేది సముద్రము హద్దు. పడమరకు గౌతమీ నది (రాజమహేంద్రవరము దగ్గఱనుండిన అఖండ గౌతమి) సరిహద్దు. ఉత్తరమునకు మూడామడలమేర, అనగా పిఠాపుర పరి సరమున బ్రవహించుచున్న ఏలానదీతీర భూమి సీమ. ఈ తీరుగ చుట్టు మూడామడల మేరలో నుండిన వలయాకార భూమికి భీమ మండలమని పేరు పెట్టి సురనాధుడు భీమనాధున కేకభోగముగా ధారవోసెనని ఈ పద్య భావము.

ఈ కావ్యములో శ్రీనాధుడు భీమేశ్వర మాహాత్మ్యముతో బాటు దాక్షా రామ క్షేత్ర మాహాత్మ్యము తెలిపినను వ్యాసుడు కాశినిబాసి ఘట్టము వర్ణించి నాడు. ప్రథమాశ్వాసములో కుకవి నింద, షష్ఠ్యంతములు, కృతిభర్త ప్రశంస మున్నగునవన్ని చెప్పి కథా ప్రారంభము చేసినాడు. ప్రారంభములోనే దక్షవాటి (ద్రాక్షారామము) పుర వర్ణన గావించినాడు. ఇది కేవలము క్షేత్ర

మాహాత్మ్యమే యైనను యెడనెడ ఆగమ సంప్రదాయ విశేషములు మనకు కాన్పించుచున్నవి. ఆలయ ప్రతిష్ఠాపన, లింగమున కభిషేకాదులు, శివలింగ పూజావిధాన క్రమమంతయు వివరింప బడినది. అందుచే నిందు కథా విశేషము లంతగా గోచరించుటలేదు. ఆంధ్రదేశములో పంచారామముల కున్న విశిష్టత శ్రీనాధుడు వర్ణింప దలచినాడు. ఈ వర్ణనలో అతనికి గల ఆంధ్ర దేశాభిమానము వ్యక్తమగుచున్నది.

భరత ఖండములోని ఆంధ్రభూమిలో శ్రీశైలము, కాళేశ్వరము, దక్షారామము అను క్షేత్రములందు తమ తమ వైభవములను ప్రదర్శించిన మూడు లింగములున్నవి. వానిలో శ్రీశైలమున మల్లికార్జున లింగము, మంథెన కాళేశ్వరమున కాళేశ్వర లింగము, దాక్షారామమున భీమేశ్వర లింగమును గలవు. ఈ మూడు లింగము లుండుటచేతనే ఆంధ్రదేశము త్రిలిఙ్గ దేశమను ప్రసిద్దిని వహించినది. ఈ త్రిలిఙ్గ దేశములోనే పరమేశ్వరునకు విహార స్థానము లైన* పంచారామము లు గలవు.

త్రిలింగములలో మొదటిదియైన శ్రీశైల మల్లికార్జున లింగము కృష్ణవేణీ నదీతీరమునందున్నది. రెండవదియగు కాళేశ్వర లింగము గోదావరీ నదీ తీరమున మంథెన సమీపమునం దున్నది. మూడవదియగు భీమేశ్వర లింగము నేటి తూర్పు గోదావరి జిల్లా రామచంద్రపురం తాలూకాకు జెందిన దాక్షారామమునందు గలదు. భీమేశ్వర పురాణములో బలుచోట్ల ఆంధ్రదేశము నకు త్రిలిఙ్గదేశమను వ్యవహారనామము ముండినట్లు శ్రీనాథుడు తెల్పినాడు. పంచారామములు పరమేశ్వరుని విహార స్థానములై వెలసినట్లు ఈ విధముగా నిరూపించినాడు.

"అనంతరంబా యంబికా వల్లభుండు కృతకృత్యుండై త్రిపుర దైతేయులకు గులదైవతంబైన యద్దివ్య లింగంబును బంచబ్రహ్మ, పంచాక్షరీ తత్త్వ పంచభూతమయంబగుటం జేసి పంచ ఖండంబులుగా ఖండించి కృష్ణవేణీ మహానదీ తీరమున ధరణాల కొటయను గ్రామంబున (దీనికి పూర్వము దాన్యకటకము ధరణికోటయని వ్యవహారము) నమరేశ్వరునిచేత బ్రతిష్ఠితం

* పంచారామము-లు పైన పేర్కొన బడినవి

డగుటంజేసి యమరలింగంబుగా ప్రసిద్ధంబైన యమరారామంబును (నేటి అమరావతి) గౌతమీ తీరంబున దక్షిణ కూలంబున గుణపూడియను గ్రామంబున సోమునిచేతం బ్రతిష్ఠితం బగుటంజేసి సోమలింగంబన ప్రఖ్యాతంబైన సోమారామంబును (నేడు దీనిని గుణుపూడి భీమవరమని యందురు) బాలకొలనను గ్రామంబున శ్రీరామచంద్రునిచే బ్రతిష్ఠితం బగుటంజేసి రామలింగంబుగా బ్రసిద్ధంబైన క్షీరారామంబును (ఇది నేటి పశ్చిమ గోదావరి జిల్లాలోని పాలకొల్లు) చాళుక్య వంశ రాజధానియగు చాళుక్య భీమవర నామ గ్రామంబున గుమార రత్నంబైన కుమారస్వామిచేతం బ్రతిష్ఠితంబగుటంజేసి కుమార భీమ లింగంబన బ్రఖ్యాతి నొందిన భీమారామంబును (ఇది నేటి సామలకోట భీమవరము) మొదటి మామయగు దక్ష ప్రజాపతి యునికిపట్టైన యారామంబటుట దక్షారామంబున శివసన్నిధానంబై తానుండునట్టుగా, నీ విధంబుగా భోగ మోక్షప్రదంబులైన పంచారామంబుల బ్రతిష్ఠ నొందించి తాను శ్రీ భీమేశ్వరలింగంబునం దధివసించె". (భీ. పు.)

[1] ఈ వాక్యములను బట్టి, పౌరాణిక క్రమము ననుసరించి, త్రిపురాసుర సంహారము జరిగిన తరువాత, త్రిపురాసురుల కుపాస్యమైన పరమేశ్వర లింగమును పంచ (అయిదు) ఖండములుగా ఖండించినపు డా పంచఖండములు పంచారామములుగ వేర డినవని తెలియుచున్నది. వానిలో అమరావతిలోను దాక్షారామములోను, గూమారారామము (సామలకోట భీమవరము)లోను నుండిన లింగములు పీఠము మీద నెనిమిది యడుగుల యెత్తు గలిగి యుండును. పాలకొల్లు గుణపూడి భీమవరములలో నుండిన లింగములు పీఠములమీద రెండడుగుల యెత్తు గలవిగ నుండును. అన్నిలింగములును స్ఫటికాకారములే. ఈ పంచారామములును వెనుకటి శతాబ్దులలో సైతము పరమ శివక్షేత్రములుగా శివభక్తుల కుపాస్యముగుచు వచ్చినట్టు లప్పటి[1] తామ్ర శిలా శాసనములు వక్కాణించుచున్నవి.

ఈ పంచారామములను గూర్చి కొంతకాలము క్రిందట నొక ప్రవాదము బయలుదేరినది.[2] "ఆరామము అను పేరు వెనుకటి కాలములో బౌద్ధ సంఘా

1. శ్రీనాథ కవితా సమీక్ష, శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి

1. శ్రీనాథ కవితా సమీక్ష, శ్రీ చిలకలూరి పాపయ్య శాస్త్రిగారు.

రామమునకే గలదు. ఆయారామములం దుండెడి యాయక స్తంభములనే శివ లింగములుగా మార్చి శైవము మనదేశములో వ్యాప్తిలోనికి వచ్చిన పిమ్మట పంచారామములుగా రూపొందివి" నారని యూహించుట జరిగినది. ఇట్లూహించు టకు మూలము, అమరారామమనబడు అమరావతి బౌద్ధ విహార స్తూపారామ చైత్యాదులకును, అమరేశ్వర లింగాదులకును నిలయమై యుండుట, అచట స్తూపాదులందు ప్రాచీనమైన బౌద్ధమునకు సంబంధించిన శాసనములు అర్వాచీన మైన శివభక్తితత్పరుల శాసనమును సమృద్ధముగా నుండినవి. ఈ విధముగ నుభయమతవ్యాప్తి చిహ్నముల శిథిలము లచట గొల్లలుగ గానవచ్చుటచే,అమరా రామమందు బౌద్ధ సంగారామముగా నుండి, తరువాత అమరేశ్వర ప్రతిష్ఠచే శైవారామముగ రూపొందినదని యూహచేసి, మిగిలిన నాలుగారామములుకూడ బౌద్ధ సంఘారామములే శైవారామములుగ రూపొందెనని నిర్ణయము చేసి యున్నారు. [1]

ఇట్లూహించుటకు గారణ మింకొకటి గలదు. బౌద్ధ సంఘారామాదులకు సంబంధించిన శిలా స్తంభములు తెల్లగానుండును. ఈ పంచారామములో నుండెడి శివలింగములు కూడ పాల శిలలుగా నుండినవి. ఆయక స్తంభముల శిలలెత్తుగా నుండును. స్ఫటిక శిలాకారమైన యీ లింగములుకూడ నెత్తుగానున్నవి. కావున నివి బౌద్ధ నిర్మాణమునకు సంబంధించిన శిలలే యీ లింగములుగా రూపొందిన వనియు శైవము వ్యాప్తిలోనికి వచ్చిన తరువాత బౌద్ధమును రూపుమాపుటకు జేసిన పనులలో, బౌద్ధ సంఘారామములే పంచారామములుగా రూపొందుట యొకటియనియు వారి ఊహ. కాని భారతదేసమునందు వెనుకటి కాలమునందు గాని, నేటికాలమునందుగని, శివలింగములను లేక విష్ణుమూర్తుల స్థాపించి దేవాలయాది నిర్మాణములు జరిగిన, తత్తదాగమోక్త విధానమున వైదిక తాంత్రిక పద్ధతులతో జరుగుచుండును గాని ఏవో కొన్ని శిలలను దెచ్చి వానిని లింగములుగనో విగ్రహములుగానో మార్చి, వాని నాగమోక్త పద్ధతిని ఆరా ధించుట జరుగుచుండుననుటకు దార్కాణమేమియు గానరాదని శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు భావించిరి. శాతవాహనుల కాలమునాటికీ దాక్షరామమున

1. శ్రీనాథ కవితా సమీక్ష, శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు.

భీమేశ్వరుడుండినట్లు తెలియుచున్నది. [1]అమరారామములో బౌద్ధ చిహ్నము లున్నను, దాక్షారామమునగాని, మిగిలిన మూడారామములలోగాని, వాని పరిసరములలోగాని బౌద్ధ నిర్మాణ చిహ్నము లేపాటియు గానరానిచోట, బౌద్ధ సంఘారామములే శైవారామలయినట్టు ఊహించుట పొసగదు.

నేపాలు దేశములో, ఉత్తర దేశములలో బౌద్ధ సంఘరామములు శైవారామములుగా మారినట్లు నమ్మవచ్చును. వేద ప్రామాణ్యము నంగీకరింపని బౌద్ధాదిమతానుయాయులు నిర్మించిన నిర్మాణములను, ధ్వంసము చేసి ఆ శిధిలములను శివలింగములుగా మార్చిరనుట భారతీయ వైదిక సంప్రదాయ విరుద్ధము. అన్య మతస్థు లుపయోగించిన శిధిలములను శల్యములని పరిహరింతురేగాని, పరిగ్రహించుటయనునది వినబడదు కనబడదు. కొన్ని తావులందు శక్తి విగ్రహములు శివలింగములుగను, విష్ణుమూర్తులుగాను మాఱినట్లు వినవచ్చుట చేతను, మహమ్మదీయుల పాలనమునా హిందూదేవాలయములు కొన్ని తావులందు మసీదులుగా మాఱినట్లు కానవచ్చుట చేతను, ఆదరించువారు లేని చోట ఆరాధనము లేక శిధిలములైన బౌద్ధాదిమత చిహ్నములను జూచి, పంచారామములు బౌద్ధ సంఘారామములుగా నూహింపబడినవియేగాని, ఆ ఊహ పరిగ్రాహ్యము కాదని శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు 'శ్రీనాధ కవితా సమీక్ష'యను పుస్తకములో పేర్కొనిరి.

శ్రీనాదుడు భీమేశ్వర పురాణములో పంచారామముల స్వరూపమును వివరించిన తీరులో చాళుక్య భీమునకు రాజధానియైన భీమవర గ్రామమునందు అనగా కుమారారామమునందు, కుమార భీమలింగమని ప్రఖ్యాతి నొందినవాడా భీమేశ్వరుడనినాడు. భీమేశ్వర పురాణములోనే మఱి రెండు చోట్ల శ్రీనాదుడు పేర్కొనిన పద్ధతిని బట్టి చూచినను, చాళుక్య భీమవర పరిసరమునకు కుమారారామమును వ్యవహారమున్నట్లును, అచటి భీమేశ్వరమునకు

1. సింహళదేశ కన్యయయిన లీలావతితో హాలుని (శాతవాహన చక్రవర్తి) వివాహము దాక్షరామ భీమేశ్వర సన్నిధానమున జరిగినట్లు కఊహల (కౌతూహల) కవి విరచితమైన లీలావఈ కహా (లీలావతీ కథా) అను ప్రాకృత గ్రంధము చెప్పుచున్నది. దీనినిబట్టి భీమేశ్వర లింగ ప్రాచీనత వ్యక్తమగుచున్నది.

చాళుక్య భీమున కుపాస్యుడగుటచే చాళుక్య భీమేశ్వరుడను పేరు వచ్చినట్లును దెలియుచున్నది. ఈ పద్యము చూతము.

సీ॥ అదే పట్టిస స్థాన మందుండు వీరభ
ద్రేశ్వర స్వామి యర్ధేందు మౌళి
యదే పుండరీ క్షాది యచట మార్కండేయు
నిలువేల్పు ముక్కంటి వెలసె దొల్లి
యదే కుమారారామ మా హార్మ్య రేఖయ
చాళుక్య భీమేశు సదన వాటి
యదె కుక్కుటేశ్వరం బయ్యుపాంతము మేద
హుంకారిణీ దేవి యోలగంబు

తే॥ వాడె మాయింటి వేల్పు పల్వాల పురమున
గొప్ప లింగంబు ఫణిరాజ కుండలుండు
సప్తముని సింధు సంగమేశ్వరుడువాడె
కుండలా ముఖమదె మౌని కులవరేణ్య.

(భీ.పు త్ర.ఆ 55)

పట్టిస శ్రీ వీరభద్రేశ్వర స్వామి 'అర్ధేందుమౌళి' అనినాడు. అనగా నర్ధ చంద్రుడు శిరోభూషముగా గలవాడని యర్ధము. సాధారణముగా శ్రీనాదుడు పరమేశ్వర స్వరూప వర్ణనమున నొక విశేషణము నుపయోగించిన, నచట నేదియో యొక విశేషముండి తీరును. అతడి భీమమండలములోని శివమూర్తు లకు 'అర్ధేందు మౌళి' అన్న తావులందెల్ల నచట పురాతనమైన రజత కిరీట ముండి తీరును. పట్టిస వీరభద్రేశ్వరుని శిరసుపై వెండి కిరీట మొకటి మెండు కొనియున్నది. ఆ లింగము రెండడుగుల యెత్తు మూడడుగుల కైవారము కలదిగ నుండును. మంత్ర సిద్ధి గోరువారి కా క్షేత్రము పరమోపాస్యము. వెనుకటి కాలములో చాలమంది మంత్రోపాసకు లచట తపస్సు గావించినట్లు నిదర్శనములు గలవు. రాజమహేంద్రవర పాలకులకు రాజ్య స్థాపనా చార్యుడుగా వచ్చిన ఘోడరాయ భీమేశ్వరుడీ పట్టిస స్థానమున తపము చేయు

చుండెడి వాడని నిశ్శంక కొమ్మన తన శివ లీలావిలాస పీఠికలో దెలిపి యున్నాడు.*

ఇంకను భీమేశ్వర పురాణములో భీమ మండలమునకు గల విశిష్టత ఈ విధముగా శ్రీనాథుడు వర్ణించినాడు. వ. "వెండియు జంభభాను కృత ప్రతిష్ఠుండును, నాఖండల ముఖ నిఖిల బహిర్ముఖ శిఖామణి మయూఖకిమ్మీరిత చరణారవిందుండును, సప్తపాతాళ భువన విష్కంభ నిర్భేద సమాసాదితావిర్భావుండును, దివ్యామృత స్వయంభూరుజ్జ్యోతిర్లింగమయ మూర్తి ధరుండునైన, భీమేశ్వరుండు భోగ మోక్ష ప్రధాన దీక్షాధురంధరుండై యందు వసించియుండు నమ్మహాదేవు చేత నప్పుణ్య క్షేత్రంబు భీమమండలంబన బండ్రెండు యోజనంబుల మేర కైవల్య కల్యాణ మండపంబును భోగలక్ష్మీ విలాస భవన పుండరీకంబునునై కుండలాముఖ సంవేద్యశార్దూల క్షేత్రంబులు మొదలుగాగల శాఖోప శాఖా క్షేత్రంబులం గలిగి దక్షిణ జలధి వేలా వనోపకంఠంబున వేదండ వదన శుండా కాండ చుళికితోన్ముక్త సప్త గోదా వర సలిల ధారాఝుణత్కార బృంహిత బ్రహ్మాండ గోళంబును, తుల్యా భాగా ప్రవాహ లహరికా ఘోష ఘుదు ఘుదూన దిగ్విభాగంబును, నౌలానదీ మాతృకాయ మాన కేదార క్షేత్ర సంవర్ధితానేక వ్రీహి భేద సంపత్సంపన్నంబును. ఫల భరిత నారికేళ షండ మండిత ప్రౌఢ పీఠాపురోప కంఠసీమా బహిర్భాగంబును, మాతృకాయమాన గోదావరీ క్షేత్ర పుణ్యాగ్రహార పరంపరా భూనిలింప సంపత్సంపాది తాధ్వర క్రియా సమాహూతాది దేవతా కదంబ సంబాధసంచరితంబును, గౌంతేయ వాహినీ ప్రాంత సంతప్య మాన ముని మండలంబును సహకారకాంతార ఫలరసా స్వాద మోదమాన పుంస్కోకిల కుటుంబ కంఠ నాళ కోమల కుహూ కార కోలా హల ప్రపంచిత పంచమంబును, హరి వంశంబునుంబోలె బలభద్ర ప్రద్యుమ్నా నిరుద్ధ పురుషోత్తమాధిష్ఠితంబునునై, మహా క్షేత్రంబన, మహాలింగ స్థానంబన, దక్షిణకాశి యన, గళ్యాన నిలయంబన, గ్రైలా స్ప్రతి బింబంబన, ననశ్వరమహైశ్వర్యంబును నప్రతిమ వైభవంబును, నవాఙ్మానస గోచరంబును, ననం

* శ్రీనాథ కవితా సమీక్ష - శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు.

ఖ్యాత ప్రమథ గణ సమా కీర్ణంబునునై, యశేష కల్యాణనిలయంబై యొప్పు నమ్మహా స్థానంబునందు"

(భీ.పు.తృఆ98)

ఈ గద్యము భీమ మండలికి గల ప్రత్యేకతను సూక్ష్మ రూపమున దెలుపు చున్నది. ఈ మండలమందున్న ప్రధాన క్షేత్రములను, తీర్థములను, గోదావరీ నదీ శాఖా విశిష్టతను భీమ మండలము భోగ మోక్ష నిలయమగుటకు గల కారణములను ఈ వచన రచన ప్రస్తరించు చున్నది. దీనికి దరువాత నుండిన పద్య మొకటి యీ గద్యమున కొక వివరణగా చూపట్టుచున్నది.

ఆ పద్యమిది.

ఉ॥ ఎక్కడజూచినన్ సరసి యెక్కడ జూచిన దేవమందిరం
బెక్కడ జూచినందటిని యెక్కడ జూచిన బుష్పవాటికల్
ఎక్కడ జూచిన న్నది మహీవలయంబున భీమమండలం
బెక్కడ నిన్యమండలము లెక్కడ భావనచేసి చూచినన్

(భీ.పు. 28)

దక్షారామమున భీమేశ్వరుడు నెలకొనియున్న చోటికి చుట్టును పంద్రెండామడల మేరలో నుండిన భూమండలమునకు భీమమండలమని వ్యవహారము. ఇచటి భీమేశ్వరుడు సూర్యప్రతిష్ఠితుడు. ఇంద్రాది దేవతల మ్రొక్కులు నందినవాడు. సప్తపాతాళ లోకములను భేదించుకొని ఆవిర్భవించిన స్వయంభూదేవుడు. జ్యోతిర్లింగమయమూర్తి. అట్టిదేవుడు సన్నిహితుడై యుండుటచే నీభీమమండలము ప్రాణిజాతము కంతటికి భోగ మోక్షప్రదమై యొప్పుచున్నది.

పై గద్యములో భీమమండలము సకల కళ్యాణ నిలయమని తెలిపి, యీ క్రింది పద్యములో భీమమండలిలో నసువులు బాసిన ప్రాణి యేదైనను శివ సారూప్యమును బొందుననను విషయమును నిరూపించినాడు.

సీ॥ పాటలంబగు జటాజూటంబునడునట్టు
పూవచుక్కలరాజు పొడవుచూపు
వెడదయైనలలాట వీధీవిటంకంబు
కట్టెఱ్ఱ క్రొవ్వేడికన్నుగూర్చుఁ
గంబుసన్నిభమైన కంఠప్రదేశంబు
గరళ కూలుముఛాయగ్రాచియుమియు
గడు మనోజ్ఞములైన కర్ణపార్శ్వములందు
బెనుపాప పోగులు బిత్తరించు
భీమమండలికా పుణ్యభూమియందు
ప్రకటకైవల్య కల్యాణవేదినసగ
గీటపక్షి సరీసృప క్రిమిచలాది
జంతు సంపతి ప్రాణావసానవేళ"

(శి.19 భీ.పు)

మోక్ష లక్ష్మీవేదికయని ప్రసిద్ధిగల భీమమండల పుణ్యభూమిలో నుండిన పురుగులు పక్షులు పాములు చిన్న క్రిములు మొదలగుగాగల ప్రాణిసమూహము, ప్రాణములు విడిచిన సమయములో శివసారూప్యము వహించి, పాటల వర్ణమైన జటాజూటము ధరింపగా, ఆ మీద బాలచంద్రు డలంకారముగా జేరును. విశాలమైన ఫాలప్రదేశమున (నుదుట) మిక్కిలి యెఱ్ఱనై వేడియైన కన్నుసు గూర్చుకొనును. కంఠము శంఖము బోలినదై కాలకూట విషచ్ఛాయను దాల్చును. మిక్కిలి అందమైన చెవుల ప్రక్కల, పెద్దదయిన పాపపోగులను (నాగాభరణములను) పెట్టుకొనును. ఈ విధమయిన శివ సారూప్యమును చరమ కాలమునం దీయజాలి యుండుట భీమమండలికి గల విశిష్టత. ఇదే విధముగ ఈ మండలములో నుండిన సంవేద్యక్షేత్రము కాశీక్షేత్రము కంటె నత్యుత్తమమనియు, సప్తగోదావరము గంగానదికంటెను పుణ్యప్రదమనియు ప్రౌఢిగ నిరూపింపబడినది.

శా॥ కాశింజచ్చిన యంతగాని పడయంగారాని కైవల్యమ
క్లేశంబై సమవేద్య నాయకునిచే లీలాగతింజేరురా

శో। శ్రీఘ్రంబున మర్త్యులార ! యను లీలన్ మ్రోయునా
కాశాస్ఫాలన గౌతమీ జలధి సంగస్థాన కల్లోలముల్
భీ. పు 8-53.

"కాశ్యాంతు మరణాన్ముక్తిః " అని సూక్తి అనగా కాశీలో మరణించిన వారికి, ఆ క్షేత్రమందున్న మహత్వముచే మోక్షము లభించునని ఈ సూక్తి భావము. కాశిలో మరణించిన ప్రాణి మాత్రమునకు, ఆ క్షేత్ర సంపర్కముచే పాపము లన్నియు నశింపగా, విశ్వేశ్వరుడు తారక మంత్రము నుపదేశించుననియు, తన్మూలమున నచట నసువుల బాసినవాసిన వారి కందఱకు మోక్షము లభించు నని పెద్దలు చెప్పెడి మాట. కాశిలో మరణించిన గాని లభింపని మోక్షము, సంవేద్య ప్రభువయిన భైరవేశ్వరుని దర్శించిన మాత్రమున హేలగా లభించును. మరణ ధర్ములైన ప్రాణులారా ! శ్రీఘ్రముగా రండని, ఆకాశమునంటు చున్న గౌతమీ సముద్ర సంగమ స్థలమందలి తరంగములు కేకలు పెట్టుచున్న వని అగస్త్యుడు వ్యాసునికి తెలిపెను. భారద్వాంతర్భూత గౌతమీ సాగర స్థలము నందలి సముద్ర తరంగముల మ్రోత యీ విధముగా చిత్రింపబడినది. గౌతమీ సాగర సంగమ స్థలమే సంవేద్యము. దీనిని 'శివసంవేద్యము' అందురట.[1] ఏలన దీని తరువాత వృద్ధ గౌతమీ సాగర సంగమ స్థలమును బ్రహ్మ సంవేద్యమనియు, కౌశికి (కౌంతేయూ) సాగర సంగమస్థలమును విష్ణు సంవేద్యమనియు, ఈనాటికిని అచటివారు వ్యవహరింతురు.

ప్రాక్సముద్ర తీరమంతటిలో సంవేద్య తీర్థ క్షేత్రములు మూడింటిలోను గానవచ్చెడి సముద్రతరంగ ఘోషము వినుటకు పరమ మధురముగను, అచటి వేలావనీ భాగము చూచుట కెంతయు మనోహరముగ నుండును. ఆ తావులను పరికించుసరి కెట్టివాని హృదయమునందైనను విచిత్ర భావ సంచారము కలిగి తీరును. ప్రాచీనతమ కాలమునందు మహర్షుల సంచారము చేతను వారి తపశ్చర్య చేతను పరమ పవిత్రమైనదీ భీమ మండలము. దివ్యతేజో రాసులైన బ్రహ్మర్షులు దివ్యర్షులు తపస్సులు గావించిన తావులగుటచే నిచటి తీర్థ క్షేత్రములన్నియు, ముణ్యార్థులయిన జనులకు బరమోపాస్యములైనవనుట పురాణ ప్రసిద్ధమైన విషయము. భీమేశ్వర పురాణమునందలి కథా వస్తువును

1. శ్రీనాథ కవితా సమీక్ష, శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రిగారు.

బట్టి చూచిన దేవతల ప్రార్థనపై నగస్త్యుడు వింధ్యపర్వతాటోపము నణచుటకై కాశిని వదలి దక్షిణ కాశీక్షేత్రమయిన దాక్షారామమునకు ముందుగ వచ్చె ననియు, ఆ వెనుక విశ్వేశ్వరుని యాగ్రహమునకు, అన్నపూర్ణాదేవి యను గ్రహమునకు బాత్రుడై వ్యాసమహర్షి శిష్య సమేతుడై వచ్చి, భీమ మండలిలో నగస్త్యుని గలిసి యాతనివలన భీమమండల మహత్త్వమును దెలిసికొనె ననియు, నెఱుగవచ్చు చున్నది. ఆ మహత్త్వమే పైన తెల్పితిని.

ఇక శ్రీనాథుడు కొన్ని పట్టుల "సర్వం శివమయం జగత్" అను నట్లుగా శివలింగములను, ఆయా ప్రాంతములను వర్ణించుట భీమేశ్వర పురాణములో గానవచ్చుచున్నది. శివతాండవము కూడా శ్రీనాధుడు వర్ణించినాడు. దాక్షారామములోని చెఱువులను చూచిన శ్రీనాధునికి లభించునది ఈశ్వర సాక్షాత్కారమేనట. ఈ విషయము డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు తమ 'ఈశ్వరార్చన కళాశీలుడు' అను పుస్తకములో వ్రాసిరి.

ఉ॥ "పీటికి నాల్గు వంకలను వెన్నెల తేటలు బోలు నీళ్ళతో
హాటకపద్మ మండితములైన కొలంకులు చూడనొప్పగున్
జీటికి మాటికిన్ హరుడు జృంభితలీల నటింపమౌళిమి
న్నేటి కృపీట నిర్ఝరము లింతట నంతలు జిందెనో యనన్"

(భీ.పు. ఆశ్వా 1-97 పద్యం)

దాక్షారామమునకు నలువైపుల చెఱువులున్నవి. ఆ చెఱువులలోని నీరు వెన్నెల తేటలను పోలును. అంతే కాదు ఆ చెఱువులనిండ పసిడి తామరలే. చీటికి మాటికి శివుడు తాండవము చేయుట వలన ఆ చెఱువులు చూడ ముచ్చటగా గలవట. శివుడు తాండవము చేయునప్పుడు ఆయన జటాజూటము కదిలి అందలి గంగాజలము చెదరి ఆ చెఱువు లేర్పడినవట. ఈ విధముగా శ్రీనాధుడు కడు చమత్కారముగా శివతాండవము వర్ణించినాడు. ఇంకను శివతాండవము నెడ శ్రీనాధునికి గల అభినివేశము చతుర్థాశ్వాసములో ఇంకొకచోట వ్యక్తము చేయబడినది.

శా॥ "అడెందాండవ మార్భటే వట హాలీలాటోప విస్ఫూర్జిత
క్రీడాడంబర ముల్లసిల్ల గరళ గ్రీవుండు జూటాటవీ
క్రోడా ఘాట కరోటి కోటరకు టీకోటీలు రక్షించుచుపే
చీడోలా పటలీ పరిస్ఫుట తరస్ఫీత ధ్వని ప్రౌఢిమన్"

(భీ.పు. 4 ఆ - 148 పద్యం)

ఇది సంస్కృత భీమఖండమున "డిణ్డిమారా వకలి తండమరు ధ్వని మఞ్జులమ్"- ఇత్యాదిగ సామాన్యముగ సాగినది. (55 - 57 శ్లో 19 అ) త్రిపురములను దహించి భీమేశ్వరుకు ప్రమోదాతి శయమున చేసిన తాండ వార భటికి శ్రీనాధుడు నైపథ్య కల్పనము చేసినది పెదకోమటి వేమారెడ్డి సాహిత్య చింతామణిలోని శ్లోకము. ఆ శ్లోకమిది1

"ఆటోపాయ నటన్మహానటజటా సంఘాట శృంగాటక
క్రోడా ఘాట కరోటి కోటరకు టీవా చాటవీచీఘటా
అస్తు స్వస్తటినీ విశఙ్కటత టీవా టీక వాటిభవ
ల్లాటీకోటిలలాట పాటల సటా పాటల్య పాటచ్చరీ"

ఇది గంగానది స్తుతి. ఇందు పూర్వార్ధమున శివతాండవ ప్రసక్తికలదు. గంగానది, ఆటోపముతో నటించుచున్న మహానటుని జటల సమూహము అను చతుష్పథము యొక్క తలమున ప్రతిబంధకమైన కపాలము యొక్క కోటరము అనెడి కుటీరము నందు మ్రోగుచున్న కెరటాల సముదాయము కలదని తాత్పర్యము. ఇందలి "ఆటోపాయ" అను శబ్దమును సందర్భమునుబట్టి "అర్భటీపలుహలీలాటోపవిస్ఫూర్జిత క్రీడాడంబర"ముగ తివ్వ తీసి "క్రోడాఘాట కరోట కోటరకుటీ" సమాసమును "వీచీ డోలా వటలీ" పద బంధముగ విన్యసించి "వాచాట" శబ్దమునకు ప్రకరణోచితముగ "పరిస్ఫుట తరస్ఫీత ధ్వని ప్రౌఢిమను" శ్రీనాధుడు పరిణమింపజేసెను. అంతేకాక శ్రీనాధుని పద్యమునందు ఉద్ధతమైన శివతాండవము వర్ణింపబడినది.2 ఇంకసూర్యాస్తమయ

1. ఈశ్వరార్చన కళాశీలుడు. డా॥ కొర్లపాటి శ్రీమ్మూర్తి గారు (పుట88)
2. ఈశ్వారార్చన కళాశీలత - డా॥ కొ. శ్రీ రామ్మూర్తిగారు.

వర్ణనా సందర్భములందు కూడ శ్రీనాథుడు శివాలయ శిఖరములను దృష్టి యందుంచుకుని పరమేశ్వరుని పరముగా వర్ణించినాడు. ఇది అతని ఈశ్వరార్చన కళాశీలతకు దార్కాణమనవచ్చును. ఇంక భీమేశ్వర పురాణములో ''అగస్త్యేశ్వరుడు కొప్పులింగేశ్వరుఁడుట"యను ఘట్టములో శివుని మాహాత్మ్యము తెలుపు కథ తెలిసి కుందము. పలివెల పురములో అగస్త్యుడు ప్రతిష్ఠ చేసిన లింగమునకు 'అగస్త్యేశ్వరుడు' అనునదియే మొదటి పేరు. ఆ స్వామి నిత్యము నారాధించు చుండెడి వెలనాటి పూజారి వంశమునకు జెందిన విప్రుడొక కాలమున, ఆ పరమేశ్వరునెడ విశేష భక్తి భావము గలిగి యుండియు వేశ్యాసక్తుడై కాలము గడుపు చుండుట సంభవించినది పౌరులాతని వేశ్యాలోలతను సహింపలేక, అప్పటి దేశ పాలకుని కావిషయమును పూజారి చేయుచున్న నేరముగా నెఱుగ జేసిరి. ఆ ప్రభు వొకనా డాకస్మికముగ నీ పలివెల పూజారిని బరీక్షింప వచ్చెను. ఆ సమయమునకు పూజారి వేశ్యయింటిలోనే యుండెను. దేశపాలకుడైన ప్రభువు పల్వెలలోని అగస్త్యేశ్వరుని దర్శింప వచ్చెనను వార్త పౌరులకును క్రమముగా పూజారికిని దెలియవచ్చెను.

ఆనాటి పరిపాటిని బట్టి ప్రభు వీశ్వర దర్శనమునకు వచ్చినపుడు పరమేశ్వర పూజా నిర్మాల్య మాలికను ప్రసాదముగా నీయవలెను. వేశ్యాసక్తితో గూడిన పూజారి చేయు నిత్య పూజలలో పూలమాలలచే స్వామి నలంకరించుట లోపించుచు వచ్చినది. పరమేశ్వర దర్శనమునకై వచ్చిన ప్రభువునకు నిర్మాల్యమాలిక నీయవలెను. దేవాలయమునందట్టి మాలిక యేదియు లేదని యాతనికి దెలియును. కొంచె మాలోచించి, వెంటనే యాతదెదురుగ నుండి వేశ్య కొప్పులో జొనిపిన పూలమాలనుదీసి, రహస్యముగ గొనివచ్చి, దేవలము తలుపులు తెఱచి, మాలికనెవ్వరు చూడకుండ బళ్లెరములో బెట్టి, పరమేశ్వరునకు నమస్కరించియున్న రాజు శిరస్సుపై పాదుకలుంచి, దోసిలిలో నీశ్వర నిర్మాల్యముగా దాను గొని వచ్చిన వేశ్య జడలోని మాలిక నుంచెను.

అప్పటి కెట్టిలో ప్రభువున కీశ్వర నిర్మాల్య మాలికను గూర్చి పెట్టిన వాడయ్యెనే కాని, ఆ మాలికలో నేమేని లోపమున్నదేమో? యని యాతడు చూడలేదు. రాజువెంట గుమిగూడియున్న పౌరు లా మాలికను పదిలముగా

పరికింపగా దానిలో నొక తలవెంట్రుక గానవచ్చెను. తన్మూలమున, వారా మాలిక వేశ్యజడ ముడిలోనిదనియు, కావుననే దానికి తలవెంట్రుక తగుల్కొని యుండెననియు రాజునకు దెలియ జెప్పిరి. రాజదిచూచి, కోపించి, ఈ దండ వేశ్యజడలోని దగునా? కాదా? యని గద్దించెను. దానికి బూజారి బదులు చెప్పుచు, "ప్రభూ: మా అగస్త్యేశ్వర లింగమునకు జటాజూట మున్నదనియు, ఈ పూల మాలిక నాస్వామి కొప్పులో నుంచిన కారణమున, అ వెంట్రుక దీనిలో జిక్కుకొనిన దనెను. ఇది యగస్త్యేశ్వరుని జడ ముడిలోని వెంట్రుకయే కాని, వేశ్యజడ ముడిలోని వెంట్రుక కాదు" అని ధీరముగా బల్కెను. ప్రక్కనున్న పౌరులు పూజారి అసత్యము పలుకుచుండెనని ఏక కంఠముగ బల్కిరి. పూజారి తానాడిన మాట సత్యమే యనెను. అయినచో నీశ్వర లింగమున జటాజూటమును తెఱచి చూపింపుమని రాజనెను. దానికి పూజారి ఈ విధముగా బదులు చెప్పెను. "రాజా! ఇది మధ్యాహ్న సమయము. ఈనాడు మా స్వామికి అభిషేక పూజాది విధులు నిర్వర్తించి, నాగాభరణము నలంకరించి యుంటిని. రేపటి యుదయము వరకు నీనాగాభరణమును తొలగించుట జరుగదు. ప్రాతఃకాలము వఱకు తమరిచట నుండిన నీవిషయమును ప్రత్యక్షముగ జూపింప గలను'' అని అనెను. రాజందుల కంగీకరించి యానాటి రాత్రి కచట నిల్చెను. పూజారిలో వేశ్యాలోలత యేర్పడినను అఖండమైన శివభక్తి నిలిచియే యున్నది. కావున దాను పలికిన పలుకులు సత్యమగుటకై; రాత్రి వేళ గుడిలో ప్రవేశించి, పరమేశ్వరునెదుట నిలిచి ''దేవా నీపీరాత్రికి కొప్పు రప్పించుకొనిన సరియే లేకున్న నా ప్రాణములు నీకర్పించివేసెద'' నని హఠము బూనెను. పరమేశ్వరు డాతని పూనికకు మెచ్చుకొని లింగమునకు గొప్పు వచ్చునట్లు చేసికొనెను ఈనాడు కూడ లింగము మీది భాగమున కొప్పుండిన చిహ్నమున్నది.

రాజతని భక్తి తత్పరతకు మెచ్చి, పలివెలకు పశ్చిమముగ నాలుగు క్రోసుల మేరలో వసిష్ఠానదీ తీరమందున్న ముప్పదిపుట్ల భూమి నాపూజారికి దానము చేసెను. అగస్త్యేశ్వరునకు జుట్టు పుట్టించి, కొప్పులింగేశ్వరునిగ జేసిన దానికి బహుమానముగ నిచ్చిన మూడు పదుల సంఖ్య పుట్లభూమి గావున 'జుత్తిగవాడు' అను పేరేర్పడినది. ఇచట పూజారికి శివార్చనయం దాసక్తి,

శివునియందు భక్తి కొనియాడ దగినవి. శివుడు తన భక్తుల నెట్లు రక్షించునో, ఆపద సమయములో నెట్లాదుకొనునో ఈ కథవలన తెలియుచున్నది.

వేదవ్యాసుడు కాశీని బాసి దక్షిణ కాశియని పేరువడసిన దక్షారామమున కేతెంచెను. ఇచట గల తుల్యభాగా తీరస్థులయిన శంకర మూర్తులకు వేద వ్యాసుడు ప్రణవ పంచాక్షరములతో నర్చనము చేసెనట.

"వేదశాఖా విభాగ సంవేది యతడు
లంత బిల్వత్రిశాఖా పలాశ సమితి
సంగమేశ ఘటోద్భవ శంకరులకు
నర్చనము సేయు బ్రణవ పంచాక్షరముల"

(భీ. పు. 2 ఆ. 71 వ)

పరమేశ్వర మూర్తులకు ప్రణవ (ఓంకార) సహిత పంచాక్షరములతో బిల్వదళ పూజచేయుట, ఆ బిల్వదళములు మూడు పలవలతో గూడియుండ వలయునను విషయ మిచట వ్యక్తమగు చున్నది. సంప్రదాయము తెలిసి శ్రద్ధా సక్తులతో నీశ్వర మూర్తుల నర్చించువారు మూడు వలవలున్న బిల్వదళము లను ప్రత్యేకముగా కొనితెచ్చుచుందురు. ప్రణవ సహిత పంచాక్షర మంత్రో చ్చారణముతో శంకర పూజ చేయుట శ్రేయస్కరమను విషయముకూడ నిచట వ్యక్తమగుచున్నది. అట్టి బిల్వ దళములతో సంగమేశ్వరునకు అగస్త్యేశ్వరులకు పూజ చేసెనమటలో అగస్త్య ప్రతిష్ఠిత శంకర మూర్తులు మూడను విషయ మిచట గూడ వ్యక్తమగుచున్నది. శివారాధకులలో ఆనాడు ఈ పద్ధతు లన్నియు ఉన్నట్లు, పూజా పునస్కారములయం దానాటి ప్రజలు చూపు శ్రద్ధ ప్రకటిత మగుచున్నవి. శైవారాధన యందు శ్రీనాథునకు గల నిష్ఠకూడ ఇందు విదిత మగునున్నది. భీమేశ్వర పురాణమునకు కృతి భర్తయై పరమ శివ భక్తుడై బెండపూడి అన్నామాత్యుడు సంగమేశ్వరునకు కల్యాణ మంటప గృహమును నిర్మింప జేయుట, ఆ మంత్రి నెఱపిన పుణ్యకార్యములలో నొక్కటి యని శ్రీనాథుడు తెల్పినాడు. "సంగమేశ్వర దివ్య శంభులింగము నకు, గల్పించె గల్యాణ గర్భ గృహము" (భీ. పు 1-75)

తుల్యభాగా నదీతీర స్థిత శంకరమూర్తులలో కడపటివాడగు ముక్తీశ్వరుని వ్యాసుడు దర్శించి శిష్యులతో గూడి యాస్వామికి మారేడు దళములతోను, తేల పూవులతోను, పుదములతోను పూజ గావించి పిదప పిఠాపురమునందు కుక్కుటేశ్వరుని దర్శించుటకై పోవుచున్న లోపాముద్రా సమేతుడైన అగస్త్య మహర్షిని వ్యాసుడు కలిసెను.

అగస్త్యుడు మహా తపస్వి. అఖండ శివ భక్తుడు. ముల్లోకములందు నెవ్వరు సాధింపని మహత్తర కృత్యములను తన తపశ్శక్తిచే సాధించినవాడు. అతడు లోపాముద్రా సమేతుడై గంగానదీ తీరమున కాశిలో విశ్వేశ్వర సన్నిధిని తపము చేయుచున్న సమయము నందు, వింధ్య పర్వతము మీదికి పెరిగి సూర్య చంద్రుల గతికి నిరోధమును గల్పించెను. దానితో లోకము లన్నిటికి నుపద్రవము వాటిల్లి దేవతలకు హావిర్భాగములు లభించుట యాగిపోయినది. దేవతలందరు పోయి యగస్త్య మహర్షిని ప్రార్థింపగా నాతడు లోకోపద్రవము నాపుటకై లోపాముద్రా సహితుడై ఉత్తర దిశనుండి, దక్షిణ దిశకు ప్రయాణము సాగించి, వింధ్యపర్వత గర్వాటోపము నణచి వేసెను. అది మొదలు దక్షిణ దేశమున బర్యటనము చేయుచు భీమ మండలములోనుండిన దివ్య తీర్థ క్షేత్రములను సేవించుచు గాలము గడుపుచుండెను.

భీమ మండలములో ప్రధాన దేవత దక్షారామ భీమేశ్వరుడు గావున నిత్యము ప్రాతఃకాలమునందా దేవుని గూర్చి తపము చేయుచుండి, తరువాత రాత్రివేళ వఱకు తీర్థములలో స్నానము చేయుచుండెడివాడై, దాక్షారామము నుండి పిఠాపురమునకు జేరి కుక్కుటేశ్వరుని దర్శింపనై యుండగ, తుల్యభాగా నది యొడ్డున ముక్తీశ్వరు డున్నచోట తోటలో వ్యాసున కగస్త్యుడు కనబడెనట. ఈ విధముగా వ్యాసాగస్త్యుల సమావేశము భీమ మండలములో ముక్తేశ్వరు డున్నచోట జరిగినదని పౌరాణికమైన నిర్ణయము* కోటిపల్లి కావలి యొడ్డున వృద్ధ గౌతమీ నదీతీరమున గూడ ముక్తీశ్వర మొకటి కలదు. అచటి దేవుడు కూడ ముక్తీశ్వరుడే. కాని యది యీ ముక్తీశ్వరము కాదు. ఈ ముక్తీశ్వరు డిపుడును కాకినాడకు మూడు క్రోసుల దూరములో సంపర

---

*శ్రీనాథ కవితా సమీక్ష, శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రి.

గ్రామమునకు సమీపమందున్నవాడు. ఆ క్షేత్రము మాత్రము వ్యాసాగస్త్యాది సమాగమమున దివ్యత్వము వహించి యున్నది.

వ్యాసుడు శిష్య సమేతుడై కాశికి జేరి అన్నపూర్ణా విశ్వేశ్వరులను సేవించి భుక్తి ముక్తులు రెండును సాధింప జూచెను. కాని దైవము ప్రతికూల మగుటచే విశ్వేశ్వరుని యాగ్రహమునకు అన్నపూర్ణాదేవి యనుగ్రహమునకు గుఱియై, కాశిని వదలి దక్షిణ కాశియగు దక్షారామమునకు జేరుచు నడుమ నుండెడి కొన్ని వైష్ణవ క్షేత్రములను దర్శించెనట. ఆ క్షేత్రముల సందర్శనము వ్యాసుని కాశీ వియోగ తాప శాంతికి గొంత కారణమైనదని చిత్రించుటలో, ఆయా క్షేత్రములకు గల విశిష్టత వ్యక్తమైనది.

సీ॥ "గంగానదీ ప్రవాహకణము మాధవదేవు
దోరంతరంబు శ్రీతులసి చిగురుఁ
బురుషోత్తమమునందు బుండరీకాక్షుని
దివ్య పాదాంభోజ తీర్థజలము
శ్రీకూర్మమున యందు శేషాహిపర్యంకు
కంఠంబు క్రొత్త చెంగలువదండ
సింహాద్రియందు లక్ష్మీనృకంఠీరవ
సార్వభౌము ప్రసాద చందనంబు
కాశికా విప్రయోగ ఘోర గాఢతాప
శాంతి కొదవెను శిశిరోపచారమగుచు
జాయ తెరువున శ్రీ బాదరాయణునకు
హరి హర ధ్యాన పరాయణునకు"

(భీ.పు. 2 ఆ - 51 పద్యం)

వేద వ్యాసుడు హరి హరుల నిరువురను ధ్యానము చేయుటలో మిక్కిలి ఆసక్తి కలవాడు ఈ విషయము శివకేశవుల యిరువుర మహత్త్వమును ప్రతిపాదించునట్టి అష్టాదశ మహాపురాణములను నిర్మించి, లోకమున కందిచ్చుట చేతనే వ్యక్తమగుచున్నది. ఆ యిరువుర మహత్త్వమును వేనోళ్ళతో జాటి చెప్పిన వేదములను, విభాగము చేయుటవలన గూడ వ్యాసుడు

శివకేశవాద్వైత భావన గల వాడని తెలియవచ్చుచునే యున్నది. వ్యాసునకే కాదు, భీమేశ్వర పురాణ రచయితయైన శ్రీనాధునకు సైతము అట్టి అద్వైత దృష్టియే కలదను విషయము ఆతని రచనలన్నిటిలోను ప్రస్ఫుటమగు చున్నది. ఈతనికి శంకరునియందు విశిష్ట భక్తి యేర్పడి యుండెనను విషయము వ్యాసుని యాత్రా ప్రసక్తిలో జతపడిన వైష్ణవ క్షేత్ర ముల ప్రశస్తిని నిరూపించిన తీరులో దెలియుచున్నది.

విశ్వేశ్వరుని యాగ్రహమునకు బాల్పడిన వ్యాసునకాయా వైష్ణవ క్షేత్ర ములందలి విష్ణు ప్రసాదములు కాశీవిరహతాప శాంతికి శిశిరోపచార మయినవని పై పద్యములో నిరూపితమైనది.

1. మొదటిది, గంగానదీ జల బిందువు గంగ విష్ణుపాదోద్భవ భూలోక మున హిమవత్పర్వతము మీదుగా ప్రవహించుటచే, నచటి హిమమే గంగా జలముగ రూపొందుట మూలము ననునది శిశిరోపచారమగుట జతపడెనని చెప్పవచ్చును.

2. మాధవదేవుని వక్షస్థలము నందుండి ప్రసాదముగ లభించిన తులసీ దళము రెండవది. గంగానదీ తీరమునందున్న మాధవ దేవు లిరువురు. త్రివేణి సంగమమగు ప్రయాగలో వేణీ మాధవుడు కాశిలో బిందు మాధవుడు. తులసీ వనమాల విశేషముగ విష్ణు ప్రీతికరము. విష్ణు వక్షస్థలాధివాసము గల తులసీ దళము, ఆనగా నది వేణీ మాధవ ప్రసాదముగాని బిందు మాధవ ప్రసాదము గాని కావచ్చును. అది రెండవ శిశిరోపచార వస్తువయినది.

3. గంగానదీ తీరము వదలి తూర్పు సముద్ర తీరమునకు వచ్చు సరికి ముందుగ జత వడునది పురుషోత్తమ క్షేత్రము. అనగా 'పురి'. అచట వెలసిన దేవతామూర్తి జగన్నాధస్వామి. అచటి విష్ణుదేవుని పాద పద్మ జలము మూడవది.

4. అది దాటి వచ్చిన తరువాత శ్రీకూర్మములో నుండెడి కూర్మ నాధుని కంఠమున వైచిన చెంగల్వదండ, ప్రసాదముగా లభించినది నాల్గవది. శ్రీకూర్మ క్షేత్రమునకు పరిసరములలో పెద్ద పెద్ద చెఱువులుండి, ఆ చెఱు

వులలోని కలువల మాలిక లా స్వామి కంఠము నలంకరించుట కుపయుక్తము లగు చుండెడివని తెలియ వచ్చినది. శ్రీ కూర్మములో తొలుతనుండెడి మూర్తి బృహదీశ్వర లింగమనియు, తరువాత నాలింగమే కూర్మనాథ స్వామిగా రూపొందెననియు నా ప్రాంతము వారు తఱచుగా జెప్పుకొనెడిమాట. ఆ దేవాలయమం దవశిష్టమైయున్న శిల్పముకూడ నది శివాలయమే యనుటకు దార్ష్ట్యాణముగా నున్నది. శ్రీరామానుజులవారు తమకుగల విష్ణుభక్తి తత్పరతచే శివ క్షేత్రములను గొన్నిటిని వైష్ణవ క్షేత్రములుగా రూపొందించిరని పెద్దలు పరంపరగా జెప్పుకొను విషయము. దీనిని బట్టి శైవ క్షేత్రములను వైష్ణవ క్షేత్రములుగా జేయగల శ్రీ రామానుజుల వారి శక్తి సామర్థ్యములు వ్యక్తమగు చున్నవి. ఏమయినను శ్రీనాథుని నాటికది వైష్ణవ క్షేత్రమగుట మాత్రము తథ్యమయిన విషయము.

౬. **సింహాచలమునందుండెడి లక్ష్మీనృసింహ** స్వామి ప్రసాదమయిన చందనమయిదవది. **సింహాచలము** సందుండెడి నృసింహస్వామి నీనాడు శ్రీవరాహాప్పల నృసింహస్వామి యని యందురు. పరశురామునిచే ప్రతిష్ఠితయైన వారాహీ దేవతయే వరాహాప్పల నృసింహస్వామిగా మాఱెనని పెద్దల మాట * ఆ యాలయ శిల్పమందెక్కడ జూచినను సింహముల శిల్పమే గానవచ్చును. దేవాలయ శిల్పమునందు సింహములుండుట సహజముగ శక్త్యాలయములందే కానబడును. పరమేశ్వరి సింహవాహన గావున సింహశిల్పముండుట పరాశక్తి దేవాలయ సూచకము. ఆ స్వామి కేటేట వైశాఖ శుద్ధ తదియ నాడు చందన చర్చ చేయుదురు. చైత్రబహుళ అమావాస్యనాడంతకు ముందు స్వామి శరీరమందున్న చందనమును దీసివైచి స్వామికి సహస్ర ఘటాభిషేకము చేసి, తదియనాడు తిరిగి చందన చర్చ చేయుదురు. అభిషేకము చేయుట యనునది శైవ సంబధమైన యాలయములందే జరుగు చుండును కావున సహస్ర ఘటాభిషేక పరిపాటిని బట్టి కూడ వారాహీ దేవతయే వరాహాప్పల నృసింహస్వామి యయ్యెనను పెద్దలు వచించు మాట తథ్యము కానవచ్చును.

ఈ విధముగనే శేషాచలమున వెలసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామిని ఉత్తర దేశస్థులు బాలాజీయని యందురు. అనగా బాలాత్రిపురసుందరీ

* శ్రీనాథ కవితా సమీక్ష - శ్రీ చిలుకూరి పాపయ్య శాస్త్రి

దేవత యని వారి నిశ్చయము. ఆ దేవాలయమునందున్న ఆలయ శిల్పము నందును సింహవిగ్రహములు గలవు. శుక్రవారము నాడు పసుపు కలిపిన జలముతోను బిల్వ దళములతోను అభిషేకము గావించు వరిపాటి గలదు. ఆ విగ్రహమున స్త్రీ విగ్రహలక్షణములున్నట్లు పెద్దలు తెలిపిన విషయము. శివభక్తులు పరమేశ్వరీ భక్తులు విష్ణుభక్తులు కూడ శ్రీ వేంకటేశ్వరస్వామి నత్యంత భక్తితో నారాధించుట ఆ స్వరూపము పరాశక్తి స్వరూపమైన దనుటకు నిదర్శనము. పరాశక్తి నారాధించు వారా మూర్తిని త్రిమూర్త్యాత్మికగా భావించుట ప్రాచీన సంప్రదాయ సిద్ధమైన విషయము. బాలాత్రిపురసుందరీ విగ్రహమును శ్రీ వేంకటేశ్వర స్వామినిగా రూపొందించిన శ్రీ రామానుజాచార్యులవారి ప్రభావము మాత్ర మూహాతీతము. శ్రీ సింహాచల నృసింహస్వామి శరీరము నుండి యొలిచిన మంచి గంధము వ్యాసునకు ప్రసాదముగా లభించినది.

పరమేశ్వరశక్తిని పురుష రూపముగ భావించినపుడు విష్ణునిగ భావింపవలెనను నీ క్రింది యాగమ సంప్రదాయ శ్లోకమును బట్టి, పరాశక్తి స్వరూపమును విష్ణు స్వరూపముగా భావించుట సంభావితమే యగుననిపించును ఆ శ్లోకమిది.

శ్లో॥ ఏకైవ శక్తిః పరమేశ్వరస్య ద్విధా చతుర్ధా వినియోగకాలే
భోగే భవానీ పురుషేచ విష్ణుః కోపేచ కాలీ సమరేచ దుర్గా.

కాశీ విరహము వలన వ్యాసున కేర్పడిన తాపము శాంతించుటకు, కాశి మొదలు పిఠాపురము వఱకు నడుమనుండెడు క్షేత్రములలో విష్ణుమూర్తి ప్రసాదములు శిశిరోపచారము లయిన వనుటలో కావ్యత్వము జతగూడినది. ఈ క్షేత్రముల మహిమ గొనియాడుటలో శ్రీనాథుని అద్వైత భావము వెల్లడియగుచున్నది. విరహతాపమునకు హిమజలము, పల్లవములు, భగవత్పాద తీర్థము, కలువ పూవులు, చందనము సమకూడుట విచిత్రమైన విషయము. అవి యన్నియు విష్ణుక్షేత్ర మూర్తులకు సంబంధించిన వగుట మఱియొక విశేషము. ఇంకను సింహాచలము దాటి వ్యాసుడు పిఠాపురమునున్నగు క్షేత్రములు దర్శించినట్లు శ్రీనాథుడు పిఠాపురము మున్నగువాని సౌందర్యము మరియు

కుక్కుటేశ్వరుని మాహాత్మ్యము వర్ణించినాడు. పురుషోత్తమ, సింహాచల విష్ణు క్షేత్రముల వర్ణనము తెలుగు భీమ ఖండమున సంగ్రహముగ నుండుటకు హేతువు శ్రీనాధుడు విష్ణుభక్తి సహింపని శివభక్తుడగుటయేయని కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగము పంతులుగారి, మరికొందఱి యభిప్రాయము 1 కాని ఇది సమంజసము కాదు. శ్రీనాధుడు విష్ణు సహనము లేని వీరశైవుడు కాదు. హరిహరా భేద తత్త్వముకల "ఈశ్వరార్చన కళాశీలుడు". విష్ణుక్షేత్ర వర్ణన స్థలములందేగాక యన్యధా కూడ, కేవలము శివపరమైన సందర్భములందును సంస్కృతాంధ్ర భీమ ఖండముల మధ్య సంగ్రహ విస్తరములు కలవు*

శిష్యసమేతుడై వ్యాసుడు పిఠాపురము మొదలు కుమారా రామము, సర్పవరము మున్నగు పుణ్యక్షేత్రములు దర్శించి అనేక తీర్థములలో స్నానమాచరించి యధావిధి పూజలు చేసి తిరుగు చుండెను. ఈ సందర్భములో శ్రీనాధుడు ఆయా క్షేత్రములలో దేవుని మహిమలు కొనియాడుటయేగాక త్రిలింగ దేశములో పండువంటలు. ఆ తీరభూమి అందచందములు మున్నగునవన్నియు కనులకు గట్టినట్లు వర్ణించినాడు. వ్యాసుడు సర్పవరమను పేరుగల త్రిలింగ భూమి వైకుంఠమును జూచెనని చెప్పుచు

"కాంచెన్సర్పవరాభిధానము ద్రిలింగక్షోణి వైకుంఠమున్
ముంచె న్నారదకుండి కాజలమున న్మోదంబుతో దేహముం
జెంచెన్ గాశి వియోగ దుఃఖము మహాక్షేత్రంబు వీక్షించి
దర్శించెన్స న్మవిలోచనోత్సవముగా శ్రీభావ నారాయణున్"

(భీ. పు. 2-65)

నారద కుండము నీటిలో సంతోషముగా స్నానము చేసెను. ఆ మహాక్షేత్రము జూచి, కాశీ విరహ దుఃఖమును చించి పాఱవేసెను. అచటి భావ నారాయణ స్వామిని కన్నుల పండువుగా జూచెను. సర్పవరము దేవాలయములో నుండిన పాతాళ భావనారాయణ స్వామి జూచినపుడు కన్నుల పండువుగానే యుండును.

1. శ్రీనాధుడు. డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి గారు. పుట 295

* ,, ,, ,,

వ్యాసునకు సర్వవర క్షేత్ర దర్శనము కాశీ విరహ తాపమును పోగొట్టెననుటలో వ్యాసుడు శివునందును వలె విష్ణువునందును విశిష్ట భక్తి భావము గలవాడని తెలియవచ్చు చున్నది. శ్రీనాధుడును పరమ వైష్ణవక్షేత్రమైన సర్వవరమును వర్ణించుటలో సమానమైన భక్త్యావేశమును ప్రదర్శించినాడు. ఇది యాతని యద్వైత భావనకు తార్కాణము.

ఇంకను వేదవ్యాసుడు సర్వ వర భావ నారాయణస్వామిని ద్వాదశాక్షర మంత్రమును బలుకుచు పద్మములతోను, అష్టాక్షరి మంత్ర మర్చించుచు బంగారు పూవులతోను, (గొబ్బిపూవులతో) పూజించి, ఏలా నదీ తీరము వదిలి తుల్య భాగానదీ తీరమును జేరి యచటి శంకర మూర్తులను దర్శించి, వారి కర్చనము చేసి ముక్తీశ్వరము చేరుసరికి అచట అగస్త్యుడు కలిసెనని ముందే చెప్పినాడు. ముక్తీశ్వరుని సన్నిధానమునందే అగస్త్యుడు ప్రశ్నింపగా వ్యాసుడు, తాను కాశిని వదలి వచ్చుటకు కారణము వివరించినాడు. అగస్త్య మహర్షి వ్యాసునకు దాక్షా రామ మండలికి గల విశిష్టత వివరించినాడు. ఇచట వ్యాసుడు కాశిని వదలి వచ్చుటకు కారణము గమనించవలెను.

వ్యాసుడు శిష్యగణముతో కాశీనగరమునందు నివసించు చుండగా ఆతని నిష్ఠను శివభక్తిని శివుడు పరీక్షింపగోరెను. ఒకసారి మాధూకరముపై జీవిం చెడు వ్యాసునకు శిష్యులకు భిక్ష దొరుకకుండు నట్లుగా శివుడు మాయాజాల మును కల్పించెను. ఏడు దినములు ఆహార పానీయములులేక వ్యాసుడు అతని అంతేవాసులూ విలపించిరి. ఇక మహర్షి కోపము పట్టలేక గంగాజలమును చేతిలో గ్రహించి కాశీనగరమును శపింప బూనెను. ఆ ప్రమాద సమయమున పార్వతీదేవి అన్నపూర్ణ రూపమున అచటికి వచ్చి వ్యాసుని శాపమునుంచి మరల్చెను. ఇదంతయు శివుడు కల్పించిన మాయయేయని చెప్పెను. మహర్షికి అతని శిష్యులకు విందు భోజనములు పెట్టించెను. అపుడు శివుడు ప్రత్యక్షమై తన పరీక్షకు నిలువలేక పోయినందులకు వ్యాసుని కాశీనగరము విడిచి వెడలి పొమ్మని ఆదేశించెను. దక్షిణ భారత దేశమున ద్రాక్షారామమునకు దక్షిణ కాశి యను ప్రఖ్యాతి గలదనియు ఆ క్షేత్రము మహిమాన్వితమైనదనియు చెప్పి అచటకు వెడలుమని ఆజ్ఞాపించెను. ద్రాక్షారామమునకు వచ్చుచు వ్యాసుడు

ము క్తేశ్వరమున అగస్త్యుని కలిసికొని తానెందుకు కాశిని వదలి వచ్చెనో చెప్పెను.

ఈ కథ ద్వారా భీమేశ్వర పురాణమునకు కేంద్ర స్థానమైన ద్రాక్షారామ భీమేశ్వరము మహత్త్వమునే కవి వర్ణించినాడు. కాశీనగరము వంటి గొప్ప తనము దీనికిగలదని కాశీనగరమువలెనే యిచటను వ్యాసమహర్షి మహేశ్వరుని కొలిచెననియు చెప్పుటయే ఈ కథ యొక్క పరమార్థముగా భాసించును. క్షేత్ర ప్రశంస క్షేత్ర స్వామి వర్ణన ఆగమ శైవములో ఒక ప్రధాన విషయమగుట చేత కథా విశేషమును దానికి అనుగుణముగానే యున్నది. భీమేశ్వరుని మహిమ అగస్త్యుడు వ్యాసున కీవిధముగా తెల్పినాడు. త్రిలింగ విషయాలంకారంబగు భీమేశ్వర మండలమునకు సకల దేవతామూర్తి సాన్నిధ్య సమేతంబైన దక్షా రామము, పరమేశ్వరునకు పరమ ప్రేమాస్పదంబైనది వ్యస్థానముగా నీ భీమేశ్వర పురాణ ప్రబంధమున నిరూపితమైనది. శంకరునికి దక్షారామము పరమ ప్రేమాస్పందం బగుటకు గారణమిట్లు తెల్పబడినది.

"గౌరి యొక్కతె యాకాశ గంగ యొకతె
కాశి యొక్కతె దక్షిణ కాశి యొకతె
నలుగురును శంభునకు లోకనాయకునకు
రాణి వాసంబు లనురాగరసము పేర్మి" (భీ.పు. 3.95)

సకల లోక నాయకుడైన శంభునకు, పర్వత రాజపుత్రి ఆకాశ గంగ, కాశి, దక్షిణ కాశి యను నీ నలుగురు పరమ ప్రేమా స్పదమైన అంతఃపుర జనమని యీ పద్యభావము. వాని వాని యధిష్ఠాన దేవతల యందు వరవు శివునకు పరమాదరము గలదని తెలియవచ్చు చున్నది. కావుననే శంకనరుకు దక్షిణ కాశియైన దక్షారామము పరమ ప్రేమా స్పదమై యెల్ల వేళల శివ సాన్నిధ్యము గలదిగ నుండునని ఈ క్రింది పద్యము తెలుపుచున్నది.

"ఎల్లకాలంబునుండెద నిచట నేను
మొదలిమామామయరామ వదమునందు
వెండి గుబ్బలిపై వేడ్క వీడుకొల్పి
మేరు నగరాజుపై జాలమెచ్చువదలి"

(భీ.పు. 6-11)

" నాకు మొదటి సోమమైన దక్షునకునివాసమైన యారామ మిదిగావున యీ దక్షారామములో నెల్లవేళ లందు నేనుండెదను.నాకు నిజనివాసమైన వెండికొండ మీద (కైలాస పర్వతము పీద) నుండవలెనని వేడుకను విడిచిపెట్టి, సకల దేవతా వాసమైన మేరు పర్వతము మీద (బంగారు కొండ మీద) నివసించు ప్రీతిని వదిలిపెట్టి యిచటనే యుండెదనని " పరమ శివుడు వరమిచ్చినాడు. దీనినిబట్టి కైలాసవాసి దక్షారామమున పరమానందముతో నివసించువాడగుటచే దక్షారామము శివసాన్నిధ్యము`ల క్షేత్రములలో నుత్తమమని తెలియుచున్నది. దక్షారామ క్షేత్రమే దక్షిణ కాశియని అగస్త్యుడు వ్యాసునకి క్షేత్రమాహాత్మ్యమును తెలిపినాడు. దక్షవాట మహాస్థానము పరమశివ ప్రీతికరమై తీర్థమనినయు, దానితో నితర తీర్థములను సరిపోల్పరాదనియు బ్రహ్మాది దేవత లభివర్ణించి నట్లు నిరూపింపబడినది.

దక్షారామమను మహాస్థానము, భీమనాధేశ్వరుడను మహాలింగముతో దేదీప్యమాన మగుచున్న పరబ్రహ్మ నివాసము. ప్రళయ కాలమున భయంకర ముగ సముద్రము లుప్పొంగగిపుడు భయపడియున్న ముల్లోకములను మునుగ కుండా నావలికి దాటించు నావయైనది. పంద్రెండు తీర్థములనే తేకులతోగూడి వికసించి యున్న క్రొత్త పద్మమైనది. జంబూద్వీపము నందలి భూమి కంతటికీ మంచి గంధపు బూతయైనది. శివునకు కళత్రము (భార్య) యైనది. శివునకు నివాసమైనది. శివ స్వరూపమైనది. శ్రీ సదాశివుని కీర్తిరూపమైనది ప్రళయ కాలములో నశించుపోవు లోకముల నుద్ధరించునది, త్రిలోకశాంతి దాయక మైనది, శివస్వరూపమైనది. పరమ శివావాసమైనది దక్షవాటము. ఇక భీమే శ్వర లింగ మహత్త్వము ఈవిధముగా చెప్పబడినది.

''భైమ మీశాన లింగం బపార తేజ
మక్షయంబ్రమధృష్యంబనాదిని ధన
మమ్మహాజ్యోతి రత్న దీపాంకురంబు
కనక గర్భాండ భవన విష్కంభమునకు''

(భీ. పు. 3-79)

భీమేశ్వర లింగ మపారమైన తేజస్సు గలది. భక్తి భావముతో దర్శించువారి కాలింగ మపార తేజోవంతముగనే గాన్పించును. ప్రళయ వేళయందును నాశ

నము లేనిది. కదిలింప రానిది. అద్యంతములు లేనిది. అట్టి యాలింగము బ్రహ్మాండ భవనమునకు మహాజ్యోతిస్సుగల రత్నదీపకళిక. భీమేశ్వర లింగము ఈ విధముగ భావింపవలెనని యిచటి ఋషి వాక్య చోదనము. ఇంకను దక్ష రామము మోక్ష ప్రదమగుటకు హేతువు నీ విధముగా చెప్పినాడు.

చ॥ "అహహ! దయా రసానుగతమైన మనంబున దక్షవాటికా
గృహపతి భీమనాయకుడు కీటపతంగ సరీసృపాలికిన్
సహజ జహత్సమీరమగు సంకట వేళను వీనులందను
గ్రహ మొనరించునట్టి మధురంబగు తారకమంత్ర రాజమున్"
(భీ.పు.తృ.ఆ।28)

దక్షారామ వాస్తవ్య గృహస్థుడు భీమనాధుడు దయారసాప్లుతమైన మనస్సుతో, అచట మరణించు పురుగులకు పక్షులకు పాములకు గూడ ప్రాణములు వదలు సమయమునందు చెవులలో మధురమైన తారక మంత్రోపదేశ మనుగ్రహించునట.

ఈ విధముగా భీమఖండములో ఆంధ్రదేశము నందలి ప్రముఖ శైవ క్షేత్రమైన దాక్షారామ క్షేత్రమును దాని మాహాత్మ్యమును వర్ణించుచునే శ్రీనాథ మహాకవి శైవప్రశంసచేసి యున్నాడు. నేనిదివర కుల్లేఖించినట్లుగా శివుని గురించి చెప్పినను శైవమహాత్త్వమును వర్ణించినను ఈ క్షేత్రమాహాత్మ్యములో శ్రీనాధుడు ఆగమోక్తమై పురాణ సంబంధమైన ఆగమశైవమునే వర్ణించెనుగాని వీరశైవమును ఉల్లేఖించిన వాడుకాడని ఈ పరిశీలనవలన తెలుచున్నది.

## కాశీఖండము - శైవనిరతి

భీమేశ్వర పురాణము వలెనే కాశీఖండముకూడ స్థల మహాత్మ్యమనియే చెప్పవచ్చును. భీమేశ్వర పురాణములో దక్షిణకాశి నాబడు ద్రాక్షారామ మాహాత్మ్యము, తన్నివాసియగు భీమేశ్వరుని మహిమ కొనియాడబడగా కాశీ ఖండములో విశ్వేశ్వరుని మహిమ, గంగానది స్నానఘట్టముల మహిమ, శివలింగముల మాహాత్మ్యము గొనియాడబడినది. వ్యాసుడు కాశినిబాయుట ఉభయగ్రంథములలో చెప్పబడినది. లింగ ప్రతిష్ఠాపన మాహాత్మ్యము, శివుని

మహిమను కొనియాడు కథలు ఇందు వివరింపబడినవి. ఇది కూడా స్కాందము నాధారముగాజేసికుని శ్రీనాథుడు రచించినాడు.

ఈ కావ్యములోని కథలద్వార శ్రీనాథుని ఆగమశైవ విధానము, శైవారాధనయందుగల ఆసక్తి మనకు విదితమగును. "ప్రాయమింతకు మిగుల గైవాలకుండ" రచించిన గ్రంథరాజమీ కాశీఖండము. శ్రీనాథుని 'ఈశ్వరార్చన కళాశీలత' ఈ గ్రంథములో ప్రతిబింబించుచున్నది.

శ్రీనాథుని ఆగమశైవ విధానమే శ్రీనాథునకిట్టి బిరుదు పొందుటలో దోహదము చేసినదనవచ్చును. శివలింగపూజా విధానమం దీతడు చూపిన ఆసక్తి కొనియాడదగినది. క్షేత్రమాహాత్మ్యము, తీర్థమాహాత్మ్యము జోడించి రెండింటికిగల ప్రాధాన్యతను శ్రీనాధుడు భీమఖండములో, కాశీఖండములో జొప్పించినాడు. ఈ రెంటిమహిమతోపాటు శివుని మహిమలు గొనియాడుట శ్రీనాథుని ప్రత్యేకత. మరియు నీశ్వరార్చన కళాశీలతకు తార్కాణము.

ఈ గ్రంథము శ్రీనాథుడు, రాజమహేంద్రవరము నేలిన రెడ్డిరాజు, వీరభద్రారెడ్డి కంకితముగా క్రీ.శ.1440 సంవత్సర ప్రాంతమునరచియితమైనట్లు తెలియుచున్నది. సంస్కృత మూలమున, ద్వాదశ సహస్ర గ్రంథపరిమితిగల విషయమును తెనుగున నేడాశ్వాసములును 1777 గద్య పద్యములుగల కావ్యమైనది. మూల గ్రంథములోని పౌరాణిక విషయములను, జాతి వార్తాచమత్కార విలసితముగను, శైవతత్త్వ ప్రతిపాదకములుగను, శ్రీనాథకవి విపులీకరించి తెనిగించెను.

శ్రీనాధుడు కాశీఖండములో కాశీయాత్ర మహిమయే చెప్పినను, ఇంకను అనేక విషయము లందు పొందు పరుపబడినవి. సంస్కృతిమున, మయూరుని సూర్యశతక శ్లోకానువాదములు ఇందుగలవు. వాల్మీకి రామాయణము, భవభూతి యుత్తరరామ చరితము, విశాఖ దత్తుని ముద్రా రాక్షసము, భట్టగోపాలుని సాహిత్య చింతామణి (కావ్యప్రకాశికవ్యాఖ్య) అవతారికా రచనముల కనువాదము లిందుగలవు.

కాశీఖండమును ప్రథమాశ్వాసమున పురాణ ప్రశంసయు, నారదుడు వింధ్యకు వితెంచుట మొదలగు వృత్తాంతములు గలవు. కాశీ ఖండ ప్రశంస శ్రీనాథుడిట్లు చెప్పెను.

శా॥ ప్రాశస్త్యంబు వహించు ద్వాదశ సహస్ర గ్రంథ సంక్షిప్తి వి
శ్వేశక్షేత్ర వియన్నదీపటు కదుంఠీనాథ సత్కీర్తనో
ద్దేశ ప్రక్రమ శోభితాద్భుత కథాధిష్ఠానమై శ్రేష్ఠమై
కాశీఖండ మఖండ వైభవమునన్ స్కాందాబ్ధి మధ్యంబునన్.

(కా। ఖం। ప్ర। ఆ। 81)

స్కాంద పురాణమును సముద్రము యొక్క నట్టనడుమ పన్నెండువేల గ్రంథమై కాశిని గంగను డుంఠి విఘ్నేశ్వరుని నుతించు ఆయా ఘట్టములు గల అద్భుత కథల కాకరమై కాశీ ఖండము మహా వైభవముతో విరాజిల్లు చున్నదని భావము. ఈ ఖండమును వేదవ్యాస సూత సంవాదాత్మకమని కూడ చెప్పెదరు. వింధ్య నారద సంవాదము, బ్రహ్మలోక ప్రభావము, గోదాన మాహాత్మ్యము, కాశియందు గల అగస్త్యాశ్రమ వర్ణనము, ముని దేవతా సమాగమము, పతివ్రతా చరిత్రము, అగస్త్య ప్రార్థనము, తీర్థ ప్రశంస, శివ శర్మోపాఖ్యానము, సప్తపురీ ప్రశంస, సంయమనీ ప్రశంస, మహేంద్రలోక దర్శనము, అగ్ని సముత్పత్తి గంధ వత్యలంకార వర్ణనము, చంద్రలోక ప్రాప్తి, ఉడులోక వృత్తాంతము, శనైశ్చర లోక వర్ణనము, సప్తర్షి లోక వర్ణనము, ధ్రువలోక వర్ణనలూ, కుమారాగస్త్య సంవాదము, మణికర్ణికా సముద్భవము, గంగా మాహాత్మ్యము, భైరవావిర్భావము। దండిపాణి జన్మము, కళావత్యుపాఖ్యానము, సదాచారము, బ్రహ్మచారి ప్రకరణము, స్త్రీ లక్షణము, కృత్యాకృత్యపు కరణము, గృహస్థ ధర్మము, యోగ నిరూపణము, కాలజ్ఞానము, దివోదాస వృత్తాంతము, యోగిని వర్ణనము లోలార్కోత్తరార్క సంజ్ఞాదిత్య ద్రుపదాదిత్యారుణాదిత్య వర్ణనము, దశాశ్వమేధ తీర్థ మాహాత్త్యమూ, పిశాచ మోచనము, గణేశ్వర ప్రేషణము, గణేశ్వర మాయా ప్రపంచము, డుంఠీ ప్రాదుర్భావమూ, విష్ణుమాయా ప్రపంచము, దివోదాస సముత్పాటనము, పంచ నదోత్పత్తి, బిందు మాధవ సంభవము, వైష్ణవ తీర్థ మాహాత్మ్యమూ, మందరాచలమునుండి ఈశ్వరుడు వారణాసీ పురమునకు వచ్చుట బైగిషవ్యోపాఖ్యా

సమూ, కృత్తివాస సముత్పత్తి దుర్గా మాహాత్మ్యము, ఓంకార మాహాత్మ్యము త్రిలోచన సముద్భవము కేదారేశ ధర్మేశ మాహాత్మ్యము, పక్షికథా విశ్వభూజా ఖ్యానము, కామేశ్వర, విశ్వకర్మేశ్వర, సరస్వతీశ్వరామృతేశ్వర వర్ణనములు, వ్యాస భుజాస్తంభము, క్షేత్ర తీర్థ కదంబవర్ణనా, ముక్తి మంటప వర్ణనా, విశ్వేశ్వరావిర్భావము, గుణనిధి కథ, దేవతాయాత్రా విధానము అను నూట ఒక్క కథలు గలవు. కాశీ మాహాత్మ్యము తెలుపు కథలున్నను, దానికి తోడు తెలిసికొనదగిన యోగవిషయము లెన్నో ఈ గ్రంథమునందు గలవు. స్కాంద మను సముద్రమున పుట్టి యెన్నో ఉప కథలను కొమ్మలతో రెమ్మలతో గూడి ఈశ్వరానుగ్రహము వలన లభించిన మోక్షమే పలముగా ఈ కాశి ఖండము కల్పవృక్షమువలె మహా వైభవముతో విరాజిల్లు చున్నది. వేదవ్యాస మహర్షి స్కాందములో కాశీఖండ కథ సూతునకు జెప్పినట్లు గలదట. నారదుడు వింధ్య గిరిని దర్శించుటతో కథ ప్రారంభ మగుచున్నది.

వింధ్యపర్వత మెల్లున్నదో ఈ క్రింది పద్యము చూతము.

శా॥ కాంచన్‌గాంచన గర్భసంభవుడు దగ్రగ్రావ కోటిసల
చ్చంచిన్నిర్ఝర వేణికాని వహ సంజాతాబ్ధి సాంగత్యమున్
బంచాస్య స్ఫుట కంఠనాదహత శుంభత్కుంభిదర్పాంధ్యమున్
ప్రాంచద్ధాటక భూమిభృచ్ఛిఖర గర్వావంధ్యమువ్వింధమున్.

(కా. ఖం. ప్ర. ఆ 87)

వింధ్యపర్వత గర్వమడంచుటకై అగస్త్యుడు లోపాముద్రా సమేతుడై దేవతలు ఋషులు ప్రార్థింపగా వారు బృహస్పతిచే అగస్త్యునకి విషయము విన్నవించగా అగస్త్యుడు కాశీని విడచి బయలుదేర నుద్యుక్తు డగును. కాశీని విడుచుటకు అగస్త్యుడు మిగుల బాధ నొందెను. అయినను అట్లే కతిపయ దూరము పయనించి వింధ్యాచలము చేరిరి. పంచాక్షరి మంత్రోపాసకుడు, నిల్వల వాతాపులను బరిమార్చిన తేజశ్శాలియు. నింద్రుండైన నహూషుని సర్పముగా శపించి యధోలోకమునకు బంపిన మహిమాశాలియు, సముద్రోదక మంతయు నొక్క గుక్కగా నాచమనము చేసిన ప్రభావ సంపన్నుడును దన గురువర్యుడును నగు నగస్త్య మహర్షి పత్నీ సమేతుడై వచ్చుటను వింధ్యాద్రి

దూరమునుండియే చూచి తన ఔన్నత్యమంతయు దగ్గించి పూర్వ స్వరూపము ధరియించి యారూప మట్లుంచివేయగా జంగమరూపధారియై యా మహనీయు నెదుర్కొనెను.

వింధ్యము తగ్గిపోవుట వలన సూర్యుని రథము సాగి ముందునకు బోయెను. మిగిలిన గ్రహములు తమ తమ స్థానములు తప్పకుండ గమనము సాగించెను. ప్రపంచమంతయు బూర్వమువలె బ్రవర్తిల్లెను. కాలము మరల నేర్పడెను. వింధ్యాద్రి పురుష స్వరూపధారియై యగస్త్య మహర్షి నెదురుకొని నమస్కరించి యతిథి సత్కారములను జరిపి యుచిత గౌరవములచే నా మహనీయుని సంతోష పఱచి కర కమలములను జోడించి "మహాశయా? నీ దర్శనముచే గృతార్థుడ నైతిని. నీ యాజ్ఞానుగ్రహమున నన్ను మఱియు ధన్యునిగా జేయవా?"అని ప్రార్థించెను. అగస్త్యుడు మిగుల సంతసించి "వింధ్య పర్వత రాజా? ఈ నా భార్యయు నేను దక్షిణాపథమందలి తీర్థములను సేవించు తలంపున నిట్లు బయలుదేఱితిమి. పెద్దవాడనైతిని. సాధారణ భూమియందు నయితము నడచుట మిగుల గష్టసాధ్యముగా నున్నది. నీవింతకు బూర్వము వలె శిఖరములను బెంచియున్న యెడల వానినెక్కి దిగుటకు నా తరమగునా? కనుక నిన్నొక్క కోరిక కోరుచున్నాను నేను దీర్థయాత్రలన్నియు జేసికొని మరల నిచటికి వచ్చు వరకును నిప్పుడున్నట్లే యుండవలయును. ఇది నా యాజ్ఞ. శిష్యుడవైన నీవు దీనిని శిరసావహింపక తప్పదు. అట్లు చేయని యెడల దాని ఫలమపుడే యనుభవింపగలవు. ఇపుడు చెప్పుట యేల"? అని గంభీరముగా బలికెను.

"మహాత్మా? చరాచర ప్రపంచమున మీయాజ్ఞ దాటువారు గలరా? మీరు మరల విచ్చేయు వఱకు నిట్లే యుండెదను. తాము సంతోషముగా దయ చేయుడు'' అని వింధ్యము నమ్రతతో విన్నవించెను. అగస్త్యుడు 'లోక హిత మును దీర్పగలగితినిగదా!' యని యానందించుచు నతని దీవించి తన పవిత్ర పాద విన్యాసములచే నా పర్వతోత్తముని భాగ్యము పండజేయుచు దక్షిణాభి ముఖుడై ముందునకు బోయెను. వింధ్యమాత్రమట్లే యుండెను. ఎంత కాల మెదురు చూచినను నా మహర్షి మరల రాలేదు. ఆ మహాత్మునికి గోప కారణ మగునేమో యని యతడు మరల బెరుగకుండుటచే సూర్యాదుల గతులు

సరిగా జరుగు చుండెను. ఈ కథలో అగస్త్యుడు భాగీరథియందు స్నానము చేసి యొడలినిండ భస్మము పూసికొనుట మారేడు చెట్టుక్రింద బద్మాసనమున గూర్చుండుట రుద్రాక్షలు ధరించుట మున్నగునవి వర్ణింపబడినవి. ఇదంతయు ఆగమోక్త విధిని శివుని కొలుచుట. ఇంకను పంచాక్షరీ మంత్రము నుపాసించుట షోడశోపచార విధిని శివపూజ చేయుట మున్నగునవన్ని ఆగమ శైవ లక్షణములే. ఇచ్చట అగస్త్యుడు'జంగమ రూపధారియైన' మహనీయుడుగా వర్ణింప బడినాడు. ఇచట భస్మము పూసికొనుట యను నర్థములో 'జంగమ' శబ్ద ప్రయోగము చేయబడినదని ఊహింపవగును. వీర శైవములో 'జంగమ' శబ్దము వచ్చును. అచట కేవలము శివుడే జంగమ వేషధారియై భక్తులింట విడియుట వర్ణింప బడును. అచట జంగమునికి వారు యథావిధిగా పూజ చేసిన పిదప నిజరూపము బయట పడును. ఇటువంటి కథలు వీరశైవ భక్తులలో పాల్కురికి సోమనాథుని కృతులలో వర్ణితములు. ఇచట శ్రీనాథుని జంగములు కర్మమార్గము నిరసించినవారు కాదు. షోడశోపచార పూజా విధానమందు ఆసక్తిగలవారు.

ఈ విధముగా అగస్త్యుడు తీర్థయాత్రలు చేయుచు దక్షిణ కాశియగు దాక్షారామున కేగును. అచట వ్యాసుని కలియును. ఈ వృత్తాంతమంతయు భీమేశ్వర పురాణములో పేర్కొనియుంటిని. పిదప వీరభద్రేశ్వరుని దర్శింతురు. పిదిప కొల్లాపురికేగి లక్ష్మిని దర్శింతురు. ఇట్లనేక తీర్థరాజములు సేవించుచు అగస్త్యుడు లోపాముద్రతో పెక్కు క్షేత్రములు దర్శించెను. వీరు లక్ష్మి యనుగ్రహమున గృతకృత్యులై యామె సెలవంది బయలుదేది స్వామిమలకు బోవుచుండ, మధ్యే మార్గమున శ్రీశైలము లోచన గోచరమయ్యెను. అది నాలుగు ద్వారములు, పదునాలుగవాక్షములు, ముప్పది రెండు మకర తోరణములు, నలువదినాలుగు నాట్యశాలలు, వేయయు నేబది దిగుడుబావులు. లక్ష కోట్ల లింగములు, కోటి తీర్థములును గల్గి వరాహకుండ, మల్లికాకుండ, క్షీర కుండాది కుండములచేతను, గదళీ బదరీ బిల్వాది వనములచేతను, హటకేశ్వరాది దివ్య స్థానముల చేతను సంశోభితమై శ్రీస్వయంభూ జ్యోతిర్లింగ మూర్తి యగు మల్లికార్జున దేవునకు నివాసమై యుండెను.

కుంభసంభవుడు పత్నితో గలిసి, పాతాళ గంగయం దఘమర్షణ స్నానము లాచరించి, యారగ్వధ కుసుమములచే హాటకేశ్వరుని బూజించి వైకుంఠ బిలమునందలి నృసింహ స్వామిని సేవించి, యేకాంత రామేశ్వరుని దర్శించి, పిదప భ్రమరాంబా సహితుడైన శ్రీ మల్లికార్జున దేవుని విధి విధానమున గంధపుష్పాదులతో నర్చించి, స్తోత్రములచే స్తుతించి, సంతుష్టుడయ్యెను. పిదప వెదకి వెదకి యన్ని చోటులందును గల యమృత లింగమూర్తులను బూజించెను. యథావిధిగా మండూక కుండమున మునిగి, పంచధారా పల్లధారలయందు స్నానమొనర్చి, కోటిలింగములను బూజించియు ధ్యానవీరభద్రునర్చించెను. పిమ్మట బ్రహ్మ నారాధించి ఘంటా సిద్ధేశ్వరుని వలన మంత్ర సిద్ధినిబొంది, భోగవతీ తీరమందలి భోగేశ్వరుని భజించి, యిష్టకామేశ్వరుని బూజచే సంతుష్టి వడసి, మాతృకలను దలంచి, కదళీవనమునందలి మాయా కిరాతరూపు నుపాసించి, సంతుష్టుడై యొకనిర్జన ప్రదేశమున లోపాముద్రా సహితుడై కూర్చుండి, యా పర్వత మహత్త్వము నామెకిట్లు తెలిపెను. "దీని మహత్త్వము నిరూపమానము. ఇచటి శిలలెల్ల శివలింగములే. చెంచులెల్ల సిద్ధమునులే. కాశీక్షేత్రమచట మరణించిన వారికిగాని ముక్తినీయజాలదు. దీని శిఖరమును జూచుట వలననే ముక్తికర స్థలమగును." ఇది విని లోపాముద్ర రెండు సంశయములు వెలిబుచ్చెను. ఎనుబదినాలుగు యోజనముల పొడవుగలిగి ముప్పది యోజనముల వెడల్పుగలిగి యోజనమున్నతమై, మూడు కోట్ల యేబది లక్షల తీర్థములు గలిగి, యెనుబది యెనిమిదివేలకంటె నెక్కుడు మునులతోగూడి, యేడుకోట్ల మంత్రముల కాధారమై మహామహిమ గల యీ పర్వతము, శిఖరము చూచినంత మాత్రముననే ముక్తినొసంగుచుండ, మరణించిననే గాని ముక్తినీయజాలని కాశీక్షేత్రమునకు గాళ్లీడ్చుకొనుచు బోవుట యెందులకు, జ్ఞానము, విజ్ఞాన సహితమగు కర్మము, దానములు, వ్రతములు, యజ్ఞములు తపము, బ్రహ్మచర్యము, గార్హస్థ్యము వానప్రస్థము,సన్యాసము, తీర్థసేవ స్వాధ్యాయము, పుణ్యక్షేత్ర సందర్శనమునను నివియన్నియు, ముక్తిసాధనములేయని బుధులు చెప్పుదురు. వీనిలో సులభమగు సాధనమేది? యని యామె సందేహము వెలిబుచ్చగా అగస్త్యుడిట్లు చెప్పెను. "శ్రీ శైలాది తీర్థములు ముక్తి కారణములగును. అన్నిటికిని మహిమ గలదు. కాని యివి కాశీ క్షేత్రమును జేరగలుగుట

-కర్తతను మాత్రమే గలిగించును. కాని సాక్షాన్ముక్తి నీయజాలవు. కాశి యొక్క-టియే సాక్షాన్ముక్తి నొసగగలదు. ప్రయాగ, నైమిశము, కురుక్షేత్రము, గంగా ద్వారము, అవంతిక, అయోధ్య, మథుర, ద్వారక, సరస్వతి, నహ్యాము, గంగా సాగర సంగమము, కాంచి, త్రయ్యంబకము, సప్తగోదావరము, కాలంజరము, ప్రభాసము, బదరికాశ్రమము. మహాలయము, ఓంకారము, పురుషోత్తమము, గోకర్ణము, భృగుతీర్థము, పుష్కరము, శ్రీశైలము నను నివి మోక్ష కారణములైన మహాతీర్థములు. దీనివలన తీర్థయాత్ర చేయుట యందు శ్రీనాథునికి గల ఆసక్తి వెల్లడియగుచున్నది. మానవు లేవేని పాపములు జేసినను తీర్థ యాత్రలుచేసి, మహానదులందు స్నానమాచరించి, పంచాక్షరీ మున్నగు మంత్రములు పారాయణచేసి దేవాలయమునకేగి భగవంతునిదర్శించినంతమాత్రముచేత పాపములు నశించి మోక్షగతిని బడయుదురని హిందువుల నమ్మకము. ఈ నమ్మకముతోనే అగస్త్యుడు లోపాముద్ర సహితుడై తీర్థయాత్రాటనము సేయుచున్నాడు. ఇది మోక్షమార్గము. మోక్షము పడయుట, శివుని సాయుజ్యము పడయుట ఇంచు మించు ఒక్కటియే. ఈశ్వరుని కొలచి ఆయనకు తగు విధముగా అర్చించి సాక్షాత్కరింప జేసికొని సాయుజ్యము కోరుట, చివరకు మోక్ష ప్రాప్తి పొందుట మనకూ కొన్ని కథల వలన తెలియుచున్నది. ఈశ్వరానుగ్రహము లేకుండిన యెడల మనసు తీర్థయాత్రకు సమ్మతింపదు. తీర్థయాత్ర చేయక పాపము నశింపదు. పాపము తొలగకుండ గాశికేగుట కర్తత లేదు. కాశీవాసములేక జ్ఞానము గలుగదు. దానివలనగాని మోక్షము లేదు. వేదాంత వాక్యముల వలన గలుగు జ్ఞానము సుజ్ఞానము. ఇతర మజ్ఞానము. ఈ సూక్ష్మ విషయమును జ్ఞప్తియందుంచుకొనవలె."

ఖడ్గధార ధారాతీర్థమనబడు దాని మూలముగా ప్రాణములను విడుచు వీరుడు ముక్తినొందును. బాహ్య తీర్థములకంటె మానస తీర్థము లుత్తమములు. అవి ముక్తి నొసగును. మానస తీర్థములను విడిచి కేవల బాహ్య తీర్థములను సేవించుట వలన లాభము లేదు. ఈ విశేషములు తీర్థయాత్రా సందర్భమున చెప్పబడినవి.

లక్ష తీర్థములను సేవించినను గాశీ తీర్థము సేవింపక ముక్తి కలుగదు. ఈ విషయమును దెల్పు నొక్క యితిహాసము కలదు. అదియే శివ శర్మోపాఖ్యానము.

మధురయందు శివశర్మ యను బ్రాహ్మణుడుండెను. అతడు వేద శాస్త్రాదులను జక్కగా నభ్యసించి, సకల భాషలను నన్ని లిపులను నేర్చి, ధర్మార్థ కామములను, సమృద్ధములుగా జరిపి, పుత్రులను గాంచి వారికి ధనము పంచి యిచ్చెను. ఇంతలో నతనికి ముదిమి లక్షణములు కానవచ్చెను. అపు డాతడు తానంతకు బూర్వము కేవల మైహిక సుఖములనే యనుభవించుటతో గాలము గడపినందులకు విచారపడి తీర్థయాత్రాసక్తుడై, విరక్తుడై సంసార బంధములను వదలుకొని వెంటనే బయలుదేరెను. రెండు మూడు దినములు ప్రయాణము చేసి చెట్టునీడన విశ్రమించి ఆయువు తటిచ్చంచలము అందుచే అన్ని తీర్థములు సేవించుట శక్యమగునా యని ఆలోచించి, అయోధ్య, మధుర, మాయ, కాశి, కాంచి, అవంతిక (ఉజ్జయని) ద్వారవతి యను నేడు పురము లును, ముక్తిదాయకములని వినుము, వానిని మాత్రము దర్శించి జన్మము సార్థకము చేసికుందునని నిశ్చయించుకొనెను. అయోధ్య, [1] ప్రయాగ సందర్శించి కాశీ క్షేత్రమునను వచ్చెను. ఇచట కూడ కాశీమహత్త్వము చెప్పబడి నది. కాశీక్షేత్ర రాజమున మరణించు ప్రాణులకు మహేశ్వరుడు కుడి చెవి యందు దారక మంత్రము నుపదేశించి ముక్తినొసంగు చుండును. అతడచట స్నానము చేయువారి కర్ణికాంతమును జేరి మోక్షమను మణి యొసగును. గనుక నా మహా తీర్థమునకు మణికర్ణిక యను పేరు గలిగెను. అచట జని పోయిన యన్ని జంతువులును మహాద్భుతముగా నీశ్వర రూపమును బొందు చుండును. అచట నెడమ వైపుగా బరుండి ప్రాణము విడుచు దోమ పిల్లలకు గూడ మహాదేవు డోంకారము నుపదేశించుట చూచి దేవతలు గూడ దాని యదృష్టమునకు మెచ్చుకొనుచు తమ వ్యర్థ జీవనములకు లజ్జించు చుందురు. కాశీ పురమున బెద్ద నిద్దుర పోయిన జంతు సంతానములు తమకచట మర ణించుటవలన గలిగిన యర్ధనారీశ్వర స్వరూపమును జూచుకుని యది తన

---

1. ప్రయాగ- ఇది ప్రజాపతి క్షేత్రము. యాగ ఫలము కంటె నెక్కువ ఫలము నిచ్చునదగుటం జేసి దానికి బ్రయాగ (ప్ర+యాగ) నామము సార్థకము. శివశర్మ మకరముతో గూడిన మాఘమాసమందు బ్రయాగకుబోయి, గంగా యమునా సంగమమున దటి తప్పక తీర్థమాడుచుండును. మరల గొన్ని దినములకు గాశికి వచ్చుచుండును.

కెట్లు కలిగెనా యని యాశ్చర్య పడుచుండును. ఇట్లు కాశీ క్షేత్రమునందు గొన్ని దినములున్న పిదప ఆ విప్రునకు మిగిలిన తీర్థములు కూడ సేవింప వలయునను నాకాంక్ష ప్రబలెను. ఉజ్జయిని కంచి, ద్వారవతి, మాయాపురి మున్నగునవి కూడ సందర్శించెను.

ఇచట శ్రీనాధుడు మాయాపురి ప్రశంస చేయునప్పుడు విష్ణు మాహాత్మ్యము కూడ వర్ణించినాడు. పిదప సంయమినీ వృత్తాంతము, అప్సరలోక వృత్తాంతము, సూర్య లోకము, స్వర్గలోకము మున్నగున వన్నిటి మాహాత్మ్యములు కవి వర్ణించినాడు. అగస్త్యుడు లోపాముద్రా సమేతుడై దక్షిణ కాశికి బోవుట, కొల్లాపురము దర్శించుట ఈ మొదలగు వృత్తాంతము లన్నియు తృతీయాశ్వాసములో చెప్పబడినవి. ఇక వైశ్వానర మాహాత్మ్యము కూడ ఇదే ఆశ్వాసములో చెప్పబడినది. శాండిల్య గోత్రమున విశ్వానరుండను బ్రాహ్మణుడుండెను. ఆతడు గృహస్థుడై తద్ధర్మంబులను సరిగా గడపి ముక్తినొంద దలచి ఉత్తమ కుల సంజాతయగు నొక బాలికను పెండ్లి యాడెను. ఆమెయే శుచిష్మతి. వారికి చాల కాలము వరకు సంతానము లేమిచే యామె చింతించి భర్తకు విన్నవించెను. అంత నాతడు "భగవంతు నారాధించి తదనుగ్రహమున సంతానము వడసెద" నని యామె నోదార్చెను. కాశీ విశ్వనాథుని కరుణ చేతనే పుత్రోదయ మగునని నమ్మకముతో ఆతడు కాశీ క్షేత్రమునకు బోయెను

విశ్వానరుడు అచట యన్ని తీర్థములందును స్నానమాచరించి పాప పరిహార మొనర్చుకొని యా క్షేత్రము నందలి యందఱ దేవులను బూజించి యచట తపము చేసిన యెడల కామితము తీరునోయని యాలోచించి యవి ముక్త మండపమందులకు దగిన చోటని నిశ్చయించెను. అచట దపంబొనర్చి నందున ము న్ననేకులు కామితసిద్ధి నొందిరని యాతడు జ్ఞప్తికి దెచ్చుకొనెను.

వైశ్వానరుండు గంగయం దఘమర్షణ స్నాన మొనరించి భస్మము పూసికొని, శిరోబాహు మూలములందు దిర్యక్పుండ్రములు ధరించి, రుద్రాక్ష మాలికలు వేసికొని, దేవతా నమస్కారము చేసి, పులిచర్మముపై కూర్చుండి ప్రాణాయామము చేసి చిత్తశుద్ధి నొంది, యాంతర జ్ఞాన చక్షుస్సుతో నవి

ముక్త విశ్వేశ్వర స్వామిని భావించి ధ్యానించుచుండ సతని యదృష్టవశమున విశ్వేశ్వర లింగమునుండి సమస్తాలంకార భూషితుడై దివ్యసుందర విగ్రహుండగు నొక బాలకుండు బయిటికి వచ్చి స్పష్టమైన స్వరముతో నోంకార సహితముగా వినసొంపుగా మూడవ సవనము నందలి శ్రుతి పఠింప నారంభించెను.

విశ్వానరుం డమందానంద పరిపూర్ణుడై నిటల తటమున హస్తములు జోడించి యుపనిషద్వాక్యముల నా మహనీయుని స్తుతించి సాష్టాంగ దండ ప్రణామములు చేసి నిలిచెను. అపుడా బాలుడు చిఱునవ్వు నవ్వుచు "భూసుర వర్యా! నీ తపమునకు మెచ్చితిని. నీ కోరిక యెఱుగుదుచు. అది సిద్ధించునట్లు పతివ్రతా తిలకమగు నీ సతి గర్భమున నచిర కాలమున నే జన్మించెదను. నీవు సంకోచము వదలి గృహమునకు బొమ్ము." అని యానతిచ్చి మరల నా లింగమందే విలీనుడయ్యెను. పరమేశ్వర కటాక్షము లభించినందులకా దంపతులు తమ నిలయమునకు బోయి సుఖముగా నుండిరి.

ఇక చతుర్థాశ్వాసము వైశ్వానర జననముతో ప్రారంభమగును. విశ్వానరుడు కాశీ క్షేత్రముమునకేగి తపస్సునియ మొదలిడినాడు. ఆ తపస్సు పరాకాష్ఠనందిన ఆగమోక్త ప్రకారమైన శివలింగార్చనము శ్రీనాథుడు గొప్పగా చిత్రించినాడు. తపస్సు ఫలించినది విశ్వేశ్వర వరప్రసాదమున శుచిష్మతి అంతర్వత్ని అయినది. "తద్యోషి దన్తర్వత్నీ బభూవ" అని మూలములో కలదట[1]. ఈవిధముగా నున్నదానిని శ్రీనాథుడు తెలుగులో మూడు పద్యములు రచించినాడు.

శుచిష్మతి గర్భవతిగా నున్నప్పుడు, గర్భస్థుడగు మహాదేవు నను భావము వలన నామెకు సంధ్యాకాలమునందు నాట్యము చేయుట కాశీలో జని పోయినవారికి దారక మంత్రోపదేశ మొసర్చుట మొదలగు పనులు జేయుటకు తలంపులు గలుగుచుండెను. శివు నను గ్రహమునే పుట్టబోవు బాలుడు గనుక, వారు జీవ భక్తులు గనుక ఆమెకట్టి యాలోచనలే కలిగెడివి. ఇంకను

శుచిష్మతి గర్భస్థ శిశువు శివుడు కనుక ఆమె పగలు ముగిసి సంధ్యా సమయము కాగానే ఆనంద తాండవమాడ దలచునట! అంతే కాదు కాశీ

1. ఈశ్వరార్చన కళాశీలుడు. డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తిగారు. (పుట 74)

క్షేత్రమున జంతుకోటి ముముక్షా వేశ ఓంకార మానతీ గోరునట! పైగా పసిడి కమ్ముల వచ్చి యేనిక తోలు పచ్చడము ధరింపనెంచునట! ఆ మీద ఆకు కూటి పిశంగ మకుటాగ్రమున చందనామను తుఱుమ ఉవ్విళ్లూరునట' ఉపరి, అంక పీఠము నందుంచి విఘ్నేశ్వరుని ఆదరింప కాంక్షించునట! ఇది శుచిష్మతి చూడిదలు. ఈ వర్ణన యంతయు శ్రీనాథుని ఈశ్వరారాధన కళాశీలతకు తార్కాణము. సంధ్యా కాలమగు సరికి శ్రీనాథుని స్మరణము శివతాండవము. అంతేకాదు శివ తాండవము నెడ శ్రీనాథుని పారవశ్యము భీమ ఖండమున వివరింపబడినది, ఉక్తపూర్వము. అది కాశీ ఖండమునందు అగ్రేసర భాసమానము

ఆ మెబాలుని కన్న తరువాత వశిష్ఠాది మహర్షులును విద్యాధరా దేవతా భేద వారును త్రిమూర్తులును నా బాలుని చూచుటకు వచ్చి 'గృహపతి' యని పేరు ములపెట్టిరి. ఒక దినమున నారద మహర్షి లోక సంచారము చేయుచు మార్గవశ మున నచటికి వచ్చెను. ఆతడన్ని విషయములు వారితో చర్చించిన పిమ్మట బాలుని తన తొడలపై గూర్చుండబెట్టుకొని కుడిచేతి రేఖలను పరిశీలింప సాగెను. పిమ్మట పండ్రెండ్రవ సంవత్సరమున నీ బాలునికి వజ్రాయుధము వలన గండము గలదని దానిని గూర్చి తగిన జాగ్రత్త తీసికొనుడని చెప్పి పోయెను. శుచిష్మతీ విశ్వానరులు పిడుగువంటి ఈ వార్త విని యనేక విధ ముల విలపించసాగిరి. వైశ్వానరుడు వారి సమీపించి "తల్లిదండ్రులారా! ఏల విచారింతురు. మీ పాదధూళి దిన దినమును నాకు సర్వాంగ రక్షయై యుండ మృత్యుదేవత నన్నెట్లు సమీపింప గలదు. అనుచు ధైర్యము చెప్పి వారనుగ్రహించిన యెడల తాను కాశీ క్షేత్రమునకేగి యచట మృత్యుంజయుని మృత్యుబాధ తొలగించుకొనెద" యని వినయముతో వారికి విన్నవించెను.

వారాశీర్వదించి "తప్పక యా మహనీయుని వలన నీవు రక్షింప బడు దువు" యని కాశీ పట్టణమునకు బంపిరి. అతడు నచటికి బోయి మణికర్ణిక యందు స్నానముచేసి విశ్వనాథుని దర్శించి దివ్య జ్యోతిర్లింగమును సేవించి పరమానంద భరితాంతరంగుడై దానివలన దప్పక తన మనోరథము సిద్ధించు నని నిశ్చయించి యొక శుభ ముహూర్తమున నచటి యొక పుణ్యాశ్రమమున నొక లింగమును స్థాపించి తత్సమీపమున బరమ నిష్ఠతో రెండు సంవత్స

రములు ఘోరముగ దపస్సు చేసెను ఇట్లు గృహపతి తపస్సు చేయుచుండ నొక్కనాడింద్రుడు వజ్రహస్తుడై యైరావతము నెక్కివచ్చి సాక్షాత్కరించి "వైశ్వానరా! నీ తపమునకు మెచ్చితిని. వరములీయ వచ్చితిని; నీ యభీష్టము తెల్పుము'' అనెను.

అంత వైశ్వానరుడు "తాను విశ్వేశ్వరస్వామిని వరము కోరునేగాని యన్యులను గాదని" ప్రత్యుత్తర మొసగును. ఇంద్రుడందులకు కోపించెను. "త్రిలోకములను పాలించు నాకంటె విశ్వేశ్వరుడెక్కువ వాడా! ముల్లోకముల లోను నాకంటె నధికుడు లేనేలేడు. కనుక నా మాటలను నమ్మి వరము గోరుకొనుము" అని మరల బలికెను. వైశ్వానరుడు ఏమియు లెక్కజేయక "నీ మహిమ లోకమునకు దెలియక పోలేదు. వరముతో నాకు బనిలేదు. వెనుదిరిగి పొమ్ము" అని పరిహాసపూర్వకముగా బల్కెను.

ఇంద్రునికి కోపము హెచ్చెను. తన వజ్రాయుధము నొక్కమారు ఝళిపించెను. దానితో మహేశ్వరుని దలంచుచునే యాతడు మూర్ఛిల్లెను. తనయందు విప్రకుమారునికి గల భక్తికిమెచ్చి విశ్వనాథుడు ప్రత్యక్షమై "వత్సా! లెమ్ము'' అని యానతిచ్చి లేవదీసి యాదరించి యీ యగ్ని లోకములకు బరిపాలకుని జేసి యంతర్ధానము నొందెను. వైశ్వానరుడు (గృహపతి) పరమేశ్వరానుగ్రహమున దీర్ఘాయుష్మంతుడును, దిక్పతియునై కృతార్థుడయ్యెను. దీని వలన కాశీ క్షేత్ర మాహాత్మ్యము విశ్వేశ్వరుని మాహాత్మ్యమెటువంటిదో తెలియుచున్నది. ఇంకను నీ అశ్వాసమున నిర్ఋతిలోక వృత్తాంతమూ, వరుణలోక వృత్తాంతమూ, మొదలగునవి వర్ణింపబడినవి. కుబేర వృత్తాంతము నందలిదే గుణనిధోపాఖ్యాము. ఈ కథవలన కూడ మనకు కాశీపురీ మాహాత్మ్యము తెలియును. కాంపిల్య నగరమునందు యజ్ఞదత్తుడను బ్రాహ్మణుడుండెను. అతడు సకల శాస్త్రవేత్త. ఆహితాగ్ని. అతనికి గుణనిధియను కుమారుడుండెను. అతడు చదువుయందు శ్రద్ధ వహింపక కులాచారములను విడిచి జూదమాడుట కలవాటుపడి యన్నివేళలందును జూదరులతో గూడి పట్టణమునందు సంచరించెడివాడట. సకల దుర్గుణములు అతనికబ్బెను. యజ్ఞదత్తుడు గృహకార్య నిమగ్నుడై యితని ప్రవర్తనమును సరిగా బరిశీలింపక జ్ఞప్తికి వచ్చినప్పుడు తనయుని సంగతి భార్యనడుగగా నామె ఈతని దుర్గుణ

ములు భర్తకెఱుక పరచక యిప్పుడే పుస్తకము తీసికొని చదువబోయెనని బొంకెడిది. కుమారునకు పదునాఱేండ్ల ప్రాయము రాగానే వివాహము చేసిరి. వివాహము చేసిన తరువాత తల్లి కుమారునకు రహస్య ప్రదేశమున ఈ విధముగా బోధించెను. "నాయనా ? నీ ప్రవర్తన మేమియు బాగా లేదు. ఇంతవఱకును జిన్నదనము గదా యనియు, నేమైన నన్న యెడల జిన్నపుచ్చు కొందువు గదా యనియు, బెద్దవాడవైనచో నీవే మంచి మార్గమునకు వత్తువనియు నుపేక్షించితిని. ఇప్పటికి బదునాఱేండ్ల ప్రాయము వచ్చినది. పెండ్లియైనది ఇప్పటికిని నీకు జ్ఞానము రాలేదు. దుస్సహవాసములను దురభ్యాసములను మానవైతివి. ఇంటగల యన్ని వస్తువులను బాడు చేసితివి.

మీ తండ్రి కోపస్వభావుడు. నీ దుష్ప్రవర్తన మాతనికి దెలిసిన యెడల నిన్నును నీ ప్రవర్తనమును గప్పి పుచ్చిన నన్ను జంపివేయడా ? నీకు కులపుబెద్దలు శ్రోత్రియులై యజ్ఞాదుల నొనరించిన పూజ్యులు నీ తండ్రి సత్ప్రవర్తన గలిగిన రాజాధిరాజులచే గౌరవింపబడు చున్నాడు. నేను బతిభక్తి పరాయణను. నీ తోడి వారందరును వేదశాస్త్రాభ్యాసముల నొనర్చి వాసి గాంచిన వారు. నీ విఱువదియైదు సంవత్సరముల ప్రాయము గలవాడవైతివి. పదునాఱేండ్ల భార్య యింటికి వచ్చియున్నది. ఈ పరిస్థితులను జక్కగా నాలోచించుకొని నీ యర్హతకు దగిన ప్రవర్తనము నవలంబించినచో నాకు సంతోషము కాదా ! ప్రజలు మెచ్చరా" ! అని చెప్పి అతనివలన అతని తండ్రికి కలుగబోయెడు హానిని గూర్చి కూడా వక్కాణించెను.

గుణనిధికి దల్లిమాటలు రుచింప లేదు. అతని ప్రవర్తనము నందించుకయు మార్పు గనపడలేదు. నవ యౌవనారంభమున దుర్వ్యసనము లలవాటైన యెడల వానిని మాన్పుట తరముకాదు.

పూర్వమొకప్పు డొకానొక గొప్ప వర్తకుడు రాజును దర్శింప వచ్చి నవరత్న ఖచితమగు నుంగరమొకటి కానుకగా నర్పించెను. రాజొకానొక పర్వదినమున దానిని యజ్ఞదత్తునకు ధారా పూర్వకముగా దానము చేసెను. అది యాతడొకప్పుడు ప్రేమతో ధర్మపత్నికిచ్చెను. ఒకప్పుడు జూదమున మిత్రులకు బాకీపడి కుమారుడు వచ్చి దీనముగా నడుగుట వలన దల్లిదానినాతనికిచ్చెను. అతడా యుంగరము జూదగానికీయ నతడు వ్రేలిని ధరించి

పట్టణమున సంచరించుచు యజ్ఞదత్తుని కంట బడెను. యజ్ఞదత్తుడు ఆ యుంగరము చూచి తనదేయని గ్రహించి యా జూదరిని పట్టుకొని యడిగెను. అంతనాతడు తన కుమారుడు జూదమున బాకీపడి ఈ యుంగరము తనకిచ్చినట్లు తెల్పెను. ఇదియే గాదు, ఇంకను వెండి, బంగారు పాత్రలు మొదలుగా గల వస్తువులన్నియు గుణనిధి తెచ్చిన వృత్తాంతము కూడ ఆ జూదరి యజ్ఞదత్తునకు చెప్పెను. యజ్ఞదత్తునకు లజ్జయు క్రోధమును గలిగెను. ఇంటికి పోయి భార్యను ఉంగరము సంగతి యడిగి యిన్నియు ఆరాతీయగా నామెను బాగుగా మందలించి మహాకోపముతో నాటి కాహ్నిక కృత్యము దీర్చుకొని యా భార్యాపుత్రులను విడిచి మరియొక శ్రోత్రియుని పుత్రికను వివాహమాడి గృహస్థ ధర్మములను నెఱవేర్చుకొను చుండెను. పత్నిని పుట్టినింటి వారు తీసికొని పోయిరి.

గుణనిధి తండ్రి కోపమెరిగిన వాడగుటచే సురల నింటికి బోవక ఇంతపని జరిగినది ఏమిచేయుదును? ఏమితిందును అనుకొని మిగులపశ్చాత్తప్తుడయ్యెను. సూర్యాస్తమయమై క్రమముగా చీకటులు విజృంభించినవి. ఆ దినము శివరాత్రి యగుటచే శివభక్తుడొకడు నగరము వెలుపలనున్న యొక దేవాలయము కడజేరి నాలుగు యామములును, నుపహారములు సమర్పింపబూని నియతుడై పలువిధములగు భక్ష్య భోజ్యాదులను జేయించెను. ఏమియు దోపక బయట సంచరించు గుణనిధి కచటి పదార్థముల వాసన నాసా పర్వము గావింప మెల్లగా దేవాలయము చేరబోయి యచట నృత్తగీతాదులు జరుగుచుండుటచే ప్రొద్దుపోవు వఱకును జాగరముచేసి కూర్చుండెను. జనులందఱును నిద్రాధీనులై పరుండిరి. అదిచూచి గుణనిధి యదియే తగిన సమయమని మెల్లగాలేచి బట్ట యెగగట్టుకొని తలుపుచప్పుడు కాకుండ నోరవాకటిగా దీసి యూపిరి బిగబట్టి కాలిముని వ్రేళ్ళపై జప్పుడు కాకుండ మెల్లగా నడిచి గర్భాలయము ప్రవేశించెను. ఇంతలో దీసియున్న ద్వారము వెంటగాలిరాగా దీప మారిపోయెను. మరల దీపము వెలిగించి తన కిష్టములగు పదార్థములను స్వీకరింపనెంచి యతడు తన వస్త్రము కొనను జించి వత్తిచేసి సమ్మెలోనుంచి రెండవగదిలో వెలుగుచున్న దీపమునుదెచ్చి వెలిగించి యచట చెంబులోనున్న నేయి కొంత దీపపు ప్రమిదలోబోసి యాదీపము వెలుగున లోపలనున్న వస్తువులను జక్కగాజూచి యచట యున్న పుగిన్నె నొకదానిని బట్టుకొని బయటికి

బోయి స్వేచ్ఛగా దినవలయుసను వాంఛతో మెల్లగా మరల బయటికి వచ్చు చుండ విధివశమున నతని పాదమచట బరుండి యున్న వారిలో నొకని శిరము నకు దగిలెను. వాడు తత్తర బాటుతో 'దొంగ దొంగ' యని యఱచెను. అందరును కేకలువేసి గందర గోళము చేసిరి. గుణనిధి భయపడి నాకటి బాధచే నన్నపాత్రము మాత్రము విడువకయే బయటికివచ్చి పఱుగెత్తుచుండ దలారులు వెంటదగిలి బాణములతో గొట్టిచంపిరి.

గుణనిధి జీవితము పూర్తియయ్యెను. అతని జీవమునుగొని పోవుటకు యమ భటులును, విమానముగైకొని పరమేశ్వరుని కింకరులును వచ్చిరి. మహేశ్వర భటులను జూచి యమభటులు ఇట్లనిరి 'మహనీయులారా! మీరు సకల ధర్మజ్ఞులరు. మీ యెదుట మేము నిలువనైనజాలము. వీడు కులాచార విహీనుడు. పితృవాక్య పరాఙ్ముఖుడు. శివ నిర్మాల్యహర్త. ధర్మకార్య మొక్కటేమైన నాచరించి యుండలేదు. ఇట్టిపీనిని గొనిపోవ మీరువచ్చుట యాశ్చర్యకరముగ నున్నది. కృపతో దీనికి కారణము దెలుపు" మని వేడిరి.

అంత శివభక్తులిట్లు బదులు పలికిరి 'శమన భటులారా! శివధర్మము మిగుల సూక్ష్మము. అది స్వల్పముగా సిద్ధించినను సకల దురితములును దొల గును. ఇతడొనర్చిన పుణ్యకర్మములను వినుడు. ఇతడు అన్నము దొరుకక పోవుట చేతనైనను శివరాత్రి యందుపవాసము చేసెను. భోజన పదార్థము లను దొంగిలింప గోరియైనను వేకువఝాము పఱకును జాగరము చేసెను. పదార్థములను సరిగా జూచుకొనుటకైనను నేతితో భగస్సన్నిధానమున దీపము వెలిగించెను. ఇష్టముతో గాకపోయినను బరమేశ్వర పూజ కన్నులార జూచెను. ఈశ్వర గేహమునందు దేహము చాలించెను. ఇవన్నియు ధర్మ కార్యములే".

ప్రమథ గణములవారు గుణనిధిని విమానమునందు గూర్చుండబెట్టుకొని తిన్నగా దీసికొనిపోయి శివుని సన్నిధిన నిలువబెట్టిరి. శివుడాతనింగరుణించి యతని పుణ్యమునకు దగినట్లు కళింగ దేశాధిపతియగు నరిందమునకు జన్మించి దముడను పేర నారాజ్యమును బరిపాలించునట్లు కరుణించెను. అతడట్లు జన్మించి పట్టాభిషిక్తుడయ్యెను.

దైవ కటాక్షమున నాతనికి బూర్వజ్ఞానము లభించెను. అతడు తన పురము నందును దేశమునందును గల సకల శివాలయములయిందును నేతితో దీపములు వెలిగించుచుండ వలయుననియు నట్లు వెలిగింపక యుపేక్షించిన వారిని దల తెగ వ్రేయుదనియు, శాసించి రాజభటులచే నెల్లప్రదేశములందును జాటింపించెను. రాజు శాసనమునకు లోబడి జనులందఱునట్లు కావించిరి. నిరంతరము నట్లు దీపదానము చేయించిన పుణ్య విశేషము నతడు మరుసటి జన్మము నందు గుబేరుడుగా జన్మించి యీశ్వరునకు మిత్రుడయ్యెను. అతని జన్మ వృత్తాంతమిట్లు గలదు. పద్మ కల్పము నందు బ్రహ్మకు మానస పుత్రుడైన పులస్త్యునకు విశ్రవసుడు జన్మించెను. ఆతనికి దపోనిధియగు వైశ్రవణుడు పుట్టెను. అతడు శివునకు మిత్రుడై యలకానగరమును బాలించెను. పిదప మేఘవాహన కల్పమునందు యజ్ఞదత్తుని కుమారుడగు గుణనిధి ధనేశ్వర పదవిని సంపాదించెను. అతడు కాశీనగరము వచ్చి పదివేల సంవత్సరములు ఱెప్ప వేయకుండ విశ్వేశ్వర స్వామిని జూచుచు నిష్ఠతో దపము చేసెను.

పరమేశ్వరుడు దివ్య ప్రభా భాసమానుండై భవానితో గూడ ప్రసన్నుండైన నా మహనీయుని తేజము వలన గుణనిధి దృష్టి చెడి యంధుడయ్యెను. అయినను భక్తి విడవక యాత డుపనిషత్తులతోను బంచాక్షర్యాది మంత్రములతోను స్తుతించి ' మీ శ్రీపాద పద్మములను సేవించు భాగ్యము గలుగజేయు' డని ప్రార్థించెను. త్రిలోచనుడాతని భక్తికి సంతసించి చిఱు నగవుతో నాతనికి దివ్యదృష్టి ప్రసాదించెను.

యజ్ఞదత్తి శివప్రసాదమున లభించిన దృష్టితో నా పరమేశ్వరుని సేవించెను. అపుడే శృంగార సారధి దేవత యనదగు పర్వత రాజకుమారిక వచ్చి యా మహేశ్వరుని భుజము తగులునట్లు దగ్గఱగా నిలుచుండెను. ఆ సుందర గాత్రి నీ గుణనిధి చూచి యామెయు నొక భక్తురాలే యనుకొని తనకంటె నంత చనువుగా నా పరమేశ్వరునట్లు సమీపించుటకామె యెంత తపస్సుచేసెనో గదా ! యనియు, దనకట్టి భాగ్యము లభింపదయ్యెగదా యనియు గొంచె మీర్ష్యతో గ్రీగంట నామెను జూచెను.

అతడట్లు తనవైపునకు జూచుటవలన పార్వతి కోపము తెచ్చుకొని శివునిజూచి "మహాత్మా ! ఈ దురాత్ముడెవ్వడు? నను మాటి మాటికిని గ్రీగంట

చూచుచు ననేక వికారములను జూపుచున్నాడు. ఇట్టి గొప్ప చనువు కలుగుటకు నీకీతనియందు గలిగిన దయయే కారణము సుమా ! నా రూపము చూచి యీతడీర్ష్య చెందుటకు గారణమేమో యడిగి తెలిసి కొనుము'ని పలికెను.

అంత నాతడు 'వీడు మనకు బుత్రుడు ; లోపములున్న క్షమింప వల యును. ఇతడు కాశియందనేక సహస్ర వర్షములు తపము చేసెను. ఇతనిని గరుణతో జూడుము. నేను దీనికి యక్షకిన్నెర లోకముల కాధిపత్యమును, నా మైత్రియు నిచ్చితిని నీవు కూడ వరమిమ్ము ' అనెను. పార్వతి ఈర్ష్యా గ్రస్తయై 'నిరసనగా జూచితివి గనుక నెడమకంటి గ్రుడ్డు గవ్వవలె బయటికి వచ్చి వ్రేలాడుచుండ, గుడికన్ను లోపలికి దించుకొనిపోయి యుండుగాక. గుబేరుడని పేరుగలుగుగాక ! పరమేశ్వరుడు నీకొసగిన వరములన్నియు జరుగునుగాక. కాశియందు నీవు నిల్పిన లింగము మహిమాన్వితమగును గాక " యని నుడివెను.

కాశియందు విశ్వేశ్వరుని సేవించు మహాత్ములకు సకల కామితములును దీరును. విశ్వేశ్వరునికి గుడి ప్రక్క గుబేర స్థానమునందు గుబేరేశ్వరుని సేవించు వారికి అణి మాద్యష్టైశ్వర్యములును లభించును. గుణనిధి యట్లు ధనదుండై శివునితో జెలిమి యొనరించి యలకా నగరమునందు రాజ రాజను పేరితో బరిపాలించు చుండెను. ఇది కుబేర లోక వృత్తాంతము. ఇంకను ఈశాన లోక వృత్తాంతము, చంద్రలోక వృత్తాంతము మున్నగునవెన్నో కాశీ ఖండములో చెప్పబడినవి.

ఇంక పంచమాశ్వాసమున కాశీక్షేత్ర మహిమ సందర్భాను సారముగా వివరింపబడినది. కుమారస్వామి అగస్త్య సంవాదముతో నీ యాశ్వాసము ప్రారంభమగుచున్నది. కాలభైరవ చరిత్ర, హరికేశ చరిత్రము ఇత్యాదు లన్నియు నీఆశ్వాసమునగలవు. కాలభైరవ చరిత్రలో శివుని ఆధిక్యత నిరూ పింప బడినది. పూర్వమున నొకప్పుడు బ్రహ్మదేవుడు మునులందఱును దన్ను సేవింప మేరు శిఖరమున గొలువుండెను. అపుడు మహర్షులాతనికి నమస్క రించి "మహనీయా మా కొక్క సంశయము గలదు. అది తీర్పవలయును. అవ్యయమగు తత్త్వమేదియో సెలవిమ్ము" అని వేడుకొనిరి. పరమేష్ఠి పరమేశ్వర

మాయా మోహితుడై పరమాత్మ వివేకము లేక, 'జగత్తులను సృజించిన నేనే యీశ్వరుడను. నాకీశ్వరుడు లేడు. కనుక నన్నే పరతత్త్వముగా భావించి సేవింపుడు' అని పలికెను. అది విని యచటనే యున్న పరమేశ్వరాంశ సంభూతుడైన విష్ణుదేవుడు సహింపక క్రోధముతో 'ఓయీ, పరతత్త్వము నెఱుగక యహంకారముతో 'నేనే పరాత్పరుడ'ననుట నీకు దగునా? నేను సాక్షాన్నారాయణుడను, యజ్ఞపురుషుడను, జగత్ప్రియుడను, అవ్యయుడను. కావున నీవులేని పెద్దఱికపు మాటలు పలుకుచు నెగిరి పడకుము' అనెను. పరస్పర జయార్థులగు వారిరువురకు బెద్ద తడవు కలహము జరిగెను. ఇద్దఱును వేదములను మధ్యవర్తులుగా గోరుకొనిరి. వేదములు 'శివుడు పరతత్త్వము గాని మీరిరువురును గారు' అని స్థిరపఱచినవి.

దానికి బ్రహ్మ యంగీకరింపక 'కాంతాలోలుడై కాటియందు సంచరించు కాలగళుడెక్కడ? అవ్యయ తత్త్వమెక్కడ? పరమాత్మ భావమాతనికెట్లు సిద్ధించును' అని నిరాకరించెను.

అపుడు ప్రణవమూర్తి మంతమై 'శివుడు స్వయంభువుడు. జ్యోతిస్స్వరూపుడు. పరతత్త్వము. పార్వతి యానంద శక్తి స్వరూపిణి. వారిరువురికిని భేదములేదు' అని దృఢముగా బలికెను. ఎవరెన్ని చెప్పినను బ్రహ్మదేవుని యజ్ఞాన తిమిరము తొలగనేలేదు.

ఇంతలోనొక యఖండమగు తేజము వారియెదుట నుద్భవించెను. దాని మధ్యము నుండి కటిభాగమున గజ చర్మము ధరించి, వక్షస్థలమందు సర్పరాజు ముత్యముల హారమువలె బ్రేలుచుండ త్రిశూలమును బట్టుకొని, జటాజూటమున బాలచంద్ర రేఖ ప్రకాశింప, జేతియందలి ఢక్కాధ్వని పిడుగుల సవ్వడిని గలిగించుచుండ, నీశ్వరు డావిర్భవించెను. ఇట్లు ప్రభవించిన యీశ్వరుని గాంచియు బ్రహ్మ యహంకారమును విడువక తన పంచమ శిరస్సుతో నీశ్వరు నుద్దేశించి యిట్లు పలికెను 'ఓయీ నీవు మొదట నాలలాటమున జన్మించుట యందఱకును స్పష్టమే..అపుడు రోదనము చేయుటవలననే గదా నీకు రుద్రుడని పేరు పెట్టితిని. కనుక నీవునాకు పుత్రుడవు. నన్ను శరణమునొంది బ్రతుకుము."

బ్రహ్మదేవుని గర్వపు వచనములకు శివుడు రోషము వహించి విజృంభింప, బది దిక్కులకును వ్యాపించు ధ్వని గలుగునట్లు ఢక్క వాయించుచు గంఠమునందలి నీలకాంతి చీకటులను గలిగింప, ఫాలాగ్ని జ్వాలలచే సముద్రము లింకు చుండ, నిక్క పొడుచుకొనిన జటలతాకుడుచే బ్రహ్మాండము చిల్లులు పడుచుండ, భైరవాకారము భైరవు డావిర్భవించెను.

అతడు శివుని యాజ్ఞవడసి బ్రహ్మదేవుని సమీపించి శివుని దూషించిన పంచమ వదనమును గోటితో సులభముగా గిల్లివేసెను. అది వచ్చి భైరవుని శివస్తోత్రములతో స్తుతించెను. బ్రహ్మయు నంతటితో నహంకారము విడిచి శత రుద్రీయమును జపించి యారాధించెను. శరణాగత వత్సలుండగు పరమేశ్వరుడు వారిని గురుణించి, తన యవతార స్వరూపుడగు భైరవునిజూచి 'ఓయి ? వీరిని మన్నింపుము. నీవు బ్రహ్మ కపాలమును ధరించి, లోకాచారమును బ్రకటించుటకై బ్రహ్మహత్య నిన్ను వెంబడింప భిక్షాటనమును భుజించుచు గాపాలిక వ్రతముతో లోకములందు సంచరింపుము. అని భీకర స్వరూపయగు బ్రహ్మ హత్యను సృజించి, కాశీయందుదప్ప నన్నిచోటులను నీవు సంచరింప గలవు. నీవీతని వెంట నంటి సంచరించరించు చుండుము' అని పలికి యంతర్ధానము నొందెను.

భైరవు డీశ్వరోక్త ప్రకారమున సకల జగత్తునందును సంచరించుచు, నొక్కనాడు వైకుంఠమునకేగి విష్ణుదేవుని మందిరమునకు జనెను. అతనిరాక విని విష్ణువెదురుగావచ్చి నమస్కరించి, చేతులు జోడించి, సంస్తుతించి, లక్ష్మికాతని మహత్త్వమును దెలియ బఱచి యతని వలననే భిక్షాటన వృత్తాంతమును దెలిసికొని యాశ్చర్యపడి భిక్షనొసగుమని లక్ష్మికి సంజ్ఞచేసెను. సౌందర్యాధిదేవత యనదగిన యాపె యంతఃపురమునకుబోయి యమృతాన్నమును గొని వచ్చి నవరత్నమయమగు గరిటెతో మనోరథ వతియను భిక్షమునొసగెను.

భైరవు డామె భక్తికి సంతోషించి కోరినవరములిచ్చి యెప్పటివలె బ్రహ్మహత్యతో గూడి సంచరించుచు నొక్కదినమున గాశీ నగరమునకు వచ్చి విశ్వేశ్వరుని మందిరమున బ్రవేశించెను. బ్రహ్మహత్య యతనితో లోనికి బ్రవేశింపజాలక హాహాకారములు చేయుచు బాతాళలోకమున బడిపోయెను. భైరవుని హస్తముననున్న బ్రహ్మకపాలమును నూడి భూమిపై పడిపోయెను.

అది మొదలుకొని యావటుకనాథుడు సంతోషముతో నానందవనమున నివసించెను. కపాలము పడిన చోటొక తీర్థమై తన్ను భజించువారికి బాపములు తొలగించి పుణ్యము లొసగు చుండెను.

భైరవదేవుని మహిమ నిరుపమానము. ఇతడు తానే యధికుడనని గర్వించిన బ్రహ్మ యంతటివానిని శిరచ్ఛేద మొనరించెను. బ్రహ్మహత్య స్వరూపము ధరించి కూడవచ్చుచుండ సకల లోకములును సంచరించెను. వైకుంఠమున లక్ష్మీనారాయణులచే గౌరవింపబడి వారొసగిన యమృత భిక్ష నానందముతో నారగించెను. చేతి బ్రహ్మకపాలమును గాశి కవ్వల బడవేసెను. విశ్వనాథునిచే బురమున దలారి యధికారమును బడసెను. పుత్తి పడినచోటనే కాపురము చేసెను. కాశికి సంరక్షకుడాతడే. ఇతనికి బాప భక్షకుండనియు, నామర్దకుండనియు, గాలనాథ కుండనియు, భైరవుండనియు నామాంతరములు గలవు. ఇతడు తన్ను సేవించు వారల కాఱు మాసముల సిద్ధి నొసగును". ఇంక హరికేశ చరిత్రము చూతము.

గంధమాదన పర్వతమున రత్నభద్రుడను యక్షునకు బూర్ణభద్రుడను కుమారుడుండెను. అతనికి గనకమండనయను పత్నియందు హరికేశుడను కుమారుడు జన్మించి పెద్దవాడై కాశికిబోయి యచట దపము-రంభించెను. చాల కాలము కూర్చుండి కదలకుండుటచే నతని శరీరమునిండ బుట్టలుపోసెను. ఒకప్పుడు పార్వతీ పరమేశ్వరు లచటికివచ్చి ప్రసన్నులై యతనికి గోరిన వరములనిచ్చి కరుణించిరి. హరికేశుడు భగవదనుగ్రహము వలన గాశియందు దండనాయక పదవినిబొంది, వెండికట్లదండమును జేతబూని, కాశీగోపుర ప్రాకారప్రాంత దేశమున నివసించుచు, జటలు, భస్మము, రుద్రాక్షలు ధరించి సత్త్వవర్తకులకు సౌమ్యాకారముతోను, బాపాత్ములకు వికృతాకారముతోను గన్పట్టుచు, గంభీరా కారముతో బ్రమథగణముల కధినాయకుండై కాశీపుర పాలనమును జేయుచుండును. ఇది హరికేశుని వృత్తాంతము. కాలభైరవ చరిత్రతో అతడు కాశీలో ఎట్లు స్థిరపడినదియు, అతని మహత్త్వమును జెప్పబడినది.

ఇంక కాశీ ఖండములో కళావత్యుపాఖ్యానము కూడ విశ్వేశ్వరుని (శివుని) మహిమను, లింగమహిమను తెలుపునదియే. కాశీనగరమున హరిస్వామి యను బ్రాహ్మణుడుండెను. అతనికి సౌందర్యవతి యగు సుశీల యనుపేరుగల

కుమార్తె కలదు. ఆమె భక్తితాత్పర్యములతో నుదయమునసనేలేచి జ్ఞానవాపి యందు స్నానముచేసి చెలులతోబోయి విశ్వనాధుని బూజించు చుండునది. నిత్యమును విశ్వేశ్వరుని కళ్యాణ వేదియందు మ్రుగ్గులు పెట్టుచుండును. జ్ఞానవాపి యందలి జలమును సేవించుటవలన నామెగర్భమున మూడు లింగము లేర్పడెను.

సుశీల సౌందర్యము నిరుపమానమై లోకానందకరముగ నుండ విద్యాధరుం డొక్కడా పెరూపలావణ్యములనుజూచి మోహించి,యొకనా డర్ధరాత్రివేళ నామెయింటికి బోయి, బయట వెన్నెలలో బరుండి నిద్రించిన యామెను నిద్రా భంగము కాకుండ మిగుల మృదువులగు తన హస్తములతోనెత్తి యాకాశ మార్గమున మలయపర్వతమునకు దీసికొని పోయెను.

అచట విద్యున్మాలియను రాక్షసుడొకడుండి, యాసుందరాంగిని జూచి మదన పరవశుండై విద్యాధరుని చేతినుండి యామెను లాగుకొనబోయెను. అతడు దూరముగాబోయి యచట నాబ్రాహ్మణ కుమారికను బరుండబెట్టి వడిగా బోయి రాక్షసునెదురుకొనెను. పూర్వము తిలోత్తమ కొఱకు బోరాటము సల్పిన సుందోప సుందులవలె నారాక్షస విద్యాధరు లిరువురును ఘోరముగా బోరు చుండిరి. ఆ సందడిలో సుశీలకు మెలకువ వచ్చి భయముతో నాయుద్ధమును జూచుచుండెను. రాక్షస విద్యాధరు లిరువురు నట్లు పోరి, పోరి, తుద కిరువురును బరస్పర ముష్టి ప్రహారముల నొక్క కాలముననే క్రిందబడి మృతినొందిరి. విద్యాధరుడు మాత్రము ప్రాణము విడుచుచు సుశీలనుజూచి 'అయ్యో నిన్ను దెచ్చి' అనిమాత్రము పలికి యిక నోట మాటరాక మరణించెను.

సుశీల విచారముతో 'అకటా' నన్నీతడు తలి దండ్రుల నుండి విడదీసి యిచటికి దెచ్చెనా ? నన్ను స్పృశించెను. గనుక నితడే నాకు భర్త. నే నితనికి బత్నిని. పతివ్రతా మార్గమున నేనితనితో సహగమనము చేయవలయును' అని నిశ్చయించి యాచుట్టు ప్రక్కలనుండు మంచి గంధపు గట్టెల నేరితెచ్చి చితి పేర్చి యగ్ని నంటించి పుష్పహారములు ధరించి, కాశీ విశ్వనాధుని, స్మరించి నమస్కరించి, మాధవుని, భైరవుని, దండపాణిని, ఢుండి గణపతిని, జగంగను దలంచి మ్రొక్కి, ముందు జన్మమునవచ్చి వారలను సేవింతెదనని పలికి, జననీ జనకులను దలంచుకొని, తమకట్టి యవస్థ సంభవించినందులకు విచారించి

తల్లి దండ్రులకు మేలు పదఘ లొసగుమని విశ్వనాదుని ప్రార్థించి, తాను దిన దినమును జ్ఞానవాపిక యందు స్నానము చేసిన ఫలము, విశ్వనాథుని ముంగిట ముగ్గులు పెట్టుట వలన గలిగిన పుణ్యము, మిగిలిన దేవతల నందఱను భక్తితో నారాధించుట వలన గలిగిన సుకృతము గలిసి మరుచటి జన్మమున నావిద్యాధరునే తనకు భర్తనుగాజేయు గాక! యని ప్రార్థించి యతనిని జితిపై నుంచి తాను గూడ దాని నధిరోహించి యతనితో గూడి దహింపబడెను.

మూడు లింగములను గర్భమున ధరించిన పావన స్వరూప యగు నామెను స్పృశించుట వలన విద్యాధరుడును రాక్షసుడును స్వర్గ పదవి నొందిరి. ఆమె కోరినట్లు విద్యాధరుడు కొంత కాలమునకు భూలోకమున మలయ కేతు వను ప్రభువుగా జన్మించెను. అగ్ని ప్రవేశ సమయమున గోరుకొనినది గనుక సుశీల కళావతి యను పేర జన్మించి యతనికి బత్ని యయ్యెను.

ఆమె పూర్వ జన్మ వాసనచే శివ భక్తి పరాయణయైన భస్మ లేపనము చేసి రుద్రాక్ష మాలికలు ధరించి శివ ధ్యానపరాయణయై యుండెను. క్రమ మున నామెకు ముగ్గురు కుమారు లుదయించిరి.

ఒకనాడొక చిత్రకారుడు కాశీనగరమును బటమునందు జిత్రించి తెచ్చి కళావతీ సహితుడై యున్న మలయకేతు మహారాజుకు జూపెను. కళావతి యాపటము చూచి పూర్వ జన్మవాసనా బలమున శరీరము మఱచి సమాధి యందున్న దానివలె గన్నులు మూసి కొంత సేపు భగవంతుని ధ్యానించి మరల, గన్నులు తెఱచి యాచిత్ర పటమున నుండు నన్ని విశేషములును బూస గ్రుచ్చినట్లు వ్రేలితో జూపుచు భర్తకు వర్ణించి చెప్పెను.

ఆమె, గంగ, మణికర్ణిక కాశి, బ్రహ్మకపాలము పడినచోటు భైరవ దేవుడు, పంచ తీర్థములు, ఢుంఠి గణపతి మున్నగు వారి నందఱను వేఱు వేఱుగా వర్ణించి క్రమముగా జ్ఞాన వాపిని జూపి యంతలో లోపలి నుండి యుబికి వచ్చు భావపరంపరల నాపలేక మూర్ఛిల్లెను. ప్రభు వందుల కాశ్చర్య పడి శీతలోపచారములు చేయుచుండెను. పూర్వ జ్ఞానము గల వాడగుటచే నత డామెకు జ్ఞాన వాపి యనిన నామెకమిత ప్రీతి యను విషయము జ్ఞప్తికి దెచ్చు కొని, కాశీ పటము నామె శరీరమున విప్పి చెవిలో 'జ్ఞాన వాపి, జ్ఞానోదయము

శివ తీర్థము' అని ముమ్మాఱు గట్టిగా నుచ్చరించెను. ఆ శబ్దములను వినినంత మాత్రమున నామెకు దెలివి వచ్చెను. మలయ కేతుపు కళావతి ప్రోత్సాహముచే రాజ్యభారము పుత్రుల యందుంచి వారణాసికి బోయి, జ్ఞాన వాపి తీర్థమున దపముచేసి ముక్తుడయ్యెను. ఇది శివ తీర్థ మాహాత్మ్యము. ఇదియే కళావత్యు పాఖ్యానము.

షష్ఠా శ్వాసము సాంబాదిత్య మాహాత్మ్యముతో ప్రారంభింపబడుచున్నది. సప్తమా శ్వాసము ధర్మరాజేశ్వర లింగ మాహాత్మ్యముతో ప్రారంభ మగు చున్నది. విశ్వభుజాఖ్యానము, ధర్మేశ మాహాత్మ్యము, వీరేశ్వరాఖ్యానము, విశ్వకర్మేశ్వర లింగ ప్రాదుర్భావము, వ్యాసేశ్వర మాహాత్మ్యము, కాశీ పట్టణ మహిమ, తదుపరి వేద వ్యాసుడు కాశిపై గోపించుట యను నంశములన్నియు నీ ఆశ్వాసమున చెప్పబడినవి.

వేదవ్యాసుడు శిష్య సమేతముగా మోక్షార్థియై కాశీక్షేత్రమున నివసించి యుండగా నాతని మనో నిశ్చలతను బరీక్షింపదలచి యొకనాడు విశ్వనాథుడు పార్వతిని జూచి 'సాతీ! బాదరాయణుని భక్తి ఎట్టిదో చూతము. ఈతనికి భిక్ష లభింపకుండ జేయవలసినద'ని చెప్పగా నామె సరియనెను.

వ్యాసుడు 'భవతీ భిక్షాందేహి'యని పలుకుచు నింటింటికి భిక్షకు బోగా ఆనాడు ఎవరును పట్టెడన్నమైన బెట్టరైరి. వండుచున్నామనియు, తిరిగి రమ్మ నియు, ఇంటిలో దేవకార్యమనియు, బలువురు బలువిధముల చెప్పసాగిరి.

శిష్యులకడ కేతెంచి వ్యాసుడు ఇట్లనెను. 'అయ్యో చతుర్విధ పురుషా ర్థములకును నునికి పట్టగు నీ మహానగరమున నేడు భిక్ష లభింపకుండుట కేదేని కారణము తప్పక యుండవలయును. మీరు బయలుదేఱి సరిగా బరిశీలించి తత్కారణము తెలిసికొనిరండు' అని శిష్యులను నలుదెసలకు బంపెను. వారు పోయివచ్చి వ్యాసున కిట్లు విన్నవించిరి.

"గురూత్తమా ? ఈ నగరమున మాకెట్టి యపకరమును గనుపట్టలేదు. తమవంటి మహానుభావు లనేకులుండ లోపములెట్లు సంభవించును? విశ్వేశ్వరుడు కైలాసమును విడిచి యే నగరమున నానందముగ నివసించెనో, యే పట్టణ

రాజమునకు సమీపమున భాగీరథి ముత్యముల హారమువలె ప్రవహించు చున్నదో, యెచటనన్నపూర్ణ యాకలి గొన్నవారి కమృతాన్నము నొసగు చుండునో, యెందు డుంఠివినాయకుడు యువరాజు పట్టమును ధరించి పరిపాల నము చేయుచున్నాడో, మీయంతంత మహర్షు లెచట నివసించి యున్నారో, యట్టి ఈ మహానగరమున భిక్ష దొరక కుండుట యాశ్చర్యకరముగనే యున్నది. ఈ నగరమున బార్వతీదేవి యన్నపూర్ణ విశాలాక్షి యనెడు నామ ములను ధరించి నిత్యమును మధ్యాహ్న కాలమున నమృతపాయసాన్నము పెట్టుచుండును. మనము పూర్వ జన్మము నందెవ్వరినో లేకుండ జేసి యా పలము నేడనుభవించు చున్నాము. గాని వేఱు గాదు. అంత మాత్రమున నీ మహానగరమును నిందింపరాదు. ఇచట నివసించు నందఱును బరమేశ్వర సమానులే. సత్య లోకము దీనికంటె దక్కువ. ఇదియు విష్ణులోకమును సమా నములు. ఇంద్రాది లోకములు దీనికి సేవకోటిలో జేరినవి.

ఈ విధముగా కాశీ మాహాత్మ్యమును శిష్యులు చెప్పగా వ్యాసుడు మల మల మాడుచు గోపము పట్టజాలక భిక్షా పాత్రము నడు వీధియందు నేలకు వైచి పగులగొట్టి 'ఈ కాశీ పట్టణపు బ్రాహ్మణులకు ధన మదము, వేద విద్యామదము, మోక్ష లక్ష్మీమదము, ముదిరినవి. కనుక ఇచటి వారికి మూడు తరముల వరకు ధనము, వేద విద్య, మోక్షము లభింపకుండు గాక!' యని శపింప బూనెను. అంతనొక విప్రభవనము ముంగిట బార్వతి ప్రాకృత రూప మున నిలిచి వ్యాసునితో నిట్లనెను.

శా॥ ఆ కతంబుగ వేడ్కతో నిపుడు భిక్షాన్నంబు భక్షింపగా
లేకున్న గడునంగ లార్చెదవు మేలే। లెస్స। శాంతుండవే।
నీకంటె న్మతిహీనులే కటకటా। నీవార ముష్టింపచుల్ శాకా
హారులు కందభోజులు శిలోంఛ ప్రక్రముల్ దాపసుల్

(స.ఆ 163 కా.ఖం)

తే॥ ఓ మునీశ్వర! వినవయ్య యున్నయూరు
గన్న తల్లియు నొక్క రూపన్న రీతి?

యటు విశేషించి శివుని యర్థాంగలక్ష్మి
కాశి యిప్పిటి మీద నాగ్రహము దగునే?

(స.ఆ (164) కా.ఖం)

ఎండి పోవుచున్న చేనికి వర్షాధారవలె నామె పిలుపు వ్యాసునకు బునర్జీవనము గలిగింప నతడు మెల్లగా నామెను సమీపించెను. ఆమె యతనిని జూచి 'సంయమి వర్యా? కంఠపూర్తిగా భుజించుటకు మధుకరాన్నము దొరుక లేదని యిట్లు విచారించుట నీవంటి వానికి దగునా. బాగు! బాగు! మహా శాంతుడవే. పిడికెడేసి నీ వార ధాన్యమును వండుకొని తినువారును, గంద మూల ఫలహారులును నగు తాపసవర్యులందరును నీకంటె మతిహీనులా? ఉన్న యూరును గన్న తల్లియు నొకటి"యను విషయము నెఱిగి యుండ లేదా? అందును విశ్వనాదుని కర్థాంగలక్ష్మియగు కాశిపయినా నీ కోపము? అని వ్యాసుని భోజనమున కాహ్వానించెను.

"భుజించి కూర్చున్న పిదప నీతోజెప్పవలసిన మాటలు కొన్ని గలవు. నాభర్త వైశ్వదేవాదులన్నియు దీర్చుకొని యతిథికై యెదురుచూచు చున్నారు. ఎట్టి యిబ్బందిగల సమయముననైనను నతిథిపంక్తిని లేకుండా భుజింపరు. వేగముగా గంగకు బోయి దయచేయుము. చాల ప్రొద్దుపోయినది. నాపతి యాకటికోర్వజాలరు" అని పలికెను.

ఆ ముత్తైదువమాట నాముని సత్తమునికి గర్ధరసాయనములయ్యెను. అతడు మహాసంతోషముతో నామెకిట్లనెను. "పుణ్యాంగనామణీ! నీ వెవ్వరు? ఇంతకాలమునుండి భిక్షకు వచ్చుచుంటినిగాని నిన్నెపుడును జూడలేదు. నీ దర్శనమాత్రముననే యఖిలాంగములకును దృప్తిగలిగెను. నను రక్షించు టకు వచ్చిన నా భాగ్యదేవతవు. నీవు మోక్షలక్ష్మివా? కామినీరూపమును ధరించిన కాశీనగరివా? లేక యాకొన్నవారి కమృత భిక్షయిచ్చిన రక్షించు విశాలాక్షివా? తల్లీ! నీయాజ్ఞప్రకారము వర్తింతును. బ్రాహ్మణుడనగుటచే జాపల్యము నాకు స్వాభావికము. నాయపరాధము క్షమింపుము. కరుణతో నీపేరుతెల్పి నన్ను ధన్యుని గావింపుము"

"మహర్షి సత్తమా ? భోజనమునకు వేళతప్పును. భోజనోత్తరమందు నావృత్తాంతము జెప్పెద" నని యాముదిత పలికెను. అంతవ్యాసుడు "తల్లీ ? ఒక్క విన్నపము. క్షమించి యాకర్ణింపుము. నాశిష్యులు పదివేలమంది గలరు. అందఱును దలకొక వీధికినిబోవ నేనొకవీధికిబోయి యేదిండ్లదగ్గర మాత్రము భిక్ష తీసికొని వత్తును. నాశిష్యులందఱును మహామహులు, పైలజైమిని ప్రముఖులు వేదపాఠము చేయుచు బట్టణమువెంట సంచరింతురు. అందఱును దెచ్చిన భిక్షాన్నమును మఠమునందు రాశిగాబోసి శాకములు సూపము మున్నగునవి వేఱు వేఱుగా దీసివేయుదుము. అన్ని పదార్థములలోను సగము అతిథ్యభ్యాగతుల కొఱకు వేఱుగా బాత్రములయందుంచి దూరముగా నుంచెదము. మిగిలిన యన్నమును నిర్మలమగు భాగీరథీ సలిలములచేగడిగి పెద్దపిన్నల క్రమమున నందఱమును వరుసగా గూర్చుండి పడ్డించుకొందుము. ముందుగా 'అమృతాయతామ్' అని నేను ప్రాణాహుతులు చేసిన పిదప శిష్యులందఱును భుజింప నారంభింతురు. చాలాకాలము నుండి యీవ్రతమిట్లు సాగుచున్నది. కాని తల్లీ ఏమి మహత్త్వమో తెలియదు. నిన్నను నేడును నొక్కముద్దయైనను మాకు లభింపలేదు. నాశిష్యులందఱును గూడుదొరుకక చేయునదిలేక యుస్సురని యుపవాసముండగా నేనొక్కడనే మీయింటికివచ్చి భుజించుటకు నాకు మన సొప్పకున్నది. రమారమి సూర్యాస్తమయము కావచ్చినది. మావ్రతప్రకారము వారలను విడిచి భుజించుటకు వీలులేదు. కనుక జననీ నేడును నిన్నటి దినము వలెనే యుపవాసముందుము. నీయాజ్ఞప్రకారము రాజాలనందుకు క్షమింపుము".

అందులకు బుణ్యాంగన నవ్వుచు నిట్లు పలికెను "మునివరా? విచారింపకుము. నీశిష్యులనందఱనుగూడ దీసికొని త్వరలోరమ్ము. విశ్వనాథుని కరుణ వలన నెందఱువచ్చినను మాయింట భోజనము దొరకును".

వేదవ్యాసున కపారమగు సంతోషము గలిగెను. 'మహాప్రసాద' మని యతడు వెంటనే బయలుదేరి శిష్యులనందఱను గూర్చుకొని గంగకుబోయి యాచనముచేసి యాపుణ్యవతి గృహమునకు బోయెను. ఆ రమణీమణి భోజనశాలయందు వ్యాసాదులందఱకును బంగారపు టరటియాకుల యందు సమస్త పదార్థములును, బంచభక్ష్యములతో నుంచెను. పిదప నెఱ్ఱని జటాజూటముతో, చెవులందు బంగరు రుద్రాక్ష కుండలములతో, బొజ్జపై నీరు కావివస్త్రము

ధరించి, యాపాదమస్తకము భస్మము పూసికొని, పురుషస్వరూపము నొందిన శాంతియో యన బంక్తి మధ్యమునకువచ్చి గృహపతి తపస్వులకు నన్నము ధారపోసెను.

మునులందఱును దృప్తిగా నారగించిరి. గృహ భర్తయు వారి పంక్తిని గూర్చిండి భుజించెను. గృహిణి భర్త భుజించుచున్నంత సేపును నతనికి వీవనతో వీచుచుండెను.

భోజనానంతరమున గృహపతి గృహిణితో నాస్థాన మండపమున సుఖముగా గూర్చుండి, వ్యాస మహర్షిని రప్పించి కూర్చుండ నియోగించి గృహిణికి గనుసన్న చేయ నామె మునితో నిట్లు పలికెను.

'ముని వర్యా? కడుపు నిండ సంతృప్తిగా భుజించితివా! శిష్యులు భుజించిరా? వేళకు రాజాలక మిగిలి పోయిన వారెవ్వరును లేరుగదః''

"తల్లీ! అన్ని పదార్థములును మిగుల రసవంతముగా నున్నవి. శిష్య సమేతముగా సంతృప్తిగా భుజించితిని. ఎవ్వరును మిగిలిపోలేదు. పాత్రముల యందిట్టి వస్తువులు తమంత దామే సిద్ధించుట మాకాశ్చర్య జనకమైనది. మీ ప్రభావము నిరుపమానము. మీ యిరువురును బార్వతీ పరమేశ్వరులే యని తలంచుచున్నాను" అని వ్యాసుడు సంతోషముగా బలికెను. పిదప భవాని యతడు కాశీనగరమును శపింప బూని చేసిన యపరాధమునకు దగిన శిక్ష విధింపదలచి యిట్లు పలికెను.

క. మేలగు కాశీనగరం
బీలాగున భక్తి గలిగెనే భోజనమే
వేళంబుట్టదు? పుట్టని
వేళం గినియంగదగునె వేద వ్యాసా?

(కా.ఖం. 193 స.ఆ.)

ఉ. ఎట్టు పురాణముల్పదియు నెన్మిమిది జెప్పితి? వెట్లు వేదముల్
గట్టితి వేర్పఱించి? నుడికారము దప్పక యుండ భారతం
బెట్టు రచించి? తీవు ఋషి వెట్టయి? తొక్కదినంబు మాత్రల్
బొట్టకు లేక తిట్టెదవు పుణ్య గుణంబుల రాశి గాశికన్

(194)

క. క్రోధంబు ఫలమె నిర్మల
బోధనకుః దీర్థము వాసమున కర్థంబే
క్రోధముః వారణసిపై
గ్రోధించిన విశ్వభర్త గ్రోధింపదొకో (195)

పార్వతి ఈ విధముగా పలికి పరమేశ్వరుని మొగము చూచెను. అమహాత్ముడు క్రోధముతో

తే॥ కాశి నుండగ నర్హుండుగాడువీడు
వేదలి పొమ్మను మాటలు వేయి నేల ?
క్రోధనుం డెట్లు ? కైవల్యకులగృహంబు
నానివాసంబు కాశి కానగరమెట్లు ? (197)

ఆ మాట వినునప్పటికి వ్యాసుని కఖండమగు భయము గలిగెను. అతడు గడ గడ వడకుచు నా దంపతులకు నమస్కారము చేసి ! 'యెఱుగక చేసిన నాయపరాధమును క్షమింప వేడెదను' అని ప్రార్థించెను. అంత మాత్రమున విశ్వనాదుని కోపము తగ్గలేదు. తనకు ప్రియతమ మగు కాశిపై నాతడు చూపిన కోపమునకు దగిన ప్రతిక్రియ చేసి తీరవలయునని యామహ నీయు డూహించి "ఓయీః నీవు పూర్వమువలె నిక గాశీనగరమున నుండుటకు వీలు లేదు. ఇచట కైదు క్రోశముల దూరమందు నా యాలయపు బైడికుండలును బ్రాకారములును గను పట్టుచోటున నుండి పుణ్యకాలములందు భూత తిథిని మాత్రమే యిచటికి వచ్చుచుండవలయును. ఇతర సమయముల యందిచట గాలు పెట్టరాదు. ఇక నెన్నడును దీర్థములను నిందింపకుము. బుద్ధిగలిగి బ్రదుకుము పొమ్ము' అని పలికి పార్వతీ దేవితో గూడ నంతర్ధానము నొందెను. విశ్వనాథు నాజ్ఞ ప్రకారము వ్యాసుడును దూరముగా బోయి యచట నివాస మేర్పఱచుకొనెను. ఇది వ్యాసుడు కాశిని బాసిన వృత్తాంతము.

ఇక కాశీ ఖండములో క్షేత్ర తీర్థకదంబ వర్ణనము, విశ్వేశ్వర లింగ మహత్మ్యము, దేవ యాత్రా విధానము చెప్పబడినవి. ఇంతటితో ఈ గ్రంథము సమాప్తము. వేద వ్యాసుని కథ వలన క్షేత్రమును నిందించుట వలన కలిగెడి పాపము తెలియుచున్నది. వ్యాసుడు దాని పర్యవసాన మనుభవించినాడు.

ఇట్లు కాశీ ఖండములో క్షేత్ర మహిమ చెప్పుట ప్రధానాంశమైనను కొన్ని కథలు సందర్భోచితముగా వచ్చినవి. ఇచ్చట ఒక విశేషమును గమనించవలెను. శ్రీనాథుడు ఈ కావ్యములో కాశీ మహిమను చెప్పినను, గుణనిధి కథ చెప్పినను, వ్యాసుడు కాశి నగరమును వదలిన వృత్తాంతము వర్ణించినను వింధ్యపర్వత మాత్సర్యమును కథనము చేసినను ఏదో విధముగా మహేశ్వరుని ఆధిక్యమును వర్ణించుటయే దీనిలోని ప్రధానాంశ మగుచున్నది. ఇది కాక కాశీ నగర విభిన్న ప్రదేశములలోని తీర్థ ప్రసంగము కూడ శివుని ఆధిక్యమునే వక్కాణించుచున్నది. ఈ శివ ప్రశంస పురాణములలో, వేదములలో వర్ణింపబడిన మహేశ్వరుని పోలినట్టిది, అనగా ఆగమ విధానమే. శ్రీనాథుడు ఈ కావ్యము నందెచ్చటను వీరశైవ సిద్ధాంతమును స్పృశించిన వాడు కాడు. అనగా ఈతనికి ఆగమ శైవము పైననే శ్రద్ధ గల దన్నమాట. ఇట్లు చూడగా ఈ మహాకవి భీమేశ్వర పురాణము నందు వలెనే కాశీ ఖండమునందును ఆగమ శైవ ప్రాధాన్యమునే వర్ణించెను.

## హరవిలాసము - శైవ నిరతి

శ్రీనాథ మహాకవి తన కావ్యములను గురించి ప్రస్తావించిన "చిన్నారి పొన్నారి" అను పద్యములో పేర్కొనక పోయినను హరవిలాసము అను కావ్యమును చక్కగా కూర్చి తెలుగు సాహితీ బంధువులకు అందించెను. శ్రీనాథుని కావ్యములన్నియు ఏదో విధముగా సంస్కృత మూలమును కలిగినట్టివి. కొన్నింటి నాతడు అనుసరించెను. మఱికొన్నింటిని అనువదించెను. కాని 'హరవిలాసము' అను కావ్యము సంస్కృతమునందెచ్చటను కన్పించదు. దీనిని ఒక నూతన పద్ధతిలో ఇదివరకే లోకమునందున్న కథా విశేషములను విశేషమైన పద్ధతిలో కూర్చి వానికి "హరవిలాసము" అని పేరు పెట్టెను. హరుడనగా శివుడు. అతని యొక్క విలాసము హరవిలాసము. దీనిలో చిఱుతొండ నంబి కథ అర్జునుని తపస్సు, శివుని సాక్షాత్కారము అనువృత్తాంతము పార్వతీ దేవి తపము చేసి మహేశ్వరుని భర్తగా పొందిన కథ, క్షీరసాగర మథనము, హాలాహల భక్షణము అనెడు కథ ఇంక మరికొన్ని వృత్తాంతములు చెప్పబడినవి.

ఇవన్నియు ప్రత్యక్షముగనో, పరోక్షముగనో అతని ఆరాధ్య దైవమగు మహేశ్వరునకు సంబంధించినవే.

నిరంజనుడు, కపింజలుడు, దుర్వాస మహాముని శిష్యులు దుర్వాస మహాముని సేవ చేయుచూ ఇరువురి బదరి కాశ్రమములో నివసించేవారట. ఆ ఆశ్రమములో ఎండవేడిమి భరింప జాలక కొన్ని పక్షులు తమ కులాయాల్లో పండుకొని నిద్రించగా కొన్ని మేతకై బయటకువెడలినవి. అట్టి సమయములో ఒక వింత సంగతి చెప్పుటకు నిరంజనుని కొఱకు కపింజలుడు వెతకసాగెను. వెతికి వెతికి చివరకు గురువుగారి గుడ్డల నుతుకుకొని వచ్చుటకు నదికిపోయి ఉండుననుకొని కపింజలుడు సమీపమున ప్రవహించుచున్న భవానీ నదివైపు నడిచి వెళ్లెను. ఆతురతగా మిత్రుని వెదకుచు ఏదో చెప్పవలెనన్న కుతూహలముతో కేకలు పెట్టసాగెను. నిరంజనుడు భయపడి గురువుగారేమైన అనిరేమో అని భయ విస్మయములతో మిత్రుని తదేక దృష్టితో చూచెను. దుర్వాసునికి ఏ మాత్రము పొరపాటు జరిగినను కోపము వచ్చును. ఆ రోజు గురువుగారి కోపమునకు గురైనవారు తుంబురుడనే శివభటుడు. అతడు భార్యా సమేతుడై విమాన మెక్కి హేమ కూటము నుండి శివుని సేవించుటకు గోకర్ణమునకు వెళ్లుచూ ఆకాశ మార్గములో పయనించుచుండెను. ఆ సమయములో దుర్వాసుడు లేడి పిల్లలకు పరమాన్నము పెట్టుచుండెనట. అది చూచి తుంబురుడు పరమానందంబంది ఆశ్చర్యముతో గట్టిగా చిటిక వేసెను. వెంటనే జింక పిల్లలు బెదరి పారి పోయెను. గురువుగారు ఆకాశమువైపు జూచి "ఓరి, దుర్మార్గుడా? నా జింక పిల్లలు సంతోషముగా క్షీరాన్న మారగించుచుండగా చిటిక వేసి వాటి తిండికి అభ్యంతరము కల్పించితివి. నీ ఈ అపరాధమును నేను సహింపజాలను" అని "నీ గర్వమణిగే విధముగా భూమిలో నీవుమనుష్యుడవై పుట్టు" మని శపించెను. ఈ సంగతి ప్రమదుడు వినెను. శివసాయుజ్యములో అనుక్షణము దేవదేవుని దర్శించుచు ప్రార్థించుచూ అతని లీలలను కన్నారాగాంచి పరమానందభరితుడగు తానెక్కడ ? భూమిపై మనుష్యుడై పుట్టుటెక్కడ ? అని ఆలోచించుచూ భార్యతో గూడి విమానమును దింపి గజగజలాడుచూ ముని పాదములపై పడి "హేభగవాన్, నా అపరాధము క్షమించు. మీ రన్న విధముగా నేను గర్విష్ఠినికాను. మీ లేడి పిల్లలను బెదరించు ఉద్దేశ్యము నాకు లేదు. మహాత్ములైన మీచేతిమీదుగా పాయసం తినగల్గిన పుణ్యము వాటికి కలిగినందులకు

ఆశ్చర్యము ఆనందము కలిగి మైమరచి చిటిక వేసితిని. దుష్టమైన తలంపు లేని నాచర్యను మన్నించి నన్ను క్షమించ"మని దీనముగా ప్రతిమాలెను.

ఇప్పుడు దుర్వాసుడేమి చేయజాలనని శాపమునకు తిరుగు లేదని తత్ఫలితమునను భవించ వలసినదేనని బదులు పలికెను. గ్రుడ్డిలో మెల్ల యనునట్లు "భూమి మీద శివభక్తాగ్రేశరుల ఇంట జన్మించి కారణాంతరమున మరల ప్రమధుడవై నీ భార్యతో కూడ కైలాసమున సుఖింతువు" అని దుర్వాసుడు పలికెను. కాని దుర్వాసునకు అతనిపై జాలి కలిగి నీవు కోరినట్లు నీవు మర్త్యుడవై యున్న కాలమున నీ భార్య నాకు కోడలుగా ఇక్కడనే యుండగలదు. భూమిపై ఆమె అంశలో గల స్త్రీ రత్నము నీకు సతియై నీ గృహస్థాశ్రమమును సార్ధక పరచును. నిద్దుర మేల్కొన్నట్లు త్వరితగతి శాప విమోచన మొంది నీ పూర్వ పదవిని పొందగల"వని ఆశీర్వదించెను.

కాంచీపురంబులో దుర్వాసుని శాపాక్షర ఫలితముగా తుంబురుడు ఒక వైశ్యుని ఇంట జన్మించెను. అతని పేరు చిఱుతొండనంబి. అతని భార్య తిరువేంగనాచి. చిరుతొండనంబి వంశమువారు ధనికులు. శివభక్తిపరాయణులు. చిఱుతొండడు పరిశుద్ధమైన మనస్సుతో ప్రాతస్సంగమ, మధ్యాహ్న, పరాహ్ణ సాయంత్రాదులందు నిష్ఠతో భార్యా సమేతుడై శివార్చన చేయువాడు. పంక్తిని ప్రతి దినము వందమంది శివభక్తులు లేనిదే భుజించువాడు కాదట. వారి పూజల ఫలితముగా వారి కొక్క కుమారుడు కలిగెను. ఆ కుమారునికి వారు "సిరియాళుడు" అని నామకరణము చేసిరి. ఆ బిడ్డను సాకుటకు చందనిక అను ఒక దాది కూడ నియమితమైనది. పూర్వజన్మ సంస్కార ఫలితముగా చిఱుతొండనంబి పరమ శివ భక్తుడై సర్వకాల సర్వావస్థలయందు ఆ మహాదేవుడే సర్వమునకు కారణభూతుడని నమ్మి నిష్కామబుద్ధితో పూజాది కృత్యములు చేయు చుండెడివాడు. జంగమప్రభు లెంతమంది యేవేళలో వచ్చి యేది అడిగినను లేదనకుండ ఇత్తునని అతడు ప్రతిని బూనెను. దానినతడు దేవుని మీద ఒట్టుపెట్టుకొని సక్రమముగా జరుపుచుండెను.

ఇట్లుండగా ఒకనాడొక జంగమ శ్రేష్ఠుడా వైశ్యశ్రేష్ఠు నింటికి వచ్చెను. అతని వద్ద శివలింగము కలదు. ఆ శివభక్తుని చూచి పరవశించి చిఱుతొండడు

సాదరముగా ఇంటిలోనికి తోడ్తెచ్చి సుఖాసనముపై కూర్చుండ బెట్టెను. ఆ శివభక్తుడు చిఱుతొండనితో నిట్లనెను. "నీవు శుద్ధ వీరశైవుడవని విని నిన్నొక విషయమడుగ వచ్చినాను" అంత చిఱుతొండడు "మీలాంటి వారు కోరికతో నా యింటికి వచ్చుట మహాభాగ్యము" అనెను. అంత జంగముడు "నేను శివ లింగమున కీదినము ఒక తూమెడు చెఱకు రసముతో అభిషేకము చేయ సంక ల్పించితిని. ఆ రసము నాకెవ్వరు తెచ్చి యియ్యగలరు, నీవంటి వాడు తప్ప ? చేగానుగుతో రసము తీసి యిమ్ము. యా వ్రతము నెరవేర్చుకొందుము" అని కోరెను. జంగమయ్య కోర్కె నెరవేర్చు నిమిత్తమై చిఱుతొండడు ఆతని చేతి భస్మమందుకొని మహా ప్రసాదముగా గ్రహించి వలసినంత దబ్బుమూట కట్టుకొని చెఱకు గడలకు బయలుదేరెను. చెఱకు గడల మోపు కట్టెను ఆ మోపు ఎత్తుకొనుట కతనికి సాధ్యము కాకపోగా, శివుడది గమనించి తన భక్తుని ఆంతరంగిక బాధను కష్టమును గమనించి మనుష్య రూపముతో ఆ దారిని వచ్చెను. నంబి ఆతనిని చూచునరికి ఆ మోపు ఎత్తవలసినదని ఇంటి వద్ద జంగముడు శివార్చనకు కాచుకొని ఉండెనని కోరెను. మోపు ఎత్తి ఆ మానవుడు నంబి కృతజ్ఞతలు తెల్పు లోపలనే అంతర్ధానమందెను.

నంబి త్వరగా ఇల్లు చేరి కోరినంత జంగమునకు చెఱుకు రసము నీయగా అతడు శివలింగమున కభిషేక మొనర్చెను. శివునిచే ఆశీర్వదింప బడెను.

ఇచట చిఱుతొండనంబి తలపై చెఱుకుగడలమోపు నుంచువేళకు సరిగా ఈశ్వరుడు పార్వతీ దేవితోగూడి కైలాసపర్వతమున కల్పవృక్షము క్రీనీడ కూర్చొని అప్సరసల నాట్యము నానందముతో తిలకించు చుండగా ఈశ్వరుని మేను చెమర్చినది. ఆ చెమటచూచిన కాత్యాయిని శివుని మనసు నాట్యముచేయు అప్సరసలలో నొకరిపై లగ్నమయ్యెనని భావించి కోపముతో మధూళికాపరాగ ములు శశాంక శేఖరుని కనులమూడింట చిందునట్లు విసిరివేసినది. శివునకు భార్యసంగతి అర్థమైనది. ఆమెచర్య కాగ్రహముతో విసుగుచెందెను. అతడు తనమేను చెమర్చుటకు గలకారణము ఆమెకు వివరించగా ఆమె శివుని పాద ములు పట్టుకొని "తనయపరాధము మన్నించవలసినదని" ప్రార్థించెను. చిఱు నవ్వు చిందులాడు ముఖముతో శివుడు ఆమె ననునయించి "మదనుని నాకంటి

మంటచే కాల్చిన నామనస్సున కాకా మముదయించుట ? అందును అన్యకాంత యందా ? ఇంతమాత్ర మూహించలేక పోతివి" అని ప్రణయ దృక్కులతో భార్యను విలోకించి ఆమె మనస్సును శాంతపరచెను.

తదుపరి పార్వతీదేవి శివభక్తుడైన చిఱుతొండనంబిని చూచి రావలెనని కుతూహలపడుచున్నట్లు కోరిక వెలిబుచ్చగా శివుడు సరియేనని, "అచట ఒక అద్భుతలీల జరుపవలెను. అందువల్ల చిఱుతొండడు, అతని భార్య శాపవిముక్తులు కావలె"నని బదులు పలికెను. దుర్వాసుడు తుంబురుని శపించిన వృత్తాంతమంతయు శివుడు పార్వతి కెఱింగించెను. తిరిగి తుంబురుని కైలాసమునకు రప్పించుకొనవలెనని శివుడు పార్వతికి చెప్పెను. జరుగబోవు కార్యము చూచెదవు లెమ్మని కాంచీపుర మెప్పు డే రీతిగా వెడలవలెనోకూడ నిర్ణయింతునని పార్వతికి విన్నవించెను. అంత శివుడు దేవేంద్రుని పిలిచి గొప్పగొప్ప మేఘములను కాంచీపురమునకు బంపి దానికి చుట్టూ మూడు యోజనములవరకు ఇరువది యొక్క దినములు అకాలవర్షములు కురిపించునట్లు ఆజ్ఞ ఇమ్మని ఇంద్రు నాదేశించెను? అందువలన తన కొక రహస్య కార్యము కలదని చెప్పెను శివుని ఆజ్ఞ ప్రకారము ఇంద్రుడు మేఘములను భూలోకమున కాంచీపురములో ఇరువది యొక్కదినములు కుంభవృష్టి కురియునట్లు ఆదేశింపగా కాంచీపురములో రేయింబవళ్లు ఇరువదియొక్క దినములు ఎడతెరపిలేక వాన కురియ సాగెను. ఇరువది రెండవదినము తెల్లవారగానే వర్షము ఆగి ప్రశాంతమయ్యెను. వర్షము కురిసిన ఇరువదియొక్క దినములు నిరాశ్రయులైన శివభక్తులగు జంగములకు చిఱుతొండ నంబి ఇల్లొక సత్రమై వెలసినది. ఆలుమగలకు తోడుగా వారి కుమారుడైన సిరియాళుడు అతని దాదియగు చందనిక కూడ అహోరాత్రములు శ్రమనొందక మనఃపూర్వకమగు భక్తి శ్రద్ధలతో అతిథిపూజలు చేసిరి.

వాన వెలసిన రోజున ఆనంద మంది మధ్యాహ్న కాలమున నతడు వీరమాహేశ్వర సమయ సిద్ధాంతము ననుసరించి స్నానముచేసి, దేహము నిండ విభూతి ధరించి త్రిపుండ్రధారి యయ్యెను. తదుపరి శివలింగమును షోడశోపచార విధిగా పూజ యొనర్చెను. ఇఁక దేవ దేవునికి నైవేద్యము పెట్టవలయును. వీరశైవ పద్ధతిలో ఒక ఉత్తముడైన జంగమ పెద్దకు కూడ సహపంక్తిలో భుజింప పెట్టవలెను ఇది ప్రతి దినము జరుగు విధానము. ఆ విధ

ముగనే చిఱుతొండడు అర్పింపబడిన లింగమును పూలలో భద్రపరచి ఉంచి వెలుపలికి రాగా శివభక్తు లెవ్వరు కాన్పించలేదు. ఇది శివుని పరీక్షయని తిరువెంగనాచి పలుకగా ఆతడు ధర్మము తప్పలేదుగదా పరీక్షకు అవసర మేమి అనుకుని ఊరి వెలుపలకు వెదుక బయలు దేరెను. చిఱుతొండడు కాంచీపురమునందలి వీధులన్నియు తిరిగినను అతని కంటికి ఒక్క శివయోగి యైనను కనబడక వెతికి వేసారి విఫలుడయ్యెను. తుదకు కాంచీపురము వదలి చుట్టునున్న తోటలలో నెక్కడైన ఒక్క శివయోగి కన్పించునేమో చూతమని ఊరి వెలుపలికి బయలు దేరెను. వెదలి చూడగా అచట పాడుపడిన దేవాలయ ములో వృద్ధ దంపతులు కన్పించిరి. ఎనభై యేండ్ల వృద్ధుడైన ఒక జంగము పెద్ద ప్రక్కన ముసలి ముత్తైదువ కాన్పించిరి. నంబి ఆ వృద్ధ దంపతుల కడకేగి నమస్కరించినాడు. అంత నా వృద్ధుడు "ఎవరు నాయనా?" యని చిఱు తొండనంబిని పలకరించినాడు. అంత నంబి తనది కాంచీపురమేనని పత్నీ సమేతముగా యీ రోజు శివార్చనకు రావలెనని ప్రార్థించెను. ఇల్లు దూర మేమోనని వృద్ధు సంశయించగా నంబి వారిని తన భుజముల మీద కూర్చుండ బెట్టుకొని ఎత్తికొని పోయెదనని పలికెను. అంతనా వృద్ధు తమకొక వ్రతము గలదని అది తన వలన నెరవేరునా లేదా యని సంశయించు చున్నాననీ ఇప్పటికిని నిరాహారదీక్ష వహించి ఒక సంవత్సర మైనది నేటితో ఉద్యాసన జరిపి దానిని ముగించవలసి యున్నదని తెలిపెను. నంబి దానికి అంగీక రించెను. అంత నా వృద్ధుడు ఆ వ్రతము సామాన్యమైనది కాదు సుమా యని నంబితో పలుకగా ఆతడు ఎంతఅసామాన్యమైన దైనను, కష్టమైనదైనను తప్పక నెరవేర్తునని సెలవిచ్చెను. విభూతి నందుకోవలసినదని కోరెను. వృద్ధ జంగము మాత్రము ఒప్పుకొనక చిఱుతొండడు అంగీకరించినను ఆతని భార్య ఒప్పుకొనక పోవచ్చునను శంకతో ఇట్లనెను.

చ॥ ఉదరమునన్ ధరించి ప్రసవోద్భవ వేదన బొంది పిమ్మటన్
ముదిముదియైన పీతబడి మూత్రమునంబడి లజ్జవందుగా
సవవదయైన తల్లికి ప్రియంబొ సుతుండు వృథాభిమానదు
ర్మదు డగు తండ్రికిం ప్రియుడొ మానసవీథి దలంచి చూడుమా!

అని సందేహము వెలిబుచ్చెను. ఇంకను "ఇంతకు పూర్వము వీర మాహేశ్వర ఘోరవ్రతంబులు నీవు చేసిన యవి లేవు. పుత్రస్నేహంబు సామాన్యంబు కాదు" అనుచు భార్యతోఁగూడి ఆలోచించ వలసినదని ఒక వేళ ఆమె అంగీకరించినను పుత్రుడెట్లం గీకరించును ?

తే॥ నీకుఁజం పఁగవచ్చు బోనియమనిష్ఠ
దల్లి కోర్వంగ వచ్చు బో ధైర్య గరిమ
మాకు బెట్టిఁయింపవచ్చు బో మనసుతివుట
జెఱుత వానికి జావంగ నశిదిగాని.

యని జంగము వృద్ధు బలుకగా చిఱుంతొండడు భార్యను బిడ్డను అడుగుటకు వచ్చెను. భార్య ఇది యంతయు విని మొదట పుత్రవాత్సల్యముతో కొంచెము బెఱికినను, తదుపరి శివారాధనను దృష్టి యందుంచుకొని భర్తచేయు ఈ కార్యము నంగీకరించెను. పిదప సిరియాళుడు కూడ నంగీకరించెను. భార్యాభర్తలు, కుమారుడు ముర్వురు పరమేశ్వరార్పణగ నేమిచేయమన్నను దానిని చేయుటకు వెనుకంజ వేయు వారు కారు. వారటువంటి భక్త శిఖామణులని తెలిసియె పరమ శివుడట్టి పరీక్ష నారంభించెను, తానెట్టి కఠిన పరీక్ష నుంచినా, దానిలో కడతేరిరాగలరని ఆ దేవదేవునికెవరిపై నమ్మకముండునో అటువంటి వారినే అట్టి పరీక్షలకు గురి చేయును. దాచి చందనిక కూడ నింటికి వచ్చినది. ఆమె ఈ వార్త విని గాభరాపడక తిరువెంగనాంచి, చిఱుతొండడు ఆమెకు జ్ఞానోపదేశము చేసిరి. తల్లి దండ్రులు యోగీంద్రుని సంతృప్తి కొఱకు కన్న కొడుకును త్యాగము చేయుటకు సిద్ధబడినప్పుడు చందనిక ఏమి అభ్యంతరము చెప్పగలదు ? తిరువెంగనాంచి యోగిపుంగవుడిచ్చిన విభూతి పుచ్చుకొనిన తరువాత అతడు జంగమ దంపతుల నాహ్వానించుటకు ఊరివెలుపల ఉద్యాన వనమున కేగినాడు.

పాడు దేవాలయములో పులి చర్మము మీద పడుకొనియున్న మాయా జంగము సిరియాళునితో మాట్లాడుట కరుగుదెంచినాడు. సిరియాళుడు గురువు గారు మధ్యాహ్న క్రియలకు లోపలి కరుగగా గురువు చెప్పిన పాఠములు తదేక ధ్యానముతో చదువుచుండగా మాయాజంగమును చూచి సమీపించి సాష్టాంగ

నమస్కారము చేసి ఎవరుకావలెనని ప్రశ్నించెను, అంత నా జంగము కన్న కుమారుని ఒక శివ యోగి సంతృప్తి కొఱకు మీ అమ్మ నాన్న నిన్ను చంపి వండి వడ్డించుటకు నిశ్చయించుకొనిరి. నీకీ వార్త నెఱింగించుటకు వచ్చితిని అని జంగము పలుకగా సిరియాళుడు నిశ్చలుడై ఏమియు చలించక రెప్ప వాల్చక నిలబడి చూచుచున్నాడట. యోగి మారు వేషముతో నరమాంసమును కోరినంత మాత్రమున కన్నవారు కొంచెమైన నాలోచించవద్దా ? ఇటువంటి పాషాణ హృదయులైన తల్లి దండ్రు లెందేనికలరా ? యనుచు ఇంకను వారిని గూర్చి జంగముడు ఇష్టమొచ్చినరీతిని మాట్లాడగా సిరియాళుడు జంగమునితో "ఒక వేళ మీ మాట నిజమైనచో నేనందుకు విచారించవలసిన అవసరమేమియు లేదు. వారేది చేయదలచినను అదంతయును మేలునకే. ఇది వారు ప్రసాదించిన శరీరము. దీనిమీద వారికి సర్వాధికారము గలదు. శరీరము ఈశ్వరార్పణము కాబోవుచున్న అంతకంటే పుణ్యమా ?" పరోప కారార్ధ మిదం శరీర"మ్మని చెప్పిన వారు మీలాంటి పెద్దలేకదా ? అని బాలుడు పలుకగా మాయామహా నాటక ప్రపంచ సూత్రధారుడగు జంగము తండ్రికంటే ఘనుడే యని మనంబున తలపోయుచు ఆచోటు వీడెను.

సిరియాళుడు పుస్తకము బట్టి కూర్చున్న కొంత సేపటికి గురువు లోపలి నుండివచ్చి సిరియాళుని ఇంత సేపు మాట్లాడు జోగి యెవ్వరని ప్రశ్నించెను. సిరియాళుడు సమాధానము చెప్పబోవునంతలో "గ్రుడ్లు తేల వైచి నోట నురుగులు రాగా మూర్ఛిల్లి పడిపోయెను. గురుకులములో కోలాహలము బయలు దేరెను. ఇదంతయు మాయాజంగముని మాయయే. ఉపాధ్యాయు డిది చూచి గాబరాచెందెను. ధైర్యము తెచ్చుకొని విభూతి ఫాలభాగ మంతయు రుద్దినాడు. బాలునకు తెలివివచ్చెను. తల్లి తండ్రి బాలుడు ఒకరిని మించిన వారొకరు. శివార్చన విషయములో ఎవరూ తీసిపోలేరు. బాలుడు జంగమునికి శివార్పణ కంటే అధికమగు ఆనందమేమియు లేదని విన్నవించు సందర్భములో బాలుని భక్తి పరాకాష్ఠ నందుకొన్నది. భక్తిభావముతోనే కాక వేదాంతధోరణిలో ఈ బాలుడు మాట్లాడుటలో మహాజ్ఞానిగా ఈ ఘట్టములో శ్రీనాథుడు దర్శింపజేసినాడు. వృద్ధాప్యము దాపురించినను తెలిసి కొనలేని తాత్త్విక భావముల నీ బాలుడు పదేండ్ల ప్రాయముననే తెలిసికొనుట అద్భుతమగు విషయము.

చిఱుతొండనంబి పొడు దేవళముచేరి, తన భార్య మున్నగు వారందరు అతనివ్రత నియమునకు అంగీకరించినట్లు తెలిపి త్వరగా దయచేయమని ప్రార్థించెను. చిఱుతొండ నంబి యోగీంద్రుని విబూదిసంచిని దండకమండలము చేత బట్టుకొని, అవృద్ధుని తన భుజముమీద భద్రముగ కూర్చుండ బెట్టుకొని శివ నామము లుచ్చరించుచు, తన ఇంటికి దారి తీసెను. వృద్ధురాలగు జంగమయ్య భార్య రూపముతో నున్న దాక్షాయణీదేవి గ్రుడ్డిదానివలె కోలనూది పొడుచుకొనుచు నంబి ననుసరించి వెళ్లెను. దారి పొడుగున చిఱుతొండని జూచి, అతని యందు భక్తి కలవారందరు 'శరణార్థి' చేయుచుండిరి. ఈ విధముగా నంబి ఇల్లు చేరెను. ఇంటి వారందరూ భయ భక్తి సంభ్రమములతో యోగి అతని భార్యను ఎదుర్కొని స్వాగతము పలికిరి. నయవినయ భయ భక్తులతో యోగికి సపర్యలు చేసి అతని నొకచోట సుఖాసీనుని చేసిరి. ముసలమ్మకు పరిమళ తైలముతో అభ్యంగనము చేయించి తిరువెంగనాంచి నూతన వస్త్రాభరణములతో అలంకరించి ఆమె భర్త ప్రక్కన కూర్చుండ బెట్టెను.

అనంతర మొక యేకాంత మందిరములో సర్వోపచార సంభారభరితముగా దేవతార్చనకు బెట్టిరి. ఆ యాది దంపతు లిరువురు మాయా రూపములలో అచ్చటికి వెళ్లి శివపూజా వ్యాపారములో నుండిరి. వింత యేమనగా ఆదినము అనేక చోటుల నుండి (ప్రదేశముల నుండి) బంధువులు, మిత్రులు మొదలగు వారందరు క్రొత్తగా దంచబడిన అటుకులు, చెక్కలములు, బెల్లపుటచ్చులు, శెనగ బేడలు, చిమ్మిలి ఉండలు, నువ్వుటుండలు సమృద్ధిగా తీసికొని వచ్చి దేవున కర్పించిరి.

ఆ సమయమున పదునారేండ్ల వయస్సుకల ఒక పచ్చి బాలెంత వచ్చి ఇంటి మొగసాల నిలిచి నంబి భార్యను పేరు పెట్టి పిలచినది. ఆమె పసి పాపనికి పాలుపోయమని ఆమెనడిగినది. తిరువెంగనాంచి పాలుపోసిన పిదప ఆమె ఈ విధముగా నడిగినది. "నిజమో అబద్ధమో గాని ఊరి వారందరు ఇట్లనుకొనుచున్నారు మీరు కొడుకుని చంపి ఒక కడుపుకక్కురితి జంగమయ్యకు వండి పెట్టబోవుచున్నారట. ఆ కపట జోగెత మాటలకు తిరువేంగనాచి చలింపలేదు. ఇంకను, "అమ్మ జంగమ దేవీ ఎవరి భక్తి ప్రపత్తులు వారివి. ఇందు ఒకరినొకరు ఆక్షేపింప బనిలేదు" అని సమాధానపరచి నీకు ప్రొద్దు పోవును.

పోయి బిడ్డకు పాలిచ్చుకొమ్ము మరల ఎప్పుడేని అవసరము కలిగిన మా ఇంటికి రావచ్చు"నని పలికి తిరువేంగనాచి లోని కరుదెంచినది. ఇది ఆమె నిశ్చల భక్తికి నిదర్శనము.

అంత చిఱు తొండడు భార్యతో "ముందుగా కుమారునకు వడుగు చేయ వలయునని గురువు నింటకేగి వానిని తీసికొని రమ్మని చెప్పగా తిరు వెంగ నాంచికి ఒక అనుమానముతో దినది. "స్వామీ మన వైశ్యుల ఇండ్లయందు వడుగు, పెండ్లి ఒక్కమారే కదా జరుగవలెను. వడుగు చేసెదము మరి పెండ్లి మాటే మిటి?" అని అడిగినది. "ముక్తి కన్యతోనే వానికి వివాహము. ఆమెతో తప్ప వానికి వేరే సంబంధ మెందులకు?" అని భర్త బదులుపలుకగా ఆమె యందులకు సంతృప్తిపడి గురువు నింటి నుండి సిరియాళున తోడ్కొని తెచ్చినది. కుమారుని అలంకరించి తల్లి దండ్రు లిరువురు బాలుని చూచి" కుమారా! ఈ దినమొక భైరవ యోగి యొక్క పాశుపతవ్రత చర్య సార్థక మగుటకు అతనికి పారణగా నీ మాంసమును వండి భోజనము 'పెట్టబోవుచున్నాము. ఇందు కై నీవు నీ మనసున విచారించవు గదా? అని అడిగిరి. అంత సిరియాళుడు "తల్లి దండ్రులారా! నామనసులో ఎట్టి కొఱతయు లేదు. మీ వంశ మిందువల్ల ధన్యము కాబోవుచుండ నాకు విచారమా? శివునకు మాంసాహార మగుటకు సిద్ధ ముగానున్నాను. నన్ను చంపవలసి వచ్చినందులకు మీ రెంత మాత్రము దుఃఖించరాదు" అని బాలుడు అంగీకారము సూచించినాడు.

ఇట్లు మనసున నెంత మాత్రము విచారము లేక పోవుచున్నట్టుండగా మిగుల సంతోషముతో ఉత్సహించి కుమారునితో నేక వాక్యముగా కడసారి వారిట్లనిరి.

మ॥ మది శంకింపకుమన్న! యా వలని ప్రేమ స్నేహ వాత్సల సం
పద పాటింపకుమన్న! నాలుక తుదిన్ బంచాక్షరీ మంత్రమున్
బదిలం బొప్ప బఠింపుమన్న! పరమ బ్రహ్మార్థ సంసిద్ధి యి
య్యది సుమ్మన్న! యనుంగు నందన! శిరాలా! వీరశైవవ్రతా

(హ.వి.ద్వి.ఆ. 116)

వెంటనే చిఱుతొండనంబి "జై నమఃశ్శివాయ" అని శివార్పణ బుద్ధితో, మన సున నణుమాత్రమైన శంక లేకుండ తిరువెంగనాంచి చందనిక బాలుని తొడ లను కదలకుండ పట్టుకొని యుండగా తీక్ష్ణమగు కత్తితో గొంతును కరుక్కున కోసి "నమశ్శివాయ"యను పంచాక్షరీ మంత్రమును బిగ్గరగ పఠింపసాగెను. సిరియాళుని తల మొండెము నుండి వేరు చేయబడినది. దానిని వారు శాకముగా వండి వడ్డించుటకు సిద్ధపడిరి. పూజ ముగించుకుని పిలుపున కెదురు చూచు చుండిన యోగి యొక్క, భార్యయొక్క పాదములు కడిగి పాదోకమును తమ శిరస్సుల మీద చల్లుకుని చిఱుతొండ దంపతులా ఇరువురిని భక్తి తాత్పర్యము లతో అర్పించి భోజనమునకు తోడ్తెచ్చిరి. వడ్డన ప్రారంభించిరి. పాయసము, అపూపములు సూపము, చెఱకు, ద్రాక్ష పాలు మున్నగు వానిచే అమృతోప మానముగ చేయబడిన రసములు, మదువు, శర్కర, ఘృతపక్వములైన భక్ష్యములు, శాక పాకములు, మొదలైన వానితో పాటు గారాబు కొడుకు మాంసాహారము వడ్డింపబడినది. చిఱుతొండడు, అతని భార్య చేతులు జోడించి నమస్కరించి "స్వామీ భక్తవత్సలా। యోగి పుంగవ! విరూపాక్ష స్వరూపా! అమృతోపమానముగా వండబడిన ఈ ఆహారము నింక ఆరగిం పుడు'' అని ప్రార్థించిరి.

భైరవయోగి ఒకమారు తన యెదుట అరటియాకున ఉంచబడిన పదార్థముల నన్నిటిని కన్నెత్తి చూచి 'ఏమయ్యా నంబీ! పిల్లవాని తలలోని మాంసమును వండలేదు. ఉత్తమాంగమును విడిచి, నీరసమైన ఇతర భాగము లను మాత్రము వండించితివా?, అని కోపముతో కన్నులెఱ్ఱబడునట్లు చిఱు తొండని వైపు చూచెను.

శెట్టి భయపడినాడు. వంటపని యంతయు, ఆడు వారిద్దరికే వదలి వేసిన వాడగుటచేత వారేమి వండినది లేనిది అతనికి తెలియదు. అతని ముఖము వెలవెల బోయినది "హరహరా ఇంత చేసియు తుద కిదియా ఫలము?" అని విచారించుచు భార్యను, చందనికను అడిగినాడు. అప్పుడు చందనిక "యోగులెప్పుడేది కావలయునందురో నాకు తెలియును, అందులకే తలకాయను వేరుగా వండితిని. తరువాత వడ్డించ వచ్చునని ప్రక్కకుంచి నాను దానిని కూడ వడ్డించెద''నని అమె శిరోమాంసము తెచ్చి వడ్డించినది.

ఆ జంగము అంతటితో సంతృప్తి చెందలేదు. 'గృహస్థును విడిచి భుజించుటయా ? అది నాకలవాటు లేదు. ఇంతకు ఒంటరిగా భుజించరాదను శాస్త్ర వాక్యమున్నది. కావున నంబీ నీవును, నీ భార్యయు మా పంక్తిన భుజియించవలెను. ఆ ఆలుమగలందులకు సమ్మతించిరి. ఇంకను జంగముడు ''కుమారుని పిలువ వలసిందని" తిరిగి ఆదేశించగా వారు, వాడు అడబోయెను, కాబట్టి మీకాలస్యమగునని సమాధాన పరచ యత్నించిరి. కాని జంగము తిననుగాక తినని వట్టు పట్టెను. శివభక్త్యావేశముతో ఆ టక్కరి యోగిని తృప్తి పరచుటకు ఆ దంపదులు చేయగలిగిన దంతయు చేసిరి. అతడు వారి మనశ్శుద్ధిని, భక్తిని అడుగడుగున పరీక్షించు చుండెను. తన భక్తులను పులు గడిగిన ముత్యములవలె చేయవలెనని ఆ ఈశ్వరుని సంకల్పము కాబోలు !

యోగి పత్తిడి కాగలేక చిఱుతొండడు తన భార్యతో సిరియాళుని ఎలుగెత్తి పిలువుమని చెప్పినాడు. ఆమె పంచాక్షరీ మంత్రమును ముమ్మారు మనస్సులో పఠించి ఈ విధముగా పిలువ నారంభించెను.

సీ॥ రారా వణిగ్వంశ వారాశి హిమధామ !
రారా వికస్వరాం భోరుహాక్ష !
రారా మహాఘోర వీరశైవాచార !
రారా మానౌదార్య రాజ రాజ !
రారా కుమార కంఠీరవేంద్ర కిశోర !
రారా సమగ్ర ధీరౌహిణేయ !
రారా మనోభవాకార రూప విలాస
రారా యపార సంసార దూర !

తే॥ రార నావన్నెవడుగ ! రారా తనూజ
రార సిరియాల ! రార నా ప్రాణపదమ !
రార నా కుట్టి ! నా జియ్య ! రార యనుచు
జీరు గారాపు గొడుకు రాజీవ నయన

(హ. వి. ద్వి. అ. 184)

"నాయనా సిరియాళా! రమ్ము నా తండ్రీ! త్వరగా రమ్ము. యోగీంద్ర దంపతుల భోజనమున కాలస్యమగు చున్నది" "అమ్మా వచ్చితిని" అని ప్రత్యుత్తరము వినబడినది. తల్లి దండ్రుల హృదయములు ఆనందముతో పులకించినవి. సిరియాళుడు చెక్కు చెదరక ఎప్పటివలెనే సుందరాకారముతో పరుగెత్తి వచ్చి తల్లి ఒడిలో వ్రాలెను. వచ్చిన వారందరు దిగ్భ్రాంతులై చూచు చుండిరి. తిరువేంగనాచి చిఱుతొండడు, చందని ఆనంద పారవశ్యముతో వాని నెత్తుకుని ముద్దాడిరి. వారు వెను తిరిగి చూడగా ముదుసలి జంగము, అతని భార్య లేరు. వారి స్థానమున భస్మముచే తెల్లనైన దేహము కలిగి, సర్పాహారములతో, నీలకంఠుడై జటా జూటమున నెలవంక ప్రకాశించు చుండగా శివుడు ఆతని ప్రక్క నలుదిక్కులను తన దేహకాంతితో ప్రకాశింప జేయు పార్వతీదేవియును కాన్పించిరి.

వెంటనే చిఱుతొండడు ఆనంద పులకిత గాత్రుడై ఆ పురాణ దంపతులకు సాష్టాంగ దండ ప్రణామ మాచరించి "హే హాలా హాలా! నీలకంధరా, మహేశా! భక్త చింతామణీ! గంగాధరా! చంద్రశేఖరా! కృపాంబోనిధీ జయము జయము" అని భక్తి పారవశ్యముతో పెక్కు రీతుల నుతించెను. దేవ దేవుడు పరమ ప్రీతుడై యా పుణ్య దంపతుల నాశీర్వదించి సిరియాళుని ఎత్తి ముద్దాడి, వానిని పార్వతి కందించెను. ఆ మహాదేవియు వాని నాశీర్వదించి కురులు దువ్వి ముద్దాడి తల్లి దండ్రుల కప్పగించెను.

"భక్తవరా చిఱుతొండనంబీ! నీవు పూర్వ జన్మమున తుంబురుడను ప్రమథుడవు. దుర్వాసుని శాప కారణమున మనుష్యుడవై పుట్టితివి. తిరువేంగనాచి నీ భార్యయొక్క అంశలో జనించినది. సిరియాళుడు మరెవ్వరో కాదు. కుమారస్వామి. మీరు ముప్పురును. కారణాంతరమున మర్త్యలోకమున బుట్టి ఈ రీతిగా కష్ట సుఖముల ననుభవించవలసి వచ్చెను. మీరిక ధన్యులు. ముప్పురును మీ శరీరములతో కైలాసమును జేరి మీ తొంటి స్థానమునలంకరింపుడు" అని దేవ దేవుడు సెలవిచ్చెను. అంత చిఱుతొండడు సతీసుతులతోను కంచిలోని ఏడువాడల వైశ్యులతోను, కైలాసమునకు జేరి శంకర సాన్నిధ్యమున నిత్య సమ్మోదలీల తేలియాడుచుండెను. ఈ విధముగా చిఱుతొండనంబి కథ ముగిసినది. శ్రీనాథుడు ఈ కథ వ్రాయుటకు ముఖ్య కార

ణము అవచి తిప్పయ్యశెట్టికి పూర్వీకుడు కావడమేనని[1] ఆరుద్రగారు వ్రాసిరి నిజమే కావచ్చును. ఎందు చేతననగా శ్రీనాదుడు ఆగమ శైవ సంప్రదాయములను గౌరవించినవాడుగా భీమఖండ, కాశీఖండ, శివరాత్రీ మాహాత్మ్యములలో దర్శనమిచ్చినాడు. ఈతడు వీరశైవుడు కాడు. అయినప్పటికీ చిఱుతొండని కథ వ్రాయుట కేవలము అవచి తిప్పయ్య సెట్టి కోరిక ప్రకారము ఈ కావ్యము రచించినాడు గనుక అతని మీదగల గౌరవ భావమే దీనికి కారణమని తోచుచున్నది. శ్రీనాదుని రచనలన్నియు సంస్కృత పురాణములకో ప్రసిద్ధ కావ్యములకో అనువాదములు. కాని సిరియాళుని కథ మాత్రము స్వతంత్ర రచన.

చిఱుతొండనంబి కథ పాల్కురికి సోమనాదుని 'బసవ పురాణము' నాల్గవ ఆశ్వాసములో కలదు. కాని శ్రీనాథుడు సోమనాథు ననుసరించలేదు. వీరశైవులు పాటించు తీక్షణమైన వ్రతములను చెప్పుటకు సోమనాథుడు ఈ కథ చెప్పినాడు. కథలోని పేర్లలోను, మరికొన్ని చిన్న చిన్న సంఘటనలలోను సోమనాథుడు వ్రాసిన కథకును, శ్రీనాథుని కథకును భేదము లున్నవి. కాని ఇతివృత్త మొక్కటే. ఈ కథ కాంచీపురమున జరిగిట్లు సోమనాదుడు వ్రాసిన దానిలో శ్రీనాథుడు ఏకీభవించెను. సిరియాళుని తండ్రి శైవదీక్షను శివుడు పరీక్షించుటయందు రెండు గ్రంథములయందు ఏకీభావము కలదు. కుమారుని ఖండించుటలోను, అతిథికి వడ్డించుటలోను, శిరోమాంస విషయములోను రెండు కథలు ఒకే విధముగా నున్నవి. సోమనాథుడు శివభక్తులలో పరంపరగా వచ్చుచున్న కథలను విని శైవనిరతిని నిరూపించుటకు రంచించిన కథ ఇది. కాని శ్రీనాథుని దృష్టి యిదికాదు. ఇతడు హర విలాసములో శివుని గొప్పతనము చెప్పుటకే అనేక శివ సంబంధమైన కథలను వ్రాసినాడు. చిఱుతొండనంబి కథను శ్రీనాథుడు సోమనాదుని గ్రంథము ననుసరించి కాక సిరియాళునకు వారసుడై పరంవరగ అతని వంశమునందు జన్మించిన అవచి తిప్పయ్యశెట్టి చెప్పగా విని ఆ విధముగనే దానిని గ్రంథస్థము చేసి యుండును. అందువలన శ్రీనాథునకు సోమనాదుడు చెప్పిన కథ ప్రమాణము కాక పోగా అవచి తిప్పయ్య వలన విన్న కథయే ప్రమాణమయినది. ఈ కథను తర తరములుగా జనులు చెప్పుకొని పోవుచుండగా దాని యందు స్వల్పమైన మార్పులు వచ్చుటలో సందేహములేదు.

---

1. సమగ్ర ఆంధ్రసాహిత్యము (ఆరుద్ర)

ఇక హరవిలాసములో సిరియాళుని కథ తరువాత గౌరీ కళ్యాణము పేర్కొనబడినది నన్నెచోడుని "కుమార సంభవము"లో సతీదేవి జననము, విఘ్నేశ్వరుని ఉత్పత్తి మొదలు దక్షాధ్వర ధ్వంసముతో సహా కుమారుని జననము తారకుని కుమారుడు వధించుట మొదలగు విషయములు పేర్కొన బడినవి. ఈ కథలన్నియు వివరముగా "తృతీయ ప్రకరణము"లో పేర్కొం టిని ఇచట శ్రీనాథుని 'గౌరీ కళ్యాణము' తారకుని విధ్వంసక చర్యలు వివ రించుటతో ప్రారంభమైనది. సతీదేవి దక్షుని యజ్ఞ సమయములో యోగాగ్నికి కాలిపోగా శివుడు సతీ వియో దుఃఖముచే హిమవన్నగ ప్రాంతములలో ఘోర తపస్సు చేయుటకు కైలాసము వదలి వచ్చుట, ఇంతలో సతీదేవి పార్వతి పేరిట హిమవంతునకు మేనకకు పుట్టుట, ఆమె శివుని తపస్సు చేయు సంద ర్భమున అచటి కేతెంచి సపర్య లొనర్చుట మన్మధుడు వీరిరువురిని కలుపు టకు పూనుకొని శివుని ముక్కంటి అగ్నికి గురియగుట, చివరకు రతీదేవి విలాపము వలన శివానుగ్రహముచే మన్మథుడు బ్రతుకుట, గౌరీ కళ్యాణము, శివపార్వతులకు కుమారు డుదయించుట, ఆ కుమారుడే తారకుని వధించుట యను ఘట్టములు హరవిలాసములో గలవు. కాళిదాసు కుమార సంభవములో చెప్పిన అనేకాంశములు పార్వతి తపస్సు, శివ పార్వతుల సంవాదము, పార్వతీ కళ్యాణము ఇత్యాది ఘట్టములలో శ్రీనాథుడు కొన్ని చోట్ల యథాతథముగను మరికొన్ని చోట్ల స్వల్పమైన మార్పులతోను గ్రహించెను. కాళిదాస శ్రీనాథుల తులనాత్మక పరిశీలన యదార్థమునకు ఒక ప్రత్యేక పరిశోధనాంశమే. కాని ఈ సందర్భములో ఆ వివరములు ఉల్లేఖించుట సందర్భోచితము కాదు. కాని ఒక విషయము మాత్రము స్పష్టము. ఈ ఘట్టములలో శ్రీనాథుడు కాళిదాసుని అనుసరించినను అతనిపై శైవ సంప్రదాయపు భావము సముచితముగా నున్న దను విషయము విస్మరించలేదు. అందుచేతనే ఈ ఘట్టములు ఇచట ప్రసక్త మయ్యెను.

దీని తరువాత షష్ఠాశ్వాసములో క్షీర సాగర మధన కథ వర్ణింపబడి నది. లోక కళ్యాణార్థము మహేశ్వరుడు గరళమును మ్రింగిన వృత్తాంతము దీనిలోని ప్రధాన కథ ఆ కథ యిట్లు ప్రారంభమైనది. ఒకసారి పార్వతీదేవి శివునితో ఈ విధముగా పలికెనట. "ఓ మహేశ్వరా! నీ కంఠ మూలములో నల్లనికాంతి ప్రకాశించుచున్నది. సమస్త లోకము చూచుటకు యిది ఇంపుగా

నుండును. ఈ నల్లని కాంతి యిట్లు కలుగుటకు కారణమేమి నెలవీయుము''
అనగా శివుడిట్లు చెప్ప ప్రారంభించెను.

మ. మునుజంభాసుర బహు విక్రమ కళాముద్రావిభాభాసురున్
ఘనదంభోళి నిశాత హేతి నిహతిన్ ఖండించి యాఖండలుం
డను మోదంబున దేవతల్ గొలువగా నైరావణారూఢుడై
ఘన మార్గంబున వచ్చె నాకమునకున్ గర్వంబ ఖర్వంబుగన్

(హ.వి.ష.ఆ 8)

పూర్వము జంభాసురుడు చాల బలవంతుడై మూడు లోకములకు కంటకుడయ్యెను. వాడతి బలవంతుడై భూలోకములో పాతాళ లోకములో ఎదురు లేకుండ నుండెను. దేవేంద్రు డిది గమనించి ''శత్రువు నిక యుపేక్షించరాదు. అని ఐరావతము నధిరోహించి దేవసేనలతో జంభుని మీదికి దండెత్తెను. వజ్రాయుధముతో జంభాసురుని ఛేదించెను. విజయవంతుడై అమరావతికి తిరిగి వచ్చుచుండ, అమరభామినులు మేడలపై నిలిచి దేవేంద్రునిపై లాజలు, అక్షతలు, పుష్పములు చల్లిరి. అష్టదిక్పాలకులు చుట్టును చేరికొల్వ, గంధర్వులు నృత్యగాన వినోదములు జరుపుచు పురోభాగమున నడచుచుండిరి. దేవతలు తన్ను పొగడుచుండగా ఇంద్రుడు సగర్వుడై పర్వతము వంటి తన తెల్ల యేనుగు మీద బంగరు టంబారిలో కూర్చుండి పోవుచుండగా దుర్వాసు డెదురయ్యెను. మహాముని ఎదురగుట తోడనే ఇంద్రుడు ఐరావతము నుండి దిగి అతనికి వినయముతో నమస్కరించెను. అంత దుర్వాసుడు ప్రమోదముతో దేవతాస్త్రీ కానుకగా సమర్పించిన పారిజాత మాల్యమును ఇంద్రునకు బహూకరించినాడు. ఇంద్రుడు ముందు వెనుక లాలోచింపక మదపు టేనుగు యొక్క కుంభస్థలము మీద ఆమాల నుంచినాడు. ఏనుగు తొండముతో నామాల నందుకొని, గాలిలో గిరగిర త్రిప్పి పూలన్నియు చెదరి పోవునట్లు విసరివైచి, కాలితో త్రొక్కినది.

తానెంతో ప్రేమ పూర్వకముగా ఆశీర్వదించి యిచ్చిన హారమునకు కలిగిన దుస్థితిని గాంచి, అందుకు కారకుడయిన దేవేంద్రుని జూచి పటుతర రోష కషాయి తాక్షుడయి, పండ్లు గీటి దుర్వాస మహాముని మిక్కిలి కోపముతో ఆ మాలకు పట్టిన దుస్థితికి విచారించి మెడలో వేసికొనవలసిన ఆ మాలను

జంతువుకిచ్చుట కేవలము విజయగర్వముచే ఇంద్రుడు చేసిన పొరపాటుగా భావించి ఈ విధముగా శపించెను. ''నీ వద్ద నుండు సమస్త వస్తువులు లక్ష్మితో కూడ సముద్రములో పడిపోవుగాక. లక్ష్మి ఉన్నచోటనే సత్పదార్థములుండును. నీ ఉచ్చైశ్శ్రవము, ఐరావతము, అప్సరసలు, కల్పవృక్షము, అమృత కుంభము, కామధేనువు, చంద్రుడు, చింతామణి రత్నము మొదలయిన వన్నియు సముద్రములో పడిపోవుగాక'' అని భయంకరముగా శపించి దుర్వాస మహా ముని చూచుచుండగా మాయమయ్యెను. క్షణ కాలములో జరిగిన దంతయు తలచుకొని ఇంద్రుడు వాపోయినాడు. క్షమార్పణ వేడుకొందమన్నను వ్యవ ధానము లేకుండా దూర్వాసుడు అంతర్హితుడయినాడు. చుట్టు నున్న దిక్పాల కులు, ఇతర దేవతలు, గంధర్వులు కూడ ఈ అకస్మిక సంఘటనకు దిగ్భ్రాంతులైరి. కొద్ది సేపటికి తెప్పరిల్లి బృహస్పతి దేవేంద్రు నూరడించి అతని సౌధమునకు తోడ్కొని పోయెను.

చూస్తూ ఉండగనే రంభా మొదలైన అప్సరసలంతా పదునాల్గు జాతుల వారితో కూడ అబ్ధిలో బడి మునిగిపోయిరి. పారిజాతము, కల్పవృక్షము, మందా రము, సంతానము, హరి చందనము అనబడు ఐదు దేవతా తరువులు మున్నీట పాలయ్యెను. ఐరావతము, ఉచ్చైశ్శ్రవము, చింతామణి రత్నము కూడ అదే జాడలో అదశ్యమయ్యెను. అమృత కుంభముతో పాటు కామధేనువు కూడ జలధిలో మునిగిపోయినది. వీనితోబాటు చంద్రుడు, స్వర్గరాజ్యలక్ష్మి కూడ పోయినది.

స్వర్గలోక వాసులు సర్వసౌఖ్యములు పోగొట్టుకొనబడిన వారై దేవ తలకు తిన తిండి కట్టబట్ట కూడ కరువై దరిద్రము ననుభవించవలసిన స్థితి ఏర్పడెను ఇట్లుండ తుద కొకనాడు శచీపతి దేవగురువును సమీపించి ''గురూ త్తమా! ఇప్పుడేమి చేయవలెను? మనమెట్లు ఈ కష్టములు గడచి గట్టెక్క గలము?'' అని ప్రశ్నించగా బృహస్పతి దేవేంద్రాదులను వెంట బెట్టుకొని సత్యలోకమున బ్రహ్మ వద్ద కేగిరి. బ్రహ్మ వారిని చూడగానే! మీ కష్టములు నేనెఱుగుదును. ఇదంతయు స్వయం కృతాపరాధమే. దుర్వాస మహాముని ఎట్టి వాడో తెలిసి, దేవపతీ - నీ వంత గర్వముతో చరించ వచ్చునా? నీ కారణ ముగా అమాయకులైన తక్కిన వారందరు కడగండ్లపాలు కావలసి వచ్చినది''

అని పలుకగా దేవేంద్రుడు నోరాడక మౌనముగా నిలబడెను. ఇంద్రుని స్థితి చూచి అందరు జాలిపడిరి. బ్రహ్మ వైకుంఠమున విష్ణువుకడ కేగుదము రండని అందరను బయలుదేర దీసెను.

దారిలో నారదుడు కలిసెను. ఆతడు వైకుంఠము నుండియే వచ్చు చున్నట్లు శ్రీహరి వీరికొరకు ఎదురు చూచుచున్నట్లు నారద మహర్షి బ్రహ్మ మున్నగు వారికి చెప్పెను. అంత నారదుడు కైలాసమున కేగుచున్నానని చెప్పగా మహాదేవునకి సంగతి వివరించమని బ్రహ్మ నారదునికి చెప్పెను. అలాగేనని నారదుడు వెళ్ళిపోగా పరమేష్ఠి దేవతలతో వైకుంఠము చేరినాడు.

వారందరికి పాల మున్నీటి నడుమ శేషశాయియై లక్ష్మీదేవితో శ్రీహరి దర్శనమిచ్చి "పితామహా! దేవతలారా! మీరు వచ్చిన పని నాకర్థమైనది. మీ కష్టములు తీరుటకు వలయు నుపాయ మొకటి కలదు. మీరు వెంటనే రాక్షస ప్రభువైన బలి నాశ్రయించి, వారితో నేస్తము కలిగి వర్తించినట్లు నటించుచు పాల సముద్రమును చిలుకవలెను" అని పలికెను. పాల సముద్రమును చిలుకుట ఎట్లాయని దేవేంద్రుడు మున్నగు వారికి సంశయము కలిగి ఒకరి మొగము నొకరు చూచుకొనిరి. అది గ్రహించి శ్రీమన్నారాయణుడు సర్ప రాజైన వాసుకుని ప్రార్థించి ఆతడు త్రాడుగా నుండునేమో కనుగొనమని, మందర పర్వతము కవ్వముగా నుపయోగించమని చెప్పి అంతర్ధానమొందెను. బ్రహ్మ మహావిష్ణువు చెప్పిన రీతి చేయమని దేవేంద్రునికి చెప్పెను.

దేవేంద్రుడు బలి నాశ్రయించెను. అక్కడ సెల్లెంద్ర బిడ్డలైనను బద్ధ వైరము ఇరువురికి గలదు. అది మానుకుని అన్నదమ్ములవలె మెలగుటకు యిద్దరు నిర్ణయించుకొనిరి. పాల సముద్రము చిలుకుట వలన దుర్వాసుని శాపమువలన సముద్రములో పడిపోయి మునిగిన వస్తువులన్నియు తిరిగి వచ్చు ననియు వాటికొరకు వారు పేచీ పడరాదనియు దేవేంద్రుడు బలికి చెప్పెను. బలి సముద్రము చిలుకు విధమెట్లని యడుగ వాసుకి త్రాడుగా మందరగిరి పర్వతము కవ్వముగా నువయోగించి చిలికి అమృతము ఉద్భవించునని బ్రహ్మ సెలవిచ్చినట్లు, కూడా దేవేంద్రుడు చెప్పెను.

ఈ విధముగా నిశ్చయించుకొని దేవదానవులు మందరగిరి పెకలించుట కనేక కష్టముల పాలగుచుండగా విష్ణువు ప్రత్యక్షమై భయపడకుడని అభయ మిచ్చినాడు అంత వారు మందరగిరిని సముద్రము కడకు తెచ్చి వాసుకి వద్దకేగి అనేక విధముల స్తుతించి, వాసుకిని మందర పర్వతము కడకు కొని తెచ్చిరి. సముద్రమును చిలుకుబెట్లని దేవదానవులు నిరుత్సాహమొందిరి. శ్రీహరి మఱల ప్రత్యక్షముకాగా వారు "దేవా? ఈ నీటిపై మందర పర్వతమును నిలుపుటెట్లు? నీవే మాకొక దారి చూపి మమ్ము రక్షింపు"మని ఇంద్రుడు ఇందిరా రమణుని వేడుకొనెను. వెంటనే లక్ష్మీకాంతుడు ఒక లక్ష యోజనముల వెడల్పు గల వెన్నుచిప్పతో, బ్రహ్మాండమునంతని ఒక్కమారు కావలెనన్న గుటుక్కున మ్రింగి వేయగల నోటితో సకల చరాచర జంతు రాసుల నన్నిటిని మ్రింగి అణచుకోగలిగిన గొప్ప కడుపుతో, విశ్వము మీద విశ్వము పడినా భరించగల బలిష్టమగు కాళ్ళతో, భయంకరమైన ఒక మేటి తాబేటి ఆకారమును ధరించి మందర పర్వతము నెత్తి తన మూపు మీద నుంచుకొనినాడు. విష్ణు లీలలకు అచ్చెరు వొందుచు దేవాసురు లమితాశ్చర్య చకితులై భక్తి తాత్పర్యములతో చేతులు మోడ్చి నిలబడిరి

వారు చిలుకుట మొదలిడిరి. అడుగడుగున విఘ్నములే. తిరిగి వారు విష్ణువును ప్రార్థించగా ఆశరీరవాణి ఈ విధముగా పలికినది. "దేవదానవులారా ! సమస్త కార్యములను ప్రారంభించుటకు ముందు సకలవిఘ్న హర్తయగు వినాయకుని మీరు పూజించలేదు కావున మీకీ యిక్కట్టు కలిగినది. మీ రా హేరంబుని పూజించిన మీ పనులు నిర్విఘ్నముగ సాగ గలవు."

వెంటనే వారు సముద్ర తీరమునందే వినాయకుని ప్రతిష్ఠించి భక్తి శ్రద్ధలతో వినాయకుని పూజించిరి. ఈ సందర్భములో వినాయకుని వీరుస్తుతించినట్లు దండకము కూడ హర విలాసములో చెప్పబడినది.

ఇక నిర్విఘ్నముగా వారు సముద్రము చిలుక మొదలిడిరి. చిలుకగా కొంత సేపటికి సముద్ర మధ్యములో బుగ బుగ మని భయంకరమైన ధ్వని కలిగెను. నీరంతయు గడ్డకట్టి నట్లయ్యెను. విశేషమగు ఆవిరిజనించెను. మూడు లోకములు కంపించి పోవునట్లు నల్లని అగ్నిజ్వాల లుదయించెను.

వాసుకి గ్రక్కుచుండిన విషమునకుతోడు లేతమామిడి చిగుళ్ళ రంగుతో భయం కరమగు హాలాహల జ్వాలలుదయించి అంతట వ్యాపింపసాగెను.

అట్లు హాలాహలము పుట్టినదే తడవుగ మూడు లోకములు తల్లడిల్లి పోయెను. సురులు, గరుడులు, ఉరగులు మున్నగు దేవతా వర్గములన్నియు కలతపాటు చెందెను. బ్రహ్మ విష్ణులు కూడ ఆతురత చెందిరి. సప్త సము ద్రములు ఘూర్ణిల్లెను. సముద్రమును చిలుకు చుండిన దేవాసురులు దిగ్భ్రాంతిచే హా హా కారములు చేయసాగిరి.

శివుడు ఇంక ఉపేక్షతో నుండలేకపోయెను. లోకములను కాపాడుట తన విధి యనుకుని వెంటనే అచట ప్రత్యక్షమై "దేవతల లారా ! భయపడ కుడు. ఇప్పుడు పుట్టినది భువన భయంకరమైన హాలాహల విషము. దీనిని నేనిప్పుడే శాంతింప జేతును'' అని వారికి అభయమిచ్చెను. తక్షణమే రుద్రుడు మహా రౌద్రు డయ్యెను. సమస్త జీవరాసుల గుండెలదురునట్లుగా ఒక్కమా రతడు హూంకారము చేసినాడు. వెంటనే లోకరక్షాదక్షమైన తన కుడి చేతిని హాలాహల భీషణ జ్వాలలవైపు జాచినాడు.

పారి పోవుచున్న దేవాసురులు కొంత సేదతీరి ఆవింతను జూచుచు ఆశ్చర్యచకితులై నిలిచిపోయిరి. ఈశ్వరుని ఎదుట హూంకారధ్వనికి హాలా హల విషమంతయు స్తంభించి నిలిచి పోయినది. విషమంతయు మేఘరూపము దాల్చినది. ఉన్నదున్నట్టు బ్రహ్మాండమైన తనప్రమాణమును కోల్పోయి, తుద కొక నేరేడు పండు రూపము చెంది, శివుడు జాచిన కుడి చేతి హస్తములోవచ్చి నిలిచినది. త్రిలోక వాసులకిది యొక గారడివలె కానవచ్చినది. బ్రహ్మాండ మును భస్మము చేయునేమో యని భయపడిన యీ విషము అత్యంత శాంతమై శివుని అరచేతిలో నిలిచినది ! ఈ మహా దేవుఁడు దీని నేమి చేయునో యని కన్నులింత చేసికొని చూడసాగిరి జగన్నాటక సూత్రధారియైన మహేశ్వరుని ముఖములో చిరునవ్వు తాండవించు చుండగా అతడా గరళపు ముద్దను అమాంత మొక చెక్కర గుళికవలె గుటుక్కున మ్రింగి వేసినాడు. నల్లని హాలా హల విషము తెల్లని శివుని కంఠ మధ్యములో ఒక దివ్య మణివలె నిలిచి ఆతనిని నీల కంఠుని జేసి వేసినది. తన కుక్షిలోని బ్రహ్మాండముల క్షేమమెంచి అభవుడు

విషమును మ్రింగి వేయకుండ గొంతుకలో నిలుపుకొనెను. ఈ విధముగా మహా దేవుడు త్రిలోకములను రక్షించగనిగెను. ఈ కధలో కూడ శివుని అధి క్యతయే గొచరించుచున్నది. అద్భుతమగు తన లీలా వైభవముచే ఇతరులు చేయలేని పని తాను చేయగలిగినాడు శివుడు. ఈతని గొప్ప తనము కూడ ఇందే ప్రకటితమగు చున్నది. అంత బ్రహ్మాది దేవత లందఱు భయభక్తులతో పరమేశ్వరునకు మ్రొక్కి స్తుతించిరి.

సీ॥ జయ విరూపాక్ష ! యీశ్వర ! దివ్యలోచన ! జయవజ్రహస్త
దిశానివాస !
జయ పినాకేఖ్యాస ! శాశ్వత ! నిత్య ! యనిత్య !
నిత్యానిత్య ! నిరుపమాన !
జయ చింత ! జయరుద్ర ! జయమహా దేవ ! యచింత్య
చింత్యా చింత్య చిత్స్వరూప
జయపాధభక్తార్తి సంహార కారణ ! జయముకుంద ప్రియ !
జయగిరీశ !

తే॥ దివసమాసార్ధమాస సద్విశ్వరూప ! కల్పయుగ
వత్సరాదీనకాల ఖేచ
రుండ ! బహురూప ! చండీశ ! దండపాణి !
జయ నమస్తే నమస్తే ప్రసన్నమూర్తీ !
(హ॥ వి॥ ష॥ అ. 78)

ఈ లోకముల కన్నిటికి నీవే యీశ్వరుడవు బంధ మోక్షములకు నీవే ప్రభు డవు. ఆర్త శరణ్యుడవు నీవే. గురుడవు నీవే. సకలసృష్టి స్థితి సంహార కర్తవు నీవే. బ్రహ్మ విష్ణు మహేశ్వర స్వరూపుడవు నీవే. సమస్తమునను నీవే ప్రాణ మగుదువు. శక్తిమయుడవై జగ దంతరాత్మవై యుందువు. దేవా! సమస్త లోకములు నీయందే పుట్టి నీయందే యణగి యుండును. నీయుదరము సర్వ భూత నిలయము. గాలి నీ యూర్పు. వరుణుడు నీనాలుక. దిక్కులు నీ కర్ణములు. ఉదము నాభి, సూర్య చంద్రులు నీకు గన్నులు సముద్రము నీ జఠరము. ఆకాశము నీ శిరస్సు. సర్వౌషధులు నీ రోమ చయము. కొండలు

శల్యములు చంద్రుడు మనసు. ఛందములు ధాతువులు. ఉపనిషత్తులు నీ స్వరూపము. ఇట్టి పరతత్త్వ స్వరూపుడవై స్వయం జ్యోతివై శివశంకరుడవై వెలుగు నిన్ను బొగడ మే మెంతటి వారము కొందరు నీవు కలవను చున్నారు కొందఱు లేవనుచున్నారు కొందఱికి నీవు గుణములు కలవాడవు. మఱి కొందఱికి నిర్గుణుడవు. నిన్నుగురించి పరిపూర్ణ జ్ఞానము కలవారు మాత్ర మెంమనులేరు. త్రి మూర్తులకు, త్రి లోకములకు, త్రి కాలములకు, మూల స్వరూపుడవగు పరబ్రహ్మ తత్త్వము నీవే. ఇప్పుడీ జలధిలో జనించిన హాలా హల మును భక్షించుటకు నీకుగాక నెవ్వరికి సాధ్యము'' అని నీలకంఠుని బహు విధ ముల స్తుతించిరి. శివుడి విధముగా హాలాహలము భక్షించి, తమ్ము రక్షింపగా దేవాసురులు సంతసించి, మరల పాల సముద్రమును జిలుకు పనికి బూను కొనిరి.

తరువాత క్షీరసాగర మథనము కొనసాగగా లక్ష్మీ దేవి, కౌస్తుభము చంద్రుడు, ఉచ్చైశ్రవము, ఐరావతము, చివరన అమృత భాండముతో ధన్వం తరి ఉద్భవించిరి. లక్ష్మి కౌస్తుభములను విష్ణుమూర్తి గ్రహించగా చంద్రుడు మహేశ్వరుని శిరోభూషణ మయ్యెను. ఆ ఉచ్చైశ్రవణ ఐరావతములు ఇంద్రుడు గ్రహించెను. అమృత భాండమును విష్ణు మూర్తి ప్రమేయము చేత దేవతలు స్వీకరించిరి. ఈ కథలో హాలాహాల భక్షణము వరకే మహేశ్వరుని మహి మాభివర్ణనమున్నది. భయంకరమైన హాలాహాలము నుండి ముల్లోకములను కాపాడుటయే మాహేశ్వరుని శక్తికి ప్రతీక.

ఇక హర విలాసములో సప్తమాశ్వాసములో 'కిరాతార్జునీయము' కథను శ్రీనాథుడు వర్ణించినాడు. ఈ కథలోని ప్రధాన పాత్రలు అర్జునుడు, మహే శ్వరుడు. వీరిద్దరిలో అర్జునుడు విష్ణుమూర్తికి అవతారమైన శ్రీకృష్ణుని భక్తుడు స్నేహితుడు. అయినను ఇంద్రుని ఆదేశముపలన భవిష్యత్ యుద్ధమున తనకు జయము కావలెనన్నచో ఈశ్వరుదే సాధనమని తెలిసికొనెను. ఇంద్రుని ఆదే శము చేతనే మహేశ్వరుని గూర్చి అర్జును డింద్ర కీలా పర్వతప్రాంతములో తపస్సు చేయదొడగెను.

ఆ పర్వతప్రాంతము తపస్సుచేయుటకు అనుకూలమైన తావై కన్పిం చెను. మున్నెప్పుడు తపస్సుచేయని వాడయినను అర్జునుడు జ్ఞాతులవయి

క్రోధమువహించి తాఘప్పుడు పడుచున్న అష్ట కష్టములచే మనసు కలత జెంది, యేరీతిగనయిన కఠిన తపస్సు చేయవలెనని మిక్కిలి పట్టుదల కలవాడయి దేవేంద్రునిగురించి తపస్సు నారంభించెను.

అర్జును డనుసరించిన దంతయు ఒక రీతి వికట పద్ధతి - చేతి యందు ధనుర్బాణములు ధరించి, మూపున నిరువంకల తూణీరములను భద్రపరచుకొని కిరీటము, కవచము దాల్చి. అతడు దేవేంద్రుని దర్శించు కుతూహలముతో తపస్సు చేయదొడగెను. అట్లు క్షాత్ర వేషమును ధరించినను, ధనంజయుని మనసు సాత్త్వికశక్తిచే నావరింపబడి తపస్సమాధి కనుకూల మయియుండెను. అతడు గ్రహించునది శాకాహారము. ఇంద్రియములను నిగ్రహింప గలిగి నాడు. రాత్రి వేళలందు రాళ్ళపై బండుకొనుచు, సింహములు, ఎలుగు బంట్లు, అడవి దున్నలు, మహో రగములు, సంచరించు చుండునట్టి ఆ పర్వత ప్రాంత మునం దతడు చాలజాగరూకతతో వర్తించుచుండెను.

అర్జునుడు ప్రాతఃకాలము నందే నిద్రమేల్కొని పయినుండి పడు సెల యేటి ప్రవాహములలో అఘమర్షన మంత్రములను పఠించుచు స్నానము చేయును. తదనంతరము చంద్రశేఖరుని కొండ పూదినుసులను దెచ్చి అర్చించును. స్ఫటికాక్ష మాలికను చేత ధరించి ఇంద్రుని గూర్చి మంత్రములను జపించుచు ఒక్కొక్క మారు దిన మంతయు ఒంటికాలిమీద తపస్సుచేయును. క్రూర మృగము లెప్పుడేని తన్ను సమీపించి బాధింపవచ్చిన, వానిని బాణములచే గొట్టి చెండాడును. చల్లని గంధపు చెట్టును విష సర్పము చుట్టుకొన్నట్లు, శాంతరస పూరితమయిన మనస్సు కలవాడయినను అతనిలో వీరరసము పొడ సూపుచుండెను.

ఈ విధముగా ఒక సంవత్సరము గడచెను. ఇంద్రుడు వృద్ధ బ్రాహ్మణ రూపములో అర్జునునకు దర్శనమిచ్చి ఆతనిని పరీక్షింపగా అర్జునుడే పరీక్ష యందు గెలిచెను. శివునిగూర్చి తపస్సు చేయమని తనకోర్కె నెరవేరునని చెప్పి ఇంద్రుడు తిరోహితుడయ్యెను.

తండ్రిహితవును విన్న తరువాత అర్జునునకు పూర్వముకంటె ఉత్సాహము, ధైర్యము, పట్టుదల అధికమైనవి

అభవుని గూర్చి తపస్సు చేయుటకు శరీరమంతట బూదిపూసికొని, పంచాక్షరీ మంత్రమును జపెంచుచు, శివ ధ్యానతత్పరుడై దిన మంతయు పులి చర్మము మీద కూర్చొని, సాటిలేని మనస్థైర్యము వహించి, పాశు పతాస్త్రమును పొందవలెనని దీక్షతో తపస్సు చేయదొడగెను తెల్లవారక ముందే లేచి, చటియనుండి పడుచుండు ప్రవాహములో స్నానముచేసి పార్థుడు విభూతిని, రుద్రాక్ష మాలికలను ధరించి, పర్ణశాలలో హరునకు అరుణోదయార్చనము చేయును. పూజా సమయమున నాతడు ఉపచార విధుల నన్నిటిని సక్రమముగ నెరవేర్చుచుండెను. అనేక విధముల శివుని షోడసోపచార విధిని పూజించుచు సాయం సమయములందు బిల్వ వృక్షము క్రింద పులి చర్మము మీద నాశీనుడై, ఆ సమయమున ప్రళయ తాండవ మొనర్చు నటరాజు నర్చించును.

అర్జునుని తపోనిష్ఠను జూచి అప్పుడప్పుటికి వచ్చి పోవుచుండిన తపసోత్తము లాశ్చర్యపడు చుండిరి. కేవల రజో మూర్తియైన యాక్షత్రియునందు తేజరిల్లు సాత్త్విక, శాంతి తేజస్సు లెంతటి వారిని అద్భుత పరచుచుండెను. త్వరలో సత్ఫలమును బొంద గోరిన వాడగుటచేత పార్థుడు ఇతరుల కసాధ్యమగు నిష్ఠనుబూని, చంద్రమౌళి దర్శనమునకై తహతహలాడు చుండెను. ఇట్లుండ ఒకనాడు ప్రాతఃకాల పూజకు కిరీటి శివార్చనకువలయు వన్య పుష్పముల గోయుచుండగా ఆతని కొకవైపు నుండి వేటకుక్కల ధ్వని వినబడెను. కుక్కల 'భౌభౌ' ధ్వనులంత కంతను అర్జునుని సమీపించుచుండెను. చూచుచుండగనే సింహములకంటే, చిఱుత పులుల కంటే, పెద్ద పులులకంటె బలిష్ఠములై భయానకములైన సారమేయముల గుంపొకటి అర్జునుని కంటబడెను. వానిని బంగారు గొలుసులచే బట్టుకొన్న భయంకరాకారులు కొందరా కుక్కల వెంటనుండిరి.

అంతలో నొక కిరాతకుడు, చెంచెత కూడ అర్జునునకు కనబడెను. చెంచెత ఆటవిక వేషము నందున్నను అనిర్వచనీయమైన తేజో రాజమానయై యుండెను. అదేసమయమున నల్లని శరీరము, భయంకరమగు దంష్ట్రలు, వజ్రాయుధముతో సమానమైన ముట్టె, వికసించిన నల్లని కలువ రేకుల కాంతి గల చెవులు, ఎఱ్ఱని గుండ్రమైన కన్నులుకలిగి కర్ణకఠోరముగా ఘుర్ఘురధ్వని

చేయుచు ఒక భయంకరమైన అడవిపంది అర్జునునికి, కిరాతునకు నడుమ పరు గిడివచ్చెను.

ఆ అడవి పందిని చూచి శబర నాయకుడు వెంటనే తన భయంకరమైన ధనస్సు నెత్తి, తీవ్రమగు బాణమును సంధించి దానిపై వదలెను. ఆదే క్షణమున అర్జునుడు కూడ శర సంధాన మొనర్చి పందిపై ప్రయోగించెను. ఈ రెండు బాణములు యిరు ప్రక్కల గ్రుచ్చుకొనుటచే పంది మరణించెను.

ఈ పంది నాది యంటే నాది యనుకొని అర్జునుడు కిరాతకుడు వాగ్వి వాదములకు దిగిరి. చివరకు కిరాతుడు మనము పోరాడుట చూచిన నీ భార్యకు వేడుకగా నుండునని యుద్ధమునకు సంసిద్ధులైరి. హోరా హోరీ యిరువురు యుద్ధము చేయసాగిరి.

ఉన్నపాటున అర్జునుని అక్షయ తూణీరములో బాణములు లేకుండ పోయెను. ఇదంతయు నీశ్వరమాయ. వచ్చినవాడు కిరాత వేషధారియైన శతి కంఠుడు. చెంచెత ఉమాదేవి. వేటకుక్కలు నాల్గు వేదములు. పరివారమంత ప్రమథగణము. ఈ సంగతులేమియు అర్జునునకు తెలియవు. ఉన్నదున్నట్టు దివ్యాస్త్రములకు సంబంధించిన మంత్రాక్షరములే వియు పార్థునకు తోచ కుండ పోయెను. కృపుడు, ద్రోణుడు మొదలైన వారు చేసిన ఉపదేశము లన్నియు వృధాయైపోయెను. బాల్యమాదిగా చేసిన శస్త్రాభ్యాస మంతయు నిష్ఫల మయెను. ఇదంతయు పినాకపాణి మాయా లీల ! పార్థున కాసమయమున నేమి చేయుటకు దిక్కు తోచలేదు. తనబలము పరాక్రమము, విద్య ఎందు కారీతిగా కలహ రంగములో రిత్తపోయినవో అతని కర్థము కాలేదు. అర్జునుని శరీర మంతట ముచ్చెమటలు పోసినది. ఈశ్వరమాయని భావించెను. పార్థుడు క్షణ మాత్ర మాలోచించి, మరెట్టి మార్గము తోచక, ఫాలలోచనుని తన చేతి గాండీ వముతో బలముగా కొట్టెను.

తన భర్త కంతటి పెద్ద దెబ్బ తగులుసరికి పార్వతి గజ గజలాడినది. శివుని జటా జూజములోన దాగియున్న మందాకిని స్రుక్కి జారినది. అతని అవ తంస కుసుమమాల్యమైవ శశిరేఖ బ్రహ్మకపాల రంధ్రములో దూరినది మెడకు జుట్టుకొన్న ఫణి హారములు పట్టువదలి జారిపోసాగినవి. నొసటికన్ను అగ్ని

వలె మండ వొడగినది. ప్రమధులందరు భయపడి పోయిరి. ఉపనిషత్తు లొక్క పెట్టున ఘోషించి నట్లయినది. శివుని తల నడిమి ప్రదేశమునకు తగిలిన ఆ గాండీవము యొక్క దెబ్బకు జటా మండలములోని ఆకాశ గంగ యందలి అలల గుంపు గుమిగా చేరినట్టయినది.

"ఇంతేనా నీ బాహుబలము? ఆయుధములు నీ వద్ద లేకపోయినవి, మల్ల యుద్ధమునకైన రమ్ము" అని మాయా కిరాతుడు అర్జునుని బట్టుకొని మల్ల యుద్ధము లోనికీడ్చినాడు. వారిరువురు అనేకములగు మల్ల బంధ విశేషము లుపయోగించుచు మల్ల యుద్ధము చేయదొడగిరి. ఒక్కొక్క మారొక్కొక్కరిది పై చేయిగా కాన్పించుచుండెను. ఫల్గుణుడు మహా రోషముతో సింహమువలె శివునితో బోరాడసాగెను. శివు డాతనిని పెక్కు వంకలు పెట్టి అలసట పాల్జే యుచుండెను".

శంకరుడు పాండవ మధ్యముని పరాక్రమమును లోలోన మెచ్చుకొనుచు ఆతనితో బాహా బాహి భయంకరముగ ముష్టి యుద్ధమొనర్చు చుండెను. వీరి యుద్ధమును జూచి దేవతలు కనుమరుగై యంతరిక్షమున నిలిచి అమితాశ్చర్యము నొందుచుండిరి. "ఆహా ఏ మానవుడైన నింతవరకు మహేశునితో సరిసమా నమగు భయంకర యుద్ధము చేసి యుండెనా" అని అందరు దాని పర్యవసాన మెట్లుండునో చూడవలెనవి కుతూహలాయత్తులై చూచుచుండిరి.

ఇరువురి దేహముల మీద చెమట కాల్వలు కట్టి పారుచుండెను. జొడు గలుచుచు బొమ ముడివెట్టుచు' ముష్టా ముష్టి రణము చేయుచున్న శంభుని, నరుని జూచి ప్రకృతి స్తంభించి పోయెను. వృషాంకుడు కిరీటి వక్షము మీద బలముగ పొడిచెను. అర్జునుడు పిడికిటిపోటున ధూర్జటిని నొప్పించెను.

తుదకు శశాంక ధరునకు పార్థుని మీద దయ కలిగినది. "వీని శక్తి సామర్థ్యములను తుదముట్ట పరీక్షించితిని. వీర వతంసు డనుటలో సంశయము లేదు. ఇతడు పాశుపతాస్త్రము నొందుటకు తగిన వాడు కరుణించెదగాక" అనుకొని మహాదేవుడు పోరుచాలించి కిరీటియెడ తన నిజరూపముతో ప్రత్యక్ష మయ్యెను. అతనితో బాటు చెంచెత పార్వతియై పతి పజ్జ నిలిచినది. వేట కాండ్ర రూపమున నున్న ప్రమధులందఱు నిజరూపములతో బరమేశ్వరుని

బరివేష్టించి నిలిచిరి. చతుర్వేదములు, ఉపనిషత్గ్రంథములతో గూడి ప్రణవ మంత్రాక్షరములలో నా దేవ దేవుని నుతింపసాగెను.

అంత పార్థుడు సంతోష సంభ్రమములతో ఆనంద బాష్పలోచనుడై చేతులు రెండును మోడ్చి ఫాలభాగమున జేర్చి, పరమేశ్వరునికి దండ ప్రణామము లొనరించి భర్గు ననేక విధముల నుతింప దొడగెను.

"జయ పరమేశ్వరా! జయ జగన్నాథా! జయ పార్వతీ వల్లభా! జయ వృషధ్వజా! జయ నీలకంఠా! జయ శంకర! సాధువ శంకరా! రిపునా శంకరా! నీవే పరబ్రహ్మము. నీవే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడవు! శివా! నీవే ప్రసన్నశ్రీ విభ. రోగ్యాయుః ప్రావీణ్య ప్రాభవైక ఫలదుడవు. త్రిజగన్నివాసుడై, పన్నగ భూషణుడై, భక్త పరతంత్రుడయి, అత్యున్నత కరుణాగుణ సంపన్నుడయిన బాలేందు ధరుడవయిన నిన్ను గాంచి ధన్యుడ నయితిని. వాచామ గోచరుడగు నిన్ను గూర్చి తపస్సు చేసినందు కీవిధముగ నన్ను బరీక్షించి తుదకు నాయెడ ప్రసన్నుడవైతివా? దేవ దేవా! చంద్రకళా శేఖరా! వేదండ చర్మాంబరా! పినాక పాణీ! కృత్తివాసా! నా తపము ఫలించినది. నేనొనర్చిన పూజలు సార్థకమయినవి. మహాదేవా! నీకు సాటి యెవ్వరు? కైటభారాతి హాటక గర్భులు నీకు నమస్కరింతురు, నీ యందు జగములు, జగములలో నీవు క్రీడించు చుండుదు. నీమాయ నెఱుగ నెవ్వరి తరము! జయ చంద్రార్థ చూడామణీ! జయ సర్వలోక జనకా! సర్వేశ్వరా! జయ కామాంతకా! చక్షుశ్శ్రవః కుండలా! జయకామితార్థ ప్రదా! జయ శైలేంద్రజా వల్లభా! సంపూర్ణ కృపా గుణైక వసతీ! ఈశ్వరా జయ గిరీశా! దక్షాధ్వర మర్దనా! నీవొక కొండ కిరాతుడవని తలచి అసభ్యపు మాటల నెన్నిటినో యాడితిని. మూర్ఖుడనై బాణముల చేత, ముష్టిఘాతముల చేత నిన్ను నొప్పించితిని. గాండీవముతో తలపై మోదితిని. నీకు నేను పెక్కు విధముల ద్రోహము చేసితిని. నన్ను మన్నింపుము. నన్ను కరుణింపుము. నమస్తే నమస్తే జయ శంకరా!" అని అనేక రీతుల స్తుతించుచు విజయుడు శూలికి మరల మరల దండ ప్రణామము చేసి నిలుచుండెను.

అతని భక్తికి పరమేశ్వరుడు సంతసించి "పార్థా! నీ తపస్సునకు

మెచ్చితిని. నీ పరాక్రమమునకు సంతసించితిని. నీవు పాశుపతమును గోరిన సంగతి నేనెఱుగుదును. దాని నిమ్మందువా!" అనెను.

"శంభో! మహాదేవా! నేనింతకాల మీ ఇంద్రకీల పర్వతమున కాయ క్లేశములకోర్చి తపస్సు చేసినది పాశుపతాస్త్రము కొరకేకదా! నాయందు అనుగ్రహముంచి పాశుపతమును దయ చేయుము" అని అర్జునుడు వినిమితు డయి ఉమాపతిని వేడుకొనెను.

శివుడు పార్థునియెడ పరమ ప్రీతుడయ్యెను. ఆ సమయమున ఇంద్రాది దేవతలందఱు అచట ప్రత్యక్షమై మహాదేవునకు ప్రణమిల్లిరి. ప్రేత చేతస్కు డయిన త్రిపురాంతకుడంత మందస్మితుడయి అసమానమగు పాశుపత దివ్యా స్త్రమును ప్రయోగోప సంహారంబు, సకీలకంబు, సరహస్యంబుగా నా పాండు కుమారున కుపదేశించెను. అప్పుడు కిన్నరకింపురుష గరుడ గంధర్వ విద్యా ధరులు తమ తమ దివ్యాస్త్రముల నర్జునకిచ్చిరి. పార్వతీదేవి అక్షయ బాణ తూణీరము నిచ్చెను. దండ ధరుడు దండమును, పాశ పాణి పాశమును, ఇంద్రుడు వజ్రమును సమర్పించిరి.

ఈ రీతిగ అర్జునునకు వర ప్రదానము చేసి, ఈశానుడు సపరి వార ముగ నంతర్ధాన మొందెను. ఇది అర్జునుడు పాశుపతాస్త్రమును పొందువరకు జరిగిన కథ.

తదుపరి ఇంద్రుడు అర్జునుని మనసార కౌగిలించుకొని తపోనిష్ఠకు మెచ్చి పాశుపతాస్త్రమును పొందగలిగిన ప్రజ్ఞా పరాక్రమములకు మెచ్చి వాని కుశల వార్త, విజయవార్త రోమహర్షుడను ముని ద్వారా పాండవులకు కబురు పంపి దేవేంద్ర లోకమున కర్జునుని గొని పోయెను. అవన్నియు చూచుకొని అర్జునుడు తిరిగి వచ్చి కౌరవులు యుద్ధమునకు సంసిద్ధులను వార్త విని పాండ వులు కూడ యుద్ధమునకు సిద్ధమయిరి. చివరకు అర్జునుని పాశుపతాస్త్ర బలము వలనను, శ్రీకృష్ణుని అండ వలనను పాండవులే యుద్ధములో జయించిరి.

ఈ కథతో శ్రీనాథుని హరవిలాస కావ్యము ముగిసినది. శ్రీనాథుడు చిఱుతొండని కథ, గౌరీ కళ్యాణ కథ, హాలాహల భక్షణ కథ, మరియు

కిరాతార్జునీయము కథ ఇందు చెప్పినాడు. ఈ కథలలో భక్త సులభుడు ఈశ్వరుడు అను విషయము శ్రీనాథుడు చెప్పినాడు. అంతేకాదు శివుడు భక్తులను అడుగడుగున పరీక్షించుట కూడ చిఱుతొండని కథలో గౌరి కళ్యాణ కథలో కిరాతార్జునీయ కథలో ప్రత్యక్షముగా మనము చూచినాము నిజమందు భక్తుల కటువంటి పరీక్షలు తప్పవు. వారు భక్తులగుట శివుని పరీక్ష నెగ్గుటకే. శివుడే వేరు రూపములో వచ్చి భక్త రక్షణార్థము శివునే మరల దూషించినాడు. నిజమగు భక్తులు ఆ దూషణ భరింపజాలరు. కాబట్టియే వారి నిజ స్థితిని పరమేశ్వరుడు పరీక్షా మూలకముగా తెలికొన గోరి అట్లు చేసినాడు.

చిఱుతొండని కథ తమిళములో "అరవత్తు నాయనార్ల కథ" అను రానిలో కలదట. దాని నాధారము చేసికొని శ్రీనాథుడీ కథ వ్రాసి యుండవచ్చును పాశుపతాస్త్రము గురించిన కథ భారతములో, శివ పురాణములో, కలదు. ఇది పురాణమూధారమైనదే, హాలాహల భక్షణ కథ కూడ పురాణాధారమైనదే. భాగవతములో నీ కథ గలదు. గౌరీ కళ్యాణము కూడ నంతియే. శివుని లీలలు, వాటి మాహాత్మ్యము చెప్పదలచి శ్రీనాధుడు భక్తి పరతంత్రుడై ఈ కథల నన్నింటిని ఈ గ్రంథములో కూర్చినాడు.

ఈ కథలన్నింటిలోను శ్రీనాథ మహాకవి ఆగమోక్తమైన శైవమును ప్రతిపాదించుటకు పూనుకొనెనని చెప్పుట ఉక్తి సహితముగా నుండును.

## శివరాత్రీ మాహాత్మ్యము-శైవనిరతి

శ్రీనాథుడు వ్రాసిన శైవ కావ్యములలో కడపటిది 'శివరాత్రీ మాహాత్మ్య'మని చెప్పవచ్చును. ఈ కావ్యము శ్రీశైలములోగల శాంబిబి షావృత్తికంకితము చేసినట్లు తెలియుచున్నది. కాశీఖండములో వలెనే ఈ కావ్యములో కూడ శ్రీనాథుడు, ఎన్ని పాపములు చేసినను శివనామము జపించినను, శివరాత్రి వ్రతము చూచినను వారికి మోక్షము తప్పక లభించునని నిరూపించినాడు.

ఆచార్య బిరుదు రాజు రామరాజుగారు శివరాత్రీ మాహాత్మ్య గ్రంథము తాళపత్ర ప్రతిని సంపాదించి పరిష్కరించిరి. శివరాత్రీ మాహాత్మ్యమునకు

మూలము స్కాంద పురాణాంతర్గతమగు ఈశాన సంహిత.* దీనిలో 336 అనుష్టుప్పులందున్న మూడధ్యాయముల కథను శ్రీనాథు డనేక వర్ణనలతో పెంచి ఐదాశ్వాసముల ప్రబంధముగా తీర్చి దిద్దినాడు.

శౌనకాది మహా మునులకు సూతుడు శివరాత్రి మాహాత్మ్యమును చెప్పుచు ఈ కథా ప్రారంభ మిట్లు చేసెను. ప్రళయాంతమున శ్రీమన్నారాయణుడు వరాహ రూపమున భూమి నుద్ధరించి గర్వముతో క్షీర సాగరమున శయనించెనట, ఇంత వరకు నిద్రించు చుండిన బ్రహ్మ శివుని అనుగ్రహము చేత లోకములను సృష్టి చేసినాడు. అందుచేత తానే సృష్టికర్తనని గర్వించి నారాయణ మూర్తిని కవ్వించెను. వీరిద్దరు పరస్పరము అహంకరించిరి. కలహించి యుద్ధము చేయుటకు సిద్ధమయిరి. తమ దగ్గర యుండిన పాశుపతాస్త్రములను ఒకరి మీద నొకరు ప్రయోగించుకొనిరి. దాని వలన లోకమంతయు ఆహాకారములు చెలరేగెను ఆ పాశు పతాస్త్రములను ఉపసంహరించుటకు వారికి శక్తి లేక పోయెను. అప్పుడు బ్రహ్మను విష్ణుమూర్తిని కాపాడదలచి లోకమును సంరక్షింప బూనుకొని మహేశ్వరుడు మహా నలస్తంభమూర్తిగా ఆవిర్భవించెను. ఈ అద్భుతమునకు బ్రహ్మవిష్ణువు ఆశ్చర్యపడి యుద్ధము మాని వేసిరి.

గీ॥ "నీ మహత్త్వంబు వర్ణింప నేరమేము
నిన్ను తెలియంగ నేరము నిజముగాగ"

యని అతని శరణు వేడిరి. అప్పుడు వారికి శివుడు శివరాత్రి వ్రతమును ఉపదేశించెను.

ఈ కథ స్కాంద పురాణమున లోక సృష్టిని గురించి చెప్పుచున్నది. త్రిమూర్తులలో శివుని ఆధిక్యమును ప్రతిష్ఠాపించు చున్నది. శివరాత్రి వ్రతమునకు మూలభూతమై నిలచినది. ఇది పురాణాంతర్గతము గాబట్టి ఆగమ శైవ విధానమే దీని యందున్నదని వేరుగ చెప్పబనిలేదు.

---

* ఆంధ్ర సాహిత్య పరిషత్ప్రకాశితము - 44 కాకినాడ

ఇంక శివరాత్రి మాహాత్మ్యములో ద్వితీయాశ్వాసము మొదలు 'సుకుమార చరిత్రము' వివరింపబడినది. దండకారణ్యమున రత్నపురి రాజధానిగా హేమాంగదుడను శబర రాజు పాలించుచుండెను. అతనికి మంత్రి యజ్ఞదత్తుడు. యజ్ఞదత్తుని భార్య సుశీల. ఆమెకు చాల కాలము సంతానము లేకుండెను ఎన్నో వ్రతములు, దాన ధర్మ దేవతారాధనంబులు సలుపగా, వాటి ఫలితమో యనునట్లు ఆమె గర్భవతి యయ్యెను. సుశీల గర్భవతిగా నున్నప్పుడు గర్భవతులగు స్త్రీల లక్షణ ములన్నియు శ్రీనాథుడు ఈ కావ్యములో కన్నులకు కట్టినట్లు వర్ణించినాడు.

నవమాసానంతరము ఒక శుభ ముహూర్తమున ఆమెకు కొడుకు పుట్టెను.

క॥ నవ మాసంబులు నిండి
ధవళేక్షణ గాంచె సుతు సుధాకర తారా
రవి బుధ ధిషణ విధుం తుద
కవులుచ్చగము గను నమృత ఘటికలు సడువన్

(శి.మా.ద్వి.ఆ 67)

ఈ వార్త అంతఃపురములో పరిచారికలు అంతటను వ్యాపింప జేసిరట. ఇంకను

సీ॥ "తల యంపి ధవళ ముద్రా పుంభ మిడు వారు
రక్షా భసిత రేఖ వ్రాయువారు"

ఇట్లు పలు విధములు పలువురు పుట్టిన బిడ్డకు ఉపచారములు చేయుచు విభూతి కూడ నలమి నట్లు కవి చెప్పినాడు. శివుని భక్తులకు విభూతియే రక్ష యను సంప్రదాయ మిచట గోచరించు చున్నది. ఈ బిడ్డనికి సుకుమారుడను నామకరణము చేసిరి. ఇతడు పెరిగి పెద్దవాడై బాల్య దశలోనే సకల విద్యలు, వేదము మున్నగునవన్నియు బాగుగా నేర్చినాడట.

యౌవన మాసన్నమగు కొలది దురదృష్ట వశమున జూదము మున్నగు దురభ్యాసములకు లోనైనాడు. ఇట్లుండుట చూచి తల్లి దండ్రులు చేర బిలిచి

వానికి హిత బోధలు చేసిరి. అవన్నియు విన్నప్పుడు అపమార్గమునుండి తప్పించుకొని మంచి మార్గములో ప్రవేశించ వలెనని ఆతడు భావించును. కాని అతడు దురభ్యాసములకు లొంగిపోయి, అందుండి విడివడ జాలక యథా ప్రకారము అపమార్గములోనే నడచు చుండెను. తల్లి దండ్రులే కాక మిత్రులు మున్నగు వారంతా కూడా వానికి హిత బోధలు చేసిరి. ఎవరెన్ని చెప్పినను వినలేదు.

ఇక తృతీయాశ్వాసములో సుకుమారుని దౌష్ట్యము పెచ్చుపెరుగుట వర్ణింపబడినది. ఇది ప్రజలు సహించలేక రాజునకు విన్నవించగా, రాజు యజ్ఞదత్తుని మొఖము చూచి వాని నేమియు చేయజాలక దేశ బహిష్కరణ మాత్రము చేయును. రాజునకు మంత్రి యందు ఎనలేని గౌరవభావము కలదు. కాని సుకుమారుడు చేయు పనులు మాత్రము క్షమించ రానివిగా నున్నవి. తృతీయాశ్వాసములో సుకుమారుని దుశ్చేష్టలన్నియు వర్ణింప బడినవి.*

రాజాజ్ఞ ప్రకారము సుకుమారుడు దేశము విడిచి కీకట దేశము మీదుగా హూణ మండలము చేరును. అచట అడవిలో ఒక కొలనిలో నీళ్ళు త్రాగుచూ తామర తూడులు తింటూ కాలము గడుపు చుండగా ఇంటివద్ద తల్లి పెట్టిన వన్నియు జ్ఞప్తికిరాగా తనలో

చ॥ అరుణ గభస్తిబింబ ముదయాద్రి పయిం బొడతేర గిన్నెలో
బెరుగును వంటకంబు వడపిందియలుం గుశువంగ బెట్టు ని
ర్భర కరుణా ధురీణయగు ప్రాణము ప్రాణము తల్లీ యున్నదే
హర హర యెవ్వరింక గడుపారని పెట్టెద రీప్సితాన్నముల్.

(శి.మా.తృ. ఆ 18)

ఇట్లు తలపోయుచు ముందునకేగి అడవియందు తిరిగి అలసిపోయి అచటనే నిద్రించెను.

---

* శి.మా..తృ.ఆ 12, 13 పద్యములు

గీ॥ బహుల పక్ష క్షపాకదంబముల లోన
ప్రభవ మొందిన యంధకారంబువోని
కొలని దరి కా నంబులో గొంత ప్రొద్దు
నలవు వాయంగ నిద్రించె యాజ్ఞదత్తి. (ఆ. 9)

ఇట్లుండగా నొక దినంబున ఒక చండాల స్త్రీ ఋతు స్నానము చేయుటకు అక్కడి కేతెంచెనట. ఆమెను చూచుట తోడనే సుకుమారుడు మోహావిష్టుడగును. ఆమెను కామించగా, ఆమె కూడ వీనికి తోడ్పడును. వీరిరువురు రహస్యముగా ఒక భద్రకాళి గుడియందు కాపురము చేయుట మొదలిడిరి. సుకుమారు డన్ని శాస్త్రములు చదివినవాడు, ఆచార వ్యవహారములన్ని తెలిసిన వాడగుటచే వీనిని స్వచ్ఛమయిన బ్రాహ్మణుడని అచటి వారందరూ భావించి భోక్తగా పిలుచుటకు ప్రారంభించిరి. ఆ విధముగా అచట సుకుమారుడు కాలము గడిపెను.

కాలక్రమమున అచట కూడ ప్రజలకు వీని దర్వృత్తి తెలిసి ఊరినుండి బహిష్కరించ వలెనని లేదా దండించ వలెనని నిశ్చయించు కొనిరి. ఇది తెలిసిన సుకుమారుడు చెండాల స్త్రీతో సహా అచటి నుండి పారిపోవును.

ఇక చతుర్థాశ్వాసంలో సుకుమారుడు ఆ స్త్రీతో కిరాత దేశములోని బ్రహ్మపురివాడ చేరుట చెప్పబడినది. సుకుమారుడు బాగుగా చదివినవాడు. చండాల స్త్రీ చాల అందగత్తె. సుకుమారునివలన ఆమెకు కొంత సంస్కారమలవడును. వారిరువు అచట బ్రహ్మణ దంపతుల వలె మసలుకొనుచుండిరి. అక్కడి ప్రజలు కూడ సుకుమారుడు బాగుగా చదువుకున్నవాడని, యజ్ఞములకు, యాగములకు మొదలగు కార్యక్రమములకు పిలిచెడివారు. జీవితము హాయిగా గడచినది. సుకుమారునకు చండాల స్త్రీ వలన ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కలిగిరి. పిదప కొన్ని దినముల కాచండాల వనిత కన్ను మూసినది.

సుకుమారుడు కన్న బిడ్డలతోనే పాపకార్యము చేసినంతటి దుర్మార్గుడు. అరువది, డబ్బది వయస్సులో వారి కొఱకు పువ్వులు తెచ్చుటకు అడవికేగగా అచ్చట ఒక చోట నాగేశ్వరుని గుడి కలదట. యాదృచ్ఛికముగా గుడిలోనికి

ప్రవేశించి శివరాత్రి వ్రతము జరుగు చుండగా చూచును. పిదప ఇంటికి తిరిగి వచ్చును. తదుపరి కొలది దినముల కాతడు కూడ మరణించును.

కాలకింకరులు వాని గొనిపోవుటకు వత్తురు. కైలాసమునకు గొని పోవుటకు శివకింకరులు ఒక వైపు వత్తురు. వీరిరువురు 'వీడు మావాడంటే మావాడని వాదోప వాదములు చేసికొందురు. సుకుమారుడు చేసిన పాపకృత్యములన్నియు ఒక దాని వెంట నొకటి చెప్పి ఎట్టైననూ యమలోకమునకు తీసికొని పోవలసి నదే నని యమభటులు పట్టు పట్టెదరు. ఈతడు చేసిన పాపకార్యములన్ని చెప్పి ఇంకను యమభటులు ఇట్లనుచున్నారు.

సీ॥ కేలుదో యెత్తి మ్రొక్కనె పాశుపతులకు
శరణార్థి యనియెనే జంగములకు
ఫాల భాగమునందు భస్మంబు పూసెనే
యఱుత దాల్చెనె రుద్రాక్షపూస
శివ మంత్ర ముచ్చరించెనె జిహ్వ తుదయందు
నరిగెనె యెన్నడే నభవుగుడికి
బఠియించెనే మహాప్రమథ చారిత్రంబు
తిరిగెనే మృడు పుణ్య తీర్థములకు

గీ॥ దోసములు పెక్కు చేసిన జేసేగాని
కాలగళు భక్తి యావంత గలిగె నేని
యడ్డుపడ ధర్మమౌ గాక యనఘులార
యర్హమే యీ దురాత్మున కడ్డుపడగ

(59)

ఉ॥ ఎట్టుగ నేగు దంచితిరి యిందు కళాధర భృత్యులార యీ
చెట్ట దురాత్మునిన్ హరుని చెంతకునుం గొనిపోవువారలై
యెట్టొకొ శంకరుం డొకని నెవ్వనినే గొనితేర బంపినం
బట్టగ వచ్చినారొ తడబాటున వీని మతిభ్రమంబునన్

(60)

యమ భటు లీవిధముగా శివకింకరులకు సుకుమారుని దోషములెత్తి చూపి, వాడెన్నడు శివుని ధ్యానించుటగాని శివ మంత్ర ముచ్చరించుట గాని శివాలయ మున కేగుటగాని :సి యుండలేదు. ఏ పుణ్య క్షేత్రములు కూడ దర్శింపలేదు. పెక్కు దోషములు చేసినప్పటికిని కొంచెమైనను భక్తి భావము కలిగియున్న యడ్డుపడవచ్చును. ఏదియు లేకుండ ఈ విధముగా నడ్డుపడుట ధర్మము కాదని యమ కింకరులు శివ భటులతో ననిరి. ఈ విధముగా యమభటులు, శివ కింకరులు వాదోప వాదములకు గురియై చివరకు యుద్ధమునకు తలపడిరి. ప్రమథ గణము లెట్టైనా ఉద్ధృతి గలవారు కనుక యమభటులను చావగొట్టి సుకుమారుని కైలాసమునకు తీసికొని వెళ్ళిరి. ఇంతటితో చతుర్థా శ్వాసము ముగిసినది. ప్రాచీన కావ్యములలో నింతవరకే ఉన్నట్టు, ఇంక పంచమాశ్వాసము లోని కథ ఆచార్య బిరుదురాజు రామరాజు గారికి దొరికిన తాళ పత్రములో నున్నట్లు వారు తమ 'శివరాత్రి మాహాత్మ్యము'లో పేర్కొనిరి. ఇంక పంచమా శ్వాసము యమభటులు వెళ్ళి యమునితో జరిగిన వృత్తాంత మంతయు చెప్పి మొర పెట్టుకొనుటతో ప్రారంభ మగుచున్నది.

ఈ 'ప్రమథ గణములు చేసిన పనియేమ'ని యముడు ప్రశ్నించుకొని తనికీ అశక్త్యాధికార మెందుకు ? శివునే ఆమాట అడిగెదనని యముడు చిత్ర గుప్తునితో కూడి కైలాసమున కేగును. అంత చిత్రగుప్తుడు సుకుమారుని దుశ్చేష్టితములన్నియు ఏకరువు పెట్టెను.

కైలాసమునకుపోయి యముడు శివునితో "ఎంతో కాలమునుండియు ధర్మ బద్ధముగా చేయుచుంటిని కదా, ఇప్పుడీ వైపరీత్యమేమి ? ఈ యమ పదవిని మీరే తీసి కొనండి. నాకక్కర లేదని' పలికెను. అంత శివుడు

శా॥ జ్ఞానా జ్ఞాన కృతంబు లయ్యు పశుహింసా బ్రహ్మహత్యా సురా
పాన స్తేయము లాదిగా గలుగు పాపంబుల్ దహించున్ నిమే
షానన్ శంభు నిశావ్రతంబు ప్రబలజ్వాలా వృతం బగ్నియె
ట్లెనిన్ గాలుచు నార్ద్ర శుష్కముల నొక్కింతి ధర్మ
భారంబులన్

ప్రవేశించి శివరాత్రి వ్రతము జరుగు చుండగా చూచును. పిదప ఇంటికి తిరిగి వచ్చును. తదుపరి కొలది దినముల కాతడు కూడ మరణించును.

కాలకింకరులు వాని గొనిపోవుటకు వత్తురు. కైలాసమునకు గొని పోవుటకు శివకింకరులు ఒక వైపు వత్తురు. వీరిరువురు 'వీడు మావాడంటే మావాడని వాదోప వాదములు చేసికొందురు. సుకుమారుడు చేసిన పాపకృత్యములన్నియు ఒక దాని వెంట నొకటి చెప్పి ఎట్టైననూ యమలోకమునకు తీసికొని పోవలసినదే నని యమభటులు పట్టు పట్టెదరు. ఈతడు చేసిన పాపకార్యములన్ని చెప్పి ఇంకను యమభటులు ఇట్లనుచున్నారు.

సీ॥ కేలుదో యెత్తి మ్రొక్కనె పాశుపతులకు
శరణార్థి యనియెనే జంగములకు
ఫాల భాగమునందు భస్మంబు పూసెనే
యఱుత దాల్చెనె రుద్రాక్షపూస
శివ మంత్ర ముచ్చరించెనె జిహ్వ తుదయందు
నరిగెనె యెన్నడే నభవుగుడికి
బఠియించెనే మహాప్రమథ చారిత్రంబు
తిరిగెనే మృడు పుణ్య తీర్థములకు

గీ॥ దోసములు పెక్కు చేసిన జేసెగాని
కాలగళు భక్తి యావంత గలిగె నేని
యడ్డువడ ధర్మమౌ గాక యనఘులార
యర్థమే యీ దురాత్మున కడ్డువడగ

(59)

ఉ॥ ఎట్టుగ నేగు దెంచితిరి యిందు కళాధర భృత్యులార యీ
చెట్ట దురాత్మునిన్ హరుని చెంతకునుం గొనిపోవువారలై
యెట్టొకొ శంకరుం డొకని నెవ్వనినే గొనితేర బంపినం
బట్టగ వచ్చినారొ తడబాటున వీని మతిభ్రమంబునన్

(60)

యమ భటు లీవిధముగా శివకింకరులకు సుకుమారుని దోషములెత్తి చూపి, వాడెన్నడు శివుని ధ్యానించుటగాని శివ మంత్ర ముచ్చరించుట గాని శివాలయ మున కేగుటగాని చేసి యుండలేదు. ఏ పుణ్య క్షేత్రములు కూడ దర్శింపలేదు. పెక్కు దోషములు చేసినప్పటికిని కొంచెమైనను భక్తి భావము కలిగి యున్న యడ్డపడవచ్చును. ఏదియు లేకుండ ఈ విధముగా నడ్డుపడుట ధర్మము కాదని యమ కింకరులు శివ భటులతో ననిర. ఈ విధముగా యమభటులు, శివ కింకరులు వాదోప వాదములకు గురియై చివరకు యుద్ధమునకు తలపడిరి. ప్రమథ గణము లెట్టైనా ఉద్ధృతి గలవారు కనుక యమభటులను చావగొట్టి సుకుమారుని కైలాసమునకు తీసికొని వెళ్లిరి. ఇంతటితో చతుర్థా శ్వాసము ముగిసినది. ప్రాచీన కావ్యములలో నింతవరకే ఉన్నట్టు, ఇంక పంచమాశ్వాసము లోని కథ ఆచార్య బిరుదురాజు రామరాజు గారికి దొరికిన తాళ పత్రములో నున్నట్లు వారు తమ 'శివరాత్రి మాహాత్మ్యము'లో పేర్కొనిరి. ఇంక పంచమా శ్వాసము యమభటులు వెళ్లి యమునితో జరిగిన వృత్తాంత మంతయు చెప్పి మొర పెట్టుకొనుటతో ప్రారంభ మగుచున్నది.

ఈ 'ప్రమథ గణములు చేసిన పనియేమ'ని యముడు ప్రశ్నించుకొని తనికీ అశక్యాధికార మెందుకు ? శివునే ఆమాట అడిగెదనని యముడు చిత్ర గుప్తునితో కూడి కైలాసమున కేగును. అంత చిత్రగుప్తుడు సుకుమారుని దుశ్చేష్టితములన్నియు ఏకరువు పెట్టెను.

కైలాసమునకుపోయి యముడు శివునితో "ఎంతో కాలమునుండియు ధర్మ బద్ధముగా చేయుచుంటిని కదా, ఇప్పుడీ వైపరీత్యమేమి ? ఈ యమ పదవిని మీరే తీసి కొనండి. నాకక్కర లేదని' పలికెను. అంత శివుడు

శా॥ జ్ఞానా జ్ఞాన కృతంబు లయ్యు పశుహింసా బ్రహ్మహత్యా సురా
పాన స్తేయము లాదిగా గలుగు పావంబుల్ దహించున్ నిమే
షానన్ శంభు నిశావ్రతంబు ప్రబలజ్వాలా వృతం బగ్నియె
ట్లైనన్ గాలుచు నార్ద్ర శుష్కముల నొక్కింతి ధర్మ
భారంబులన్

జ్ఞానము కలిగియు అజ్ఞానము చేతను పశుహింస బ్రహ్మహత్య సురాపానము చేయుట మొదలైన పాపములు చేయగా ఆపాపము లన్నింటిని శివరాత్రి వ్రతము క్షణకాలములో నశింప చేయును. ఎట్లనగా ఉన్నతమైన జ్వాలలు ఎండిన గడ్డి పరకలను కట్టల సమూహములను క్షణకాలములో కాల్చినట్లు పాపము నశించును. ఇంకను-

"ఇది ధర్మ సూక్ష్మము. నీవెరుగవు. ఈతడు శివరాత్రిని దర్శించుటచే పాపములన్నియు పటాపంచ లయి పోయినవి. శివరాత్రి వ్రతము ఎంతయో పవిత్రమయినది. నీవు కూడ చేయవలసినదని శివుడు వివరించినాడు. యముడు కూడ శివరాత్రి వ్రతము చేయును. శివ కింకరుల లక్షణములు చెప్పి భటులకు వారి జోలికి పోరాదని సలహా నొసంగును. ఇది శివరాత్రి మాహాత్మ్యము కథ. ఇందు శ్రీనాధుని కథానిర్వహణ పద్ధతి, భక్తిభావా విష్కృతి, మూర్తి సాక్షాత్కారము ఎన్నదగిన అంశములు. ఎన్ని పాపములు చేసినను భక్తి భావ సమన్వితులైతే చాలునట శరణాగతి చూపిన భగవంతుడు కరుణించునన్న ఉపదేశము చేయుటే ఈ కావ్యరచనోద్దేశము1. శివరాత్రిని యాదృచ్ఛికముగా దర్శించినంత మాత్రముననే అట్టి దుర్మార్గుడు పవిత్రుడయినాడు. శివరాత్రి విశిష్టత అట్టిదని ఈ కావ్యములో శ్రీనాథుడు నిరూపించినాడు.

శివరాత్రి మాహాత్మ్యమును ప్రాచీన పురాణమైన ఈశాన సంహిత చెప్పుచున్నది దీనిలో శివరాత్రి పుణ్యదినమున శివ భక్తులు చేయు వ్రతాచరణము ప్రధానమైన విషయము.ఆవ్రతాచరణము వలన ఎంతటి అసంభవ విషయమైనను సమకూడునను ని చెప్పుటయే దీనిలోని ముఖ్య విశేషము.

శ్రీనాథుడు శైవనిరతి కలిగిన వాడనుట యదార్థము. కాని వీరశైవుల వలె ఏ సందర్భమునకు ఈ శైవ కవి 'పరమతనింద' చేసిన వాడు కాదు. ఇట్లు చూడగా పురాణోక్తమై ఆగమ సంప్రదాయము ప్రకారము త్రిమూర్తులు సృష్టి స్థితి లయకారకులని సమాన మహిమాన్వితులని ఒకరిని దూషణచేసిన వేరొకరిని నిందించినట్లే యని శ్రీనాథుడు భావించె ననుట స్పష్టము. ఇదియే ఈ మహాకవి శివతత్త్వ నిరూపణము.

---

1. ఆచార్య బిరుదురాజు రామరాజు (శివరాత్రి మాహాత్మ్యం)
శ్రీనాథకవితా వైజయంతి.

# ప్రబంధ యుగము – శైవసంప్రదాయములు

ఆంధ్ర వాఙ్మయములో 'స్వర్ణయుగ' మని పేరుపొందినది ప్రబంధ యుగము లేక శ్రీకృష్ణదేవరాయల యుగము. ఇంతవరకు ఆంధ్ర వాఙ్మయములో వెలువడిన కావ్యముల కంటే భిన్న రీతిని రచనలు వెలువడి 'ప్రబంధము' అను ప్రత్యేక ప్రక్రియ వెలువడుటే ఈ యుగము ప్రత్యేకత. అష్టాదశ వర్ణనలుండవలెనన్న నిబంధన విధిగా పాటింపబడి పెక్కు రచనల కాలవాలమైనది రాయల యుగము. కేవలము కల్పిత కథల నాధారముగా జేసికుని, అలంకార ప్రాయమైన వర్ణనలతో పెక్కు మంది కవులు కావ్య రచన చేసిరి. ద్వ్యర్థి కావ్యరచన కూడ ఈ యుగములో జరిగినది. లలిత కళలు, సంగీతము, సాహిత్యము చోటుచేసికున్న ఈ యుగములో నివసించిన కవులు రచనలో ప్రత్యేకత చూపిరి.

స్వర్ణ యుగము అనిపించుకున్న ఈ ప్రబంధ యుగములో ప్రజలకు గాని, పరిపాలకులకుగాని, కవి పండితులకుగాని మతము పట్ల అధికమైన ఆసక్తి యున్నట్లు కాన్పించదు. అందుచేతనే గడచిన శతాబ్దములలో మనకు కన్పించెడి సిద్ధాంత రూపమైన మత సంఘర్షణలుగాని ప్రజలలో విభేదరూపమున వెలువడిన సంఘర్షణలు కాని కాన్పించవు. ఈనాటి వారు మతమును తమ జీవితవిధానములో ఒక భాగముగా భావించి అనుసరించుచువచ్చిరి. అంతే కాని మతమే తమ జీవితమని వారు భావించిన వారు కాదు. ఈ సాహిత్య యుగమునకు అధినేత అయిన రాయలు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణము నందు పాల్గొనుటయేకాక శ్రీశైల క్షేత్ర గోపురములను, ద్వారములను కట్టించెను. అట్లే తెనాలి రామలింగడు వంటి కవులు ఉద్భటారాధ్య చరిత్ర వంటి శైవ కావ్యములను వ్రాసియు, పాండురంగ మాహాత్మ్యము వంటి ప్రబంధములు కూర్చియు మతముపై వారి కుండిన సామరస్యమును ప్రకటించుకొనిరి

ఇక పెద్దనాది కవుల చూడగా మతప్రమేయము వారికి పట్టనట్లే కాన్పించును. మను చరిత్ర, వసు చరిత్ర, రాజశేఖర చరిత్ర వంటివి అనేకములు మతస్పర్శ లేకయే వెలువడినవి.

ఈ విధముగా మత స్పర్శ లేక వెలువడిన కావ్యములే అయినప్పటికి పెద్దనగారి మను చరిత్రలో, రామరాజభూషణుని వసు చరిత్రలో శివపరమైన స్తుతి అవతారికా పద్యములలో కన్పించుట విశేషము. వైష్ణవద్వేషము లేదు. కాని శైవారాధన కలదు. ఇది శైవమత విశిష్టతను చాటు విశేషమనియే చెప్ప నగును. రాయలు వైష్ణవుడైనప్పటికి శివుని ద్వేషించినవాడు కాడు. ఇంత పరమత సహనము కలిగిన వ్యక్తి గాబట్టియే రామలింగడు, ధూర్జటి తమ అష్ట దిగ్గజములలో పేరుపొందగలిగినారు.

ఇటువంటి వాతావరణములో కొన్ని వైష్ణవ ప్రబంధములు, శైవప్రబం ధములు అనాడు రచితములైనవి. తెనాలి లింగని ఉద్భటారాధ్య చరిత్ర, ధూర్జటికవి శ్రీకాళహస్తి మాహాత్మ్యము ఈ సందర్భములో పేర్కొన దగినవి. వీనికి పరమత ద్వేషము లేని మాట యదార్థమే అయినను ఈ రెండు కావ్యము లలో శైవమతస్పర్శ స్పష్టముగా కాన్పించును.

ఇక తెనాలి రామలింగడు ఉద్భటారాధ్య చరిత్ర కాక పెక్కు కావ్య ములు రచించినాడు. రామలింగని రచనలు నిడదవోలు వెంకటరావు గారు 'ఉద్భటారాధ్య చరిత్ర' పీఠికలో పేర్కొనిరి. అ క్రమ మిట్లున్నది. 1) లింగ పురాణము 2) ఉద్భటారాధ్య చరిత్ర. 3) కందర్పకేతు విలాసము. 4) హరి లీల విలాసము. 5) పాండురంగ విజయము 6) పాండురంగ మాహాత్మ్యము. 7) ఘటికాచల మాహాత్మ్యము. ఇందు మొదటి నాలుగు కావ్యములు రామలింగ నామముతో వెలయుచున్నవి. మిగిలిన మూడు కావ్యములు రామకృష్ణుని నామ ముతో వెలయుచున్నవి. రామలింగ కవి మొదట శైవుడుగా నుండి తరువాత వైష్ణవుడుగా మారినట్లు విదితమగుచున్నది. పై కావ్యములలో ఉద్భటారాధ్య చరిత్ర, పాండురంగ మాహాత్మ్యము, ఘటికాచల మాహాత్మ్యములు సంపూర్ణ ముగాలభ్యమగుచున్నవి.[1] కందర్పకేతు విలాసము, హరిలీలా విలాసము, పాండు

1) ఉద్భటారాధ్య చరిత్ర పీఠిక శ్రీ నిడదవోలు వెంకటరావుగారు.

రంగ విజయము లసంపూర్ణములు. ఈ కృతులకు సంబంధించిన పద్యములను లభ్యమైన వాటిని నిడదవోలు వెంకటరావుగారు ఉద్భటారాధ్య పీఠికలో ఉదహరించిరి ఇంక పాండురంగ విజయము, పాండురంగ మహాత్మ్యము, ఈ కృతుల విషయములో భిన్నాభిప్రాయములున్నట్లు నిడదవోలు వారి పీఠిక వలన తెలియుచున్నది. మొత్తము మీద 'పాండురంగ విజయము' కూడ రామ లింగడు రచించినట్లు తెలిపిరి1.

దేచమంత్రి, గోపమంత్రికి ''రాజ కార్య నిర్వాహకుడ''నియు గోప మంత్రి భూభరణ సౌధమునకు స్తంభము వంటివాడనియు వర్ణించుటచేత నితడు రాజ తంత్ర ప్రవీణుడని విశదమగుచున్నది, ఈతడు మంత్రి మహా పరాక్రమశాలి. 1) నిబిడ భుజాబల విడంబిత కుమారుడు 2) దోః ఖడ్గలతా నిష్పీడిత విమత నృపుడు. 3) ప్రతాపానలుడు అన్న విశేషము లీయంశమును ధ్రువ పఱచు చున్నవి.

దేచ మంత్రి శివ పూజా పరాయణు డగుటయేగాక శివస్తోత్ర సాహిత్య మును నాకళించుకొన్నవాడు. శివ స్తోత్రముల నాతడు నిత్యము పఠించువాడని రామలింగకవి యిట్లు చెప్పెను.

> భవానీ శ స్తవోచ్చారణ ప్రావీణ్యు క్షమ భావ (1-205)
> శంభుస్తుతి పఠన దురీణ (3-1)

అను సంబోధనలలో నీ విషయము సూచితము.

ఇంకను దేచ మంత్రి - ఉద్భటారాధ్య వంశీయుడగు చంద్ర శేఖర గురు శిష్యుడు - ఆతని శివ పూజా ధురంధరత్వమును రామలింగ కవి వర్ణించినాడు.

ఇంకను ఉద్భటారాధ్య చరిత్రలో సందర్భాను సారముగా దేచ మంత్రి శివధ్యాన పరాయణత్వము సూచితమైనది.

---

1) ఉద్భటారాధ్య చరిత్ర పీఠిక శ్రీ నిడదవోలు వెంకటరావుగారు.

ఇంతటి శివధ్యాన తత్పరుడయిన దేచ మంత్రికి రామలింగడు కృతి నిచ్చుట అతిశయోక్తికాదు. రామలింగము వంశము వారందరు శివధ్యాన తత్పరులను విషయము వారి వంశము వారి వివరములవలన అవగతమగు చున్నది. రామలింగడు కూడ నట్టివాడే. ఉద్భటుని కథ వీరశైవ సంప్రదాయ ములో కూడ నుండుటచే ఆనాటి ఆచార వ్యవహారములలో కొన్ని ఈ కావ్య ములోనున్నను అంతమాత్రమున రామలింగడు వీరశైవుడనిగాని తన్ మతాను యాయి అనిగాని అనలేము.

## ఉద్భటారాధ్య చరిత్ర - కథావిశేషములు

"ఉద్భటారాధ్య చరిత్ర" యను పేరు ఈ కావ్యమునకు సార్థకమే. ఉద్యటుడను ఒక శైవాచార్యుని కథ దీనిలో ప్రధానేతి వృత్తము. ఇది కొంత వరకు చారిత్రకమునగునేమో యని విమర్శకు లూహింతురు. ఎందుచేతననగా ఈకథను పాల్కురికి సోమనాథుడు తన బసవపురాణములో చెప్పియుండెను.1 కాని రామలింగనికి చారిత్రక దృష్టి లేదు. ఇత డతనిని పౌరాణిక వ్యక్తిగానే పరిగణించి సూతుడు శౌనకాది ఋషులకు చెప్పినట్లు ప్రారంభించెను. ఇది పురాణ పద్ధతియేకదా.

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు కైలాస పర్వతమున ఉద్యానవనము నందు విహారార్థము వచ్చిరి. అదే సమయమున కొందఱు గంధర్వ దంపతలు కూడ నచ్చటికి వచ్చిరి. వారివలన ఉమా మహేశ్వరుల విహారమునకు భంగము కలిగెను. శివుడు వారుచేసిన అపచారమునకు కోపించి వారిని 'పిశాచ రూపులు కమ్మని' శపించెను వారు వెంటనే పిశాచములైరి. తమ తప్పును తెలిసి కొని గంధర్వులు శివుని వేడగా అతడు వారి శాపవిమోచనకు తెలియ జేసెను. అదే మనగా భూలోకమున 'ఉద్భటుడు' అనెడు శైవగురువు ఉద్భవించును. అతడు పల్లకీ పురము నందుండును. అతడు శివసాయుజ్యము చెందిన తరువాత అతని శివధూమము మీకుతగిలినంతనే పూర్వమున్న గంధర్వ రూపము వచ్చును.

1) బసవపురాణము - సప్తమాశ్వాసము.

శివుని మాట విని గంధర్వులు వల్లకీ పురమునకు వెడలి అచట ఒక మఱ్ఱిచెట్టును నివాసము చేసికొనిరి.

శివుని యొక్క భయంకరమైన కోపముతో కూడిన శాపము మిచ్చు చున్న వదనమువలెను, దేవతల సమూహములు ఆకాశములో తిరుగుచు ధ్వనులు చేయగా ఆధ్వనులు ఎండుచున్నవట వృక్షమునకు శివుని చేత నిర్దేశింపబడిన కొండవంటి ఉన్నతమైన ఆవటవృక్షమునకు వారు విచ్చేసిరి.

ఆ వృక్షము యొక్క ఆకులతో గూడిన కొమ్మలందు ఊడలు వ్రేలాడి యుండి ఆకాశ మార్గమున చీకట్లు గప్పుచుండెను. అచట సూర్యుని కాంతులు వ్యాపించుటలేదు ఆ వృక్షము అనేక శాఖాసమూహములను గలిగి దిశాపతప్తు లకు భూభారము వహించుట యందు సాయము చేయుచున్నదేమో యన్నట్లుం డెను. ఇట్లు అన్ని దిక్కులలో తానే వ్యాపించియున్న ఆ వృక్షమునకు సమీప ముగా గంధర్వ మిధునము వెండికొండ నుండి వచ్చి ఆ వృక్షమున ప్రవేశించెను.

వల్లకీ పురమును ప్రమదేశ్వరుడను రాజు పాలించుచుండెను. అతడు గొప్ప శివ భక్తుడు. తన రాజ్యమంతటా శైవమతము విస్తరింపజేసెను. ఆ సమయమున కైలాసమున నీశ్వరుడికి తన తలపులో గంధర్వుల శాపము నిలిచెను. వెంటనే, ఆతని తలపు నుండి ఉజ్జ్వల దేహముతో ఉద్భటుడు ఉద్భ వించెను. శివు డాతని జూచి, నీవు మానుష రూపములో వల్లకికి బోయి అచట ప్రమదేశ్వరునికి గురువుగా నుండుము. నీ శవధూమముచే నచ్చట నున్న పిశాచములకు శాపమోక్షము గలుగునని చెప్పెను.

"ఓ పుణ్యాత్మా! పూర్వము నేను కొందరు గంధర్వులపై గినిసి వారు పిశాచ రూపులు గమ్మని శపియించితిని. అదివిని వారు దుఃఖించగా 'నావచన మును తప్పించు తరమా' అని శాపోపశమనమునకై ఒక మార్గము చెప్పితిని. నీవు భూలోకమునకు వెడలి నా కీర్తిని వ్యాపింపజేయుము. అచట ప్రమదేశ్వ రునికి గురువుగా నుండుము. నీ శవధూమముచే అచట నున్న పిశాచములకు శాపమోక్షము కలుగును. ఈ ఆదేశము విని ఉద్భటుడు భూలోకమునకు వెడ లెను ఇంతటితో ప్రథమాశ్వాసము ముగిసినది. ఇక ద్వితీయాశ్వాసములో

ప్రమథేశ్వరుడు తనకు సంతానము లేకపోగా తన భార్య యగు ప్రభావతితో కౌండిన్య మహాముని ఆశ్రమమునకు వెడలి ఆ మునీశ్వరునితో తన కోరిక తెలిపెను. కౌండిన్యుడు "నీవు కాశికి వెడలి విశ్వనాథుని తపస్సుచే నలర జేయుము" నీ కోరిక నెఱవేరునని అనతిచ్చెను. అంత ప్రమథేశ్వరుడు, భార్యా సమేతుడై, కౌండిన్యుని ఆనతి ననుసరించి కాశీ క్షేత్రమున కేగును. అచట కౌండిన్యుడు ప్రమథేశ్వరునకు కాశీ మహిమను వర్ణించి చెప్పి మదాలసుడను బ్రాహ్మణ కుమారుని కథ చెప్ప దొడంగెను.

పుత్రుడు కావలె ననుకొనుచున్న నాకు కాశీనివాస భాగ్యము కలిగినది స్వామి! సామాన్యమైన గాజు పూసను చూడగోరు వానికి పద్మరాగ మను మణి దీని వలన దొరకినట్లయినది. ప్రమథేశ్వరుండు మిక్కిలి సంతసించి కాశీ మాహాత్మ్యంబు వినుటతోడనే తనకు ఆనందము కలుగగా, కౌండిన్యుడు సెలవిచ్చిన మదాలసు దేదేశంబు వాడు, తల్లి దండ్రు లెవరు, కులాచార దూరుండెట్లయ్యెనని, కాశిలో శరీరమునెట్లు చాలించెనో మున్నగు విషయము లన్నియు చెప్పవలసినదని ప్రమథేశ్వరుడు కోరెను. కుంతుల దేశములో రత్న పురి రాజయిన చంద్రకేతునకు ధీనిధి యను మంత్రి యుండెను. ఆతడు బ్రాహ్మణుడు. వేద శాస్త్రములు చదివిన వాడు. ఆతడు పెక్కు వ్రతములు చేయగా నతనికి మదాల సుడను పుత్రు డుదయించెను. ఆతని భార్య శుభ కీర్తి యను నామె ఆ బాలుని అల్లారు ముద్దుగా పెంచుచుండెను. అతనికి అన్న ప్రాసన చౌలోపనయనాదికృత్యములు యదావిధిగా జరిపించిరి. ఉక్త వయస్సు రాగా సుందరియైన చంద్రకళ యను కన్యను వివాహము చేసిరి.

మదాలసుడు నూత్న యౌవనముతో శోభిల్లుచూ స్త్రీల మనస్సును హరించు శక్తి కలిగియుండెను. ఆతడు వేదములు, శాస్త్రములు మరచెను. పురాణములు విస్మరించెను. సూత్రములు నిర్లక్ష్యము చెసెను. కులాచారములు దూరము చెసికొనెను. దిన దినము చక్కగా శృంగారము చేసికొనుచు పట్టణ ములో చరించుచుండెను. ఆ పట్టణములోని సుందరీమణులతో విహారము చేయును. జూద మనగా అతనికి అభిమానము. పరధనావహ రణముపై ఆత నికి కోరిక. వేశ్యలకు ధన మందించుట అతని నీతి. ఇట్టి మదాలసుడు చంద్ర కళను సంసార సుఖము నుండి దూరము చేసెను. వావివరుసలు లేక అతడు

స్త్రీలతో క్రీడించుచుండును. కానక కన్న సంతానమగుటచే తల్లిదండ్రులు అతనిని వారించలేరు. పతివ్రతయైన భార్య అతని నాటంక పరచలేదు. మన కేదులకని బంధుదులు నిర్లక్ష్యము చేసిరి. ఇట్లతని దుష్కృత్యములు మితిమీరి పోయెను. జను లాతనిని అసహ్యించుకొనుచుండిరి. కాని బ్రాహ్మణుడగుటచేత పౌరులును అతనిని సంహరించుటకు భయపడుచుండిరి. తల్లిదండ్రులు అతనికి బుద్ధి చెప్పుటకు ప్రయత్నించిరి. పాలవంటి స్వచ్ఛమైన వంశములో విషము వేయవలదని వారించిరి. ఐనను అతడు వినలేదు. అప్పుడు తల్లిదండ్రు లతనిని విడిచిపెట్టిరి. బంధువులు కూడ త్యజించిరి. అట్టి మదాలసుడు దేశాంతరము వెళ్లుటకు ఆలోచించి దేవాలయములో ధనము దొంగిలించి పౌరులకి తెలియ కుండు నట్లుగా పరదేశమేగెను. అడవులు దాటిపోగా అతనికి కన్యాకుబ్జ పురము కాన్పించెను. అచట ధనవంతుడైన ఒక వ్యాపారితో స్నేహము చేసి తన ధన మాతనికి చేతికిచ్చి అతనితో నివసించ దొడంగెను అ పట్టణములో సజ్జనుని వలె ప్రవర్తించి అచటి వారి కాప్తుడయ్యెను. కాని పూర్వపు ప్రవర్తన ఎచటికి పోవును.!

ఆ పట్టణములో ఒక సానికూతురు కనకలత యను సుందరి గలదు. ఆమె సంగీతమునందు కామ కళారహస్యమునందు నేర్పుగలది. ఆమె ఒకనాడు తన సఖులతో మాహేశ్వరాలయమున కేగెను. అచట కనులు మూసికొని మహే శ్వరుని ధ్యానించి ఆడుచూ, పాడుచూ శివుని కీర్తించుచుండెను. అచటికి వచ్చిన మదాలసుడు ఆమె సౌందర్యమునకు ముగ్ధుడై నిశ్చేష్టుడయ్యెను. అతడామె మోహమునకు లోనయ్యెను. ఆమె వేశ్య యని తెలిసికొని ఆమె యింటికేగ నిశ్చయించుకొనెను. అచటికి వెడలి ఆమె ఆట పాటలను మెచ్చుకొనెను. ఆమె సౌందర్యమును స్తుతి చేసెను. తన విరహమును బాధను ఆమె ముందు ప్రకటించెను. ఎంత ధనమైనను యిత్తునని అచట చేరి మధుసేవనముచేసి ఆమెకు ధనము లన్నియు అప్పగించెను. కొంత కాల మిట్లు జరుగగా వేశ్య మాత ధన మంతయు వ్యయమై పోవుటచే మదాలసుని యింటి నుంచి వెడల నడిపించెను. దరిద్రుడైన మదాలసుడు ఎటులైన ధనము సంపాదింతునని దొంగ తనమునకు పాల్పడెను. ఆ ప్రయత్నమున ప్రయాణము చేయుచుండగా ఎండకు అలసి ఒక కొండ సమీపమున పడిపోయెను. అంత నాదారి వెంట విద్యావాణీ ధవుడైన ఒక పండితుడు వచ్చుచుండెను. ఆ పండితుడా దగ్గరలో ఉన్న రాజు

గారిచ్చిన దానములు స్వీకరించి, వజ్రములు, వస్త్రములు పట్టుకొని చిన్నారి కొమరుని వెంట నిడుకొని వచ్చుచుండెను. సొమ్మసిల్లి పడియున్న మదాలసుని చూచి జాలిపడి నీళ్లు జల్లి సేదదీర్చి ప్రాణ దానము చేసెను. అతనిని చూచుట తోడనే మదాలసున కేదో ఆశ పుట్టెను. అంత మదాలసుడు 'జాతికి విప్రుడను. వాదములో ఓడిపోయి సిగ్గుపడి శాస్త్ర పాఠము చేయుటకు పోవుచుంటి'నని అబద్ధమాడి పండితుని నమ్మించెను.

'నామది తోచుచున్నయది నాయన నీవు దలంప సర్వ విద్యా మయ మూర్తివంచు' అని చెప్పి తనను శిష్యునిగా స్వీకరించి శాస్త్రములు చెప్పమని అర్థించెను.

ఇట్లు మదాలసుడు చెప్పగానే ఆ విద్యామూర్తి నమ్మినాడు. 'నిన్ను నా కొడుకువలె చూచుకొందు' ననెను. బాగా ప్రొద్దుపోయిన తరువాత మదాలసుడు పండితుని, కొడుకుని చంపి డబ్బు తీసుకొని బయలు దేరెను. బయలుదేరి దారి తప్పెను. కాశీవైపు నడిచినాడు. అదృష్టవశాత్తు ఆ పుణ్య క్షేత్రము జేరెను. అచట మదాలసు నొక పాము కరిచెనట. ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడినది. కాశీ పట్టణములో చనిపోవు వారందరికీ శివుడు కుడి చెవిలో తారక మంత్ర ముపదేశించునట. అతడట్లు చేయు సమయములో యమభటులు వచ్చి చూసి పారి పోయిరి. యముడే స్వయముగా వచ్చెను. ఎందుకొచ్చితివని శివుడు ప్రశ్నించెను. ఈ మదాలసుడు చేయనిపాపమంటూలేదని యముడు ఈతడొనర్చిన పాపకృత్యములన్ని ఏకరవుపెట్టెను.

గొప్ప తపస్సు చేసినను నీ సన్నిధానంబు చేరుట అసాధ్యమైన విష యము కదా ! ఈమదాలసుడు అనేక దుర్మార్గ కృత్యములు చేసినవాడు. ఇట్టి వాడునిన్ను చేరుట విచిత్రము కదా అని యముడు పలుకగా శివుడిట్లు సమా ధానము చెప్పెను. తుమ్మెద స్పర్శచేత పుష్పము తుమ్మెదవంటి కుమార రూపమును పొందు విధముగా కాశీ నగరమునందు ప్రాణము విడిచిన పాప కర్ముడైనను శివునితో సమానమైన స్థానమును పొందును.

అందుచేత యితడు దుష్టుడైనను మరణానంతరము కైవల్యమే ఈతన స్థానము ఈ విషయము విని కాశీ మహత్త్వమును వర్ణించుట ఎవరికి సాధ్యము ?

అని పలుకుచు శివునిస్తుతి చేయుచు తన మార్గమున పోయెను. మదాలసుడు శివుని లోలీనమయ్యెను. ఇన్ని పాప కృత్యము లొనరించినను, చివరకు కాశీ పుణ్య క్షేత్రము జేరుటవలన ముక్తిని పొందుట ఆ క్షేత్రమాహాత్మ్యము వలననేయని యిచట కవి నిరూపించినాడు. శివునిలో లీనమగుట కైలాసము చేరుట మోక్ష మార్గము సూచించుచున్నవి.

శ్రీనాధుని కాశీఖండములో గుణనిధి, శివరాత్రి మాహాత్మ్యములో సుకు మారుడు, ఉద్భటారాధ్య చరిత్రలో మదాలసుడు దుష్కృత్యములొనర్చినను మరణ సమయమున శివుని సాన్నిధ్యముమ చేరుటవలన కైవల్యమును పొందిరి.

ఈ మూడు కథలలో కూడ శివుని ఆధిక్యత నిరూపింపబడినది.

ఇక 'ఉద్భటారాధ్య చరిత్ర'లో తృతీయా శ్వాసములో కౌడిన్యుని యాదేశము ననుసరించి ప్రమదేశ్వరుడు కాశి కౌగి తపస్సు చేసి శివుని మెప్పించి పుత్రుని బడయుట - మున్నగు విషయములు వివరింపబడినవి. ప్రమదేశ్వరుడు భార్యతో కూడి కాశీకేగి నప్పుడు ఆ క్షేత్ర వైభవము చూచి మహదానంద భరితుండై కాశీ విశ్వనాథుని చూచి యంజలిఘటించి నుతించెను.

(ఉ. చ. తృ. ఆ. 11,12,13)

గీ॥ జయ మహా కాళ । విశ్వేశ ! సమమూరి ।
జయ మురాంతక సాయక । జయ మహేశ ।
జయ విరూపాక్ష ! ధూర్జటీ ! జయగణేశ ।
జయ చతుర్వ్యూహ ! జయ చంద్ర శకలజూట !

(ఉ. చ. తృ. ఆ. 11)

ఇట్లు స్తుతిచేసి ఆమహారాజు తన గురువు నియమించిన విధముగ తగిన స్థలములో తన భార్యతో పాటు శంభు మూర్తిని మనస్సున స్థాపించుకొని కోర్కెల నడంచుకొని తపస్సు చేయ పూనుకొనెను. కొన్ని దినములు హవి ష్యము, కొన్ని దినములు ఫలములు, కొన్ని దినములు నీరు, గాలి గ్రహించుచు కఠినమైన తపస్సు చేసెను భర్త చేసిన కఠిన తపమును అతని భార్య అను సరించు చుండెను. అతని శరీరము వాడ లేదు ఏ విఘ్నములు కలుగలేదు.

కారణము అతని మనస్సు శివుని పై నిలిచియుండుటయే. ఇట్లు తపస్సు చేయగా అతని తీక్ష్ణమైన తపస్సు చేత ఆ సూర్యుని కాంతి తగ్గిపోయెను. వాయు గమనము మందగించెను. అగ్నిప్రభ స్వల్పమయ్యెను. అట్టి ఘోర తపమునకు మహేశ్వరుడు కరుణించ బూనుకొనెను. భక్తి కలిగిన వారికి శివుడు కల్ప వృక్షము వంటి వాడు గదా ! తలపై బాల చంద్రుడు ప్రకాశించగా కంఠము లోని నల్లని కాంతి వ్యాపించగా ముఖములోని త్రినేత్రము మెరయగా సర్ప హారములు కదలుచుండగా ఆ భూత భర్త దయాస్వభావము కలవాడై రాజు ఎదుట ప్రత్యక్షమయ్యెను. అప్పుడు దేవతలు గరుడ యక్ష విద్యాధర కిన్నరుడు శివుని సేవించి వచ్చిరి. మహారాజు భక్తితో లేచి నమస్కరించి మదనాంతకుని ప్రస్తుతి చేసెను.[1]

ఇట్లు స్తుతి చేసిన రాజును చూచి మహేశ్వరుడు "నీ కేమి కోరిక కలదో దానిం తీర్చెద" నని పలికెను ఇది విని రాజు చేతులు జోడించి "నా కోరిక నెర వేర్చదలచిన నిరాఘాట తర ప్రతాపుని హిమానీ శుభ్ర కీర్తి ప్రియున్ జనతా రక్షణదక్షు"డైన తనయుని ప్రసాదించుమని రాజు కోరెను. శివుడంత "నీ కోరిక ఫలించు"నని కల్ప వృక్షములో కలిగిన ఒక ఫలము నాతనికిచ్చి తన భార్య కిమ్మని చెప్పెను రాజు తన భార్యతో కాశీ నుండి సెలవు తీసికొని తన పట్టణమునకు రాగా అతని భార్య గర్భవతి అయ్యెను అతని భార్య గర్భ చిహ్నములను కవి దీర్ఘముగా వర్ణించినాడు. ఆ రాణి అనేక దానములు చేసె నట. కొద్ది కాలముననే పంచాక్షరీ మంత్రమువలె ప్రకాశించు బాలుని కనెను. దేవతలు మనుజులు చాల సంతోషించిరి. అతనికి చెవులాది బాల్య కర్మలు నిర్వర్తించిరి. బాలునికి ముంజ భోజుడని నామకరణము గావించిరి. అతడు దిన దిన ప్రవర్ధమానుడై పెరుగుచు వేదశాస్త్రములు, అస్త్ర శస్త్రాది విద్యలు చక్కగా నభ్యసించెను. అతనికి అన్నియు తండ్రి గుణములే యుండెను.

---

1. ఈ సందర్భములో కవి ఒక దీర్ఘమైన దండకమును రచించెను. దీనిలో మహేశ్వరుని గూర్చి స్వరూప స్వభావములు వర్ణన అతడు చేసిన ఘన కార్యముల ప్రస్తుతి గలదు.

అతని స్వరూపము శంకరునివలె గంపట శివుని లీలలు శివుని క్రీడలు అతని కానందమును కలిగించు దానగుణము, శివ భక్తుల నిన ప్రేమ యనెడు మంచి గుణములతో ప్రకాశించుచుండెను అతని శౌర్యగుణములు విని చాల మంది రాజకన్యలు అతనిని వరించి వివాహము చేసికొనిరి. వినయము వివేకము, శౌర్యము సాధులక్షణము ఆ విశ్వనాథుని దయ కలుగగా అతడు రాజ్యమును చక్కగా పరిపాలించెను. ఈ జన్మ సౌఖ్యములను వదలి వాన ప్రస్థా శ్రమము స్వీకరించి ప్రమదేశుడు కాశీ నగరమునకు భార్యతో గూడి ప్రయాణమయ్యెను. అప్పుడాతడు కుమారునకు తగిన నీతిని బోధించెను. శివ భక్తి నుపదేశించెను. ప్రయాణమై కాశీ నగరమున ప్రవేశించి నందికేశ్వరుని అనుగ్రహమును పొంది విశ్వనాథాలయమున ఆ మహేశ్వరుని దర్శించెను. అతని తేజోరూపము ఆ మహారాజుని నిశ్చేష్టితుని జేసెను. పార్వతీదేవి స్తనమండ లమువలెను, హిమాలయ పర్వత శిఖరమువలెను మలయాచలములోని ఎత్తైన వృక్షములవలెను భస్మమున లదికొనిన శివుని స్వరూపము వెన్నెలతో ప్రకా శించు చంద్రునివలె నుండెను అతనికి చేతులు జోడించి ముఖమును భూమిపై నుంచి మహేశ్వరుని ప్రస్తుతి చేసెను శివుడు ప్రసన్నుడై "ఓ అర్భకా యిటు రమ్ము. నాచేత ఆజ్ఞాపింపబడిన ఆచార్యుడు ఉద్భటుడు. అతడు భూలోకమున నున్నాడు. అతడు నీకు గురువగును. ఈ వృత్తాంతము స్వప్నములో చూచిన మహారాజు ముంజభోజుడు ప్రాతర్వేళ సముచిత కృత్యములు నిర్వహించి తన స్వప్న వృత్తాంతమును పెద్దలకు విన్నవించెను వారు "నీవు మహేశ్వరుని స్వప్నములో గాంచితివి. నీవు కృతపుణ్యుడవు. నీవు తలచిన సంకల్పము నిర్విఘ్నముగా ఫలించు'' నని చెప్పగా ముంజ భోజుడు శంకరు డెప్పు డను గ్రహించునో యని ఎదురుచూచుచుండెను.

అట్టి సమయములో లోకమునందు అద్భుతముగా మహేశ్వరుని సంక ల్పము చేత భూలోకమున ముదిగొండ యందు ఉద్భవించిన ఉద్భటస్వామి ఇతరుల దైన్యమును నిర్మూలించు వాడు ఆరాధ్యులలో శ్రేష్ఠుడు, శైవధర్మ నిరతుడు, మహారాజగు ముంజభోజుని వద్దకు వచ్చిరి. అతడు ధరించిన భస్మకాంతులు అతని శరీరమును చంద్రునివలె ప్రకాశింప జేయు చుండెను శైవ లక్షణములు అతని శాంత మూర్తిని స్ఫురింప జేయుచుండెను. మహా

రాజు ఎదుట నిలిచిన ఆ ఉద్భటుడు శ్రీకంఠమూర్తి వలె నుండెను. అతని చూడగా మహారాజునకు కన్నుల కఱువుతీరి నట్లుండెను. ఆ జ్ఞానమూర్తి ఉద్భటుడనియే భావించెను. మనస్సు ఆనందముతో పారవశ్యము చెందగా వంగి అతని పాదములకు ప్రణమిల్లెను. "మాంపాహి మాంపాహి"యని వేడుకొనెను. ఆ మహిమాన్వితుని జూచి రాజు యిట్లు పలికెను. ''అనాడు మహేశ్వరుడు చెప్పగా మిమ్ము గూర్చి వినియుంటిమి. ఈనాడు మమ్ము దర్శించు భాగ్యము కలిగెను. మీ పాదాబ్జములు చూచుట చేత భవ బంధ పాశములు ఊడి పోయెను. సందేహముతో నిండిన నాకు జ్ఞాన ముపదేశించి నన్ను కాపాడుము. అఖిలాత్మ వేదివి, ఇంద్రియ సుఖములను వదలిన వాడవు. నీవు సామాన్యుడవా ? నేను ఎట్టి తపము చేసితినో మీ దర్శనము లభించెను. శివలింగము ధరించని వానికి యిహపరములు లేవని పెద్దలు చెప్పుదురు. కావున లింగధారణ ప్రకారంబును గురుశిష్య వర్తనమును శివార్చనా విధానమును సవిశేషముగా జెప్పి నన్ను కృతార్థు చేయు''మని ప్రణామము గావించెను. ఇది విన్న ఉద్భటుడు యిట్లనెను. "నీ ప్రయత్నమునకు మెచ్చితిని. నీవు భార్యాపుత్రులను రాజ్యముమ తృణప్రాయములు చేసి శివభక్తియందు మనస్సు నిలిపితివి. ఎట్టి వానికైనను సులభముగా శంకరుని భక్తి సమకూడునా ! హరునికి అర్పింపని ఆహారము తినుట, భవునికి నివేదించని పానీయము త్రాగుట శివుని, కీయని పువ్వును వాసన చూచుట, శంభు భక్తుడు కాని వానిని స్పృశించుట శివునికి కాని పుణ్యములు పట్టుట ఇవన్నియు హేయములు. ఇన్ని వేదములు చదివినను శాస్త్రము లభ్యసించినను గురుని చేర వలయును. ఆ గురువునకు పరిచర్య చేయుచు అతనిని సేవించ వలయును. అట్టి వాడే శిష్యుడు కాదగును భక్తికలిగి శివలింగదీక్ష వహింపవలయును. మహారాజా ! ఇంక లింగధారణము వివరింతును. శరత్కాలము, వైశాఖ, జేష్ఠ, ఫాల్గుణ, మార్గ శీర్ష మార్గములు లింగధారణమునకు యోగ్యములు. మాఘము, ఆషాఢము, శ్రావణము ఒక విధమైనట్టివి. సూర్య చంద్రోప రాగములు ఉత్తమమైనవి. శుక్ల పక్షము, బహుళ పక్షములోని పంచమీ తిథి గ్రహింప దగినది. చవితి, నవమి, షష్ఠి, అష్టమి, పూర్ణిమ, చతుర్దశి దీక్షకు తగినవి కావు. మిగిలిన తిథులు తగినట్టివే. రోహిణి, ప౦ఖ, పునర్వసు పుష్యమి, మృగ శిర, గ్రహింపదగినవి. హస్త, అనూరాధ, ఉత్తర ఫాల్గుణి, ఉత్తరాషాఢ సాధు

సమ్మతములే. రేవతి, పూల అర్హమైనవి. చివరి రాశి తప్ప మిగిలిన రాశు లలో శివ దీక్ష వహించ వచ్చును. ఇట్లు ముహూర్త నిర్ణయమైన తరువాత చేతి బంటి నీటిలో నిలవబడి చేతిబంటి ఇసుక తీయవలయును. దానితో చదర ముగా ఒక అరుగును నిర్మించ వలయును దానికి నాలుగు వాకిళ్లు చేయ వలయును. గోమయము చేత అలికి అలంకరించ వలెను. పువ్వుల చేతను, ముత్యముల ముగ్గు చేతను ధూప దీపాదుల చేతను పూజించవలెను. బంగారు, వెండి, రాగి లేక మట్టి పాత్రలను పంచకలశములుగా ఏర్పాటు చేయవలెను. వాటియందు మంత్రజలమును నింపవలయును. అన్నిటియందు చూత పల్లవ ములను నాగ దళములను ఉంచవలయును. ఐదు కలశములకు "ఓమా వస్సర్వ"యను వేదమంత్రం బావహించి సకల మంత్రసారంబైన పంచాక్షరీ మంత్రమును ఉన్ముఖంబు గావించి మూడు సారులు ఆ కలశము అతని తలపై ప్రోక్షించి గంధాక్షతల చేత ప్రోక్షించి "అవయోనిద్ధి రస్తు"నుచు అతని తలను స్పృశించుచు పుష్పాంజలి పూర్వకముగా గురువు ప్రాణలింగము చేయవలయును. ఇది లింగధారణ ప్రకారము అంత రాజిట్లనెను. ఆ లింగము నెట్లు ధరించ వలెను? అనగా నాభిలో గాని, భుజ మధ్యమ మందుగాని చేతులలో గాని, తలపైన గాని కంఠసీమనైనను దానిని ధరించ వలయును. నాభి క్రింద భాగమున ధరింప రాదు. అప్పుడు భస్మమును, రుద్రాక్షను ధరించుట వలన ఎట్టి పుణ్యము లభించును? చెప్పుమనగా ఉద్భటుడిట్లనును. సర్వకాల సర్వావస్థల యందు శివలింగమును, రుద్రాక్షలను ధరించినవాడు బ్రహ్మ, విష్ణువుల వలె అక్ష పాద శిలాదహర దత్తము నీళుల వలె శివ సాయుజ్యము నొందుదురు.

ఇది విని చరితార్థుడైన మహారాజు ఉద్భటుని అర్చనచే తృప్తిగావించి లింగధారణమునకు సిద్ధముగుచుండెను. అప్పుడు శరదృతువు ప్రవేశించెను. ఉద్భటుని వలన ముంజ భోజుడు లింగధారణము వహింపదలచెను. ఉద్భ టునికి వార్త పంపెను. ఉద్భటుడు జంగములతో గూడి అచటికి వచ్చెను. వారికి మహారాజు పాదపూజ చేసెను. వారు మాచి దేవుని వలె, కక్కయ విధమున, వీర నాచాంకు వలె, మహణయ్య వలె, మారయ్య వలె ఖ్యాతి నందుమని దీవించెను. అంత పంచమీ దినమున పట్టణమును దేవాలయమును అలంకరించిరి. మహేశ్వరుని స్తుతి చేయుచూ శివ మంత్రమునకు సారమైన

పంచాక్షరిని గురుడు శిష్యున కుపదేశించెను. అంత ఒక తేజస్సు గురు ముఖమునుండి రాజు ముఖమునకు ప్రసరించెనట. ఇట్లు లింగధారణుడై మహే శ్వరుని స్తుతి చేసెను. (ఈ స్తుతి ఇరువది పద్యములలో వర్ణింపబడినది) (ఉ.చ. 202 - 221)

అంత రాజు తన రాజ్యమును సంప్రదాయ సిద్ధముగా గురువునకు అర్పితము చేసెను. గురువు సంతసించి తిరిగి దానిని అనుగ్రహించగా రాజు స్వీకరించెను. తన గురునకు పాదపూజ చేయుచూ రాజ్యమును పరిపాలించు చుండెను. అంత నుద్భటుడు శివుని శాపమును దాని పరిసమాప్తిని తలంచు కొనెను. ఈ లోకములో మహేశ్వర సంప్రదాయము సుస్థిరమైనది. శాపగ్రస్తు లైన వారిని కాపాడ వలయును కదా! ఇంక ఆ పని చేయుదునని ఆ మహా యోగి బ్రహ్మ రంధ్రము నుండి ప్రాణము విడిచి శివునిలో ఐక్యమయ్యెను. అతని కుమారులు శాస్త్రోక్తముగా అతని శరీరము ఆహూతి గావించిరి. ఆ ఆహూతి దూమము లోకమున వ్యాపించి ఆ పిశాచ పిండములపై కూడ ప్రస రించెను. స్పర్శవేది చేత ఇనుము బంగారమైనట్లుగా ఉద్భటుని అంగ ధూమము చేత గంధర్వులు శంభు వేషములు దాల్చిరి. అప్పుడు వారి నాయ కుడైన చిత్రరధుడు ఉద్భటుని చూడలేమికి విలపించెను. ఎందుచేత ననగా అతని చితా ధూమము వ్యాపించి నప్పుడు అతడు ఆహారార్థమై వెడలి యుండెను అతడు వచ్చిన తరువాత తన అనుచరుల శాపమోక్షము తెలిసి కొని ముంజ భోజుని వద్దకు వచ్చి తన దీన స్థితిని నివేదించు కొనెను. ముంజ భోజుడు పిర్రవతము బూని శంకరుని రప్పించి ఆ పిశాచమునకు గంధర్వత్వము నిప్పించెను. ముంజభోజుడు కొంత కాలము రాజ్యము చేసి కైలాసమున కేగెను.

ఉద్భటుని వంశము వారు కాశి యందు నివసించిరి. అక్కడ వారి వంశము వృద్ధి అయ్యెను. వారు కాశీ నగరము నుండి తెలుగుదేశమున ముది గొండకు వచ్చి అచ్చట స్థిరపడిరి. ఉద్భటారాధ్యుని వంశము వాడే కృతి పతి దేచమంత్రి గురువైన చంద్ర శేఖరుడు. అతని వంశ చరిత్రతో కావ్యము ముగియు చున్నది.

'ఉద్భటారాధ్య చరిత్ర' కావ్యము చదువుచున్నప్పుడు ప్రబంధ యుగములో వీరశైవ సంప్రదాయములెట్లు కన్పించు చున్నవి యను వింత అనుభూతి కలుగును. కాని కేవలము ఆ దృక్పథముతో చూడక కవి, కాలము కథ, అంకితము, కృతికర్త మున్నగు విషయములు దృష్టి యందుంచుకొని యోచన చేసిన యెడల కవి వీర శైవుడు కాదని పరమత ద్వేషములేని వాడని కేవలము కథ కొంత వీరశైవ సంబంధమగు కాలము నాటిదని తెలియవచ్చుచున్నది. అంతియే కాదు, ఈ కథ బసవ పురాణములో పాల్కురికి సోమనాథుడు ద్విపదలో రచించుట మరొక కారణముగా భావించ వచ్చును. కృతికర్తయగు దేచమంత్రి శైవాచార సంపన్నతను గూర్చి చెప్పుచు రామలింగ డిట్లు వర్ణించినాడు.

మ. ప్రణత ప్రాభవు దూర దేచ విభు డభ్యర్చించు హస్తాగ్రకం
కణ ఝంకారము లంకురింప విరులం గంధంబునన్ బత్త్రిరిన్
మణి హారంబున గాంచ నాక్షతల శుంభద్వర్ణ పంచాక్షరిన్
బ్రణవాత్మున్ బరమ ప్రకాశు గిరిజా ప్రాణేశు నశ్రాంతమున్.

(ఉ.చ.1-46)

ఇక నీ 'ఉద్భటారాధ్య చరిత్ర'కు మూలమేదియో రామలింగ కవి తెలుపలేదు. కాని 'ఉద్భటారాధ్య చరిత' పీఠికలో నిడదవోలు వెంకట్రావు గారు పాల్కురికి సోమనాథుని బసవపురాణ కథయే ఉద్భటారాధ్య చరిత్రకు మూలమని పేర్కొనిరి. నిజమే కావచ్చును. ఈ కథ ఏ పురాణములలో నున్నట్లు కనబడుటలేదు. ఇది దేశి కథవలె కన్పించు చున్నది. దేశియమగు కథేతివృత్తమునకు శైవ సాంప్రదాయమును జోడించి రామలింగడు కథ వ్రాసినాడు. మూల కథయగు బసవపురాణ కథ వీరశైవ సాంప్రదాయానుసారము నడచినది గనుక కథానాయకుడైన ఉద్భటుడు వీరశైవుడుగా, కృతి నందుకున్న గురువులు కూడా వీర శైవ మతానుయాయులు గనుక, ఈ కావ్యములో వీరశైవ సంప్రదాయములు కన్పించు చున్నవని తోచుచున్నది.

ఇక బసవపురాణములో ఉద్భటుని కథకును రామలింగడు రచించిన 'ఉద్భటారాధ్య చరిత్ర'లో ఉద్భటుని కథకును గల భేదమును పరిశీలింతము.

పాల్కురికి సోమనాధుని బసవ పురాణము నుండి కొన్ని ద్విపదలు పరిశీలింపగా, రామలింగ కవి కృతికి బీజము మూల కథలో అనగా ఏడు నూఱు భూతములు ఉద్భటుని చితిపొగ దాకి కైలాసమునకు వెడలుట- అను ముఖ్య విషయములో భేదము కాన్పించుటలేదు. తక్కిన విషయములో చిన్న చిన్న భేదములు కాన్పించు చున్నవి. కథా ప్రారంభమున బసవ పురాణములో బల్లకి పురమని చెప్పబడగా, రామలింగని కృతిలో వల్లకి యని పేర్కొన బడినది. ప్రమథేశ్వరుని కుమారుడు బసవ పురాణము ననుసరించి భోజరాజు, ఉద్భటారాధ్య చరిత్రలో ముంజ భోజుడు. ఉద్భటుడు గురువై శివదీక్ష నొసంగుట ఉభయ కావ్య సామ్యము. ఈ దీక్ష నొసంగుట యనునది వీరశైవ సాంప్రదాయము. ఈ సంప్రదాయము బసవని కాలములో పాటింప బడినది. వీరశైవము వెఱ్ఱి తలలు వైచిన కాలమది. అందుచే ఆ సంప్రదాయ ముండుట అతి శయోక్తి కాదు. ప్రబంధ యుగములో కావ్యము వ్రాసిన రామలింగడు కూడ ఈ సంప్రదాయము అనుసరించినాడు. కారణము కృతి భర్త గౌవ వార్ధమేయని భావించవలసియున్నది. కవి శైవగురువుల యందు భక్తి భావము కలవాడు గాబట్టి, శైప భక్తుడు గనుక ఈ సంప్రదాయము పాటించినని కూడ భావించ వచ్చును. నేటికిని బ్రహ్మణుల లోలింగ ధారులను శాఖ వారున్నారు. వారు పెద్దల వద్ద గురువుల యొద్ద లింగ ధారణ దీక్ష వహించుట కలదు. అందుచే కేవలము వీరశైవ సంప్రదాయమనక శైవ సంప్ర దాయమని చెప్పి నను సముచితముగనే యుండును. బసవ పురాణములో ఉద్భటునికి జొమ్మవ్వ అను భార్య కలదని అమె హీనకుల జురాలని పేర్కొనబడినది. ఇది ఉద్భటా రాధ్య చరిత్రలో లేదు. బసవని కాలములో శైవ భక్తులకు కులముతో నిమి త్తము లేదు. శైవ భక్తులైన చాలును, వారు కులాంతర వివాహములు చేసి కున్నను సమ్మతమే. ఒకే పంక్తిలో బ్రాహ్మణులు, హీన కులజులు అందరూ కలిసి భుజించు చుండెడివారు. శైవ భక్తులకు వర్ణవ్యవస్థతో కాని, కర్మ సిద్ధాంతముతోకాని పనిలేదు. అందుచే బసవని కావ్యము ననుసరించి ఉద్భ టుని భార్య హీనకులజురాలుగా చెప్పబడినది. కాని ఈ సిద్ధాంతము త్వరలోనే అంతరించినది. కాలానుసారముగా వచ్చుచున్న మార్పువలన ఉద్భటా రాధ్య చరిత్రలో ఈ ప్రసక్తి రాలేదని భావించవచ్చును. ఇంకొక విషయమేమనగా నిడదవోలు వేంకట్రావుగారు ఉద్భటారాధ్య చరిత్ర పీఠికలో 'శైవ సంప్ర

దాయ విశిష్టత' యనునంశములో వీర శైవవాఙ్మయము సవైదికము, అవైదికము అని రెండు విధములని పేర్కొనిరి. దీనిని బట్టి చూచిన బసవన ప్రవర్తిల్ల జేసిన ఈ సంప్రదాయము అవైదిక మని చెప్పబడినది. అనగా కర్మ సిద్ధాంతమును మాత్రము వీరు నమ్మెడి వారు కాదని తెలియుచున్నది. దీనినే జంగమ సంప్రదాయమని అందురట. కర్మ సిద్ధాంతమును బసవడు అంగీకరించలేదనుటకుఅతడు ఉపనయనమును తిరస్కరించుటయే తార్కాణము. ఇక పండితుని కాలము వచ్చుసరికి వీర శైవము కొలది మార్పులు సంతరించు కొన్నదని తెలియుచున్నది. దీనికి తార్కాణము శివతత్త్వసారములోని కథా విశేషములే.[2] దీనిని ఆరాధ్య సంప్రదాయముగా చెప్పుచున్నారు. ఇదే సవైదికమార్గము రామలింగడు తన కృతిలో ఈ సవైదిక సంప్రదాయము పాటించి నాడని తెలియుచున్నది. ఉద్భటుని భార్య హీన కులజురాలన్న మాట ఈ కవి చెప్పలేదు.

శైవ సంప్రదాయమునకు ప్రధానమైన లింగధారణ దీక్షా విధానము శివకవుల గ్రంథములలో లేదు.[3] "దీక్ష" అనగా లింగధారణ "దీక్ష" యని యర్థము - ఇప్పటికి శైవులలో మీరు "దీక్ష" పుచ్చుకున్నారా యని వ్యవహారమున్నది. ఈ దీక్ష పొందినగాని శివ పూజ కర్హత లేదు. శివ పూజ యనగా లింగమును అరచేతి యందుంచుకొని అభిషేకించి పూజ చేయుట[1]. ఈ సంప్రదాయమునే సూచించుచుపాల్కురికి సోమనాథుడు, పండితారాధ్య చరిత్ర తొలి ప్రకరణమునకు దీక్షా ప్రకరణము అని పేరు పెట్టినాడు. అందు ప్రధానముగా పండితారాధ్యుని లింగార్చన లేక శివ పూజయే వర్ణితము. సోమనాథుడు పండితారాధ్య చరిత్రకు కావ్యత్వము నాపాదించినవాడు కావున దీక్షా విధా

---

1) ఉద్భటారాధ్య చరిత్ర - పీఠిక - నిడదవోలు వేంకట్రావు (పుట 49)

2) శివ తత్త్వసారము - శైవమత విశేషములు అను ప్రకరణములో నేను పండితుని శైవ సంప్రదాయములు వ్రాయునప్పుడు మొదటి సంపుటములో 'శివ తత్త్వ సారము' ననుసరించి చర్చించియుంటిని.

3) ఉద్భటారాధ్య చరిత్ర - (పీఠిక పుట - 51) శ్రీ నిడదవోలు వేంకట్రావు.

నము నెంత మాత్రము తెలుప లేదు - రామలింగ కవి దానిని యీ కావ్యములో వివరముగా తెల్పినాడు.

ఇక బసవ పురాణములో పండ్రెండు వేలేండ్లు ఉద్భటుని మరణము గౌరి భూతములు నిరీక్షించుట చెప్పబడినది. ఉద్భటారాధ్య చరిత్రలో నూఱు దివ్యసములు అని కలదు. దివ్యసములనగా దేవ సంవత్సరములు దేవ మానము ననుసరించి మానవులకు ఒక సంవత్సరము దేవతల కొకరోజు కాబట్టి నూఱు దివ్యసములు అనగా 36500 మానవ సంసత్సరములు. తృతీయాశ్వాసము 260లో విడిచిన భూతము "తోచితి న్నగ శాపభరమున్ శత దివ్యసమంబులు" అని చెప్పెను.

బసవ పురాణము ననుసరించి అన్ని భూతములు శాప మోక్ష మంది ఒక్క భూతము మిగిలి రాజు వద్దకువచ్చి వేడుకొనగా రాజు చితి యందగ్ని నెలకొల్పును.

ఉద్భటారాధ్య చరిత్రలో రాజు విడివడిన భూతమును బ్రోవుమని, కంఠమున కత్తికేలించును. ఈశ్వరుడు ప్రత్యక్షమై - ఆ భూతమునకు శాపమోక్ష మొసంగును. ఇక బసప పురాణములో "ఉదుబటుడు" అను తద్భవ రూపము వాడబడినది. రామ లింగని కృతిలో "ఉద్భటుడని" గలదు.

ఇచట నొక విషయము మనము గ్రహింపవలెను. ఉద్భటారాధ్యుడు పాల్కురికి సోమనాథునకు అయిదు వందల యేండ్లు ముందున్నవాడు - ఇక బసవ పురాణ రచనమును గూర్చి సోమనాథుడే - "కథా సూత్రము వెలివెలి గింపు"దని శ్రీశైలమున భక్తుల వేదు కొన్నట్లవతారికలో చెప్పినాడు -కావున అతడు - భక్తుల మూలమున విన్న ఉద్భటుని కథను - మాత్రమే గ్రంథస్థము చేసినాడు.

రామలింగ కవి ఉద్భటుని ఉత్తర కథ కొంత చెప్పినాడు. ముంజ భోజునికి ప్రత్యక్షమైన శివుడు తాను కాశీ విశ్వనాథ స్వరూపముతో కాశియందు నివసింతుననియు, ఉద్భటుడు నక్కడే గురుభావము దాల్చి యుండుననియు, ఉద్భటుని కాశీ నివాసమును గూర్చి చెప్పెను. (3-304-308)

పై కథా సంగ్రహమును బట్టి రామలింగ కవి తన కృతిపతియైన దేచమంత్రి గురువు చంద్రశేఖరుని కీర్తించుటయే ప్రధానముగా, నాతని మూల పురుషుడైన యుద్భటుని చరిత్రమును రచించెనని మనము నిశ్చయింప వచ్చును.1 శైవ సంప్రదాయమున హరునకు గురువునకు నభేదము గాన రామలింగ కవి, ఆది నుంచి, అంతము వఱకును నచ్చటచ్చట శివునికి బదులుగా చంద్రశేఖర శబ్దమునే వాడినాడు. మొదటి పద్యముననే. "ఆధ్యాత్మ విద్యా విశ్రాంతుడు చంద్రశేఖరుడు", బాలక "చంద్రశేఖర కళాదర్ప స్ఫురద్గర్భయై"

(3.259, 3.41)

పూనినాదవ సుధాశరమున్ గురు చంద్రశేఖరా ! ఇది ఉద్భటునికి సంబోధన.

గ్రంథాంతమున - చంద్రశేఖర గురురాజ చక్రవర్తి అని ముగించినాడు.

ఈ కావ్యములో ప్రమదేశ్వరుడు కౌండిన్య మహామునిని దర్శించినట్లు వ్రాసియున్నాడు. ఈ కధకు, కౌండిన్యునకు నేమాత్రము సంబంధము లేదు. కాని, కౌండిన్యుడు, తన గోత్ర కర్తయే గాక, ముఖ్యముగా కృతిపతి దేచ మంత్రి గోత్రము- కౌండిన్య గోత్రమే. కాబట్టి, కృతిపతి వంశోత్కర్షకై కౌండిన్య మహామునిని కథ యందు ప్రవేశ పెట్టెను.2 ఇఁక మదాలసుని కథ చూచిన కథను పెంపొందించుటకు, శ్రీనాథుని రచన ననుసరించి తాను గూడ యట్టి రచన చేయగలడని సామర్థ్యము వ్యక్త పఱచుకొనుటకై ఈ కవి ఈ కథ చెప్పినట్లు నిడదవోలు వారి యభిప్రాయము. కాశీ క్షేత్ర మహిమ చెప్పు టలో శ్రీనాథుని తరువాత రామలింగడే యని చెప్పవచ్చును. కాశీ ఖండములో

---

1. ఉద్భటారాధ్య చరిత్ర - పీఠిక శ్రీ నిడదవోలు వెంకట్రావు (పుట 47)

1. ఈ కౌండిన్యుడు మలయా దేశమున - కంబోడియాలో హైందవ సంస్కృతి ప్రతిష్ఠాపించినవాడు. (చూ. కౌతవరం చరిత్ర) సముద్ర యానము చేసిన మొదటి ఋషి కౌండిన్యుడని భారతీయ చరిత్రకారులు తెలిపిరి. ఈ విషయము శ్రీ నిడదవోలు వేంకట్రావుగారు ఉద్భటా రాధ్య చరిత్ర పీఠికలో తెలిపిరి. (పుట. 47)

గుణ నిధి కథ శ్రీనాథుడు చెప్పినట్లుగనే రామలింగడు ఉద్భటారాధ్య చరిత్రలో మదాలసుని కథ చెప్పినాడు.

ఇట్లు పాల్కురికి సోమనాథుని కథా బీజముగా తాను సేకరించిన విషయములతో ప్రోదిచేసి శ్రీనాథ మహాకవి కవితా కథాంశములను, శాఖలతో నొక ప్రత్యేక ప్రబంధముగా, ననుపమాన వైదుష్యముతో రామలింగ కవి దీనిని నిర్మించినాడు. ఆయా కథలను తమంతట తామనుకుకొన్నట్లు సమన్వయించి, ఏక కథా శరీరముగా నేర్పఱుచుట రామలింగని కావ్య కథా నిర్మాణ శక్తి వెల్లడించును. పై విషయములే కాక, ఈ కావ్యమునకు ప్రబంధ సాహిత్యమున ప్రత్యేకత నిచ్చినది శైవ సంప్రదాయ విశిష్టత ఈ విధముగా "ఉద్భటారాధ్య చరిత్రము" ఆంధ్ర సాహిత్యములోని ప్రబంధ యుగమున విస్తృత కథా వస్తువుతోను, సముచితమైన వర్ణనలతోను చక్కని కథా సమన్వయముతోను పూసలలో దారమువలె శైవ సంప్రదాయ విశేషములతోను వెలసిన ఉత్తమ కథా కావ్యము.

# కాళహస్తి మాహాత్మ్యము—శైవనిరతి

శ్రీకృష్ణ దేవరాయల ఆస్థానములో స్వర్ణ యుగ మని పేరు పొందిన ప్రబంధ యుగములో అష్ట దిగ్గజములను ఎనమండుగురు కవులు రాయల సభ నలకంకరించిన విషయము మనకు విదితమే. అష్టదిగ్గజములని పేరు పొందిన కవులలో మహాకవి ధూర్జటి ఒకడు.[1] ఈ విషయము విపులముగా నాసిద్ధాంత వ్యాసమున చర్చించి యుంటిని. దీనిని బట్టి చూచిన, ధూర్జటి రాయల పరిపాలనా కాలముననే అనగా 1509 - 1530 వరకును గల సంవత్సములలోని వాడని విశ్వసించుట సమంజసము. ఇఁక ఈ మహాకవి రెండు కృతులు రచించినట్లు తెలియుచున్నది. (1) శ్రీకాళహస్తి మాహాత్మ్యము. (2) శ్రీకాళహస్తీశ్వర శతకము. ఈ కృతుల పూర్వాపరముల విషయమున పండితలోకమున ఇంచుక అభిప్రాయము భేదములు గలవు. దాన్ని గురించి నాసిద్ధాంత వ్యాసములో విపులముగా చర్చించినాను.

ఇఁక ధూర్జటి కావ్యములోని కథలను స్థూలముగా పరిశీలించి అందలి శైవ నిరతిని విశదీకరించుటకు ముందు ధూర్జటి కావ్యము ప్రబంధమెట్లైన దను విషయ మించుక పరిశీలింతము. రాయల కాలములో ప్రబంధములు పరంపరగా రచియించుచుండగనే ఈ కాళహస్తి మాహాత్మ్యము కూడ రచింపబడెను. అల్లసాని వారి మను చరిత్ర ప్రథమ ప్రబంధమను విషయమెల్లరకు విదితమే. క్షేత్ర మాహాత్మ్యమైనను శ్రీకాళహస్తి మాహాత్మ్యము వర్ణనలతో కూడి యుండుట వలనను, ప్రబంధ లక్షణము లిందు కాన్పించుట వలనను, ప్రబంధమని చెప్పనొప్పును. ఈ కావ్యములోని వర్ణనా వైవిధ్యమే యిందులకు సాక్ష్యము. ఈ కావ్యమందు వశిష్ఠుడు, అజుడు, లూత, వాతాశనము, సామజము, ఆటవికుడు, గోత్రాదేవుడు, నత్కీరుడు, రాజీవాక్షీ యుగము, యాదవాధిపుడు అను వారందరును పరమేశ్వర సాక్షాత్కారమును తదైక్యమును

1. ధూర్జటి - జీవితము - రచనలు - పుట. 215

పొందుట వర్ణింపబడినది. అందుచేతనే కవి "వశిష్ఠా జలూతా వాతాశన సామా జాటవక గోత్రాదేవ నీత్క్వర రాజీవాక్షి యుగ యాద వాధి పులకున్ శ్రీయస్కరంబైన యార్యా వామాంగము దివ్యలింగము మాధీ యాటిష్టముల్ ల్పల్పెడిన్" అనినాడు. కథా సూచన ఈ విధముగాజేసి, ఇంకను, చంద్రోదయ వర్ణన, సూర్యాస్తమయ వర్ణన, పురవర్ణన, శైలవర్ణన మొదలగు ప్రబంధ వర్ణన లన్నియు ఆయా పట్టుల దూర్జటి గావించినాడు. అందు చేనిది ప్రబంధమైనది. ఇచట గమనింపవలసిన విషయ మొకటిగలదు, దూర్జటి కాళహస్తి మాహాత్మ్యమును ప్రబంధ మనలేదు. మాహాత్మ్యమని పేరు పెట్టెను. ఎందులకన శివుని యొక్క మహిమలను గుర్తించి ఆరాధించుటయే భక్తి. ఈ భక్తియే ముక్తిగా పేర్కొనబడినది. ఇది కేవలము శివుని యొక్క మహిమలు గుర్తుంచు గ్రంథము గావున మాహాత్మ్యమని పేరు పెట్టియుండును. శ్రీ సాలెపురుగు, కాళ - నాగము, హస్తి - ఏనుగు, ఈ మూడింటిచే శివుని మహిమ గుర్తించబడినది. అందుచే శ్రీకాళహస్తి మాహాత్మ్యమైనది. వేర్వేరు కథ లనేకము లీ కావ్యమున చెప్పబడినను కవి ప్రత్యేకముగా ఈ మూడింటి ఆధారముతో ప్రబంధమునకు నామకరణము చేసినాడు. దీనికి కారణ మిట్లూహించుట కవకాశమున్నది. మానవుల యందు భక్తి భావము ఎట్లైనను సహజమే. కాని 'తిర్యక్కులలో కూడ శివ భక్తి కలదు సుమా' అని దూర్జటి ప్రత్యేకముగా ఈ కథల ద్వారా వ్యక్త పరచినాడు. ఇంకొక విశేష మేమనగా ఈ గ్రంథమున జంగమారాధన దూర్జటి జంగముని సాక్షాత్తూ శివునిగా చిత్రించెను ఇది వీరశైవ సంప్రదాయమే. బసవని కాలములో వీరశైవ మతము ఉచ్ఛస్థితి యందున్నప్పు డిటువంటి కథ లెన్నియో పాల్కురికి సోమనాథుడు బసవ పురాణములో చెప్పియున్నాడు. బహుశ ఆ సంప్రదాయమే దూర్జటి గ్రహించి యున్నాడనిపించుచున్నది, అట్లని దూర్జటి వీరశైవుడు కాదు. విష్ణుద్వేషి అసలు కాడు. కాని తాను చెప్పిన కథ అటువంటిది గనుక ఆ సంప్రదాయము వచ్చినదని భావింపనగును. ఇంకొక విశేషమేమనగా వివిధ కథలు దూర్జటి చెప్పినప్పుడు ఆగమ సంప్రదాయములు చాల వరకును, కొన్ని వీరశైవ సంప్రదాయములును, ఈ కావ్యములో కలిసి ముడివడి వర్ణింపబడినవని తోచుచున్నది. కథలు చెప్పిన పిమ్మట ఈ అంశము మరింత స్పష్టము కాగలదు. శ్రీకాళహస్తి మాహాత్మ్యమున శివ భక్తి కథలన్నిటికిని ఏక సూత్రత ఘటించుచున్నది. ఈ కథలన్నింటిని

జంగమ స్వరూపుడగు సాక్షదీశ్వరుడే యాదవ భూపాలునకు స్వయముగా చెప్పి నాడు. కృష్ణరాయలు తాను రచించిన ఆముక్త మాల్యదలో విష్ణుచిత్తుని కథ గోదాదేవి కథ, పాండ్యరాజు కథ, ఖాండిక్యకేశి ధ్వజ సంవాదము. మాలదాసరి కథ మొదలగు వానిని రచించెను. ఈ కథలన్నియు వైష్ణవాధిక్యతను వెల్లడించు నట్టివే. అయినను రాయలు దాని నిప్రబంధ మని పేర్కొనెను. అట్లే ధూర్జటి కూడ చెప్పెను. ధూర్జటి వస్త్వైక్యమునకు భంగము రాకుండ కాపాడి నాడు. శ్రీకాళహస్తి పురముతో బాటు పొత్తపినాటిలోని విపిన భూమి కూడ ఇందు వర్ణితము. ప్రథమాశ్వాసము నందలి 62 వద్యములు రెండవ చరణము నుండి కావ్యాంతము వరకును గల కథలు ఈశ్వరుడు చెప్పినవే.

> ఎ. అగుగాకంచు ప్రపంచ భర్తయను కంపాలింగి తస్వాంతుడై
> జగతీ నాథుని శోదనిట్లనియె, దచ్చారిత్ర మాలింవనిం
> పగునే నిన్వెను, మమ్మాహత్మ్యము పురాణాబ్ధిన్మధింపంగబూ
> ర్ణ గతిం బుట్టిన మోక్ష లక్ష్మికి విహార స్థానమై యొప్పగున్
>
> (ప్ర.ఆ.కా.మా. 162)

కావుననే ధూర్జటి ద్వితీయ - తృతీయ - చతుర్థా శ్వాస ప్రారంభము లందిట్లు చెప్పకొనినాడు.

> "అవధరింపు డిట్లు భవదీయ కథ విన్న
> వింతు భక్త జనుల వీను లలర
> మీరు యాదవునకు గారుణ్య పూరి
> తేక్షణముల నాన తిచ్చినట్లు" (2)

శైవభక్తునకు సర్వస్వము ఈశ్వరుడే. ఈ కావ్యములో గల షష్ఠ్యంతములలో 'కాళహస్తిశునకున్' అనునది మే మకుటము. ఇది ధూర్జటి శైవభక్తికి నికషో పలము.

సాధారణముగా ఆశ్వాసాంత పద్యములందు పద్యరచన నియతముగా నుండును. కాని ధూర్జటి నాలుగాశ్వాసముల అంతములందును వరుసగా శార్దూల, కంద, పంచచా మరములను వాడి యుండుట మరియొక విశేషము.

ఆశ్వాసాంత గద్య కూడ కొనికొన్ని ప్రతులలో భిన్నముగా గలదు. ఆశ్వాసాంతము ఎప్పుడు ఒకే విధముగా నుండుట సర్వసామాన్య విషయము. అందుచే నది కేవలము లేఖక ప్రమాద మని భావించవలెను గాని భిన్నముగా నుండుట తగదనియే నా అభిప్రాయము. ప్రారంభ పద్యములో కథా సూచన గావించి మరల ప్రథమా శ్వాసమునందే శ్రీకాళహస్తి పుర వర్ణన గావించు నప్పుడు మరల కొంత కథా సూచన ధూర్జటి గావించినాడు.

ఇట్లే తక్కిన ఆశ్వాసాది పద్యములలో కూడ కథా సూచన చేయబడి నది. ద్వితీయాశ్వాస ప్రారంభ పద్య మిట్లున్నది.

"శ్రీ ఖండాచల మారుత
లేఖా స్పర్శాది విషయ లీలాళ్ళద్వి
ద్యాఖని ముని జన కల్పక ।
శాఖీ! శ్రీకాళహస్తి సదన! మహేశా!"

(ది.ఆ. కా।మా॥)

ఇందు 'విద్యాఖని' యనుటలో బ్రహ్మ 'ముని జనకల్ప' యనుటలో బ్రహ్మ పుత్రుడు ఋభువు 'శ్రీకాళహస్తి సదన' యనుటలో శ్రీకాళహస్తులు సూచితములు. అనగా ద్వితీయాశ్వాసములో వీరి కథలే చెప్పబడినవి. ఇట్లే తృతీయాశ్వాస ప్రారంభమున తిన్నని కథ; నత్కీరుని కథ. చతుర్థాశ్వాస ప్రారంభమున వేశ్యా తనయుల కథ సూచితములైనవి. వశిష్ఠుని, అగస్త్యుని (బ్రహ్మర్షుల) కథలను విన్న పిమ్మట, ప్రథమాశ్వాసాంతమున వీర నరసింహ యాదవుడు భర్గుస కుంభ్రగమ్ముల మ్రొక్కి "భక్తనిధీ! నాకుం జెప్పవే విశ్వ నాథుని యారాధన సేసి యగ్గిరని జంతు శ్రేణిలో మున్ను గోరిన యర్థంబులు గాంచి రెవ్వ"రని ప్రశ్నించినాడు. ప్రథమాశ్వాసము 161 పద్యమందీ విష యము సూచితము.

అంత గౌరీనాథుడు తరువాతి ఆశ్వాసములో జంతుశ్రేణికి జెందిన శ్రీ కాళ హస్తుల కథలను వర్ణించినాడు.

నారాయణ వన పురాధి నాదుడగు యాదవ భూకాంతుని భక్తిని తెలియ బూని, శివుడు యాయా జంగమ స్వరూపుడై శ్రీకాళహస్తి పురమునకు వచ్చి ఒక దాసి యింట విడిసెను. ఆమె యాదవ భూకాంతు డారగింపు బోయెడు వేళ స్వయముగా వక్కెరమిడు చుండును. కాని అనాడామె తపసి తగులమున నుండి ఆ విషయమే మరచెను. రాజు కోపముచే ఆమె తల గొరిగింప బంపెను. కాని మాయా జంగమ స్వరూపుడగు శివుడు హస్త మస్తక సంయోగ మాచరింపగనే ఆమెకు మరల కుచభరము వచ్చెను. అది విని విస్మితుడై, ఆ రాజు సపరివారముగా నమ్మచ్చెకంటి యింటికి వచ్చి జంగమ లింగమును పూజించి ప్రసన్నుని చేసికొనెను. అంతట శివుడు "కలధౌతా శైల శిఖరాలయ గేహము గట్టబంపవే" (ప్ర.అ.కా.మా 60) యని రాజును కోరెను అందులకు రాజు అంగీకరించి "తదాది పురాణ కథా ప్రసంగముల్ విన వలతు, సవిస్తర వైఖరిం జెప్పవే" అని ప్రార్థించెను. అపుడు శివుడు కాళహస్తి మాహాత్మ్యము చెప్ప దొడగెను. ఇట్లు ఏ కథ యైనను ఈ మాహాత్మ్యమున శివభక్తి ప్రతిపాదితమే.

దక్షిణ కైలాసమని ప్రసిద్ధి నందిన శ్రీకాళహస్తి క్షేత్రము సామాన్యము కాదు. తత్సమీపముననే గజకానన మను వనంబు కలదట. గాధి నందను కదంబున తన తనయులు నూర్వురుం జచ్చిన, వశిష్ఠుడు కదలేని దుఃఖమున కొండ యెక్కి క్రిందబడి ప్రాణ త్యాగము చేయ దలపగా, పృథివి పట్టుకొని రక్షించి ''దేవోత్తంసుని పార్వతీ రమణుని గొల్వు"మని యుపదేశించెను. అంత వశిష్ఠుడు శివునిగూర్చి అత్యుగ్రమైన తపము చేయ మొదలిడెను. ఆ దేవ దేవుడా మునికి ప్రత్యక్షమై వరములను వేడవలెనని పలికెను. తనకు బ్రహ్మ విద్య ననుగ్రహింప వలెననియు, ఈ స్థలముననే యుగముల తరబడి జనులు మహేశ్వరుని (నిన్ను) పూజించు నట్లనుగ్రహింపవలెననియు రెండు వరముల నా మహానీయుని కోరెను. వరమ శివుడట్లే అనుగ్రహించెను. శివు డిచటనే నివసించుట గాంచి పార్వతీ దేవియు పరమేశ్వర చిర విరహ భారంబును సహింపలేక వచ్చి తదీయ సన్నిధిని నిల్చి జ్ఞాన ప్రసూనాంబగా ఖ్యాతి వహించెను. కైలాస పర్వతము కూడ వచ్చి దక్షిణ కైలాసమను పేర ఇచట స్థిరపడి పోయెను. పార్వతీ పరమేశ్వరులు సపరివారముగా విహరించిన

ఆ గిరియే శ్రీకాళహస్తి యనబడెను. పార్వతీ దేవితో మహేశ్వరునకు వివాహము జరిగినప్పుడు, ఆ వివాహ మహోత్సవములు చూచుటకు దక్షిణ ప్రాంతమునందలి జనులందఱును ఉత్తరమునకు వచ్చిరి. అందువలన ఉత్తర దిక్కున భూమి క్రుంగిపోవ నుండెను. ఆ విషయమును గమనించి శివుడగస్త్య మహా మునిని పిలిచి, దక్షిణ ప్రాంతమునకు పోయి, ఆ ప్రాంతము తేలిపోక యుండునట్లు చేయవలెనని కోరెను. పరమశివుని యాజ్ఞ ననుసరించి యగస్త్యుడు దక్షిణమునకు ప్రయాణమయి మార్గమున అడ్డు వచ్చిన వింధ్య పర్వతము గర్వము నణచి వేసెను. ఆ పిదప, ఆ మహాముని గోదావరిలో నిమజ్జన మొనర్చి, పిదప కృష్ణానదిని తరించెను. శ్రీశైల మల్లికార్జునుని సేవించెను. సిద్ధ వటనాథుని దర్శించి దక్షిణ కైలాసమగు శ్రీకాళహస్తికి వచ్చి శివలింగమును పూజించెను. అప్పటికచ్చట సువర్ణముఖీ నది లేదు. తీర్థరహితమైన క్షేత్రము వెన్నెలలేని చంద్రునివలె నుండునే గాని శోభించదు. కావున అచ్చట తీర్థమును కూడ నెలకొల్ప వలెనని అగస్త్య మహాముని సంకల్పించెను. తన కార్యము నెరవేరుటకై అతడు తపస్సు చేయ నిశ్చయించి, ఆ క్షేత్రమునకు నాలుగు యోజనముల దూరమున గల పర్వతమునకు తన సహధర్మచారిణి యగు లోపాముద్రతో కూడ పోయెను. అచటి జలధారలో మునుగుచు తీవ్రముగా తపస్సు చేసెను. దానికి లోకములు తపించినవి. అతని తపస్సునకు కారణము తెలియక బ్రహ్మ ఇంద్రుడు మున్నగు ప్రధాన దేవతలు తల్లడపడి, పరమేశ్వరుని వద్దకు పోయి, అగస్త్యుని తపస్సును గూర్చి తెలిపి, అతని తపస్సును మాన్పి లోకములను కాపాడవలెనని ప్రార్థించిరి. తపః కారణము నెఱిగి శివుడు "మీరు భయపడ నక్కర లేదు, శ్రీకాళహస్తి క్షేత్రమున తీర్థమును నెలకొల్ప దలచి అగస్త్యుడు తపస్సు చేయుచున్నాడు. ఆ తపస్సు మాన్పుటకు నేను రానక్కరలేదు. నేను బ్రహ్మ వెంట ఆకాశగంగను పంపెదను." అని పలికి బ్రహ్మవెంట ఆకాశగంగను పంపెను. అది సువర్ణ కాంతితో మిలమిలలాడుచు సువర్ణముఖీ నది యయ్యెను. అది శ్రీకాళహస్తి ప్రక్కగా ప్రవహించెను. అగస్త్యుని కోరిక నెరవేరెను. అతడచటి శివుని పూజించి, అది వరకు లేని నది యేర్పడుట కాశ్చర్య పడిన మునులకు దాని వృత్తాంతమును తెలిపెను. మునులందఱును ఆనందించి అగస్త్యుని కొనియాడిరి. సువర్ణముఖి యచట ఉత్తర వాహిని యగుటచే ఆ క్షేత్రము కూడ అవిముక్త

క్షేత్రమయ్యెను. ఆ నదిలో స్నానము చేసిన కీటకమైనను శివైక్యమును పొందును. అగస్త్య మహాముని మునుల యనుమతి తీసికొని యచటినుండి దక్షిణమునకు పోయెను. ఈ వృత్తాంతమును జంగమ వేషియగు శివుడు తెలుపగా విని యాదవ రాజు మిగుల సంతసించి, ఆ క్షేత్రమున ముక్తి పొందిన జంతుకీటకాదుల వృత్తాంతమును తెలుప వలెనని ప్రార్థించెను. ఆ శివ భక్తుడు వాని వృత్తాంతమును చెప్పుటకు ప్రారంభించుటతో ప్రథమాశ్వాసము ముగియును.

ధూర్జటి ఈ ఆశ్వాసములో వీరశైవ సాహిత్యమునకు సంబంధించిన జంగముని ప్రవేశ పెట్టినాడు. దాని కూడా అటువంటిదే. అట్లని ఆగమ సంప్రదాయమును విడనాడలేదు. వశిష్ఠుడు, అగస్త్యుడు తపస్సు చేయుటలో నియమ నిష్ఠలు తీర్థమాహాత్మ్యములు యథావిధిగా వర్ణించినాడు.

ఇఁక ద్వితీయాశ్వాసమున బ్రహ్మ కథయు, శ్రీకాళహస్తుల కథయు చెప్పబడినది. బ్రహ్మ కథలో బ్రహ్మ కొలువు తీర్చియుండగా వాణి యచటకు విచ్చేయుట, ఆతడు కొలువు చాలించి వాణిని నూరు రూపములు గైకొని తన కోర్కె తీర్చ వలసినదని కోరెను. తత్ఫలితముగా నూర్గురు దుర్చేష్టులగు కుమారులు గల్గిరి. వారు రక్కసులై వింత విధముల ప్రవర్తింప సాగిరి. అంత వారిని బ్రహ్మ వింధ్యకు పొమ్మని ఆజ్ఞాపించెను. వారచటికి పోయి నివసించుచు, అచటి మునులను, జనులను మిక్కిలి హింసింప సాగిరి. భూమికి వారు మిక్కిలి భారము కాగా భూదేవి భరింపజాలక బ్రహ్మదేవునితో మొర పెట్టుకొనెను. అతనికి తన పుత్రులగు రాక్షసులపై మిక్కిలి కోపము కలిగెను. అతడు భూదేవి నూరడించి పంపివేసెను. పుత్రులపై కలిగిన కోపము నుండి అతనికి ఉగ్రుడను కుమారుడు జనించెను. బ్రహ్మ అతనిం జూచి "నీవు క్రూరులగు నీ సోదరులను చంపుము" అని యాజ్ఞ యిచ్చెను. అతడు తన సింహ రథముతో భూమికి దిగి వింధ్య ప్రాంతమునకు వచ్చి రాక్షసుల నెదిరించెను. రాక్షసులును జంకక అతనితో తలపడిరి. కాని తుదకు ఉగ్రుడే జయించెను రాక్షసులందరును సంహరింప బడిరి. ఉగ్రుడు ఆ వార్త బ్రహ్మకు చెప్పగా బ్రహ్మపుత్ర హత్యా బాధచే మండిపడుచు నుగ్రుని చూడ వాడును మరణించెను. పుత్ర హత్యా దోషమును, పుత్రహీనత్వంబును సంప్రాప్తమగు

టకు విచారించి బ్రహ్మ ఆత్మ వధూటితో గూడి దక్షిణ కైలాస శైలమున శివుని గూర్చి తీవ్రమగు తపసు చేయదొడగెను. అంత నొకనాడు శివుడు ప్రత్యక్షమయ్యెను. బ్రహ్మ తన పరిస్థితిని తెలిపి కోరికలను వెల్లడించెను. అంత మాహేశ్వరుడు "ఓ పరమేష్ఠీ! దక్షిణ కైలాసగిరి దర్శనముననే నీ పుత్ర హత్యా పాతకము నశించినది. నీవు మాఘ మాసమున మఖా నక్షత్రమున్న దినమున ఉషఃకాలము నందే లేచి సువర్ణముఖీ నదిలో స్నానము చేసి పంచాక్షరీ మంత్ర జపమును, నూటయెనిమిది పర్యాయములు మౌనముతో లింగ ప్రదక్షణము చేయవలెను. ఇట్లు సంవత్సర కాలము మఖా నక్షత్ర దినమున చేసిన యెడల నీకు సుపుత్ర ప్రాప్తి కలుగును" అని తెలియజేసి అంతర్ధాన మందెను. పిదప సరస్వతీదేవి గర్భము ధరించెను. ఆమెకు కుమారుడు జనించిన పిదప మహేశ్వరుడే వచ్చి వానికి ఋభువని పేరు పెట్టి ఆత్మ తత్త్వోపదేశ మొనరించెను. ఋభువు బ్రహ్మజ్ఞానియై యిచట సంచరించు చుండెను. అతని వలన నిదాఘుడీ బ్రహ్మ విద్యను పొందెను. నిదాఘుని వలన సనకాదులు తెలిసికొనిరి. వారు మునులకు బోధించిరి. మాయా జంగమ మూర్తి కీటకాదుల ముక్తి వృత్తాంతము చెప్పుటకు ముందీ పరమేష్ఠి వృత్తాంతము తెలిపి యాదవ రాజునకు శ్రీకాళహస్తులు ముక్తి నొందిన కథ తెలిపెను. పరమేష్ఠి యంతటి వాడు తప్పు మార్గమున చరించి, చివరకు తన తప్పిదము తెలిసికొని శివుని గూర్చి తపస్సు చేసి మంచి మార్గ మవలంబించ గల్గినాడు. ఈ కథలో ధూర్జటి శివుని ఆధిక్యతను నిరూపించినాడు. కవికి శివారాధన యందాసక్తి వెల్లడియగుట ఒకటి, త్రిమూర్తులలో బ్రహ్మ కూడ శివానుగ్రహము బడయవలసి వచ్చుట ఒకటి రెండు విషయములు ధూర్జటి ఈ కథ వలన తెలియజేసినాడు. సకల జీవులు పరమేశ్వరానుగ్రహమునకు పాత్రులు కావలసినదే యను సత్యమును నిరూపించినాడు ధూర్జటి. బ్రహ్మ తపస్సు శివుడు ప్రత్యక్షమగుట మొదలగునవన్నియు ఆగమ శైవ సంప్రదాయములనియే చెప్ప వచ్చును.

కృత యుగమున శ్రీ యనెడి చెలది యొకటి తన పూర్వజన్మ వాసన వలన శివుని సేవింప దలచెను. అది యా దేవ దేవుని పూజ చేయుటకు సామర్థ్యము లేని కీటకము. కావున తన నుండి వెలువడు తంతువులతోనే శివుని కయి దేవాలయ గోపురాదులను నిర్మింప సాగెను. అదియే యా దేవుని సేవ

యని తృప్తిని పొందెను. గాలి తాకునకు తెగిన తంతువులను మరల మరల అతుకుచు సర్వదా దేవాలయాది నిర్మాణమునే చేయుచుండెను. ఇట్లుండ శివునకు దానిని పరీక్షింప వలెనని బుద్ధి పుట్టెను. దీప శిఖచే ఆ తంతు గృహము లన్నియు తగులబెట్టెను. చెలదికి దుఃఖము, కోపము కలిగెను. అపు డిట్లను కొను చున్నది.

క॥ "ఇది పెక్కుడులు పట్టెన్
సదనంబులు గట్ట నాకు శంభుని కొలకున్
దుది గుమ్మరి కొక యేడును,
గుదె కొక పెట్టన్న మాటకు న్సరి వచ్చెన్"

(ద్వి. ఆ. కా. మా. 100)

ఈ విధముగా ననుకొని చెలది దీపమును మ్రింగబోవ శివుడు దానిని కెంగేలున పట్టి ఆపి దాని భక్తికి మెచ్చి సాయుజ్య మొసంగెను. శివుడు ఏమి కావలెనో కోరుకొను మనునప్పుడు సాలె పురుగు 'నా తపస్సు ఫలించినది' అని శివునకు నమస్కరించినది. భక్తితో సంభ్రమముతో ఉబ్బి తబ్బిబ్బై పోయినది. 'దేవా నేను నిను స్తుతింప లేను. నాకే పాటి వేదశాస్త్రములును రావు. వేదములే తమ కాద్యంతములు, లేదనగా అవి చదివిన వారికి మాత్ర మేమితెలియును? సేవించుటే కర్తవ్యమని తమ శ్రీపాదము లాశ్రయించితిని. నాకు సంసార దుఃఖములు లేకుండ కైవల్యము నిమ్మ' అనికోరెను. శివు డానందముతో దానిని తనలో నైక్యము చేసికొనెను. అదిచూచి దేవతలు మనము ప్రతిదినమును చేయు శివార్చనలెందును ? అని నిరసించిరి. మునులు తపస్సు లెందుకనుకొనిరి. యోగములోపడి కొట్టుకొచు వారు తమ జన్మము వ్యర్థమని తిట్టుకొనిరి. తక్కిన భక్తులు ఈ మతములు దండుగ యనుకొనిరి. దేవతలు మునులు చేసిన స్తుతిధ్వను లాకాశము నిండినవి. ఇది సాలె పురుగు కథ.

త్రేతాంతమున నొక్క కాలఫణి, పాతాళంబున నుండి దివ్య రత్నములను దెచ్చి ప్రతి దినము శివుని అర్చించుచుండెను. ఇట్లుండగా ద్వాపరయుగ ప్రారంభమున, ఒక ఏనుగు అచటికి వచ్చి ఫణి యర్చించిన మణులను త్రోచి

మాలూర శాఖలతో నాళీ కకహ్లార కుముద పుష్పంబులతో శివుని పూజింప సాగెను. ఉదయముననే కాలఫణి వచ్చి తని మణులు క్రిందకు త్రోయబడు టయు వాని స్థానమున పూవులుండుటయు చూచి కోపించి, ఆ పుష్పములను తొలగించి మణులతో శివుని పూజించి వెడలి పోయెను. ఆమరునాడు ఉదయ మున పాము వచ్చుటకు ముందే ఏనుగు వచ్చి, తాను పూజించిన పుష్పములు తొలగించబడి మణులుండుట చూచి అయ్యో రాళ్ళతో దేవుని పూజించుటయా ? ఎంత పాపము !" అని పరితపించి, ఆమణులను త్రోసివేసి పూవులతో లింగా ర్చన చేసి వెడలిపోయెను. పిదప వచ్చిన భుజంగము దీనిని గాంచి దుఃఖించి తిరిగి రత్నములతో మహేశ్వరుని పూజించెను. శివరాత్రి దినమున గజము రాత్రి యంతయు జాగరముండి ఉదయముననే స్నానము చేసి వచ్చి తన పూజ యొనర్చెను. సర్పమును, ఏనుగును, ఈరీతిని తాము చేసిన పూజలను నిరసిం చుచు, విరోధించు వారెవ్వరో తెలిసికొనవలెనని సంకల్పించుకొనినవి. సర్పము చిన్న రూపు ధరించి స్వామిని పూజించిన బిల్వ దళములలో దాగుకొని యుండి తని విరోధి రాక కొఱ కెదురు చూచుచుండెను. ఇంతలో అచటికి క్రొత్తపూవులు దళములు తీసికొని యేనుగు వచ్చెను. అది నిర్మాల్యమును తొలగించుచుండగా ఆగజమే తన విరోధియని గ్రహించి సర్పము దాని నాసారంధ్రములో ప్రవే శించి జర జరపోయి కుంభ స్థలమును చేరి మిక్కిలి బాధింప సాగెను. ఆ బాధను భరింప లేక యాగజము కుంభ స్థలముతో అచట పర్వతమును ఢీకొ నెను. ఆ తాకుడు వలన కుంభ స్థలము పగిలి యేనుగు మరణించెను. అందులో నున్న సర్పము చిదికి చచ్చెను. అట్లు చచ్చి రుద్రగణా కారంబులు దాల్చిన క్రాదివేయ భద్ర గజంబులకు శివుడు సాయుజ్య మొసంగెను. తిర్యక్కులు శివ సాయుజ్యము పడయుట ఈ కథ ప్రత్యేకత. మూఢ భక్తితో చేతనగు సేవ చేసి సాలె, చేతనగు పూజచేసి క్రాదవేయ భద్ర గజంబులు శివ సాయుజ్యము పడయుట విశేషము. ఇచట జంతువులు కూడ ఆగమోక్త ప్రకారము శివు నర్చించినవి. అభిషేకము, పూజ యిత్యాది విషయములు ఆగమ శైవ సంప్ర దాయములే.

ఇక కావ్యమునకు జీవగఱ్ఱవంటి తిన్నని కథ తృతీయాశ్వాసములో గలదు. పొత్తపినాటిలో 'ఉడుమూరు' అనెడు బోయపల్లికి నాథనాథుడు రాజు. అతని భార్య తండె. వీరికి తిన్నడను బాలుడు జన్మించెను. తిన్నడు "శైల

జాధిపుని కరుణచే" తండెకు జన్మించెనట. ఈ బాలుడు తప్పటగులు వేయు లోపల బాల్య క్రీడలన్నియు కవి ఒక పద్యములో చెప్పినాడు. సర్వం శివ మయంజగత్" యను భావమిచట గోచరము. తందే గర్భముదాల్చినది మొదలు తిన్నడు పెరిగి పెద్దవాడగు వరకు వారికి శివా రాధనయందున్న ఆసక్తి ఒక సీస పద్యములో కవి కన్నులకు కట్టినట్లు వర్ణించినాడు.

(కా. మా. తృ. ఆ. 130)

తిన్నడు పెరిగి పెద్దవాడై విలు విద్యల్లో నేర్పుగడించెను. తండ్రి బహు విధ మృగయా విహారంబుల చందం బెరింగింప గోరి, కాద్రేని జాతర సాగించెను. వేటకు తగిన వయసు వచ్చి యందు నేర్పుగడించిన పిమ్మట కాద్రేనికి జాతర చేయుట వీరియాచారము. నాథనాధుడు తందె ఉపవాసముండి సెలయేట జలకమాడి తగిన వస్త్రములు ధరించిరి. కుమారుని చక్కగా నలంకరించిరి. కాద్రేని గుడికి పోయి పూజ చేసిరి. ఉత్సవమంతయు ముగిసిన పిదప యిల్లుచేరిరి.

మరునాడు తిన్నాడు. వేటకు పోవుటకు ఏర్పాట్లు చేయబడెను అనుచరులతో తిన్నడు వేటకు బయలు దేరెను. కొంత సేపు వేటాడి అలసి అతదొక వకుళవృక్షపు నీడను పరుండి నిద్రించెను. అతని కప్పుడు స్వప్నములో మహేశ్వరుడు కనబడి "ఓ బాలకా! ఈ సమీ పముననే కొంద చేరువగా ప్రవహించు సువర్ణముఖీ నదీ తీరమున ఒక వట వృక్షము కలదు. ఆ వృక్షమూలమున భక్తులపాలిటి పెన్నిధి యగు పార్వతీ పతి కలడు. అతనిని సేవింపుము" అని చెప్పి అంతర్హితుడయ్యెను. తిన్నడు మేల్గాంచి చూచుసరికెవ్వరను కానరాలేదు. అప్పుదొక ఏకలము యెవ్వరికిం జిక్కక యతని వైపునకొచ్చి పరిగిడసాగెను. తిన్నడు దాని వెంటనంటెను. అది చాల దూరముపోయి సువర్ణముఖీ నదీ తీరమందలి వట వృక్షమూలము చేరి యచట అదృశ్యమయ్యెను. ఇది అంతయు శివుని మాయయని తిన్నడు గ్రహించెను. ఆ వృక్షమూలమున అతని కొక శివలింగము కానవచ్చెను. వేరు నివాసము లేక చెట్టు నీడ నాశ్రయించి యున్న ఆ దేవుడి దయనీయస్థితికి మిగుల పరితపించి, ఆ స్థలము విడిచి తమయూరికి రావలెననియు, అచట ఎన్నో సౌకర్యములు కలవనియు బ్రతిమాలుకొనెను. శివ లింగము కొంచెమై

నను చలింపలేదు. "నీవు రాకున్నచో నేనును ఇచటనే ఉండిపోయెద" నని తిన్నడు పట్టు బట్టెను

శ్లో॥ "ఇల్లో, ముంగిలియో, యనుంగు జెలులో, యీడైన
చుట్టంబులో,
యిల్లాలో, కొడుకో, ధరింపవశమే, యేపోడుముల్లేక ? మా
పల్లెం గోరిన వెల్లనుంగలవు తెప్పల్గాన, నీకిచ్చెదన్
జెల్లంబో ! యిటు నొంటినుండ కటు విచ్చేయంగదే
లింగమా
(శ్రీ. అ. కా. మా. 70)

మ॥ "నను మన్నించెదవేని నీవిపుడు రానావెంట, రాకుండినన్
నిను నే బాసి చనంగ నోప, నిచట న్నీతోడి దేలోకమై
మనువాడం, గనువాడ నీకరుణ, నీమౌనంబు చిత్తంబువ
చ్చినచో మానుదు గాని, విన్నిపుడు కస్తిం బెట్ట నాకేటికిన్"
(72)

అనుచరు లెంత బ్రతిమాలినను వారి గ్రామమునకు వెడలక తిన్నడు శివుని తోడిదే లోకమని, మహేశ్వరుడు రానిచో తాను గూడ రానని అచటనేయుండి పోయెను. వారు నిరాశతో తిరిగి వెడలిరి.

శివుని పయి ప్రగాఢ భక్తి గల తిన్నడు ఆ దేవుని తృప్తి పొందింప దలచి, అడవిలోకి పోయి యొక పందిని చంపి దాని మాంసము పక్వము చేసి రెండు దొప్పలలో నింపెను. సువర్ణముఖీజలమును నోటి నిండుగ నింపివచ్చి, ఆ పుక్కిటి నీటితో శివలింగమును కడిగి, మాంస ఖండములను భుజింపవలెనని శివుని ప్రార్థించెను. అతడెంత ప్రార్థించినను ప్రయోజనము లేకపోయెను. ఆర గింపని యెడల తాను ప్రాణములు విడుతునని పలుకుచూ ఎద్వదొడంగెను.

తిన్నడు మూఢ భక్తికి సంతసిల్లి శివుడా మాంస ఖండముల నారగి చెను. తిన్నడు పరమా నందభరితుడయ్యెను.

ఇట్లే అతడు ప్రతి దినము శివ లింగము నారాధించుచు, అవనమున తిరుగదొడగెను.

వారము దినముల కొకసారి భక్తుడగు శివబ్రాహ్మణు డొకడచటికి వచ్చి ఆ శివ లింగమును పూజించి పోవుచుండును. వాడుక ననుసరించి అతడు వచ్చి చూడగా లింగముపై చారికలు, గుడి యందు ఎంగిలి ఆకులు కానవచ్చెను. ఇది చూచి శివబ్రాహ్మణుడు చింతించుచు, ఇట్లు చేసిన వాడెవ్వడో చెప్పవలెనని లేనిచో ప్రాణములు విడుతునని పరమేశ్వరునకు విన్నవించెను. అంత పరమే శ్వరుడు తిన్నని వృత్తాంతము తెలిపి, ఆతని భక్తి యెట్టిదో తెలిసికొన దలచిన వెనుకన దాగి యుండమని శివబ్రాహ్మణునకు చెప్పెను.

శివ బ్రాహ్మణు డట్లే చేసెను. ఇచట తిన్నడు "శ్రుతి వ్యవహారేతర మత మున" శివుని గొలచుట విశేషము. ఇది మూఢ భక్తికి ప్రతీక. మాంస ఖండ ములు కాల్చి రుచి చూచి పెట్టుట ఒక వింత పద్ధతి. శివ బ్రాహ్మణుడు శివు నర్చించుట వైదిక సంప్రదాయ పద్ధతి. దీనినే ఆగమ శైవవిధాన మనవచ్చును. తిన్నడు పరమేశ్వరునితోడిదే లోకమనినమ్మి కఱకుట్లు అందించుట, శివు డార గించుట శృతి వ్యవహారేతర మార్గము. శివబ్రాహ్మణుని శివార్చన, తిన్నని శివార్చన రెండింటి యందును భక్తిభావము సమానమే. కాని శివుని కొలుచు మార్గములో భేదము గలదు.

తిన్నడు యథారీతిని వచ్చి అభిషేకించి మాంసా శనమును స్వీకరింప వలెనని శివుని ప్రార్థించెను. కాని శివుడు దానిని భుజింపలేదు. ప్రతి దినము తన నివేదన స్వీకరించుచున్న పరమేశ్వరుడు నే డుపేక్షించుటకు కారణ మేమోయని పరిశీలించి చూడగా శివుని కంటి వెంట నీరు కారుట కానవచ్చెను. అది చూచి తిన్నడు శివుని కంటికి వైద్యము చేయ మొదలిడెను. అడవి యందు దొరకు మూలికలన్నియు తెచ్చి తను విన్న మందులు కన్నమందులు అన్నియు వాడెను. కాని ప్రయోజనము లేకపోగా కంటి వెంట రక్తము కారుట మొద లిడెను. అంత తిన్నడు "కంటికి కన్నిచ్చుటయే మందని" నిశ్చయించి, బాణా గ్రమున తన కంటి నొకదాని నూడ బెరికి రక్తము స్రవించుచున్న శివుని నేత్ర స్థానమున అమర్చెను. అది మునుపటి కంటి కంటె నెక్కువగా ప్రకాశించెను.

కాని, మరల శివుని రెండవ కంటి నుండి కూడ రక్తము కారజొచ్చెను. అది చూచి ఆ యాటవిక భక్తుడు ధైర్యము వహించి "దేవా! కంటి కేది తగిన చికిత్సయొ తెలిసినది. ఇక భయములేదు" అని తన చెప్పు కాలిని శివుని కంటికి గుర్తుగా నుంచి, బాణముతో తన రెండవ కంటిని పెకలించుటకు సిద్ధపడెను. అట్టి సమయములో శంకరుడు ప్రత్యక్షమై "నిలువు, నిలువు" మనుచు ఆ బాణమును పట్టుకొని తిన్నని ప్రయత్నమును వారించెను. తిన్నని భక్తికి వెనుక నుండి చూచిన శివబ్రాహ్మణుడు మిగుల ఆశ్చర్యపడెను. ఇట్లు ప్రత్యక్షమైన శివుడు 'మీకే వరములు కావలెనో కోరుకొమ్మ'నెను. అంత తిన్నడు, శివ బ్రాహ్మణుడు యిరువురు కూడ జన్మరాహిత్యమును, తాదాత్మ్యమును కోరిరి. ఆ దేవ దేవుడు వారిని తనలో నైక్యము చేసికొనెను. శివునకు కన్నునిచ్చుట వలన తిన్నడు కన్నప్ప యయ్యెను. నేటికిని శ్రీకాళహస్తిలో కొండపైన కన్నప్ప విగ్రహము నిలువు టెత్తున గలదు. దేవాలయము కూడ నిర్మించిరి.

ఈ కన్నప్ప కథ పాల్కురికి సోమనాథుని 'బసవ పురాణము' నందు ఉడుమూరి కన్నప్ప యను పేరిట కలదు. కన్నప్ప యను తిన్నని జన్మభూమి వర్ణనము, తిన్నని జననము, తిన్నడు విలువిద్యల నభ్యసించుట, తిన్నడు పరిజనంబుతో గూడి వేటకు వెడలుట యను వర్ణనాత్మక భాగములు బసవ పురాణమున నిరపేక్షములు. స్వప్నమున శివుడు సాక్షాత్కరించుట, మొగలేటి సమీపమున శివలింగ మున్నదదని చెప్పుట, ఒక ఏకలము వెంట తిన్నడు శివలింగము కడకు బోవుట, అంత నా ఏకల మదృశ్యమగుట మొదలగు విషయములు బసవ పురాణమున లేవు. ధూర్జటి గ్రంథమున శివలింగమునకు తిన్నడు సేవలు చేయుట వానినిగని బోయలు పరితపించుట గానరాదు. కొండలో నొంటిగా నున్న పరమేశ్వరుని చూచి ఉడుమూరికి రమ్మని తిన్నడు పరమేశ్వరుని ప్రార్థించిన ఘట్టము బసవ పురాణము నందిట్లు గలదు.

> "కొండల లోన నొక్కండ నీవిట్టు
> లుండంగా వెఱవ నాఖండేదు మౌళి" (బ.పు.తృ.ఆ)

ఈ ద్విపద భావమునే ధూర్జటి తెలుగు కావ్యమున ౬, ౯ పద్యములలో విపులముగా చెప్పినాడు. (కా.మా.తృ.ఆ. 65, 66, 67, 68, 69, 70)

మాంస ఖండములు కాల్చుట, ప్రేల్చుట సోమనాదుడు కూడ వివరించెను. తిన్నడు పరమేశ్వరుని నేత్ర రోగమునకు చికిత్సలు చేయుట, శివుడు తిన్ననికి ప్రత్యక్షమగుట యనునవి ఉభయ గ్రంథ సామ్యములు. ధూర్జటి బసవ పురాణమున లేని విషయములు కొన్ని చెప్పినాడు. బసవ పురాణమున తిన్నని కథ (కన్నప్ప కథ) యని కలదుగాని తిన్నని తల్లి తండ్రుల పేర్లుగాని వాని జననముగాని చెప్పలేదు. ధూర్జటి బసవ పురాణమున గల విషయములు కొన్ని వదిలి పెట్టినాడు. సౌందర్య మహాకాయులును, శివభక్తులగు రాక్షసులు, బుద్ధి పూర్వకముగ మృగములై తిన్నని చేతిలో వధింపబడు సన్నివేశము కాళహస్తి మాహాత్మ్యమున లేదు. సోమనాదుని బసవ పురాణ గాథలో గన్పించు పాదోదక ప్రాసాదముల ప్రభావమును ధూర్జటి తానద్వైతి యగుటచే కాబోలు విడిచి పెట్టినాడు. శ్రీకాళహస్తీశ్వరుడు ప్రత్యక్షమై తిన్నని వరములు వేడుమనగా నతడు పలికిన విధము కూడ బసవ పురాణము కంటె భిన్నముగా గలదు. బసవ పురాణములో ప్రసన్నుడైన పరమేశ్వరునితో కన్నప్ప యిట్లు విన్నవించుకొనెనట.

"ఎఱుగ మోక్షముల పేరెఱుగ వాంఛితము" (బ.పు.తృ. ఆ) ధూర్జటి ప్రబంధములో తిన్నడు 'భగవదనుగ్రహమున జగన్మిథ్యాత్మకత్వ భావన చిత్తమున దృఢముగ నాటుకొన్నదనియు, నింక జిద్గగనమున గలపి క్రమ్మఱ బుట్టకుండునట్లు చేయుమని వేడుకొనెను.

1ఈ తిన్నని కథ తమిళ సాహిత్యములో 'పెరియ పురాణము'న, 'తిరువళ్ యాడల్ పురాణము'నను గలదు. శ్రీకాళహస్తి మాహాత్మ్యము నందలి తిన్నని కథకు దానికి యించుక భేదము లున్నను తిన్నడు శివునారాధించుట సాయుజ్యము వడయుట అచట కూడ చెప్పబడినవి.

ఇక సంస్కృత సాహిత్యమున కన్నప్పను మొట్టమొదట గైవార మొనరించినది ఆచార్య శంకరులుగా చెప్పబడినది. వారు తమ శివానంద లహరిలో కన్నప్ప నీ విధముగా ప్రశంసించిరి.

---

1. ఈ విషయములు విపులముగా నాసిద్ధాంత వ్యాసములో (మహాకవి ధూర్జటి జీవితము-రచనలు) చర్చించి యుంటిని.

శ్లో॥ మార్గావర్తిత పాదుకా పశుపతే రంగస్య కూర్చాయతే
గండూషాంబు నిషేచనం పురరిపోర్దివ్యాభిషేకాయతే
కించిద్భక్షిత మాంస శేషకబళం నవ్యోపహారాయతే
భక్తిః కిం నకరోత్యహో! వనచరో భక్తావతంసాయతే

(శివానందలహరి ౬౩ శ్లోకం)

తెలుగున కన్నప్పను ప్రశంసించినది 'శివ తత్త్వసార'ము రచించిన మల్లికార్జున పండితుడు. ఇంకను శ్రీనాథుని భీమేశ్వర పురాణమున ప్రథమా శ్వాసమున కన్నప్పను గూర్చిన ప్రశంస యిట్లుగలదు.

'పన్నీట గంధ జలమున
నన్నయ తల్ల ప్రధాను దభిషేకింపన్
గన్నప పుక్కిట నీటన్
గన్నయ రోచికము వాయగఱ కందునకున్'

(భీ.పు. 1-౬౩)

తిన్నని కథ అముక్త మాల్యదలోని మాలదాసరి కథతో ప్రతిస్పర్ధిగా నున్నట్లనిపించును. అందు మాలదాసరి వైష్ణవ భక్తుడైనచో, ఇందు తిన్నడు శైవభక్తుడు. కులముచే నాతడు మాలవాడు. ఇతడు బోయవాడు. ఇరువురు మూఢ భక్తులే. వేద శాస్త్ర సంబంధ మగు పాండిత్యము లేనివారు. చివరకు భగవద్భక్తియే యిరువురకు కైవల్య సాధకమైనది. బహుశ శ్రీకృష్ణ దేవరాయల కృతి యగు ఆముక్త మాల్యద చదివిన పిమ్మట శైవపరముగా నీ భక్తుని (తిన్నని) కథ ధూర్జటి వ్రాసి యుండవచ్చును కేవలము దేశి కథను తీసికొని ధూర్జటి శైవ భక్తి జోడించి ఈ కథను వ్రాసినను వ్రాసి యుండవచ్చును.

ఇంక నత్కీరునికథ మధురాపురాధిపతులైన పాండ్యభూపతులయొద్ద పూర్వము అగస్త్యుడొసంగిన శంఖపలక మొకటిగలదు. భారతీదేవి కెనయైన వారలెందరకైన దానిపై చోటు లభించును. ఒక్కటే యున్నచో, అందులకు తగినచోటు మాత్రమే యుండును. కలియుగమున పాండ్యరాజు సభలో నత్కీరాది కవుల పన్నిద్దరుండిరి. ఒకప్పుడా రాజ్యమున దుర్భరమగు కఱువు సంభ

వించెను. ఆకలి బాధతో దేశమును వీడి పోనెంచిన ఒక హర ద్విజుని వారించి, శివుడొక పద్యమును వ్రాసియిచ్చి "భూపాలుని సభలో దీనిని చదివినచో మెచ్చిసత్కరించు" నని చెప్పెను. శివభక్తుడట్లే చేసెను. ఆ పద్యములో "సింధుర రాజగమనా దమ్మిల్లము సహజగంధ"మని వర్ణితమైయున్నది. అట్టి వర్ణన సరికాదనియు, యువతీ కేశ పాశమునకు సహజమైన పరిమళము లేదనియు నత్కీరు డాక్షేపించెను. అంత నాబ్రాహ్మణుడు తిరిగిపోయి ఈ వృత్తాంతము శివుని కెఱింగింపగా పరమేశ్వరుడే స్వయముగా రాజస భకరుదెంచెను. ఆ సందర్భమున పరమేశ్వరు డిట్లను చున్నాడు.

క। "కట కట ! యన్నత్కీరుం
డట ! కవితయు దప్పువట్టెనట ! యటు పదమీ
యెటువలెనో తెలిసెద ?" నని
నిటలాక్షుడు వచ్చి, కుంభినీ పతిసభలోన్."

(కామా। తృ। ఆ। 166)

శా। ఈ రాజన్యుని మీదనే గవిత సాహిత్య స్ఫురన్మాధురీ
చారుప్రౌఢిమ జెప్పి పంప, విని మాత్సర్యంబు వాటించి,న
త్కీరుండొరకే తప్పువట్టెనట : యేదీలక్షణంబో, యలం
కారంబో, పదబంధమో? రసమో చక్కంజెప్పుడా తప్పనన్

(కా। మా। తృ। ఆ 167)

నత్కీరుడు ఊరుకొనక "గిరి తనయా ఘనకచ భారంబు సహజ గంధం" బను మాట తప్పనెను. నీలగ్రీవుడు నిటలనేత్రము తెఱచినను, నత్కీడూరుకొనక దివ్యస్త్రీలకు గంధమున్న ఉండవచ్చును గాని సామాన్యుల విషయమట్లు గాదు" ఇది తప్పు అని వాదించెను.

ఇదే విషయము తమిళమున " నెత్రికణ్ కన్నే క్కాట్రినం కుట్రం కుట్రయే" యని చెప్పబడినది. తలచుట్టు వార కన్నులున్నను తప్పుతప్పేయని ఖండిత వాదము చేసినాడు.

అంత పరమేశ్వరుడు "కుష్ఠువ్యాధి బాధితుడయ్యెదవు గాక" యని శాపమిచ్చినాడు అంత నక్కీరుడు పశ్చాత్తప్తుడై శాపానుగ్రహ మీయవలసినదని పరమేశ్వరుని వేడుకొనెను. పరమేశ్వరుడు "కైలాస శైలమును గనునప్పుడు శాపాంతమగు" నని అనుగ్రహించెను. దేహము పట్టు తప్పక మున్నె తీర్థయాత్రలన్నియుజేసి చివరకు కైలాసము జేరవలయునని నక్కీరుడు నిశ్చితుడయ్యెను. కైలాసగిరికి బయలు దేరిన నక్కీరుడు మార్గ మధ్యమున పెక్కుపుణ్య స్థలములను దర్శించుచు పోయెను. అతడు చెవ్వందీశ్వరుని, జంబుకేశ్వరుని దర్శించెను. కావేరిలో తీర్థమాడి, పోయి, పోయి, అరుణాచలేశ్వరుని కొల్చి, తిరువత్తూరి దేవుని సేవించెను. పిచ్చి నయనారును దర్శించెను. పిదప కాంచీ పురాధి నాధుడగు ఏకామ్రేశ్వరుని సేవించి కొన్ని ప్రయాణములుచేసి విక్రమ సింహపురము చేరెను. పెన్నను, గుండ్లకమ్మను, కృష్ణానదిని, గౌతమీ గంగను దాటి పీఠికాపురమునకు పోయి కుక్కుటేశ్వరుని దర్శించెను. తరువాత సింహాచలమును, శ్రీకూర్మమును, గోకర్ణమును, పురుషోత్తమ క్షేత్రమును, కృత్తివాసమును, కటకమును, జలేశ్వరమును, నందనేశ్వరమును గయను, గంగానదిని దర్శించెను. కాశీక్షేత్రమున విశ్వనాధుని, విశాలాక్షీదేవిని, కాలభైరవుని, ఢుంఠి విఘ్నేశ్వరుని సేవించెను. పంచక్రోశక్షేత్రములను దర్శించెను. ఇంత దూరము ప్రయాణము చేయుట వలన అలసి పోవుటవలన "కైలాస పర్వతమున కెట్లు పోగలను?" అని దిగులు కలిగెను. కొంత దూరమేగగా ఒక సరోవరము కానవచ్చెను. దాని తీరమున ఒక మర్రిచెట్టు కలదు. నక్కీరుడు ఆనీడలో కొంత విశ్రాంతి తీసికొనెను. ఆచెట్టు నుండి రాలిన పండుటాకులలో నేలపై పడినవి పక్షులుగను, నీటిలో పడినవి మత్స్యములుగాను మారుచుండెను. ఒక ఆకులో సగము భాగము నీటిలోను, సగము భాగము నేలపైన పడియుండగా అది సగము చేప, సగము పక్షిగా మారెను. దీనిని చూచి నక్కీరు డాశ్చర్యపడు చుండగా, ఒక భూతము వచ్చి అతనిని పట్టుకొనెను. ఆ భూతము నక్కీరుని గుహలో పెట్టి, గుహద్వారము నొక బండరాతితోమూసి స్నానమునకై కొలనికి పోయెను.

అదివరకే ఆ గుహయందు కొందరు మానవులు బంధింపబడిరి. 'ఇదియే' మని నక్కీరుడు వారిని ప్రశ్నింపగా వారిట్లనిరి "ఈ క్రూరుడు తన ఆహా

రార్థము మమ్మందరిని ఇచట చేర్చియున్నాడు. తన నియమము ప్రకారము నూరుగురు పూర్తియైన పిదపనే ఈ పనిని నెరవేర్చును. మేము తొంబది తొమ్మండుగుర మున్నాము. నీతో శత సంఖ్య పూర్తియైనది. ఇక మనకందరి కిని మరణము తప్పదు. "

ఈ వృత్తాంతము విని నక్కీరుడు నిరాశాపూరిత హృదయుడైనను ధైర్యము తెచ్చుకొని ఆ భూతమును చంపి, అచటి వారినందరిని రక్షింప వలెనని కోరుచు సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించెను. ఆ దేవుడా తని మొర నాలించి, ప్రత్యక్షమయి, భూతమును చంపి, గుహద్వారమున నున్న శిలను త్రోసివేసెను. అందలి వారందరును పరమానందముతో బయటపడి తమ యిచ్ఛవచ్చినట్లు పోయిరి. ఆ దేవుడు "నీ విచటికి రాగారణమేమి ?" అని ప్రశ్నింపగా నక్కీరుడు తన వృత్తాంతము నంతటిని తెలియ జేసి "స్వామీ! నాకు కైలాసగిరికి పోవుట సాధ్యము కాదు. నన్నెట్లో నీవే రక్షింపవలెను" అని ప్రార్థించెను. గుహుడు క్షణమాత్ర మాలోచించి "ఓయీ! మహేశ్వరుడు కైలాసగిరి యనెను గాని ఉత్తర కైలాసగిరి యని చెప్పలేదు గదా! నీవు దక్షిణ కైలాసగిరిని చూచినయెడల నీ యీ కుష్ఠురోగము నశించును. దానికొక యుపాయము చెప్పెదను. నీ వీ సరస్సులో స్నానమాడినచో కైలాసగిరి దర్శనము సిద్ధించును" అని పలికెను. నక్కీరు డందు స్నానముచేసి లేచు సరికి ఎదుట సువర్ణముఖీ నదీతీరమున దక్షిణ కైలాసపర్వతము కానవచ్చెను. అతని కుష్ఠురోగము మాయమయ్యెను.

నక్కీరు డాశ్చర్యముతో పరమానంద భరితుడై యానదిలో స్నాన మాచరించి శ్రీ కాళహస్తీశ్వరుని దర్శించి పూజించి ద్రావిడ భాషలో నూరు పద్యములతో ఆ దేవుని స్తుతించెను. దానికి శివుడు సంతసించి ప్రత్యక్షమై వరము వేడుకొమ్మనెను. తనకు సంసార దుఃఖము లేనట్లు చేయవలెనని నక్కీరుడు ప్రార్థింపగా ఆ కాళహస్తీశ్వరు డతనికి సాయుజ్యము నొసగెను.

నక్కీరుడు మహాజ్ఞాని. చదువుకున్న వాడేయైనప్పటికి తన అహంకారము వలన శివునితో వాదనకు గురియై శాపము పొంది, చివరకు శివానుగ్రహము బడయుట వలననే శాప విముక్తి పొంది, తప్పిదము తెలిసికొని పరమేశ్వరుని

సాక్షాత్కరింపజేసికొని శివునిలో లీనమయినాడు. శివుని మహాత్మ్యము ఇందు వెల్లడింపబడినది.

ఇంకను ఈ నక్కీరునికథ తమిళ వాఙ్మయమున కూడగలదు. శ్రీకాళహస్తి పురాణములో 'నక్కీరర్‌సర్గ' యనుపేరిట ఈ కథగలదు. తమిళము నందేకాక స్కాందపురాణమున, హాలస్య మాహాత్మ్యమునకూడ ఈ కథ ప్రస్తావింపబడినది.

ఇక వేశ్యాతనయులకథ. మధురాపురమున మాణిక్యవల్లి యను వార వనిత గలదు. ఆమెకు దైవయోగంబున నిరువురు కుమార్తెలు కలిగిరి. వారు ఆబాల్యముగ శివభక్తురాండ్రు. వారు శివునే పరమదైవమని భావించి వార ధర్మమును పాటింపక యుండిరి. తల్లి వారికి వార ధర్మము నెంత బోధించినను వారి మదికెక్కలేదు ఇతర వార కన్యలు రతీమన్మధులను పూజించు చుండగా వీరు పార్వతీ పరమేశ్వరులను పూజించుచుండిరి. తమకు శివుడే భర్తయని తమ నిశ్చయమును తల్లికెరింగించిరి. కాని ఆమె ఎట్లయినను వారిని వేశ్యా వృత్తిలో దింపవలెనని సంకల్పించు కొనెను. అచటనున్నచో ప్రమాదము సంభవించునని తెలిసికొని వారు తల్లికి తెలియకుండ ఊరు విడిచి శ్రీకాళహస్తి పోవుటకు నిశ్చయించుకొని, అది చాల దూరముననున్న ప్రదేశము, యువతు లగు తాము నిస్సహాయముగ ఆ క్షేత్రమునకు చేరుట సాధ్యముకాదు, తమ్మచ టికి భద్రముగా తీసికొని పోవువారెవ్వరా ? అని వారాలోచించుచుండిరి. జంగమ వేషములు ధరించిన యిరువురు దొంగలా పట్టణమున ఈ వేశ్యా కన్యకల యాశయమును గ్రహించిరి. "రాజ భటులను మోసపుచ్చి రాజ భవన మున ప్రవేశించి ధనము నపహరించుట కష్టసాధ్యమైనపని. దాని వలన ప్రమా దముకూడ సంభవించును. ఈ బాలికలను నమ్మించి కాళహస్తికి కొనిపోయెద మని చెప్పి సులభముగా వీరి సొత్తును, నగలను దొంగిలింప వచ్చును" అని వారు నిశ్చయించి వేశ్యమాత యింటియరుగుపైనే పరుండుటకు వచ్చిరి. వారు కన్యలతో "అమ్మలారా! మీరు మీ తల్లితో పోరనేల ? మీ సంకల్పమును గ్రహించితిమి. మేము మిమ్ము భద్రముగా శ్రీకాళహస్తికి తీసికొని పోవుదము. మేమును శివభక్తులము. మమ్ము నమ్మి మాతోరండు. మీకెట్టి శ్రమయు ఉండదు. మీరు జంగమ స్త్రీలవేషములు ధరింపుడు. అర్ధరాత్రి ప్రయాణము చేసిన

ఎవ్వరికిని తెలియదు. ప్రయాణమునకు సిద్ధపడుడు" అని పలికి ప్రయాణము నకు ప్రోత్సహించిరి. వారును జంగములను నమ్మి, తామును జంగమ స్త్రీల వేషములు ధరించి, అర్ధరాత్రి సమయమున తల్లికి తెలియకుండ ఆ జంగముల వెంట ప్రయాణమైరి. తెల్లవారు సరికి వారు రెండున్నర ఆమడల దూరము ప్రయాణము చేసిరి. దొంగలు వీరిని తప్పుమార్గమున ప్రయాణము చేయించు చుండిరి. వారు కుంభకోణమునుచేరి కుంభేశ్వరుని పూజించిరి. పిదప చిదంబరమునకు పోయి నటరాజస్వామిని దర్శించిరి. శివకామ సుందరిని సేవించిరి. సముద్ర తీరమునకేగి, సముద్రుని పూజించిరి నాటిరాత్రి చిదంబర మున నివసించి మరునాటి వేకువనే ప్రయాణమై ఒక యడవిని ప్రవేశించిరి.

ఇంతవరకును దొంగలకాకన్యలను చంపి, వారి యాభరణములను, సొత్తును అపహరించుట కవకాశము కలుగలేదు. వారు బస చేయుచున్న స్థలము లలో రాత్రి సమయమున వారిని చంపవలెనని చోరుల సంకల్పము. కాని ప్రతి రాత్రియు శివుడొక జంగమ వేషమున వచ్చి ఆత్మ విద్యను బోధించు నెపమున వారు నిద్రింపకుండునట్లు చేయుచు కాపాడు చుండెను. జన సంచారములేని యీ యడవిలో నైనను తమ సంకల్పము నెరవేర్చు కొనవలెనని దొంగలు తలచిరి. కాని అది కొనసాగలేదు. సేనలతో కూడి రాజు పోవుచున్నట్లును, పుళిందులతో కిరాతరాజు పోవుచున్నట్లును,వర్తకులు, పశువులను కాయు గొల్ల వాండ్రును కానవచ్చునట్లును, శివుడు కల్పించుట వలన దొంగ లేమియును చేయలేకపోయిరి క్రమముగా వారు అరణి నదిని చేరిరి. అచటినుండి శ్రీకాళహస్తి పర్వతము దృగ్గోచరమగు చుండెను. వారానదియందు స్నానము చేసి, తీరముననున్న శివుని సేవించిరి. అచటి శివలింగమును తొల్లి వాలి పూజించెనట. అచట భైరవుడు సిద్ధుల కణిమాది సిద్ధుల నొసగెనట. ఆ క్షేత్ర మహాత్మ్యమును తెలుపవలెనని వార కన్యకలు కోరగా స్థలజ్ఞులగు పౌరులిట్లు చెప్పిరి.

"ఇచట తొల్లియొక సరోవర ముండెడిది. ఒకప్పుడు మహాశివ భక్తుడైన వాలి తన సజ్జలింగమును, ఆ సరోవర తీరమున ఒక పీఠముపైనుంచి, పూజించి, ఉద్వాసన చెప్పి తిరిగి ఆ లింగమును తీసికొనదలచెను. కాని అది కదలలేదు. వానరరాజగు వాలి, తా నెచటికి పోయినను- తనతోకూడ ఆ లింగ

మును త్రీసికొనిపోయి నిత్యము పూజించుట పరిపాటి. లింగము చలింప నందులకు మిక్కిలి యాశ్చర్యపడి, అతడు తన బలమునంతను ఉపయోగించి రెండుచేతులతో పట్టిలాగెను. లాభము లేకపోయెను. తోకతోగట్టిగా చుట్టి పెకలింపజూచెను. లింగముపై నఖుకులు పడెనేగాని యది కదలలేదు. వాలిని మించిన బలశాలి మరియొకడు లేడు. అతనికే సాధ్యపడలేదు. ఇది శివుని మాయయని తలచి యతడా లింగమునకు మ్రొక్కులిడి "స్వామీ! ఏల కదలి రాకున్నావు? నా యపరాధమేమి? నాపై రోతకలిగినదా? ఒక పూటయైనను నిన్నుచూడక జీవింపలేను. ఇట్టి నన్ను నిమిషకాలములో విడిచితివే"! అని వాపోయెను. ఆ శివలింగ మింద్ర పుత్రునితో "ఓయీ! నీయపరాధమేమియు లేదు. నాకీసరోవర తీరమునందే నివసింపవలెనని బుద్ధిపుట్టినది. కావుననే కదలకుంటిని. నిన్ను నే విడువలేదు. నీవు నన్ను నీమనస్సున ఉంచుకొని సేవింపుము." అని పలికెను.

ఆ సరోవరమును పూడ్చి వేసిన యెడల శంకరుడు తనంతనే కదిలి వచ్చునని వాలి భావించి, ప్రక్క నున్న కొండను పెల్లగించి యా సరస్సులో పడవైచెను. అందున్న జలము వెల్లువయై శివలింగమునకు దక్షిణ దిశగా ప్రవహించెను. ఇది ఉత్తమ తీర్థము, ఇందుస్నాన మొనరించినచో నరుడు సంసార సముద్రముమ తరించును. ఈ కొండ భైరవునికి నివాసము. బ్రహ్మాది దేవతలిందు చరించుచుందురు. పార్వతీ పరమేశ్వరులిందు విహరింతురు. భైరవుని కృపవలన అణిమాది సిద్ధులును ఇచట సులభములగును."

ఇట్లా సరస్సు పూడ్చబడినను లింగము కదలలేదు. వాలి మిక్కిలి విచారముతో ఆలింగమును విడువలేక, విడువలేక నిట్టూర్పులు నిగిడించుచు, నాటి దిన ముపవాస ముండి పటనుండి వెడలిపోయెను. ఈ తీర్థమాహాత్మ్యమును దేవతలు కూడ వర్ణింప జాలరు. మానవ మాత్రులకెట్లు సాధ్యమగును?"

పౌరు లిట్లు చెప్పి యా వనితల నా రాత్రి అచటనే నివసింప గోరిరి. వారును మజ్జన భోజనాదుల నిర్వర్తించుకొని యొక బస నేర్పాటు చేసికొనిరి. నాటి రాత్రి వాలీశ్వరుని, భైరవుని సేవించి శ్రీకాళహస్తీశ్వరుని మదిలో ధ్యానించుచు విడిదికి వచ్చి భుజించి, శివునిపై స్తోత్రములను పఠించుకొనుచు రాత్రి గడపిరి.

మరునా డుదయముననే వారు ప్రయాణమై యొక పల్లెను చేరిరి. దానికిని శ్రీకాళహస్తికిని నడుమ ఒక పెద్ద యడవి యుండెను ఆ యడవిని దాటినచో మాపటి వేళకా క్షేత్రమును చేరగల్గుదురు. అచటికి పోయిన పిదప, ఆ వార కన్యలను చంపుట సాధ్యము కాదని, అడవిలో ప్రయాణము చేయునప్పుడే చంపవలెననియు ఆ చోరులు నిశ్చయించిరి. అడవిలో పోవుచున్నప్పుడు వారీ కన్యలను చంపుటకు సిద్ధపడగా వారు శివ స్తోత్రములు పఠింపసాగిరి. అప్పుడు శివుడు ప్రమథులతో కూడ జంగమ వేషమున ప్రత్యక్షమయ్యెను. వారిం జూచి దొంగలు భయపడి పారిపోయిరి. జంగమ వేషధారి యగు శివుడా కన్యలం జూచి, మీరిటకేల వచ్చితిరి? అని యడుగగా వారు తమ వృత్తాంతమును, దొంగలు జంగమ వేషములతో తమ్ము మోసగించి తీసికొని వచ్చి, యిచట చంపి, తమ యాభరణములు తీసికొనదలచుటయు, తాము శివుని స్తుతించుటయు, ఇపుడు యథార్థ జంగములను చూచి భయపడి పారిపోవుటయు తెలిపిరి. "అమ్మా! మీరు భయపడనక్కరలేదు. మేము మిమ్ము సురక్షితముగా కాళహస్తికి తీసికొనిపోవుదము'' అని చెప్పి అడవిని దాటించి, శ్రీకాళహస్తికి తీసికొనిపోయిరి. ఆ వార కన్యలు గుడి వద్దకు రావేగమే ఆ జంగముల పెద్ద తోడి వారితో కూడ మాయమై వారికి మిక్కిలి యాశ్చర్యమును కలిగించెను. దొంగల నుండి తమ్ము రక్షించి, శ్రీకాళహస్తిని చేర్చిన వారు జంగములు కారనియు ఆ వేషముతో నున్న మహేశ్వరుడును, ఆతని సేవకులగు ప్రమథ గణములని అప్పుడు వారు గ్రహించి, చేత జిక్కిన పెన్నిధానమును జారవిడిచితిమే! యని మిగుల విచారింప దొడగిరి. అయినను ఆ దేవదేవునికి తమపై కరుణ యున్నదనియు, తప్పక కైవల్యము ననుగ్రహింప గలడనియు భావించిరి. వారచ్చటి సువర్ణ ముఖీ నదిలో స్నానము చేసి, ధౌత వస్త్రములు ధరించి, నదీ తీరమున గల యిసుక తిన్నెలపయి పద్మాసనము వేసికొని కూర్చుండి శివుని స్తుతింప సాగిరి ద్రావిడ భాష యందు నక్కీరుడు రచించిన పద్యములను పఠింప సాగిరి. కొంత సేపైన పిమ్మట అటనుండి లేచి, దేవాలయమునకు పోయి శ్రీకాళహస్తీశ్వరుని, జ్ఞాన ప్రసూనాంబను దర్శించి, అవధిలేని యానందమును పొందిరి. వారి కనుల నుండి ఆనంద బాష్పములు ధారగా ప్రవహింప సాగెను. వారు పెక్కు విధముల నా యాదిమ దంపతులను కీర్తించి ప్రార్థింపగా శివుడు ప్రత్యక్షమై వారికి సాయుజ్య మిచ్చి అంతర్హితుడయ్యెను.

అచట - మధురలో దేవాలయమునకు పోయివత్తు మని చెప్పిన పుత్రిక లెప్పటికిని రానందున వేశ్యమాత కలత పాటు చెంది గుడికిపోయి వెదుకగా వారెచ్చటను కానబడరైరి. పిదప ఆకాశవాణి వారి వృత్తాంతమును తెలిపి యామె మనస్సును కుదుటపరచెను. మరియు నాకాశవాణి వేశ్యమాతతోను, తోడి వారలతోను శ్రీకాళహస్తికి పోయి శివుని సేవించిన ముక్తి కలుగునని చెప్పిన, వారట్లే యొనరించి ముక్తిని పొందిరి.''

ఈ కథను వినిన పిదప యాదవ రాజు మాయా జంగము మూర్తితో ''స్వామీః గొప్ప తపస్సులు చేసిన విజ్ఞులకే శివుని తెలిసికొనుట సాధ్యము కాదు. ఇట్టి స్థితిలో సాలెపురుగు, పాము, గజము, ఎరుకును ఆ దేవునెరిగి, పూజించి ముక్తిని పొందుట యెట్లు సంభవించెను?" అని ప్రశ్నించెను. అంత నామహనీయు డిట్లు చెప్పసాగెను.

"బ్రహ్మ దేవుడు సృష్టి కార్యమును నెరవేర్చుచుండగా, విశ్వకర్మ పుత్రుడగు ఊర్ణనాభుడు తనకును అట్టి శక్తి కలదను గర్వమున బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి యొనర్పసాగెను. దానికి బ్రహ్మ కోపించి అతనిని ఊర్ణనాభము-సాలె పురుగు అగునట్లు శపించెను. అతడు బ్రహ్మ కాళ్లపై పడి ప్రార్థింపగా, బ్రహ్మ "ఓయీ! నీ వూర్ణనాభమవై భూలోకమున గజారణ్యమునందు బిల్వవనమున నివసించుచు నీదారముతో చిత్ర విచిత్రములగు నిర్మాణములను శివునికయి చేయుచుండుము. శివు డనుగ్రహించి నీకు శాప విముక్తి కలిగించి ముక్తి నొస గును. పూర్వము శిష్యునకు ముక్తి నొసగుటకై శివుడు లింగ మూర్తియై యచట నిలిచియున్నాడు. అతని తీరు ఫణాకృతి నుండును. ఒక భక్తుడు ప్రతి దినము అచటికి వచ్చి యా లింగమును పూజించి పోవుచుండును. "శ్రీ'' యను నామ మున నీవచట నుండుము. ఈ జన్మముకంటె ఆ జన్మమే నీకు పావనమైనది. విచారింపకుము. శివుని చూచినదే తడవుగా నీకు ముక్తి కలుగును" అని పలికెను. ఊర్ణనాభుడును, బ్రహ్మ శాపము ననుసరించి సాలెపురుగై గజారణ్యము నందలి మారేడు వనమున నొక బిల్వ వృక్షము పయి నివసించుచుండెను. శివ భక్తు డొకడు మారేడు దళములు కోయుచు తన వెదురు బుట్టలో వేయుచుండగా, ఆ దళములతో ఈ సాలెపురుగు ఆ బుట్టలో ప్రవేశించి, అతడు సువర్ణ ముఖీలో స్నానమాడి, దళములతో శ్రీకాళహస్తీశుని పూజించు సమయమున శివుని దర్శిం

చెను. ఇది వరకు తెలిపిన రీతిని ప్రాణ త్యాగమునకు సిద్ధపడి, శివుని యను గ్రహము సాయుజ్యమును పొందెను.

పరమేశ్వరుడు కైలాసమున నుండగా, అతనిని సేవించుటకు పాతాళము నుండి సర్పములన్నియును వచ్చుచుండినవి. ఒకప్పుడు కాళుడను నాగుడు భార్యను విడిచి రాజాలక సేవకు రాకుండెను. శివుడు కోపించి భూమిపయి పడు నట్లతనిని శపించెను. ఇకమీద కైలాసమునకు రాకూడదనెను. కాళుడాదేవుని కాళ్ళపై బడి శాప విముక్తి ననుగ్రహింపవలెనని ప్రార్థింపగా, దేవ దేవుడు కరుణించి దక్షిణ కైలాసమునకు పోయి, ప్రతిదినము నొక్కొక్క రత్నముతో అచటి శివుని పూజింపవలెయుననియు, ఒక గజముతో, సంభవించెడు వైరము మూలముగా ముక్తి లభించుననియు, తెలియజేసెను. కాళుడును దుఃఖముతో భూలోకమున సర్పమై గజారణ్యమునకు వచ్చి ప్రతి దినము నొక్కొక్క రత్నముతో అచటి శివుని పూజింప సాగెను.

ఒకప్పుడు కైలాస పర్వతమునందలి కనక సౌధమున పార్వతీ పర మేశ్వరు లేకాంతమున నుండిరి. ఆ సమయమున చెలికత్తెలును వారిని సమీపింప రైరి. కాని, హస్తియను ప్రమధుడు మదాంధుడై కావలి వారిని లెక్కచేయక ఆ సౌధములో ప్రవేశించెను. పార్వతీదేవి అదిచూచి మిగుల కోపించి హస్తియగు నట్లు వానిని శపించెను. ఆ ప్రమదుడును భయముతో వడకుచు తన్ను రక్షింప వలెనని ప్రార్థించెను. ఆమె కరుణించి "ఓయీ! భయపడకుము, నీవు హస్తివై భూలోకము నందలి గజారణ్యమునకుపోయి, అచటి శివుని పూజించుచుండుము. ఆ దేవ దేవుని పూజింపవచ్చిన యొక సర్పముతో నీకు విరోధము కలుగును. మీరు పోరాడి మరణింతురు. అపు డిరువురికి శివుడు ముక్తి నొసగును." అని చెప్పెను. హస్తియట్లే సేవించి వెనుక చెప్పినట్లు మరణించి ముక్తిని పొందెను. ఆ గజము చర్మమే శివునికి వస్త్రమయ్యెను. మరణించిన సర్పము భూషణ మయ్యెను.

ఇంక కన్నప్ప వృత్తాంతము : అర్జునుడు శివుని యనుగ్రహమును పొంది అతని వలన పాశుపతాస్త్రమును పడయుటకై ఆ దేవుని గూర్చి ఇంద్ర కీలాద్రిపై ఘోరమగు తపస్సు చేయసాగెను. అర్జునుని శక్తి పరీక్షించుటకై

శివుడొక శబరుని వేషమున అచ్చటికి వచ్చెను. అతడు మూకాసురుని పందిగా చేసి అర్జునుడున్న ఆశ్రమము లోనికి తరిమెను. అది ఆశ్రమములో ప్రవేశించి యలజడి చేయగా అచటి మునులు మిగుల నాందోళన పడిరి. కిరాతవేషమున నున్న శివుడును, అర్జునుడును, దానిని బాణములతో కొట్టిరి. అది గిరగిర తిరిగి చచ్చిపోయెను. నా బాణముల వల్లనే అది చచ్చెనని అర్జునుడు, నా బాణము వలననే చచ్చెనని కిరాతుడును తగవులాడిరి. కిరాతుడు నిజమైన కిరాతుడేయని అనుకొని అర్జునుడాతనితో యుద్ధము చేసెను. శివుడును వెనుదీయలేదు. ఇట్లు కొంతకాలము పోరిన పిదప అర్జునుని శక్తి సామర్థ్యములు శివునికి సంతృప్తిని కల్గించెను. ఆతడు వృషారూఢుడై దేవతలు తన్ను సేవింపగా, అర్జునునకు ప్రత్యక్షమయి వరము కోరుకొమ్మనెను. అర్జును డచ్చెరువొంది ఆ దేవునికి సాష్టాంగ నమస్కారములుచేసి, తన తప్పును క్షమింపవలెనని ప్రార్థించి పాశుపతాస్త్రము నీయవలెననియు, ముక్తి ననుగ్రహింప వలెననియు వేడుకొనెను. శివుడు ఓయీ! నీకు పాశుపతాస్త్రమును ఉపదేశించెదను. దాని సాయమున శత్రువులను సంహరించి విజయమును చేకొనుము. నీవు యుద్ధమున బంధువులను వధింతువు కావున ఈ జన్మమున నీకు ముక్తి లభింపదు. నీవు కలియుగమున కిరాతుడవై పుట్టి వేటకు పోయినపుడు నా రూపమగు లింగమును చూచి, పూజించి ముక్తిని పొందగలవు" అని తెలిపెను. ఆ యర్జునుడే తిన్నడై పుట్టి ఆ జన్మమున ముక్తిని పొందెను.

మాయా జంగమ మూర్తి యగు శివుడిట్లు యాదవ రాజగు వీరనరసింహ మేదనీశ్వరునకు శ్రీకాళహస్తి మాహాత్మ్యమును వివరముగా తెలిపి "నీవు కృతార్థుడ వయ్యెదవు: మహాదేవునకు దేవాలయమును కట్టింపుము" అని మరల హెచ్చరించి అంతర్ధానము పొందెను. ఇంతవరకును తనకీ విషయములన్నియు చెప్పిన వాడా మహాదేవుఁడే యని యాదవ రాజు తెలిసికొని, తన జన్మము సార్థకమయ్యెనని మిక్కిలి ఆనందించెను. ఆ దేవుని యనుగ్రహమునకు పాత్రురాలైన తన దాసిని సమ్మానించెను. వెంటనే తురగారూఢుడై వేగముగా శ్రీకాళహస్తికిపోయి సువర్ణ ముఖీ నదిలో స్నానము చేసి శ్రీకాళహస్తీశ్వరుని పూజించెను. పిదప అచట ఆ మహాదేవునికి భైరవాదులకును దేవాలయములను కట్టించెను. ఈ మాహాత్మ్యము, మాయా జంగమ స్వరూపుడగు మహేశ్వరుడు యాదవ రాజగు వీరనరసింహునకు చెప్పినట్లు కూర్చబడుట యొక విశేషము.

ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యములో చెప్పిన కథల మూలమున అతని శివభక్తి వెల్లడి యగుచున్నది. భక్తి భావము ప్రధానముగా చెప్పునది సామాన్య శైవ మనబడును. సామాన్య శైవమున శివుడు ఎంత సత్యమో ప్రకృతి అంత నిత్యము. అతడెంత చైతన్య స్వరూపియో ఇది అంత దివ్య సుందర స్వరూపిణి. ఈ భేదా భేదము ననుసరించిన సామాన్య శైవమే ధూర్జటిది. భక్తులైనవారికి జాతి, కుల, మత, వివక్షత లేదు. కడకు తిర్యక్కుల యందును తిర్యక్కులు కూడ సంస్కార వశంబున ఈశ్వరాభి ముఖమై పోవుచున్న వనుటకు ధూర్జటి సాలె, సర్పము, మత్త గజముల కథను చెప్పినాడు. ఈ తత్త్వమే నారదుని భక్తి సూత్రము లందుగలదు. రామాయణమున నరులకే గాదు, వానరులకే గాదు, శూద్ర స్త్రీలకే గాదు (శబరి మున్నగు వారు) కడకు ఉడుతకు కూడ భగవ దనుగ్రహము లభించుచున్నది. ఈ విషయమే ధూర్జటి శ్రీకాళహస్తి మాహాత్మ్యమున శ్రీకాళహస్తుల కథలో చెప్పినాడు. ఈ ప్రాణులలో సంస్కారము బలీయమై యున్నదనుటకు చతుర్థా శ్వాసమున పూర్వ జన్మ వృత్తాంతములే తార్కాణము.

ఇంక ప్రథమాశ్వాసమున భక్తికి లక్షణముగా ఈ పద్యము చెప్ప వచ్చును.

చ. అమితములైన జంతువుల కిక్కడ నుత్తమ మధ్య మాధమ
త్వము లరయంగ గాన మపవర్గ రమాసతి బెండ్లి యాడుటో
సమతయె గాని తత్పురము సాటిగ నన్యపురంబు లెన్నగా
నమరు నటన్న హస్తిమశకాంతర మింతియు వాసిచూచినన్

(కా.మా.ప్ర.ఆ. .2)

ఈ పద్యము భక్తికి లక్షణముగా చెప్ప వచ్చును. ఇంక తరువాతి పద్యములలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రుల నలుగురి గూర్చి చెప్పినాడు. నలుగురు వారి వారి యధికార యోగ్యతలను బట్టి గొప్ప వారగుచున్నారే గాని ఒకరితో నొకరికి పోటీలేదు.

ధూర్జటి యిట వర్ణ ధర్మములకు వ్యతిరిక్తి కాలేదు. భక్తి తత్త్వము మరచిపోలేదు. ఇంక ఈ పురమున కధీశ్వరు డెట్టి వాడనగా రాజశేఖరుడట! కాళహస్తి పురాధీశ్వరుడు సాక్షాత్తు శివుడే యని ధూర్జటి చెప్పినాడు. ఇంకను

చ. కపట కుమార జంగమ వికారమునం జనుదెంచు శైలజా
ధిపు గని భక్తి పూర్వక మతి 'శ్శరణార్థి' యొనర్చి యొక్కచే
త్రిపదములంటి తన్మృదుల పాణి సరోరుహ దత్తభూతిని
ద్ధపు నుదుటన్ ధరించి ప్రముదామని యిట్లనియెం బ్రియంబునన్

(కా.మా.ప్ర.ఆ. 34)

ఇచట 'శరణార్థి' యనుచున్నాడు ఇది భక్తి లక్షణము. ఇది శైవముననే గాదు వైష్ణవము నందునూ గలదు.

సీ. 'బిజమాడు దేవరు నిజకృపా దృష్టి జె
న్నారు నాయిల్లు బిడారు మీకు,
నాకు మీ పాదార్చనము సేయనదలింగ
మూర్తి, చేకుజె వచ్చి మూర్తమాడు
యొడయ! చిత్తేశ! నాయునికి నిమజ్జనం
బాడి శివార్చన మాడ బేకు,
విచ్చేయుడు విభూతి వీడియం బందునో
జంగమ స్వామి నాసదనమునకు,
నోగిరంబులు మంచిమే లోగిరములు
నావటించెద బదడు మీరారగింప
ప్రతి దినంబును జంగమార్చనము లేక
తసివు పడనొల్ల విజిత కందర్ప!'' యనుడు

(కా.మా.ప్ర.ఆ. ౭౯)

ఈ పద్యము వీరశైవ సంప్రదాయములతో గూడి యున్నది. సంప్రదాయమే గాక ఆశరణ సాహిత్యములోని పదములను గూడ యథాతథముగ ధూర్జటి యిందు వాడినాడు. 1) బిజమాడు దేవర, 2) బిడారు 3) వడయ 4) మాడ బేకు. శైవాచారములలో కొన్ని సమయములు గలవట. ఆ సమయములలో ఒకటి పంక్తి భోజనము. జంగముడు లేనిచో భక్తులు భోజనము చేయరు. లింగధారులలో ఈ నియమము గలదు. ఇచట దాసి లింగధారిణి. ఈ పల్లె రపు దాసి ఈ కోవకు చెందినది. కనుకనే జంగముని తన యింటి కాహ్వానించినది.

క. అని కాంతా! నీ యింటికి
జనుదెంచెద, నీవు గుబ్బచను గొండల సం
దున దెరువెఱుగక తిరిగెడి
మనసను తెరువరికి దప్పి మాన్పంగలవే?

(కా.మా.ప్ర.ఆ. 37)

లింగముని కంటె జంగము దధికుడు. శైవమున శివునికంటే శివభక్తు లెక్కువ యని ఒక సంప్రదాయము కలదు. దాసీ హృదయముపై నిలిచిన శివుని కంటే (లింగముకంటె) ప్రత్యక్షముగా ఆమెతో మాట్లాడిన జంగమ శివుడే అధికుడని రుజువు చేయుటకు దాసితో జంగముడు పై రీతిగా మాట్లాడెను. ఈ కఠిన పరీక్షలో మహాత్మురాలు లోకాతీత సౌందర్యవతి కాంతా రత్నము జంగ మార్చన కళా సామర్థ్యయైన దాసి సర్వము ఈశ్వరార్చన బుద్ధితో త్యాగ స్వరూపిణియై పోయినది. తత్ఫలితముగా కేశాలంకారము సర్వము రాజుచే భంగమై పోయినను జంగమ స్వామిచే మరల నిజకురుల సంపదతో చిత్రరాజ్య లక్ష్మి కభిషేకము చేయుచు నిల్వగలిగినది. ఈ దాసి వలననే రాజు శివుని మాహాత్మ్యము సర్వము తెలిసికొన గలిగినాడు. ధూర్జటి జంగమునితో కథ ప్రారంభించి, వేశ్యా తనయులు ముక్తి నొందుటతో ముగించినాడు. స్త్రీతో ముగి యుట ఇట్లు కథ నన్వయించుట శైవ సంప్రదాయము.

కాళహస్తి మాహాత్మ్యమున వశిష్ఠుని కథను చిత్రించుటలో ఔచిత్యము పరామర్శించుచు ఇది ధూర్జటి శైవమున కెంత వరకు తోడ్పడినదో చూచిన యెడల బ్రహ్మ జ్ఞానిని కూడ మాయ బంధించుచున్నదని తెలియు చున్నది. అందుచేతనే ఈ విషయము ఆశ్వాసాంతములో కూడ ధూర్జటి ధ్వనింపజేసినాడు. పుత్రేషణ యనినాడు పాశము తొలగించుకొనుటకు గాను వశిష్ఠుని కథను ప్రతిపాదించినాడు. బిడ్డల కొఱకు ఈయన మరణించవలె ననుకొనుచున్నాడు. పరమేశ్వరుడు ప్రసన్నుడై వశిష్ఠుని చేతనే శివుని కొలిపించినాడు. ఇదే శైవము యొక్క ప్రాధాన్యత. శైవాగమములలో 36 తత్త్వము లుండును. ఈ పద్య ములో 24 తత్త్వములు చెప్పినాడు.

క॥ ఇరువది నాలుగు తత్త్వము
లరయగ నీ యందఁ బుట్టి యణఁగె, నన, జగ
త్పరిపూర్ణుఁడవన, దృశ్యే
తర మూర్తి వనంగ నిందువ తత్త్వజ్ఞులచేన్

(కా. మా. ప్ర. ఆ. 79)

యాదవరాజు పురుషుడు. అతడు 23 తత్త్వములతో కూడిన పురమున కధిపతి. ఇది శైవాగమ సంజ్ఞ. ఈ పురుషుడు భక్తుడగుటకు ముందు శక్తి పాతము ఏర్పడును. అనగా యాదవ రాజు జంగముని అనుగ్రహమునకు పాత్రుడై శివ భక్తు డయ్యెను. వెంటనే (శక్తి పాతము కల్గిన వెంటనే) మనస్సు శివాభి ముఖ మగును. శివ భక్తుల కథలపై ఆసక్తి కల్గును. అట్లు యాదవ రాజులో పుట్టిన ఆసక్తికి తగినట్లుగా ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యము నందలి శివకథలను అల్లుకొని పోయినాడు. పైన చెప్పిన తత్త్వముల విషయములో మిగిలిన 12 తత్త్వములు తెలిసికొనుట కనుభవము కావలెనని కవియే యిట్లు చెప్పినాడు.

క॥ స్వానుభవంబున దత్త్వము
గానంబడుగాని, మీయఖండాద్వైత
జ్ఞానమయా కృతిబహు భా
షా నైపుణి దెలియునది యశక్యమట ! శివా !

(కా. మా. ప్ర. ఆ. 80)

ఇంకను ధూర్జటి ప్రథమా శ్వాసముననే వశిష్ఠుని, అగస్త్యుని ప్రవేశపెట్టినాడు. వీరిరువురును మైత్రావరుణునకు పుట్టినవారు. అగస్త్యుడు నీళ్లయందు పుట్టినాడు కనుకనే సువర్ణముఖీనదిని తీసికొని రాగలిగినాడు. ఇట్లు చెప్పుటలో ఇంకొక రహస్య మేమనగా అగస్త్యుడు శాక్త సంబంధి. దేవీ ఉపాసకుడు. ఇఁక వశిష్ఠుడన్ననో శివోపాసకుడు. వశిష్ఠుడు జ్ఞాని, అగస్త్యుడు భక్తుడు. అతని భార్య లోపాముద్ర జ్ఞాన ప్రధానియైన వశిష్ఠునిచేత శివ తత్త్వము, కర్మజ్ఞుడై శక్త్యుపాసకుడగు అగస్త్యునిచే దేవీతత్త్వము ఈ రెండింటిని ప్రథమా శ్వాసముననే గుదిగుచ్చి ధూర్జటి శివ శక్త్యాత్మక శైవమును రూపించినాడు. నేలపై

పుట్టిన వశిష్ఠుడు, స్థావరసత్య ప్రదీపకమగు శివజ్ఞానమును, నీట పుట్టిన అగస్త్యుడు భూమిపై సువర్ణముఖిని తెచ్చిన యపరభాగీరథుడగు చున్నాడు. స్థావర జంగమాత్మకమైన ప్రపంచ స్వరూపమును ప్రథమాశ్వాసమున ధూర్జటి తత్త్వపరముగా ప్రతిపాదించెను. ఈ ఆశ్వాసములో వానికి కురులువచ్చుట హస్త మస్తక న్యాయము. శైవములోని వేదా దీక్ష నిట నన్వయింపవచ్చును.

ఇక బ్రహ్మకథవలన వారి ప్రణయము జగత్ సృష్టికే కాదు, జగత్ వినాశనమునకు తోడ్పడుచున్నదను విషయము రుజువైనది. బ్రహ్మకు పర తత్త్వము తెలిసినను అనుభవమునకు రాలేదు. అది ఒక్క పర శివ తత్త్వమునకే చెల్లును. బుద్ధి వ్యాపారమున కతీతమైన శక్తియే యిట ధూర్జటి ప్రతిపాదింపదలచెను. ఇది శైవములోని రహస్యము.

ఇక శ్రీకాళహస్తుల కథలు చెప్పినప్పుడు ధూర్జటి కాలము ప్రసక్తి తీసికొనివచ్చెను. శైవాగమముల యందు కాలము మాయలో పుట్టిన ఏడు గణములలో ఒకటి. ఇది మిశ్రసృష్టికి సంబంధించినది.

> [1]"అనాది నిధనా చ్ఛాంతాచ్చి వాత్పరమ కారణాత్
> ఇచ్ఛా శక్తి ర్వి నిష్క్రాం తాతతో జ్ఞానం తతః క్రియా !
> తత్రోత్పన్నాని భూతాని భువనాని చతుర్థశ"
> అని శైవాగమము చెప్పుచున్నది.

ఇక తిన్నని కథలో తిన్నడు మాయిలోని అవిద్యకు చెందినవాడు. అవిద్యాగుణమును ధూర్జటి తిన్నని కథలో సూచించుచున్నాడు. శివానుగ్రహముచే అవిద్య కతీతమైన ఆనంద తత్త్వము నాతడు పొందుచున్నాడు. ఇచట తిన్నడు మరణించలేదు. శివ సన్నిధానము నందున్నాడు. నత్కీరుని కథలో నత్కీరుడును మరణించలేదు. ఇచ్చట ధూర్జటి శైవాగమములలో కనిపించు మాయలో పుట్టుకళను ధ్వనింప జేసినాడు. కీర మనగా చిలుక నత్కీరుని కథలో కాశ్మీర శైవమును సూచింప చేసి ఆ అద్వైతమునకు వ్యతిరిక్తముగా ధూర్జటి జ్ఞాన రహితమైన భక్తిని ప్రతిపాదించుచున్నాడు. ఆశ్వాసాంత పద్య

---

1. బసవవచనాలు-డా॥ బడాల రామయ్యగారు. పుట (412)

ములో 'శకుంత వాగురిక' యనినాడు. ఇట్లనుటవలన తిన్నని కథ ధ్వనించు చున్నది ఆ తిన్నడు శివుని యందే కలడు. అది కూడ నిచట ధూర్జటి ధ్వనింప జేసినాడు. ఈ పద్యమున 'యోగీంద్ర స్వాంద శకుంతవాగురిక' యనుటలో వ్యంగ్యమానమగుచున్న దేమనగా, యోగీశ్వరుల యొక్క హృదయము లనెడి పక్షులకు వలలు వేసిన ఆటవికుడు శివుడో శివభక్తుడైన తిన్నడో రసజ్ఞులు తెలియగలరు. ఆశ్వాసాంతములో 224 పద్యములో "స్వాభావతేజోగండూషిత పద్మ జాండ! భవచక్షుశ్శ్రోత్ర వక్షీశ్వరా ! యనుటవలన నక్కీరుని కథ ద్యోతకమగుచుచున్నది. ధూర్జటి ప్రథమాశ్వాసమున వశిష్ఠ అగస్త్యుల కథలను చెప్పెను. ఈ ఇరువురి విషయమును గూర్చి ఋగ్వేదములోనున్నది ఆ శ్లోకమిది.

> సత్రేహజాతానిషితానవోభిహిః
> కుంభే రీతహుః నిషచతుః సమానం
> తతో హమాన ఉదియా యమధ్యాతతో జాత
> మృషి మాహూర్ వశిష్టః
>
> (యం. సం. 2-33-13)
> (2 భాగము ఋగ్వేద సంహిత-పుట 597)

నాల్గవ ఆశ్వాసమున వేశ్యాతనయుల కథ తదుపరి వీరి జన్మాంతరములు చెప్పుచు ద్వాపరయుగములో అర్జునుని కథను ప్రస్తావించినాడు. కావలి మంతయు శైవాగమ ప్రక్రియ కనుగుణముగా నడిపినాడు.

శివుడు పర బ్రహ్మవాచిగా చెప్పబడినది ఆగమములందే. పురాణ ప్రసిద్ధుడగు శివుడే, పంచాక్షరీ మంత్రమునవచ్చు శివుడు. సంసారమను త్రాటిచే కట్టబడిన జీవులకు.

> "భవపాశ నిబద్ధానాం దేహినాం హిత కామ్యయా
> ఆహాం నమశ్శివాయేతి మంత్ర మాద్యం శివః స్వయం"
>
> (స్కాందము-ప్రథమాధ్యాయము-పుట 3)

హితమును ప్రసాదించువాడై శివుడే యీ పంచాక్షరీ మంత్రమును "నమశ్శివాయ" అని చెప్పెనట. ఆచార్య శంకరులవారు కూడ పంచాక్షరీ మంత్రములోని ఒక్కొక్క యక్షరమునకు ఒక్కొక్క శ్లోకమును చెప్పి శివపంచాక్షరీ మాహాత్మ్యమును గుర్తించిరి. బసవన పంచాక్షరీ స్థలమునే ప్రత్యేకించి తన వచనములందు పేర్కొనెను.

పంచ మహా పాతకములు పారునది
శివానీ నామ స్మరణకయ్యా (వ. సం. 75)
భవ బంధన దురితంబులు గెలువగ
ఓం నమశ్శివాయ శరణన చాలదే (వ. సం. 79)

దయామయుడైన పరమేశ్వరుదే పంచాక్షరీ మంత్రమును దుఃఖ జీవుల తరింప జేయ మొదట ఉపదేశించినట్లు స్కాందము చెప్పెను. స్కాంద పురాణ కాలము నాటికి శివ పంచాక్షరి ప్రజలలో ప్రవేశించినదని చెప్పవచ్చును. అంతే కాదు దీక్షాది నియములేవియు దీనికి అవసరములేదు కడకు స్మశానము నందైనను దీని నుచ్చరింపవచ్చును. సర్వకాల సర్వావస్థలయందును స్మరింపవచ్చును. ముక్తినిగోరు స్త్రీ శూద్ర సంకర జాతులవారైనను స్మరింపవచ్చును. ఆగమ మందరకు పఠనీయమే. నమఃశ్శివాయ మంత్రము అంతరికిని తారక మంత్రమే. ఓంకారముతో చేరిన పంచాక్షరి షడక్షరి యగును.

ఆగమములందే—

1 "ద్విజైరియంతు జప్తవ్యా నిత్యం ప్రణవ పూర్వికా ।
స్త్రీ భిన్శూద్రైశ్చజప్త వ్యాచమో ఒం తా ప్రణవంవినా"
(చం. జ్ఞా. ఆ. అష్టమ పటలము 10 శ్లోకం పుట 46)

" ప్రణవేన వినాదద్యాత్ స్త్రీ శూద్రాణామి మం మనుం
యది దద్యాత్స ప్రణవము భయోః పతనంభవేత్ (22)
పంచాక్షరే మహామంత్రే స్థితే ఒ పిక విజనరాః ।
పతంతినరకే మూఢా మాయయా పరిమోహితః (23)
(సూక్ష్మాగమము 3 వ పటలము పుట 23)

1. (బసవ వచనాలు-బణాల రామయ్యగారు. 368 పుట)

శివ యను రెండుక్షరములయందు ఆదిమ దంపతులగు పార్వతీ పరమేశ్వరు లిరువురని అర్థమును సూచించును. ఈ భావము శివపురాణమునందు గలదు. శైవదర్శనము లన్నియు శివశక్త్యాత్మకముగా పరబ్రహ్మను సూచించుచున్నవి. వీరశైవముకూడ ఈ భావమునే సూచించును.

ఇక వేశ్యా తనయుల కథలోకూడ శివుని మాహాత్మ్యమే కన్పించు చున్నది. శివుని మాహాత్మ్యము వలననే తల్లి బోధించు వారధర్మముల నుండి తప్పించుకొని తనయులు తమ మదియందుగల సంకల్పము నేరవేర్చుకొన గలిగిరి. వీరి భక్తి కనుగుణముగా పరమేశ్వరుడు అనుక్షణము వీరికి తోడ్పడి సహకరించెను. ఇదంతయు భక్తియొక్క మాహాత్మ్యమే. శివ పారమ్య మిందు ప్రధానాంశము. ప్రతి కథ యిట్లంత మొందుట ఈ ప్రబంధ విశిష్టత.

ఇక ధూర్జటి కాళహస్తి మాహాత్మ్యమునకు, శ్రీనాధుని హర విలాసము కొద్ది సామ్యములు గలవు. శ్రీనాధుడు నాలుగు శైవ కథలు చెప్పి చివరకు శివ పారమ్యమే నిరూపించి కావ్యము ముగించినాడు. ధూర్జటియు అంతే. హర విలాసమున చిఱుతొండని కథలో వీరశైవ సంప్రదాయములు కన్పించునట్లే కాళహస్తి మాహాత్మ్యములో పశ్లెరపుదాసి కథలో వీరశైవ సంప్రదాయములు కన్పించుచున్నవి. కన్నప్ప కండ్లు పెరికి శివున కర్పించుట, చిఱుతొండడు బాలుని బలియిచ్చుట యిట్టివే. రెండింటను మూఢభక్తి విదితమగుచున్నది. వేశ్యల గృహవర్ణన చేయునప్పుడు ఓషధీ ప్రస్థపురములో శ్రీనాధుడు గోడలపై శృంగార చిత్ర వర్ణన చేసినాడు. అట్లే ధూర్జటి మాణిక్యవల్లి యింట శృంగార గాథలు గోడలపై చిత్రింప బడినట్లు వర్ణించినాడు. రెండు కావ్యములందు కథలు వివిధ పురాణముల నుండి గ్రహించి నట్టివి వర్ణింపబడినవి.

ఈ విధముగా ధూర్జటి తన కావ్యములో అనేక కథలు వ్రాసినప్పటికి వానిలోని పరమార్థము ఒకటిగానే కన్పించుచున్నది. తిన్నని వంటి భక్తుల కథ వ్రాసినను కాళహస్తుల వంటి తిర్యక్కుల కథ వ్రాసినను నత్కీరునివంటి మహా కవి వృత్తాంతము రచించినను, ఇంకేది వ్రాసినను ధూర్జటికి ఒకటే ధ్యేయము. మహేశ్వరుని మహిమలు చెప్పుట. అతని క్షేత్రమైన కాళహస్తియొక్క ప్రాశస్త్యమును ప్రతిష్ఠించవలెను. ఈ ధ్యేయము భిన్న కథలు కలిగిన కాళహస్తి మాహాత్మ్యమునకు వస్త్వైక్యతను సాధించు చున్నది. వస్త్వైక్యత యనునది ప్రబంధమునకు ప్రధాన లక్షణ మగుటచేత కాళహస్తి మాహాత్మ్యము కూడ ఆంధ్ర ప్రబంధ వాఙ్మయమున ప్రముఖ స్థానము పొందుచున్నది.

# లఘుకృతులు—శైవనిరతి

## 1. శతకములు

'శతక' మను ప్రక్రియ అన్ని భాషా వాఙ్మయము లందున్నప్పటికినీ తెలుగున వానికి ప్రత్యేక స్థానము గలదు. వానిసంఖ్యకూడ చాల అధికమనియే చెప్పవచ్చును. ఆంధ్ర వాఙ్మయమున శాఖోపశాఖలుగా వెలువడిన కావ్య ప్రక్రియలలో 'శతకము' ముఖ్యమైనది. క్రీ.శ. 12 శతాబ్దినుండి నేటివరకును ఆంధ్రమున శతకరచన సాగుచునేయున్నది.[1] శతకరచన యనునది ఇంకను అతిప్రాచీనమై యుండును. కాని ఆనాడు శతకమని పిలువబడక అనిబద్ధ, అసర్గబద్ధ కావ్యమను పేర పిలువబడినదట.

[2] సంఖ్యామూలక పద్యకావ్య భేదము నుల్లేఖించి అందు శతకమును స్పష్టముగ పేర్కొనిన సంస్కృతాలంకారికుడు అమృతానందయోగి. ఈతని 'అలంకార సంగ్రహము' పదమూడవ శతాబ్ది నాటిదని నిర్ణయింపబడినది.

క్రీ.శ. 1160-70 ప్రాంతమున నుండిన మల్లికార్జున పండితారాధ్యుడు ప్రథమాంధ్ర శతక కర్త యని వాఙ్మయ చరిత్రకారుల మతము సర్వసమ్మతము. శ్రీ గిరిమల్లికార్జునా ! యను మకుటముగల పద్యమొకటి లక్షణ గ్రంథమునం దుదాహృతము. శివతత్త్వ సారము శతకమా ? యను సందేహము కలుగుటకు అందు వివిధ మకుటములు ప్రయుక్తములగుటయు, దాదాపు ఐదువందలు పద్యములుండుటయే కారణము. "శతకంబు శివతత్త్వసారము" అని పాలుకురికి సోమన స్పష్టముగ పేర్కొనినప్పుడు శతక లక్షణములుగల శివతత్త్వ సారమును శతకముగ గ్రహించుట సమంజసము. ఇంతకంటెముందు తెలుగున

---

1. డా॥ దివాకర్ల వెంకటావధానిగారు - ఆంధ్ర వాఙ్మయ చరిత్ర.
2. డా॥ కె. గోపాలకృష్ణ రావుగారు - ఆంధ్ర శతక వాఙ్మయ వికాసము.

శతక ప్రాయములైన రచనలు కాన్పించుచున్నవి. శతకమును పోలియుండుట వలన మనకు శతకమే యనుభావము కల్గును. తెలుగులో మకుటాత్మకస్తోత్ర రచన కాద్యులు నన్నయ, నన్నెచోడులని చెప్పబడినది 'శతక' మనుపేరే యిది నూరుపద్యములు గలదని యను అర్థము స్ఫురించుచున్నది. కాని శతకము లందు నూఱు మొదలుకొని ఎన్నోని పద్యములుండవచ్చును. శతకములు భగవన్నుతి పూర్వకములైన గ్రంథములు ఇట్టి స్తోత్రములు ఋగ్వేద కాలము నుండియు గోచరము. ఋగ్వేదమునం దగ్ని, రవివరుణాది దేవతల స్తోత్రముల సముచ్చయమని చెప్పవచ్చును.

[1] ప్రాకృతమున హాలుడు సంకలించిన గాధాసప్తశతి ఏడు శతకముల సమాహారమని చెప్పదగియున్నది. ఇట్లే ఆంగ్లమున, తమిళ, కన్నడము లందును శతకములు శతక ప్రాయములైన రచనలు పెక్కుగలవు. కావ్యము లందువలె శతకములలో నందలి పద్యము లన్నిటికిని సంబంధము సమకూర్చు కధాసూత్రము గానరాదు అందు పద్యములు స్వాతంత్ర్యములు. అందుచే వీనిని ముక్తక కావ్యములనికూడ అందురు. శతకములు సాధారణముగా గ్రంధ కర్త ఆత్మభావములను ప్రకటించునవిగా యుండును. కవి ఆత్మ పరిశీలనము చేసికుని గత జీవితదోషములు స్మృతికి వచ్చుటచే బశ్చాత్తాపము నొందును. ఈ విధముగా శతకములు ఆత్మాశ్రయజాతికి జెందినట్టివి. ధూర్జటికవి విరచిత శ్రీకాళహస్తీశ్వ శతక మిట్టిదే.

ఇంతవరకు మనకు తెలియవచ్చిన శతకముల ననుసరించి చూడగా భక్తి ప్రధానమయిన శైవసంప్రదాయముతోనే శతక మాంధ్ర వాఙ్మయ రంగమున కవతరించినట్లు కన్పించు చున్నది. శతకము నొక వాఙ్మయ శాఖగా తెలుగులో పాదుకట్టిన విఖ్యాతి శివకవులది. శతక వాఙ్మయమున మల్లికార్జున పండితుడు, యధావాక్కుల అన్నమయ్య (సర్వేశ్వర శతకము) పాల్కురికి సోమనాథుడు ప్రారంభ శతక కవిత్రయముగా కీర్తింపబడుచున్నారు. ఉదాహరణాదులగు 'దేశి' ప్రక్రియల నాంధ్రమున ప్రవేశపెట్టిన శైవకవులే యీ శతకములనుగూడ ప్రవేశపెట్టుట గమనింపవగిన విషయము. తెలుగున వెలువడిన మొదటి

---

1. ఆంధ్రవాఙ్మయచరిత్ర. డా॥ దివాకర్ల వేంకటావధానిగారు.

శతకములన్నియు శివభక్తి ప్రధానములు. ఈ శతకముల నాదర్శముగా స్వీకరించియే శ్రీకాళహస్తీశ్వర, రాజశేఖర, శంభోదయాంభోధి, కంచి ఏకామ్రలింగ శ్రీ మల్లేశ్వర శతకములు మున్నగునవి వెలువడినవి.

## సర్వేశ్వరశతకము

యథావాక్కుల అన్నమయ్య తన 'సర్వేశ్వర శతకము'ను క్రీ.శ. 1164న రచించినట్లు 'ఆంధ్రశతక సాహిత్య వికాసము' అను గ్రంథమున డా॥ గోపాల కృష్ణరావుగారు వ్రాసియున్నారు. ఇదేవిషయమును చర్చించుచు 'ఆంధ్ర కవి తరంగిణి' కారుడు చాగంటి శేషయ్యగారు ఈతని కాలమును '1 64 శాలివాహన శకము' అని నిర్ణయము చేసిరి. అప్పుడు 1164+78=1242 అతని శతక రచనా కాలమగుచున్నది. ఒక పద్యమున అన్నమయ్య శతక రచనా సంవత్సరమును గురించి చెప్పినట్లు తెలియుచున్నది గాని దానిని గ్రహించుట యందుకూడ కొంత క్లిష్టత ఉన్నది.

"శాకాబ్దంబులు వార్ధిషట్క పురభి సంఖ్యన్ ప్రవర్తింప"

ఇట్లు చూడగ శైవము ఆంధ్ర దేశమునందు బహుళ ప్రచారములో నున్నప్పుడు అనగా క్రీ.శ. 12, 13 శతాబ్దుల లో ఈ కవి శైవ ప్రధానమైన ఈ శతకమును రచించెనని చెప్పుట సమంజసముగా నుండును.

యథావాక్కుల అన్నమయ్య ఆత్రేయస గోత్రజుడు. యజుశ్శాఖీయుడు. గోదావరీ తీర నివాసి. బ్రాహ్మణుడు. దూదికొండ సోమేశ్వరారాధ్యుని శిష్యుడు. రాజమహేంద్ర వరమునకు సమీపమున గల 'పట్టిస' గ్రామమున వెలసిన వీరభద్రేశ్వర స్వామి అన్నమయ్య కిష్ట దైవము. అన్నమయ్య శ్రీశైలమల్లికార్జునుని సేవించి తిరిగి వచ్చుచు పల్నాడు తాలూకాలో జెట్టిపాలెము దగ్గర కృష్ణాతీర మందు విశ్వామిత్రాశ్రమ మనబడు సత్రశాల యను స్థలమున శ్రీమల్లేశ్వర స్వామిని సేవించుచు కొంత కాల ముండి యచ్చటనే 'సర్వేశ్వర శతకము'ను రచించెను. శతక రచన సందర్భమున కవి పాటించిన నియమమును గూర్చి ఒక గాథ బహుళ ప్రచారము నొందినది అన్నమయ్య ఒక్కొక్క పద్యమును

తాటియాకుపై వ్రాసి కృష్ణా నదిలో వేయుచు నది తిరిగి వచ్చిన స్వీకరించెడి వాడట, తిరిగి రానిచో శిరమును ఖండించుకొందునని శపథ మొనర్చెనట.

మ. తరులం బువ్వులు పెందెలై యొదవి తత్తజ్జాతితో బండ్లగున్
హరా! మీ పాదపయోజ పూజితములై యత్యద్భుతం బివ్విరుల్
కరులౌ నశ్వములౌ ననర్ఘమణులౌ గర్పూరమూ హారమౌ
దరుణీ రత్నములౌ బటీర తరులౌ దథ్యంబు సర్వేశ్వరా!

(87)

అను పద్య మెదురుగా రాక ప్రవాహములో కొట్టుకొని పోవుట జూచి కంఠ మును కత్తిరించుకొనుట కుద్యమించు చుండగా నొక పశువుల కాపరి "నాకొక తాటి యాకు దొరికినది చూడు"దని యిచ్చి అదృశ్యుడయ్యెను. కవి ఆ యాకును చూడగా దానిపై తాను వ్రాసిన పద్యమునకు బదులుగా వేతొక పద్య ముం డుట జూచి యిది సర్వేశ్వర కృత మని గ్రహించి యా పద్యమును సూత్ర మున కెక్కించెను. మరియు తన సర్వేశ్వర శతకమును పూర్తి చేసి కొంత కాలమునకు ఆ సత్రశాల యందే సిద్ధి నొందెనట! ఆ పద్య మీ క్రింది విధముగా గలదు.

మ. ఒక పుష్పంబు భవత్పదద్వయముపై నొప్పంగ సద్భక్తిరం
జకుడై పెట్టిన పుణ్య మూర్తికి బునర్జన్మంబు లేదన్న బా
యక కాలత్రితయో పచారముల నిన్నర్చించుచో బెద్దనై
ష్ఠికుడై యుండెడు వాడు నీవగుట దాశ్చర్యంబె సర్వేశ్వరా

(88)

పై గాథ విశ్వసించుటకు తగిన ఆధారములు లేకపోయినను దీని వలన అన్న మయ్య వజ్రసంకల్పము, భక్తి భావము వెల్లడి యగుచున్నది. సర్వేశ్వరుని యం దపార భక్తి పారమ్యములు గలవు గాబట్టియే భక్తి ప్రపత్తులతో సత్రశాల యందు శతక రచన గావించి చివరకు సిద్ధి పొందినాడు. 'సిద్ధి పొందుట' యను నది అపార భక్తి భావమునకు తార్కాణము.

[1]ఈ అన్నమారాధ్యుని కొడుకు పీరంరాజు, పీరంరాజు కుమారుడు నాగరాజు, నాగరాజు తనయుడు చిట్టెమరాజు. ఈయన పల్నాడు సీమకు వచ్చి యచ్చట చెర్ల గుడిపాడు, మిరియాల, పల్లిగుంత, పశ్వేముల, వద్దిరేల, సీతానగరము సను ఆరు గ్రామముల కరిణీకము సంపాదించెను. అప్పటి నుండియు నీ వంశము వారు పల్నాటి సీమ వాసులైరి. చిట్టెమరాజు కొడుకు గోవరాజు. గోపరాజు కొడుకు సోమరాజు ఈ సోమరాజు, సుప్రసిద్ధుడై యుండుటచే నాతని నాటి నుండియు నా వంశమునకు యథావాక్కుల వారను పేరుమాటి సోమరాజు వారను పేరు కలిగినది. ఇప్పటికిని నిదియే వాడుకలో నున్నది.

[2]ఇది సోమరాజు వేంకట శివుడు గారు వ్రాసిన దానికి సంగ్రహము. తాను పెద్దల వలన వినిన దానిని వ్రాసితినని వెంకట శివుడు గారు "యధావాక్కుల అన్నమయ్య సర్వేశ్వర శతకము' పీఠిక (పరిషత్ పత్రిక నుండి నుండి పునర్ముదిత ప్రతి) లో పేర్కొనరి. ఈయన వ్రాసిన దానిని బట్టి "అన్నమయ్య గారి వంశావళి" యను గ్రంథ మొకటి యున్నట్లు కనబడు చున్నది. దానిలోనివని వెంకట శివుడు గారు వ్రాసిన పద్యములు కొన్నిటిని 'సర్వేశ్వర శతకము' పీఠికలో నీయబడినవి[3] వీరు 9 పద్యములు ఈ వంశావళికి సంబంధించినవి వ్రాసిరి. ఇందు 9వ పద్య మకుటము మాత్రము చివర "సర్వేశ్వరా" యను సంబోధన గలదు. ఆ పద్య మిది.

మ. అజ రుద్రాదులు మిమ్మెఱింగి నుతి సేయన్లేరు నేనెంతవా
ద జగద్రక్షణ దక్షు నిన్ను గొనియాడ న్నీ స్వభావంబు దా
సజనానుగ్రహ నిశ్చితంబగుట నా జన్మంబు సాఫల్యమం
ద జడుండంచు నిరాకరింపక ప్రసన్నుంబౌట సర్వేశ్వరా

ఈ పద్యములో కవి భక్తుడగుట చేత తన నాయకుడైన ఈశ్వరుని యెదుట నూనత్వమును ప్రదర్శించుకొనుచున్నాడు. ఈశ్వరుని తెలిసికొనుటకు బ్రహ్మ రుద్రాదులకే సాధ్యము కాదు. లోకమును రక్షించు వాడవైన నిన్ను స్తుతి

1. సర్వేశ్వర శతకము పీఠిక (పరిషత్పత్రిక నుండి పునర్ముద్రిత ప్రతి)
2. ,, ,, ,,
3. సర్వేశ్వర శతము పీఠిక పుట

చేయుట నాకు సాధ్యమా? దాసులను భక్తులను కాపాడుట నీ స్వభావమగుట చేత నేను ధన్యుడనైతిని. నేను జడుడను అనగా అజ్ఞానిని అని భావింపక నీ దాసుడనగుట చేతనే నీవు ప్రసన్నుడవైతివి- అని దీని భావము[1].

'ఆంధ్ర శతక సాహిత్య వికాసము"లో డా॥ గోపాలకృష్ణరావు గారు 'సర్వేశ్వర శతకము'లో నూట నలుబదికి మించి పద్యములు గలవని పేర్కొనిరి. చాగంటి శేషయ్య గారు తమ ఆంధ్రకవి తరంగిణిలో(మూడవ సంపుటము)నూట నలుబది రెండు పద్యములు గలవని వ్రాసిరి. శతకమను పేరుతో రెండు వందలు, మూడు వందలు పద్యములు గల శతకములు గలవుగాని నూట నలు బది రెండు పద్యములు గల శతకములు లేవు[2]. తక్కినవి లభ్యము కాలేదేమో తెలియదు. ఒక వేళ కవి 108 పద్యములు వ్రాసి యుండగా, మఱికొన్ని పద్యము లెవరైన వ్రాసి యిందు చేర్చిరేమో తెలియదు" ఇది చాగంటి వారి యభిప్రాయము.

నేను కాకినాడ సాహిత్య పరిషత్తు వారి గ్రంథాలయములో చూడగా పరిషత్పత్రిక నుండి పునర్ముద్రితమైన 'సర్వేశ్వర శతకమును' చూచియుంటిని. అందు నూట ముప్పయి యెనిమిది పద్యములు గలవు. శైలిని బట్టి చూడ ఇది యన్ని పద్యములు అన్నమయ్య కృతములే యన్పించుచున్నది. సర్వేశ్వర శతకములో ఒక పద్యమున స్తవ మనియు, మఱి యొక్క పద్యమున స్తోత్ర మనియు పేర్కొనబడినది శతకము స్తుతి ప్రధానమైనది కనుక దీనిని స్తవ మనుట గాని స్తోత్రమని వ్యవహరించుట గాని సమంజసమే. శతకమని అన్న మయ్య దీనిని పేర్కొన్నను సంఖ్యా నియమ మిందు పాటింపబడలేదు. శతక వస్తువును తనకు గల ఆదర్శములను కవి ఒక పద్యమునందిట్లు వివరించెను

శా॥ ధాత్రిస్ఫక్తు జనానురంజనముగా దత్త్వ ప్రకాశంబుగా
జిత్రార్థాంచిత శబ్దబంధురముగా సేవ్యంబుగా సజ్జన

1. ఆంధ్ర శతక సాహిత్య వికాసము - డా॥ కె. గోపాలకృష్ణ రావు గారు.
2. ఆంధ్ర కవి తరంగిణి - చాగంటి శేషయ్యగారు (3వ సంపుటి)

శ్రోత్రానందముగా శుభాంచితముగా శోధించి సర్వేశ్వర
స్తోత్రంబన్నయ చెప్పె నిజ్జగములో శోభిల్లు సర్వేశ్వరా !

(129)

ఈ పద్యములో తన రచనను స్తోత్రమని యనుట గమనించ దగిన విశేషము. బహుశ ఈ కవి దానిని శతకముగా కాక సర్వేశ్వర స్తుతిగానే భావించియుండ వచ్చును.

అన్నమయ్య ఈ ఆదర్శములను శతకరచనము నందు సంపూర్ణముగ పాటించెను. ఇందు సగుణ నిర్గుణోపాసన తత్త్వము ఉదాత్త గంభీరరీతిలో వివరింప బడినది. పరమ శివుని తాండవ నృత్యము, ఈశ్వర మహిమ, సద్భక్తుల చరితము-మున్నగు అంశములను వర్ణించునపుడును, నామస్తుతి గావించునపుడు అన్నమయ్య తనకుగల శివభక్తి పారమ్యమును వ్యక్తీకరించెను. ఈశ్వరుని చరితము ఊహాతీతము. జలజాత ప్రభవాచ్యుతాదులు మదిని జర్చించి చర్చించి కలరూ పారయలేక చిక్కులబడిరి. సర్వేశ్వరుని స్థూల సూక్ష్మ రూపమును నిరూపించి సృష్టిస్థితి లయములకు ప్రాతినిధ్యము వహించు పరమేశ్వరుని త్రిగుణాత్మక శక్తిని అష్టమూర్త్యాత్మకమగు మూర్తిని మనసులో ధ్యానించి అతని రూపత్వమును గ్రహించుటకు అన్నమయ్య ప్రయత్నించెను.

మ॥ సకలాదీశ్వర పట్టభద్రుడవు దీక్షగామి వత్యంతశాం
త కళాత్ముండవు రౌద్రమూర్తివతి సౌందర్యాంబికా సంగమా
ధిక లోలుండవు దివ్య యోగివి మదిం దెల్లంబుగా నెట్టివా
రికి దాశక్యమె నీనిజంబరసి చర్చింపగ సర్వేశ్వరా ! (106)

ఒకమాటీ సకలంబు నీమయముగా నూహించిచు న్వేండి యొక్కొక్క మాటిం తయునీవు గావనచునే యుక్తి ప్రశంసింప నేరక వేదములే చిక్కువడినప్పుడు తన వంటి అల్పునకు పరమేశ్వరుని సత్యరూపమిట్టిదని నిరూపించుటకు శక్తి చాల దని వచించి జ్ఞానాతీతుడైన ఈశ్వరుని మహామహిమను ప్రజ్ఞచే తర్కించుట అజ్ఞాని లక్షణమని ఈశ్వరాను గ్రహము నొందుటకు భక్తి యోగమే సాధన

మనియు అన్నమయ్య వివరించెను. ఈ భావములే ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకములో పొందుపరచినాడు. ఈ పద్యములో ఈశ్వరునికి గల పరస్పర వ్యతిరేక గుణములను కవి వర్ణించినాడు. శివుడు సమస్తదేవతలకు అధీశ్వరుడు. దానికి భిన్నముగా దీక్ష వహించిన విరాగి మిక్కిలి శాంతుడు. దానితోబాటు రౌద్ర స్వరూపము కలవాడు. పార్వతీదేవిపై ప్రేమాతిశయము కలిగినవాడు. అటులే యోగధ్యానము చేయువాడు. ఇట్టి వ్యతిరేక స్వభావము కలిగిన ఈశ్వరుని తెలిసికొనుట యెవరికెట్లు సాధ్యమగునని కవి ఉల్లేఖించినాడు.

సంసార రంగమున బహురూపములనొంది భ్రమించుచు సంసార కారా గృహాంతర గేహంబున నుండి చింతిల్లుచు మోహధ్వాంతమున మునిగి భ్రష్టు డగుచు 'యోని గేహముల' జన్మ పరంపరల గ్రుగ్గి దుర్గతి నొందుచున్న మూఢాత్మునకు భక్తి మార్గమే శరణ్యమని కవి ఉపదేశించెను. భక్తి తత్త్వము భక్తి మహిమ శివయోగి లక్షణములు మున్నగు అంశములను అన్నమయ్య ఈ శతకములో మనోహరములగు కల్పనలతో వివరించెను. శతకారంభమునందు కవి సర్వేశ్వరుని అనంత లీలా స్వరూపము చిత్రించి అతని అజ్ఞాశక్తి ప్రభావమును వర్ణించెను. ఈశ్వరుని మహిమ అనంతమైనది. జీవుని నింద్రజాలమున నాడించు శక్తి అతనికి కలదు. ఈశ్వరుని భక్తి పురస్సరముగా సేవించు వారికి లౌకిక భోగములు సిరిసంపదలు తృణప్రాయములు. భక్తాంఘ్రి పానీయముల తలదాల్చుట, భక్తులను సేవించుట, జంగముల నారాధించుట, భక్తుల విధి యని ఉద్బోధించెను. ఇవన్నియు వీరశైవ సాంప్రదాయములే. యోగ సాధన చేత భక్తుడు శివ యోగి పదవి నొందుననియు, సద్భక్తి వలన అతడు శరీర బంధములను ఛేదింపజేసి కొనుననియు, వివిధ రీతులలో అన్నమయ్య భక్తి తత్త్వమును నిరూపించెను.

సద్భక్తికి చిత్తశుద్ధి ఆవశ్యకము పూజలు స్తోత్రములు నైవేద్యాదు లెన్ని యొనర్చినను ఈశ్వరుడు తనకు ప్రీతి పాత్రమైన సద్భక్తిని మాత్రమే గైకొనునని స్పష్ట మొనర్చి సద్భక్తి ప్రాధాన్యమును నిరూపించెను ఈశ్వర పాదాబ్జ సంసేవనా పరాఙ్ముఖ మగు చిత్తమును వశీకరించుకొని అరిషడ్వర్గములను జయించి సంసార వ్యామోహమును త్యజించ వలయునని అన్నమయ్య ఉపదేశము.

శా. కాయంబన్నది వారి బుద్బుదన వృక్షంబందు రూపింపలే
ఛాయంబన్నది శారదాంబు తటిత్ప్రాయంబగున్ దత్పల
శ్రేయంబన్నది మాయ యిట్లెరిగియున్ శ్రీఘ్రంబె నీధ్యానసం
స్థాయీ భావన బొంద దేమిటికయా సంసారి! సర్వేశ్వరా!

(83)

ఈ పద్యములో జీవితములోని తాత్త్విక భావమును కవి చక్కని ఉపమలతో నిరూపించి యున్నాడు. ప్రాణము నీటి బుడగ వంటిది. యవ్వనము శరత్కాలములోని మేఘము నందలి మెరుగువలె క్షణ కాలము కనిపించి అదృశ్యమగునట్టిది. అందుచేత ఈ తాత్కాలిక జీవితమున నిన్ను ధ్యానము చేయుటయే శాస్వితమైనది. సంసారియైన మానవుడు అట్లు చేయుటయే పరమార్థము. ఇట్టి భావములను అనేకములైన వానిని సర్వేశ్వర స్తోత్రము లేక సర్వేశ్వర శతకము అను ఈ గ్రంధములో అన్నమయ్య చాల మనోహరముగా పొందు పఱచినాడు. ఈ భావములు అన్నమయ్య స్వచ్ఛమైన భక్తి మార్గము నుపదేశించెను. అన్య దైవముల దూషణము అన్య మత ఖండనము ఈ శతక మందెచటను కన్పించదు. ఇతర దైవములను పూజించు వారిని అన్నమయ్య దూషించ లేదు. శైవారాధన కేవలము భక్తి ప్రపత్తులతో చెసెనే గాని ఇతరులను ద్వేషించ లేదు.

అన్నమయ్య కల్పనా శక్తి ప్రౌఢమైనది. కల్పన లెంత ప్రౌఢములో అంత మనోహరములు. నిష్కామసేవాసక్తిని నిరూపించిన సందర్భము నం దన్నమయ ఇట్లు వచించెను.

మ। సతి వేడ్కందన ప్రాణవల్లభునితో సంయోగమర్థించుగా
కతనిం బ్రార్థన చేసి సొమ్ము గొనిపోనట్టాదునే భక్తుడీ
క్షితి నీభక్తియ వేడుగాక మఱి నీశ్రీపాదముల్గొల్చికు
త్సిత కామ్యార్థము నొందువేడుకొనునే చింతింప సర్వేశ్వరా!

(45)

శా॥ ప్రారంభించి చకోరిపోతము మహీయ జ్యోత్స్నయందుత్సవ
శ్రీ రంజిల్లు వేడ్కనుండుగతి నాచిత్తంబు నీదివ్యశ్రృం

గార ధ్యానమునం దహర్నిశము జొక్కంజేయవే దేవ శ్రీ
గౌరీలోచన నర్తకీనటనరంగస్థాన సర్వేశ్వరా !

(86)

ఇట్టి పద్యములందు మధురభక్తిచ్ఛాయ సూచ్యము. అన్నమయ్య ఈ శతకము నందు కొన్ని పద్యములలో శివమహిమ, అనామయ, హలాయుధ స్తోత్ర భావము ననుకరించెను. శివతత్త్వ సార మునందలి భావాను కరణములును నిందుగలవు.

మదరాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమున "లీలానంద సర్వేశ్వరా" యను మకుటముతోనున్న యేబది పద్యములుగల తాళపత్ర ప్రతి యొకటి కలదు. (క్యాటలాగు స.07 సంఖ్య 169.) ఆ పద్యము లీతనివేయని కొందరు [1] భావించుచున్నారు. కాని లీలానంద సర్వేశ్వర శతకకర్త యెవ్వరో తెలియుట లేదు. అన్నమయ్య మాత్రము కాదని చాగంటి శేషయ్యగారు "ఆంధ్ర కవి తరంగిణి"లో పేర్కొనిరి. మచ్చునకొక పద్యము.

శా॥ శ్రీ సర్వేశ్వరుగా సదాశివునిగా జిద్రూపునింగా నిరా
భాసాఖ్యాతునిగా నిరంజన పరబ్రహ్మంబుగా బ్రహ్మ వి
ద్యా సారాంగునిగా నిరంతరము నే ధ్యానింతు హృత్పద్మపీ
ఠా నీనస్థిరుగా గురుప్రభుని లీలానంద! సర్వేశ్వరా!

ఇందులో మహేశ్వరుని చిద్రూపమును తాత్త్వికముగాను నిర్గుణముగాను కవి వర్ణించి యున్నాడు. ఇది జ్ఞానప్రధానమైన వర్ణనము. అన్నమయ్య భక్తి మార్గమునకు ఇది పూర్తిగా భిన్నమైనది.

ఇది యిట్లుండగా "సర్వేశ్వర శతకములు" మరి రెండు కానవచ్చినవి. ఒకటి అల్లమరాజు రంగశాయి కవి విరచితము. రెండవది స్వయంపాక లక్ష్మీ నారాయణశాస్త్రి విరచితము. మొదటిది పద్యములతో కూడియున్నది. రెండవది దండకము. మొదటిదానిలో 10? పద్యములు గలవు. ఇందు కేవలము భక్తి భావములేకాక వృక్షములు, పురుగులు, అహింస, మాయ, వైరాగ్యము, దయ,

1. ఆంధ్ర కవితరంగిణి - చాగంటి శేషయ్యగారు.

కాలము, భూగోళము, ఖగోళము, నిరసనము, జ్ఞానము, నిరాకార వర్ణన, నిరాకార ప్రార్థన యను నంశములు కూడ చెప్పబడినవి. భగవచ్ఛక్తి యను శీర్షికతో ఈ శతకము ప్రారంభింపబడినది. వివిధ శీర్షికలక్రింద విభజింప బడినను ఒక్కొక్క శీర్షిక క్రింద 6 మొదలు, 8 పద్యములు వరకు చెప్పబడి నవి. ఇందు మొదటి పద్య మీ విధముగా గలదు.

శ్రీరమ్యా నుపమానధీర, వరసచ్చిత్కార, సౌజన్యవి
స్తారా, జ్ఞాని విరాగి యోగి బహృత్సంచార సర్వం సహా
ధారా, సజ్జన చిత్తచోర, యధికోదారా, గభీరా, నిరా
కారా, కిల్బిషదూర, కైగొను నమస్కారంబు సర్వేశ్వరా!

తదుపరి 'భగవచ్ఛక్తి' యను శీర్షికలో అల్లమరాజు రంగశాయి కవి 6 పద్య ములు చెప్పినాడు.

2. చీమంజూచిన యంత దోచెడు భవత్సృష్టి ప్రభావంబహా
యేమీ, యబ్బురమింత చిన్న క్రిమి కెట్లేరీతి నిర్మించినా
డోముక్కుం గనులం బదంబుల శిరంబున్ నాడులుల్ శ్రోత్రముల్
రోమంబుల్ పలురోగముల్ రుధిరమున్ లోకేశ సర్వేశ్వరా!

ఈక్షోణీ రుహ సంఖ్య జెప్పదరమే యా రాలుచున్నట్టి జీ
ర్ణాకీర్ణోరు దళంబులందు శిథిలంబౌ పర్ణమున్ దీనినే
శిక్షన్ రెమ్మల నీనలన్ వలవలెం జేయంగ నా నౌరనీ
దక్షత్వంబు నెఱుంగ నాతరమె యాత్మారామ సర్వేశ్వరా!

ఈ విధంబుగా మూడు సర్వేశ్వర శతకములున్నవి. ఈ సర్వేశ్వర శతకములు సంఖ్యలో మూడున్నప్పటికి తెలుగు సాహిత్యము నందును, లోకము నందును, యథావాక్కుల అన్నమయ్య రచించిన సర్వేశ్వర శతకమునకే ప్రాధాన్యము, ప్రాముఖ్యము కనిపించును. బహుశ అన్నమయ్య ప్రతిపాదించిన భక్తి విశేషము లోకమును ఎక్కువగా అకర్షించి యుండును అంతే కాక యితని సరళమైె భావములు, భాష కూడా ఈ శతక ప్రచారమునకు దోహదము చేసినవి. శైవ సంబంధ శతకములలో యథావాక్కుల అన్నమయ్య 'సర్వేశ్వర శతకము' నకు ప్రాచుర్యము, ప్రాధాన్యము అధికముగా నున్నవి.

## శ్రీకాళహస్తీశ్వరశతకము

ఇక భక్తి శతకములలో, అందున శైవశతకములలో పేరెన్నికగన్నది శ్రీకాళహస్తీశ్వర శతకము. ఇది ధూర్జటి కవి విరచితము. ప్రబంధకాలములో చక్కటి శైవప్రబంధము రచించిన వెనుక వార్ధక్యదశలో ధూర్జటి ఈ శతకము వ్రాసినట్లు తెలియుచున్నది. ఈ శతకములో ఆత్మాశ్రయకవిత్వము, రాజదూషణ, వైరాగ్య భావములు మున్నగు భావములతోపాటు శైవభక్తికూడ వెల్లడింపబడినది. శైవభక్తి ముఖ్యాంశమగు విషయమే నను భావము శతకము చదివినవారందరికి తెలియును.

ఆత్మవంచనము, జగద్వంచనముచేయక ఆత్మీయమైన భావమును, ఉద్వేగమును, ప్రదర్శించుటయే ఆత్మాశ్రయ ప్రధానమైన భావకవిత్వమని నిర్ణయించుకొనినచో ఈ శతకము నట్టి గౌరవము పొందుటలో నద్వితీయమనిపించుకొనును. ఈ శతకము వలన ధూర్జటి జీవిత చరిత్ర ఊహించుట కవకాశము గలదు. ఏ శతక కర్త స్పష్టముగా చెప్పనంత ఆత్మోదంతము ధూర్జటి ఈ శతకములో చెప్పినాడు. తను నివసించు సీమలోని దైవమైన శ్రీకాళహస్తీశ్వరునకు ధూర్జటి తన బాధలు, భయములు, కోరికలు అణుమాత్రము దాచక చిత్తశుద్ధితో మహోద్వేగముతో ఈ శతకము మూలమున విన్నవించినాడు.

ధూర్జటి తన కవిత్వము శివునికే అంకితమీయ దలచినాడు. ఆ విషయము నిర్భయముగా శతకములో చాటిచెప్పినాడు.

నీకుంగాని కవిత్వమెవ్వరికి నేనీనంచు మీదెత్తితిన్
జేకొంటిన్ బిరుదంబు కంకణము ముంజేగట్టితిం బట్టితిన్
లోకుల్ మెచ్చ వ్రతంబునా తనువు కీలున్ నేర్పులుంగావు చీ
చీ కాలంబుల రీతి దప్పెడుజుమీ శ్రీకాళహస్తీశ్వరా

(కా।శ।14)

తిర్యక్కులలో కూడ శివభక్తి గలదని శ్రీకాళహస్తి మాహాత్మ్యము ద్వితీయాశ్వాసములో ధూర్జటి చెప్పినాడు, అటువంటి శివభక్తియొక్క గొప్పతనము ప్రాశస్తము శతకమున కూడ ఈ విధముగ స్మరించినాడు.

(కా।శ।18)

ఏవేదంబు పఠించెలూత భుజగం బేశాస్త్రములు ఫ్చెచె దా
నేవిద్యాభ్యసనంబొనర్చె గరిచెంచేమంత్రమూహించె బో
దావిర్భావ నిదానముల్ చదువులయ్యా! కావు! మీపాదసం
సేవాసక్తియెకాక జంతుతతికిన్ శ్రీకాళహస్తీశ్వరా!

సాలె శివుని గొలుచుటకు ఏ వేదములు పఠించలేదు. చెంచు తిన్నడు ఏమియు చదువలేదు. అయినను శివభక్తికి కొదువ రాలేదు. శివుని కొలిచి చివరకు సాయుజ్యము పడసిరి. కాళహస్తీశ్వరుని విశ్వాసముతో కొలుచుట కేవేదాధ్యయన మక్కరలేదని ఏ చదువులతో పని లేదని భావము.

ధూర్జటికి సంసార జీవితము పట్ల అసంతృప్తి గలిగినది. ఆసక్తియు తగ్గినది. ఈ విషయ మీవిధముగా శతకములో తెల్పినాడు.

సంతోషించితి జాలుజాలు రతిరాజ ద్వార సౌఖ్యంబులన్
శాంతింబొందితి జాలుజాలు బహురాజ ద్వార సౌఖ్యంబులన్
శాంతిం బొందెద జూపు బ్రహ్మపరాజ ద్వార సౌఖ్యంబుని
శ్చింతం న్శాంతుడ నౌదు నీకరుణచే శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 62)

పై పద్యములో ధూర్జటికి శ్రీకాళహస్తీశ్వరుని యందున్న భక్తి భావములే కాక అతని వైరాగ్య తత్త్వము కూడ అవగత మగుచున్నది. మంత్ర, తంత్రములు, తీర్థ యాత్రలు ముక్తి నొసగ లేవని అతడు నిశ్చయించుకొనెను. కాళహస్తీశ్వరుని పట్ల నిశ్చలమైన భక్తి కుదురుటకు ఇంద్రియ నిగ్రహ మవసరమని గుర్తించి అట్టి శక్తిని ప్రసాదింపు మని ధూర్జటి ఎన్నియో విధముల కాళహస్తీశ్వరు నర్థించెను. పరమేశ్వరుని మెప్పించిన భక్తులు, కవులు మాత్రమే తనకు బంధువులని విశ్వసించెను. ధూర్జటి శైవ సాహిత్యమును అవగాహన చేసికొన్న వాడు. ఆంధ్ర దేశములో శైవము ఎన్ని విధములుగా ప్రవర్తిల్లెనో అతనికి తెలియును.

నిన్నే రూపముగా భజింతు మదిలో నీరూపు మోకాలొ స్త్రీ
చన్నో కుంచమొ మేకపెంటికయొ యీసందేహముల్మాన్పి

కన్నార న్భవదీయ మూ_ర్తి సగుణా కారంబుగా జూపవే
చిన్నీరేజ విహారమత్త మధుపా! శ్రీకాళహస్తీశ్వరా!

(15)

ధూర్జటి శివుని రూపము నేవిధముగా నైనను భజియింప వచ్చునని పై పద్యములో చెప్పినాడు. పాల్కురికి సోమనాధుడు బసవ పురాణములో చెప్పిన వీర శైవ సంప్రదాయ కథల ప్రశక్తి ఈ పద్యమున గలదు. కాళహస్తీశ్వరుడైన మహేశ్వరుడు దేవదేవుఁడు అతడు సర్వమయుడు. లింగస్వరూపము కలిగిన ఏ పదార్థమునందైనను మహేశ్వరుడు నిలిచి యున్నాడని శివమతస్థులు ముఖ్యముగా వీరశైవులు విశ్వసింతురు. అందుచేత లింగాకారము కలిగిన, సామాన్య వస్తువైన మోకాలి యందును, స్త్రీ ఇంద్రియమైన కుచాగ్రమునందును కేవలము హేయ వస్తువైన మేక పెంటిక యందును ఇటువంటి యితర అనేక వస్తువు లందును మహేశ్వర రూపము నిక్షిప్తమై యున్నదని శైవులు భావింతురు. ఇటువంటి పదార్థములలో మహేశ్వరుడు శివభక్తులకు ప్రత్యక్షమైన శైవగాథ కూడ వీరు చెప్పుదురు. అనగా ఈ పద్యము నందు వీరశైవ సిద్ధాంత ప్రతిపాదనము సూచన ప్రాయముగా చేయబడినది. ఇఁక శ్రీకాళహస్తి మాహాత్మ్యములోని కథల ప్రసక్తి కూడ ధూర్జటి యీ శతమున తీసికొని వచ్చినాడు. శ్రీకాళహస్తి మాహాత్మ్యమున నిశ్చలమైన భక్తికి తిన్నడు ప్రతీక, ధూర్జటియు నంతే

హృదయమున వైరాగ్య భావము స్థిరముగా నిలిచిన తరువాత ధూర్జటి నిశ్చలమైన ధ్యానము చేతను, కవితా శక్తి చేతను ముక్తిని సాధించ వచ్చునని విశ్వసించెను. ఈశ్వరార్చనకు తగిన సాధన సంపత్తి తన కవితకు కలదని భావించెను. ఉపమ, ఉత్ప్రేక్ష, ధ్వని, వ్యంగ్యముల కతీతమైన రూపము నెట్లు వర్ణింతునని అజ్ఞతను చాటి 'కవితా నిర్మాణ శక్తిన్ని నుంప్రీతుంజేయ గలేనని తన అశక్తతను ఇట్లు చాటినాడు.

నీతో యుద్ధము జేయనోప, గవితా నిర్మాణ శక్తిన్నినుం
బ్రీతుంజేయగలేను, నీకొఱకు దంప్రడిం జంపగా జాలనా
చేతన్రోకట నిన్ను మొత్త వెఱతుంజీ కాకు నాభక్తియే
రీతిన్నాకిక నిన్ను జూడగలుగున్ శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 8 పద్యం)

తిన్ననివలె ఈతడును పరమేశ్వరుని మందలించెను. భక్తులు నానావిధములుగ సేవించుచుండ వారి కోర్కెలు తీర్చక లోభమేటికి? అని "పరమార్థం బిచ్చి పొమ్మన్న నీ శ్రీభాండారములో గొరంతపడునా"యని సూటిగా ప్రశ్నించెను. ఇటువంటి భక్తి సిద్ధాంతమునే ఈ పద్యములో చెప్పినాడు.

నీకుం మాంసము వాంఛయేని కఱవా నీ చేత లేడుండగా
జోకై నట్టి కుఠారముండ ననలజ్యోతుండ నీరుండగా
బాకంబొప్ప ఘటించి చేతి పునుకన్భక్షింప కాబోయచే
జేకొం దెంగిలి మాంస మిట్లు తగునా? శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ 20)

ఈశ్వరునికి భక్తునికి భక్తి మార్గము ద్వారా ఎంత సాన్నిహిత్యమున్నదో ఈ పద్యములో కవి చెప్పినాడు. మహేశ్వరుడైన నీకు మాంసము తినుట తగునా? యను ఆక్షేపణ పైకి కాన్పించును ఆ బోయవాడు అనగా తిన్నడు ఇచ్చిన మాంసమును ఎందులకు తింటివని కూడ ఆక్షేపించుచున్నాడు. ఎంగిలి మాంసము తినుట తగునాయని కూడ నిందాగర్భితముగా పల్కినాడు. ఇట్లు చెప్పుటలో సూచన మాత్రముగ బోయవాని కథ స్ఫురించినది. అంతటితో పోలేదు. అజ్ఞానియైన బోయవాడు సమర్పించిన మాంసమును స్వీకరించి ఆతనికి మోక్షమును ప్రసాదించినావు. "అంతటి ఘనుడవు నీవు" మోక్షము పొందుటకు నీపై భక్తి యుండిన చాలును. జ్ఞానులు, అజ్ఞానులు, నాగరకులు, ఆటవికులు అనెడు భేద భావము నీకు లేదుగదా అను స్తుతి దీనిలో కన్పించుచున్నది. భక్తి భావములోని సర్వసమానత్వము వీరశైవమున ముఖ్యాంగము కదా!

మును నీచే నపవర్గ రాజ్యపదవీ మూర్ధాభిషేకంబు గాం
చిన పుణ్యాత్ములు నేనునొక్క సరిపోచింతించి చూడంగ, నె
ట్లనినం గీట ఫణీంద్రపోత మదవేదండో గ్రగ్రహింసా విచా
రిని గాగ నినుగాన గాక మదిలో శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 40)

వీరశైవులలో పరంపరగా అనేక గాథలున్నవి. ఆ గాథలలో సామాన్యమైన మనుష్యులే కాక అల్పములైన జంతువులు చివరకు కీటకములు కూడా శివుని ఆశ్రయించి మోక్షమును పొందినట్లు చెప్పుదురు. ఈ పద్యములో సాలెపురుగు, సర్పము, ఏనుగు అనువాని ప్రస్తావన యున్నది. కవి ఈ జంతువులతో భక్తి భావమునందు సమానమైన వాడని చెప్పి వారికిచ్చి నట్లుగా తనకును సాయుజ్యము ప్రసాదించుమని కోరుచున్నాడు. ఇదియు వీరశైవమునందలి ప్రధానాంశమే.

ఇట్లు పై పద్యములలో ధూర్జటి వీరశైవ సిద్ధాంత ప్రతిపాదన స్పష్టముగా చేసెను. ఇక కొన్ని చోట్ల ఆగమ శైవ సంప్రదాయములు కూడా లేక పోలేదు. వానిని చూతము.

దినముం జిత్తములో సువర్ణ ముఖరీ తీరప్రదేశాశ్రమకా
ననమధ్యోపల వేది కాగ్రమున నానందంబు నంబంకజా
సన నిష్టన్నిను జూడగన్న నదివో సౌఖ్యంబు, లక్ష్మీవిలా
సిని మాయా నటనల్ సుఖంబులగునే? శ్రీకాళహస్తీశ్వరా

(కా.శ ౫౬)

పై పద్యములో వివరింపబడిన సువర్ణముఖరీ లహరీ శీతల శిలాతలమే ధూర్జటి ప్రతి దినము సదాశివుని ధ్యాచించు పవిత్ర స్థలము. ఈ పవిత్ర స్థలమందే ధూర్జటి దివ్యలింగమును హృదయ గేహమున నిలుపుకుని తపము గావించి, బిల్వదళములచే అర్చనకూడ చేయువాడు. అంతర్ముఖుడై తపమాచరించునట్టి సమయములో పరమేశ్వరుని తేజస్సంతయు ధూర్జటి ముఖమునందే భాసించుచున్నదా! యనునట్లు ఆ కవి ముఖవర్చస్సు తేజస్సుతో ప్రకాశించినదట. కవి ఇచట ఆగమోక్త ప్రకారముగా శివుని కొల్చుట వివరింపబడినది. తపస్సు, ధ్యానము, ఏకాగ్రత మొదలైన వన్నియు ప్రాచీన ఋషులు, మునులు శివుని ఆరాధించు పద్ధతులే కదా! ఇవన్నియు వీరశైవోక్తమైన భక్తి సిద్ధాంతమునకు భిన్నమైనవని ప్రత్యేకముగా చెప్పబని లేదు.

పవి పుష్పంబగు నగ్ని మంచగు నకూపారంబు భూమీ స్థలం
బవు శత్రుం డతి మిత్రుడౌ విషము దివ్యాహారమౌ నెన్నగా

నవనీ మండలి లోపలన్ శివే శివేత్యా భాషణోల్లాసికిన్
శివ నీ నామము సర్వవశ్యకరమౌ శ్రీకాళహస్తీశ్వరా

(కా.శ 45)

నిరంతరము శివ ధ్యానము చేయుట, శివుని జపించుట కైవల్యా మార్గమని పురాణములలో చెప్పబడినది. ఈ నిరంతర ధ్యానమే ఒక విధమైన తపస్సు. ఇట్టి తపశ్చర్య చేయు వారికి లౌకికములైన కష్టనష్టములు బాధించవు. ప్రమాదములు సంభవించవు. ఈ విషయమునే కవి ఉపమాన పూర్వకముగా చెప్పుచున్నాడు. శివధ్యానము చేయుచున్న వానిపై వజ్రాయుధము విసరగా అది పుష్పమువలె భాసించును. తాపమును కలిగించు అగ్ని అతనిని కాల్చదు సరి కదా, మంచువలె సౌఖ్యమును ప్రసాదించును. అతడు బావిలో పడినను భూమిపై నున్నట్లే యుండును. ఆగ మోక్తమైన తపశ్చర్య ఎంతటి గొప్ప ఫలితముల నిచ్చునో కవి ఈ పద్యమునందు చెప్పియున్నాడు.

మునునే బుట్టిన పుట్టులెన్నిగలవో, మోహంబుచే నందుజే
సినకర్మంబుల ప్రోవులెన్నిగలవో, చింతించినంగాన; నీ
జననంబే యని యున్నవాడ నిదియే చాలింపవే, నిన్నుగొ
ల్చిన పుణ్యంబునకుం గృపాతుడవై శ్రీకాళహస్తీశ్వరా!

(కా.శ. 47)

ఈ పద్యములో కూడా ఆగమోక్త శైవ విధానమే వర్ణింపబడినది. జననము, మరణములు జీవులకు నిరంతరముగా కొనసాగుచుండునని పురాణములలోను భగవద్గీతాది గ్రంథములలోనూ చెప్పబడినది. కవి తనకు కలిగిన జన్మ పరంపరలను గుర్తు చేసికొని ఇంక తనకు ఆ జన్మములు చాలునని ఇంతటితో కైవల్యము ప్రసాదించుమని మహేశ్వరుని ప్రార్థించుచున్నాడు. జన్మ పరంపర అనునది పురాణాదికములందే ఉండును గాని బసవేశ్వరాదులు ప్రతిపాదించిన వీరశైవ సిద్ధాంతమైన భక్తిలో ఉండదు. ఇట్లు కాళహస్తీశ్వర శతకములో కొన్ని పద్యములందు దక్షిణ దేశములో ప్రవర్తితమైన వీరశైవమునకు ప్రస్తావన ఉండగా మరికొన్ని పద్యములలో ఆగమోక్తమైన తపశ్చర్య కర్మ సిద్ధాంతము మున్నగు వాని ప్రశంస కలదు.

ఇది చూడగా ఈ కవికి మన దేశమున ప్రవర్తిల్లిన వీరశైవ, ఆగమశైవ మార్గముల రెండింటి యందును విశ్వాసమున్నట్లు కాన్పించును. ఈ రెండు సిద్ధాంతములు యదార్థమునకు పరస్పరము విరుద్ధములు కావు. కాని శైవులు మాత్రము రెండు విధములుగానే వీనిని స్వీకరింతురు. కాని ధూర్జటి తన కావ్యమైన శ్రీకాళహస్తి మాహాత్మ్యము నందువలెనే దీనిలోను సమన్వయమును సాధించినాడు. ఇది ఒక ప్రత్యేకమైన పద్ధతి. ఈ పద్ధతికి ధూర్జటియే నిర్దేశకుడని చెప్పుట సమంజసముగా నుండును.

కాళహస్తీశ్వర శతకములో వీరశైవమును ఆగమ శైవమును సూచించు పద్యములు అనేకములున్నది. నేను కొన్నింటిని మాత్రమే ఉదాహరణ ప్రాయముగా ఉల్లేఖించితిని.

# ఉదాహరణములు - శైవనిరతి

ఉదాహరణ కావ్యములలో 'శైవనిరతి'ని గూర్చి పరిశీలించుటకు ముందుగా ఉదాహరణ కావ్యలక్షణము లించుక తెలిసికొనుట యుక్తము. ఉదాహరణములనగా భాష యందుగల సప్త విభక్తులు సంబోధన విభక్తిని ఉదహరించు లఘుకృతి. ఇది ప్రధానముగా స్తోత్ర రూపమగుటచే దేవతా పరమగు కావ్యము కాని మానవ పరమగు కృతులును నుండును. ఇందలి ఇతివృత్తము, వృత్తములు - కళికలు - ఉత్కళికలు- సార్వ విభక్తిక పద్యము - కవి కృత నామాకింత పద్యము అను విభాగములు కలవు. ప్రతి విభక్తికి ఒకే వృత్తము, ఒకే కళిక, ఒకే ఉత్కళిక నియతములు. వృత్తములలో చంపకోత్పలములు, మత్తేభ, శార్దూల వృత్తములు మాత్రమే ప్రయుక్తమగును. కళిక యనగా మాత్రాచ్ఛందస్సునకు సంబంధించిన రగడభేదము, ఇందెనిమిది పాదములు మాత్రమే యుండును. ఉత్కళిక యనగా కళికలో సగము భాగము - అర్ధకళిక - ఇందును నెనిమిది పాదములే. కళికయందు ప్రతి పాదాంతముననను విభక్తి ప్రత్యయము భాసింపవలెను. ఉత్కళిక యందు చివరి రెండు పాదములలో మాత్రము భాసింపవలెను ంబోధనయందు మాత్ర మన్ని పాదములను సంబోధనాంతములుగానే యుండవలెను.

చతుర్థీ విభక్తియందు ప్రతిపాదాంతమున విభక్త్యాభాసము స్పష్టముగా నుండవలెను. కళికలయందు ప్రతి పాదమును స్వతంత్ర వాక్యముగా నుండవలెను. ఉత్కళికయం దేక సమాసముగా పాదము లుండవలెను.

సార్వ విభక్తికము - దీని యందొక్క పద్యముననే యన్ని విభక్తులు ప్రయుక్తములు కావలెను. ఇది సాధారణముగ మత్తేభమునగాని, శార్దూల వృత్తమున గాని యుండును.

కవికృత నామాంకిత పద్యము-ఇందొకే పద్యమున కవిపేరు, నుదాహరణము పేరు నుండవలెను.

ఉదాహరణములలో పైని వివరించిన వృత్తములు తప్ప తక్కిన పద్యము లేవియు ప్రయుక్తములుకావు. ఇది కేవలము స్తుతి రూపకమైనది కావున గాన యోగ్యమైనది - ఇందలి పద్యములు రాగాంగ ప్రధానములు. అనగా రాగము లతో పాడదగినవి - కళికోత్కళికలు తాళాంగ ప్రధానములు, త్రిపుట - జంపె - రూపక తాళముల తోడనే పాడవలెను. ఆతాళము కనుకూలములైన త్ర్యశ్ర - చతురశ్ర - మిశ్ర జాతులందు ప్రకటితములు కావలెను. మహా కావ్యము నందలి నాయకునివలె నిందును నాయక గుణకీర్తనమే ప్రధానము. "అల్పాక్షరముల ననల్పార్థ రచన కల్పించుటయుగాదె కవి వివేకంబు" అన్న సూక్తికి నుదాహరణములు లక్ష్యములు. ఇందలి కళికోత్కళికా పద్య సంఖ్య యిరువది యాఱు. ఈ యిరువదియాఱు సఖ్య సదాశివుని షడ్వింశతి తత్త్వము లకు ద్యోతకము[1]

ఉదాహరణములు ప్రస్తుత స్వరూపమున గాకపోయినను, వాని యందలి కొన్ని లక్షణములు ప్రాచీన భారతీయ వైదిక లౌకిక సాహిత్యమున గానవచ్చు చున్నవి. ఉదాహరణము ప్రధానముగా స్తుతి పరమైనది. ఇట్టి స్తుతులు ప్రప్రధ మమున మనకు వేదముల యందాదియైన ఋగ్వేదమునందు కానవచ్చుచున్నవి. ఈ స్తుతులుగల సూక్తములకు "కుంతాప సూక్తములు" అని పేరు. ఇవి ఋగ్వే దమున నిరువదియవ కాండమున గలవు.[2] వీనిని "నారాశంసి"యని కూడ అందురట. వీని స్వరూపము నెఱుంగుటకు ఆంధ్రానువాదములను కూడ శ్రీ నిడదవోలు వేంకటరావుగారు తమ "ఉదాహరణ వాఙ్మయ చరిత్ర"లో పేర్కొనిరి.

ప్రాచీన సంస్కృత కావ్యములలో 'ఉదాహరణము'అను పేరుతో ప్రథమ మున కవికుల గురువగు కాళిదాసుని రఘు వంశమున గానవచుచున్నది. "చియో దాహరణం బాహ్వోర్గాపయో మాసకిన్నదరాన్."

(4 సర్గ. 78 శ్లోకము)

---

1. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర-శ్రీ నిడదవోలు వేంకటరావుగారు

2. " " "

రఘువంశమునందే గాక యాతని విక్రమోర్వశీయ నాటకమునందును నీ పదము గానవచ్చుచున్నది. "ప్రత్రేసి వేశిత ముదాహరణం ప్రియాయా" (2 ఆ. 5 శ్లోకం) కాని వ్యాఖ్యాత లెవ్వరును దీనిని సరిగ వ్యాఖ్యానింప లేదు. కాళిదాసు కన్న ప్రాచీనుడగు భరతముని నాట్య శాస్త్రమున కళి కోత్కళికల ప్రస్తావన గావించెను.

నేడు మనకు లభించిన నాలుగు సంస్కృతోదాహరణములు యాంధ్రో దాహరణ లక్షణ లక్షితములై యున్నవి. కావున నుదాహరణములు మార్గ దేశ కవితా భేదమున రెండు తెఱగులుగా నేర్పడిన కవితా పథకములలో తెలుగున దేశి కవితా శాఖలో ప్రత్యేక విశిష్టత గలవిగా నెన్ననగును.

సంస్కృతముననే లేకపోయినప్పుడు దేశ భాషలలో లేకుండుటలో నాశ్చర్యము లేదు. తెలుగు కన్న ముందు సాహితీ రీతులను వెలయించిన ద్రవిడ కన్నడ భాషలలో నివిలేవు. తరువాత సారస్వత స్థాయినందిన మళ యాళ మహారాష్ట్ర ఘూర్జర భాషలలో నివి లేనే లేవు. కావున భారత దేశ భాషలలో నొక స్వతంత్ర విశిష్ట శాఖ వెలయించిన గౌరవము తెనుగుదే యని నిశ్చయముగా చెప్పవచ్చును.

ఆంధ్ర కవితా పరిణామమును దెలిసికొ౦టకు నుదాహరణములు సాధ నములు. తెలుగు కవిత యేకపదమై, ద్విపదమై, త్రిపదమై, చతుష్పదమై పరి ణతి జెందినట్లు కానవచ్చుచున్నది. ఏకపదములగు పాటలును, ద్విపదములగు ప్రబంధములును, త్రిపదాది సంయుక్తములై సంపూర్ణ గాన యోగ్యములగు యక్షగానములును, సలక్షణ చతుష్పాదవృత్త కవితా సమన్వితములగు భార తాది గ్రంథములను, వాఙ్మయ వీథిని ప్రథమ, ద్వితీయ, చతుర్థఘట్టములు. ఉదాహరణములీ తృతీయ ఘట్టమున జేరినవి. ఇవి కేవలము ఏక పదములు గాక, ద్విపదాదులవలె నొకే ఛందస్సు ననుసరింపక, పదకవిత యందలి యేదో నొక ఛందో విశేషము ననుసరించును. యక్షగానములవలె గానయోగ్య ములైన పదములను హెచ్చుగా గలిగి యుండకపోయినను లయ, తాళ సమన్వి తములగు పదములతో గూడి వృత్తములు గలిగియుండును. కావున నివి ద్విపద కవితకును, యక్షగాన కవితకును మాధ్యమికములని నిశ్చయింప వచ్చును.

ఉదాహరణములకు సంగీతముతో దగ్గర సంబంధము కలిగియుండుట మరి యొక విశిష్టత. కేవలము సంగీత పరములగుటయేకాక, ఛందస్సు, వ్యాకరణము, విభక్తి ప్రత్యయములతో కూడ దగ్గర సంబంధము కలిగియున్నవీ ఉదాహరణములు.

ఆంధ్ర వాఙ్మయమున బురాణేతి హాస కావ్య నాటకాదుల యందలి లక్షణములన్నియు, నంతర్భూతములై యుండుటచే నుదాహరణము లాయా గ్రంథముల వలన గల్గు ప్రయోజనములన్నిటి నొసంగి యానందము జేకూర్చుచున్నవి. భక్తిరస ప్రధానములగు మతములకు, ముఖ్యాంగమగు గానకళకు సంబంధించిన యుదాహరణము పంద్రెండవ శతాబ్దికి ముందే వెలయుచున్నట్లు శైవ వాఙ్మయమువలన దెలియుచున్నది[1]

తెలుగు కవిత, ఆశు, మధుర, చిత్ర, విస్తర కవిత్వములని నాలుగు విధములు. వీనికే 'చతుర్విధకవిత'లని పేరు. ఈ కవితా విభాగములునన్నయ కాలము నుండి, అనగా క్రీ॥శ॥ 1050 నుండి తెలుగున వెలయుచున్నవి. ఈ నాల్గు విధములగు కవితలలో 'ఉదాహరణములు' మధుర కవితా జాతికి చెందినవని నిడదవోలు వేంకట్రావుగారు తమ 'ఉదాహరణ వాఙ్మయ' చరిత్రలో సప్రమాణముగా నిరూపించి యున్నారు.

క్రీ॥ శ॥ 16వ శతాబ్దము వరకు వెలువడిన శతకముల తరువాత చెప్పదగిన లఘు కృతులు ఉదాహరణములు. శతకములవలె ఇవి కూడా తెలుగు సాహిత్యమున విరివిగనే వెలువడినవి కాని ఇవి కూడా స్వల్ప సంఖ్యలోనే క్రీ॥ శ॥ 16వ శతాబ్దమునకు ముందుగా వచ్చినవి. అందుచేత సంఖ్యలో ఈ లఘు కృతులు అధికముగా నున్నప్పటికీ కాలనియతి ఉండుటవలన శైవ ప్రధానములైన 'ఉదాహరణములు' కొన్నింటిని మాత్రమే మనమీ పరిశీలనలో గ్రహింప గల్గుచున్నాము.

మనకు తెలిసినంతవరకు పాల్కురికి సోమనాథుడు రచించిన వృషాధిప శతకమే తెలుగు శతకములలో సమగ్రమైన మొదటి శతకమైనట్లు అతడే

1. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర - శ్రీ నిడదవోలు వేంకట్రావుగారు.

రచించిన బసవోదాహరణము తెలుగులోని మొదటి ఉదాహరణముగా చెప్ప వలసి యున్నది.

## బసవోదాహరణము

పాల్కురికి సోమనాథుడు తన పండితారాధ్య చరిత్రమున ఉదాహరణ గ్రంథ లక్షణ సూచనము గావించి యున్నాడు. కొన్ని ద్విపదలలో ప్రథమా విభక్తి మొదలు, సప్తమీ విభక్తి వరకున్న పదముల నుపయోగించినాడు 1 బసవోదాహరణమున సోమనాథుడు దక్షిణ దేశమున వీరశైవ మతమును ప్రతి పాదించెను. బసవేశ్వరుని మహిమను వర్ణించినాడు. ఒక విధముగా దీనిలోని వర్ణనము అతడు చెప్పిన 'బసవ పురాణము' నందును, వృషాధిపశతకము నందును, అతడు రచించిన గద్యలయందును ఉన్నట్టిదే. దీనిలో వివిధ విభక్తుల యందు ఉన్నట్టి పద్యములందును కళికోత్కళికలలోనూ బసవేశ్వరుని స్తుతియే ప్రధానము. ప్రారంభ మిట్లు గలదు.

ప్రథమావిభక్తి:

ఉ॥ శ్రీ గురులింగ తత్పరుడ-శేషజగన్నిధి, శుద్ధ తత్త్వసం
యోగసుఖప్రపూర్తి వృషభోత్తమమూర్తి యుదాత్తకీర్తి ది
వ్యాగమ మార్గవర్తి, బస-వయ్యకృపాంబుధి మాకు దివ్యసం
భోగములం బ్రసాదసుఖ-భోగములం గరుణించు గావుతన్.

ఈ పద్యములో బసవనికి శివునకు అభేదము చెప్పబడినది. దీనిలో బసవేశ్వరుని వ్యక్తిత్వము వర్ణితమైనది. ఈశ్వర లింగము నందు మనస్సు నిలిపినవాడు లోకమునందంతటను విధివలె వ్యాపించినవాడు, నిర్మలమైన తాత్త్విక యోగము చేత సౌఖ్యమును అనుభవించినవాడు. మహాశివభక్తుడగు నందీశ్వరుని స్వరూ పముకలవాడు స్వచ్ఛమైన కీర్తి వహించినవాడు, వేదమార్గమున చరించువాడు, ఇట్టి బసవేశ్వరుడు మాకు ఐహిక, ఆముష్మిక సౌఖ్యములను ప్రసాదించుగాక! ఇట్లు చెప్పుటవలన శివునితో సమానమైన ఇంకొక కళికలో బసవేశ్వరుడు

1 పండితారాధ్య చరిత్ర-పాల్కురికి సోమనాథుడు. (పుట. 279)

సాక్షాత్తూ కలియుగ రుద్రుడని కవి వర్ణించినాడు. మహిమగల బసవేశ్వరుని కవి ప్రార్థించినట్లైనది కావ్యప్రారంభమునందు ప్రార్థన సంప్రదాయమే.

కళిక- వెండియు త్రిభువన-వినుత సమేతుడు
మండిత సద్గుణ-మహిమోపేతుడు
సురుచిర శివసమ-సుఖసంధానుడు
పరమ పరాపర-భరితజ్ఞానుడు
విదితానందా-న్వితమనస్కుఁడు
సదమల విపుల వి-శాల యశస్కుఁడు
శ్రీవిలసిత పద-చిరతర భద్రుడు
గావున సాక్షాత్-కలియుగ రుద్రుడు

బసవేశ్వరుడు మూడు భువనములకు నాయకుడు. సద్గుణముల ప్రోవు. గొప్ప మహిమాన్వితుడు. శివునితో సమముగా కొల్వదగినవాడు. గొప్ప జ్ఞానము కలిగినవాడు. ఈ విశాల జగత్తులో గొప్పయశస్సు సంపాదించినవాడు. ఆ కీర్తి నేటికిని నిలిచినవాడు. సాక్షాత్తూ కలియుగ రుద్రుడేగాని వేరుగాదని ఈ కళికలో బసవేశ్వరుని గొప్పతనము వర్ణింపబడినది.

ద్వితీయా విభక్తి :

చ॥ వసిగొని యెవ్వడేని బస-వాయను నీసుకృతాక్షరత్రయం
బెసగ బఠించెనే నినేగిరి-జేశుని కాతని వక్త్రగహ్వరం
బసదృశగేహమన్న యవి-యార్యుల వాక్యములట్లు కావునన్
బసవన బుణ్యమూర్తి దల-వంగదె చిత్తమ। పాయకెప్పుడున్

ఎవ్వరైనను, బసవా! యని హృదయాంతరాళముల నుండి భక్తితో పిలిచిన ఈ మూడక్షరములు ఆర్యుల వాక్యమువలె పవిత్రములైనవి. ఎందుచేత ననగా ఆ బసవేశ్వరుని ముఖము మహేశ్వరునికి గృహము వంటిది. అట్టి వానిని తలంచుమని తనచిత్తమును కవి కోరినాడు. ఈ ద్వితీయావిభక్తి కళికలో భక్తులను కాపాడిన రీతిని పండితులను గెలిచిన పద్ధతిని బసవని వర్ణించెను. తృతీయావిభక్తి పద్యములో జంగముడని బసవని పేర్కొని అతడు లింగ మునితో సమానుడని చెప్పెను. తరువాతి కళికలో (అనగా తృతీయా విభక్తి

కళిక) వేదోక్త జ్ఞానము వలన ప్రకాశించు బసవయ్య పాప బంధనములను నశింపజేయునని చెప్పెను. దాని తరువాత ఉత్కళికలో అతడు తత్త్వజ్ఞుడని పేర్కొనెను. చతుర్థీ విభక్తి పద్యములో బసవని పేర్కొనుటచేత మనుష్యుని సర్వేంద్రియములు పావనమగునని వర్ణించెను. అదే కళికలో ఇతడు పండితారాధ్యునిచేత లేక పండితులచేత స్తుతి చేయబడిన వాడని చెప్పెను. దాని తరువాతి ఉత్కళికలో బసవేశ్వరుడు వంగకాయలను లింగములుగా మార్చిన వృత్తాంతము చెప్పబడినది.

పంచమీ విభక్తి పద్యములో బసవేశ్వరుని యశస్సు లోకమున వ్యాపించిన విధము వర్ణితమైనది. అదే కళికలో బసవేశ్వరుడు వీరులను యుద్ధమున పండితులను వాదమున జయించిన విధానము పేర్కొనబడినది. ఇతని ఉపదేశముచేత పాపాత్ములు దైవజ్ఞులెట్లైరో ఉత్కళికలో చెప్పబడినది. షష్ఠి విభక్తి పద్యమునందు నాగయ్యగారి కథ సూచింపబడినది. అతడు నాస్తికుడై భక్తులను దూషించు చుండగా బసవన్న అమృత ధారలు కురిపించి అతనిని శైవుడుగా మార్చిన పద్ధతి వర్ణితమైనది. షష్ఠివిభక్తి కళికలోను ఉత్కళికలోను బసవన గుణగణములు వర్ణింపబడినవి. సప్తమీ విభక్తి పద్యము, కళిక, ఉత్కళిక శరణు వేడినవారిని బసవడు ఎట్లు ఉద్ధరించినది చెప్పబడినది. సంబోధనా విభక్తియందు త్రినేత్రముచేత మన్మథుని సంహరించిన విశేషము, దక్షుని యజ్ఞమును నాశనము చేసిన వృత్తాంతము చెప్పి ఈశ్వరునికి బసవేశ్వరునికి ఏకీభావము కలిగించెను. ఆ మహేశ్వరుడే లోకమున పుట్టి భక్తజనులను కాపాడినట్లు చెప్పబడినది. కళికా, ఉత్కళికలు, ఆనందీశ్వరుడే బసవేశ్వరుడని నిరూపించుచున్నవి. సార్వ విభక్తికము పద్యములో బసవేశ్వరుని స్తుతి చేసినవారికి, కావ్యము నంకితము చేసినవారికి కలుగు పుణ్యమును చెప్పి నమస్కారముతో ఆ పద్యమును ముగించినాడు.

ఉదాహరణ కావ్యము ఒక ఇతివృత్తమును గురించి చెప్పినది కాదు. ఇదివఱకు చెప్పినట్లు కేవలము దీనిలో స్తుతియే ప్రాధాన్యము వహించుచున్నది. బహుశః పూర్వము ఇట్టి లఘుకావ్యములను పండితుల సభలలో కాని భక్తుల గోష్ఠులలో కాని దేవాలయములలో కాని చదివెడివారు కాబోలు !

త్రిపురాంతకోదాహరణము :-

ఈ ఉదాహరణము కూడ శైవ సంబంధమైనది. దీనిని గూర్చి పరిశీలించుటకు ముందుగా రావిపాటి త్రిపురాంతకుని గూర్చి ఇంచుక తెలిసికొనవలయును.

రావిపాటి త్రిపురాంతకుని కాలముగూర్చి తెలిసికొనుట కాధారములంతంత మాత్రముగానే కలవనుచూ ఆరుద్రగారు తమ 'సమగ్ర ఆంధ్ర సాహిత్యము' లో ఇట్లనిరి. "ఇతడు క్రీ. శ. 1295 మొదలు 1326 వరకు పాలించిన ప్రతాపరుద్రునికాలంవాడయి ఉంటాడని పరిశోధకులు భావిస్తున్నారు.[1]"

త్రిపురాంతకుడను కవి ద్వితీయ ప్రతాపరుద్రుని యాస్థానమున నున్నట్లు ప్రతాప చరిత్రమున కలదు" అని (ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక ఏడవ సంపుటము పుట 7) నిడదవోలు వెంకటరావు గారు ప్రమాణము చూపుచూ వ్రాసిరి. చాగంటి శేషయ్యగారు కూడ " ప్రతాప చరిత్రమున రెండవ ప్రతాప రుద్రుడి యాస్థానమున త్రిపురాంతకుడను కవియునట్లు చెప్పబడినది- అని వ్రాసిరి[2]

కాని ఖండవల్లి లక్ష్మీరంజనంగారు ప్రచురించిన సిద్ధేశ్వర చరిత్రములోని, ప్రతాప చరిత్రలో త్రిపురాంతకుడను కవిపేరు కనబడుటలేదు. సర్వమండల చక్రవర్తి, చిలుకపలు ...రారి పేరు మొదలైన ఎనుదు పాత్రలు యెనభైనూర్లు , భాస్కరుడు మున్నగాగల కవీశ్వరులు యున్నారు కలరని తెలియుచున్నది.[3] ప్రతాపరుద్రుని చెరపట్టి మహమ్మదీయులు తీసుకుపోయినప్పుడు అతని వెంట వెళ్లిన వారిలో శివదేవయ్య, మల్లికార్జున భట్టు, శరభాంకుడు, రంగనాథుడు అనువారే గాని త్రిపురాంతకుడు కనబడుటలేదు.

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యము - సంపుటము 4.
1. సిద్ధేశ్వర చరిత్ర- ఖండవల్లి లక్ష్మీరంజనంగారిచే సంపాదితము-పుట 152
2. ఆంధ్రకవి తరంగిణి-చాగంటి శేషయ్యగారు ప్రథమముద్రణ-పుట 50
3. (సిద్ధేశ్వర చరిత్ర - పుట 153).

మఱి ప్రతాపరుద్రుని ఆస్థానములో లేకపోయిన ఈ కవి ఇంకెవరి ఆస్థానములో ఉండెనో, ఏకాలములో జీవించెనో ప్రశ్నించుకొన్న కొన్ని ఆధారములు దొరికినవని ఆరుద్రగారు వ్రాసిరి. రావిపాటి తిప్పరాజు చాటుధార అని అప్పకవి ఒక పద్యము నుదహరించినాడు. ఆ పద్యమిది.

సరి జేస్తెరిపుడేల భాస్కరులు బాషానాధ పుత్రా వసుం
ధర నందొక్కడు మంత్రియయ్యె వినుకొండ న్రామయామాత్యభా
స్కరుడో యౌనయితే సహస్ర కర శాఖల్లేవదేయున్నదే
తిర మైదానము సేయుచో రిపుల హేతిన్వేయుచోన్రమయుచో

(అప్పకవీయము. తృ। ఆ। 60)

ఈ పద్యాధారముతో తిప్పన కాలమును ఆరుద్రగారు కొంతవరకు చెప్పిరి. సప్త ఋషులు, అష్ట దిక్పాలకులూ ఉన్నట్లే మనకు పదకొండు మంది రుద్రులూ, పన్నెండు మంది ఆదిత్యులూ కలరు. ఈ పన్నెండనే సరి సంఖ్యలో ఒకర్ని తగ్గించి బేసిని చేసి కవి చమత్కరించినాడు. ఈపద్యము రావిపాటి తిప్పరాజుదే యని అప్పకవి చెప్పెను. ఈ పద్యములో వినుకొండలో రామయా మాత్య భాస్కరుడను మంత్రి, దండనాదుడు వుండేవారని వర్ణించెను. క్రీ।శ।వ 362 ప్రాంతములలో రాయన భాస్కరుడను మంత్రి వినుకొండలో నుండెనట. ఈ పద్యములో 'రామయామాత్య' అనే మాట బహుశ 'రాయనా మాత్య' అను విధంగా వుండేదని, లేఖకులు పొరబడి వ్రాసిరని చరిత్ర కారులు భావించిరి.[1] త్రిపురాంతకుడు క్రీ। శ। 1300 ప్రాంతముతో పుట్టి తన మునలితనంలో ఈ పద్యము చెప్పి ఉంటాడని చాగంటి శేషయ్య గారు సమన్వయించిరి. దీనిని ఆరుద్రగారు సమర్ధించిరి. ప్రతాపరుద్రుడు రాజ్యపాలన కాలములో త్రిపురాంతకుడు పాతిక సంవత్సరములవాడని అందుచే ఆస్థాన ప్రవేశము కలిగియుండదని ఆరుద్రగారు భావించిరి. ఇట్లు వారు ఊహించుటకు 'క్రీడాభిరామము'లో ఓరుగంటి నగర వర్ణన కన్నులకు కట్టినట్లుగా నుండుటయే కారణము. 'క్రీడాభిరామము' సంస్కృతములో రావిపాటి త్రిపురాంతకుడు రచించిన 'ప్రేమాభిరామము'నకు అనుసరణ గ్రంధమని సాహిత్యచరిత్రకారులు భావించుచున్నారు.

1. సమగ్ర ఆంధ్ర సాహిత్యం- ఆరుద్ర- సంపుటము 4)

ప్రత్యక్షముగా ప్రేమాభిరామము మనకు లభించక పోయినను పరోక్ష ప్రమాణమును బట్టి ఇది త్రిపురాంతకుని రచన అనియే భావించుటలో అసామంజస్యములేదు. ఇట్లు చూడగా త్రిపురాంతకుడు క్రీ. శ. 14వ శతాబ్దపు వాడగుచున్నాడు. అనగా రెండవ ప్రతాపరుద్రుని సమకాలికుడు. పాల్కురికి సోమనాధునికి సమకాలికుడో లేక స్వల్పకాలము తరువాత జీవించిన వాడో అయి ఉండును.

ఈతడు త్రిపురాంత కోదాహరణమే కాక అంబికా శతకము, మదన విజయము అనెడి సంస్కృత గ్రంథమును రచించినట్లు సాహిత్యచరిత్రకారులు చెప్పుచున్నారు. కాని త్రిపురాంత కోదాహరణము మాత్రమే మనకు లభించుచున్నది. దానిని గురించి పరిశీలింతము.

శ్రీశైలమునకు తూర్పు వాకిలియైన త్రిపురాంతకమున కుమారగిరి మీద వెలసియున్న శివుని గురించి చేసిన స్తోత్రమే త్రిపురాంత కోదాహరణము. ఇది కూడా ఉదాహరణ కావ్య లక్షణము లన్నియు కలిగిన లఘుకృతి. ఈ ఉదాహరణములో కవి నామాంకిత పద్యము లేదు. ఇందలి కవిత ప్రసన్న మధురమును, ఉదాత్తభావ సమన్వితమునై ఉన్నది. "వాచవి లోనుగా నొడలి వాకిటలం బొడసూపు తీపులం, ద్రోచిలో చవులు మరగించునది." తెలుగు తనమును, తెలుగు నుడికారమును చవిచూపునట్టిది. ఇందలి వస్తువు శైవపరమైనదే. అల్పాక్షరముల ననల్పార్థ రచన ఇందునూ వ్యక్తమగును. ఒక్కొక్క రగడ పాదమున ఒక్కొక్క శివ కథను రావిపాటి తిప్పన సూచించి యున్నాడు.

తిప్పన వ్రాసిన "త్రిపురాంత కోదాహరణము" తెలుగు సాహిత్యమునందలి ఉదాహరణ సంప్రదాయము ననుసరించియే యున్నది. ఇదివరకే సూచించినట్లుగా, మొదటి ఉదాహరణమును తెలుగులో పాల్కురికి సోమనాథుడు వ్రాసి యుండెను. ఇదే పద్ధతి ననుసరించి త్రిపురాంతకుడు కూడా "త్రిపురాంత కోదాహరణము"ను రచించి యున్నాడు. అనగా శివుని గురించిన రెండవ ఉదాహరణ మన్నమాట. బసవోదాహరణమునకు శివుడు కథానాయకుడైనట్లుగానే దీనికిని శివుడే నాయకుడు. ఈ విషయము నందు ఈ రెండింటికి సమానత్వమే.

ఇక రెండవ సామ్యము శివభక్తి. పాల్కురికి సోమనాథుడు శైవ భక్తిని తన ఉదాహరణమునందు నిబంధించినట్లు గానే త్రిపురాంతకుడును తన ఉదాహరణములో శివభక్తిని ప్రధాన సూత్రముగా జేసెను. ప్రథమా విభక్తి కళికలో "కరద లెఱుగక వేడు దీనుల గదియు జంగమ రత్న సానువు" అని చెప్పుట ఈ భక్తి విశేషమును వెల్లడి చేయుచున్నది.

మహేశ్వరుని గుణ సంకీర్తనము చేయుట ఈ రెండు ఉదాహరణము లలో నింకొక సామ్యము. సోమనాథుడు వివిధ మహేశ్వర కథలను సూచన చేసి మహేశ్వరుని గుణ సంకీర్తనము చేసినట్లుగానే త్రిపురాంతకుడు కూడా మహేశ్వరుని కథా సూచనము చేసినాడు.

సంబోధనలోని ఈ పద్యము ఈ సందర్భమున ఉదహరించదగినది.

ఉ॥ శ్రీ చనుదోయిపై శరము - జేర్చి భుజంగమ రాజ సజ్యహే
మాచల మెక్కుడించి నిగ - మావళి యశ్వులు వేడ్చి పద్మజుం
జూచి మొగంబు లిచ్చి దివి - జుల్‌గాని యాడగనున్న నీ రణాం
తా చరణంబు విందుచెవు - లార గుమార గిరీంద్ర మందిరా!

బసవోదాహరణమున ప్రతికళిక ఉత్కళిక తాళ ప్రధానమైన రచన యైనట్లుగానే 'త్రిపురాంతకోదాహరణము' కూడా కళికలు ఉత్కళికలు రగడ భేదములో తాళాశ్రితములై యున్నవి.

ఇది దీనిలోని మరియొక సామ్యము. ఉదాహరణమునకు ఈ రగడ చూడవలెను.

కళిక

క॥ మఱియు వేలుపు లేటి - మౌళి నాగినవాని
నెల యగన్నప నోటి - నీలు దాగిన వాని
బొలతితో నొక్కొడల - బొత్తు గూడిన వాని
తలకి సేసమ రాజు - దాడి కోడిన వాని
శాఖ్య తొండని రాల - జడికి న్నొర్చిన వాని
సౌఖ్యతర సాయుజ్య - సరణి గూర్చిన వాని

వెన్నెలలల బురుణించు - వెలది నవ్వుల వాని
పెన్నునకు నలువకును - వెదుక దవ్వుల వాని

ఇన్ని సామ్యములున్నను ఒకటి రెండు భేదములు కూడ కాన వచ్చినవి. బసవేశ్వరుడు రచించిన 'ఉదాహరణము' ప్రధానముగా వీర శైవ సిద్ధాంతమును ప్రచారము చేయు దృష్టితో వ్రాయబడినది. కాని 'త్రిపురాంతకోదాహరణము'నకు శివస్తుతియే ప్రధానము గాని వీరశైవ సిద్ధాంత ప్రచారము ప్రధానముగాదు. ఆ ఉదాహరణములో వీరశైవ భక్తుల కథా సూచన అడుగడుగులో చేయబడినది. కాని 'త్రిపురాంత కోదాహరణము' చాల వఱకు పౌరాణిక కథలనే సూచించు చున్నది శివుని పతితోద్ధారణ గుణము, అతని గంగాధారణము, సర్పాలంకారములు, మన్మథ విజయము, కుమార పర్వత ఉద్ధరణము, దేవతల నుద్ధరించుట త్రిమూర్తులలో అతని ఆధిక్యత, గణాధిప కుమారస్వాముల ఆధిక్యత వంటి కథలే దాదాపు సూచనా మాత్రముగా ఈ ఉదాహరణములో చోటు చేసికొన్నవి సంబోధనలోని కళిక, జయభద్ర రగడ యిచట ఉదహరించదగినదే.

"మఱిరియు నానా మంత్ర - మణిగణ సుధా కల్ప
కొఱలు నేనుగు మోము - కొడుకు గాంచిన వేల్ప
మూడు మోముల పోటు - ముట్టు బట్టెడు ఛూర
వేడి చూపుల దెయ్య - దిలుతు ద్రుంచిన ధీర !
తాపసుల యీలువుల - తనరు తపముల పంట
చూపులకు నెల్ల పర - సుఖవార్థి పెన్నింట
తిలకాయ మాన దీ - ధితి సుధా సంసూతి
వెలుగులకు నెల్ల తొలి - వెలుగగు పరజ్యోతి !

ఇట్లు సూచనలన్ని పౌరాణికములే. మిగిలిన పద్యములలోను కళికలలోను ఇట్టి కథలే చెప్పబడినవి. ఇట్లు చూడగా ఈ కవికి పాల్కురికి సోమనాథునికి భిన్నముగా పౌరాణిక దృష్టి అధికముగా నున్నది. దీని వలన ఈ కవి వీరశైవ మతాభిని వేశము లేని వాడని పౌరాణికముగా నున్న ఆగమ శైవము మీద అధికముగా శ్రద్ధ కనబరచిన వాడని చెప్పుట సాధ్యమగును.

ఇది ఇట్లుండగా కొన్ని చోట్ల బసవపురాణము నందును, ఇతర శైవ సంప్రదాయమునందును చెప్పబడిన శివభక్తుల ప్రస్తావన సూచనా మాత్రముగా కన్పించును. ద్వితీయా విభక్తి రగడలో కన్నప్ప, సేనమరాజు, శాక్య తొండడు ప్రస్తావింపబడిరి. అట్లే తృతీయా విభక్తి రగడలో నంబి, కంచెన కర్తలు, బల్లహుడు అను శివభక్తులు సూచింపబడినారు. వీరు పురాణోక్తము లైన శైవులు కారు. కేవలము ఇహలోకమునందలి భక్తులే. బహుశ ఈ కవి ఈ ఉదాహరణము రచించు నాటికి శివభక్తుల కథలు లోకములో బహుళ ప్రచారము చెంది యుండును. అందుచే నామ మాత్రముగా ఈ భక్తి కావ్య ములో వానిని కూడా చేర్చుకొనినాడు. ఇట్టి వీరశైవ కథా సూచన త్రిపురాం తకోదాహరణములో స్వల్పముగా నున్న మాట వాస్తవమే అయినను ఇది వీర శైవ సిద్ధాంత నిరూపణకు రచించిన కావ్యము మాత్రము కాదు. పౌరాణిక మహేశ్వర మూర్తిని ఆవిష్కరించిన ఆగమశైవ నిరూపణము చేసిన కావ్యమే అని చెప్పినచో యుక్తి యుక్తముగా నుండునని నేను భావించుచున్నాను.

# వచనములు - శైవనిరతి

శతకములలో, ఉదాహరణములలో శైవతత్త్వమును పరిశీలించినట్లే వచన వాఙ్మయములోకూడా కొద్దిపాటి శైవ వచనములు కానవచ్చినవి. వాటి స్వభావములను పరిశీలించి చూడగా అందు శైవమత సంబంధములగునవి కొన్ని కలవు. పదునాఱవ శతాబ్దపు లోపలగల వచనముల నెన్నిక చేసికొని వాటి యందలి శైవనిరతిని పరిశీలించుటయే ఈ వ్యాసరచనోద్దేశ్యము.

వచనములు రెండురకములు గలవు. వైష్ణవ పరములైనవికొన్ని, శైవపరము లైనవి కొన్ని. ఇందు వైష్ణవ పరములగు వచనములసంఖ్య ఎక్కువగను, శైవపరములైన వచనములసంఖ్య అంతకంటె తక్కువగను కన్పించుచున్నది. 'వచన వాఙ్మయము' ఉత్పత్తి వికాసములు' అను పుస్తకములో డా॥ యమ్. కులశేఖరరావుగారు వచనములనుగూర్చి కూలంకషముగా పరిశీలించిరి. ఈ పరిశీలన నాధారము చేసికొని చూడగా వైష్ణవ సంబంధమగు వచనములలో సింహగిరి వచనములు, శ్రీ వెంకటేశ్వర వచనములు మున్నగువానిని గూర్చి విపులముగా చర్చించిరి. ఈ చర్చ అంతయు 'స్తుతివచనములు' అను ప్రకరణ ములో వారు పేర్కొనిరి.

ఇక వారు శైవపరములైన వచనములను గూర్చి చెప్పుచు గంగాధరయ్య వచనములు, భవానీ మనోహరవచనములు, కాశికాధీశ్వర వచనములు మున్నగు వానిని పేర్కొనిరి. ఇంకొక విశేష మేమనగా స్తుతివచనములు శతకములను బోలిన కొన్ని లక్షణములు గలిగి యుండుట. దాదాపు అన్ని వచనములందును అంతమున సంబోధనతో కూడిన మకుటమొకటి యుండునని ఉదాహరణ పూర్వకముగా వారు నిరూపించిరి. [1] శతకమునందలి పద్యములందువలెనే ఏ వచనము కావచనము, భావమునకు సంబంధించినంతవరకు స్వతంత్రముగా నుండుట రెండవది. శతకమునందువలెనే, ఇందొక కధనుగాని, వృత్తాంతమును గాని కూర్పవలయునను నియమము లేకపోవుట మూడవది. శతక పద్యము

1. వచన వాఙ్మయము - డా॥ యం. కులశేఖరరావుగారు.

లందలి భావములవలెనే, మనోహర భావాన్వితముగా నీ వచనములను గూడ కూర్చుట నాల్గవది. ఇట్టి విశేషములు శతకములకును, ఈ వచనములకును సామాన్యమైనను, ఈ వచనములందు ఒక దానిలోకూడా సంఖ్యానియమము లేదు. అందువలన వీనికి వచన శతకములను వ్యవహారములేదు. ఈ వచనములకును, శతకములకును ఇంకొక భేదమును కలదు. శతకము వస్తు వైవిధ్యము కలిగినది. శృంగారము, అధిక్షేపము, నీతి మున్నగునవి యందుండును. కాని యీ వచనములు అధికాంశములు భక్తి ప్రధానములుగానే యున్నవి. ఇట్లు కొద్ది భేదములున్నను, వీనికి సామ్యములే అధికముగా నున్నవి.

గంగాధరయ్య వచనములు, భవానీ మనోహర వచనములు మున్నగు వచన రచనమునకు ఆద్యుడు వైష్ణవ భక్తుడగు కృష్ణమాచార్యులు. అనగా తరువాతి స్తోత్రవచన రచయితల కీతడు మార్గదర్శకుడయ్యె ననవలసివచ్చును. కాని భిన్నమతావలంబియగు నీతడు శైవమతాభిమానులకు మార్గదర్శకుడయ్యె ననుట సందేహాస్పదమే కాని దీనికి సమాధానము కలదు. వైష్ణవ మతాచార్యులగు శ్రీరామానుజులు సంస్కృతమున గద్యరచన చేసినట్లుగనే దక్షిణ భారతమున శైవమత ప్రచారమును చేసిన బసవేశ్వరుడును, వచన రచన గావించినాడు. ఇవి కన్నడ భాషయందున్నవి. షట్స్థల వచన, కాలజ్ఞాన వచన అనునవి చాల ప్రఖ్యాతములైనవి. ఉదాహరణకు-

"నర కెన్నెగె, తెరగెల్లకె, శరీర గూడవశదమున్న !
హల్లు హోగి , చెన్ను జాగి, అన్యరిగె హంగా గదమున్న
కాలు మేలె కయ్యనూరి కోలహడి యదమున్న ।
ముప్పిందొప్ప వళియదమున్న ! మృత్యు ముట్టద
మున్న. పూజసునమ్మ కూడలి సంగమ దేవరా ! "

(షట్స్థల వచన)

సృష్టియొళిరుతిహ, భ్రష్టమనుషరు ఎల్ల ! కెట్ట పాప
పుహఃపుదకె వట్టి హోఅసి, ఘట్టి యుడిసువద
క్కెఃశివ బట్టుకళహువను, మారియను, మశేయిల్ల

కెఱెయిల్ల, నెలవిల్ల, ఉదకము నిల్ల, మొళియిల్ల
సూర్యకళె యిల్ల, గలవిల్ల ఉడీవిల్ల, ఆ పాపిగళిగె"

(కాలజ్ఞాన వచన)

పాల్కురికి సోమనాథాది శైవకవులు, శైవ సంప్రదాయమును పాటించి తెను గున రచనలు చేసినట్లుగనే, వచనమును వ్రాయుటకు వచన కర్తలు బసవేశ్వరుని నాదర్శముగా గ్రహించి యుందురు. రామానుజాచార్యుల సంస్కృత గద్యములు వైష్ణవులకు మార్గదర్శక మైనట్లే, బసవేశ్వరుని కన్నడ వచనములు శైవులకు అనుగమ్యములైనవి. ఇట్టి వచన రచనము కన్నడమున అక్కమహాదేవి యను రచయిత్రిచేసి యున్నది. ఈమె రచనలును భావి రచయితలకు ప్రోత్సాహకారణములై యుండును.

## గంగాధరయ్య వచనములు :-

ఈ వచనములు ప్రచురితములు కాలేదు. మహబూబునగరు జిల్లా మహమ్మదాబాదు గ్రామమున నాగలింగ శివయోగి గారి యింట నొక కాగితపు పుస్తకమున నివి లభించినవి. 1 ఈ వ్రాత పుస్తకము శిథిలావస్థయందున్న తాళపత్ర గ్రంథమునకు నకలు అని అందే కలదు. రచన ప్రాచీనముగనే కన్పించు చున్నది. స్తోత్ర వచనముల రచన బహుళ ప్రచారముననున్న కాలముననే యీ వచనములు రచితమైనట్లు ఊహించుట కవకాశము కలదు. గంగాధరయ్య వచనములను గూర్చి యిదివరకు నే సాహిత్య చరిత్ర కారులును వ్రాసియుండలేదు 2 'కరుణా కటాక్ష గంగాధరయ్య' అను మకుటముతో నున్న వచనముల కర్తను గురించి తెలిసికొననలసియున్నది.

---

1 ఆంధ్ర వచన వాఙ్మయము- డా॥ యమ్. కులశేఖరరావుగారు

2 శ్రీ డా॥ యమ్. కులశేఖరరావుగారు దీనిని గురించి యిటు వ్రాసిన తరువాత భారతి (అక్టోబరు 1963లో) నాగలింగ శివయోగి గారి వ్యాస మొకటి ప్రచురిత మైనది.

ఈ వచనకర్త పేరు గంగాధరయ్య యని తెలియుచున్నది. ఒక వచనమున 'నా పేరు పరవాదుల గజాంకుశంబైన గంగాధరయ్య' అని చెప్పియుండెను.[1] అయిన గంగాధరయ్య యను పేరు కలిగిన రచయిత యెవరును ప్రాచీన కాలమున కాన్పించుట లేదు. కాని సిద్ధేశ్వర చరిత్రమున కాసె సర్వప్ప ఒక గంగాధరయ్యను పేర్కొనినాడు.

(సిద్ధేశ్వర చరిత్ర పుట 84)

వచన కర్తయు కాసె సర్వప్ప తాతయు నొకేపేరు కలవారు. కాసె సర్వప్పయేగాక ఇతని పితామహుడు గంగాధరుడు కూడ శైవుడే. తన తండ్రికి లేని గ్రంథకర్తృత్వమును గంగాధరునికి సర్వప్ప చెప్పియున్నాడు. దానిని పేర్కొనినచో మరింత స్పష్టముగా నుండెడిది.[1] ఐనను అతడు 'బయకారములు' వ్రాసినట్లు చెప్పియుండెను. బయకాడు అనగా రాగములు బయలు పఱచువాడు. గాన విద్యోపాధ్యాయుడు అను నర్థములున్నవి.[2] బయకారములనగా సంకీర్తనములు, గానము ప్రధానముగా కలిగినవి యను నర్థమును గ్రహించవచ్చును. వచనములు పాడుట కనువుగా నుండుటయు, పూర్వకాలమున వానిని పాడుటయు కలదని ఆచార్య శ్రీ కులశేఖరరావుగారు తమ వచన వాఙ్మయములో విశదీకరించిరి. వచన వాఙ్మయము - ఉత్పత్తి వికాసములు. డా॥ యమ్. కులశేఖరరావు గారు.

గంగాధరుడీ వచనములను రచించుట చేతనే 'బయకారములు పెక్కు' రచించినట్టుగా సర్వప్ప పేర్కొని యుండును 'శివపదధ్యానైక చిన్మయాత్మకుడు, శైవ శాస్త్రాగమ సారానుభవుడు, లింగార్చన క్రియానిరంతుడు' మున్నగు విశేషము లీతని వచనములు చదివినప్పుడు చక్కగా సరిపోవుచున్నవి. ఇవన్నియు ఈ వచన కర్త గంగాధరుడే సర్వప్ప పితామహుడగు గంగాధరుడని నిరూపించు చున్నవి. ఈతడు విశ్వనిర్మాణమును గురించి ఒక వచనము నిట్లు చెప్పెను.

---

1.10వ వచనము.

2. శబ్ద రత్నాకరము.

"శివా ! బ్రహ్మదేవుండు సృష్టినిర్మించ ఉపాయంబు దోచక అనేక వేలేండ్లు శివధ్యానియై మిమ్ములను మెప్పించి యిట్లనియె. ఈశ్వరా! నీవు ఉంటే గాని బ్రహ్మాండకోట్లు గావించలేరు. నీవు నామీద కృపాదృష్టి కలిగి నాలలాట మందు నిలిచి యుండుమని, అందు మీద శ్రీహరి తన గుహ్యమందు వెడలితే గాని, బ్రహ్మత్వము దొరకదని నీకు విన్నవించిన నీవు మూర్తిత్రయుండవై నిలిచినంత విష్ణు ఆ బ్రహ్మ గుహ్యమందు వెడలి పారినంతలో అజుడు బ్రహ్మత్వము నొంది పంచముఖంబు లాయెను. నిటలాక్షి మొదలి బొట్టాయెను. శేషుడే జంధ్యమాయెను. శ్రీహరి వెన్ను దండిపు కోలాయెను. తన కపాలంబు భిక్షపాత్రగా బట్టి 'భిక్షా' యని రుద్రంబున అడిగిన క్షణమే బ్రహ్మాండ కోట్లు భిక్ష మొసంగి వచ్చినట్లు నిర్మితంబై నిలిచెను. నిల్చి నప్పుడే ఉత్పత్తి స్థితి లయాదులు ఏర్పడెను. ఇది సర్వశాస్త్ర సమ్మతము. కరుణించవే కరుణా కటాక్ష గంగాధరయ్య."

ఉత్తమమైన ఉపమానములు కల్పించి శైవమత సిద్ధాంతము ప్రతిపాదించుటలో నితడు నేర్పరి. ఈ వచన ముదాహరణీయము.

"శివా? విటమార్గుండు అంతఃపురంబు గావించినట్లు, పుష్పశయ్యలు గావించినట్లు, చీని చీనాంబరాలు గావించినట్లు, నానారత్న భూషణాలు గావించినట్లు, పరిమళ గంధ వస్తువులు గావించినట్లు, దేవా! మీరు గావించుట గాని కాదు. అనంత కుంజర ఘోటకాది భటుల కోట్లు కొలువంగ అష్టదిక్కులు ఏలింతువట! మీర కైలాసంబు రావలె నన్న యిత్తువట! మీ వలన కొదువ లేమి? కరుణించవే, కరుణా కటాక్ష గంగాధరయ్య" పరమేశ్వరుడే యేకైక దైవమను నభిప్రాయమును నీవచనము ప్రతిపాదించుచున్నది.

"శివా: రసము సిద్ధించి ఉండంగ తవిటి పాతర తోడినట్లు కామధేను వుండంగ గొడ్డుటావును దాయివేవి నట్లు, భుక్తి ముక్తి ఫలదాయకుండవైన మహాదేవా! మీరు ఉండంగను గొడ్డు చెరుపు దైవాల గొలిచేదియ్యేమి కారణము? కరుణించవే కరుణా కటాక్ష గంధరయ్య"

ఇంకను ఈ వచనము లుత్తమ భావములతో గూడి యున్నవి.

"శివా! త్రిపురాలు సాధించి వచ్చి. రథ తురంగబులు విడిచి, భారతిని

యొప్పించి, సారథియైన బ్రహ్మపదంబును కంపించి, చంద్రకంబుల మింటకే వట్టిగిరి చాపంబు ఎక్కుడించి, నారియై యున్న శేషుణ్ని పాతాళానకు దిగవిడిచి, నారాయణాస్త్రంబులు లక్ష్మికిచ్చి, బసవని కైలాస ద్వారంబునంటి, పార్వతీ సమేతుండవై సింహాసనారూఢుండవై యున్న మహాదేవా! నావాక్యంబులు చేయక అవధిధరించవే; కరుణాకటాక్ష గంగాధరయ్య!"

"శివా! భూలోకమున బుట్టిన వారికెల్ల నెంత సుఖమిచ్చినావో, తోడుతనే అంత దుఃఖము కలదని చివుకం బనిలేదు. సుఖ దుఃఖములు మీకు సమర్పణ చేసి నీవిచ్చినంతే చాలునని యున్నవానికి, అతడు కళంకుడు కాడు. నేరని వాడే కళంకుడు. ఇది తథ్యంబు. కరుణించవే కరుణా కటాక్ష గంగాధరయ్య!"

ఇట్టి వచనములు శైవభక్తి ప్రతిపాదకములై, ఉన్నత భావాన్వితములై యున్నవి. మనకు లభించు ౩౮ వచనములే కాక యింకను ఉండి యుండును[1] ఇట్టి వచనములను వ్రాసిన గంగాధరుడు, ఆంధ్ర వచన రచయితలలో - ముఖ్యముగ స్తుతి వచనములు వ్రాసిన వారిలో - విశిష్టుడుగా పేర్కొనదగి యున్నాడు.

భవానీమనోహరవచనములు

భవానీ మనోహర వచనములు సంఖ్యలో నూటుండి యుండునని ఆచార్య యం. కులశేఖరరావుగారు తమ 'వచన వాఙ్మయ వికాసము' లో స్తుతి వచనములు అను ప్రకరణములో పేర్కొనిరి. కాని ౬౨ మాత్రమే లభించినవని వ్రాసిరి. వచన కర్త పేరు కానవచ్చుటలేదు. ఆది వచనము, అంత్యవచనము లభించిన యెడల కర్తకు సంబంధించిన యంశము లుండెడివేమోగాని అట్టి దేదియు కాన్పించదు.[2]

ఈ వచనముల కర్తృత్వమును గూర్చి ప్రస్తావించుచు శ్రీ నిడదవోలు వెంకటరావుగారిట్లు వ్రాసిరి "వీనికి (భవానీ మనోహర వచనములకు) పూర్వము

1. ఆంధ్ర వచన వాఙ్మయము - డా॥ యం. కులశేఖరరావు గారు.
2. వచన వాఙ్మయము - డా॥ యం. కులశేఖరరావుగారు.

పురాతన శంకర వచనములని పేరుండెను. శివ పంచ స్తవికి వ్యాఖ్య రచించిన దేచనామాత్యుని పుత్రుడు శంకరకవి. మహిమ్నము మొదలగు శివ స్తవములనుండి భావములను గ్రహించి యిందు పొందుపరచినాడు". [1] దీనిని బట్టి శంకర కవి యను నాతడీ వచనములను రచించెనని తెలియుచున్నది. ఈ కర్తృత్వమును వీరెట్లు నిశ్చయించిరో తెలియదు. అయిన శంకరకవి యను నాతడు రచించుటచేతనే యీ వచనములు శంకర వచనములని వ్యవహరింపబడి యుండును. ఈ వచనకర్త కాలమును గురించి యేమియు తెలియదు.

ఈ వచనములును, సంబోధనముతో ప్రారంభమై సంబోధనముతోడనే అంతమగుచుండును. ప్రారంభమున శివునికి సంబంధించిన యేదైన నొక సంబోధన, అంతమున, భవానీ మనోహరా యను మకుటము నుండును. కర్త, మహేశ్వరునికి వివిధ విశేషములను విన్నవించుకొనుచు, ఈ వచనములను వ్రాసినాడు. కొన్నిటిని డా॥ కులశేఖరరావుగారు తమ వచనవాఙ్మయములో ఉదహరించిరి. ఆ క్రమముతోడనే ఇచట వివరింతురు.

ఈ క్రింది వచనమున భక్తుడు ఎంతటి కష్టదశలో నున్నను, ముక్తుడగు నను భావము పొందు పరుపబడియున్నది. మొదటి కొంతభాగము తాళపత్రము శిథిలమగుటచే పోయినది.

"........సమస్త జీవులకు ఎందుదగిలి పిపీలికాది బ్రహ్మపర్యంతంబు నీవయైయుండియు, గ్రమ్మర దేవంబులం బృధి వ్యాది మహాభూతంబులం ద్రిసంధ్యలన హోరాత్రంబుల ధర్మంబులు .... అంతరాత్మను కావలి వెట్టితిరి. కిందరనంబట్టిన (?) ఆతతాయికిం బ్రాయశ్చిత్తంబులు కలవే. అయినను నాకొక విశేషంబైన తరుణోపాయంబు దొరికె కతాస్మరణాన్ముక్తి యను వచనంబు కలదు. కావున నిన్ను నిత్యంబును స్మరింపుచు భవదీయ సేవా హయమేధం బొనర్చిన అఖిల పాపక్షయంబుగా, నీ పుణ్యపాదోదకంబుల నవభృథస్నానముచేసి సోమయాజి చందంబై జడ నిబిడాంధకారంబు సుజ్ఞాన దీపంబున నణచి, నిరాతంకంబైన పాప పంకంబు వలన విముక్తుండనై పరిశుద్ధి

1. ఆంధ్ర వచన వాఙ్మయము - పుట 37

బొందెద. మదీయ హృత్పద్మంబునం బాయక నిలిచి శాశ్వతంబైన సుగతి యొసగి రక్షింపవే, భవానీ మనోహరా! " - 3

ఈ వచనమున మహేశ్వరుడే సర్వాంతర్యామి యని చరా చరవస్తువు లకు నాధారుడని, సకల దేవేశుడని నిరూపించుటకు ప్రయత్నించి యున్నాడు.

"త్రిలోకేశా! సగుణ నిర్గుణ స్వరూపంబుల నీవు క్రీడాది విహారం బొనర్చి కైలాసంబున, వటమూలంబున, కాశీస్థలంబున, కేదారంబున, శ్రీశైలంబున, యోగి జన కమల హృదయ నిధుల వసియించు చుండెడి నీకు బ్రహ్మాండంబున సరిగా నుపమించి ప్రస్తుతించెద. అందెనేని నీకంటె అతి తరం బేమియు లేమిజేసి, నిన్నె నీకు సకల సన్నుతులచే నుతించెద. చరాచరంబులైన వస్తుప్రకారంబులయందు నిన్నే భావించిన వారలకు నీపట్లయై కనిపింతువట. నీవెరుంగకుండ నెవ్వరే కర్మం బాచరించిన నీకప్పుడే గోచరంబై యుండునట. నిన్ను పేర్కొని పిలిచిన మశక శిశువునకైన నోయని పలికి యాదరింతువట. నీ కెవ్వరేమి పేక్షించిన ప్రముదితహృదయుండవై పరిగ్రహింతువట. అఖిల జగన్మయుండవై విశ్వంభరాభారంబు వహించి ముప్వరు వేల్పులకు మూలం బైన యాదిమూర్తివై, పరమేశ్వరా, పరేశా, పరమాత్మా, పరమపురుషా, పర బ్రహ్మ యనుచు అనేక విదాభిధానుండవైన నిన్ను నుతింప నాకుం దరమే, అభేద్యకవచంబు దొడిగిన యతడు శస్త్రాస్త్రంబులకోహ దెంచని వగిది నాదేహంబున రుద్రాక్ష ధరించుటంజేసి నాపాపంబులవలని భయంబువా సె - నన్ను కటాక్షించి రక్షింపవే, భవానీ మనోహరా! " - 5

పైవచనమంతయు శివస్తుతియే. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతకములో సర్వము శివమయమే యని కొన్నిపట్ల పేర్కొనినాడు. శివుని నుతించుట కే అలంకారములు సరిపోవని ఇంకొక సందర్భములో చెప్పినాడు.అట్లే ఇచట కవి భవానీమనోహర వచనములలో శివుని వర్ణించుట తన తరము గాదని పేర్కొని నాడు. శివారా ధన యందు ఈ కవులకుగల ఆన క్తియే యిచట ప్రధానాం శముగా కన్పట్టు చున్నది.

ఒక్కొక్క ఉపమానమును గ్రహించి తన అధిదేవతల గుణములతో దాని నన్వయించుచు నీతడు చెప్పిన యీ వచనము మనోహరముగా నున్నది.

పెద తిరుమలాచార్యులు వేంకటేశ్వర వచనములందుపలె నీతడును ఉపమాన పరంపర గ్రహించుట యందాసక్తి చూపియుండెను.

“సద్దవిగ్రహా! గుణాద్భుతంబైన మృగమదంబసమాన సురభిళ ద్రవ్యం బయ్యును, నిజగంధాను భవంబు పరులకొసంగి మనఃప్రీతి కావించు చందం బున, నీవు షడ్గుణైశ్వర్య సంపన్నుండవయ్యును, భిక్షాపాత్రుండనని తలంపక నిన్నాశ్రయించిన వారలను అఖండ శ్రీమంతకల్యాణాన్వితులంగాజేసి, సుఖం బొసంగుదువట. స్వచ్ఛంబైనమౌక్తికం బపాత్రంబైన శుక్తియం దావిర్భవిం చియు, సర్వ జనాలంకారంబై ప్రముదిత హృదయులంజేయురీతి, నీవు పరమ పావనుండవయ్యును, కూష్మాండపిశాచ శాకినీ ఢాకినీ సంకీర్ణంబై అమంగళం బైన భయంకర శ్మశాన నలయుండవయ్యును, నిన్ను భజియించు వారలకు శాశ్వతానూన సౌఖ్యంబైన పుణ్యలోకం బొసంగుదువట! గోరత్నంబు దాప విత్రంబయ్యును నీరసతృణ ఖాదనంబొనర్చి సమస్త జనంబుల దధిఘృత క్షీరంబులందనిపి ప్రవర్ధ మానుల జేయుకరణి, నీవు సర్వోత్తముండవయ్యును, అస్పృశ్యంబైన చిరకాల కాఠిన్యంబైన శుష్కాస్థిమాలికలు ధరియించి, నిన్నుం బూజించు వారలకు అనర్ఘమణి మయోద్దీపిత స్వర్ణకిరీట కుండల కటకకేయూర హారాన్వితులంగా జేసి శుభంబొసగుదువట! నిఖిల జలంబుల గ్రాహ్యంబైన ఫేనంబు ననువర్తించియు ప్రక్షాళనంబున కళంకంబు గావించు భంగి పవిత్రం బైన నీ దేహంబున మకరాంక శవభస్మం బలదియు, నిన్ను స్మరించు వారలకా క్షణంబే మహాపాతక పంక నిర్ముక్తులంగాజేసి రక్షింతువట! చక్షుశ్శ్రవాశ్శ్వ ధీరుండు మహోజ్జ్వల ప్రకాశంబులైన సహస్రఫణంబుల దాల్చియు గాలి ద్రావుచు పంచాశత్కోటి మహీమండల భారంబు వహించు తెఱంగున, నీవు సుధాంశు కళాపతసుండవయ్యును, విషం బాహారంబుగాగొని సకల ప్రాణి కోటుల క్షుత్పిపాసలం బొరయకుండ నన్యోవిధంబుల నాహారంబు దయచేసి యోగక్షేమంబులు అరయుదువట! నినువంటి యాశ్రిత జనరక్షాదక్షుండైన దైవంబుగలడే! పరమ కార్పణ్యుఁడనైన అనాథుని నన్ను రక్షించి నాచేసిన సకల పాపౌఘవిధ్వంసంబుగావించి, యిహపర సుఖ ప్రదాయివై రక్షింపవే భవానీ మనోహరా!” - 2౧.

ఈ వచన కర్తకు శైవ సిద్ధాంత ప్రతిపాదితమగు పంచాక్షరీ మంత్రము మీద విశ్వాసమును, అభిమానమును మెండు. సాధ్యమైనపుడెల్ల నా మంత్ర ప్రభావము నుల్లేఖించుచుండును. శివుని వర్ణించుటయనిన నీతనికి చాల యిష్టము. ఈ క్రింది వచనమున నీ రెండు విశేషము లేకీభవించియున్నవి.

"గగన తనుత్రాణా ! ప్రణవోచ్చారణ పూర్వకంబైన పంచాక్షరీ మహా మంత్రంబు నాకుంగొరుకుటం జేసి సర్వదోషఘ్నుండనై నిస్సందేహంబుగా బుణ్యలోకాను భవంబు నాకబ్బెనని మనంబునం గృత నిశ్చయుండనైతి. అయితే నాకు లోకోపవాదంబైన అపకారి స్ఫురించె (సుదించె) ఎట్లంటి వేని సర్వలోక స్వామి యగు శివు నాశ్రయించు తన నేర్పు విధంబున నతం డుద యాస్తమయంబులు ప్రస్తుతింపదొడంగిన పరాకు చేసి ఎన్నడును బ్రసన్నుడు గాడయ్యె. ఎంత లేకి గుండెవాడో! హాయని జనులు నిన్నాడుమాటలకు నామ నంబునం గడలేని సిగ్గువొడము చున్నయది. నన్నెవరేమనిన నోర్చెద గాని నిన్నాడిరేని నామనంబు నీరగలసిన తేనియ యైయుండు. నా మనోరథం బీడేర్ప దలంచి నీవు నిందారహితుండవయ్యెదవేని గ్రక్కున ననుమానింపక చిన్నరేని యెందమౌనిం ? బరిఢవిల్ల పుల్లాంబోరుహకల్హారకుము దోసితంబై రథాంగ కౌంచ మరాళ చంచరీక సంచారంబగు జటాజూటాంత ర్వాహిని యుప్పొంగ, ననంగ భస్మోద్ధూళిన ధాళధళ్యంబంగ బంగరాగంబై శోభిల్ల. సల్లలిత కర్పూర తాంబూల చర్వాణార్ద్రిరాగ సౌభాగ్యంబైన పద్మరాగంబుల దెగడు దంత పంక్తి యొకిస్రంత గానబడుచు, నరుణాధర విభ్రాజ సుస్మేరంబైన సుందర ముఖారవిందం బుల్లసిల్ల, గగన మణి సన్నిభంబులైన మణి కుండలోజ్వల కాంతులు గండ స్థలంబునం బ్రతి జ్వలించుచు, మదీయ హృదయ చింతా ధ్వాంత నిర్ఘాత బొనర్ప, దెప్పరంపు చింతిలి నగిపుకువ్వ తిని (?) కుత్తిక గప్పిమొప్ప, గబ్బ బెబ్బులి యెడ రాకాసి కళాసంబంస ఖాగంబునం దేజరిల్ల తెలియేని నిడుదపాము జన్నిదంబొక వింతయై యమంద మంద దగద్దగాయ మానంబగు వాడి ముమ్మొనల వాలుంగేల చెలంగ, మెఱుంగు దీవ కైవడి జలికొండ రేనిముద్దు కొమరితె వెలుంగ, పటికంపు నిగనిగ చ్ఛాయ మేనితోడ తెల్లని ఆలపోతునెక్కి యెఱ్ఱని కనుంగొలంకుల చల్లని సుధారస బిందువులం జార, గొల్లలై యుల్లంబురంజిల్ల నాకుంగోరిక లొదవిన రీతి సాక్షాత్కారం బొనర్చి రక్షింపవె భవానీ మనోహరా !".28.

ఈశ్వరునికి తనకు గల సంబంధము సర్వమానవుల కన్వయించునట్లు ఈశ్వర మాహాత్మ్యయే సర్వ సాధకమని యీ రచయిత దృఢమైన యభి ప్రాయము. ప్రాపంచికమైన భోగముల ననుభవించి పాప పంకిలమున బడినను, ఈశ్వర భక్తియే తరుణోపాయమని, యీతడీ వచనమున ప్రతిపాదించు చున్నాడు.

"శ్రీ కంఠా ! నీవు సమస్త లోకోపకారార్థము సంపాదించిన సాధనం బులు నాకు దొరకుటం జేసి, నిర్భయ స్వాంతుండ నైతిని. ఎట్లంటివేని, బ్రహ్మహత్య సురాపాన, గురు తల్పగమన, స్వర్ణస్తేయ తత్సంగతులను పాత కంబులైదింటిని గెల్వనైదక్షరంబుల మంత్ర బొకటి నా నాలుకం గీలు కొనియె. పరేత రాట్కింకర పిశాచంబులు నన్ను చూడ కుండ ఫాలంబున ధవళిత త్రిపుండ్రాంకంబు వహించితి. అనేక క్షుద్ర పాపంబులం దరిమి, సర్వోపద్రవ శాంతియొసర్చు రుద్రాక్ష నామేనంబూనితి. శాశ్వతానందంబై, అఖిల శ్రుతి గుణాలంకారంబై, మహా తారకంబై యొప్పునోంకారంబు నాహృదయంబున గుదురయ్యె. ఇంత నిత్యంబు శంకరాయ, శివాయ, మహేశ్వరయ, మహా రుద్రాయ యనుచు నాజేయు నమస్కృతులు నీ మీద నప్పయి యుండకుండంగ రక్షించి సుగతి యొసంగి రక్షింపవే, భవానీ మనోహరా !" 27.

ఈ వచనములలో చాల బాగము చూర్ణిక లనదగినవే కాని యచ్చటచ్చట ఉత్కలికా ప్రాయ మనదగి గంభీర శైలీ సమన్వితములైన వచనములు కొన్ని కాన్పించుచున్నవి.1

"నిరంతర పూర్ణానందా ! ఇంద్రోపేంద్ర ద్రుహిణాది దేవతా దుర్లభుం డవైన మహానుభావా ! నిన్ను బ్రస్తుతించను, సముచిత జ్ఞాన భక్త్యారాధన నిష్ఠాగరిష్ఠుండనై నిన్ను భావంబున పరవను. పరాయత్తుండనైన నాయట్టి కష్టమానవునకుం దరమే ! నీవు అకారణ సకృతివైన అనాథనాథుండవు. సహర్ష హృదయుండవై నన్నాదరింప దలచితివేని నా విజ్ఞాపన నంబవధ రింప వలయు, నెట్లందువేని, అనల్ప కల్పద్రుమ నవకోమలారుణ కిసలయ సదృశం బైన భవదీయ జటాజూటాం తర్వర్తియగు పుణ్య తరంగిణీ రంగత్తుంగభంగ

1. వచన వాఙ్మయము. డా॥ ఎమ్. కులశేఖరరావుగారు. (పుట. 485)

నికరంబు లుప్పొంగి చెలంగు మున్నా ఖండల తనూభవుదోర్దండ మండిత ప్రచండమహోద్దండ కోదండ తాడనంబున నొక్కింత నొక్కువడిన జడల నడుమ సుడివడి బుడబుడ రవంబు వెడలెడి పెన్నీటి నిడజాలుమో మౌళిం గీలు కొల్పి నీ కళంక శశాంక రేఖ నొరసి స్రవించు తుహిన సుధారసంబిందు సందోహంబులు బొందు పడగ విసవిస దృగంతంబులకు డిగ్గి యచ్చటం గటాక్ష వీక్షణామృత ధారా పరంపరలం బెనగొని భవచ్చరణాంబోరుహ ఘటి తలలాటుండవై మదీయ మూర్ధంబున ననర్గళంబై ప్రవహించి విరించి మున్ను ఫాల ఫలకంబున లిఖించిన దుర్లక్షణంబుల నన్నింటిం బ్రక్షాళనం బొనర్చి యమ్మహా వాహిని సర్వాంగ ప్రతి రోమ కూపంబుల ప్రపూరంబై ఘుమ ఘుమ ధ్వానంబైన పెను వరద వడిదలమైపార, నపారంబైన నన్ను బరివేష్టించి యున్న మహా పాతక ఉపపాతక దుఃఖోపద్రవ దారిద్ర్య చింతా మనః ఖేద మృగంబులే యథాయథలై భయ భ్రాంతి గలిగి తొలంగి పారునట్లుగా నీరీతి నన్నుం గటాక్షించి రక్షింపవే భవానీ మనోహరా !'' - 31.

శైవమత ప్రతిపాదనమును, ప్రచారమును దృష్టియందుంచుకొని యీతడు రచనలు చేసి శైవ పారమ్యమును, శైవ మాహాత్మ్యమును గురించి వ్రాసినను, ఇతడెచ్చటను పరమత నిందచేసినట్లు కాన్పించదు. ఇది ఈతని సమానదృష్టినే వ్యక్తము చేయుచున్నది. నిజమునకు భవానీ మనోహర వచన కర్త వీర శైవుడుగా కాన్పించుటలేదు. వీర శైవులకు వర్ణాశ్రమధర్మ నిరతి యుండదు. యజ్ఞయాగాది వైదిక కర్మలపై సమ్మానముండదు. కాని ఈ వచనములం దచ్చటచ్చట బ్రాహ్మణ ప్రశంస, యాగాదికముల ప్రసక్తి కాన్పించు టచే, నీతడు వైదిక మతావలంబికుడైన శైవుడు కావచ్చునని చెప్పవలసి యున్నది.

ఈ భవానీ మనోహర వచనములందు శివునికి సంబంధించిన పురాణ గాథ లుల్లేఖింపబడినవి. కవికిగల బహుపురాణ పరిచితిని వ్యక్తముచేయుచున్నవి. ఒక కాలమున నీవచనములు బహుళ ప్రచారము నంది యుండెనని శ్రీ నిడదవోలు వేంకటరావుగారు వ్రాసిరి ఇది నిజమే కావచ్చును. ఎందుచేత ననగా శైవులకు నిత్యోపాసనమైన పంచాక్షరీ ప్రసంగ మున్నది. దాని వలన సర్వానర్థములు తొలగునని రచయిత యిట్లు చెప్పుచున్నాడు. "ఐదక్షరంబుల మంత్రగం బొకటి నా నాలుకన్ గీలుకొనియె. పరేతనాడ్కింకరా పిశాచంబులు నన్ను చూడకుండా హాలంబున భసిత త్రిపుండ్రకంబు వహించి అనేక క్షుద్రపాపంబులం

దరిమి సర్వోపద్రవ శాంతి మొనర్చు రుద్రాక్ష నామేనం బూనితి శాస్త్రోతా నందంబై అఖిల భద్ర గుణాలంకారంబై మహా తారకంబై యొప్పు నోంకారంబు నా హృదయంబున కుదురయ్యె.'' ఇట్లు చెప్పుట ఈ వచనములను రచయితతో బాటు పలువురు పాఠకులు చదువుటయు, అందలి అంశములను తేలికగా గ్రహించుటయు జరిగి యుండును. భవానీ మనోహరవచనముల శైలి ఆ వచనముల బహుళ ప్రచారమునకు కారణమై యుండును కూడ.

## కాశికాధీశ్వర వచనములు

మదరాసు ప్రాచ్యలిఖిత గ్రంథాలయమున నీ పేరుతో నొక తాళపత్ర గ్రంథము కలదు. దీని శీర్షిక చూడగా, దీనిని పరిశీలించినవారు కాశికావచనములని వ్రాసిరి. వ్రాత ప్రతిలో శివయోగ వచనములను శీర్షిక యున్నది. ఈ వచనముల చివరకు 'కాశికాధీశ్వరా!' యని యుండుటచేత కాశికాధీశ్వర వచనము లనుటయే తగియున్నది. ఇందలి విషయమునుబట్టి శివ యోగ వచనము లనుటయు సార్థకమే యగును [1]

లభించిన తాళ పత్ర సంపుటమునం దెచటను కర్త పేరు కానరాలేదు. వివిధ రచనములకు మధ్యన రెండు వచనములు మాత్రమే యున్నవి. ఈ వచనములను చూడగా మహేశ్వర మహేశ్వరులను (శైవ గురువులను) నేకముగా భావించు శైవమతస్థుడెవరో తన గురువునకు, మహేశ్వరునకు నేకత్వమును ఘటించి వ్రాసినట్లు కనిపించుచున్నది. ఈ రెండు వచనములందును శివ రాజ యోగ విషయములు, శైవస్తుతి, గురుస్తుతి ప్రధానముగానున్న అంశములు తాళపత్ర గ్రంథములో లభించు రెండు వచనములలో నొకదానిని 'ఆంధ్రవచన వాఙ్మయ వికాసము'లో ఆచార్య కులశేఖరరావుగారు పేర్కొనిరి.

ఇక రెండవ వచనము కూడ, పరిమాణమునను, భావమునను దాదాపు అట్టిదే. చివరను ఈ శ్లోకము కలదు.*

శాస్త్ర దృష్టం గురోర్వాక్యం
తృతీయం ఆత్మనిశ్చయమ్॥

ఇందెచటను కర్త జీవిత కాలమునకు సంబంధించిన విశేషము లేవియు గానబడుట లేదు. ఈ రచయిత కేవలము రెండు వచనములను మాత్రమే వ్రాసెనా, లేక అనేకములు రచించెనో తెలియదు. రచనము చూచిన ప్రాచీనముగా కనిపించుట చేతను, ఇవి తాళపత్రములందు లిఖితమై యుండుట

1. వచన వాఙ్మయము డా॥ ఎమ్. కులశేఖరరావుగారు.

చేతను, వీనిని రచించిన వాడు రెండు మూడు వందల సంవత్సరములకు పూర్వుడై యుండునని యూహించ వచ్చును. శ్రీ నిడదవోలు వేంకటరావు గారు తమ 'ఆంధ్ర వచన వాఙ్మయమున వీనిని గురించి యేమియు వ్రాయ లేదు కాని, ఒక వచనమున కొంత భాగ ముదహరించి యున్నారు. యోగ శాస్త్ర దృష్ట్యా ఈ వచనముల కేదైన ప్రాధాన్య మున్నదేమో కాని, సాహిత్య కముగా వీని ప్రాధాన్య మంతగా కానరాదు.

ఈ ప్రకరణములో తెలుగు సాహిత్యము నందలి లఘుకృతులైన శతక ములు, ఉదాహరణములు, వచనములు అను వానిని గ్రహించి వానిలో శైవ సిద్ధాంత విశిష్టతా భావమును ఉల్లేఖించితిని. ఈ మూడు విధములైన సాహిత్య ప్రక్రియలు మన భాషలో యధార్థమునకు అనిబద్ధ కావ్యములే. ఈ రచయి తలకు కవులకు ఒక కథా విశేషమును చెప్పవలెనను ఆసక్తి కాన్పించదు ఏ పద్యమున కాపద్యమే, ఏ వచనమున కావచనమే స్వతంత్రమై భాసించును. ఐనను పూసలలో దారముపలె కవి చెప్పదలచిన విశేషాంశము అవిచ్ఛిన్న ముగా కొనసాగుచుండును. అది భక్తి కావచ్చును సిద్ధాంతము కావచ్చును లేదా కథాసూచన కావచ్చును. ఇదియే లఘుకృతులలోని పరమార్థము.

నేను గ్రహించిన ఈ మూడు రకముల లఘుకృతులలో ప్రత్యక్షము గాను, పరోక్షముగాను వ్యక్తమైన శైవవిశేషములను మత సిద్ధాంత పరములైన వానిని ప్రదర్శించుటకు ప్రయత్నించితిని. చాలా చోటులందు ఒకే విషయము చాలసార్లు చెప్పుట ఈ రచనలలో కాన్పించును. అట్టి సమయములలో నేను అన్ని ఉదాహరణములను గ్రహించక దిఙ్మాత్రముగా కొన్నిటిని గ్రహించితిని. ఈ ఉదాహరణలు నేను చెప్పదలచిన విషయమును ప్రదర్శించినవనియే భావింతును. తెలుగులో శతకములు, ఉదాహరణములు, వచనములు అధిక ముగానే యున్నవి. వీనిలో శైవ వైష్ణవ సిద్ధాంత భావ నిరూపకములు ఉండును. నేను శైవ సిద్ధాంత విశేషములు ఉన్నవానినే గ్రహించితిని. అంపున నా పరిధి క్రీ॥శ 12 వ శతాబ్దము వరకు మాత్రమే కాబట్టి ఆ పరి ధిలో ఎక్కువ రచనలు రాలేదు. వచ్చిన స్వల్ప రచనలలో ఉన్న విశేష ములను సమగ్రముగా చర్చించినట్లుగా భావింతును.

# సింహావలోకనము

"తెలుగు సాహిత్యము శైవమత ప్రభావము" అను నంశము గూర్చి పరిశోధన మొదలిడి నప్పటి నుండి పది ప్రకరణములలో వివిధ కాలములలో శైవమత పరిణామము- మార్పులు, వీరశైవ మత ప్రాచుర్యము, సాహిత్యముపై ఆ మత ప్రభావము మున్నగు అంశములన్నియు చర్చించి యుంటిని. 'శివ' శబ్దము యొక్క ప్రాచీనత్వము నుండి మొదలిడి, ప్రబంధ కాలములో అనగా పదునాఱవ శతాబ్దము వరకు గల శైవకావ్యములలోని విశేషము లన్నియు ఆయా ప్రకరణములో వివరించి యుంటిని. నన్నెచోడుని కుమార సంభవ ములో కాన్పించు శైవ సిద్ధాంతములు మొదలుకొని పండితుని శివతత్త్వ సారములో విశేషములతో జోడించి చూచిన యెడల ఆయా కాలములలో శైవ మెట్లు మార్పు చెందినదో స్పష్టమైనది.

ఇంక శివకవుల యుగములో పేరొందిన పాల్కురికి సోమనాథుని కృతులలో గల శైవ నిరతి ఆయా కావ్యములలోని శైవ సిద్ధాంతములను విశదీకరించితిని.

ముఖ్యముగా ఈ కావ్యములలో బసవేశ్వరుడు ప్రతిపాదించిన శైవ సిద్ధాంతములు సాహిత్యముపై వాని ప్రభావము కూలంకషముగా చర్చించి యుంటిని. బసవేశ్వరుని గురువుగా, దైవముగా కొలచటయే ఆనాటి ప్రజల యాశయము. ఆతని సిద్ధాంతములు ఆధారముగా జేసికొని పలువురు కవులు గ్రంథ రచన గావించిరి. ఈ యుగములో మరియొక విశేషము దేశి ప్రక్రియ. ద్విపద సాహిత్యములో పాల్కురికి సోమనాథుడు గ్రంథ రచన చేసి ముందు ముందు పలువురు కవులకు మార్గదర్శకుడైనాడు. తాను చెప్పు ప్రతి కథలోను శివుని మాహాత్మ్యము, బసవేశ్వరుని గొప్పతనము, ఆనాటి సాంఘికాచారములు వివరింపబడినవి. కేవలము వీరశైవ సిద్ధాంతములు కొన్ని గ్రంథములలో ప్రతిపాదితములు కాగా కొన్ని గ్రంథములలో ఆగమశైవ, ఇతర శైవ సిద్ధాంతములు కూడా చిత్రీకరింపబడినవి.

తరువాతి కాలములో కాసె సర్వప్ప (సిద్ధేశ్వర చరిత్ర), ఏకామ్రనాథుడు (ప్రతాప చరిత్ర), యధావాక్కుల అన్నమయ్య (సర్వేశ్వర శతకము), గౌరన (నవనాథ చరిత్ర) మున్నగువారు శైవ కావ్యములు రచించి అనేక శైవమత విశేషములు కావ్యముల ద్వారా పాఠకుల కందించిరి. ఈ సంప్రదాయములలో కాలానుగుణ్యముగా శైవము మార్పు చెందినదనుటకు వీరి కావ్యములే తార్కాణములు. కాసె సర్వప్ప ద్విపద కావ్యరచనచేసి తద్వారా శివుని మాహాత్మ్యమును పేర్కొనినాడు. ఏకామ్రనాథుడు తన వచన కావ్యములో చారిత్రక పర్వముగా శివుని మహిమలు కొనియాడినాడు. ఈ కవులలో పిడుపర్తి సోమనాథుడు కూడ పేర్కొన దగినవాడే. కాని పాల్కురికి సోమనాథుని బసవపురాణమే ఈతడు పద్య బసవ పురాణముగా వెలయించుటచే ప్రత్యేకముగా నీ కావ్యమును గూర్చి నేను చర్చించలేదు. యధావాక్కుల అన్నమయ్య శతకరూపమున తన శైవ వీరశైవ సిద్ధాంతములు పాఠక లోకమున కందించినాడు. భక్తి శతకములలో పేరెన్నికగన్న ఈ శతకము ఆంధ్ర శతక వాఙ్మయమునకు మణిమకుటకము వంటిది. బసవేశ్వరుని కాలమునాటి శివభక్తుల ప్రసక్తికూడ ఈ శతకములో నెడ నెడ మనము చూడవచ్చును. ఇక గౌరన 'నవనాథ చరిత్ర'లో శైవములో ఇంకొక శాఖయగు నాథ సంప్రదాయమునుగూర్చి చెప్పినాడు. నవనాథు లను శైవచార్యులకథల నిందు పొందు పఱచి ఈ సంప్రదాయ విశేషముల నెడ నెడ కావ్యమున చొప్పించినాడు. ఆయావిశేషములన్నియు "నవనాథ చరిత్ర-శైవ సంప్రదాయము"లను ప్రకరణమున విశదీకరించితిని.

ఇక శ్రీనాథుడు తనరచనలలో నే విధముగా శైవనిరతిని ప్రదర్శించెనో ఆయా గ్రంథములు ప్రమాణముగా చర్చించియుంటిని. పైనచెప్పినట్లు కాలానుగుణ్యమగు మార్పు శైవమతములో వచ్చినది. తదనుగుణ్యముగా వీరశైవ మంతరించి ఆగమ శైవము చోటు చేసుకున్నదనుటకు తరువాతి కాలములో వారి రచనలు, శ్రీనాథుని కావ్యములు కూడ తార్కాణములు. ఒక్క హర విలాసములో 'చిఱుతొండనంబి' కథలో వీరశైవచ్ఛాయలు కన్పట్టినను మిగిలిన కథలన్నియు ఆగమశైవ సంప్రదాయములే. శివుని మాహాత్మ్యము తెల్పు కావ్యములే. ఇక 'శివలీలా విలాస' మను కావ్యమొకటి నిశ్శంక కొమ్మన విరచితమైనది కలదు. ఈ కావ్యప్రసక్తి ఆరుద్రగారి 'సమగ్ర ఆంధ్ర సాహిత్యము'లో

కలదు. ఈ కావ్యము అసంపూర్ణమని తెలిసినది. రెండాశ్వాసములు మాత్రము సాహిత్య పరిషత్ పత్రికలలో లభ్యము కాగలదని వారు వ్రాసిరి. నేను వివిధ గ్రంధాలయములు పరిశోధన నిమిత్తమై సందర్శించితిని. నాకు ప్రధమాశ్వాసములో కొంత భాగము మాత్రమే లభ్యమైనది. హరవిలాసములో శ్రీనాధుడు శివునిలీల లన్నియు వర్ణించినట్లే నిశ్శంక కొమ్మన తన 'శివలీలా విలాసము'లో శివుని లీలలు మఱికొన్ని వర్ణించినట్లు తెలిసినది. ప్రధమాశ్వాసములో కొంత భాగము మాత్రమే లభ్యమైనందువలన నేనా కావ్యమును నా పరిశోధన ప్రణాళికలో జేర్చలేక పోతిని.

ఇఁక ప్రబంధ కాలములో ముఖ్యముగా శైవకావ్య రచనలు చేసిన వారిరువురు. ఒకటి ఉద్భటారాధ్య చరిత్ర కావ్యము రచించిన తెనాలి రామలింగకు, రెండు శ్రీ కాళహస్తి మాహాత్మ్యమను శైవక్షేత్ర ప్రబంధమును రచించిన మహాకవి దూర్జటి. ఈతని శతకము కూడ శైవశతకమే. శ్రీ కాళహస్తి మాహాత్మ్యము, శ్రీ కాళహస్తీశ్వర శతకము అను రెండు కృతులు రచించి రెండును శ్రీ కాళహస్తీశ్వరుడగు మహేశ్వరునకే అంకిత మొనరించినాడు. తెనాలి రామలింగని కావ్యములో, ధూర్జటి కావ్యములో గల శైవమత విశేషము లన్నియు విపులముగా ఒక ప్రకరణములో పేర్కొంటిని. మహాభారతములో శైవ నిరతినికూడ క్లుప్తముగా వ్రాసియుంటిని.

శివకవుల యుగము నుండి ప్రబంధము కాలము వరకుగల శైవమత గ్రంథముల నుండి ఆయా విశేషములన్నియు పేర్కొనుటయే ఈ పరిశోధన ఉద్దేశ్యము. నా ప్రణాళికా పరిధిలో గ్రహించ వలసిన విషయములు ఈ గ్రంథములో చేరినట్లుగానే భావించుచున్నాను.

## ఉపయుక్త
## గ్రంథముల పట్టిక

1. సిద్ధేశ్వర చరిత్ర - కాసె సర్వప్ప.

2. ప్రతాపరుద్ర చరిత్ర - ఏకాంబ్రనాధుడు.

3. నవనాథ చరిత్ర - గౌరన.

4 నవచోళ చరిత్ర - పొలిశెట్టి లింగనకవి.

5. ఆంధ్ర వచన వాఙ్మయము - ఆచార్య యం. కులశేఖరరావు.

6. భీమఖండము - శ్రీనాధుడు.

7. కాశీఖండము - శ్రీనాధుడు.

8. హరవిలాసము - శ్రీనాధుడు.

9. శివరాత్రిమాహాత్మ్యము - శ్రీనాధుడు.

10. ఉద్భటారాధ్యచరిత్ర - తెనాలి రామలింగడు.

11. శ్రీకాళహస్తిమాహాత్మ్యము - మహాకవి ధూర్జటి.

12. సర్వేశ్వర శతకము - యధావాక్కుల అన్నమయ్య.

13. శ్రీకాళహస్తీశ్వర శతకము - మహాకవి ధూర్జటి.

14. ఉదాహరణ వాఙ్మయచరిత్ర - డా॥ నిడదవోలు వెంకట్రావు.

15 సమగ్ర ఆంధ్రసాహిత్యము - ఆరుద్ర.

16. ఆంధ్ర కవితరంగిణి - చాగంటి శేషయ్య.

17. సర్వేశ్వరశతకము - అల్లమరాజు రంగశాయికవి.

18. సర్వేశ్వర శతకము - స్వయంపాక లక్ష్మీనారాయణ (దండకము)

19. శతకసంపుటము - నిడదవోలు వెంకట్రావు.

20. శతకసంపుటము - వంగూరి సుబ్బారావు.

50424



21. శతకసంపుటములు - తెలుగు సాహిత్య ఎకాడమీ వారి ప్రచురణలు.

22. వృషాధిపశతకము - పాల్కురికి సోమనాథకవి.

23. పాల్కురికి సోమనాథకవి - బండారు తమ్మయ్య.

24 ఆంధ్ర మహాభారతము - ఆదిపర్వము - నన్నయ.

25. ఆంధ్రవాఙ్మయ చరిత్ర - డా॥ దివాకర్ల వెంకటావధాని.

26. కాశీఖండము - వచనకావ్యము - దేవరకొండ చిన్నికృష్ణయ్య.

27. శబరత్నాకరము - నిఘంటువు.

28. ఆంధ్రశతక సాహిత్యవికాసము - డా॥ కె. గోపాలకృష్ణరావు.

29. ఈశ్వరార్చన కళాశీలుడు - డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి.

30. శ్రీనాథకవితాసమీక్ష - డా॥ చిలుకూరి పాపయ్యశాస్త్రి.

31. Saiva Siddhantha - Dr. T.M.P. Mahadevan.

32 Saiva Upanisheds - Dr. T.R. Srinivas Iyyangar.

33. బసవవచనములు - డా॥ బడాల రామయ్య.

34. వాఙ్మయ వ్యాసమంజరి - డా॥ నేలటూరి వెంకటరమణయ్య.

35. ఆంధ్రకవుల చరిత్రము - కందుకూరి వీరేశలింగం పంతులు.

36. భారతి - (1986) నవనాథచరిత్ర - అనుశీలన వ్యాసము
డా॥ మట్నూరి సంగమేశం.

37. శ్రీకాళహస్తిమాహాత్మ్యము - సమగ్ర పరిశీలన - శెట్టివారి అశ్వత్థప్ప.

38. ప్రబంధ వాఙ్మయవికాసము - డా॥ పల్లా దుర్గయ్య.

39. పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాథుడు.

40. ఆంధ్ర సాహిత్య సంగ్రహ చరిత్ర - వారణాసి వెంకటేశ్వర్లు.